# కథా కౌముది

2020



శ్రీ

కౌముది

మీ మనోగగనంలో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 244

# కౌముది మాసపత్రికలో

# 2020 జూలై నుంచి డిసెంబర్ 2020

# వరకూ

# వచ్చిన కథలు



| క్రమసంఖ్య | కథపేరు | రచయిత(త్రి)పేరు | పేజి |
|---|---|---|---|
| 1 | మెతుకు విలువ | కృపాకర్ పోతుల | 4 |
| 2 | విలోమ విలువలు | కె.వి.రాజ్ | 10 |
| 3 | అంటువ్యాధి | ఊహ | 17 |
| 4 | కోరికలు | విద్యార్థి | 21 |
| 5 | పుట్టిల్లు | ఎం.బిందుమాధవి | 43 |
| 6 | సరోజ కనపడింది | మత్తి భానుమూర్తి | 48 |
| 7 | లేఖలు | విద్యార్థి | 54 |

| | | | |
|---|---|---|---|
| 8 | బకుడు | వేగుళ్ళ కోటేశ్వరరావు | 65 |
| 9 | ఓ..నందికేశ్వరా...! | చివుకుల పద్మజ | 69 |
| 10 | ప్రజాసేవ (ప్రై)లిమిటెడ్ | డా. రమణ యశస్వి | 73 |
| 11 | భయం | డా.రూపేష్ ఆదిమూలం | 78 |
| 12 | జిప్సీ | రాయపెద్ది వివేకానంద్ | 83 |
| 13 | ఉత్తరాల స్టాండు | పెయ్యేటి శ్రీదేవి | 98 |
| 14 | సంక్రమణం | అంజన కొడాలి | 104 |
| 15 | మా'నవ' కర్మాగారం | భాగ్యలక్ష్మి అప్పికొండ | 110 |
| 16 | అలోఖి | తిరుమలశ్రీ | 116 |
| 17 | ఏది నిత్యం? | రాజశేఖర్ తటవర్తి | 127 |
| 18 | కుక్కలరాజుగారి కత | కృపాకర్ పోతుల | 132 |
| 19 | దారి దీపాలు | డా.జడా సుబ్బారావు | 139 |
| 20 | సహానుభూతి | అంజన కొడాలి | 144 |
| 21 | తాను నేను | క్రాంతి శివరాత్రి | 150 |
| 22 | సెకండ్ ఇన్నింగ్స్ | మోపూరి కె రెడ్డి | 155 |
| 23 | అదృష్టం | కప్పగంతుల శ్రీ కృష్ణ బహదూర్ | 160 |
| 24 | ఓ అమ్మాయి కథ | డా.చివుకుల పద్మజ | 167 |
| 25 | క్షమించు మిత్రమా! | జీడిగుంట రామచంద్రమూర్తి | 173 |
| 26 | ఇలా ఉంటే బావుంటావమ్మాయీ | జ్యోతిర్మయి మళ్ళ | 180 |
| 27 | జన్మ | భాగ్యలక్ష్మి అప్పికొండ | 187 |
| 28 | ఏమోయ్ నీకు పెళ్ళైందా!? | చంద్రమౌళి కళ్యాణచక్రవర్తి | 194 |
| 29 | మీతో 34 ఏళ్ళు – మీపై 10 ఆరోపణలు | అనన్య | 199 |
| 30 | ముఖ చిత్ర పత్రం | టి.వి.ఎస్. రామానుజ రావు | 203 |
| 31 | రాధా చలం ప్రణయ కథ | తురగా శివరామ వెంకటేశ్వర్లు | 212 |

# మెతుకు విలువ

కృపాకర్ పోతుల

"ఐషూ, ఒక విషయం అడుగుతాను. కొంచెం ఆలోచించి సమాధానం చెప్పమ్మా. అడగమంటావా?" అన్నాడు రాంబాబు కూతురు ఐశ్వర్య వేపు చూస్తూ.

"అలాగే" అన్నట్టు తలాడించింది ముభావంగా ఐశ్వర్య.

"సరే విను. ఒక ఐదారు సంవత్సరాల వయస్సున్న చిన్నబ్బాయి ఒకడున్నాడు అనుకో. వాడికి ఈ ప్రపంచంలో వాళ్ళమ్మ తప్ప వేరే దిక్కెవరూ లేరు. ఆవిడకి రెండు రోజులనుండీ ఒళ్ళుపేలిపోయే జ్వరం కాస్తోంది. ఆ సమయంలో వాళ్ళ చేతిలో ఒక రూపాయి డబ్బులుగాని, ఇంట్లో తినడానికిగాని ఏమీ లేవు.... మూలనున్న కుండలో మంచినీళ్ళు తప్ప. ఆ అబ్బాయీ వాళ్ళమ్మా రెండు రోజులుగా ఆ నీళ్ళతోనే కడుపునింపుకుంటున్నారనుకో. అలాంటి భయంకరమైన పరిస్థితిలో ఆకలితో నకనకలాడిపోతున్న ఆ అబ్బాయి మనస్థితీ, పరిస్థితీ ఎలా ఉంటుందో ఊహించగలవా?"

కంప్యూటర్ ముందు కూర్చొని ప్రోజెక్ట్ వర్క్ చేసుకుంటున్న ఐషూ......ఎమ్.ఏ మొదటి సంవత్సరం చదువుతున్న ఐశ్వర్యరాజ్యలక్ష్మి....తండ్రివేపు చూసింది ఏమీ అర్థంకానట్టు. అలా అయోమయంగా చూస్తున్న కూతురువైపు మృదువుగా చూస్తూ అదే ప్రశ్న మళ్ళీ అడిగాడు రాంబాబు.

అప్పటికి కొంచెం సర్దుకొని తండ్రి అడిగిన ప్రశ్నని అర్థం చేసుకున్న ఐశ్వర్య "ఎప్పుడైనా కనీసం టిఫిన్ ఒక పది నిమిషాలు ఆలస్యంగా తినున్నా తెలిసేదేమో నాన్నా . అమ్మ నాకు టిఫిన్ కూడా ఆలస్యంగా పెట్టలేదెప్పుడూ నాకెలా తెలుస్తుంది!? అందులోనూ ఐదారు సంవత్సరాల అబ్బాయి మనస్తితీ పరిస్తితీ అంటున్నావు. నో ఐ కాంట్ గెస్" అంది తేలికగా తీసిపారేసే ప్రయత్నం చేస్తూ.

"నేను చెప్పనా ఎలా ఉంటుందో. వింటావా?" అని అడిగి కూతురు సమాధానం చెప్పే లోపులోనే, "నేను చెప్పేముందు ఈ స్కెచ్ ఒకసారి చూస్తావా" అన్నాడు రాంబాబు.

"ఆవిషయాలన్నీ ఇప్పుడు దానికెందుకు రామూ. ఏదో వర్క్ కూడా చేసుకుంటుంది కదా" అంది అతని భార్య సరోజ ఆందోళనగా కూర్చున్నదగ్గర్నుండి లేస్తూ.

“లేదు సరూ. నన్ను చెప్పనీ” అంటూ, తనచేతిలో పట్టుకున్న ఫోటోఫ్రేమ్ లాంటిదాన్ని కూతురికి చూపిస్తూ, “తెలుసుకదమ్మా ఇదేంటో?”అన్నాడు కూతురుతో.

లేమినేట్ చేసి టేబిల్ మీద పెట్టుకోవడానికి వీలుగా కింద చిన్న ప్లాస్టిక్ స్టాండ్ లాంటిది అమర్చిఉన్న ఒక “బ్లేక్ & వైట్” పెన్సిల్ స్కెచ్ అది. ఎప్పుడూ చూసేదే అయినా, తండ్రి చెప్పాడు కదా అని ఇంకొకసారి మళ్ళీ చూసింది దాని వైపు.

బక్కచిక్కిన శరీరం, దాన్ని కప్పడానికి విశ్వప్రయత్నం చేస్తూ, ఆ ప్రయత్నంలో దారుణంగా ఓడిపోతున్న చాలీచాలని చింకిచీరా, తైలసంస్కారం బొత్తిగాలేని చింపిరిజుత్తూ....నల్లగా, సన్నగా అస్థిపంజరంలా ఉన్న పల్లెటూరిమనిషి ఒకామె.... నేల మీద చతికిలబడికూర్చొని పుల్లల్లాంటి చేతుల్తో చేటొకటి పట్టుకొని, దానితో బియ్యం చెరుగుతుంటే, ఆ అస్థిపంజరం ఎదురుగా, మొలచుట్టూ చిన్న చింకిపాత తప్ప ఒంటిమీద మరే అచ్ఛాదనా లేని ఐదారుసంవత్సరాల కుర్రాడు.....తినడానికి సరైన తిండి లేకపోవడంవల్ల బయటకు పొడుకువచ్చిన ప్రక్కటెముకలూ, చెంపల మీద ఎముకలతో, కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకొని, జాలిగా ఆమెవేపు చూస్తూ నిలబడి ఉన్న స్కెచ్ అది. ఆ మనిషి చెరుగుతున్నవి బియ్యమే సుమా అని తెలియజెప్పడానికా అన్నట్టు, నేపథ్యంలో తలుపులు తెరిచిఉన్న ఓకొట్టుగదీ దానినిండా నిండుగా నింపబడిన బస్తాలూ, వాటిలో ఒక బస్తాకున్న చిల్లిలోనుండి ధారగా కారుతున్న బియ్యంగింజలూ.... పెన్సిల్తో గీసిన బొమ్మఅది.

అదేంటొ తెలీకపోతే కదా ఐశ్వర్యకి. “ఎందుకు తెలీదు నాన్నా. నా చిన్నప్పట్నుండీ చూస్తున్నదే కదా. ఆ థీమ్ నువ్వే చెప్పి నీ ఫ్రెండ్ చౌదరీ అంకుల్తో గియ్యించానని చాలాసార్లు చెప్పావుకదా!” అంది తండ్రివేపు చూస్తూ.

“ఓకే. ఇప్పుడు విను రెండురోజులు తినడానికేమీ లేకపోతే ఎలా ఉంటుందో” అని చెప్పడానికుపక్రమిస్తున్న రాంబాబుకి అడ్డొస్తూ

”రామూ, మళ్ళీ చెప్తున్నా. అవసరమా ఇదంతా ఇప్పుడు” కలవరపాటుతో అంటున్న భార్య సరోజ అభ్యంతరాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా చెప్పడం మొదలుబెట్టాడు రాంబాబు.

“రెండురోజుల పాటు తినడానికి రెండు మెతులుకులు కూడా లేకపోతే, ఆ రెండు రోజులూ నీళ్ళతో మాత్రమే కడుపు నింపుకోవలసిన పరిస్థితే దాపురిస్తే ఎలా ఉంటుందో తెలుసా తల్లీ!? ఆకలికి కడుపులో పేగులు..... నేషనల్ జియోగ్రాఫిక్ ఛానల్లో చూపిస్తుంటారే, పాములు, ఒకదాన్నొకటి చుట్టుకొని, రెస్ట్ లెస్ గా మెలికలు తిరిగిపోతూఉంటాయి చూడూ...అలా లుంగలు చుట్టుకుపోతుంటాయి. కళ్ళు బైర్లుకమ్మి చూపు మందగించి, ఏదీ స్పష్టంగా కనబడదు. అస్పష్టంగా అలికేసినట్టు కనిపిస్తాయన్నీ. ఒంట్లో సత్తువ పూర్తిగా హరించుకుపోవడం మాత్రమే కాకుండా, కాళ్ళలో చేతుల్లో సన్నటి ఒణుకు కూడా మొదలవుతుందేమో. నిల్చోవడం మాటటుంచి, కనీసం కూర్చోవడానికి కూడా ఓపికుండదు. కళ్ళు తెరిచి ఉంచడానికి కూడా బృహత్ప్రయత్నం చెయ్యాల్సివస్తుందంటే నమ్ముతావా. తెరవలేకపోతున్నాం కదా అని కళ్ళు మూసుకుంటే నిద్రాదేవి కరుణించి దయతో కమ్ముకుంటుందకుంటున్నావేమో. నో ఛాన్స్. కనీసం మనకి ఆమడదూరంలోకి కూడా రాదు. ఆకలి దాన్ని రానీయదు. దూరంగా తరిమేస్తుంది. ఎవరైనా జాలిపడి రెండు ముద్దల అన్నమో,

కాస్త గంజినీళ్ళో ధర్మం చేసేటట్టు చెయ్యి భగవంతుడా అని ఉన్నాడో లేదో కూడా ఖచ్చితంగా తెలీని ఆ భగవంతుడిని బ్రతిమాలుకోవడం తప్ప వేరే ఇంకేమీ చెయ్యలేని నిస్సహాయస్థితి....." కడుపులో చెలరేగే ఆకలిమంటల్లో కాలిపోతున్న చిన్నకుర్రాడి మానసిక శారీరక స్థితిగతులెంత భయానకంగా ఉంటాయో ఉద్వేగంగా వర్ణించి, ఊపిరి తీసుకోవడానికి ఆగిన తండ్రివేపు భయంభయంగా చూసింది ఐశ్వర్య, నుదుటిమీద పట్టిన చెమటబిందువుల్ని ఒణుకుతున్న చేతుల్తో ఒత్తుకుంటూ.

మితభాషీ, తనూ, తన ఆఫీసూ, పుస్తకాలూ తప్ప, ఎవరితోనూ, చివరికి భార్యతోనూ, కూతురుతోనూ కూడా అవసరానికిమించి ఒక్కమాట కూడా ఎక్కువ మాట్లాడే అలవాటులేని రాంబాబు ఈరోజు ఎందుకిలా ఆందోళనా ఉద్రేకం కలగలిపి మాట్లాడుతున్నాడో అర్ధంకావట్లేదు తల్లీకూతుళ్ళిద్దరికీ. అవడానికి సీరియస్ టైపే గాని, కూతురన్నా భార్యన్నా అమితమైన ప్రేమ రాంబాబుకి. కూతురు ఒకటి రెండుసార్లు తుమ్మితేనే గాభరా పడిపోయి, డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళేవరకూ స్థిమితంగా కూర్చోలేని మనస్తత్వం అతనిది. ప్రేమ చేతల్లోనేగాని, మాటల్లో చూపించడం కొంచెంకూడా తెలీని తండ్రికంటే, తల్లి దగ్గరే చేరిక ఎక్కువ ఐషూకి.

"చెప్పకు నాన్నా భయమేస్తోంది నాకు. అయినా నీకెలా తెలుసు అంత భయంకరంగా ఉంటుందని" అంది ఒణుకుతున్న గొంతుతో.

"నీకు వింటేనే అంత భయం వేస్తుందికదా, అనుభవించిన నాకెలా ఉంటుందంటావ్. అవునమ్మా. ఇప్పుడు నీకు చెప్పినదంతా నిజంగా నేను అనుభవించినదే. ఎప్పుడో ఎక్కడో చెప్పనా?" అంటూ తన చేతిలో స్కెచ్ వేపు వేలితో చూపిస్తూ

"పోలికలంతగా కనిపించడం లేదుగాని ఐషూ, ఇందులో ఉన్నది నేనూ, మా అమ్మే" అన్నాడు రాంబాబు లోగొంతుతో.

"ఏంటి నాన్నా. ఏం చెప్తున్నావ్? వాళ్ళిద్దరూ నువ్వూ నానమ్మా అంటావేంటి. నాకేమీ అర్ధం కావట్లేదు" అంది ఆశ్చర్యంగా తండ్రి వేపూ, తల్లి వేపూ మార్చి మార్చి చూస్తూ.

"అవునమ్మా. అందులో ఉన్నది నేనూ నానమ్మే. ఆ సంఘటన నా చిన్నప్పుడు, ఐదారేళ్ళ వయస్సులో జరిగింది. నా చిన్నప్పుడే తాతయ్య చనిపోయాడని తెలుసుకదా నీకు. ఆ తర్వాత నానమ్మా నేనూ..... ఏంతిన్నామో ఎలా బ్రతికామో ఏ కొద్దిమందికో తప్ప ఎవరికీ తెలీదు. ఆ విషయాలెవరితోనూ ఎప్పుడూ మాట్లాడాలనిపించదమ్మా నాకు. ఇష్టం లేకపోవడం ఒక కారణం అయితే, అంతకంటే ముఖ్యమైన కారణం ...భయం, భయంకరమైన గతాన్నీ, ఆ గతంతో ముడిపడి ఉన్న దుర్భరమైన ఆకలినీ తలంచుకొని తట్టుకోడానికి కావలసిన మనోధైర్యం ఈ రోజుక్కూడా నాకు లేకపోవడం."

"తాతయ్య చనిపోయాక ఇల్లు గడవాలికదా. దానికోసం నానమ్మ ఊర్లో ఇద్దరు ముగ్గురు షావుకార్ల పశువులశాలలు శుభ్రం చేసే పనిలో చేరింది. జీతం డబ్బుల్తో పాటూ వాళ్ళిచ్చే మిగిలిపోయిన అన్నం, కూరా లాంటి వాటితో నాకు కనీసం కడుపు

నింపగలిగేది. అయితే ఒకసారి నానమ్మకి జ్వరం వచ్చింది. రెండు రోజులు ఉధృతమైన జ్వరం. ఇంట్లో నూకలు కూడా నిండుకోవడంతో గంజిక్కూడా గతిలేకుండా పోయింది. పనిలోకి వెళ్ళలేక పోయిందేమో, వీళ్ళూ వాళ్ళూ ఇచ్చే అన్నం మెతుకులు కూడా దొరకలేదా రెండురోజులూ. కడుపు నింపుకోవడానికి కుండలో నీళ్ళే గతయ్యాయి. మూడోరోజు జ్వరం కొంచెం నిమ్మళించడంతో తింటానికేమైనా అడుక్కొస్తానని తను పనిచేసే ఒక షావుకారింటికి వెళ్ళింది లేని ఓపిక తెచ్చుకొని. వెళ్ళిన నానమ్మ రెండుగంటలు గడిచినా తిరిగొచ్చే జాడ కనబడక పోవడంతో తనని వెతుక్కుంటూ బయల్దేరాను నేను బైర్లు కమ్మే కళ్ళు బలవంతాన తెరుచుకుంటూ. తూలుతూ, తడబడుతూ షావుకారింటి దగ్గరకి చేరుకున్న నాకు అక్కడ కనిపించిన దృశ్యం అది.

--00--

తరవాత నానమ్మ చెప్పింది. రెండురోజులుగా తిండి లేకుండా ఖాళీ కడుపుల్తో ఉన్నామనీ తినడానికేమైనా పెట్టమనీ అడిగితే, రెండ్రోజులుగా పనెగ్గొట్టినందుకు తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి "ఎలాగూ వచ్చావు కదే ఆవులశాల కొంచెం తుడిసెయ్ ముందు. నూకలు తరవాత ఇస్తానని" చెప్పి ఆవులశాల శుభ్రం చెయ్యించిదట షావుకారమ్మ. అది శుభ్రం చేసేక "ఇదిగో ఈ బియ్యంకొట్టు కూడా కొంచెం సుబ్రం చేసియ్యే తల్లీ. మాయదారి ఎలకలు. తెగ కొట్టేస్తన్నాయి బస్తాల్ని. చూడెంత బియ్యం నేలపాలైపోయాయో. కనీసం నాలుగైదు శేర్లన్నా ఉండవూ. నువ్వే తీసుకెల్దుగానయ్యన్నీ. పదిరోజులొందుకోవొచ్చు నువ్వూ నీ కొడుకూనూ." అని చెప్పి బియ్యంకొట్టు కూడా శుభ్రం చెయ్యించిందట. రెండురోజులుగా తిండిలేని నానమ్మ లేని ఓపిక తెచ్చుకొని, బియ్యంకొట్టు శుభ్రంచేసి, ఊడ్చి పోగేసిన బియ్యాన్ని....దుమ్మూ ధూళీతో కలగలిసిపోయిన బియ్యాన్ని......చేటలో వేసుకొని శుభ్రం చేస్తుందమ్మా నేనక్కడికి వెళ్ళేటప్పటికి. అంత ఆకలితో, ఒళ్ళు తెలియని స్థితిలో ఉన్న ఆ సమయంలో కూడా నానమ్మ అక్కడ చతికలబడి చెమటలు కక్కుతూ అలా బియ్యం చెరుగుతున్న దృశ్యం నామనస్సులో బలంగా.... ఎవ్వరూ చెరపలేనంత బలంగా...... ముద్రించుకు పోయిందమ్మా" అన్నాడు నీరునిండిన కళ్ళతో కూతురి వేపు చూస్తూ.

--00--

"ఆ తరవాత" అంది ఐషూ గొంతు పెకలించుకొని.

"ఏముందమ్మ చెప్పడానికి. తినీ తినకా అర్ధాకలితో బ్రతికేం రెండేళ్ళపాటు. ఆ తరవాత దేవుడే పంపినట్టు "న్యూటన్" గారని ఒక టీచర్, మాస్కూలుకి బదిలీమీద వచ్చారమ్మా. పాఠాలు బాగా చెప్పడమే కాకుండా పిల్లలందరినీ ఏ తారతమ్యం లేకుండా సమానంగా, ప్రేమగా చూసేవారు. మన పరిస్థితి ఎవరిద్వారానో తెలుసుకున్న సార్ నానమ్మతో దెబ్బలాడి, బలవంతాన ఒప్పించి మరీ, ప్రక్కటౌన్లో ఉన్న గవర్నమెంట్ హాస్టల్లో చేర్పించారు నన్ను. తరవాత డిగ్రీ వరకూ అలా హాస్టళ్ళలో ఉండే చదువుకున్నానమ్మా" అన్నాడు రాంబాబు కళ్ళు తుడుచుకుంటూ.

"గవర్నమెంట్ హాస్టళ్ళలోనా. నిజంగానా. దారుణంగా ఉంటాయట కదా అక్కడ పరిస్థితులు. ఎలా ఉండగలిగేవు నాన్నా అక్కడ?" అనడిగింది ఐశ్వర్య జాలిగా.

"దారుణంగా ఉంటాయా అంటే....మధ్యాహ్నం తింటే రాత్రికి తినడానికి ఉంటుందో లేదో తెలీని నాలాంటివాళ్ళకి మూడు పూటలా ఖచ్చితంగా తిండి దొరుకుతుందనే భరోసానే ఒకపెద్ద లక్జరీ కాదంటావా. అలాంటి లక్జరీనే దొరికిందక్కడ నాకు. కాకపోతే తినే అన్నంలో పురుగులూ, కూరల్లో, సాంబార్లో బొద్దింకలూ, అప్పుడప్పుడూ బల్లులూ.....అలాంటివసలు సమస్యల్లానే కనిపించేవికాదు. నిర్వికారంగా వాటిని తీసి పక్కన పడేసి, మిగిలిన అన్నం తినేసేవాళ్ళం" అన్నాడు విషాదంగా నవ్వుతూ.

"మరి నానమ్మ...!?" ప్రశ్న పూర్తి చెయ్యకుండానే చెప్పడం మొదలుపెట్టాడు రాంబాబు.

"అదృష్టవశాత్తూ డిగ్రీ అవగానే ఉద్యోగం రావడంతో కష్టాలు తీరిపోయాయని చాలా ఆనందించానమ్మా. నానమ్మని ఇక నా దగ్గరకి తెచ్చేసుకుందామని అనుకుంటున్నంతలోనే తను....." రాంబాబు గొంతు పూడుకు పోయింది దుఖంతో మళ్ళీ.

అర్ధమైన ఐషూ అడిగింది లోగొంతుకతో "ఎలా?" అని.

"టీ.బీ.తో.. నాలుగు మెతుకులకోసం జీవితమంతా పోరాడుతూనే ఉంది కదమ్మా మా అమ్మ. గెలవడానికి అవకాశమేలేని అనంతమైన పోరాటం అది. అందుకే అర్ధాకలితోనే బ్రతికింది తను జీవితమంతా. దానితో లివర్ ఎఫెక్ట్ అయ్యిందట. సమయానికి సరైన వైద్యం అందకపోవడంతో అదికాస్తా టీ.బీ.లోకి దించేసింది. నానమ్మ ఆవిషయం నాకు తెలియనివ్వలేదు. ఒకవేళ తెలిసినా నేను చెయ్యగలిగినది కూడా ఏమీలేదు ఆరోజుల్లో. మహా అయితే చదువుమానేసి, నానమ్మని తీసుకొని గవర్నమెంట్ ఆస్పత్రి చుట్టూ తిరిగేవాడిని. అంతే. దానితో జబ్బు బాగా ముదిరిపోయింది. నాకు ఉద్యోగం వచ్చి, నానమ్మకి మందులిప్పించగలిగే స్థోమత వచ్చేనాటికి.....ఇట్ వాజ్ టూ లేట్ ఐషమ్మా. డాక్టర్స్ సెడ్ దేర్ వాజ్ నో హోప్. తరవాత మూడునెలలకే చనిపోయింది. అర్ధమైందా మీ నానమ్మ ఎలా చనిపోయిందో. తినడానికి సరైనతిండి లేక చనిపోయింది తల్లీ" చెప్పాడు రాంబాబు ధారాపాతంగా కారుతున్న కన్నీటిని తుడుచుకుంటూ

--00--

ఆరోజు రాత్రి పదకొండు గంటలప్పుడు, ఐషు నిద్రపోయిన తరవాత, "ఈ సంగతులు ఎట్టి పరిస్తితులలోనూ ఐషూకి తెలియనివ్వకూడదనే వాడివి కదా రామూ. అంత హఠాత్తుగా ఎందుకు చెప్పావు దానికి. అదీ అంత కఠోరంగా. ఎంత అల్లాడిపోతోందో తెలుసా. ప్లేటులో అన్నాన్ని చూసి కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకుంది ఈ అన్నం దొరక్కపోవడంవల్లే కదమ్మా నానమ్మ చనిపోయింది అంటూ" అన్న భార్య వేపు, చదువుతున్న పుస్తకం లోనుంచి తలెత్తి చూసాడు రాంబాబు.

ఆమె వేపు ఒక క్షణం నిదానంగా చూసి "సరూ, నీకు తెలుసు కదా అన్నం మెతుకు ఒక్కటి వృధా అయినా, నాలుగుమెతుకుల కోసం మాఅమ్మ పడిన యాతన గుర్తొచ్చి నాకు భరించలేని బాధ కలుగుతుందని. ఈ మధ్యకాలంలో మన పెళ్ళిళ్ళలో వెర్రితలలు వేస్తున్న భోజన'విష'సంస్కృతి.....పదిరకాల స్వీట్లూ, పదిరకాల కూరలూ, రకరకాల బిర్యానీలూ గొప్పకోసం విస్తట్లో గుమ్మరించడం, వచ్చిన అతిథిదేవుళ్ళు స్టైల్ గా ఒకటో రెండో ఐటెమ్స్ మాత్రం రుచిచూసి లేచిపోవడం, వాళ్ళలా వదిలేసిన వాటిని

అపరాధభావం కొంచెమైనా లేకుండా పెంటకుప్పలమీద పారబోసెయ్యడం, అలా పారేసిన ఎంగిలిమెతుకుల కోసం తినడానికి పిడికెడు మెతుకులులేని అభాగ్యులనేకమంది ఆ పెంటకుప్పలమీదే పందులతోనూ, కుక్కలతోనూ పోటీపడడం.....ఇవన్నీ చూసి తట్టుకోలేకే కదా నేను పెళ్ళిళ్ళకి వెళ్ళడం పూర్తిగా మానేసింది. తినడానికిలేక "అన్నమో రామచంద్రా" అని అల్లాడే లక్షలాదిమంది నిరుపేదలున్న మనదేశంలో అన్నాన్ని అలా వృధాచేసే హక్కు ఎవడికైనా, వాడెంత శక్తిమంతుడైనా, గొప్పవాడైనా ఉందంటావా సరూ. అలాంటి వెధవల్ని నడిబజారులో ఉరితీసెయ్యొద్దూ". అన్నాడు ఆవేశంగా.

"నేను అడిగిందేంటి, నువ్వు చెప్తున్నదేంటి రామూ? ఐషూని ఎందుకలా ఏడిపించావని అడిగితే, దానికి సమాధానం చెప్పకుండా ఎవడ్నో ఎందుకో నడిబజారులో ఉరితీసెయ్యాలంటావేంటి. ఏమైనా అర్థం ఉందా నువ్వు మాట్లాడుతున్నదానికి?" అంది సరోజ కూడా ఆవేశంగా.

"ఐయామ్ కమింగ్ టు దట్. ఈ మధ్య చాలా రోజులుగా గమనిస్తున్నాను. ఐషమ్మ అన్నాన్ని చాలా వృధాచేస్తుంది. రెండుమూడుసార్లు, నీ ఎదురుగానే చెప్పాను గుర్తుందా "అన్నం దేవునితో సమానమమ్మా. అలా వేస్ట్ చెయ్యకూడదు. కావలసినంత మాత్రమే వడ్డించుకొని తిను. మిగిలితే ఎవరైనా పేదవారికి పెట్టొచ్చు. ఎంగిలి చేసి వదిలేస్తే బయట పారెయ్యడానికి తప్ప ఎందుకూ పనికిరాదు" అని. కాని తనా అలవాటు మానుకోవడంగాని మానుకునే ప్రయత్నం కాని చెయ్యలేదు. ఎవడో బయటివాడు చేస్తేనే తట్టుకోలేని నాకు, నా కూతురే అలా చేస్తుంటే ఎలా ఉంటుందో చెప్పు. అందుకే మొన్నొకరోజు....నువ్వు ఇంట్లో లేవు, ఆఫీస్ డిన్నర్ ఉందని వెళ్ళావు.....మళ్ళీ అలాగే వేస్ట్ చేస్తుంటే, కోపంవచ్చి కొంచెం గట్టిగానే మందలించాను "

"ఏంటి ఐషమ్మమీద అరిచావా నువ్వు? ఏమందది?" అడిగింది సరోజ ఆశ్చర్యంగా.

"ఏమందా? నీకు చాదస్తం మరీ ఎక్కువైపోతుంది నాన్నా. కొంచెం అన్నం పారేసినందుకే నేనేదో భయంకరమైన పాపం చేసినట్టు అంతలా కేకలేస్తున్నావేంటి. వేరే పనిలేదా నీకు.' అని తిరిగి నామీద అరవడమే కాకుండా, మాట్లాడడంకూడా మానేసింది. అందుకే....తనకి అర్ధంకావాలనే.....ఎప్పుడూ తెలియనివ్వకూడదనుకున్న నా గతాన్ని అంత కఠినంగా చెప్పాల్సొచ్చింది." అన్నాడు బాధగా.

"అర్ధం కావాలనా?ఏం అర్ధంకావాలని?" అంటూ అయోమయంగా చూస్తున్న భార్య కళ్ళలోకి సూటిగా చూస్తూ,

"అవును. అర్ధంకావాలనే....... నాకూతురుకి మెతుకు విలువ అర్ధంకావాలని" అని మృదువుగా చెప్పి చదువుతున్న పుస్తకంలోకి తలదూర్చేసాడు రాంబాబు.

***

# విలోమ విలువలు

కె.విరాజ్

నేను భాస్కర్ బంగళా చేరేసరికి సాయంకాలం ఆరైంది. నదివొడ్డున చిన్న గుట్టమీద బ్రిటిష్ వారి అభిజాత్యాన్ని ప్రతిబింబిస్తూ ఇండోయూరోపియన్ స్టైల్లో కట్టిన పెద్ద బంగళా. చుట్టూ తోట. గుండ్రటి స్థంబాలు, అర్ధవృత్తాకార ఆర్చీలతో విశాలమైన వసారాలు, ఎత్తైన పైకప్పు. దిగువలో పారుతున్ననది కనిపించేట్టుగా కిటికీలు.

భాస్కర్ వసారాలో బల్లముందు కూర్చుని ఆఫీసు ఫైళ్లు చూసుకుంటున్నాడు. పక్కనే పియ్యే కాబోలు నిలబడి ఏదో వివరిస్తున్నాడు. నన్ను చూసి చదువుతున్న ఫైలు మూసి, నవ్వుతూ "ప్రయాణం బాగా జరిగిందా? కారు సమయానికే స్టేషనుకొచ్చిందిగదా" అంటూ వచ్చి చెయ్యి కలిపాడు. 'ఆరోజుకు పనిచా'లని పియ్యేను ఇంటికి వెళ్లిపొమ్మన్నాడు.

ఇద్దరం అక్కడే ఉన్న పేము కుర్చీల్లో కూర్చుని కబుర్లలో పడ్డాము. వంటమనిషిని పిలిచి టీ, బిస్కట్లు తీసుకురమ్మన్నాడు. నదిమీదుగా వస్తున్న చల్లగాలి తోటలోని పూల సువాసనలను కలుపుకుని మత్తుగా వీస్తోంది.

"బ్రిటిష్ పాలకులు అడవిలోవున్నా వాళ్లక్కావల్సిన సౌకర్యాలు కళాత్మకంగా అమర్చుకునేవాళ్లనుకుంటా" అన్నా, పాతబడినా వన్నెతగ్గని బంగళా ఇంటీరియర్స్ చూస్తూ.

"మేముకూడా దొరలమేగా. వీటిని యింకా సుందరీకరించుకున్నాము" అని నవ్వి "బ్రిటిష్ వాళ్లనైతే సాగనంపగలిగాముగాని వాళ్లు వాళ్లజాగ్రత్త కోసం మనచుట్టూ బిగించిన చట్రాలను మాత్రం వదిలించుకోలేకున్నాము" అన్నాడు భాస్కర్.

"యిక్కడెలావుంది?" అన్నాను. భాస్కర్ నిజాయతిగా నిక్కచ్చిగా ఉంటాడు. అందుకే రెండుమూడేళ్లకోసారి బదిలీ అవుతూంటాడు. ముందువాడి అవినీతి శృతిమించి పైవాళ్లకు ప్రమాదకారి అయ్యాక మంటలార్పడానికి ఇతన్ని వేస్తారు.

"యెక్కడైనా అదే కథ. నాముందిక్కడ పనిచేసిన దీనదయాళ్ గారికి 'తిమింగల'మని పేరు. యిక్కడి పైస్థాయి వుద్యోగుల్లోని కొంతమంది అత్యాశాపరులక్కూడా ఆయన వ్యవహారం కలిసొచ్చింది. వలస పాలకుల్లాగే యీదొరలూ మన సమాజంతో సంబంధాన్ని తల్లకిందులుగా విలోమంగా కొనసాగించారు. యిలాంటివాళ్లకు దెబ్బతింటున్నది మనసమాజమే అన్న స్పృహ వుండదు కాబోలు. వీళ్లను దారిలో పెట్టడానికి సంవత్సరం పట్టింది. స్వతంత్రం వచ్చినప్పట్నుంచీ చాలాచోట్ల యిదంతా వొక సమాంతరవ్యవస్థగా కొనసాగుతోంది. యిలాంటివి మీలాంటి సామాజికశాస్త్రవేత్తలు పరిశోధించలేదనుకుంటా" అన్నాడు భాస్కర్.

"స్వతంత్రమైతే వచ్చిందిగాని, గాంధీగారితరంతోనే ఆ సంస్కరణలూ పోయాయి" అన్నాను టీకప్పు అందుకుంటూ. భాస్కర్ వంటమనిషికి 'థ్యాంక్స్' చెప్పి టీకప్పు తీసుకున్నాడు.

"దయాళ్ గారు అవినీతిపనుల్లో తనెక్కడా దొరక్కుండా వుండడానికి కొంతమంది కిందిస్థాయి వుద్యోగులను యిరికించాడు. ప్రాథమిక అవసరాలను తీర్చలేని పేదరికం మనిషిచేత యేదైనా చేయిస్తుంది. దాన్ని యెలా ఎక్స్ ప్లాయిట్ చేయాలో మనదొరలకు బాగాతెలుసు. నేనిందాక చూస్తున్న ఫైలు అలా యిరుక్కున్న వొక నిర్భాగ్యుడిదే. అదిగో ఆ పూలచెట్లలో పనిచేస్తూంది చూడు ఆమె భర్తది" నిట్టూర్చాడు భాస్కర్.

"సునంద లేదా?" అనడిగాను, తనుంటే ఈపాటికి సందడి చేస్తూండేది.

"పక్కనున్న పల్లెకెళ్లింది. యీపాటికొచ్చేసిండాల్సింది. చెప్పానుగా తను వొక సేవాసంస్థ తరఫున పనిచేస్తోంది. పల్లెల్లో ఆడవాళ్లల్లో అవగాహన పెంచి వాళ్లను కుటుంబ లీడర్లుగా తయారుచేయడం ఆ సంస్థ ఆశయం. బాగా కష్టపడుతోంది" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

యూనివర్సిటిలో భాస్కర్, నేను సహాధ్యాయులం. పీజీతర్వాత భాస్కర్ కేంద్ర సర్వీసులో పెద్ద ఉద్యోగం తెచ్చుకున్నాడు. నేను డాక్టరేట్ చేసి విశ్వవిద్యాలయంలో పంతులుగా స్థిరపడ్డాను. సునందవాళ్లు ముంబైలో స్థిరపడిన తెలుగువాళ్లు. ఆమె సైకాలజిలో పీజి చేసింది.

బయట కారాగిన చప్పుడైంది. సునంద హడావుడిగా వచ్చి "సారీ అండీ. యీరోజే లేటైంది" అంటూ కూర్చుంది. బాగా అలసిపోయినట్టు కనబడింది. రోజంతా తిరిగి కష్టపడినట్టు చెదరిన జుట్టు, నలిగిన దుస్తుల్ని బట్టి తెలుస్తూంది.

"మీ పని యెలా సాగుతోంది?" అన్నాను. రెండేళ్ల క్రితం చూసినప్పటికీ ఇప్పటికీ ఆమెలో వచ్చిన మార్పుని అంచనా వేస్తూ. వయసు నాలుగేళ్లు పెరిగినట్టుంది. ఇక్కడి ప్రజలతో కలసిపోవడానికి నుదిటిమీద పెట్టుకున్న పెద్ద బొట్టు, కట్టుకున్న కాటన్ చీర, బొత్తిగా మేకప్ వేసుకోకపోవడం వీటివల్లకూడా అలా అనిపిస్తూండవచ్చు. 'పనివొత్తిడి ఆడవాళ్లమీద అధికప్రభావం చూపిస్తుందేమో' అనుకున్నా.

"చూస్తున్నారుగా... తరాలుగా చదువులేకపోవడంవల్ల వీళ్ల ఆలోచనల్లో మార్పు తీసుకురావడం అంత సులభంగాలేదు" అంది దిగులుగా.

“మనుషుల్ని వొక చెడునుంచి మరొక చెడుకి మార్చినంత సులభంగా చెడునుంచి మంచికి మార్చడం అవుతుందా, అందులోనూ మీ నాగరికులు శతాబ్దాలుగా పక్కనబెట్టిన యీ పల్లెటూళ్లలో” అన్నాడు భాస్కర్ నవ్వుతూ

“ఆవిషయంలో మా నాగరికులకంటే వీళ్లే నయం బాబూ” అంది కొంటెగా నవ్వుతూ.

తరువాత ఇతరకబుర్లలో పడిపోయాము. వంటమనిషి టీ తీసుకొచ్చి సునందకు ఇచ్చింది.

"నువ్వు యిక్కడే యింట్లోనే వుండు. పైనున్న గది పెద్దదే. పైగా దాదాపు రోజంతా మేమిద్దరం బయటే వుంటాము. నీ ప్రాజెక్టు రిపోర్టు రాసేపని నిరభ్యరంతరంగా చేసుకోవచ్చు. గెస్టౌస్ లో నీకేంతోస్తుంది?" అన్నాడు భాస్కర్ మరోసారి టీ తాగాక.

"యీసారికిలా వుండనివ్వు. అయినా రోజూ సాయంత్రం టీ తాగడానికొస్తాగా" అన్నాను

"మీరున్న వారం రోజులూ డిన్నర్ కూడా యిక్కడేచేసేట్టైతేనే మిమ్మల్ని గెస్టౌస్ కి వెళ్లనిస్తాం. అదికూడా అనుకోకుండా యీవారమే నేను పగలు యింట్లోవుండడంలేదు కాబట్టి" అంది సునంద గట్టిగా.

నేనక్కడే రాత్రిభోజనం చేశాక గెస్ట్ హౌస్ చేరుకున్నాను. అదికూడా బ్రిటిష్ వాళ్లు కట్టిందే.

ఫ్యాక్టరీ నదివొడ్డునే ఎత్తుమీద మైదానంలో ఉంది. నాగరికతకు దూరంగా కొండల్లో, అడవిలో ఉన్న ఖనిజాలకు సంబంధించిన ఫ్యాక్టరీకి ఉన్నతాధికారి భాస్కర్. అతని బంగళాకు ఫ్యాక్టరి మధ్య మైలుదూరం, ఈ మధ్యభాగంలో అధికార్లకు, ఇంజనీర్లకు, మిగతా ఉద్యోగులకు క్వార్టర్స్, క్లబ్బు, ఆసుపత్రి, స్కూలు, ఆడిటోరియమ్, పార్కులాంటివి ఉన్నాయి. ఉద్యోగుల అవసరాలు చూడ్డానికి చుట్టుపక్కలనుంచి వచ్చినవారితో ఫ్యాక్టరీకి మరోవైపు కాంక్రీటుఇళ్లు, గుడిసెలు, రేకు షెడ్లతో, దుకాణాలతో ఒక చిన్న బస్తీ వెలసింది. క్వార్టర్స్ లేని చిన్నఉద్యోగులూ ఆ బస్తీలోనే ఉంటారు.

★ ★ ★

ఉదయపునడకకు వెళ్లొచ్చి గదిలో రీసెర్చ్ ప్రాజెక్టు రిపోర్టు పని చూసుకుంటున్నాను. తలుపుమీద వేళ్లచప్పుడై మరో నిముషంలో తలుపు తెరుచుకుంది. గెస్టౌస్ మెస్ నుంచి పలహారం ప్లేటుతో ఒకతను లోపలికొచ్చి "గుడ్మానింగ్ సార్" అంటూ ప్లేటుని టీపాయ్

మీదవుంచి "మీ టిఫిన్ సార్. కాఫీ తెమ్మంటారా? టీ తెమ్మంటారా?" అని అడిగాడు. సన్నగా, పొడవుగా, చామనఛాయ రంగులో, పల్చబడిన జుట్టుతో, వడలిన మొహంతో ఉన్నాడు.

మొహంచూస్తే అతను నాకు తెలిసినవాడిలాగ అనిపించాడు. “టీ” అంటూ పరీక్షగా చూశాను. “సరే సార్” అని వెళ్లిపోయాడు. అతను వెళ్లగానే చప్పున గుర్తొచ్చింది. అతను ఒడ్డెప్ప. ఎన్నేళ్లైంది ఒడ్డెప్పను చూసి. ఇన్నేళ్ల తరువాతకూడా అతన్ని గుర్తుపట్టగలగడం చిత్రంగా అనిపించింది. కొన్ని జ్ఞాపకాలు మనిషి సుప్త చేతనంలో స్థిరపడివుంటాయేమో.

టిఫిన్ తినడం మర్చిపోయి ‘ఒడ్డెప్ప టీ పట్టుకుని ఎప్పుడువస్తాడా’ అని ఎదురుచూస్తుంటే పాతవిషయాలు గుర్తొచ్చాయి.

ఒడ్డెప్పవాళ్లు నా చిన్నప్పుడు కొన్నేళ్లు మా పల్లెటూళ్లో ఉన్నారు. ఎక్కడినుంచోవచ్చి మాయింటిపక్కన మా ఖాళీ స్థలంలో మానాన్ననడిగి ఒక పూరిల్లు వేసుకుని ఉండేవాళ్లు. అతను నాకంటే ఐదారేళ్లు పెద్ద, ఒక తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్లూ ఉండేవాళ్లు. వాళ్ల నాన్న పంటకాలంలో ధాన్యంవ్యాపారుల దగ్గర సహాయకుడుగా పనిచేసేవాడు. మిగతా సమయంలో కమీషన్ మీద చిన్నచిన్న పనులు చేస్తూ బయట తిరుగుతూవుండేవాడు. వాళ్లమ్మ మోతుబర్ల ఇళ్లల్లో దంచడం, ఒలవడంలాంటి పనులు చేసేది. ఒడ్డెప్ప పొద్దునపూట రైస్ మిల్లులో పనిచేస్తూ ఇంటి విషయాలన్నీ చూసుకునేవాడు. వాళ్లకు జరుగుబాటు కష్టంగా ఉండేది. అసలు ఒక కుటుంబం స్థిరనివాసం లేకుండా ఇలా ఊర్లుమారడం నాకు అప్పట్లో వింతగా అనిపించేది. అందుకేనేమో యూనివర్సిటి ఉద్యోగంలో చేరి ఒకేచోట స్థిరపడ్డాను.

ఒడ్డెప్ప నాకంటే ఐదారేళ్లు పెద్దవాడైనా నన్ను మిత్రుడుగా పరిగణించి నాతో సన్నిహితంగా ఉండేవాడు. స్కూలు మధ్యలో మానేసినా అతనిది వయసుకి మించిన లోకజ్ఞానం. సన్నగా వున్నా పనులన్నీ నైపుణ్యంతో చేసేవాడు. అతని ఉంగరాల జుట్టు ప్రత్యేకంగా ఉండేది. వాళ్ల తాతలు బ్రిటిష్ వాళ్లదగ్గర పనిచేశారని, బ్రిటిష్ వాళ్లు వెళ్లిపోయాక అంతా గాడి తప్పిందని, భయం పోయి బలమున్నోడిదే రాజ్యమైందని చెప్పేవాడు. నేను స్కూలునించి రాగానే ఇద్దరం తోటలు, గుట్టలు తిరిగే వాళ్లం.

ఒక్కోరోజు నన్ను ఇంటికెళ్లిపొమ్మని అసురసంధ్య మసకలో కొందరు మోతుబర్ల పొలాల్లో కంకులు, కాయలు, పళ్లూ, కూరలు తెచ్చుకునేవాడు. ఒకసారి నేను ‘తప్పుకదా’ అంటే ఆ మోతుబర్లెంత చెడ్డవాళ్లో, వారివల్ల తమలాంటివాళ్లెలా పేదలౌతున్నారో వివరించి ‘మీరు చేప్పే ధర్మరాజ్యం వచ్చేలోపల మేం ఆకలితో చచ్చిపోతాం’ అన్నాడు. వీటి సంగతెలావున్నా అతనివల్ల నాకు పైకి కనబడే సమాజం వెనక దాగివుండే అనేక విషయాల్లో జ్ఞానం కలిగింది. అప్పుడప్పుడు నన్ను ‘మీకేం బాబు పెట్టిపుట్టినవాళ్లు, ధర్మంగా వుండగలరు’ అనేవాడు.

రైసుమిల్లు యజమాని కూతురు ఇతని చురుకుదనం చూసి అభిమానించడం మొదలుపెట్టింది. ఆమె అడుగుతోందని మాపెరట్లో విరగ్గాస్తున్న లిల్లీ పువ్వులను రోజూ తన చెల్లిచేత మాలగా కట్టించి తీసుకెళ్లి ఆ అమ్మాయికిచ్చేవాడు. కొన్నాళ్ల తరువాత హఠాత్తుగా ఒకరోజు రైసుమిల్లులో పని వదిలేసి అటువైపెళ్లడం మానేసాడు. ‘ఎందు’కని అడిగాను.

"ఆ పిల్ల నన్ను ప్రేమిస్తావున్నానని చెప్పి, పెళ్లి చేసుకుందామని అడిగింది" అన్నాడు.

"ఇంకేం, అదృష్టమంటే యిదే. అందుకే పని మానేసావా?" అన్నాను

“యిదేమన్నా సినిమా అనుకున్నావా చినబాబూ. ఆమెది తెలిసే వయసుకాదు. పని పోతేపోయింది, నా ప్రాణాలు కాపాడుకున్నా" అన్నాడు.

రానురానూ కరువుపెరిగి దిగుబళ్లు తగ్గిపోవడం మొదలయ్యాక ఒడ్డెప్ప కుటుంబం అప్పులపాలై ఒక రాత్రి ఊరువిడిచి వెళ్లిపోయింది. ఆతరువాత అతన్నిదే చూడ్డం.

తలుపుతెరుచుకుని మరో కుర్రాడు టీ తీసుకొచ్చి బల్లమీద పెట్టాడు.

"వొడ్డెప్ప యేడీ, అతను యీ గెస్టౌస్లో పనిచేస్తాడా?" అని ఆతృతగా అతన్ని అడిగాను.

"ఔనుసార్, కానీ యింటికెళ్లిపోయాడు సార్" అని కొంచెం తటపటాయించి "యిప్పట్లో రాదు సార్, వొడ్డెప్ప సస్పెన్షన్ లో వున్నాడు, మూడునెల్లైంది" అన్నాడు ఆకుర్రాడు.

నేనాశ్చర్యంగా చూసి "యిందాక టిఫిన్ తెచ్చాడుగా. యెక్కడుంటాడో తెలుసా" అన్నా.

"దూటి నాది సార్. యేదో పనిమీద యిటొచ్చేడు. మరి నేను వేరేపన్లోవుంటే మీకు టిఫినట్టుకొచ్చేడు. పాపం మంచోడు సార్" అని బస్తీలోవుండే ఒడ్డెప్ప ఇంటి గుర్తులు చెప్పాడు.

★ ★ ★

ఆసాయంత్రం నాలుక్కే పని ఆపి, వెతుక్కుంటూ వెళ్లి బస్తీలో ఒడ్డెప్ప ఇల్లు పట్టుకున్నాను. ఇంట్లోనే ఉన్నాడు. వీధి తలుపుదగ్గర రేకుకుర్చీలో ఒక్కడే కూర్చుని వీధిలో ఆడుకుంటున్న పిల్లల్ని నిరాసక్తంగా చూస్తున్నాడు. సన్నటి వీధిలో మూడుగదుల ఇల్లు.

పలకరించి నేనెవరో చెప్పాక కొన్నిక్షణాలకిగాని నన్ను గుర్తుకు తెచ్చుకోలేకపోయాడు.

"చినబాబు యెన్నాళ్లకు చూసినాను" అంటూ సంబరంగా కౌగిలించుకుని ఉన్న ఒక్కకుర్చీలో కూర్చోబెట్టి ఆదరంగా నావి, మా కుటుంబసభ్యులవి పేరుపేరునా యోగక్షేమాలు విచారించాడు. మా వూరిగురించి, వూర్లోవాళ్ల గురించి గుర్తున్నంతవరకూ అడిగాడు.

మేం విడిపోయినప్పట్నుంచీ తనవివరాలు క్లుప్తంగా చెప్పాడు. మనిషిలో ఇదివరకటి శక్తి, హుషారు లేవు. ఉంగరాలజుట్టు పోయింది. చాలామందికిలాగే అతన్దీ జీవితమంతా విడుపులేని పోరాటమే. మానవ నాగరికతాఫలాలు అందక బతుక్కోసం రాజీపడిన అసంఖ్యాకులకు ప్రతీకగా ఉన్నాడు.

ఇప్పుడిక్కడ గెస్టౌస్ లో మెస్ చూసుకుంటున్నాడట. ఎక్కడెక్కడో తిరిగి రాష్ట్రం ఈ చివరన పదేళ్లకిందట కిందామీదాపడి ఈ ఉద్యోగం సంపాయించాడట. జబ్బులుచేసి అతని అమ్మా, నాన్న, చిన్న చెల్లెలు చనిపోయార్ట. భార్య భాస్కర్ బంగళాలో తోటపని చూస్తుంది. ఒడ్డెప్పకు ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు. అప్పుచేసి పెద్ద కట్నమిచ్చి పెద్దకూతుర్ని పోలీసు కానిస్టేబుల్ కిచ్చి పెళ్లి చేశాడట. పోలీసు ఉద్యోగమే వేరట. వేలు ఖర్చుపెట్టి అల్లుణ్ణి ఫ్యాక్టరి సెక్యూరిటిలో డెప్యుటేషన్ వేయించుకున్నాడట.

ఈ వాతావరణంలో కొడుక్కు సరిగ్గా చదువబ్బలేదని విచారంగా చెప్పాడు. తన కష్టపడి తెచ్చుకున్న ఉద్యోగంతో సంఘంలో కాస్త పైకెగిరినా కొడుక్కు చదువురాకపోవడంతో మళ్లీ తాము కిందికి పడిపోతామన్న భయం అతనిలో కనిపించింది.

'అందరూ యెవురిపనులమీద వాళ్లెళ్లినారు, యింట్లో నేనొక్కడినే వున్నా'నని నొచ్చుకున్నాడు. వద్దన్నా వినకుండా టీ చేసిచ్చాడు.

" ఇంతదూరం నీకీవూర్లో యేంపని?... నువ్వుగూడా కంట్రాట్టులు జేస్తున్నావా... ఆఫీసర్లు, కంట్రాట్టర్లే మా గెస్టౌస్లో దిగుతారు" అని తనే నిర్ధారించాడు. నేను అప్పటికి నవ్వి ఊరుకున్నాను.

ఇద్దరం పాతసంగతులు చాలాసేపు మాట్లాడుకున్నాం.

"ఐతే మీ భాస్కర్ సారు చాలా స్ట్రిక్ట్ అఫీసరట కదా" అన్నాను వర్తమానంలోకి వచ్చి.

"ఔనుబాబు, జాగర్తగా వుండు" అని "ఆయనట్లా కచ్చితంగా వుండడంవల్ల యెవురికి వుపయోగం?" అన్నాడు నిజాన్ని తీర్మానించినట్టుగా.

"స్ట్రిక్టుగా వుంటేనేగదా మీఫ్యాక్టరీకీ మంచిది, అలాంటివాళ్లేగదా కావల్సింది?" అన్నాను

"ముందున్న దయాళుసారు దర్మరాజు చినబాబూ, నాలుగుడబ్బులు మనవిగావనుకుంటే పనులు ఐపోయ్యేవి. మీలాంటి కంట్రాట్టర్లందరూ ఖుషీ. మాకూ నాలుగుడబ్బులొచ్చేవి. యీయనొచ్చాక అన్నీ రూల్సంటాడు. మావేంజీతాల్లే బాబూ, తిండికే కటకట". అతను నన్ను కంట్రాక్టరని భావించి మాట్లాడ్డం నాక్కొంచెం ఇబ్బందిగానే ఉంది.

"మొదట్నించీ గెస్ట్ హౌస్ లోనే వున్నావా?" అడిగాను

"యెక్కడిది బాబూ, రెండేండ్లనించే. అంతకుముందంతా కొలిమి దగ్గరే గదా. అన్నీ పాతకొలుములు, కొత్తగా మార్చాలంటే పైవాళ్లు డబ్బుల్లేవంటారు. వొళ్లు కొరివైపోయింది. రూలుప్రకారం నా వయసును బట్టి అక్కణ్ణుంచి వాళ్లే మార్చాలనుకో. ఐనా దయాళుసారును బతిమాల్తే డబ్బులు తీసుకొని గెస్టౌసుకు మార్చినాడు. ఖర్చయితే ఐంది, ఆరోగ్యం కుదుటబడింది" చొక్కా పైకెత్తి చాతీకాలిన మచ్చలను చూపించాడు.

"నువ్వు సస్పెన్షన్ లో వున్నావని తెలిసింది. నిజమేనా. యేంజరిగింది?" అనడిగాను

కాస్సేపు మాట్లాడకుండా తలవొంచుకున్నాడు. "యేదో జరిగిందిలే. పిల్ల పెండ్లికి తెచ్చిన అప్పుమీద వడ్డీ పెరిగిపోయింది. అప్పిచ్చినోడు యింటిమీద కూచ్చున్నాడు. కంట్రాట్టరు ఫ్యాక్టరీకి తక్కువసరుకు తూకమేసినా డబ్బుకు ఆశపడి వూరుకున్నా. అదంతా వేణుసారు చెప్తేనే చేసినా. దయాళుసారు కంట్రాట్టరూ దోస్తులు. నీకు తెలీదులే, చెయ్యకపోతే ఆయన్తో చిక్కు. యీ బాస్కరుసారు వచ్చినాక యెవురో పిర్యాదుజేస్తే విచారణ జేయించినాడు. అక్కడికీ నావల్ల జరిగింది చిన్నతప్పేనని అందరూ చెప్పినారు. యీయన యెవురిమాటైనా వింటేగదా. ఆరాత్రి డూటీలోవుండిన వేణుసారు అంతానామీదేసి తప్పించుకున్నాడు, యెళ్లిపోయిన దయాళుసారూ సాయంజెయ్యలేదు. యేదిజెరిగినా బీదోడికేగదా తగిలేది. మాలాంటోళ్లకు యిదంతా వొక వూబీ చినబాబూ" గొణుక్కున్నట్టుగా నిదానంగా చెప్పాడు.

"జరిగిందాంట్లో నీ తప్పు లేదనుకుంటున్నావా?" అడిగాను.

"లేకుండా యెట్లుంటుంది" అన్నాడు నెమ్మదిగా. మొహం మ్లానమైంది. జరిగిందానికి పశ్చాత్తాపపడుతున్నట్టే ఉంది.

"యిప్పటికే మూడునెల్లైందంటగదా, యీ కొత్తసారు తొందర్లోనే పోస్టింగిస్తాడా?" అన్నా

"యేమో తెలీదు. యీయన యెక్కడా యెక్కువరోజులు వుండడంటలే చిన్నబాబూ. అప్పటిదాకా ఆపని యీపనీ చేసుకుంటా యెట్లో కాలం యెళ్లదీయాల" అన్నాడు పరిస్తితితో రాజీ పడినట్టుగా.

మరి కాస్సేపు మాట్లాడేక "మళ్లీ వస్తా" అని లేచాను.

అతను చుట్టూ చూసి "నువ్విక్కడికి రాలేవులే. నేనే గెస్టౌస్ కు వస్తుంటా. నీకే సాయంగావాలన్నా అడుగు. యిక్కడంతా నాకు తెలిసినోళ్లే. కానీ మా బాస్కరుసారుతో కొంచెం జాగర్తగావుండు" అని వీధి చివరివరకూ వచ్చి సాగనంపాడు. పెద్దసారు దయ అతనిమీద లేదని తెలిసిన బస్తీజనం 'అతన్ని వెలివేసారా' అన్నట్టుగా ఒడ్డెప్ప తలొంచుకుని నడిచాడు. అన్నిచోట్లావున్న అవినీతిగురించి తెలిసినా పట్టుబడినవాణ్ణి మాత్రమే సమాజం వేరుగా చూడ్డం చిత్రం, 'పట్టుబడనంతవరకూ మన్నిస్తుంది కాబోలు' అనుకున్నాను.

'నాకన్నా ఎక్కువ తెలివి, నైపుణ్యం, చొరవ కలిగిన ఒడ్డెప్ప బతుకంతా పోరాటంతోనే గడవడం, అప్పుడప్పుడు దారితప్పడంకూడా మన సమాజపు ఒక విలోమలక్షణమా!?' అనిపించింది.

★ ★ ★

రెండురోజులు గడిచాయి. నేను రోజూ సాయంత్రం భాస్కర్ ని కలుస్తూనే ఉన్నా అతని దగ్గర ఒడ్డెప్ప ప్రసక్తి తీసుకురావడానికి కుదర్లేదు. ఒడ్డెప్పపట్ల నా అభిమానం చెక్కుచెదరక పోవడం ఆశ్చర్యమనిపించింది. బాల్యస్నేహం తప్పుల్ని పట్టించుకోదేమో. అతను సహజంగా మంచివాడేనన్న విషయాన్ని భాస్కర్ కి ఏవిధంగా చెప్పాలన్నదే తేల్చుకోలేకుండా ఉన్నాను.

మూడోరోజు సాయంకాలం నేను వెళ్లేసరికి భాస్కర్ ఇంటి వరండాలో ఒక పంచాయతి నడుస్తోంది. ఒడ్డెప్ప ఒకపక్కగా గోడకానుకుని తలొంచుకుని నిలబడివున్నాడు. సునంద దగ్గరగా అతని భార్య, కూతురు నేలమీద కూర్చొని ఏడుస్తూ మధ్య మధ్యలో మాట్లాడుతున్నారు. పక్కనే సెక్యూరిటి యూనిఫాంలో ఓ యువకుడు చేతులు కట్టుకుని నిలబడివున్నాడు. అతను ఒడ్డెప్ప అల్లుడుగా నాకు అర్థమైంది. భాస్కర్ కొంచెం వెనకగా కూర్చుని కాగితాలు చూసుకుంటున్నాడు. నన్ను చూసి భాస్కర్ తనదగ్గరికి వచ్చికూర్చోమని పిలిచాడు. ఒడ్డెప్ప నన్ను చూసి, చూడనట్టుగా తలవొంచుకున్నాడు.

సునంద ఒడ్డెప్ప అల్లుడిని ప్రశ్నలడుగుతూ ఒకసారి మెత్తగా మరోసారి గట్టిగా నచ్చజెపుతోంది. కొంతసేపటికి నాకు విషయం అర్థమైంది. ఒడ్డెప్ప అల్లుడు మరో అమ్మాయితో తిరుగుతున్నాడు, పెళ్లికి ముందునుంచే ఇది ఉన్నట్టుంది. ఒడ్డెప్ప భార్య ఈ పంచాయతి పెట్టించింది. సునంద అడిగినపుడంతా అతను "అబ్బే లేదమ్మగారూ" అంటూ తాను అమాయకుణ్ణని చెపుతున్నాడు. ఒడ్డెప్ప తనకేమీ సంబంధంలేనట్టుగా ఉన్నాడు.

ఇలా కాసేపు జరిగాక భాస్కర్ కలగజేసుకుని, 'పోలీసుగావుండి ఇలాచేయడం అన్నిరకాలుగానూ తప్పేనని, ఆ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కి ఇతన్ని సరెండర్ చేస్తూ ఇతనిమీద తీవ్రమైన చర్యకు సిఫార్సు చేస్తా'నని అన్నాడు.

దాంతో అతను భాస్కర్ ముందు నేలమీద కూలబడి తప్పు ఒప్పుకుని ఇంకెప్పుడూ అలా చేయనని ప్రమాణం చేశాడు. సునంద మళ్లీ కొంత కౌన్సెలింగ్ చేసి అతనిచేత అనేక హామీలు ఇప్పించుకున్న తరువాత వాళ్లను పంపించేసింది.

మరుసటిరోజు పొద్దున వచ్చినప్పుడు ఒడ్డెప్ప తనే ఆవిషయాన్ని ప్రస్తావించి "నేను నిన్నసాయంత్రం నిన్ను పలకరించలేదు చినబాబూ. నువ్వు అయ్యగార్తో పనుండి వచ్చినట్టున్నావు. నామీద అయ్యగారికి కోపం వుందిగాబట్టి నీపని చెడిపోతుందని పలకరించలేదు, నువ్వేమనుకోలేదు గదా" అని "నువ్వాయన్ను యింటిదగ్గర కల్సుకుంటున్నావంటే యింగ చెప్పేదేముంది. నీపని అయిపోతుంది" అన్నాడు.

నేను నవ్వి "అది సరే, నిన్న నువ్వేమీ మాట్లాడలేదే వొడ్డెప్పా, అల్లుడికి బుద్ధి చెప్పాల్సిందిపోయి అలా వూరికే నిలబడ్డావేం" అన్నాను

"అమ్మగారి అండచూసుకోని మాయావిడ చేసిన ఆగాయిత్యంగాని పోలీసోడంటే ఆమాత్రం పరిచయాలుండవా బాబూ, ఆ వుద్యోగం పవరట్లాటిది" అన్నాడు తాపీగా.

నేను నిరుత్తరుడినై అతనివైపు కొంచెంసేపు చూసి "అలాగంటావేం వొడ్డెప్పా ఆమె నీకూతురు కాదా?" అన్నాను కోపంగా.

"నాకు మాత్రం బాదుండదా బాబు. నాకైనా పెండ్లికి ముందు తెలుసా? మేం చెప్తే యింటాడా? మాజన్మానికి యిన్నేండ్లకు పోలీసోణ్ని అల్లుణ్ణి చేసుకోగలిగినాం. యిది పల్లేగాదు, పట్నంగాదు. యిక్కడోళ్లు అట్లాటిపనులే గొప్పనుకుంటారు. వడ్డీలేని అప్పుమాదిరి లోకంలో మంచొక్కటే కావాలంటే మాలాంటోళ్లకు దొరుకుతుందా" అన్నాడు నిర్లిప్తంగా.

'ఇతనిలో ఇద్దరు మనుషులున్నారా? ఆస్థితిలో ఎవరైనా అంతేనా?' అనుకుంటూ అతనివైపు చూస్తూండిపోయాను.

★ ★ ★

మర్నాడు ఉదయమే ఒడ్డెప్ప ఉత్సాహంగా గెస్ట్ హౌస్ కి వచ్చాడు. "చినబాబూ నువ్వొచ్చిన యేళావిశేషం, నా సస్పెన్షన్ యెత్తేస్తా నిన్న మద్దేన్నం బాస్కరుసారు ఫైలుమీద సంతకంజేసినాడంట. నాది చిన్నతప్పేనని యీ సిచ్చ చాలునని అన్నాడంట. అంతేకాదు, టౌన్లో మాయావిడ జబ్బుకుజరిగిన ట్రీట్మెంటు డబ్బులుగూడా శాంక్షన్ చేసినాడంట. యెంతైనా యీ బాస్కరుసారు మంచోడు బాబూ" అన్నాడు సంబరంగా

"అంటే నీకు మంచిజేస్తే మంచోడు, లేకపోతే చెడ్డోడా?" అన్నా నవ్వుతూ

"లేదు బాబూ, నిజంగానే మంచోడు. నిజం నిలకడమీద అర్థమైతుంది. నాబార్య ఫైలు యేనాటిదనుకున్నావు? మా పాత దయాళుసారు దీన్ని తొక్కిపెట్టినాడు. ఆయనే వుండుంటే యిట్లా వూరికే చేసేవాడా? పనయ్యేదానికి మళ్లా తప్పుదారిలో నడిచేవాణ్ణి, యేంజెయ్యాల, అవసరాలట్లాటివి. దేవునిదయవల్ల మీకా దరిద్రం లేదు బాబూ" అన్నాడు.

ఆరోజు మధ్యాన్నం వచ్చి నన్ను వాళ్లింటికి భోజనానికి తీసుకెళ్లి భార్యాపిల్లలకి పరిచయంచేశాడు.

★ ★ ★

ఆ వారాంతంలో ఫ్యాక్టరీ స్కూల్లో ఫంక్షన్ జరిగింది. ముఖ్యఅతిథిగా ఉండడానికి నన్ను బలవంతంగా ఒప్పించాడు భాస్కర్. ఆ సాయంత్రం స్టేజీమీద అతిథుల్తోపాటు భాస్కర్ పక్కన నన్నూ కూర్చోబెట్టారు. స్కూలుపిల్లలు, తల్లిదండ్రులు, ఉద్యోగులు పెద్దసంఖ్యలోనే వచ్చారు. ఒడ్డెప్ప ప్రేక్షకుల్లో ఒకమూలన నిలబడి స్టేజివైపు చూస్తూండడం గమనించాను. సభలో భాస్కర్ 'నేను ప్రొఫెసర్ నని, మేమిద్దరం క్లాస్ మేట్లమని, మంచి మిత్రులమని, తన ఆహ్వానం మీద నేను వచ్చానని,' నాగురించి వివరంగా పరిచయం చేశాడు. పిల్లలకు ప్రైజులు నాచేత, సునందచేత ఇప్పించారు. నన్ను మాట్లాడమన్నపుడు నేను చదువు అవసరాన్ని, దానిద్వారా నేర్చుకోవలసిన విలువలగురించి క్లుప్తంగా మాట్లాడి కూర్చున్నాను. సభానంతరం మాకు అక్కడే ఏర్పాటు చేసిన విందులో భోంచేసి రాత్రికి గెస్ట్ హౌస్ చేరుకున్నాను.

ఆ మరుసటిరోజే నా తిరుగుప్రయాణం. ఆ రోజు ఆదివారంకావడంతో నన్ను లగేజితో సహా బంగళాకొచ్చేసి అక్కడినుంచే రైల్వేస్టేషన్ కెళ్లమని సునంద, భాస్కర్ లు గట్టిగాచెప్పారు. పొద్దున్నే బ్రేక్ ఫాస్టయ్యాక సామాన్లు సర్దుకుంటుండగా ఒడ్డెప్ప వచ్చాడు. నేను వెళ్లిపోతున్నాననే బెంగ అతని మొహంలో కనిపిస్తూంది. నేను కలిసినప్పట్నుంచి మా బాల్యపురోజులన్నీ నెమరువేసుకున్నాము. అతని చివరి సంతోషపు రోజులవే.

సామాన్లు సర్దడం అయ్యాక గోడకానుకుని నిల్చుని "నువ్వు బలేవోడివి చినబాబూ, మా బాస్కరుసారు నీకంత దోస్తని నాకు చెప్పకుండా దాచినావు. ఆయనగురించి అనౌసరంగా యేదేదో మాట్లాడినాను" అన్నాడు నిష్టూరంగా

నేను నవ్వి "నువ్వే నన్ను చెప్పనివ్వకుండా కంట్రాక్టరును చేశావు" అన్నా.

"వోమాటడిగేదా చినబాబూ? నువ్వు నాగురించి బాస్కరుసారుకు చెప్పి సిఫార్సు చేసినావుగదా? అందుకేగదా ఆయన సస్పెన్షన్ యెత్తేసి నాఫైళ్లన్నీ సంతకంబెట్టింది?" అన్నాడు.

డ్రైవర్ గదిలోకి వచ్చి సామాను తీసుకెళ్లాడు.

“నిజం చెబితే నమ్ముతావా వొడ్డెప్పా? నీగురించి భాస్కర్ కి చెప్పడానికి నాకింతవరకు వీలే కుదర్లేదు. నీ పనులన్నీ అతనికి అతనే చేశాడు. అందులో నా ప్రమేయమే లేదు. ఐతే ముందు ముందు ఆయన్నించి నీకే సమస్యా రాకుండా యీరోజు అతనికి నీగురించి చెబుదామనుకుంటున్నాను" అన్నాను బ్యాక్ ప్యాక్ తగిలించుకుంటూ.

"వొద్దు చిన్నబాబూ చెప్పొద్దు, యిట్లావుండడమే మంచిది" అభ్యర్థనగా అని నేను వారిస్తున్నా వినకుండా నా బ్యాక్ ప్యాక్ తీసుకుని ముందుకు నడిచాడు.

***

# అంటు వ్యాధి

ఊహ

"**అమ్మాయ్** శైలూ... శైలూ" మా అత్తగారు కేకేసింది.

"అబ్బా! మళ్ళీ ఏమొచ్చిందో అరగంటకోసారి ఏదో వంకతో పిలుస్తూనే ఉంటుంది" అనుకుంటూ చేతిలో పని వదిలేసి వెళ్ళాను.

మనసులో విసుగు మొహంలో కనబడనివ్వకుండా "ఏంటత్తయ్యగారూ?" అన్నాను నవ్వుతూ.

"ఎవరితో యిందాక అబ్బాయి మాట్లాడుతున్నాడు?" అడిగింది ఆరాగా.

"వాళ్ళ బాబాయితో, అనుకుంటాను" అబద్ధం ఆడలేక ఉన్న ముక్క కక్కేశాను.

నేనూహించినట్టే ఆవిడ మొహం పాలిపోయింది. "వీడికసలు బుద్ధిలేదు. ఎవరితో పూసుకోవాలో ఎవరితో కూడదో తెలియనే తెలియదు" రుసరుసలాడింది.

ఆవిడ వాలకం చూసి, నా గుండెల్లో రాయిపడ్డట్టైంది. ఆవిడ మరిది, తోడికోడలు గురించి, వాళ్ళు చేసిన అన్యాయాల గురించి చెప్పటం మొదలు పెడుతుంది. పాతపురాణం అంతా తిరగతోడుతుంది. ఇప్పటికే వందసార్లు విన్న కథ నూటొకటోసారి వినాలేమో? "ఏదో పెద్దావిడ ఒంటరిమనిషి ఆవిడగోడు వినేవాళ్ళూ కావాలికదా! నిజంగానే జీవితంలో దెబ్బతిని ఉండొచ్చు" అన్న ఆలోచనతో ఓపిగ్గా ఆవిడ గోడు అంతా వింటుండేదాన్ని మొదట్లో.

కానీ, ఆవిడ కథ చివర్లో ముగింపుని నా వైపుకి తిప్పుతూ ఉంటుంది.

"ఆవిడ మరిది కన్నా మా మరిది ఎంత మంచివాడు. నేను ఎలా తెలివిగా మా పుట్టింటివాళ్ళను దూరం పెట్టాలి. పెద్దకోడలుగా ఆవిడ బోల్డన్ని కష్టాలుపడ్డా నన్నెంత బాగా చూసుకుంటారు మా యింట్లో" లాంటి ముగింపులు యిస్తుంది. అందుకే, ఆవిడ కథలు వినాలంటే నాకు భయం.

రాత్రికి టిఫెన్‌కి పెసరట్ల పిండి రుబ్బాలి. ప్రణవ్ స్కూల్‌కి వెళ్ళి ప్రిన్సిపాల్‌ని కలవాలి. కింద ఫ్లోర్ రమ్య వీలు కుదిరితే బజారుకి వెళదాం రమ్మంది. కుదరకపోతే కనీసం ఫోన్ చేసి రానని అన్నా చెప్పాలి" చెయ్యాల్సిన పనుల లిస్టు అంతా బుర్రలో గిర్రున తిరిగింది.

"శైలూ ఆఫీసుకి వెళుతున్నా" ఇంతలో రమేష్ పిలిచాడు.

"ఒరేయ్ రమేషూ! మీ బాబాయి ఏమంటున్నాడురా?" మా వార్ని కదిలించింది.

"ఆ! ఏమంటాడు? ఆ చెరుకూరి దగ్గర పొలం అమ్మకానికి పెడదామా?" అని అడుగుతున్నాడు.

"ఆహా!" మా అత్తగారు తలాడించింది.

"ఆయనకి అవసరం ఉంటేగానీ ఫోన్ చేయడు. తెలిసిన సంగతేగా. పొలం కొనేందుకు ఎవరైనా పార్టీలని చూడమని అడుగుతున్నాడు. మరీ మొహం మీదే కాదని చెప్పలేంగా అందుకే చూస్తానన్నాను"

అసలే భగ్గుమంటున్న ఆమె మనసు మీద ఓ అగ్గిపులని గీసిపారేశాడు రమేష్.

"ఏవండీ! సాయంత్రం ఎన్నింటికి యింటికి వస్తారు?" ప్రణవ్ గురించి మాట్లాడాలని ఆరాటంగా అడిగాను.

"ఎందుకు?" చిరాకు పడ్డాడు.

"ఎన్నింటికి వస్తానో నాకే తెలియదు. ఏదైనా వుంటే వాట్సప్ చెయ్యి" చెప్పి ధడాల్న తలుపేసుకుని వెళ్ళిపోయాడు.

వెంటనే, అలా వెనక్కి తిరిగానో లేదో మా అత్తగారు అందుకుంది.

"చూశావా అమ్మాయ్. ఎంత స్వార్ధపరులో. వాళ్ళకి అవసరం అయితే మనుషుల్ని అతికించుకుంటారు. లేదంటే, విసిరిపారేస్తారు" చెప్పుకుపోతూ ఉంది.

"అత్తయ్యగారూ నాకు కొంచెం పనివుంది. కాస్త హడావుడిగా ఉన్నాను. యివాళ, ప్రణవ్ స్కూల్‌కి కూడా వెళ్ళాలి" గబగబా చెప్పేసి ఆవిడ రియాక్షన్ కోసం చూడకుండా వెనక్కి తిరిగాను.

"మేం ఎన్ని అనుభవించామో ఎన్ని కష్టాలు పడ్డామో. ఈ కాలం పిల్లలకి వినాలన్నా తలనొప్పి" వెనకనుంచి మా అత్తగారు సణగడం నాకు వినిపిస్తూనే ఉంది.

అదేమీ పట్టించుకోకుండా గబగబా రెడీ అయ్యి స్కూలుకి వెళ్ళాను.

ప్రిన్సిపాల్ కూర్చోమని చెప్పి, ప్రణవ్ గురించి మాట్లాడింది. "ఈసారి ఎగ్జామ్స్‌లో చాలా తక్కువ మార్కులు వచ్చాయండీ. దాదాపుగా పాసింగ్ గ్రేడ్స్... అంతే. అదికూడా కొన్ని సబ్జెక్ట్స్‌లో టీచర్లే కొంచెం ఎక్కువ మార్క్స్ వేసి పాస్ చేశారు. కావాలంటే చూడండి" డ్రాలో నుంచి కొన్ని పేపర్స్ తీసి బల్లమీద పెట్టింది. మొక్కుబడిగా వాటిని తిరగేశాను.

"మా ప్రణవ్ తెలివైనవాడే ఎప్పుడూ మంచి మార్కులే వస్తాయి. ఈ సంవత్సరమే యిలా జరిగింది. వాడిలో బాగా మార్పు వచ్చింది. రెటమతంగా తయారవుతున్నాడు. చెప్పినమాట అస్సలు వినడంలేదు. బహుశా టీనేజ్ వల్ల అనుకుంటాను" నాకున్న పరిజ్ఞానంతో తోచింది చెప్పాను.

"కరెక్టేనండి" ప్రిన్సిపాల్ అంది.

"నైన్త్‌క్లాసు పిల్లల్లో మార్పు చాలావుంది. కొంతమంది మూడీగా ఉంటున్నారు. కొంతమంది అసహనంగా అల్లరిగా తయారయ్యారు. అలాగని, వాళ్ళని వదిలెయ్యకూడదు. ఎగ్జామ్స్‌లో మంచి గ్రేడ్స్ రావడం కూడా ముఖ్యమే.

మీరు మీ అబ్బాయి గురించి ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలి.. హార్మోన్లవల్ల చిరాగ్గా, దురుసుగా ఉంటారు పిల్లలు. మీరు కోప్పడకుండా, అరవకుండా నిదానంగా నచ్చచెబుతూ ఉండండి. మీకు కొన్ని బుక్స్ యిస్తాను. అవి తీసుకెళ్ళి చదవండి. హెల్ప్ అవుతాయి.

లేదంటే మన స్కూల్లోనే టీనేజ్ కిడ్స్‌కీ, పేరెంట్స్‌కీ కౌన్సిలింగ్ క్లాసెస్ కూడా ఉన్నాయి. అవసరమైతే అదీ చూద్దాం." అంటూ ఇంతలావు పుస్తకాలు రెండు తీసి బల్లమీద పెట్టింది. టీనేజ్ పిల్లలతో తల్లిదండ్రులు ఎలా మెలగాలి? అని ఫారిన్ రచయితలు రాసిన పుస్తకాలవి.

"ఆ లావు పుస్తకాలని ఎప్పటికి చదివి, ఎప్పటికి నేను వాటిని అర్ధం చేసుకుంటానో" అని నిట్టూర్చి, వాటిని తీసుకుని లేచాను.

మధ్యాహ్నం భోజనాలు అయ్యి, వంటిల్లు సర్దుకుని వచ్చేసరికి మా అత్తగారు నా కోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

ఇక వినక తప్పదని అర్థమైంది నాకు. తప్పనిసరై ఎదురుగా కూర్చున్నాను. ఈసారి టాపిక్కు మా అత్తగారి పిల్లలు, ఆవిడ తోడికోడలి పిల్లల మీదకి మళ్ళింది. ఓ అరగంట గడగడా మాట్లాడాక, ఆవిడ నిజంగానే ఓ పాతికేళ్ళు వెనక్కి వెళ్ళిపోయింది.

"మేము పిల్లల్ని సరిగ్గా పెంచలేదన్నాడు మీ చినమావగారు. మా పిల్లలకి పెద్దంతరం చిన్నంతరం తెలియదట. అంతమాట అంటాడా? నేనడిగాను ఆయన్ని 'నువ్వెలా పెంచావు మీ పిల్లల్ని అని' నిలబెట్టి కడిగిపారేశాను" అంది ఆవేశంతో ఊగిపోతూ.

ఆ మాటల్లో నిజం ఎంతుందో నా అంతరాత్మకి తెలిసినా అత్తగారి బి.పి పెరిగిపోతుందన్న భయంతో మాట్లాడకుండా కూర్చున్నాను.

ఇంతలో, ప్రణవ్ స్కూల్ నుంచి రావడంతో మా అత్తగారి ప్రసంగం ఆగిపోయింది.

వాడు వస్తూనే, బ్యాగ్ విసిరేసి టి.వి రిమోట్ తీసుకుని సోఫాలో కూలబడ్డాడు.

"రేయ్! ఏంరా? ఆ సోఫాలో వేలబడడం? వెళ్ళి మొహం కాళ్ళూ చేతులూ కడుక్కో ఆ బట్టలు మార్చు" అరిచింది మా అత్తగారు.

వాడు జవాబివ్వలేదు. ఆవిడ యింకోసారి అరిచింది. వాడు చురుగ్గా ఓ చూపు చూసి తలతిప్పేసుకున్నాడు.

"ఎంత పొగరు? నీకే చెప్పేది" ఆవిడ వదిలిపెట్టలేదు.

నాకు ఠక్కున ప్రిన్సిపాల్ చెప్పింది గుర్తొచ్చింది " నెమ్మదిగా ప్రేమతో" అని నేనేదో చెప్పబోయేలోపలే

"ఐ యామ్ టైర్డ్. కెన్ యూ ప్లీజ్ షటప్" అనేసి టి.వి ఛానెల్ మార్చేశాడు ప్రణవ్.

"అంతే ఆటంబాంబు నేరుగా వచ్చి నా నెత్తిమీదే పడిందని అర్ధమైంది నాకు.

నేను ప్రణవ్‌ని మందలించే గ్యాప్‌లోనే మా అత్తగారు అందుకుంది.

"ఎలా పెంచుతున్నావు పిల్లాడిని? పెద్దంతరం, చిన్నంతరం వుందా వాడికి? ఇదేనా నువ్వు నేర్పించేది?" అంటూ అరవడం మొదలుపెట్టింది.

అయిదు నిముషాల క్రితం, ఆవిడ, తన మరిది గురించి మాట్లాడిన మాటలన్నీ మర్చిపోయి నా మీద విరుచుకుపడిపోయింది.

ఆ మాటలు ఆవిడకి గుర్తుచేసినా ఉపయోగం ఉండదు. టీనేజ్‌లో వాడికి ఉండే ఫ్రస్టేషన్ మూడ్ స్వింగ్స్‌లాంటి వాటి గురించి వివరించే లాభంలేదు.

ఎందుకంటే ఆవిడకి కావల్సింది సమస్యకి పరిష్కారం కాదు. మనసులో వున్న చికాకునీ, అసహనాన్నీ వెళ్ళగక్కడం కావాలి. అది తెలిసి నేను మౌనంగా మ్యూట్‌లో తెలుగు సినిమా పాటకి డాన్సుని చూసినట్టు, ఆవిడ హావభావాల్ని చూస్తూ ఉండిపోయాను.

సాయంత్రం రమేష్ ఆఫీస్ నుంచి వచ్చాడు. లంచ్‌బ్యాగ్ బరువుగా ఉండటం చూసి "లంచ్ చెయ్యలేదా?" అడిగాను వెంటనే.

"ఇవాళ బైట ఒక మీటింగ్ ఉంది. భోజనం అక్కడే" చెప్పాడు పొడిగా.

"ఎండకి బాక్సులో అన్నం పాడైపోయి ఉంటుంది. ముందే చెప్పాల్సింది" అనవసరంగా పారేయాల్సొస్తుందని బాధపడుతూ అన్నాను.

"రమేష్‌కి కోపం వచ్చింది" నాకు లక్షపన్లు ఉంటాయ్. ఎన్నని గుర్తుపెట్టుకోను. ప్రతీది సాధింపే. నరకం ఎక్కడో లేదు" విసుక్కుని వెళ్ళిపోయాడు.

రాత్రి భోజనాల తర్వాత ప్రణవ్ గురించి మాట్లాడటానికి రమేష్ దగ్గరకి వెళ్ళాను.

అప్పటికే లాప్‌టాప్ ముందేసుకుని కూర్చుని ఉన్నాడు రమేష్. "ఏంటో త్వరగా, రెండుముక్కల్లో చెప్పు" అన్నాడు నా వాలకం కనిపెట్టి లాప్‌టాప్ లోనుంచి తల ఎత్తకుండానే.

"ఇవాళ మధ్యాహ్నం అత్తయ్యగారు ప్రణవ్ మీద కోప్పడ్డారు. వాడి బిహేవియర్..." నా మాటలు యింకా పూర్తికూడా కాలేదు.

"ఇంటి రాజకీయాలు నాకు చెప్పకు. నాకింకా ముఖ్యమైన పనులు బోల్డు ఉన్నాయి" నిర్లక్ష్యంగా జవాబు చెప్పి మళ్ళీ లాప్‌టాప్‌లో తలపెట్టాడు.

ఉస్సూరనుకుంటూ హాల్లోకి వచ్చాను. మా అత్తగారు ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతున్న మాటలు వినబడుతున్నాయి.

"ఆ...ఈ కాలంలో ఏం అంత యింటిపన్లు కోసం విరగబడాలిలే. మా కోడల్ని చూస్తున్నానుగా. మిక్సీలు, ఓవెన్లూ, వాషింగ్ మిషన్లూ అన్ని వచ్చేశాయి. మనలాగా నీళ్ళబిందెలు మోయాలా? ఏమన్నానా?" మా అత్తగారు నొక్కులు నొక్కుతూ వుంది.

నేను నా గదివైపుకి నాలుగడుగులు వేశాను. రమేష్ మాటలు వినిపిస్తున్నాయి.

"ఈ ఆడవాళ్ళ రాజకీయాల్లో పడ్డామంటే ఏ పనీ చేయలేం. వాళ్ళనసలు పట్టించుకోకూడదు."

నిజానికి రమేష్ ఆ మాటలు అనలేదు. కానీ అతని మనసులోనుంచి వినిపించాయి ఆ మాటలు నాకు.

గదిలోకి వెళ్ళి ప్రిన్సిపాల్ యిచ్చిన పుస్తకం చేతుల్లోకి తీసుకున్నాను. కూర్చుని చదువుతున్నానన్నమాటేగానీ ఆలోచనలు పరిపరి విధాలుగా పోతున్నాయి.

మనిషి ఫ్రస్టేషన్‌నీ, బాధనీ అవతలివాళ్ళ మీదకి బలవంతంగా రుద్దాలని ఎందుకు చూస్తాడు?

మా అత్తగారి గతం, రమేష్ ఆఫీసు వత్తిడి నా దాకా ఎందుకు వస్తాయి? వత్తిడిని తగ్గించుకునే ప్రయత్నాలుకానీ ఆత్మశక్తిని పెంచుకోవాలని కానీ ఎందుకు ప్రయత్నం చేయరు? ప్రతి చిన్నా, పెద్దా సమస్య అసహనంగా మారి ఒకరినుంచి ఒకరికి పాకుతూ ఉండాల్సిందేనా?

ఆలోచిస్తే ఇదొక భయంకరమైన అంటువ్యాధిలా తోచింది. అవును. కరోనాలాగా ఇదొక భయంకరమైన మహమ్మారి. దీనికి స్వీయనియంత్రణ తప్ప యింకో మందులేదు. ఇలా ఆలోచిస్తూ, ఆలోచిస్తూ ఎప్పటికో కన్ను అంటుకుంది.

తెలవారింది. ఎండాకాలం సూర్యుడు ఐదున్నరకే వెలుగుల్ని ప్రసరిస్తున్నాడు. పక్కన వేపచెట్టు మీద పక్షుల కిలకిలలు వినిపిస్తున్నాయి. లేచి కిటికీ దగ్గర నిలుచున్నాను.

విశాలమైన ఆకాశాన్ని చూస్తూ వుంటే ఏదో కొత్తశక్తి పుట్టుకొచ్చింది లోపల.

వీధిలో విసిరేసినట్టుగా అక్కడక్కడా తిరుగుతున్నారు. అప్పుడే మా యింటిముందుగా వెళ్తున్న ఓ పెద్దాయన మీద పడింది నా దృష్టి.

నాలుగడుగులు వేసి, ఉన్నట్టుండి "అబ్బా!" అని అరిచాడాయన. కాలికేదో తగిలినట్టుంది. అటే వెళ్తున్న పాలపాకెట్లు వేసే కుర్రాడు ఆయన్ని చూసి సైకిలు ఆపాడు.

"ఏంట్రా! నిలబడి సిన్మా చూస్తున్నావ్. పనేంలేదా నీకు?" అసహనంగా ఆ కుర్రాడ్ని అరిచాడాయన

నేనూహించినట్టు ఆ కుర్రాడు తిరిగి ఆయనమీద అరవలేదు. బాధపడ్డట్టూ మొహం పెట్టలేదు.

ఆయన మాటలకి పకాల్న నవ్వాడు.

"ఏం బాబాయ్ నువ్వు పుట్టడమే చిరాకుతో పుట్టినట్టున్నావే? కాలు బానే వుందా? ఏమన్నా సాయం కావాలేమో అని ఆగానంతే" అని చాలా మామూలుగా చెప్పి వెళ్ళిపోయాడు.

ఆ కుర్రాడిని చూసి నా మోహం మీద చిరునవ్వు మొలిచింది. "ఈ అంటురోగానికి యిమ్యూనిటీ వున్నవాళ్ళు కూడా ఉన్నారన్నమాట" అని నవ్వుకుంటూ నా ప్రపంచంలోకి వెనుతిరిగాను

## కోరికలు

విద్యార్థి

"గడప దాటి అడుగు ముందుకు పడదుగానీ, నాకలోకానికి ఎగబాకుతానందట, నీబోటి ముసిల్దే. యేడకొస్తావేటి? ఇదో ఈ దిగువ అహోబిల సామి ఉన్నాడు, నీబోటి ముసిలాళ్ల కోసమే. ఈడ దండమెట్టుకుని, ఈడనే కూసో, మేం ఎగువ అహోబిలానికి పోయొస్తాం", గట్టిగానే హెచ్చరించిది ఒక పల్లె పడుచు ముసల్లమ్మని.

"ఇదో బోటి, నాకోసం పెద్దన్న అటో కడితే, మీరందరు వెంటడొచ్చారు. తొమ్మండుగురు ఆటోలో ఇరుక్కుని రేతిరంతా పయాణంలో నన్ను నలిపి, ఇప్పుడు పైన సామి దగ్గరకు నన్ను రావొద్దంటావా, ఎంత ధైర్యం నీకు, నా సంగతి తెలీదేటి నీకు? ఎవరనుకుంటున్నావేటి నన్ను? నేను చెంచు బిడ్డను" గట్టిగానే బదులిచ్చింది ముసలమ్మ.

"నీ సంగతి తెలీకే, నిన్న గాక మొన్న జైలు నుండి వచ్చావు. నీతో మాకెందుకులే. సరే సూస్తా ఏడ దాకా ఎక్కుతావో? అయినా అంత పైకెక్కి మొక్కుకోటానికి, నీబోటి ముసిలికి కోరికలేటో" అన్నది ఒకతె.

"నాకు కోరికలేటే బోటి, నీకే మంచి మొగుడు రావాల, నీ కడుపు పండాల" అన్నది ముసలమ్మ. సిగ్గు మొలకలతో కొంచెం తల తిప్పుకుంది ఆ పూబోటి.

"ఈ బోటి సోద్యం ఎందుకు కానీ, పెద్దనా, నువ్వు గొయింద కొట్టు" అని కేక వేసింది ముసలవ్వ .

"మూడు గీతలోడా గోయిందా గోయిందా" అన్నాడు పెద్దన్న
"గోయిందా, గోయిందా" అని వల్లించారు ఆ ఆడవారందరూ.

"నిలూ గీతలోడా గోయిందా గోయిందా"
"గోయిందా గోయిందా"

"ఓబులేశా గోయిందా గోయిందా"



"గోయిందా గోయిందా"

చెట్ల కొమ్మల మీది పక్షులు అహోబిలేశునికి మేల్కొలుపులు పాడుతున్నాయి. గరుడాద్రి ప్రక్కనుండి సూర్యుడు హారతి వెలుగులతో ఆకాశానికి సింధూర తిలకం దిద్దుతున్నాడు. ఇటు వైపున స్వాతి నక్షత్రం వేదాద్రి పైన కొండెక్కుతున్నది. గరుడాద్రి వేదాద్రి పర్వత శ్రేణుల సంధిలో అహోబిల క్షేత్రం భక్తుల గోవింద నామావళితో మేల్కొంటున్నది.

ఎగువ అహోబిలానికి వెళ్లే మెట్ల దగ్గరగా ఎవరో గొప్పింటివారు, ఎగువ అహోబిలానికి వెళ్లే దారి ఇదేనా అని అడుతున్నారు. పైకి తలెత్తి చూసి, హమ్మో అనుకున్న వాళ్లు ఒకరు. దారిలో తినటానికి తాగటానికి ఏమీ తెచ్చుకోలేదు అనుకున్నవారు కొందరు. ఇప్పుడు పైకెక్కితే ముఖ్యమైన పనులకు తిరిగి వెళ్లటానికి ఆలస్యమవుతుంది, ఇప్పుడు కాదులే అనుకున్నవారు ఇంకొందరు. పైకి కారు వెళ్లేదారి ఎందుకు వెయ్యలేదని ప్రశ్నించేవారు మరి కొందరు. అదే ఫారిన్ కంట్రీస్‌లో అయితే ఈ పాటికి కేబుల్ కార్ వేసావాళ్లు, ఛ, చా అంటు వాపోయినవారు ఒకరు. చివరికి ఆ గొప్పింటివారందరూ కోరికలన్నీ దిగువ అహోబిలంలోనే చెప్పుకుని క్రిందే మొక్కుకుని వెళ్లదాము అని నిర్ణయించుకున్నారు.

## భర్గోటి నరసింహ స్వామి

పెద్దన్న వెంటబడి ఆ తొమ్మండుగురు ఆడవారు మాత్రం గట్టి గట్టిగా మాట్లాడుకుంటూ, ఊసులాడుతూ, ఒకరినొకరు పరిహాసాలాడుతూ సునాయాసంగా మెట్లు ఎక్కుతున్నారు. దట్టమైన నల్లమల అడవి ప్రాంతం. మెట్ల ప్రక్కనున్న చెట్ల మీద, కొండ ఎక్కేవారి దగ్గర ఉన్న తిను బండారాల కోసం కోతుల గుంపులు కాపు కాసివున్నాయి. ఆ కోతులని చూపిస్తూ ఒక పడుచు, "ఇదిగో ముసిలవ్వా, ఈడ కోతులే కాదు, ముందుగాళ్ల అడివిలో తోడేళ్లుంటాటాయి" అని భయపెట్టబోయింది.

"ఓసోసి, నాకు సెపుతావంటే బోటి, నా పసిగాపునాడే నే ఒంటిగా కట్టె పుల్లలేరుకోటానికి అడివికి పోయొచ్చేదాన్ని. ఓ పరి మేకల మీదకి తోడేలొస్తే, నే గొడ్డలి తిప్పి తరిమి తరిమి కొట్టినాను. ఆ తోడేళ్లె అల్లూ పోయాయి. ఏటనుకుంటున్నావో", ఆ బోటితో మెట్లు పోటీగా ఎక్కుతూ చెప్పింది ముసలవ్వ.

ఆ వేగంతోనే అహోబిలం నవనారసింహ క్షేత్రంలోని మొదటిదైన భర్గోటి నరసింహాలయం చేరుకున్నారు. స్వామి దర్శనం తరువాత అక్షయ తీర్థంలోనుంచి కొంచెం నీళ్లు త్రాగుతుంటే, ఆ గుంపులో నుంచి ఇంకొకామె "ముసిలవ్వా, ఈడదాకా ఎక్కావు కదా, సామి నీ కోరికలు తీరుస్తాడు. ఈడ మంచి నీళ్లు కూడా ఉండాయి. ఈడనే ఉండరాదు, మేం పైదాకా పోయొస్తాం" అన్నది.

"ఒసే బక్కదానా, నాకు కోరికలేటే, సామి నాకిచ్చేటియ్యన్నీ ఎప్పుడో ఇచ్చేశాడు. నీకే, కడుపు పండాల, పండంటి బిడ్డ పుట్టాల, ఓబులేశు అని పేరు పెట్టాల. నేను ఎగువ సామిని సూసేది సూసేదే. పెద్దన్నా, ఈ బక్కదాని సోదెందుకుగానీ, గోయింద కొట్టు".

"బొగ్గోటి నరసింహా గోయిందా గోయిందా"

"గోయిందా, గోయిందా"

పైకి వందల మెట్లో, వేల మెట్లో ఏటవాలుగా ఉన్నాయి. వడి వడిగా ఎక్కుతున్నారు పెద్దన్నతోబాటు ఆ ఆడవాళ్లందరూ. ఒక ప్రక్క కొండ చరియ, ఇంకొక ప్రక్క లోయలో ప్రవహిస్తున్న భవనాశిని నది. మధ్య నిట్ట నిలువుగా వున్న మెట్ల మీద ఈ శ్రామిక వర్గానికి చెందినవారు సునాయాసంగా పైకి ఎక్కుతున్నారు. ఇంతలో కర్రలు గట్టిగా తాటిస్తున్న చప్పుడుతో, తప్పుకోండి, తప్పుకోండి అంటూ కేకలు వినిపించాయి. అందరూ ఒక ప్రక్కకు జరిగితే, ఒకప్పుడు సుఖపడి, ఇప్పుడు డోలీలో ప్రాయాసపడుతున్న ఒక భారీ కాయం పెద్దావిడను వేరే మనుషులు ఎగువ అహోబిలం గుడికి మోసుకు వెళ్లుతున్నారు.

"మనుసులు మోసుకు పోతే సామి కోరికలు తీరుస్తాడేటి? సొర్గానికి కూడా డబ్బులు కట్టి, కూలీలెట్టుకుని మోసుకు పోతారా?" అంటూ వెటకరించింది ఆ ఆడవాళ్ల గుంపులో నుంచి ఒకతె.

"ఆ అమ్మ ఏ కష్టంలో ఉన్నప్పుడు సామికి మొక్కుకుందో? కష్టాలు తీరేటప్పటికి ఎక్కలేకపోతాంది. ఏ, ఎలాగైతేనేటి? సామిని సూడాలనుకుంది ఆ మనిషి, నీకేటి? మోసుకెళ్లే మనుషులేవన్నా ఊరకే మోసుకు పోతున్నారా? అసువంటి అమ్మలుంటేనే మోసుకెళ్లే వాళ్లకి కూలి గిడతది, ఆ పూటకు బువ్వస్తాది, కడుపు నిండుతుది." అన్నది ముసల్లవ్వ.

"కూలేటి? సుఖపడేది ఆళ్లు, కూలి సేసేది మనమా??

"కష్టపడే మనుసులకు రాత్రి బాగా నిద్రడతది. అంతకంటే సుఖమేటి? ఉన్న సుఖాలు మర్చిపోయి లేని సుఖాలకు అర్రులు చాచటమెందుకూ?" ప్రశ్నకు ప్రశ్నలతోనే జవాబిచ్చింది ముసలవ్వ.

"నీకూ డోలీ కట్టిస్తాంలే ముసలవ్వా. నీ కోరికలు కూడా ఎగువ సామి తీరుస్తాడులే" అంటూ వెటకారం చెయ్యబోయింది ఇంకొకతె.

"ఇదో యెర్రదానా, ఏటనుకుంటావో, నాకు ఈడు రాక మునుపే, వేసంగిలో, ఊరి సెరువు ఎండిపోతే, ఉరుకురుకున పోయి కొండకావల కోనేటిలో నుండి నీటి బిందె మీద నీటిబిందెలెట్టుకుని కొండలెక్కి తెస్తిని. నాకివ్వాల్సిన సత్తువ సామి ఎప్పుడో ఇచ్చేసాడు. ఇంక నాకు కోరికలేటి? నీ బిడ్డకే మనువు కుదరాలా, నీ నెత్తినే బోలెడు సారెత్తుకుపోవాలా, సాయానికి నన్ను రమ్మనాల", అన్నది ముసలవ్వ.

కొండ పైకి మెట్లు అలా సాగుతూనే ఉన్నాయి. కొండ దారిలో ఒక కానుగ చెట్టు క్రింద చల్లని నీడలో చిన్న మందిరం కనబడింది. లోపల స్వామికి దణ్ణం పెట్టుకుని బయటకు వచ్చారందరు.

గుడి ప్రక్కగా ఉన్న రాళ్ల గుట్టల మీద పడిన కానుగ కాయలు ఏరటం మొదలుపెట్టింది ముసలవ్వ.

"ఓయ్, ముసలవ్వ, ఏడ పడితే ఆడ ఎక్కుతుండావ్, ఆ రాళ్ల కింద పురుగూ పుట్రా కుడితే ఏటి సేస్తావ్, నీకు మందూ మాకెయ్యటానికి ఈడ ఏదీలేదు" అరిచింది ఒకతె.

"ఇదో సోగుదాన, నాకేటీ మందక్కర్లా, కానుగ గింజల అరగదీసీ రాస్తే తేలు కుట్టినా నొప్పి పోతది, కానుక్కాయలు కనబడితే ఏరతన్నా. నా సిన్నతనాన అడివిలో సింతాకు కొయ్యటానికి పోనప్పుడు తేలు కుడితే, ప్రక్కనే పడున్న కానుగ గింజల అరగదీసి రాసుకున్నా, అదే మందు" అన్నది ముసలవ్వ.



కారంజ (కానుగ) నరసింహ స్వామి

"ఏది సెప్పినా అన్నీ తెలిసినట్టు సెపుతావే"?

"ఇదో సోగుదాన, నేను చెంచును, ఈ అడివిలో పుట్టినాను, పెరిగినాను. అడివంతా తెలుసు. సామి మాకు అడివిలో అన్నీ ఇచ్చినాడు. తిండికిచ్చినాడు, మందుకీ ఇచ్చినాడు. కానుగ సెట్టు ఆకులతో దురద రోగం తగ్గుద్ది, కాయలతో పుండు తగ్గుద్ది, తేలు కుడితే విషం తగ్గుద్ది. కానుగు సెట్టుంటే రోగాలకి మందుంటాది, సామి ఉంటే మనసుకు మందుంటాది. తెల్సుకో. పెద్దన్నా, ఈ సోగుదానితో వాదెందుక్కానీ, గోయింద కొట్టు" అన్నది ముసలవ్వ.

"కానుగ సెట్టు నరసింహా, గోయిందా గోయింద"
"గోయిందా గోయింద"

మళ్లీ మెట్ల మార్గం చేరి పైకి ఎక్కటం మొదలు పెట్టారు అందరూ. తెల్లని పంచె కట్టు, ఆ పైన కుంభాకారపు ఉదర భారం, ఆ పైన

తిరునామంతో ఒక అయ్యవారు "మహోగ్ర భీకరాకారం .." అంటూ నరసింహ స్తోత్రం చెయ్యబోతూ, అయాసం ఎక్కువయ్యి, ఎగశ్వాసతో ఇబ్బంది పడుతూ నెమ్మదిగా ఎక్కుతున్నారు. వారి వెనుక, వారి ఆండాళ్లు పూజా సామాగ్రి సంచులు మోసుకుంటూ ఇంకా భారీగా ప్రాయాసపడుతూ ఎక్కుతున్నారు. వడివడిగా ఎక్కుతున్న ఈ శ్రామిక స్త్రీలు వారిని దాటుకుని పైకి ఎక్కబోతుండంగా, ముసలవ్వ ఆ ఆండాళ్లుతో, "మాయమ్మ, అంతేటి సంచులు సేతులతో మోస్తూ అంతేటి కాకు పడుతుండవ్, నే నెత్తి నెట్టుకొచ్చి పైన సామి దేవళం దగ్గర ఇస్తా, ఇటియమ్మా అన్నది". ఆ ఆండాళ్లు సంచులందించబోయి అయ్యవారి వంక సందేహంగా చూసింది. అయ్యవారు చిరునవ్వుతో, "మహాలక్ష్మినే చెంచులక్ష్మి అయ్యి, నరసింహ స్వామిని చేరుకుంది. ఫర్వాలేదు, ఈ చెంచు స్త్రీలు పూజా సామాగ్రి పట్టుకుంటే ఆచారానికి దోషమేమీ ఉండదు" అన్నారు. ఆ ఆడవాళ్లు ఆ సంచులు మోస్తూ పైకి ఎక్కుతుంటే ఆండాళ్లు కొంత తేలికపడింది.

"అయ్యోరు, సామి కథ సెపుతూ ఎక్కరాదే" అన్నది ముసలవ్వ. ఆ ఆండాళ్లు అయాసపడుతూ ఎక్కుతున్న అయ్యవారిని కొంటెగా చూస్తూ, "కూర్చుని రాత్రుళ్లంతా పురాణం చెప్పటం కాదు, కొండ ఎక్కుతూ ఇప్పుడు పురాణం చెప్పండి, చూద్దాం" అన్నది. అయ్యవారు ఎగశ్వాసతోనే, గట్టిగా నవ్వి పాడడం మొదలు పెట్టారు.

"వినరయ్య నరసింహ విజయం జనులాల
అనిశము సంపదలు నాయువు నొసగును
....."

అలా పాడుతూ ఎక్కుతున్నారు. ఇంతలో, రెండు పెద్ద, పెద్ద పర్వత శ్రేణుల మధ్య నున్న జలపాతం కనబడింది. అయ్యవారు "అదిగో భవనాశి నది" అంటూ, పెరిగిన ఉత్సాహంతో, హెచ్చిన ఎగశ్వాసతో ఎక్కటం మొదలుపెట్టారు.

"అయ్యోరూ, ఈ ఏటికి పేరు సెప్పారే, అర్థం సెప్పరూ", అడిగింది ముసలవ్వ.

"భవము అంటే పుట్టుక, ఈ పుట్టకలోని పాపాలను నశింప చేసి, స్వామి సాన్నిధ్యమునకు తీసుకు వెళ్లేది ఈ భవనాశినీ నది. నరసింహ స్వామి హిరణ్యకశిపుడిని సంహరించిన తరువాత, ఉగ్రనరసింహుడిని శాంతింప చేయటానికి ఆకాశ గంగయే జలపాతముగా దిగి వచ్చింది. అదిగో అటు గరుడాద్రి, ఇటు వేదాద్రి పర్వత శ్రేణుల సంధిలోనుండి పడుతున్నది. అదిగో ఆ పైన అహోబిలం ఉగ్ర నరసింహ స్వామి ఆలయం!", అన్నారు అయ్యవారు.

"అయ్యోరు, అసలు ఈ సంధి ఏటో, అసలు ఓబులేశు సామి కథేటి? అర్థమేటి?" అడిగింది ముసలవ్వ.

"భవనాశినిలో స్నానం చేసి కథ చెప్పుకుందాము" అన్నారు అయ్యవారు. ఆ ఆడవాళ్ల గుంపు పెద్దన్నతో కలసి హాయిగా ఆ జలపాతంలో నిలబడి స్నానం చేసారు. పైకి వస్తున్న కొందరు భక్తులు "అమ్మో!, నీళ్లు ఇంత చల్లగా ఉన్నాయేమిటి?" అనుకుంటూ, అరచేతితో తీర్థం పట్టినట్టు, పట్టి, మూడు సార్లు తలపై పోసుకుని ముందుకు సాగారు. అయ్యవారూ, ఆండాళ్లు చలి వణుకులతోనే మంత్రోచ్చారణ

చేసుకుంటూ స్నానం చేశారు. ఈ శ్రామిక వర్గానికి మాత్రం చలి తెలవలేదు. తలలు భవనాశిని జలపాతం క్రింద పెట్టి తన్మయత్వంతో తడిచారు. ఆడవాళ్లు చీరలు అడ్డంగా పట్టుకుని తడి బట్టలు తీసి పోడి బట్టలు మార్చుకుని మెట్లమీద కూర్చుంటే, అయ్యవారు పై మెట్టుమీద కూర్చుని పురాణం మొదలుపెట్టారు.

"ఒకసారి విష్ణువు లక్ష్మీ దేవితో ఏకాంతములో ఉండగా, సనక సనందులు అనే మహర్షులు స్వామిని చూడడానికి వచ్చారు. వారిని జయ విజయులు అనే ద్వారపాలకులు అడ్డగించారు. ఆ మహర్షులకి కోపం వచ్చి జయ విజయులని రాక్షసులుగా పుట్టమని శపించారు ...."

"సామి అమ్మోరుతో ఉంటే, కాపలా కాసేటోళ్లు ఆళ్ల పని ఆళ్లు సేసారు, తప్పేటి? ఎవుడడితే ఆడు నేను సన్నాసిని, నాకు అన్నీ తెలుసంటూ ఇంటోకి తోసుకుపోతుంటే కాపలా కాసేటోళ్లు అడ్డు పడొద్దా? మనం కాపలా పనికి కుదిరితే యెళ్లనిస్తామా?" అన్నది ఒకతె.

"పెద్దపెద్దోళ్ల దగ్గర కొలువు సేసేటప్పుడు భద్రముండాల, మెలుకువుండాల. వచ్చినోళ్లూ సదూకున్న సాములే గందా, ఆళ్లతో సరీగా మాటాడి కూకోపెట్టాలి, అంతేగానీ తరుముతారా?" అన్నది ఇంకొకతె.

వాదులాట పెరగబోయింది. "ఊకే గోల సేస్తరు, అయ్యోరు కథ సెప్తుంటే, యినుకోరాదే?" అంటూ ఖస్సు మన్నాడు పెద్దన్న.

"అయ్యోరూ, కాపలా కాసేటోళ్లు సేసిన పని వోపో కాదో అగుపడటలే, సరిగా సెప్పు" అన్నది ముసలవ్వ.



"సరైన ప్రశ్న. జీవితములో ఏది ఒప్పో, ఏది తప్పో తెలియని సంధి కాలములో, పగలనక రేయనక, లోపల పరిష్కరించాలా బయట పరిష్కరించాలా అంటూ తాత్సారం చేయక, సందేహించక, అవసరమైతే మనిషే మృగమై సన్మార్గానికి దారి చూపించే కథే నరసింహ స్వామి కథ. హిరణ్యము అంటే బంగారం. అక్ష అంటే ఇంద్రియము. మిలమిలలాడుతూ కనిపించే ప్రతి వస్తువునూ చూచినప్పుడల్లా, అవి కావాలి, ఇవి కావాలనే కోరికలతో అలజడి సృష్టించేవాడే హిరణ్యాక్షుడు. ఏ వస్తువునైనా చూచినా, తాకినా, వినినా, రుచి వాసనలతో ప్రబలే కోరికలని సంహరించటమే వరాహావతారము. అలాగే, కశిపు అంటే వస్త్రం. మిల మిలలాడే బంగారపు వస్త్రము వంటి అహాన్ని తొడుగుకున్నప్పుడు, కోరరాని కోర్కెలతో అహాన్ని పెంచుకుంటున్నప్పుడు, సర్వాంతర్యామి ఆ అహాన్ని సంహరించటమే నరసింహావతార కథ. ఈ అహం మనందరిలోనూ ఉంటుంది, బ్రహ్మమూ మనందరిలోనూ ఉంటుంది. మనలోని బ్రహ్మము అహాన్ని సంహరించటమే నరసింహోపాసన. అంటే, మనము కోరికలు తీర్చుకోవటం కోసం జీవకోటిని పెట్టే హింసకు సింహమై, కోరికలను అదుపులో పెట్టుకోవాలనమాట" అంటూ ఇంకా ఏదో చెప్పబోయారు అయ్యవారు.

"ఇసుమంత అగుపడ్డది, అసలు కథ సెప్పరాదే అయ్యోరు?" అన్నది మరొకతె.

అయ్యవారు, గట్టిగా ఉపిరి పీల్చుకుని, "అదిగో, ఆ కనబడుతున్నదే, నిట్ట నిలువుగా కొండ, అదే ఉగ్ర స్తంభం, ఆ పైన ఉక్కు స్తంభం ఉన్నది. విష్ణువు సర్వాంతర్యామి అని ప్రహ్లదుడి అన్నప్పుడు, హిరణ్యకశిపుడు ఆ ఉగ్ర స్తంభం పైన ఉన్న ఉక్కు స్తంభాన్ని చూపించి, "స్థంభే న దృశ్యతి" అంటే, ఎక్కడ? ఆ విష్ణువు స్తంభంలో కనబడటం లేదు అంటాడు. అప్పుడు ప్రహ్లాదుడు "స్తంభేన దృశ్యతి" అంటే నాకు స్తంభంలోనే కనపడుతున్నాడు అని అంటాడు. అప్పుడు ఉగ్ర నరసింహస్వామి, ఆ ఉక్కు స్తంభంలోనుంచి వచ్చి హిరణ్యకశిపుడుని, అదిగో, ఆ పైన ఉన్న బిలం, అంటే గుహ. ఆ బిలానికి లోపలా బయటా కాని గడప మీద కూర్చుని హిరణ్యకశిపుడుని సంహరించాడు. అప్పుడు, దేవతలు అశ్చర్యంతో "అహో బలం", అనగా, ఆశ్చర్యంతో అహో, స్వామికి ఎంత బలం అన్నారు. అందుకనే ఈ క్షేత్రం పేరు "అహో బలం" అయ్యింది. ఉగ్రనరసింహస్వామి ఆ



ఉగ్ర స్తంభం

బిలంలో ఉన్నాడు కావున, అహోబిలం అని అయ్యింది".

"సామి వచ్చిన ఆ ఉక్కు కంభానికి దండమెట్టుకుని వత్తా" అంటూ లేచింది ముసలవ్వ.

అయ్యవారు ఆశ్చర్యంగా ఆ కొండ వంకా, ముసలవ్వ వంకా చూసి, "ఉగ్ర స్తంభం పైన ఉన్న ఉక్కు స్తంభానికి నమస్కరించితే, కోరికలన్నీ తీరుతాయి అని అంటారు. కానీ, స్వామిని కోరేవాళ్లకి మాత్రమే పై దాకా వెళ్లే శక్తి ఉంటుందేమో!"

"అయ్యోరూ, నాకు ఈడు రాక మునుపే కొండల పైకి మేకల్ని తోల్కపోయేదాన్ని. కొండలకావల నా నల్ల మేక జంటిగా ఈనితే, రెండు మేక పిల్లలని మెడ మీదేస్కుని కొండలు దాటి వచ్చా. సామి నాకిచ్చేటి బలం ఎప్పుడో ఇచ్చినాడు. నాకు కోరికలేటి, అయ్యోరూ, నువ్వే సల్లగుండాల, అమ్మోరు సల్లగుండలా. మీ పిల్లగాండ్లు సల్లగుండి, ఈలానే అందరికీ సామి కథ సెప్పాల". అంటూ ఉగ్ర స్తంభం ఎక్కటానికి వెళ్లే దారికి అడ్డంగా ఉన్న ఒక బండరాయి పైకి ఎక్కటం మొదలుపెట్టింది

కౌముది

"జైలునుండీ ఇప్పుడే వచ్చినావు కూసోమంటే కూసోలా. సామిని సూడాలని గోలెట్టింది. ఈడదాకా వస్తే, ఇప్పుడు ఉగ్గ కంభం మీదకి యెగబాకుతానంటాది. ఆగు మేమూ వస్తాం" అంటూ బయలదేరారందరూ. జైలు మాట వినపడగానే ఆండాళ్లు జంకింది. అయినా, ఆ పైన ఉక్కు స్తంభం మీద పూజ చెయ్యటానికి ఒక చిన్న కుంకుమ పొట్లం, కొన్ని పూలు, గబ గబా సంచిలో నుంచి తీసి ఆ ముసలవ్వకి అందించింది ఆండాళ్లు .

ముసలవ్వ పైకెక్కుతూనే, "అయ్యోరూ, గోయింద కొట్టరాదే" అంటూ కేక వెసింది.

"గరుడాద్రి వాసా, గోవిందా గోవిందా"
"గోయిందా గోయిందా"

ఉగ్ర స్తంభం పైకి వెళ్లే దారి

"ప్రహ్లాద వరదా, గోవిందా గోవిందా"
"గోయిందా గోయిందా"

"లక్ష్మీనృసింహా, గోవిందా గోవిందా"
"గోయిందా గోయిందా"

ఉగ్ర స్తంభం పైకి వెళ్లే దారి. దారంటే దారి కాదు. ఏటవాలుగా ఉంది. ఒక దరి లోయ, మరొక దరి నిటారు కొండ చరియ. వాడిగా, పదునుగా కోసుకుపోయే రాళ్ల దారికి, అడ్డంగా నిలువెత్తు బండ రాళ్లు. ఊతం పట్టుకుని ఎక్కబోతే, కదిలి ఊడివచ్చే రాయ ఒకటి, కాలు కింద జారుడు రాయలు కొన్ని, కొండ చరియ నుండి పొడుచుకు వస్తున్న ములుకు రాళ్లు మరికొన్ని. కొన్ని చోట్ల అడుగు పడితే జారిపోయే సూది మొన కల్లు రాళ్ల గుట్టలు. అయినా వాదులాటలు మానకుండా, గోల గోలగా, హుషారుగా పెద్దన్న నాయకత్వంలో ఎక్కుతున్నారు అందరూ.

ఎదురుగా ఒక పట్నం కుర్రాళ్ల గుంపు జాగ్రత్తగా పైకి ఎక్కుతున్నారు. కుర్రాళ్లు అక్కడక్కడా ఆగి, బండ రాళ్ల మీద ఫోజులు పెడుతూ, సెల్ఫీలు కొట్టుకుంటన్నారు. వాళ్లని దాటుకుంటూ ఎక్కబోయింది ఈ ఆడవాళ్ల గుంపు. ఉన్నట్టుండి ముసలవ్వ గట్టిగా గావు కేక పెట్టి ఒక కుర్రవాడిని చెట్టు ప్రక్కకి గట్టిగా తోసి, తను కూడా ఒక బండ రాయి క్రింద నక్కి కూర్చుంది. కొండ చరియ పైనుండి రెండు బండ రాళ్లు ఒక క్షణం క్రితం వీళ్ళు నుంచున్న బండ రాయి మీద పడి ముక్కలై, క్రింద లోయలోకి దొల్లుకుంటూ పోయాయి.

ఆ కుర్రవాడు తేరుకోలేదు. క్రింద బండరాయి మీద పడ్డ నొప్పితో మెలికలు తిరుగుతున్నాడు. "కుర్రాడికి పిర్రలు పగిలిపోనాయి" అంటూ కిసుక్కుమన్నది ఒకతె. ద్రౌపది నవ్వితే సుయోధనుడికి వచ్చినంత కోపం వచ్చిందా కుర్రాడికి. అవమానానికి గాట్టిగా ఘర్జించి, తిట్లుతో కూడిన నాలుగు డైలాగులు చెప్పబోయి, క్రింద పడిన నొప్పితో నాలుగు కాళ్ల మీద లేస్తూ సన్నగా మ్యావ్ అంటూ మూల్గాడు.

"బిడ్డకి దెబ్బ తగిలితే, ఆసికాలా" అంటూ ఖసురుకుంది ముసలవ్వ. నెమ్మదిగా ఆ కుర్రాడిని లేప బోయింది. ఇంతలో మిగతా కుర్రవాళ్లు అక్కడికి వచ్చి, "దెబ్బ తగిలితే తగిలింది, నువ్వు వాడిని ప్రక్కకి తొయ్యకపోతే తల పగిలి, బతికేవాడు కాదు" అంటూ ముసలవ్వ చేతులు పట్టుకున్నారు. ఇంతలో ఒకడు, "మేము ట్రెక్కింగ్ అని ప్లాన్ చేసుకుని, మంచి బూట్లు కొనుక్కుని, ఎక్కటానికి సరంజామాతో వచ్చాం. మీరేమో చెప్పులు కూడా లేకుండా చీరలు ఎగగట్టుకుని ఎక్కుతున్నారు!" అంటూ ఆశ్చర్యపోయాడు.

ఉగ్ర స్తంభం కొప్పురం పైకి చేరుకున్నారు అందరూ. ఆ పది మంది మాత్రమే ఇరుక్కుంటే పట్టే కొండ కొన. హోరున చలి గాలి. ఉన్నట్టుండి, ఉవ్వెత్తున తెరలు తెరలుగా కొడుతున్న గాలి దెబ్బలు. పైకి వచ్చిన ఆ చిన్న దారి తప్పితే చుట్టూ, కను చూపు మేర పచ్చని చెట్లు కప్పివేసిన లోయలు. ఇంతలో ఒక గరుడ పక్షి వీళ్ల పైన ఐదడుగుల ఎత్తులో చక్కర్లు కొడుతో ఆశ్చర్యంగా చూసి వెళ్లింది.

క్రింద లోయలను చూపుతూ పెద్దన్న, "ఈడనే అన్నమాట, సామి ఇరణ్యకశిపుడితో కోట్లాడి, ఆడికి కాలు అడ్డుపెట్టి పడేసి, ఆడు పడిపోకుండా జుట్టట్టుకుంటే, కింద లోయలోకి తోస్తాడని అల్లూపోయాడు" అన్నాడు.

"ఉక్కు కంభం ఏది?" అన్నది ముసలవ్వ.

"ఇదో, ఈ పరి దిగూకి సున్నంతో గీత పెట్టారు. ఈ బండ రాళ్ల మీద నుండి దిగాలేమో" అంటూ చూపింది ఒకతె.

"ఇదో ముసిల్లవ్వా, ఈడ దాక ఎక్కినావ్, ఇక సాల్లే, ఇంకేడకి దిగుతావు." అన్నది ఇంకొకతె.

"ఇదో, పొట్టిదానా, నే మనువాడిన తరువాత, నా మగడు తాడు నా నడుము కట్టి పట్టుకుంటే, యేలాడుతూ కొండ దరికి పట్టిన తేన తుట్టుకు దిగి, తేనె తుట్టు ముక్కలు బుట్టలో యేసుకిని పైకి తెచ్చేదాన్ని. ఈడనూ దిగగలను, సామి నాకు ధైర్యం ఇచ్చినాడు, నాకేటి భయం" అన్నది ముసల్లవ్వ. ఒక్కరు మాత్రమే పట్టే ఆ దారిలో బండ రాళ్ల మీద నుండి జారుకుంటూ, హోరు గాలి తోపుళ్లకు రాళ్లని కరుచుకుంటూ సాగింది ముసలవ్వ. పెద్దన్న వెనక తోడువస్తే ఉక్కు స్తంభం చేరుకుంది. కాలు ఒక నూలు పోగు వాసి జారినా పాతాళాన్ని తలపించే లోయలోకి పడటం ఖాయం. అయినాసరే ఉక్కు స్తంభం చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణ చేసింది. క్రింద ఆండాళ్లు ఇచ్చిన కుంకుమ పొట్లం, పూలూ, కొంగు ముడిలోనుండి తీసి ఉక్కు స్తంభానికి పూజ చేసింది.

"జైలు నుండీ రాటం రాటం ఓబులేసు సామిని సూడాలని గోల గోల సేసినావ్. ఈడ దాక ఎక్కినావు. ఇంకేటన్నా కోరికలున్నాయా" అన్నాడు పెద్దన్న.

"పెద్దన్నా, సామి నన్ను ఈడ దాకా తీసుకొచ్చినాడు. నే తొలీగా కడుపుతా ఉన్నప్పుడు, నా మొగుడు నా కోసం పుట్ట తేనె అట్టుకుని వచ్చేప్పుడు, ఇనపరాయి కోసం రెడ్డి మనుసులు సుంకాలమ్మ గుడి ఇరగ్గొడుతాంటే అడ్డుపడ్డాడు. ఆ కొట్లాటలో ఆడు గొడ్డలితో ఫాక్షనోళని ఇద్దరిని నరికితే, ఆళ్లు నా మొగుడిని కొట్టేసారు. నా బిడ్డడిని ఒక్కదాన్నే సాకా. ఫాక్షనోళ్లు నా మీద కచ్చ కట్టి గుడిస తగలెట్టారు,

ఎన్నో తగాదాలు సేసారు. అయినా ఏడో తరగతి దాకా నా కొడుక్కి సదూ సెప్పించితే, ఆడు మిలట్రీలో జేరాడు. నా బతుక్కి సత్తువ సామి ఎప్పుడో ఇచ్చేశాడు. ఇంక నాకేటీ వద్దు. నీకే మంచి కోడలు రావాలా, నీకు కడుపునిండా మూడు పొద్దులా బువ్వ పెట్టాల. గోయింద కొట్టు" అన్నది సాకా. ఫాక్షనోళ్లు నా మీద కచ్చ కట్టి గుడిస తగలెట్టారు, ఎన్నో తగాదాలు సేసారు. అయినా ఏడో తరగతి దాకా నా కొడుక్కి సదూ సెప్పించితే, ఆడు మిలట్రీలో జేరాడు. నా బతుక్కి సత్తువ సామి ఎప్పుడో ఇచ్చేశాడు. ఇంక నాకేటీ వద్దు. నీకే మంచి కోడలు రావాలా, నీకు కడుపునిండా మూడు పొద్దులా బువ్వ పెట్టాల. గోయింద కొట్టు" అన్నది.

"వీర నరసింహా గోయిందా గోయిందా"
"గోయిందా గోయింద"

ముసలవ్వ కాసేపు అక్కడే ఉక్కు స్తంభాన్ని అంటి పెట్టుకుని కూర్చుంది. తనలో తనే ఏదో మాట్లాడుకుంది. కంటి తడిని కొంగుతో తుడుచుకుంది. నెమ్మదిగా కొండ కొన పైకి చేరుకుని మిగతా ఆడవాళ్లతో కలసి, ఉగ్ర స్తంభం దిగటం మొదలుపెట్టారు.

అందరూ మళ్లీ వాదులాడుకుంటూ గోల గోలగా భవనాశి జలపాతం దగ్గరకు చేరుకున్నారు. మళ్లీ అటు వైపు పైకి మెట్లు ఎక్కి ఎగువ అహోబిలం గుహాలయం చేరుకున్నారు. ఎవరో రాజకీయ నాయకుడు, ఎలచ్చన్లయినాయి, ఇంకా పెద్ద పదవి కోరుకోవటానికి డోలీ ఎక్కి వచ్చాడట. వాళ్ల మందీ మార్బలంతో హడావుడిగా ఉన్నది. వాళ్లని దాటుకుని గుహాలయంలోకి వెళ్లారు. ముసలవ్వ వడి వడిగా ముందుకు సాగింది. గుహ గడప దగ్గర రాజకీయ నాయకుడి సెక్యూరిటీ వాళ్లు ఇద్దరు ముసలవ్వను భుజం పట్టుకు తోస్తే, క్రింద పడింది, "ఏయ్, ముసిల్దానా, యేడకి తోసుకుపోతావ్? లోపల మంత్రిగారు అభిషేకం చేయించుతున్నారు, ఈ గడపకి ఇవతలే దండం పెట్టుకు ఫో, కోరికలేమన్నా ఉంటే ఇక్కడే చెప్పుకో, ఫో, ఇంకో ఆడుగేసావో కేసు పెట్టి జైలులో తోస్తా" అంటూ అరిచాడు ఒకడు.

ముసలవ్వ ఉవ్వెత్తున లేచింది. కళ్లతో రక్తం చిమ్మింది. "ఎవుడురా నే సామి కాడికొస్తే అడ్డు సెప్పేది? ఏటి జైలా? నా కొడుకు మిలట్రీ, ఆడు దేశానికి కాపలాకు పోతే, నిండుమనిషి నా కోడలుతో ఉంటిని. సుంకాలమ్మ గుడి కూల్చినప్పుడు నా మొగుడును కొట్టేసిన రెడ్డి కచ్చతో, బిడ్డ పుట్టగూడదని, నా కోడల్ని భంగపర్చటానికి ఆడి కొడుకునూ, ఫాక్షన్ రౌడీలని పంపినప్పుడు, ఫాక్షనోడి కొడుకుని గడప మీదే పుల్లల కొట్టే గొడ్డలితో కొట్టేసి, నా కోడల్నీ, బిడ్డనీ కాపాడా. పద్దానుగేళ్లు జైలులో ఉండి రాటం రాటమే సామి దగ్గరికి వస్తిని. ఎవుడురా నాకు అడ్డమొచ్చేది? నాకు జైలంటే భయమేటి? సామి ఇరణ్యకశిపుడిని ఈ గడప మీద వట్టి సేతులతో సంపినాడు, అడ్డమొస్తే నిన్ను కూడా ఈ గడప మీదే సంపుతా. ఫాక్షోడి రగతంతో తడిసిన సేతులియ్యి, సూస్తావరా ఈటి దెబ్బ? నాకు కోరికలేటి, సామి కడుపుతూండ నా కోడల్ని కాపాడే ఉద్రేకం నాకెప్పుడో ఇచ్చేసినాడు" అంటూ పూనకం పట్టినట్టు ఊగిపోతూ, ఒక సెక్యూరిటీ వాడిని గట్టిగా తోసింది.



ఈ అల్లరికి, అరుపులకీ, లోపల పూజ చేస్తున్న అర్చకుడు వచ్చాడు. "అయ్యా, ఈమె చెంచు స్త్రీ. చెంచులక్ష్మి అమ్మవారు వీరి ఆడపడుచు. వీరికి అహోబిలం ఆలయ ప్రవేశం ఎప్పుడూ ఉంటుంది. వారిని కాదంటే అందరికీ అనర్ధం" అని సర్ది చెప్పి లోపలికి తీసుకు వెళ్లాడు.

ఆలయం లోపల నుండి మంత్రి గారు పళ్లు బిగబట్టి గమనిస్తున్నాడు. ముసలవ్వ పూనకంతో ఊగిపోతూ స్వామి విగ్రహం ముందు కెళ్లి, "పెద్దన్నా, గోయింద కొట్టు" అని అరిచింది.

"పదును గోళ్ల వాడా, గోయిందా గోయింద"
"గోయిందా గోయిందా"

"కోర దవడలోడా. గోయిందా గోయింద"
"గోయిందా గోయింద"

"ఉగ్గ నరసింహా, గోయిందా గోయింద"
"గోయిందా గోయింద"

**ఉగ్ర నరసింహ స్వామి**

అర్చకులవారు హారతి కర్పూరం వెలుగులో ముసలవ్వ రౌద్రం, స్వామి రౌద్రం రెండూ కనబడ్డాయి.

ఆలయం బయటకి వచ్చినా ముసలవ్వ పూనకంతో ఊగిపోతున్నది.

"ఇరణ్యకశిపుడి పేగులు తీసి సంపిన తరవాత సామి ఊగి పోయినట్టు ఊగుతావేటి? సామి కోపం తగ్గించటానికి లచ్చిమీ దేవి చెంచులచ్చిమిగా వచ్చింది. నీకెవడొస్తాడూ? సాలు, సాలులే తగ్గు, అదో చెంచులచిమి, మన కుల దేవత దేవళం" అన్నది ఒకతె. అందరూ చెంచులక్ష్మి గుడిలో తమ ఆడపడుచుని చూసుకుని ఇంకో కొండదారి పట్టారు.

భవనాశిని తుంపరలలో తడుస్తూ, నది ప్రక్కనున్న ఇరుకు దారిలో నుండి క్రోధ నరసింహస్వామి గుహాలయం చేరుకుని, దర్శనం చేసుకుని కొండ దిగుతున్నారు అందరూ. ముసలవ్వకి పూనకం ఇంకా తగ్గలేదు. "ఇంకా ఊగుతావేటి? ముసిల్దానివి ఇంకా ఇంత కోపం ఏటి?" అన్నది ఒకతె.



క్రోధ (వరాహ) నరసింహ స్వామి

"సామి సెప్పింది, కోపం రావాల్సినప్పుడు కోపం తెచ్చుకోవాలే యెర్రిదానా, పెద్దన్నా గోయింద కొట్టు" అని కేక వేసింది ముసలవ్వ.

"క్రోధ నరసింహా గోయిందా గోయింద"
"గోయిందా గోయింద"

"వరాహ నరసింహా గోయిందా గోయింద"
"గోయిందా గోయింద"

"ఓబులేశా గోయిందా గోయిందా"
"గోయిందా గోయింద"

కొండ అంచుని ఆనుకుని ఒకరి వెనక ఒకరు మాత్రమే నడిచే బండరాళ్ల దారి పట్టారు. ఒక వైపు నిట్ట నిలువు కొండ. రెండవ వైపు అగాధం. చీమల బారులు లాగా సాగుతున్నారు. కొండ చరియ మీద నుండి ఒక జలపాతం ఈ రాళ్లదారి మీద పడుతున్నది. "హమ్మో! దాటుకుని వెళ్లాలంటే కాళ్లు జారి క్రింద పడతాం, ఎనక్కి పోదాం" అన్నది ఒకతె. "ఓసోస్, ఈ మాత్రం దాటలేమా? అందరూ ఒకరి సేతులు ఒకరు పట్టుకుంటే అందరికీ ఊతం ఉంటది" అంటూ దాటించారు, ముసలవ్వ పెద్దన్నా కలసి. మరి కొంత దూరం నడిచేటప్పటికి గరుడాద్రి వేదాద్రి పర్వత శ్రేణులుగా చీలే మధ్యలో, ఒక సువిశాలమైన రాతి పలకను చేరుకున్నారు. ఆ పలక రాతి మీద లక్షలకొలది గుండ్రటి అక్షరాలు, దిద్దుతున్నట్లుగా చెక్కబడి ఉన్నాయి. పైనుంచి ఒక జలపాతం, నీరు ఒక మడుగులోకి చేరి ఎర్రబడుతోంది. ఆ వెనుక జ్వాలా నరసింహ గుహాలయం.



"ఇదే పెహ్లాదుడి బడి. సెండామార్కులు బండరాతి మీద అచ్చరాలు దిద్దించినాడు. ఈ రెండు కొండల మజ్జిగ ఉండేది ఇరణ్యకశిపుడి మిద్దె. ఇదో మిద్దెకి గడప, సామి ఇరణ్యకశిపుడిని ఉగ్గ కంభం మీద కొట్టేసినాక, ఈడకి ఈడుసుకొచ్చాడు. సామి వేడి వేడి ఊపిర్లతో బుసకొడుతూ ఊగాడు. కళ్లలోనుండి నిప్పులు పడ్డాయి. అందుకే జోలా నరసింహ సామి. దవడలు గిట గిట ఊగినాయి, పెదాలు పెట పెట లాడాయి, పళ్లు పట పటలాడాయి. ఎగువ బొట్టి కాడ సామి ఇరణ్యకశిపుడి పేగులు పీకి సంపేసినాక, ఈడ కొచ్చి రగతం సేతులు ఈ మడుగులోనే కడుక్కున్నాడు. ఇరణ్యకశిపుడి రగతంతో తడిసిన నీళ్లు గందా, అందుకే ఈ మడుగులో నీళ్లు యెర్రగుంటాయి" అంటూ ఎర్రమడుగుని చూపించాడు పెద్దన్న.



**చండామార్కులవారు ప్రహ్లాదుడితో చెక్కించిన అక్షరాలు**

అందరూ జ్వాలా నరసింహ స్వామి

**ప్రహ్లాదుడి బడి అని చెప్పబడే పెద్ద బండరాతి పలక**

గుహాలయంలో దండం పెట్టుకుని బయట పడ్డారు. ప్రహ్లాదుడు అక్షారులు దిద్దిన పలక మీద నుండి వస్తున్నారు. ఉన్నట్లుండి ఒకతె, తమతో వచ్చిన ఇంకొకతెతో "ఇదో బీబీ, మా సామి దుండగీడుని ఎట్టా సంపినాడో సూసినావా" అన్నది ఇంకొకతె.

"నా సామి, నీ సామీ ఏటీ? అన్ని సాములొకటే" అన్నది బీబి.

"బాగా సెప్పినావు. బీబీ, నీ బిడ్డ సల్లగుండాలా, పెహ్లాదుడికి మల్లే బాగా సదూకోవాల. ఈ పరి నువ్వు గోయింద కొట్టరాదే" అన్నది.

"జోలా నరసింగ్ బాబా కీ జై" అన్నది బీబి
"జోలా నరసింహా గోయిందా గోయిందా" అన్నారు అందరూ.

ఎర్రగుంటలోని నీళ్లు కొంచెం తలపైకి జల్లుకుని ముందుకు సాగుతూ దగ్గరలోని ఒక ప్రశాంతత వనంలోకి ప్రవేశించారు. కొండ గోగులు విరగ పూచి వున్నాయి. ఎదురుగా ఇంకొక దేవాలయం కనిపించింది. ముసలవ్వ కొంగులోకి కొండగోగు పూలు కొయ్యటం మొదలుపెట్టింది. "ముసలవ్వా, నీకు పూల మీద మనసడ్డాది, నీకు కొత్త కోరికలేటున్నాయి?" అంటూ పరాచికమాడబోయింది ఒకతె.



"ఒసే, బుగ్గీ, ఈ పూలు సామికే, రోజూ మొగుడితో కొట్టాడుతుంటావ్, నివ్వే తల నిండా పూలెట్టుకు పోరాదే నీ మొగుడు దగ్గరకి, అప్పుడు ఆడు నిన్ను అక్కున తీసుకుంటాడు, అపుడుగానీ నీ కడుపు పండుతాది, అప్పుడు మేమందరూ నీకు సీమంతం సెయ్యాల. అదేనే నే కోరేది" అన్నది ముసలవ్వ. బుగ్గి బుగ్గలు ఎఱ్ఱబడ్డాయి.

దేవళంలో ప్రవేశించారు. "ఈడ సామి కథేటి అయ్యోరు" అంటూ గుడిలోని అర్చకదుని ముసలవ్వ అడిగింది.



మాలోల నరసింహ స్వామి

నరసింహ స్వామి హిరణ్యకశిపుడిని సంహరించిన తరువాత, లక్ష్మీ దేవి చెంచులక్ష్మి రూపంలో

జ్వాలా నరసింహ స్వామి

వచ్చి ఆయనను శాంత పరిచింది. అప్పుడు స్వామి ప్రేమతో చెంచులక్ష్మీ దేవిని తన వళ్లో కూర్చోపెట్టుకుంటాడు. "మా" అంటే లక్ష్మీ దేవి, "లోల" అంటే అమితమైన ప్రేమ. అందుకే ఇక్కడ స్వామిని "మాలోల లక్ష్మీ నరసింహ స్వామి" అంటారు", అన్నాడు అర్చకుడు.

ముసలవ్వ తను కోసుకొచ్చిన కొండగోగు పూలతో చెంచులక్ష్మి నీ, స్వామినీ అలంకరించింది. "అయ్యోరూ, అంత పెద్ద పేరు, నువ్వయితే సరీగా సెపుతావ్, గోయింద కొట్టు" అన్నది.

"ఈ రోజు స్వాతి నక్షత్రం శుభ దినం. స్వాతి నాడు అమ్మవారికీ, స్వామికీ పూజ చేశారు, మీ అందరికీ శుభం", అన్నారు

అర్చకులు.

"మాలోల నరసింహా గోవిందా గోవింద"

"గోయిందా గోయిందా"

ఇంకొక కొండదారి పట్టుకున్నారు అందరూ. సూర్యుడు నడి నెత్తిమీద ఉన్నా, దట్టమైన అడవిలో చెట్ల క్రింద నడుస్తున్న వాళ్లను ఇబ్బంది పెట్టలేకపోతున్నాడేమో, అందరూ గోల గోలగా మాట్లాడుకుంటూ, వాదులాడుకుంటూ, నవ్వుకుంటూ, కొండల మధ్య నుండి ఆదిశేషుడి తోకలాగా మెలికలు తిరుగుతూ, వడి వడిగా ప్రవహిస్తున్న పావని నదిని అంటుకుని ఉన్న దారి మీద ముందుకు సాగుతున్నారు. ఉన్నట్లుండి దగ్గరగా కొమ్ము బూరలు, డప్పుల చప్పుడు వినబడ్డాయి. ప్రక్కన ఉన్న చెంచు గూడెంలోని వాళ్లందరూ, చెంచు భాషలో పాటలు పాడుకుంటూ, తలలమీద గంపలలోనూ, కుండలలోనూ ముడుపులు పెట్టుకుని చిందులువేసుకుంటూ వచ్చి వీళ్ల దారిలో కలిసారు. ఈ ఆడవాళ్లు కూడా చెంచుల భాషాలోని పాటలకు గొంతు కలిపి చిందులు వేస్తూ సాగుతూ ఇంకొక గుహాలయానికి చేరుకున్నారు. ఆ గుహాలయం ముందు చెంచుల సంబారాలు జరుగుతున్నాయి. చెంచులు కొమ్ము బూరలూదుతూ, డప్పులు కొడుతుంటే, చెంచితలు పాటలు పాడుతూ చిందులు వేస్తున్నారు. అర్ధచంద్రాకారం వరుసలో నిలబడి ఆడవారు అందరూ ఒకరి భుజాల మీద ఇంకొకరు చేతులు వేసుకుని నిలబడి, వేడుకగా, చాలా పాటాలు పాడారు, చిందులు వేశారు.

ఇంతలో కొండ గాలి తిరిగింది. చెట్లన్నీ జోరుగా తలలు ఊపాయి. ప్రక్కనే ఉన్న వెదురు పొదలోనుండి గాలి ఆనంద భైరవి రాగం పలికింది. అర్ధచంద్రాకారములో నిలబడి చిందులు వేస్తున్న ఆడవాళ్లకి ఎదురుగా ఎక్కడి నుండో ఒక నెమలి వచ్చి వాలి, పురి విప్పి ఆడటం మొదలు పెట్టింది. వడి వడిగా నల్లని మబ్బులు కమ్ముకొన్నాయి.

ఉన్నట్లుండి ముసలవ్వ "మా ఇంటి పడుచు, చెంచు లచ్చమ్మా" అంటూ రాగం తీసింది. చెంచులందరికీ తెలిసిన పాటేమో, వాళ్లు వెంటనే "మా ఇంటి పడుచు, చెంచు లచ్చమ్మా" అంటూ వంత పాడుతూ, చిందేస్తుంటే, వాళ్ల అందెలు తాళం వేసాయి. మేఘాలు ఆది తాళంలో మృదంగనాదముతో, హర్షణ ఘర్జనలతో ప్రతిధ్వనించాయి. స్వాతి వాన జల్లు పడటం మొదలయ్యింది. ముసలవ్వ పాట కొనసాగించింది.



మా ఇంటి పడుచు, చెంచు లచ్చమ్మా
తేనెటీగ సామిని కోరిక కోరినానని సెప్పమంది
మా ఇంటి పడుచు, చెంచు లచ్చమ్మా

సామికి పుట్ట తేనె తీసేటేళ
కొమ్మ కొమ్మకూ పూలు కావాల పూల గుత్తులూ కావాలని
తేనెటీగ ఝుమ్మంటూ సెవిలోన సేరి కోరినాది

మా ఇంటి పడుచు, చెంచు లచ్చమ్మా
సెట్టుకున్న పువ్వు సామిని కోరిక కోరినానని సెప్పమంది
మా ఇంటి పడుచు, చెంచు లచ్చమ్మా

## పావన (పాములేటి) నరసింహ

సామికి కొమ్మ మీది పూలు కోసేటేళ
సెట్టుకి సల్లని గాలి, సల్లని నీరు కావాలని
సెట్టుకున్న పువ్వు నా బుగ్గలకు గిలిగింత పెట్టి కోరినాది

మా ఇంటి పడుచు, చెంచు లచ్చమ్మ
పాములేటి నీరు సామిని కోరిక కోరినానని సెప్పమంది
మా ఇంటి పడుచు, చెంచు లచ్చమ్మ

సామికి పాములేటిలో జలకము తెచ్చేటేళ
కొండ కోన మీద జడివాన కురువాల రంగుల విల్లు గుడి కట్టాలని
పాములేటి నీరు నా సేతులను తడిమి తడిమి కోరినాది

మా ఇంటి పడుచు, చెంచు లచ్చమ్మ
పాములేటి నీరు సామిని కోరిక కోరినానని సెప్పమంది
మా ఇంటి పడుచు, చెంచు లచ్చమ్మ

సామికి తేనే పూలూ నీరు తేవాలంటే
చెంచులను సామి కాయాలని, చెంచితల కడుపు పండాలని
ఓబులేశునకు సేతులెత్తి దండమెట్టి కోరినామని

మా ఇంటి పడుచు, చెంచు లచ్చమ్మ
చెంచు కులముద్దరించాలని  సామిని కోరినామని సెప్పమ్మ

మా ఇంటి పడుచు, చెంచు లచ్చమ్మ

ఇంకా ఎన్నో పాటలు పాడారు చిందులు వేసారు. ఆట పాటలు ముగిసే సమయానికి వాన వెలసి, గరుడాద్రి, వేదాద్రి కొండకోనల మీద హరివిల్లు గుడి కట్టింది.

గుహ ముందు నుంచుని "అల్లుడోరికి ముడుపులు తెచ్చినాం, మా ఆడబొట్టికి సారెలు తెచ్చినాం" అంటూ కేక వేస్తూ గుహాలయంలోకి ప్రవేశించబోయారు. నుదుట పెద్ద బొట్టుతో, కాషాయం లాల్చీ వేసుకుని, జుట్టు విరబోసుకుని, అర్భాటంగా గడ్డం సవరదీసుకుంటున్న పెద్ద మనిషి ఒకరు, “హదేవిటి, హెవరు పడితే వాళ్లు లోపలికి వెళ్లకూడదు, అపచారం" అంటూ ఇంకా ఏదో అనబోయాడు.

అప్పటిదాకా చిందులు వేసిన ముసలవ్వ, నుదుటి మీద చెమటని తుడుచుకుంటూ, "ఇదో పెద్దాయనా, నరసింహసామి ఇరణ్యకశిపుడిని ఇరిసినాక, తీవరంగా తుక తుక లాడుతుంటే దేవతలడిలిపోనారు. అప్పుడు మా ఆడుబిడ్డ చెంచులచిమి సామికి కోపం తగ్గించి ఈ బొఱ్ఱెలోనే కొలువైనాది. మా బిడ్డకి మా అల్లుడికి సాతి నాడు ముడుపులెట్టటం మా ఆచారం. ఇదో పెద్దాయనా, నువు తగ్గు తగ్గు. చెంచుదొరా ఈ మనిసి సంగతి నే సూసుకుంటా గాని, నువు లోనికి పోయి ముడుపులు సెల్లించు" అంటూ ఆ పెద్ద మనిషిని కళ్లతో గుచ్చుతూ నిలబడింది.

చెంచుల ఆచారం ప్రకారం పూజలు అయిన తరువాత అందరూ కలసి వేడుకగా సంబరాలు జరుపుకుంటూ అన్నీ పంచుకుని తిన్నారు.

చెంచుల సంబరాలు ముగించుకుని వెళ్లబోతున్నారు. ముసల్లవ్వ చెంచు దొరతో, "గోయింద కొట్టరాదే" అన్నది.

"పాములేటి నరసింహా గోయిందా గోయిందా"
"గోయిందా గోయిందా"

సూర్యుడు వేదాద్రి కొండల చాటుకు చేరుకునే వేళకి ఈ తొమ్మండుగురు ఆడవాళ్లు పెద్దన్నతో కలసి కొండ దిగటం మొదలుపెట్టారు. పావన నరసింహుడి సంబరాలు ముగిసినా ఈ శ్రామికుల సందడి మాత్రం తగ్గలేదు. అదే ఉత్సాహంతో ఊసులాడుకుంటూ త్వర త్వరగా దిగుతున్నారు.

కొండ దిగువలో యోగముద్రలో ఉన్న నరసింహుడి విగ్రహంతో కూడిన తోరణం కనబడింది. దాటుకుని వెళితే, ఇంకొక గుహాలయం. యోగముద్రలో ఉన్న నరసింహ స్వామి ప్రహ్లాదుడికి రాజ్యం అప్పచెప్పే ముందు యోగ విద్యను ప్రసాదించిన గుహ. దర్శనం అయ్యిన తరువాత అందరూ అర్చకుడిచ్చిన కుంకుమ పెట్టుకుని బయటకి వస్తున్నారు.



"ముసలవ్వా, ఏదడిగినా వద్దని అంటావు, నీకు అసలు కోరికలు ఉండవా, నిజంగానే కోరికలుండవా నీకు?" అడిగింది ఒకతె.

"యెర్రిదానా, నేనూ మనిసినే, నాకు కోరికలుంటాయి. కోరికలకి అడ్డూ అదుపూ ఉండాల. ఇరణ్యకశిపుడు అడ్డమైన కోరికలు కోరితే సామి ఇరిచేసాడు. అర్రులు చాచి కోరికల కోరే మనసే ఇరణ్యకశిపుడు, సామిని తలుసుకుని అర్రులు చాచే మనసును అదుపులో పెట్టి, కోరికలని ఇరిస్తే ఆ మనిషే నరసింహం" అన్నది ముసలవ్వ.

"ఓసోసి, జైల్లో యేదాంతం యెక్కింది ముసలవ్వకి" అంటూ నవ్వింది ఇంకొకతే.

"ముసలవ్వకు కోరికలేటి, కొడుకు మిలట్రీలో ఉజ్జోగం, సొమ్ములంపుతున్నాడు, కోడలు బువ్వెడుతుంది, మనవడు పనుల్లోకి పోకుండా బడికోతున్నాడు, ఇంకేటి ముసలవ్వకు కోరికలు. ముసలవ్వా, జైలుకి పోతే పోయినావు, ఇప్పుడు నీకేటి చింత, నీకేటి కోరికలు" అన్నది ఇంకొకతె.

యోగానంద నరసింహ స్వామి

"సింతా ఉన్నాది కోరికా ఉన్నాది. నా గుడిసెకి సేరాల, నా నల్ల గేదె ఈనాల, గేదా దూడా సల్లంగా ఉండాల. నా మనవడికి నే జున్నుపాలు వండాల, ఆ పరి నా నల్ల గేదె పాలతో సిరి పాయసం వండాల, సామికి నైయేద్దం పెట్టాల" అన్నది ముసలవ్వ.

"ఓసోసి, నీ నల్ల గేద గంగి గోవేటి? నల్ల గేదె పాలతో సామికి నైవేద్దమెట్టటానికి!" వేళాకొళం చెయ్యబోయింది ఇంకొకతె.

"ఒసే నల్లదానా, నువ్వు మనిసివి కాదేటి? నల్లగా ఉంటే మాత్రం ఏటి, గేదె దాని బిడ్డ తాగాల్సిన పాలు మనకి పోస్తాది. మనుసులందరూ గేదె పాలు తాగుతారు, పూజలు మాత్రం తెల్లగా ఉంటేనే! తెల్లగా ఉంటేనే గంగి గోవా? మనకు పాలు ఇచ్చేదేదైనా గంగి గోవే" అన్నది ముసలవ్వ.

"నీతో మాట గెలవటమే, అన్నిటికన్నీ సెపుతావు" అన్నది ఇంకొకతె.

"పెద్దన్నా ఈ నల్లదాని సోదెందుకు కానీ, గోయింద కొట్టు " అన్నది ముసలవ్వ.



ఛత్రవట నరసింహ స్వామి

"జోగి నరసింహా గోయిందా గోయిందా"
"గోయిందా
గోయిందా"

కొండ అడుగు ప్రాంతం, చిట్టడవి. పక్షులు అహోబిలేశునికి పవళింపు సేవలు పాడుతున్నాయి. అందరూ వడి వడిగా నడుస్తున్నారు. రోజంతా కొండలు ఎక్కటం, దిగటంతో గడిచినా ఎవరికీ అలసట కనబడటంలేదు.

"ముసిలవ్వా, జైలు నుండి రాటం రాటమే మంకు పట్టావ్. నీతోడి వస్తే ఇయ్యాళ అంతా సందడి సందడిగా గడిసింది. మళ్లీ రేతిరంతా ఆటోలో పోవాల, రేపు పనులకు పోవాల. పోయిన తరవాత కొత్త కస్టాలు ఏటి ఎదురైతాయో" అన్నది ఒకతె.

"ఒసే పిచ్చిదానా, కస్టాలు మనుసులుకు రాక బండ రాళ్లకు వత్తాయా? సోద్యం సెపుతున్నావే! అదుగో ఇంకో దేవళం అగుపడతాంది. కష్టాలొచ్చిన్నప్పుడు ఓర్పు కావాల, సత్తువ కావాల, ధైర్యం కావాల, ఉపాయం కావాలని సామిని కోరుకో" అన్నది ముసల్లవ.

మఱ్ఱి చెట్టు గొడుగు పట్టితే, ఆ క్రింద వెలసిని నరసింహుడి గుడి. అందరూ దండం పెట్టుకుని బయలుదేరారు.

"పెద్దన్నా, గోయింద కొట్టు" అన్నది ముసలవ్వ.

"గొడుగు నరసింహా, గోయిందా గోయింద"
"గోయిందా గోయింద"

చీకటి కమ్ముకున్నది. మిణుగురు పురుగుల వెలుగులో చిట్టడవి దాటి దిగువ అహోబిలానికి చేరుకున్నారు.

మనిషి నిలబడగలిగినంత ఎత్తులో ఉన్న గుహలో గర్భాలయం. గుహలో ఒక ప్రక్క అరుగులాంటి పెద్ద బండ రాయి మీద నెలకొన్న ప్రహ్లాద వరదుడు. ఆ అహోబిలానికి గంభీరంగా కాపలా కాస్తున్న నిలువెత్తు జయ విజయలు విగ్రాహాలు. కాకతీయ రాజులు, విజయనగర రాజులు అహోబిలానికి ఆనుకుని కట్టించిన ఆలయం, రంగ మండపాలు. స్వాతి నక్షత్రం నాడు అవటము వలన జన సందోహం ఎక్కువగానే ఉంది. ఈ ఆడవారి గుంపులోని వారందరూ ఓపికగానే నిలబడ్డారు. గుహ గడప దగ్గరకు వచ్చారు. ఎవరో దంపతులు లోపలికి వెళుతున్నారు. వారి వెంట ఉన్న బుడి బుడి నడతల పాప ఎత్తైన గడప దాటలేక, గడప మీద కాలు వేసి ఎక్కబోయింది. ముసలవ్వ వంగిన నడుముతో ఆ పాపను ఎత్తుకుని, "గడప తొక్కకూడదే సిట్టి మాలచిమి" అంటూ ఆ పాపను గడప దాటించింది. అహోబిలం గర్భాలయంలో భక్తులు స్వామి వారికి కానుకులు అర్పిస్తున్నారు. అర్చకుడు బాసిపెట్టుకుని కానుకలు అందుకుంటూ అందరికీ శఠగోపం పెడుతున్నాడు.

"అయ్యోరు, పైని ఓబులేశుని కాడికెళ్లి, పైని దేవళాలన్నీ సూసుకుంటూ వచ్చినాం, సామికియ్యటానికి మా దగ్గర కానుకలు లేవు" అన్నది ముసలవ్వ.

“నవనరసింహులని చూడాలంటే ఏభై కిలోమీటర్ల కొండ దార్లు, అంతా నడిచారేమిటి? మరి ఆపైన ఉగ్రస్తంభం?" సందేహిస్తూ ప్రశ్నించారు అర్చకులవారు.

"అన్ని దేవళాలలోనూ సామికి దండమెట్టి, మా చెంచులచిమిని సూసుకుకొని వత్తన్నాము, అయ్యోరు. ఉక్కు కంభానికి కూడా దండమెట్టుకొచ్చినా" అన్నది ముసలవ్వ.

"మంచిది, నవనారసింహులందరినీ దర్శించుకుని వచ్చారనమాట, ప్రహ్లదవరదుడు మీకు కూడా వరాల జల్లు కురిపిస్తాడు, కోరికలు తీరుస్తాడు" అంటూ మంత్రోచ్చారణ చేస్తూ, అందరికీ శఠగోపం పెట్టి, కుంకుమ, పూలు ఇచ్చాడు అర్చకుడు.

"అహోబిలే గారుడ శైల మధ్యే కృపావశాత్ కల్పిత సన్నిధానమ్
లక్ష్మ్యాత్ సమాలింగిత వామభాగం లక్ష్మీనృసింహ శరణ్యం ప్రపద్యే"

"ఇప్పుడు నరసింహ స్తోత్రం నాతో పాటు అందరూ చెప్పండి" అన్నారు అయ్యవారు.

"ఉగ్రం వీరం మహా విష్ణుం జ్వలంతం సర్వతోముఖం
నృసింహం భీషణం భద్రం మృత్యుర్ మృత్యుం నమామ్యహం"



"అయ్యోరు, నువు సదివింది మాకు అగుపడదుగానీ, గోయింద కొట్టరాదే" అన్నది ముసలవ్వ.

"సరే! గోవింద నామానికి మించినది లేదు" అంటూ గోవింద చెప్పారు అయ్యవారు

"ప్రహ్లాదవరదా గోవిందా గోవిందా" అన్నాడు అర్చకుడు.

"గోయిందా గోయిందా" అని అందరూ అంటే, అహోబిలం ప్రతిధ్వనించింది.

ఆటో దగ్గరకు చేరారందరూ. గూటిలో గువ్వలులాగా అందరూ ఒదిగి ఒదిగి ఆటోలో కూర్చున్నారు.

"పెద్దన్నా, అడిగిందే తడవుగా ఆటో కట్టినావు, సామికాడికి తీసుకొచ్చి కోరిక తీర్సినావు, గోయింద కొట్టు" అన్నది ముసలవ్వ.

"మూడు గీతలోడా గోయిందా గోయిందా

"గోయిందా గోయింద"

"నిలూ గీతలోడా గోయిందా గోయింద"

"గోయిందా గోయింద"

శ్రీదేవీ భూదేవీ సమేత ప్రహ్లాద వరదుడు

"ఓబులేశా గోయిందా గోయిందా"

"గోయిందా గోయిందా

గోల గోలగా బయలుదేరింది ఆటో.

# పుట్టిల్లు

ఎం.బిందుమాధవి

"పుట్టిల్లు" అంటే, మనం పుట్టి పెరిగిన మనదైన ఇల్లు.

మనం పడుతూ లేస్తూ బుడి బుడి అడుగులతో నడయాడిన మన ఇల్లు.

అమ్మ-నాన్నతో దెబ్బలాడి, అలిగి...వారితో బ్రతిమాలించుకుని మన కోరికలు తీర్చుకున్న మన ఇల్లు.

తోబుట్టువులతో గడిపిన మధురమైన క్షణాలకి, వారితో కలిగిన చిలిపి తగాదాలకి ప్రత్యక్ష సాక్షి. మన చదువు-సంధ్యలకి, ఆటపాటలకి, మరెన్నో మధురమైన జ్ఞాపకాలకి నిలయం.

అందరిలాగే మాలతికి కూడా పుట్టిల్లు మధుర జ్ఞాపకాల పందిరి.

చిన్నప్పుడు అన్నయ్యకి..తనకి అన్నీ పోటీయే.

ఇద్దరి కంచాలు ఒకేలాగా ఉండేవి. కానీ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని...ఆ రోజు అన్నయ్య ముందు తినేసి వెళ్ళిపోతే....మిగిలింది తనే కనుక కంచం చేత్తో పట్టుకు చూసి.... ఇది అన్నయ్య కంచం..నా దానిలో వాడు తిన్నాడు అని అలిగికూర్చునేది.

తల్లి మహలక్ష్మి బుజ్జగించి...ఏదో ఒక తాయిలం ఇస్తానని ఆశపెడితే అప్పుడు భోజనానికి వచ్చేది.

అలాగే తను చదువుకోవటానికి కూర్చునే చోటు, టీవీ చూసేటప్పుడు తన సీట్ ....ఏవీ మారటానికి ఒప్పుకునేదికాదు.

★★★★★★★★

అలా పుట్టింట్లో ప్రభ వెలిగించుకున్న మాలతి .....పెళ్ళయి భర్త చిటికెన వేలు పట్టుకుని ముంబయి కాపురానికివెళ్ళింది.

కొత్త కాపురం...కొత్త కుండలో నీటి లాగా తియ్య తియ్యగా ఉన్నది. ఆరునెల్ల కాలం ఎలా గడిచిందో తెలియలేదు.

మాలతి ఒక రోజు ఆఫీస్ కి బయలుదేరుతూ కొంచెం తలతిరుగుతున్నట్లుగా అనిపించి సోఫాలో కూర్చుండిపోయింది. కొంచెం కడుపులో కూడా తిప్పుతున్నట్లుగా ఉన్నది.

కొత్త జంట కదా! మాటి మాటికీ భార్యతో మాట్లాడాలనే కుతూహలం.... అప్పటికే ఆఫీస్ కి చేరిన వినోద్....ఫోన్ చేసి'మాలతీ ఆఫీస్ కి బయలుదేరావా?' అని యధాలాపంగా అడిగాడు.

'లేదండీ కడుపులో తిప్పుతున్నట్టుంది. కొంచెం కళ్ళు కూడా తిరుగుతున్నట్లున్నాయి. ఎంత లేదన్నా ఆఫీస్ కిఅరగంట ప్రయాణం. అంత సేపు బస్ లో కూర్చోగలనా అని సందేహం! వెళ్ళనా..వద్దా అని ఆలోచిస్తున్నా' అన్నది మాలతి నీరసంగా.

వెంటనే అటెన్షన్ లోకొచ్చిన వినోద్ 'అయ్యయ్యో ...కంగారు పడకు. పక్కింటి ఆంటీని పిలు. నేను లంచ్ టైం లో పర్మిషన్ పెట్టి వస్తాను. డాక్టర్ దగ్గరకి వెళదాము. కాసేపు రెస్ట్ తీసుకో. నువ్వెళ్ళకపోతే అక్కడ ఆఫీస్ లో కొంపలేమీమునగవులే' అని.

"ఏమయ్యుంటుంది? నిన్న హోటల్లో తిన్న పనీర్ కూర అరగలేదా? పాపం తను వద్దంటూనే ఉంది. నేనే బలవంతాన తినిపించాను!" అని ఆలోచిస్తూ ఆఫీస్ పని మీద దృష్టి పెట్టలేక పరాకుగా ఉన్నాడు. మాటి మాటికీ బయట కారిడార్ లోకివెళ్ళి ఎవరితోనో ఫోన్ లో మాట్లాడుతున్నాడు.

కొలీగ్ లింగం ఉదయం నించీ ఈ తంతు గమనించి వినోద్ దగ్గరకెళ్ళి.

"ఏంటి వినోద్ ఏమైనా సమస్యా? పొద్దుటి నించీ చూస్తున్నాను..."బాడీ ప్రెజెంట్మైండ్ యాబ్సెంట్" లాగా నువ్వుఇక్కడ ఉన్నావు...మనసెక్కడో ఉన్నది. చెబితే నాకు చేతైన సహాయం చేస్తానుకదా" అని భుజం మీద చెయ్యేసిఅడిగేసరికి, భార్య విషయం చెప్పి...

"నేనే బుద్ధి లేకుండా.....నిన్న హోటల్లో తన చేత అనవసరంగా తనకిష్టం లేని పనీర్ కూర తినిపించాను. ఇప్పుడేమో ఉదయం నించీ కడుపులో తిప్పి వాంతులు చేసుకుంటున్నది" అని కళ్ళనీళ్ళతో చెప్పాడు.

"మేనేజర్ని పర్మిషన్ అడిగాను. లంచ్ లో ఇంటికెళ్ళి తనని డాక్టర్ దగ్గరకి తీసుకెళితే కానీ కుదుటపడలేను" అని టైం ఎప్పుడు అవుతుందా...అని గడియారం వంక చూస్తున్నాడు.

★★★★★★★

మాలతి ఒక ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నది. పెళ్ళైనాక హైదరాబాద్ నించి ముంబయి బదిలీ చేయించుకుంది. ఇద్దరి ఆఫీస్ లకి దగ్గరగా ఉండేట్లు ఒక ఫ్లాట్ అద్దెకి తీసుకున్నారు.

ఆఫీస్ లనించి ఇంటికొచ్చింది మొదలు చిలకా గోరింకల్లాగా కువ కువలాడుతూ ఇద్దరూ చెరో పని చేసుకుని...చెట్టా పట్టాలేసుకుని షాపింగ్ కో, సినిమాలకో తిరుగుతూ ఉంటారు.

అప్పటి వరకూ తల్లిదండ్రుల గారాబంలో ఎప్పుడూ వారిని వదిలిపెట్టి ఉండే అలవాటు...అవసరం లేనిమాలతి...ఈ ఆరు నెలల్లో వారిని మిస్ అయినట్లుకూడా అసలు అనుకోలేదు.

పుట్టిల్లు గుర్తుకే రాలేదంటే అతిశయోక్తి కాదేమో!

పాపం మాలతి తల్లిదండ్రులు..శ్రీనివాసరావు–
మహాలక్ష్మి దంపతులు మాత్రం " అంత పెద్ద సిటీలో పిల్ల ఎలాఉన్నదో? తెలిసిన వాళ్ళెవరైనా దగ్గరలో ఉన్నారో, లేదో? ఒక్కతే ఉద్యోగం–వంట....ఎలా తిప్పలు పడుతున్నదో? అల్లుడుఇంటి పనిలో సహాయం చేస్తాడో..లేదో? అసలు పిల్లని ప్రేమగా..మురిపెంగా చూసుకుంటున్నాడో.. లేదో? తమని విడిచిఇంతవరకూ ఎప్పుడూ బయట ఉండని పిల్ల...ఒక్కసారిగా అంత దూరంలో బెంగ లేకుండా ఎలా ఉంటున్నదో?" అనుకుంటూ ఏ రోజుకారోజు ఫోన్ కోసం ఎదురు చూస్తూ ఉండేవారు.

మాలతి 15,20 రోజులకోసారి ఫోన్ చేసి "అమ్మా ....ఇక్కడ మేం బాగానే ఉన్నాం. మీరు బెంగ పడకండి. టైందొరికినప్పుడు ఫోన్ చేస్తాం." అని హడావుడిగా నాలుగు మాటలు చెప్పి ఫోన్ పెట్టేసేది.

దానికే సంతోషపడిపోయిన దంపతులు ...పిల్ల తీపి కబురు చెబితే వెళ్ళి ఓ సారి చూసి రావచ్చు! ఊరికే కొత్త జంట కాళ్ళకి–చేతులకి అడ్డం ఎందుకు? అని సరిపెట్టుకున్నారు.

★★★★★★

పొద్దుటి నించీ ఒకటే గాభరా పడ్డాడేమో.... ఆఘమేఘాల మీద ఆఫీస్ నించి పరుగెత్తుకొచ్చిన వినోద్...భార్య నిద్ర పోతుండటం చూసి..లేపటం ఇష్టం లేక, పక్క ఆంటీ దగ్గరకి పరుగెత్తుకెళ్ళి ..."మాలతి పడుకుంది ఆంటీ! తనకి ఎలాఉన్నది? మీరు ఉదయం నించీ మా ఇంట్లోనే ఉన్నారా? తనేమైనా తిన్నదా? మందులేమైనా వేసుకున్నదా?" అని గుక్కతిప్పుకోకుండా ప్రశ్నలు వేశాడు.

ఆంటీ చిరుమందహాసంతో "తండ్రివి కాబోతున్నందుకు శుభాకాంక్షలోయి! కంగారు పడకు. మన ఫ్లాట్స్ లో ఉన్న లేడీడాక్టర్ ని పిలిచాను. ఆవిడ వచ్చి చూసి శుభవార్త చెప్పి వెళ్ళారు. నీరసంగా ఉన్నది... నాలుగు రోజులు రెస్టీసుకోమన్నారు." అని ఆవిడ మాట పూర్తి చేసేలోపు వినోద్ పరుగున ఇంటికెళ్ళి భార్య నుదుటిన ముద్దు పెట్టి

"అమ్మ దొంగా! చెప్పవేం...నాకు నాన్నగా ప్రమోషన్ ఇప్పిస్తున్నానని! ఇందాకటి నించీ ఆఫీస్ లో కాలు–చెయ్యిఆడలేదు. ఎప్పుడెప్పుడు ఇంటికొచ్చి నిన్ను చూస్తానా అని అసలు పని మీద ధ్యాసే లేదు" అని ఒళ్ళంతా ముద్దులతోనింపేశాడు.

భర్త మురిపాలతో ఒళ్ళు తెలియని మాలతి, నెమ్మదిగా మంచం మీంచి లేచి "లంచ్ చేశారా? కాఫీ పెట్టివ్వనా?" అంటూ వంటింటి వైపు వెళుతూ తూలినట్లయి గట్టు పట్టుకు నిల్చుంది.

వినోద్ కంగారు పడి..."అమ్మాయి గారికి ఇప్పుడు రెస్ట్. ఏ పనులు చెయ్యకూడదు. ఇప్పుడే ఫోన్ చేసి ఆఫీస్ కినాలుగు రోజులు సెలవు చెప్పేస్తాను. నీ అవసరాలు అన్నీ నేను చూస్తాను" అని హడావుడి పడిపోయాడు.

★★★★★★

ఇలా ఆరు నెలలు కాలు కింద పెట్టకుండా మాలతిని అపురూపంగా చూసుకున్నాడు, వినోద్. క్రమం తప్పకుండా డాక్టర్ కి చూపిస్తూ అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాడు.

మాలతి తల్లి మహలక్ష్మి గారు మూడో నెల్లో వచ్చి, పిల్లని చూసి... చలిమిడి (దొంగ) పెట్టి (అలా అంటారు లెండి) కూతురుకి..అల్లుడికీ జాగ్రత్తలు చెప్పి వెళ్ళారు.

మొదటి పురుడు పుట్టింట్లో పోసుకోవాలి! ఈ సమయంలో హాయిగా ఆడుతూ పాడుతూ ..దాని స్నేహితులతో కబుర్లుచెప్పుకుంటూ, కోరింది తల్లి చేత వండించుకు తింటూ ప్రశాంతంగా ఉంటే.... పుట్టే పాపాయి ఆరోగ్యంగా పుడుతుంది. కాబట్టి మంచి రోజు చూసుకు వచ్చి ఏడో నెల్లో పురుటికి తీసుకెళతామని శ్రీనివాసరావు గారు అల్లుడికి ఫోన్ చేశారు.

భార్యని వదిలి ఉండలేక ....

"పిల్ల పుట్టాకనే సెలవు ఎక్కువ అవసరం అవుతుంది. కాబట్టి మాలతి తొమ్మిదో నెల దాకా ఆఫీస్ కివెళ్ళాలనుకుంటున్నది! అదీ కాక ఇప్పటివరకూ చూసిన డాక్టర్ అయితే తనకి ధైర్యం గా ఉంటుంది" అని పురుడుపొయ్యటానికి అత్తగారినే ముంబయి రమ్మన్నాడు..వినోద్.

ముందు ముందు తానేం పోగొట్టుకుంటుందో తెలియని మాలతి...అప్పటికి భర్త మాటకి తాళం వేసి....తల్లినేముంబయి రమ్మని అడిగింది.

★★★★★

చిన్నప్పటి నించీ మాలతిని ఎరిగున్న పక్కింటి కామేశ్వరి గారు...మాలతి కడుపుతో ఉన్నదని తెలిసి అభినందించటానికి వీరింటికి వచ్చి.."వదినా పిల్లని పురిటికి ఎప్పుడు తీసుకొస్తున్నారు?" అని అడిగింది.

తనే వెళుతున్నానని మహలక్ష్మి గారు చెప్పగానే...

"అయ్యో అదేమిటి? ఏదో వేరే దేశం అయితే ఎలాగూ తప్పదు. ఇక్కడే ఉన్న ఆడపిల్లల పురుళ్ళకి కూడా తల్లులు వెళ్ళటం దేనికి?

"తల్లితో పుట్టిల్లు.." అన్నారు పెద్దలు! ఇలాంటప్పుడే కదా..నాలుగు రోజులు ప్రశాంతంగా ఏ బాధ్యతలూ లేకుండా మళ్ళీతనకి చిన్నప్పటి నించీ అలవాటైన పరిసరాల్లో మసలగలరు!"

"మనమున్న చోట మనకి స్థానబలం! దేనికి తడుముకోనక్కరలేదు. ఇంట్లో అలవాటైన పని వాళ్ళు, డ్రైవర్ ఉన్నారు. ఈ వయసులో మనం సమర్ధవంతంగా పని చెయ్యాలంటే ఇవన్నీ ముఖ్యం. అదీ కాక ఆ వూళ్ళో మనకి ఎవ్వరూతెలియదు. భాష రాదు. మనంతట మనం ఎక్కడికీ వెళ్ళలేము. అన్నిటికీ వాళ్ళ మీదే ఆధారపడాలి." అని కామేశ్వరి గారు అనేసరికి

"మేమూ అదే అంటున్నాం వదినా! ఇక్కడ మీ అన్నయ్య గారి ఫ్రెండ్ భార్య గైనకాలజిస్ట్ కూడాను ...హస్తవాసి మంచిది. పిల్లలు అర్ధం చేసుకోవాలి కదా! అంతకంటే చెప్పటం బాగుండదు. అందుకని నేనే బయలుదేరుతున్నాను" అన్నది మహలక్ష్మి గారు.

★★★★★

మహలక్ష్మి గారి పాట్లు మొదలు! ఆవిడ గారు తనంతట తను ఏ కూరలో ...సరుకులో తేవటానికి బయటికి వెళ్ళలేదు. పోనీ చిన్న చితక అవసరాలకి బయటికి పనిమనిషిని పంపిద్దామంటే... తన భాష దానికి అర్ధమవదు...అదిచెప్పేది ఈవిడకి అర్ధం కాదు.

అన్నిటికీ అల్లుణ్ణే ఇబ్బంది పెట్టాలి.

నెలలు నిండి నిల్చో లేక–

కూర్చోలేక అవస్థ పడుతూ కూడా వేళ కాని వేళ సినిమాలకీ..హోటళ్ళకీ స్కూటర్ మీదతిరుగుతున్న కూతురూ–

అల్లుడుని చూసి ఏ ఇబ్బందులు వస్తాయో? పుట్టే వారు ఏ సమస్యాలేకుండా ఉంటారా? ఇలాంటి సందర్భాలు వచ్చినప్పుడు...పెద్దలు చెప్పే జాగ్రత్తలు ఈ కాలం పిల్లల వినరు! వద్దంటే ఆగరు. పెద్దది తను ఉండిచూస్తూ ఊరుకోలేదు.

పురిటికి పుట్టింటికి వెళితే ఇలాంటి సమస్యలు ఉండవు. ఆలూ మగలకైనా మధ్య మధ్య దూరంగా ఉంటేనేబంధాలు బలపడతాయి! ఎంత ప్రేమలైనా "తినగా తినగా గారెలు చేదైనట్లు", ఒకే చోట ఉంటే మొహం మొత్తుతుంది. అని మహలక్ష్మి గారు పరిపరి విధాల మధన పడుతున్నారు.

ఏమనాలో తెలియక భర్తకి ఫోన్ చేసినప్పుడు తన భయాలన్నీ ఏకరువు పెట్టింది.

మాలతి భయపడినట్లే ఆ రోజు సినిమా హాల్లో ఉండగా నొప్పులొస్తున్నాయని..కంగారుగా వినోద్ దంపతులు స్కూటర్అక్కడే వదిలేసి క్యాబ్ లో ఇంటికొచ్చారు.

ఇద్దరికీ తినటానికి ఏదో పెట్టి, అప్పటికే సర్ది తయారుగా పెట్టిన బ్యాగ్ పుచ్చుకుని ముగ్గురూ హాస్పిటల్ కి వెళ్ళారు.

స్కాన్ తీసి... కడుపులో బిడ్డ పేగు మెడకేసుకున్నదని అప్పటికప్పుడు ఎమర్జెన్సీ గా సిజేరియన్ చేసి పిల్లని బయటికితీశారు.

'అనుకున్నంతా అయింది' అని మహలక్ష్మి గారు..ఇందుకే బిడ్డకి జన్మనివ్వటం అంటే ఒక యజ్ఞమని, అది ఒకతపస్సులాగా దీక్షతో మసులుకోవాలని..ఆడదానికి అది పునర్జన్మతో సమానమనీ పెద్దలు ఊరికే అన్నారా?

పూర్వం తను మాలతిని కడుపుతో ఉన్నప్పుడు..ఏడో నెలన అమ్మ దగ్గరకి పురిటికి వెళితే...ఏం తినాలి? ఎప్పుడు తినాలి? ఏది తినకూడదు? ఎలా పడుకోవాలి? అని అమ్మ చెబుతూ ఉంటే తు.చ. తప్పకుండా పాటించబట్టి తనకితేలికగా పురుడు (normal) రావటం, ఏ ఇబ్బందులూ లేకుండా మూడో నెలన పిల్లని ఎత్తుకుని శ్రీనివాస రావుగారి దగ్గరకిరావటం గుర్తొచ్చింది.

ఇక పురిటాలికి పెట్టే ఆహారం విషయంలో.... తన చిన్నప్పుడు పాటించిన నియమాలన్నీ కూతురితో, అల్లుడితోఏక రువు పెట్టింది. నచ్చినవి విన్నారు, లేనివి పెడ చెవిని పెట్టారు.

వచ్చిన పని అయింది ...భర్తకి కూడా ఇబ్బంది అవుతున్నది కనుక... కూతుర్ని తనతో తీసుకెళ్ళి నాలుగు నెలలుఉం చుకుని పంపిస్తానని...పిల్లకి కూడా విశ్రాంతి అవసరమని.... ఆ రోజు ఆఫీస్ నించి వచ్చిన అల్లుడితో అన్నారు మహలక్ష్మి గారు.

అన్ని రోజులు తన కూతుర్ని వదిలి ఉండలేనని..వినోద్ "ఇప్పుడు మాలతిని మీతో తీసుకెళ్ళండి అత్తయ్యగారు! పుట్టిన వారిని తరుచు డాక్టర్ కి చూపించటం, వాక్సినేషన్ లు వేయించటం అవసరం కదా! డెలివరీ అయిన హాస్పిటల్ఇక్కడ మా ఇంటికి దగ్గర . అక్కడ మంచి పీడియాట్రీషియన్ కూడా ఉన్నది. నేను పది రోజుల తర్వాత వచ్చి వెనక్కితీసుకొచ్చేస్తాను. ఇక్కడ ఫుల్ టైం మనిషిని పెడతాను. మాలతికీ రెస్ట్ ఉంటుంది, పాప కూడా నాతో ఉంటుంది" అన్నాడు.

★★★★★★

ఆవిడకి ఇక్కడికి వచ్చినప్పటి నించీ ఒకటే పని ఒత్తిడి! ఆ వయసులో అంత పని లోడ్ తీసుకోవటం వల్ల ఆవిడకి ఆరోగ్యం కొంచెం పాడయింది. అలా అని సిటీల్లో బోలెడు జీతాలు పోసి మనుషులని పెట్టమని అల్లుడ్ని అడగలేరు!

మారిన కాలంలో ...కూతుళ్ళు కూడా ఉద్యోగాలు చెయ్యటం వల్ల ...ఒకే దేశంలో ఉన్నా... పుట్టింటికే వెళ్ళి ప్రశాం తంగాజరిపించుకోవలసిన పురుళ్ళకి తల్లుల్ని తమ ఇళ్ళకి పిలిచి ఇబ్బంది పెట్టటం తప్పనిసరి చేసుకున్నారు! వీళ్ళకీసుఖంఉండదు...వారికీ సుఖమూ, విశ్రాంతి ఉండవు!

సెలవులుండవనే సాకుతో పెళ్ళైన కొత్తల్లో పండక్కి రావటం లాంటి సరదాలు, తల్లిదండ్రుల దగ్గర విశ్రాంతిగా గడపటాలు ఉండట్లేదు! ఎప్పుడూ ఉద్యోగం..పరిమితంగా ఉండే సెలవల్ని ఎలా క్లుప్తంగా వాడుకుని జాగ్రత్త చేసుకోవాలిఅనే రంధి! అదొక ఊబి!

ఇక పురుళ్ళైతే సరేసరి! తల్లులే వారి దగ్గరకి వెళ్ళటం..తమది కాని స్థానంలో నానా రకాలయాతనలు పడటం!

★★★★★

పిల్లల పుట్టిన రోజు వేడుకలు, పండుగలు ...పిల్లలు ఎదుగుతూ ఉండగా వచ్చే ఇతర వేడుకలు... అన్నిటికీతల్లిదం డ్రులనే పిలిపించుకుంటూ పాతికేళ్ళ కాలం గడిచిపోయింది..మాలతికి

మాలతి ఈ మధ్యలో పుట్టింటికి వెళ్ళినా, మొక్కుబడిగా ఓ పూటో..ఓ రోజో ఉండి వచ్చేసేది.

కాలంలో తండ్రి గతించాడు. తల్లి ఒంటరిగా ఉండలేక అన్నయ్య దగ్గరకి అమెరికా వెళ్ళిపోయింది. తండ్రి బ్రతికుండగా...ఇక్కడున్నప్పుడే ఎన్ని సార్లు పండక్కనో, నాలుగు రోజులు సరదాగా పుట్టిపెరిగిన ఇంట్లో గడపటానికి రమ్మనోపిలిస్తే తను వెళ్ళేది కాదు. ఇప్పుడు పిలిచే వారే లేరు! మాలతికి ఒక్క సారిగా ఆ వెలితి బాగా తెలుస్తున్నది!

మొన్న పెసరపప్పు పులుసు తింటుంటే అమ్మ చేతి పులుసు రుచి గుర్తొచ్చి కళ్ళనీళ్ళొచ్చాయి.

పిల్లలకి వారి జీవితాలు...ఉద్యోగాలు...వాళ్ళు బిజీ. భర్త వినోద్ నిశ్శబ్దంగా తయారయ్యాడు. ఇంట్లో ఏదో ఒక మూలకూర్చుని ఏ ఐపాడ్ చూసుకోవటమో, పుస్తకం చదువుకోవటమో!..భోజనం టైం కి పిలిస్తే వచ్చి భార్యతో మాట్లాడటానికిఏమీ లేనట్టు ఇంత తిని వెళ్ళి పడుకుంటాడు.

ఇప్పుడు తను ఒంటరినైపోయాననే భావన మాలతిని ఎక్కువగా బాధిస్తున్నది. అన్నయ్య దగ్గర ఉన్న తల్లి తనని స్వతంత్రంగా రమ్మని పిలవలేదు. అధవా పిల్చినా అమెరికా వెళ్ళి తను ఉండలేదు.

మన ఇల్లు, మన కాపురం...అందులో మధురానుభవాల రూపంలో యవ్వనంలో మనకి మనమే వేసుకునే కాలిసంకెల. అప్పుడు ఆనందంగా అనిపించే విషయం ఇప్పుడు మనుషులని దూరం చేసి ఒంటరితనాన్ని మిగులుస్తున్నది.

ఎవరి ఇంట్లో వారు బిజీ. హాయిగా కబుర్లు చెప్పుకుని...మనసారా నవ్వుకుని ఎన్నాళ్ళయిందో?

చిన్నప్పుడు అన్నయ్య తనని అన్నిటికీ ఆట పట్టించి తను ఉడుక్కుంటుంటే నవ్వేవాడు. తన ఫ్రెండ్స్ తో "మాచిట్టితల్లి అంటే నాకు ప్రాణం రా! తను లేకపోతే నాకుతోచదు. ఊరికే అలా ఏడిపిస్తా కానీ, ఒక్క రోజు జ్వరం వచ్చిపడుకుంటే నాకు ఇల్లంతా బోసి పోయినట్టనిపిస్తుంది. రేపు పెళ్ళై వెళ్ళిపోతే ఎలా ఉండగలనో!" అనే వాడు.

గతాన్ని తల్చుకుంటూ అలా సోఫాలో చేరగిలపడిన మాలతి కళ్ళల్లో గిర్రున నీరు తిరిగింది. అలాగే పడుకున్న మాలతిని....ముందుగదిలో చీకటిగా ఉన్నది, మాలతి ఎక్కడికెళ్ళిందో? అనుకుంటూ వచ్చి లైట్ వేసిన వినోద్ చూసి, కంగారు పడి "ఏం జరిగింది? మీ అమ్మగారు కులాసాగా ఉన్నారా? మీ అన్నయ్య ఫోన్ ఏమైనా చేశాడా? అనేసరికి మాలతిదు:ఖం కట్టలు తెంచుకుంది.

"అత్తయ్యగారిని చూడాలని ఉన్నదా? పోనీ ఆవిడని పంపమని మీ అన్నయ్యకి ఫోన్ చెయ్యనా?" అని అడిగాడు.

మాలతి "వద్దండీ. మనం వయసులో ఉన్నప్పుడు కూడా ఇదే తప్పు చేశాం! ఆవిడ ఎన్ని సార్లు ముద్దుగా రమ్మని పిలిచినా వెళ్ళి మా పుట్టింట్లో పది రోజులు గడపలేదు. అలా వెళ్ళటం అనేది అక్కడ మన స్థానాన్ని కాపాడుకోవటం అనికానీ, అది ఒక ముచ్చట అని కానీ, పెద్ద వాళ్ళని గౌరవించటం అని కానీ ఒక్క నాడు కూడా ఆలోచించలేకపోయాను. ఎప్పుడూ మన ప్రాధాన్యతలు...ఇబ్బందులు గురించి ఆలోచించామే కానీ సంప్రదాయంగా మన పెద్దవాళ్ళు పెట్టిన ఒరవడుల్లో ఎంతో అర్ధమున్నదని గ్రహించలేకపోయాను."

"ఉన్న నిండు తెలియదు...లేని వెలితి తెలుస్తుంది" అని "అన్నయ్యని స్పాన్సర్ లెటర్ పంపించమని వీసా కి అప్లై చేస్తాను. భగవంతుడి దయవల్ల ఏ ఇబ్బంది లేకుండా వీసా వస్తే నేనే అమ్మ దగ్గరకి వెళ్ళి రెణ్ణెల్లు ఉండి వస్తాను. మీరు పిల్లలతో కాలక్షేపం చేసినా సరే, నాతో మీరూ వీసా తెచ్చుకుని అక్కడికి వచ్చినా సరే!" అన్నది.

ఆ ఆలోచన రావటం తడవు..మనసు తేలికపడి మాలతి ...రాత్రి వంట చెయ్యటానికి లోపలికి వెళ్ళింది.

★★★

## సరోజ కనపడింది

మత్తి భానుమూర్తి

రంగనాథ్ చెప్పాడు ..

**సరోజ కనపడింది...**

ఔను.. ఇవ్వాళ సరోజకనపడింది. మరోసారి కనపడింది. దాదాపు నలభై ఏళ్లుగా అప్పుడప్పుడు. ఎన్నో సార్లు..ఇలా కనబడుతూనే ఉంది. అనుకోకుండా..అకస్మాత్తుగా..

ఆమె ఎవరో నాకు తెలుసు.. కాని నేనెవ్వరో ఆమెకు తెలియదు..

ఆమెను నేను మొదటిసారి నాపదిహేనేళ్ళవయస్సులో చూశాను.. ఆ చూడటం ఇప్పటికి గుర్తే.. ఎప్పటికి ఆ దృశ్యం నాలో నిత్యనూతనం..లవ్ యట్ ఫస్ట్ సైట్ అంటారే.. అలాంటిది..చిత్రంగా అది లవ్ కాదు.. కనీసం పరిచయంకూడా కాలేదు..ఆమెతోఎప్పుడూ మాట్లాడిందీ లేదు..అప్పట్నించి ఇప్పటి ఈ యాభైఏళ్ల వయస్సు వరకూ.. అయినా ఆమె నామదిలో.. చెప్పాలంటే నా జీవితంలో క్షణికమై శాస్వతమైన ఓ మధురజలదరింపు. అనుకోకుండా చటుక్కున ఎదురయ్యే స్వప్నవాస్తవం. ఈరోజు మళ్ళీ అదే జలదరింపు..

విజయ డయాగ్నిక్ సెంటర్ లో మెడికల్ పరిక్షలకోసం వస్తే అక్కడ కనబడింది..నేను గేట్ లోకి వచ్చేసరికే సరోజ పరీక్షలు పూర్తైనట్లుంది..బయటకొచ్చిలాంజ్ లో కూర్చుంది..కొడుకు కాబోలు..తల్లిపోలిక..ముప్పైల్లో ఉన్నాడు. రిచ్ గానూ మంచిహోదాలోఉన్నట్లు స్పష్టంగా తెలుస్తున్నాడు. దగ్గరకొచ్చాడు. చిన్నగా ఏదో చెప్పి రెక్కపట్టుకున్నాడు. ఆమెలేచింది. నేను తలదించి కళ్ళ చివర్లనుండి చూస్తూనే ఉన్నాను. మళ్ళీ ఎప్పుడు చూస్తానో తెలియదు..క్షణాన్ని వెయ్యోవంతుకూడా వదలకుండా నాలో రికార్డు చేసుకుంటున్నాను..సరోజ మెల్లగా కదిలింది.నిండుగా ప్రౌఢగోదారిలాది.పెద్దబొట్టు.. మెరుపుతగ్గిన పేరుడునెయ్యిరంగు వొంటిఛాయ..జీవితానుభవాలు వెలార్చుతున్న విశాల కన్నులు..డై చేసుకున్నా అక్కడక్కడా కొంగరెక్కల్లా రెపరెపలాడుతూ కనువిందు చేస్తోన్న తెల్లవెంట్రుకలు..వయస్సును దాచకుండా కొంచం వినయంగా వంగినిలబడ్డ విశాలవక్షం..మృదువుగా జారిన ఉదరం..వయస్సుకుతగ్గట్లు నడకలో బరువైన పరిపూర్ణత్వం.

నాకు ఎంతో నచ్చేది..నేను ప్రత్యేకంగా చూసేది..సరోజ నుదురుపైన,పాపిటలోనూ కనిపించే ఎర్రెర్రగాబొట్లు. ఆ రెండుబొట్లను చూడటం నాకెంతో తృప్తికలిగించే ఫీలింగ్..సరోజజీవితం ఎంతో బావుందని నాకు దొరికే జవాబు.

ఈసారికూడా నాకా ఆనందం తృప్తి లభించాయి. ఆమె మెల్లగా నడుస్తోంది. మురిపెంతో అటే చూస్తున్నాను.

మళ్ళీ నాలో ముప్పైఐదేళ్ల క్రిందటి తొలిదృశ్యం.. తోలిచూపు.. పన్నెండేళ్ళ ఆడపిల్ల..ముగ్ధంగా..వాననీటిలో తడిసిన నందివర్ధనం పువ్వులా.. ఎవరీ పిల్ల భలే ఉందే..?!!

అలామొదలైన ఆ అపురూపం తర్వాతివారం మళ్ళీకనబడి నా స్పందనను సుస్థిరం చేసింది..ఈసారి సరోజ వాళ్ళున్న వీధిలోనేఉండే నాఫ్రెండు నానిగాడు చెప్పాడు. “పేరు సరోజరా..వేదా వారమ్మాయి..ఎనిమిదోతరగతి బి సెక్షన్.. వాళ్ళ పెద్దన్న కిశోర్ నా ఫ్రెండే..” చెప్పాడు గాని నాకు తెలిసిందీ, అప్పటినుండి ఇప్పటికి.. ఎప్పటికి గుర్తుంది ఆమె పేరు..సరోజ!!!

అప్పుడు నేను టెన్త్ క్లాసులో ఉన్నాను.. ఆమె రెండేళ్ళు చిన్న..

ఆ తొలిచూపుల అనుభవం అలా నాలో నిబిడీకృతమైంది. అంతకు మించి ఎదగలేదు..అందుకు ప్రత్యేక కారణం

లేదు.. ప్రత్యేక ప్రయత్నమూ లేదు.. మళ్ళా నాలుగేళ్ళ తర్వాత ఓరోజు ఇలాగే చటుక్కున కనబడింది.. బెజవాడ బస్టాండ్ లో..నేను బందరు బస్సు దిగాను. సరోజ బందరువెళ్ళే బస్సు ఎక్కబోతోంది..పరిపూర్ణ యవ్వనంతో.. ఉన్నత మధ్యతరగతి కుటుంబంలో అల్లారుముద్దుగా పెరుగుతున్న ఓ నిండైన యవ్వనవతి.. ప్రయాణంలో

అలసినా ఏమాత్రం బడలిక తెలియని జలపాతం..ఉరికే ఉత్సాహం..పలికే ప్రవాహం..కదిలే నవ్వుల రథం..

అబ్బ.. ఎంతఅందం.. చూస్తే చాలు.. మనస్సంతా పరిమళభరితమై లోలోపల వినిపించే తీయని కూజితం..

ఆమె బస్సెక్కింది.. బస్సు వెళ్ళిపోయింది..

ఢిల్లీ – బందరు మధ్య తిరుగుతున్నరోజుల్లో ఓ రోజు మళ్ళీ సరోజ కనపడింది..

ఈసారి దాదాపు ఏడాదితర్వాత కనపడటం..బెజవాడ అమ్మవారి గుడిదగ్గర..కొండమీద..కొందరు మిత్రురాళ్ళతో కబుర్లు చెప్పుకుంటూ నా కంటపడింది. కాస్త ఆగి మరింత వివరంగా చూశాను..యవ్వనోల్బణం నిండా ఆక్రమించిన శరీరం ఆమెను గొప్ప అందగత్తెగా మలచిందేమో .. నడచే అందాల విరితోటలా ఉంది సరోజ.. ఎంత రొమాంటిక్ గా ఉందీ!

“దిక్కులు చూస్తావేరా..క్యూలోకి పద” అక్క పిలవడంతో ముందుకు సాగిపోయాను. ఆలోచన అక్కడే ఆగి పోయింది. మళ్ళీ ఏడాదితర్వాత బందరు కోనేరు సెంటర్ దగ్గర చూశాను..షాపింగ్ పూర్తయ్యి రిక్షా ఎక్కుతోంది. ప్రక్కన వాళ్ళమ్మగారు..మళ్ళీ నాలో అదే స్పందన..

అలా సరోజ అప్పుడప్పుడూ కనిపిస్తూనే ఉంది.. నాలో సంస్పందిస్తూనే ఉంది..

సరోజ..నా కల..నాకు మాత్రమే పరిమితమైన కల..ఎప్పుడూ నాకు కావాలని నేను ఆమెను ఆరాధించలేదు. ప్రేమించలేదు...పెళ్ళి చేసుకోవాలని స్పష్టంగా అనుకోలేదు..కాకపోతే అప్పుడప్పుడు కనపడినప్పుడు నాలో అదో రసప్లావితం.. ఓ మధుమాసం..

తర్వాత చాలా సార్లు.. మళ్ళా ఇప్పుడు..

కొడుకు కాస్త ముందు నడిచాడు. వెనక సరోజ అలాఅలా నడచి కారుదగ్గరకు వెళ్ళింది.. కొడుకు డోర్ తీసాడు..

మెల్లగా వంగి కారులోపలి వెళ్ళింది..నా ఊపిరి కళ్ళలోచేరి ఆమె ప్రతి కదలిక రికార్డ్ చేసింది.. కారు కదిలింది..

దూరంగా మలుపుతిరిగి మాయమైంది..ఓసారి కళ్ళు మూసుకున్నాను..నా ఊపిరి మళ్ళా లబ్ డబ్ మని

కద లాడింది...అదేదో ఉత్సాహం..హుషారు.. తెలియని ఏదో పరిమళం..

అయితే ఈసారి సరోజ నాలో ఎప్పటిలా కనిపించి మధురిమల పరిమళాలను మరోమారు కదిలించి మరో పని లో పడగానే ప్రక్కకు పోలేదు..ఆరోజంతా అలా సరోజ మొత్తంగా కనిపించిన సంఘటనలన్నీ గుర్తుకొస్తున్నాయి.

డిల్లీలోఫారెన్ ట్రేడ్ లో డిగ్రీచేసి అమెరికా వెళ్ళిపోయాను. ఎనిమిదేళ్ళు విదేశాలలో ఉన్నాను..ఎప్పుడైనా వచ్చి నా మా కుటుంబం హైదరాబాద్ కు మారడంతో బందరు వెళ్ళడం జరగలేదు.. విదేశాల్లో ఉద్యోగాలు కట్టిపెట్టి హైదరాబాద్ లోనే ఎక్స్ పోర్ట్, ఇంపోర్ట్ వ్యాపారంలో నా స్వంత కన్సల్టేషన్ నిర్వహిస్తున్నాను..

దాదాపు ఎనిమిదేళ్ళ తర్వాత మళ్ళీ అనుకోకుండా హైదరాబాద్ లోసరోజ కనబడింది..

కూకట్ పల్లిలో ఓస్కూలు ముందుగా కారులోవెళుతుంటే యధాలాపంగా కనిపించింది.. చటుక్కున ఎవరో వీపుమీద చరచినట్లుగా ఉలిక్కిపడ్డాను..సరోజ!!..సరోజే! అరె..అవును..సరోజే..ఆ స్కూల్ ముందు నిలబడి

ప్రక్కనున్న మరో మహిళతో కబుర్లుచెబుతోంది..అలా చూస్తూ ఉండిపోయాను..వెనక కార్ల హారన్..నాకు సరోజ తప్ప ఏమీ కనపడటంలేదు..వినపడటంలేదు..ఆమెనే చూస్తున్నాను..ఇది కలా నిజమా.. ఎన్నేళ్ళ తర్వాత చూస్తున్నాను? ఎనిమిదేళ్ళ తర్వాత..

మనిషిలో అందం మరింత పెరిగింది..నిండుగా విరగ కాసిన మామిడితోటలా..కొంచం ఒళ్ళు చేసినా నాజుకు తగ్గలేదు..అన్యోన్యమై అనురాగ పూరితమైన సంసార జీవితానికి ప్రతీకలా..యువ ముత్తైదువులా..పండుగలో అలంకరించిన గుడి కలశంలా నిండుగా పవిత్రంగా ఉంది..

నన్ను మరీఆకర్షించింది..గతంలోలేనిది ఇప్పుడు ప్రత్యేకంగా నా దృష్టిని ఆకర్షించించిందీ ఆమె ముఖాన రెండు బొట్లు.. సో..సరోజకు పెళ్లయ్యిందన్నమాట.. ఆఎర్రెర్రని బొట్లు శోభాయమాన మైన ఆమెజీవితాన్ని నాకు చెప్పక నే చెప్పాయి..ఆమె జీవితం సంతోషంగానే సాగుతున్నట్లు నాకు స్పష్టంగా తోచింది..ఆ భావన నాకెంతో ఆనందాన్ని తృప్తిని ఇచ్చింది. సరోజ ఇక్కడ ఉన్నదంటే పిల్లలు ఈ స్కూల్లో చదువుతున్నారన్న మాట..ఈ దగ్గరలోనే నివాసం కాబోలు నాఆలోచనలను భగ్నంచేస్తూ కారుచుట్టూ గోలగోల.. అప్పుడే స్కూల్ విడిచారు.. బిలబిల మంటూ పిల్లలే పిల్లలు..కారు చుట్టుముట్టారు.. నాలో ప్రెషర్ పెరిగిపోయింది. వెనక ముందూ హారన్ల గోల..కారు కదపక తప్పలేదు.. స్టీరింగ్ పట్టుకునే అటు సరోజ వైపు చూశాను..ఓమగపిల్లాడు స్కూల్ యూనిఫోరంలో ఉన్నాడు..తల్లికి.. సరోజకు ఏవేవో ముద్దు ముద్దుగా చెబుతున్నాడు.సరోజ నవ్వుముఖంతో వింటూ స్కూల్ బాగ్ తనభుజానికి తగిలించుకుని ముందుకు తీసుకుపోతోంది.. వెంట వెళ్లి ఇల్లు, భర్త వివరాలు పట్టుకుందా మనుకున్నాను.. కాని కారు ముందుకు పోక తప్పలేదు.. ఆమె వెనక్కు సాగిపోయింది..దూరంగా మలుపు తిరిగి అదృశ్యమైంది..

ఈసారి సరోజ కేవలం చూసిన కాసేపే కాకుండా ఆ రోజంతా వెంటాడింది.. ఆమె జీవితం చాలా చాలా హాపీగా ఉన్నట్లే.. ఆమె నాకు కనీసం పరిచయంకూడా లేక పోయినా ఆమె బావుండాలని గట్టిగా కోరుకుంటూ అలా ఆమె ఉన్నప్పుడు సంతోషంతో పొంగిపోవడం ఓ వైచిత్రే.. ఆతర్వాత ఆరోడ్డులో ఆ ఏరియాలో చాలాసార్లు తిరిగాను..అటూఇటూ రెప్పవెయ్యకుండా సందులు గొందులు చూశాను సరోజ కనిపిస్తుందని.. నా కోరిక తీరింది. ఓరోజు స్కూటర్ పై జంటగా.. సినిమాలో ఓ రొమాంటిక్ జంట డూయేట్ పాడుతూ సాగిపోయే సీన్ లాంటిది చూశాను..సరోజజంట స్కూటర్ పై కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటూ నా కళ్ళముందు వెళ్ళడం నాకెంతో మురిపెంగా గోచరించింది. సరోజ దంపతులు అన్యోన్యంగా ఉన్నారు..చాలు..హేపీ...అతనెలా ఉన్నాడు..ప్చ్.. అనవసరం..సరోజ హేపీగా ఉంది..అది ముఖ్యం..

తర్వాత రెండేళ్ళ తర్వాత అనుకుంటాను.. ఓ పాపను ఎత్తుకుని ఇండస్ట్రియల్ ఎక్షిబిషన్ లో కనిపించింది.. ప్రక్కన భర్త..అతనిచేతిలో కొడుకు చెయ్యి..సరోజఫ్యామిలీ..బాగుంది.. తర్వాత ఓముసలమ్మను నడిపిస్తూ అపోలో హాస్పటల్ దగ్గర కనబడింది..బహుశా అత్తగారేమో! పెద్దవారిని బాగానే చూసుకుంటుందన్నమాట.. భేష్.. తర్వాత ఓ కాలేజ్ దగ్గర కనబడింది.. ఏదో పరీక్ష సెంటర్.. కూతురు పరీక్ష రాస్తోందేమో.. ఇంకోసారి ఓ హోటల్లో కూతురు,కొడుకుతో తింటూ కనపడ్డారు.. భర్త అక్కడలేడు..బహుశా వాష్ రూమ్ కు వెళ్ళాడేమో.. అలా చాలాసార్లు అక్కడక్కడా..అప్పుడప్పుడూ..విభిన్నవయస్సులలో..వివిధఋతువులలో..విభిన్న ప్రదేశాలలో సరోజ కనిపిస్తూనే ఉంది..

ఇప్పుడు ఇలా హాస్పటల్ దగ్గర కలిశాక మాత్రం వొక్కసారి సరోజను కలిసి మాట్లాడాలి.. ఆ జంటను ఇంటికి పిలిచి గౌరవించి బట్టలు పెట్టాలి.. బావుంది..కాని అసలుపరిచయమే లేదే..ఎలా..ఎలాగో అర్థంకాలేదు..

అనుకోకుండా ఆ అవకాశం నా ఆఫీసుకే వచ్చింది..

**విశ్వనాథ్ చెప్పాడు**

ఆఫీసు కేబిన్లో ఫోన్లో మాట్లాడుతున్న రంగనాథ్ ని మొదటిసారి చూశాను. పాతికేళ్ళుగా విదేశీ వ్యాపారంలో అగ్రగామి కన్సల్ టెంట్ గా వెలుగొందుతున్న రంగనాథ్ అనుకున్నదానికంటే మరెంతో హుందాగా ఆత్మీయంగా అనిపించాడు. ఓ ప్రాబ్లెం పట్టుకుని కలిశాను..మా సమస్య చిన్నదేనని.. తప్పకుండా క్లియర్ చేస్తామని భరోసా ఇచ్చారు..చాలా హేపీగా అనిపించింది. నిజానికి నేను ఆయన్ను కలిసింది నా వ్యాపార సమస్యమీద కాదు.. అదొక వంక..అరుణత్త రంగనాథ్ గురించి నాచెవిలో వేసింది. కలిసి మాట్లాడి నీ అభిప్రాయం చెప్పు

అంది. అరుణత్త, అమ్మ ఒకేమనస్సు..ఒకేబుర్ర..ఒకేచోట పుట్టి ఒకేచోట పెరిగి..స్కూలు కాలేజి.. ఇప్పుడు కాపురం కూడా ఒకే చోట.. అంతేకాదు ఇద్దరి పెళ్ళిళ్ళు కాస్త అటో ఇటో గా ఒకే టైంలో జరిగితే.. ఇద్దరి భర్తలు కూడా అలాగే మరణించారు. .నాన్నప్రభాకర్ యాక్సిడెంట్ లో పోతే ఆమె భర్త బలరాం అంకుల్ హార్ట్ ఎటాక్ తో పోయారు.. ఇది పదేళ్ళనాటి మాట..ఇప్పుడిప్పుడే ఇద్దరు కాస్త తెరిపినపడ్డారు..నాన్నపట్ల అమ్మకున్నది కేవలం 'తాళి కట్టిన భర్త' .. అంతే.. అని తెలిశాక నోరువెళ్ళబెట్టడం నా వంతయ్యింది.. నిజమే.. నాన్న పెద్ద లంచగొండి.. దృష్టి ఎప్పుడూ డబ్బుమీద..ఆస్తులు కూడబెట్టడంమీద..మనుష్యుల మధ్య అనుబంధాలు, ప్రేమలు తక్కువ. అమ్మ ఆయనతీరు మాకుచెబుతూ అది ఎంతతప్పో వివరిస్తుండేది..ఆయనచేసిన వొకేవొక్క మంచిపని అమ్మ ను బొట్టుగాజులు తీయొద్దని చెప్పడం..చెప్పకపోయిన అమ్మ తీసేదికాదని ఇప్పుడు అనిపిస్తోంది. అత్త కొడు కు ప్రసాద్ తో ఇదేచెబితే "మా అమ్మది కూడా ఇలాంటి అభిప్రాయమేన"న్నాడు..అమ్మ, అరుణత్త ఎంత ఫ్రెండ్సో నేను ప్రసాద్ కూడా అంతే..ప్రతిదీ ఇద్దరం చెప్పుకుని చేస్తుంటాం. ఇద్దరం అమెరికాలో చదువుకున్నాం.. అక్కడే ఉద్యోగాలు చేశాం.. వొంటరిగా ఉన్నతల్లుల కోసం జన్మభూమికి వచ్చేశాం..ఇప్పుడు ఇద్దరూ కాస్త బెటరయ్యాక ప్రసాద్ కో ఐడియా వచ్చింది. చెప్పింది విన్నాక నాగుండెలు అదిరాయి..అప్పుడు రాజుగార్ని పరిచయం చేశాడు.. రాజుగారు పెద్దలకుపెళ్ళిళ్ళు చేసే..అంటే పెద్దవయస్సులో కబుర్లు చెప్పుకోడానికి తోడు సమకూర్చే సేవ చేస్తున్నాడు ఓ సంస్థద్వారా.. ఇలాంటి సంస్థలు, మనుష్యులు ఉన్నారనికూడా నాకు తెలియదు. అప్పుడు చెప్పాడు చెవిలో.. "మీ అమ్మ, మాఅమ్మ ఈసంస్థలో సభ్యులు" అని..వోర్నాయనో..ఆసంస్థ మీటింగ్ కు వెళ్ళి రాజుగారి స్పీచ్ విన్నాను..ఎలాంటి వాళ్ళనైనా మళ్లి పెళ్ళికి వొప్పించగలడాయన..ఎనభై ఏళ్ల వాళ్ళను కూడా పెళ్లి చేసుకోడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన చెబితే నోరు వెళ్ళబెట్టడం నావంతయ్యింది. నా మొత్తం ఆలోచనే మారిపోయింది. నిజమే.. వొంటరితనం పెద్ద శిక్షే..రతన్ టాటాగారికి.. వెంకట్రావుగారికి.. రిక్షారంగయ్యకూ.. ఏస్థాయి వాడికయినా కష్టమే..అరుణత్తకు అమ్మకు మరో ఆలోచనరావడం..ప్చ్..చాలా తర్జనభర్జన పడ్డాను.. ప్రసాదూ కూడా ఆలోచిస్తున్నట్లంది. మేమిద్దరం వారం వరకూ దీనిపై మాట్లాడుకోలేదు.."నిజమేరా..నాన్నవల్ల అమ్మ ఏం సుఖపడింది? రోజూ తప్పతాగి వచ్చేవాడు.. కక్కుకున్న బట్టలు తీయడం..ప్చ్..పెళ్ళిచేసుకున్న పాపానికి ఆవిడ నరకబాధ నాకు తెలుసు..ఇప్పుడైనా ఆవిడవొప్పుకుంటే..తప్పకుండా మంచివ్యక్తితో..కనీసం సాయంకాలం కాస్తకబుర్లు చెప్పేవ్యక్తీ చాలు. అమ్మను కాళ్ళుపట్టుకుని వొప్పిస్తారా..వరే విశ్వా..నువ్వు కొంచం నాకు మోరల్ సపోర్ట్ ఇవ్వాల్రా.. విమల ఏమి చెప్పలేకపోతోంది.." అన్నాడు. వాడికి ఎలాగూ సపోర్టుచేస్తాను.. సరే.. నా ఆలోచన మాఅమ్మ గురించి..

ఆ సమస్య అరుణత్త తీర్చింది..రంగనాథ్ ప్రస్తావన ఆమెతెచ్చింది.. మా బందరువాడే..మావారుపోయినప్పుడు కూడా వచ్చాడు..చిన్నప్పట్నుంచి మీ అమ్మకు ఇష్టం.. మీ కిషోర్ మావయ్య కు నాని అని ఫ్రెండ్ ఉన్నాడులె.. ఆ నానికి రంగనాథ్ ఫ్రెండు..ఆ నాని వీళ్ళ పెళ్ళికి ప్రపోజ్ చేశాడు..అది బహుశా ఆయనకు తెలీదు.. అప్పుడు మీతాతగారు కిషోర్ ఇద్దరూ ఆయన్నుచూసారు..కాని వాళ్ళు శూద్రులుకావటాన ప్రపోజల్ ముందుకెళ్ళలేదు. అప్పట్నుంచి ఆయన మీఅమ్మకు అప్పుడప్పుడు కనిపిస్తూనే ఉన్నాడట..ఈమధ్య మెడికల్ టెస్టులకు వెళ్ళి నప్పుడు కూడా కనిపించాడట.. ట్రై చెయ్యరా.." అంది.

అలా రంగనాథ్ గారిని కలిసి చూసి సంతోషించాను..రెండోసారి ఇప్పుడే కలవడం.. "థాంక్యు సర్.. చెక్కు రిలీజ్ అయ్యింది.. థాంక్యు వేరీమచ్.." అన్నా. ఆయన నవ్వుతూ చెయ్యి కలిపి కాఫీ తెప్పించారు. కబుర్లలో 'మా స్వస్థలం బందరు' అన్నా..గాలానికి చిక్కాడు.. "అలాగా..మాది బందరే.. ఎక్కడ చదివారు..ఏ స్కూలు?" జవాబు చెప్పకుండా "మీకు బందరంటే మహా ఇష్టం అనుకుంటా..ఎందుకు సర్?" ఆయన హాయిగా అరగంట ఉపన్యాసం.. ఈలోగా కొంచం ప్రిపేరయ్యా.. వింటూ ఫోన్ చేశా..ఆయన తన్మయత్వానికి బ్రేక్ వేస్తూ "మా అరుణత్త మీకు తెలుసు.. బలరాం మీ హైస్కూల్ క్లాస్మేట్ ..ఆయన వైఫ్.. మీ హిందుకాలేజి లెక్చరర్

కామేశ్వరరావ్ మాష్టారి అమ్మాయి..అరుణ..మాట్లాడండి..” ఆయన దిగ్భ్రమలోంచి కోలుకోకుండా ఫోను అందిస్తూ అన్నాను.. “బైదిబై.. నేను.. మా అమ్మ.. సరోజ!! ”

**సరోజ చెప్పింది...**

అరుణ పెళ్లికి ఒప్పుకోవడం నాకెంతో ఆశ్చర్యంగా ఉంది.. పెళ్లి ఘనంగా చేశాడు దాని కొడుకు ప్రసాద్.. అతనికి పూర్తి తోడు మా విశ్వనాథ్.. నా కొడుకని చెప్పడం కాదుగాని నిజంగా ఐయాం ప్రౌడ్ ఆఫ్ విశ్వ.. వాడ్ని చూస్తే గర్వంగా ఉంది.. పెళ్లిసంబరం పూర్తయ్యాక అందరిని పంపించేసి పిల్లలిని తన కారులో తీసుకెళ్ళమని సుప్రియ కి ఆర్డరు వేసి నన్ను వాడి కారులో ఎక్కించుకున్నాడు..

కారు డ్రైవ్ చేస్తున్న విశ్వనాథ్ చాలా ఇబ్బందిగా కదులుతున్నాడు..అరుణ పెళ్లి నిర్వహించిన అలసటా..లేకపోతె పెళ్లిపందిరిలో తెలిసినవారంతా నన్ను ఏవేవో ప్రశ్నలువేసి విసిగించడం వీడిని బాధపెట్టిందా!? అక్కడికీ నాలుగైదుసార్లు నా దగ్గరకొచ్చి అనునయంగా “మమ్మీ వీళ్ళ మాటలు పట్టించుకోకు.. నువ్వు హర్ట్ అయితే నేను చాలా అప్ సెట్ అవుతాను..” అన్నాడు.. “అబ్బే.. ఇవన్నీ సహజం..అరుణ పెళ్లిదగ్గర నాతొ అలా మాట్లాడటం..నువ్వూ పెళ్లి చేసుకోవచ్చుకదా అనడం సహజం..నువ్వేమీ అనుకోకు నాన్నా” అంది.. కోడలు సుప్రియ కూడా ఇదే పదిసార్లు అడిగింది.. సుప్రియ మొగుడి ముఖంచూసి మోకాలునొప్పి చెప్పగల పతివ్రత..

అయితే నా ముఖంలో తెజరిల్లుతున్న సంఘర్షణ నా పిల్లలు గుర్తించడం ఆశ్చర్యంగా ఉంది.. అపరాజిత కూడా అలాగే అడిగింది.. “ఏంటి మమ్మీ ..అదోలా ఉన్నావ్.. ఎవైంది.. తలనొప్పా?.. గిరితో టాబ్లెట్ తెప్పించనా..??”

“ఛ.. నాకేం కాలేదు..వెళ్ళు.. వెళ్లి భోజనాలు ఎలా జరుగుతున్నాయో చూడు” అన్నాను..అది ఏమీ మాట్లాడ లేక వెనక్కి వెనక్కి తిరిగి చూస్తూనే వెళ్ళింది..

విశ్వనాథ్ అరచిన అరుపుతో ఉలిక్కి పడ్డాను..కారుకు ఎవరో అడ్డువచ్చారు..పెద్దగా అరుస్తున్నాడు..అడ్డొచ్చిన వాడు తప్పుకున్నా డ్రైవ్ చేస్తూ వాడిని తిడుతూనే ఉన్నాడు..“అరె..ఏవిట్రా అంత అసహనం.. కారుకు మనుష్యులు అడ్డురావడం సహజం..నువ్వేమిటి..ఎప్పుడూ చూడ్లేదు..ఈ అరుపులు..కేకలు?” నిజంగానే వాడిలో ఇంత అసహనం ఎప్పుడూ చూడలేదు. వాడు ఏదో లోలోన పిసుక్కుంటున్నాడు. “నాతో ఏదన్నా చెప్పాలంటే చెప్పు.. ఏమీ అనుకోను..అంతేగాని అందరిమీద చిరాకుపడకు” అన్నాను.. వాడు మౌనంగా డ్రైవ్ చేస్తున్నాడు పావుగంట.. అరగంట.. ఇంటిదగ్గరగా వచ్చాం.. కారు స్లో చేశాడు.. “జేబులోంచి ఓ ఫోటో తీశాడు..”మమ్మీ .. ఈయన.. ఈ ఫోటో అరుణత్త ఇచ్చింది.. ఈయన నీకు బాగా తెలుసనీ.. నువ్వు ఒప్పుకుంటే మీ ఇద్దరికి పెళ్లి చెయ్యాలని.. చూసి నీ అభిప్రాయం చెప్పు”

వాడి చెయ్యి చాచడంతో ఆఫోటో నా కళ్ళ ముందుకొచ్చింది..

అ ఫోటో లో వ్యక్తీ రంగనాథ్!!

★★★

వెంకటేశ్వరస్వామి కోవెల.. ఉదయం పదిగంటలు దాటడంతో అప్పుడే వేడెక్కుతున్నఎండ ఆ మహా మండపం లోకి ఏటవాలుగా పడుతోంది.. చల్లగాలితోకలసి కొబ్బరాకుల నీడ నా పారాణికాళ్ళను తాకుతోంది.. నాదృష్టి కొత్తగా తొడిగిన కాలి మెట్టెలపై ఉంది..పాతికేళ్ళ క్రితం తొలగించిన మెట్టెలు..మళ్ళీ కాలివేలిని అలంకరించాయి..

ఒళ్ళంతా పసుపుకుంకుమ వాసన..వొద్దన్నా వినలేదు పిల్లలు..ఇదొక్కటి ఇదొక్కటి అంటూ పెళ్లి సంబరాలన్ని జరిపించారు.. కాకపోతే గుళ్ళో పెళ్లి.. ప్రక్కనకూర్చున్నా తగిలితగలకుండా కూర్చున్నాడు రంగనాథ్.. ఇంకా దిక్భ్రమ లోంచి కోలుకున్నట్లు లేదు.. విశ్వ

కలిసిన దగ్గరనుండి అన్ని చాలావేగంగా జరగడం..నేనిలా భార్యగా పక్కన కూర్చోవడం..పాపం..ఊహాతీతంగా ఉందనుకుంటా..కిశోర్ అన్నను, ఇద్దరి కామన్ ఫ్రెండ్ నానిని అరుణత్త పిలిపించింది..ఇరువైపులా సమాలోచనలు జరిపారు..పెళ్ళి పెత్తనం వాళ్ళదే..ఇవ్వాళ చాలా హుషారుగా మళ్లి కుర్రవాళ్ళలా పెళ్లితంతు జరిపించడం..భలే థ్రిల్లింగ్గా ఉన్నట్లుంది వాళ్లకు..డైనింగ్ హాలో తింటున్నారేమో..

మనవలు మనవరాళ్ళు పరిగెత్తుకొచ్చి ఇద్దరిని చుట్టేశారు..''హాయ్ అంకుల్" అన్నాడు పెద్ద మనవడు కార్తీక్.. రంగనాధ్ తో. నవ్వి "నో..అంకుల్ కాదు..తాత..తాత అనాలి..ఈవిడ నీకు నానమ్మ కదా..నేను ఆవిడ భర్తను కదా..అంటే తాతను కదా.." అన్నాడు..వాడు ఆలోచించి "అవును.. మీరు తాత.. తాతే.. హాయ్ తాతా.." అని పరిగెత్తాడు.. ఇద్దరు నవ్వారు.. అప్పుడన్నాడు రంగనాధ్..''కరక్ట్ గానే చెప్పానా..నువ్వు నాకు భార్యవే కదా.."

అబ్బా..ఇంకా సందేహంలోనే ఉన్నట్లున్నాడు..మోచేత్తో పొడిచాను..అప్పుడు గుర్తొచ్చింది..ఎప్పటినుంచో అడగాలనుకున్న మాట.. అసలు ఆ సంగతి తెలిశాకే కదా పెళ్ళికి వొప్పుకున్నది..

"మీరు .. అసలు ఇంతవరకు పెళ్లి ఎందుకు చేసుకోలేదు??"

**రంగనాధ్ అన్నాడు..**

"ఏమో..తెలీదు..జస్ట్..చేసుకోలేదంతే.." జరిగిందంతా చూస్తె నెత్తిమీద పాలుపోయడం .. శ్రావణబెళగోళ లో బాహుబలికి పోసినట్లు..దిమ్మతిరిగిపోయేలా పోశారు.. ఆ రోజు అరుణ పెళ్లిప్రస్తావన తేవడంకన్నా కూడా నలభై యేళ్ళుగా సరోజను ఎప్పుడు చూసినా ఆమె నన్నుకూడా చూస్తోందని గ్రహించలేకపోవడం.. అది.. అది మరీ ఆశ్చర్యంగా ఉంది.. అమ్మో ఆడవాళ్ళు.. ఎంత డేంజర్!! .. ఆమె చేతివేళ్ళలోకి నావేళ్ళుపోనిచ్చి గట్టిగా పట్టుకున్నా.. "క్లియర్ గా లేదు కాని ఏమూలో నీమీద ప్రేమ భావన ఉన్నదేమో.."

**రచయిత ముక్తాయింపు..**

ఇంత ఈజీగా పునర్వివాహాలు.. మలిదశ పెళ్ళిళ్ళు .. ఎదిగిన పిల్లలు చెయ్యడం..ఆ తల్లులు హేపీగా వొప్పు కోవడం.. కందుకూరి వీరేశలింగం, రఘుపతి వెంకటరత్నం నాయుడు చూస్తే ఆనందిస్తారు కాని ఆశ్చర్యపోతారేమో.. !!

## లేఖలు — విద్యార్థి

New York

01:00AM, మార్చి 11, 2020

ఎందుకో, ఫోనులో నీతో మాట్లాడిన ఐదు నిమిషాలకే మళ్లీ మాట్లాడాలనిపించింది. ఫ్లైట్‌లోకి అప్పుడే వెళ్లి ఉంటావు. ఇంకొక 24 గంటలలో నా ఎదురుగా ఇక్కడ ఉంటావని కూడా తెలుసు! అయినా మళ్లీ నీతో ఒక్కసారి మాట్లాడాలనిపించింది.

ఈ ఐదు నిమిషాలలో ఎన్నో గుర్తుకు వచ్చాయి. మొదటిసారి నేను నిన్ను చూసినప్పుడు నీ తలలోని చామంతి పూలని చూసి, “ఇదిగో చామంతి పూలమ్మాయి” అని పిలిచినప్పుడు నువ్వు నన్ను చూసిన కొరకొర చూపులూ; సమయం అయిపోయిందని మేము మెడికల్ కాంపు మూసివేస్తుంటే నువ్వు గభాలున నా చెయ్యి పట్టుకుని నన్ను తీసుకువెళ్లి బిడ్డ వైద్యం కోసం ఉదయం నుండి వేచి చూస్తున్న నిర్భాగ్యురాలి ముందు నిలబెట్టటమూ; ఇంకా ఎన్నో గుర్తుకువస్తున్నాయి. ఆ రోజు మీ వలంటీర్లందరూ కలసి పెట్టిన మెడికల్ కాంపు ఎంత మందికి ఉపశమనం ఇచ్చిందో తెలవదు కానీ, నువ్వు నా చెయ్యిపట్టుకున్నప్పుడు, తెల్లవారు ఝామునుండి పడిన శ్రమకు, అలసటకు నాకు ఉపశమనమిచ్చింది. నాకు ఆ చెయ్యి మళ్లీ కావాలి. పదమూడు సంవత్సరాల నాటి ఆ రోజు ఈ నాటికి కూడా కళ్లకు కట్టినట్లు కనబడుతున్నది. ప్రతి క్షణమూ నీకోసం ఎదురు చూస్తున్నాను. ఇంకెంత? ఇంకొక 24 గంటలు.

నువ్వు వస్తున్నావని వచ్చే రెండు వారాలు శలవు పెట్టానని ఇప్పటికే వేల సార్లు చెప్పి ఉంటాను. అందుకే, ఈ రెండు వారాలు సర్జరీలు ఎక్కువయ్యాయి. అలసటగా వుంది. మరి రేపు ఎయిర్‌పోర్టులో నువ్వు కనబడగానే నీ చెయ్యి పట్టుకుంటాను, అప్పటికిగానీ నా అలసటకు ఉపశమనం దొరకదు.

నీ చేయి అందుకోవాలని నేను చేసిన మొదటి ప్రయత్నం నీకు గుర్తు లేకుండా ఉండదు. మీ కాలేజీలో జరిగిన అఘాయిత్యానికి నిరసనగా నువ్వు పోరాడుతున్నప్పుడు, నేను కూడా నీ కోసం వచ్చాను. ఎందుకో, పోలీసు దెబ్బలు నా మీదే పడ్డాయి. నీ స్నేహితురాళ్లతో కలసి పోలీసులకి అడ్డంపడి నన్ను తప్పించి, రక్తం కారుతున్న నన్ను మా కాలేజీ హాస్పటల్‌కే తీసుకు వస్తున్నావు. ఇంతలో ప్రక్కనున్న ఇరానీ హోటల్ నుండి కిషోర్ కుమార్ పాట.

यूँ तो अकेला भी अक्सर
गिर के संभल सकता हूँ मैं
तुम जो पकड़ लो हाथ मेरा
दुनिया बदल सकता हूँ मैं
माँगा ह□तुम्हें
दुनिया के लिए
अब खुद ही सनम फ□सला कीजिये
ओ मेरे दिल के च□

ఔను, ఎప్పుడన్నా నేను పడిపోతే నా అంతటకు నేను లేవగలను, కానీ నువ్వు చెయ్యి అందించితే ప్రపంచాన్నే మార్చగలను! అందుకే కదా నీ చెయ్యి కావాలనేది. మరి విధాత ఎలా రాస్తాడో.

ఎందుకో ఆ పాట వినగానే నీ చెయ్యి పట్టుకోవాలనిపించింది. నలుగురిలో, రోడ్డు మీద నీ చెయ్యి పట్టుకోబోయానని నీకు ఎంత కోపం వచ్చింది?

మరి, రేపు ఎయిర్‌పోర్ట్‌లో అందరిలో చెయ్యి పట్టుకున్నాని విదిలించుకోవు కదా! ఇప్పుడు మనకి పెళ్లయ్యింది కదా! మరి నేను నిన్ను చామంతి అని పిలిస్తే విసుక్కోవు కదా?

ఏమో, ఈ ఉత్తరాలు రాయటం నువ్వు నాకు చేసిన అలవాటే. ఈ కాలంలో ఉత్తరాలు రాసుకునే వాళ్లు ఇంకెవరు ఉంటారు? నావి పెద్ద పెద్ద ఉత్తరాలు. నువ్వు మాత్రం రెండంటే రెండు మాటలు వ్రాసి, నీ తలలోని చామంతి పువ్వుల రేకులు ఉత్తరం మడతలలో పెట్టి పంపించుతావు. అదేమిటని నేను అడిగితే, “ఉత్తరంలో పెట్టినది చామంతి పువ్వు కాదు, నా మనసు, అంతకంటే ఏమి కావాలి” అని అన్నావు. అంతేగా, అంతేగా ..., ఎప్పటికీ నీదే ఆఖరి మాట, పై మాట కూడాను. రేపటి నుండి నాకు ఆ ఉత్తరాలు ఉండవు కదా! ఇప్పుడు వ్రాసే ఉత్తరం ఎక్కడికీ వెళ్లదని తెలుసు. అలవాటు. రేపు నీ చేతికే ఇస్తానులే!

రేపు నీ ఫ్లైట్ ఇక్కడికి వచ్చేటప్పటికి గురువారం రాత్రి అవుతుంది. నేను హాస్పటల్ నుండి నేరుగా వస్తాను. నువ్వు నా చెయ్యి పట్టుకుంటావు కదూ? శుక్రవారం కూడా శలవు పెట్టాను. కానీ, మన కథ ఇక్కడ మా నర్సింగ్ స్టాఫ్ అందరికీ తెలుసని ముందే చెప్పాను కదా! మా నర్సమ్మలందరూ నిన్ను తప్పకుండా శుక్రవారం ఒకసారి తీసుకురమ్మన్నారు. నిన్ను చూడాలంట, నీతో నా మీద బోలెడు చాడీలు చెప్పాలట.

నేను క్రిందపడితే ఒక్కడినే లేవగలను, కానీ నువ్వు చెయ్యి అందిస్తే ప్రపంచాన్నే మార్చగలను.

ओ मेरे दिल के चम

ప్రతి క్షణం నీ కోసం ప్రతీక్షణ. నీ చేతి స్పర్శ కోసం ఎదురు చూస్తూ ...

====================

0130 AM, మార్చి 12, 2020

నిన్న మూడవ సర్జరీ పూర్తవ్వగానే మా హాస్పిటల్ చీఫ్ న్యూయార్కులో కోవిడ్ కేసులు ఎక్కువ అవుతున్నాయి, గవర్నర్ హాస్పటల్స్ అన్నీ తయారుగా ఉండాలని చెప్పాడని, అందుకని కొత్త డ్యూటీ పోలసీ మొదలు పెడుతున్నాని చెప్పాడు. రెండు వారాలు రెండు టీంలు హాస్పటల్ లోనే ఉంటారు. ఈ రెండు వారాలు హాస్పటల్ స్టాఫ్ ఎవరూ బయటకి వెళ్లటానికి వీలు లేదు. ఆ తరువాత ఇంకొక రెండు మెడికల్ టీంస్ వస్తారు. మా సర్జన్స్‌కి కూడా ఎమర్జన్సీ రూం డ్యూటీ ఉంటుందని కూడా చెప్పారు. నేను ఇప్పుడు హాస్పటల్ లోనే ఉన్నాను కాబట్టి, నన్ను ఇంకొక రెండు వారాలు కొనసాగించమన్నారు. నాతో పాటు ఇంకొక టీం కూడా ఉన్నది. ఒకొక్కరిదీ పన్నెండు గంటల షిఫ్ట్. ఆ తరువాత రెండు వారాలు ఎవరింటిలో వాళ్లు క్వారంటైన్‌లో ఉండాలి.

ప్చ్, నిన్ను ఎయిర్‌పోర్టు నుంచి నేనే తీసుకువద్దామనుకున్నాను. ఈ రకంగా కోవిడ్ మనలని కలవకుండా దూరం చేస్తోంది. కానీ, నువ్వేగా నాకు చెప్పింది, "కత్తి పట్టితే సైనికుడు యుద్ధానికి తయారుగా ఉండాలి, స్తెతస్కోప్ పట్టితే డాక్టర్ పేషంట్స్ వ్యాధులు

తగ్గించాటానికి సిద్ధంగా ఉండాలి" అని. నువ్వు పరిస్థితి అర్థం చేసుకుంటావని తెలుసు. అయినా ఈ వాతావరణంలో, ఇక్కడకు క్రొత్తగా వచ్చే నిన్ను హాస్పటల్ నుండి ఏవేవో రోగాలు తీసుకువచ్చి, వాటిని నీకు కట్టిపెట్టకుండా జాగ్రత్త తీసుకోవాలి కదా!

కులం అహంకారంతో మీవాళ్లు, కట్నం డబ్బు పేరాశతో మా వాళ్లు మన పెళ్లిని 12 సంవత్సరాలు ఆపారు. పెద్దవాళ్లకు నచ్చ చెప్పిన తరువాతే మన పెళ్లి, అలా అయితేనే అందరికీ ప్రశాంతత అని నువ్వేగా చెప్పింది. క్రితం సంవత్సరం నేను నెల రోజులు శలవు పెట్టి వస్తే, అందరికీ నచ్చ చెప్పేటప్పటికి సమయం గడిచిపోయింది. ఆఖరు రోజున మన పెళ్లి. ఇంకెంత, త్వరలోనే వచ్చేస్తానుగా అని చేతిలో చెయ్యి వేసి, కళ్లలోకి చూస్తూ వీడ్కోలు ఇచ్చావు. మరి వీసా కోసం ఇంకొక సంవత్సరం. 13 ఏళ్లు మనం ఆగినప్పుడు, ఇంకొన్ని రోజులు ఆగలేమా?

ఇక్కడ కోవిడ్ పేషంట్లు పెరుగుతున్నారు. మా స్టాఫ్ అందరూ PPE వాడాలని హాస్పటల్ వాళ్లు హడావుడిగా రూల్ పెట్టారు, కానీ సరిపడా PPEలు మాత్రం ఇవ్వలేదు. ఇచ్చినవేమో రక రకాల సైజులు, ఎవరకి అందినవి వాళ్లు తీసుకున్నారు. నర్సింగ్ స్టాఫ్ అయితే చాలీ చాలని సైజులతో చాలా ఇబ్బంది పడుతున్నారు. PPE ప్లాస్టిక్ ముసుగు వేసుకుంటే, బోలెడు చెమటలు. సర్జరీ చేసేటప్పుడు ముఖానికి చెమటలు కారుతుంటే తుడుచుకోవటానికి కూడా లేదు. బాత్రూముకి వెళ్లితే PPE జాగ్రత్తగా తీసి వేసుకోవటానికి అరగంట పడుతుంది. అందుకని మంచి నీళ్లు తాగటం కూడా తగ్గించాము.

ఇంకొక అరగంటలో నీ ఫ్లైట్ New York చేరుతుంది. ఎయిర్‌పోర్టులో నిన్ను రిసీవ్ చేసుకోవటానికి నా స్నేహితులు చాలా మందే పోటీ పడుతున్నారు. నలుగురన్నా వస్తారు. చామంతి పూలమ్మాయని గుర్తు చెప్పాను. నువ్వు రాగానే ఫోన్‌లో మెసేజ్ పెట్టు. షిఫ్ట్ అయిపోయిన తరువాత PPE తీసివేసి ముందు నీ మెసేజ్ చదువుకుని అప్పుడు ఫోన్ చేస్తాను.

ओ मेरे दिल के चन

ప్రతి క్షణం నీ కోసం ప్రతీక్షణ. నీ చేతి స్పర్శ కోసం ఎదురు చూస్తూ ...

===================

01:20AM, మార్చి 13, 2020

ఫ్లైట్స్ అన్నీ అపేసారని, నీ ఫ్లైట్ పారిస్‌లో అపేసారని మెసేజ్ పెట్టావు. సాయంకాలం నా షిఫ్ట్ అయ్యిన తరువాత చూసుకున్నాను. ఇక్కడి మా స్నేహితులతో ఫోన్లో నేను చెపితే, వాళ్లందరూ యూరప్‌లో ఉన్న తమ తమ స్నేహితులతో మాట్లాడి నీ గురించి వివరంచి, కనుక్కుని నీ అవసరాలు చూసుకోమని చెపుతూ గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. అయినా, అందరికీ కొండంత ధైర్యం ఇచ్చే నీకు, నేను వేరే చెప్పాల్సింది ఏముంటుంది?

నాకు హౌస్ సర్జన్సీ చివరిలో ఆక్సిడెంటయ్యి చెయ్యి విరిగితే, చెయ్యి తప్పకుండా బాగుపడుతుంది, నువ్వు మంచి సర్జన్ తప్పక అయ్యి తీరుతావు అని నాకు ఎంత ధైర్యం చెప్పావు? నేను అమెరికా వచ్చి రెసిడెన్సీ కోసం ప్రయత్నిస్తుంటే, తప్పక వస్తుంది అని ఎంత ధైర్యం చెపుతూ ఉత్తరాలు రాసావు? అప్పటి ఉత్తరాలలో చామంతి రేకులు ఎక్కువ ఉండేవి!.

మరి, ఇప్పుడు నేను నీకేమని ధైర్యం చెప్పను? ఎలా చెప్పను? నీకు ఒక SIM card అందించేలా చూస్తామని నా స్నేహితులు చెప్పారు. నీకు ఫోన్ అందగానే, మాట్లాడతాను.

ఇక్కడ కోవీడ్ కేసులు పెరుగుతున్నాయి. ఊపిరి తిత్తులకి వచ్చిన రోగంతో, గుండె రోగాలు పెరుగుతాయి కదా, మరి వారికి వెంటనే సర్జరీలూ, ప్రొసీజర్లూ చెయ్యాలి. నిన్న పన్నెండు సర్జరీలు చేసా. ఇంతవరకూ ఎప్పుడూ ఒక్క షిఫ్టులో అన్ని సర్జరీలు చెయ్యలేదు. పదహారు గంటల తరువాత, ఇప్పుడే కొంచెం తీరిక దొరికింది. ఒక రెండు గంటలు పడుకుని మళ్లీ సర్జరీలు మొదలు పెట్టాలి.

నీ మాట కోసం, నీ రాక కోసం ఎదురు చూస్తున్నా. నువ్వు ధైర్యంగానే ఉంటావు. నాకే, నీ చెయ్యి కావాలి.

ओ मेरे दिल के चैन

ప్రతి క్షణం నీ కోసం ప్రతీక్షణ. నీ చేతి స్పర్శ కోసం ఎదురు చూస్తూ ...

==================

03:15AM, మార్చి 14, 2020

24గంటలు ఎయిర్‌పోర్టులో గడిపిన తరువాత హోటల్‌కి చేరుకున్నావని, ఫోన్ చార్జ్ అయిపోతున్నది, ఫ్రాన్స్‌లో చార్జర్ ప్లగ్ వేరే రకంగా వున్నదని నువ్వు పెట్టిన మెసేజ్ ఇప్పుడే చూసాను. నా స్నేహితులకి చెపితే SIM Cardతో పాటు, చార్జర్ కూడా అందించే ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఎప్పుడు ఫ్లైట్స్ మళ్లీ లేస్తాయో తెలవదు. కానీ అమెరికన్ సిటిజన్స్‌కి మాత్రం “Evacuation Flights" నడుపుతారని అంటున్నారు. మా హాస్పటల్ చీఫ్ “Essential Worker’s family" అని సెనేటర్ ఆఫీసుకు రాసానని చెప్పాడు. నువ్వు అమెరికన్ సిటిజన్ కాకపోయినా నువ్వు ఇక్కడికి వచ్చేలాగా గట్టిగా ప్రయత్నిస్తున్నానని చెప్పాడు. నువ్వు వచ్చిన తరువాత ఇక్కడ నా, కాదు కాదు, మన ఇంటిలోనే క్వారంటీన్ ఉందువుగాని. ఇంకొంచ్చెం ఓపిక పట్టాలి.

అయినా, "మనకొచ్చినవే కష్టాలు అనుకుంటే ఎలా?" అని నువ్వు చెప్పిందే గుర్తుకువస్తున్నది. ఇక్కడ నా టీంలో ఉండే నర్సులు ఎవ్వరూ ఇంటికి వెళ్లటంలేదు. వాళ్లకీ పిల్లలు ఉన్నారు కదా, హాస్పటల్లో ఉన్న కోవిడ్ పిల్లలకి అంటుతుందేమోనన్న భయం. పొరపాటున జుట్టు ముఖం పైకి వస్తే చేతులతో సవరించుకుంటామేమోనని, నర్సులలో ఒకరికొకరు జుట్టు కత్తిరించుకున్నారు, కొందరేమో

గుండులు చేయించుకున్నారు. ఒక పసి పిల్ల ఉన్న నర్సు ఇంటికి వెళ్లలేక ఏడుస్తూనే రోజంతా పని చేస్తోంది. అందరికీ డాక్టర్ల మీద వున్న గౌరవం, సానుభూతి నర్సుల మీద, సానిటరీ స్టాఫ్ మీద ఎందుకు ఉండదో? వాళ్లే కదా పేషంటులతో ఎక్కువ సమయం గడిపేది? ఇవన్నీ చూస్తున్నప్పుడు నీ మాటలు గుర్తుకువస్తాయి. ఔను, మన కష్టాలెంత?

కోవిడ్ కేసులు పెరిగి, పేజర్ మోగినది మోగినట్లే ఉంటోంది. షిఫ్ట్ అయ్యిన తరువాత నీ మెసేజ్ చూద్దామనుకుంటే, బోలెడు అనవసరమైన వాట్సప్ మెసేజులు. హోమియోపతి చిట్కా అని ఒకరు, కషాయం చిట్కా అని ఒకరు, ప్రార్థన చిట్కా అని ఒకరూ, సిల్వర్ నైట్రేట్ మందు అని ఇంకొకడు, Hydroxy Chloroquine అని ఇంకొక మూర్ఖుడు. అసలు వీళ్లందరికీ చదువు ఉంది కానీ కొంతైనా బుద్ధి ఉందా అనిపిస్తుంది. ఎవరికీ అంతుపట్టని అంటురోగంతో హాస్పటల్ స్టాఫ్ అంతా తమ ప్రాణాలని పణంగా పెట్టుకుని పోరాడుతున్నప్పుడు, ఎందుకూ పనికి రాని మెసేజులు ఫార్వార్డులు చెయ్యటమెందుకు?

ఎందుకో ఈవేళ కొంత అలసటగా ఉంది. నిద్ర లేక పోవటంవలనేమో. కానీ పోరాడాలి, ఆ పోరాటానికి నీ చెయ్యి ఆసరా కావాలి.

ओ मेरे दिल के चैन

ప్రతి క్షణం నీ కోసం ప్రతీక్షణ. నీ చేతి స్పర్శ కోసం ఎదురు చూస్తూ ---

===================

04:00AM, మార్చి 15, 2020

నిన్నుకూడా ఎవక్యుఏషన్ ఫ్లైట్లో రేపు న్యూ యార్క్ ఫ్లైట్‌కి పంపించుతున్నామని అక్కడ ఎంబసీ వాళ్లు చెప్పారని, మెసేజ్ పెట్టావు. నేను కూడా రెండు మెసేజ్‌ల్ నీకు పెట్టాను. ఏమిటో, పొడి పొడి మెసేజ్ సంభాషణ. హాస్పటల్ హడావుడిలో, నీ మెసేజ్ అందగానే కనీసం ఫోన్ చేసి మాట్లడలేకపోతున్నాను. PPE అడ్డం ఒకటి. సరే, నువ్వు ఇక్కడికి చేరుకోగానే నీతో మాట్లాడుతాను కదా!

ఇక్కడ హాస్పటల్లో ఎక్కడ చూసినా కోవిడ్ రోగులే. ఏది ఎమర్జెన్సీ వార్డో, ఏది జనరల్ వార్డో తెలవకుండా ఉన్నది. కారిడర్లలో కూడా పేషంట్లు ఉన్నారు.

డాక్టరన్న తరువాత మరణాలు చూడకుండా ఉండము. కానీ ఈవేళ జరిగిన విషయంతో మా స్టాఫ్ అందరికీ మనసు నిలువటంలేదు. ఒక 65 సంవత్సరాల పెద్దాయన, యూనివర్సిటీ ప్రొఫెసర్. మాజీ సైనికుడు కూడానట. ఆ పెద్దాయనను మూడు రోజుల క్రితం వాళ్లావిడ హాస్పటల్‌కి తీసుకువచ్చింది. వాళ్లది స్కూల్లో ఉన్న పరిచయమట, 18 సంవత్సరాల వయసులో యుద్ధానికి వెళ్లేముందు పెళ్లి

చేసుకుని, యుద్ధం ముగిసేటప్పటికి 20 సంవత్సారాల వయస్సు నుండి ఇప్పటిదాకా ఏ రోజూ ఇద్దరూ విడిగా ఉండలేదట. ఆవిడ రోజూ ఏ క్షణానయినా వచ్చి పెద్దాయన బెడ్ ప్రక్కన చేయి పట్టుకోవచ్చని, హాస్పటల్ దగ్గరే కార్ పార్కు చేసుకుని మూడు రోజుల నుండి గడుపుతున్నదట. ఈవేళ ఆవిడకు కబురు అందించితే, కనీసం ఆఖరు చూపుకు కూడా దగ్గరకు రానివ్వటంలేదని గుండలవిసేలా ఏడ్చి స్పృహ కోల్పోయింది. ఆఖరి చూపులు కూడా దక్కనివ్వని రోగం ఈ కోవిడ్.

మనసులో ఎంత అలజడి ఉన్నా ఆలోచనలని కట్టిపెట్టి, చెయ్యవలసిన పని చెయ్యాలి, ఇంకా ఎంతో మంది పేషెంట్లు ఉన్నారు. కానీ అలసట పెరుగుతోంది. హాస్పటల్ ఫ్లోరోసెంట్ వెలుతురు తప్ప, సూర్యుడిని చూడలేదు. మనం సూర్యుడిని చూడటం, చల్లని గాలిని పీల్చటం గురించి ఎప్పుడూ ఆలోచించము. అవి లేకపోతే జీవితం ఎంత దుర్భరమో తెలుస్తుంది. హాస్పటల్ తిండి అనుకుంటా, ఏ ఒక్కటీ రుచి తెలవటంలేదు. అప్పుడు, నీ టిఫిన్ బాక్సులో నువ్వు నా కోసం చాటుగా తెచ్చి ఇచ్చినవి గుర్తుకు వస్తున్నాయి. నువ్వు ఇక్కడకి వచ్చిన తరువాత, పాత రోజులలాగానే ఇక్కడి పార్కులో ప్రక్క ప్రక్కనే కూర్చుని తినవచ్చు. ఆ తరువాత అక్కడిలాగా కాకుండా, ఇక్కడ నీ చెయ్యి పట్టుకుని నడవచ్చు. ఆ ఆసరా నాకు కావాలి.

ओ मेरे दिल के चैन

ప్రతి క్షణం నీ కోసం ప్రతీక్షణ. నీ చేతి స్పర్శ కోసం ఎదురు చూస్తూ ...

==================

5AM, మార్చి 16, 2020

నువ్వు రావలసిన ఫ్లైట్ ఇంకా రాలేదని నా స్నేహితులు చెప్పారు. పారిస్‌లో ఉన్న పరిచయస్తులెవరో నీకు హోటల్ వాళ్ల ద్వారా కొంత అక్కడి కరన్సీ అందించబోతే వద్దన్నావట. ఇంకొకరికి ఎప్పుడూ ఆసరా అందించే చెయ్యి, ఇంకొకరెవరన్నా అందించే చెయ్యిని నువ్వు ఎందుకు అందుకోకూడదు? ఈ సమయంలో కూడా నీ పట్టుదలేనా? కానీ, నీకు కోపం వచ్చినప్పుడు మౌనంగా కను రెప్పలు కొంత వాల్చి, తల అటు పక్కకు తిప్పి ఎలా చూస్తావో నాకు బాగా తెలుసు కదా, కళ్లలో కట్టినట్లు కనబడుతున్నావు. నువ్వు కోపంతో తల అటు తిప్పుకుంటే, నీ తలలోని చామంతులు నా వంక చూస్తూ, నవ్వుతూ, నన్ను చక్కగా పలకరించేవి. అప్పుడు నేను నిన్ను బ్రతిమాలటం, కోపం ఒక్కసారిగా విరిగిపోయి నువ్వు నన్ను చూసి నవ్వటం, అన్నీ గుర్తుకు వస్తున్నాయి. ఇంకొక రోజు ఆలస్యమయితే అయ్యింది, నువ్వు క్షేమంగా హోటల్ గదిలో ఉన్నావని తెలిసి చాలా సంతోషంగా ఉన్నది.

ఇక్కడ హాస్పటల్‌లో ఎప్పుడూ చూడని పరిస్థితి. పేషంట్లని ఎవరని అనాలి? కళ్ల ముందు కనబడుతున్న హరిశ్చంద్ర ఘట్టం. మధ్యలో నేనూ, నర్సింగ్ స్టాఫ్. నాతో పాటు పని చేసే అనస్తీస్టు, వాళ్లు ఇంట్యుబేట్, అంటే రోగి ఊపిరితిత్తులదాకా గాలి పీల్చటానికి తేలికగా ఉండే ట్యూబ్ పెట్టాలి, వాళ్లు తప్పనిసరిగా పేషంటును పట్టుకోవాలి. ఆ తరువాతే మేము. ఎవరికీ సరైన మాస్కు కూడా లేదు. అవసరానికి సరిపడా మాస్కులు కానీ, గ్లోవ్స్ కానీ, PPEలు కానీ లేవు. వాడినవే వాడుతున్నాము. అలాగే పని చేస్తున్నాము. కవచం అంటే ఏదో బాణాలని,

కత్తులని ఆపేది కాదు, కోవీడ్ లాంటీ రోగాలని ఆపగలిగేదే కవచమేమో. సరే, నాతో పాటు పని చేసే అసిస్టెంటు, ఇంటికి వెళ్లలేక, వీడియో కాల్‌లో తన పిల్లలతో మాట్లాడుతుంటే, జుట్టు కత్తిరించుకున్న వాళ్ల అమ్మను రెండేళ్ల పాప గుర్తు పట్టక, నువ్వు మా అమ్మవి కాదు అన్నదట. ఆవిడ రోజంతా ఏడుస్తూనే పని చేసింది.

ఎందుకో, ఇవన్నీ చూస్తూ పని చెయ్యటం వలన అనుకుంటా, చాలా నీరసంగా ఉంది. చామంతీ, నువ్వు నా పక్కనుంటే, నీ చెయ్యి అందుకోవాలని ఉంది.

ओ मेरे दिल के चम

ప్రతి క్షణం నీ కోసం ప్రతీక్షణ. నీ చేతి స్పర్శ కోసం ఎదురు చూస్తూ ...

================

Time ??, మార్చి 17, 2020

నీ ఫ్లైట్ ఈవేళ సాయంత్రం పారిస్ నుండి బయలుదేరుతుంది అని మెసేజ్ పెట్టావు. నా స్నేహితులు నిన్ను మన అపార్టుమెంటుకు చేర్చి, ఒక సెల్ ఫోన్ ఇస్తారు. వాళ్లే ఇంట్లోకి అవసరమయినవన్నీ ఏర్పాటు చేసి అట్టిపెట్టారు. అవసరమైనవన్నీ నువ్వు వచ్చిన తరువాత నీ ఇష్ట ప్రకారం కొనవచ్చని ఆగాను. అందుకే ఇంటిలో ఎక్కువ సామాను ఏమీలేదు. రేపు రాత్రి 11 గంటలకు తప్పకుండా ఫోన్ చేస్తాను. నీ మాట వింటే నాకున్న నీరసం పూర్తిగా పోతుంది.

ఏమిటో, ఈ కోవిడ్ వలన మనుషలకు దూరం పెరుగుతున్నది. నలుగురు కూర్చుని మాట్లాడుకోవడం కానీ, భోజనం చేయటం కానీ జరగదేమో. “Social Distancing" అంటూ మనిషి మనిషికీ దూరం పెరిగింది. మా స్టాఫ్ నర్సు ఒకావిడ, వయసుతో వచ్చిన భారీకాయం, రోజూ ఉదయం కనబడగానే లేని కోపం ప్రదర్శిస్తూ, “Where is my Sugar, I need a big hug " అంటూ గట్టిగా కావలించుకుని ముద్దు పెట్టుకునేది. నన్నే కాదు, అందరినీ అలాగే పలకరించేది. ఆ నర్సుకి కోవిడ్ అని తేలింది. ఇప్పుడు క్వారంటీన్‌లో ఉన్నది. ఆవిడకి నేనే ఎమర్జెన్సీ ప్రొసీజర్ చెయ్యవలసినప్పుడు చేతులు వణకకుండా ఆపుకోగలిగాను కానీ, కన్నీళ్లు ఆపుకోలేకపోయా. ప్రతి ఉదయం ఆవిడ నన్ను కావలించుకుని ముద్దు పెట్టటం కొత్తలో ఇబ్బందిగా ఉండేది. కానీ, ఇప్పుడు అది లేకపోతే జీవితం ఖాళీ అయినట్టుగా ఉన్నది. ఎంతో మంచి మనిషి. నన్ను వాళ్ల చర్చికి తీసుకువెళ్లి గుండె రోగాలూ, డయాబెటీస్ వంటివి రాకుండా ఉండేందుకు ఆహారపు జాగ్రత్తలూ వేరే జాగ్రత్తల చెప్పించేది. "మా నల్ల వాళ్ల చర్చిలో ప్రార్థనలన్నీ ఉత్సాహంగా పాటల పాడటమే" అనేది. నిజమే, మన త్యాగరాజు కీర్తనలలో ఉన్న "Ecstasy", వాళ్ల పాటలలో కూడా ఉన్నాయి.

ఆ నర్సుకి కోవిడ్ వచ్చింది, మా అందరినీ రోజూ కావలించుకునేది కాబట్టి, మా టీంలో అందరికీ కోవిడ్ పరీక్షలు చేశారు. రేపు తెలుస్తుంది. అయినా, రోజూ వందల మంది కోవిడ్ పేషంట్ల మధ్యలో ఉంటున్నాము, సరైన మాస్కులూ, గ్లోవ్స్, PPE మాకు ఇవ్వనప్పుడు, మాకు కోవిడ్ అంటకుండా ఉండదు. కానీ, కర్తవ్యం ...

ఆవిడను ఎలాగైనా కాపాడాలి. మరి ఆ శక్తి నాకు ఎవరిస్తారు? రేపు రాత్రికి నీ మాట విన్నప్పుడు కానీ నాకు శక్తి రాదేమో. నీ మాట కోసం ఎదురు చూస్తూ ...

ओ मेरे दिल के चैन

ప్రతి క్షణం నీ కోసం ప్రతీక్షణ. నీ చేతి స్పర్శ కోసం ఎదురు చూస్తూ ...

===================

మార్చి 18, 2020

కోవిడ్ వలన ఎమెర్జెన్సీ ఫ్లైట్‌లో ఆరు సీట్లకి ఒకరినే కూర్చోపెడుతున్నారని, అందుకని నువ్వు ఎక్కవలసిన ఫ్లైట్ పారిస్ నుండి ఆలస్యంగా బయలుదేరిందని, రేపు ఉదయానికి నువ్వు వస్తావని మెసేజ్ పెట్టావు. సరే, ఎక్కడో ఆకాశంలో ఉండి వుంటావు. నువ్వు రాగానే మాట్లాడుతాను.

రోజుకి పదహారు గంటలు పనిచేయటం వలననేమో, అలసటో, అలజడో తెలవటం లేదు. నేను కూలబడితే, నర్సింగ్ స్టాఫ్ నన్ను ఒక సోఫాలో పడుకోబెట్టారు. ఒక నర్సు నా టేబల్ వెతికి నువ్వు నా పుట్టిన రోజుకు పంపిన ఉత్తరం ఇచ్చింది. ఆ ఉత్తరం మడతలలోని చేమంతి రేకులు నా మీద రాలాయి. ఆ చేమంతి రేకుల పలకరింపుతో నా మనసు ఉవ్వెత్తున ఎగిరింది.

కానీ, ఇప్పుడు హాస్పటల్లో పని చెయ్యాలంటే ఏమీ చెయ్యలేకపోతున్నామనే నిరుత్సాహం. ఈవేళ ఒకామెకు ఎమెర్జెన్సీ సర్జరీ చెసాము. నిండుగర్భిణి. కోవిడ్ బాధితురాలు. IVF ద్వారా చాలా కాలానికి పిల్లలు కలిగే అవకాశం వచ్చిందట. మంచి కుటుంబం. ఆవిడ భర్త రోజూ వచ్చి, ఆవిడ హాస్పటల్ రూమ్ కిటికీకి ఎదురుగా ఉన్న చెట్టు దగ్గర పెద్ద పెద్ద అక్షరాలతో వ్రాసిన బోర్డ్ మీద "నువ్వు గెలుస్తావు" అంటూ, ఇంకా ఏవేవో ఉత్సాహపరుస్తూ మాటలు రాసి కొమ్మలకు తగిలించేవాడు. అక్కడే నుంచుని గంటలు తరబడి గిటార్ మోగిస్తూ ఏవో పాటలు పాడేవాడు. ఆవిడ కోవిడ్ పరిస్థితి చూసి, ఎమెర్జెన్సీగా సర్జరీ చేసి కవల పిల్లలను తీసాము. కానీ తల్లిని బ్రతికించలేకపోయాము. ఎంతో కాలంగా పిల్లల కోసం ఎదురుచూసిన ఆమె పిల్లలని కనీసం కళ్లు తెరచి చూసుకోలేకపోయింది. ఆమె భర్తకు ఏమని జవాబు ఇవ్వగలను? వింతలో వింత, అ పసి పిల్లలకి కోవిడ్ లక్షణాలు లేవు. ఆ పిల్లలను కాపాడాలి.

నీతో మాట్లాడితే ఏమన్నా శక్తి వస్తుందేమో. జీవితంలో ఒక మంచి మాట పంచుకునే వాళ్లు ఉండాలి కదా! నాకు ఎప్పుడు అర్థం కాని పరిస్థితి ఎదురైనా నీతో మాట్లాడితే ఉపాయం, ఉత్సాహం వెంటనే దొరికేవి.

ओ मेरे दिल के चन्न

ప్రతి క్షణం నీ కోసం ప్రతీక్షణ. నీ చేతి స్పర్శ కోసం ఎదురు చూస్తూ ...

==================

02:30AM, మార్చి 19, 2020

నువ్వు వచ్చావని మెసేజ్ పెట్టావు. నువ్వు రాగానే కనీసం ఫోన్‌లోనన్నా మాట్లాడదామని అనుకున్నాను. ఆ అవకాశం కూడా ఇప్పుడు లేదు. నేను కూడా కోవీడ్ పేషంట్‌గా చేరాను. కాదు చేర్చారు.

తప్పదు. ఇంతమంది పేషంట్ల మధ్యలో ఉన్నప్పుడు తప్పదు. నా స్టాఫ్ నర్సులూ, తోటి డాక్టర్లూ అందరూ పలకరించుతున్నారు. దూరం నుండే. కన్నీళ్లు పెట్టుకున్నారు. నన్ను రోజూ "Sweetie" అని పలకరించే నర్సు ఒకావిడ, ఈవేళ దూరం నుండే “Amazing Grace ..." అంటూ ప్రార్థన పాడింది. తోటి నర్సులందరూ గొంతు కలిపారు. నా మంచి కోరే ఇందరి మధ్యలో ఉన్న నేను, నువ్వు లేక ఒంటరినే. నీ చేతి ఊతం కావాలి. ఆ మొదటి రోజు పరిచయం అయ్యినప్పుడు, మృదువుగానే నా చేతిని పట్టుకుని తీసుకు వెళ్లావు. బోలెడు శక్తి ఉత్సాహం వచ్చింది. ఈవేళ ఆ చెయ్యి నాకు కావాలి.

నేను డాక్టరుని కాబట్టి, నాకు వెంటనే వెంటిలేటార్ ఏర్పాటు చేసారు. ఆ వెంటిలేటర్ నీతో మాట్లాడే అవకాశాన్ని కూడా తీసివేసింది. ఇంకొక రోగికి ప్రాణం నిలిపే ఈ వెంటిలేటర్ నేను వాడుకోవటం స్వార్థమా?

మెలుకువ వచ్చింది, నువ్వు చేసిన అలవాటుతో ఉత్తరం మాత్రం వ్రాస్తున్నాను.

ఇన్ని రోజుల ప్రయాణం తరువాత నువ్వు ఎలా ఉన్నావు? నా అపార్టుమెంటులోనే నిన్ను క్వారంటీన్ ఉంచారని, నా స్నేహితులు చెప్పారని నర్సు చెప్పింది. నీకు అన్ని ఏర్పాటులు చేసామని చెప్పారట. నా జీవితానికి ఆసరా నీవే అని నేను ఒకసారి అంటే, ఒకరికొకరం అని అనేదానివి. కానీ, నిన్ను ఇక్కడకి తీసుకువచ్చి నిన్ను బందీని చేసాననిపిస్తోంది. నాకు కొంచెం మెరుగైన తరువాత వెంటిలేటర్ తీసి నీతో ఫోన్‌లో మాట్లాడిస్తామని నర్సులు చెప్పారు.

ఇంకా ఏదో రాయాలని ఉంది, కానీ నా గుండెలు ఉడికిపోతున్నంత బాధ. మాట రావటంలేదు. తల నా శరీరం నుండి ఊడి తేలిపోతునట్టు ఉంది.  మళ్లీ స్పృహ వచ్చినప్పుడు రాస్తాను. నువ్వు ధైర్యంగా ఉండటమే నాకు మనశ్శాంతి.

ओ मेरे दिल के चन्न

ప్రతి క్షణం నీ కోసం ప్రతీక్షణ. నీ చేతి స్పర్శ కోసం ఎదురు చూస్తూ ...

=================

ఎన్ని రోజులయ్యిందో తెలవదు. ఏ రోజో, ఏ వారమో, ఏ సమయమో కూడా తెలవదు

ప్రపంచం ఉన్నదో లేదో కూడా తెలవదు. నువ్వు ఉన్నావని మాత్రం తెలుసు. కలో కాదో కూడా తెలవదు. కాళ్లకు చల్లగా తగులుతున్న అలలు. నువ్వు నాకు చెయ్యి అందిస్తున్నావు. అందుకోవటానికి నేను ప్రయత్నిస్తున్నాను. ఎప్పటికైనా మనం కలుసుకుంటామా అని నేను అడిగితే, ఈ సముద్రపుటంచున ఆకాశం కలుస్తున్నది కదా, అలాగే మనమూ కలుసుకుంటాము అని అన్నావు. సముద్రం ఆకాశం నిజంగానే దూరాన కలుస్తున్నాయా అని నేను ప్రశ్నించాను. ఇంతలోనే నాకు వెంటిలేటర్ సరిచేయటానికి వచ్చిన నాతోటి అనస్తీస్టు డాక్టర్, స్పృహ వచ్చింది, మన సంభాషణ ఆగింది. కానీ నాకు నునువెచ్చని నీ చేతి స్పర్శ కావాలి.

గుండెలలో వేయి అగ్ని పర్వతాలు బ్రద్దలయినంత బాధ. చేతులకు పొడిచిన సెలైన్ సూదులు. మేకులు కొట్టినట్టు వేళ్ల నొప్పి. అయినా రాస్తున్నాను. అలికిన అక్షరాలు. నువ్వు చదువుతావని కాదు. చదవక పోవటమే నాకు కావాలి.

నువ్వు క్వారంటైన్ కాబట్టి ఎవరూ నీకు తోడుగా ఉండటానికి వీలు లేదని చెప్పారట. నిన్ను ఇక్కడకు తీసుకువచ్చి బందీని చేశాను కదూ! నువ్వు ఎన్నో సార్లు ఫోన్ చేసి మాట్లాడదామని ప్రయత్నిస్తే, నేను స్పృహలో లేనని చెప్పామని నర్సులు అన్నారు. ఇప్పుడు మాట్లాడతానని చెపితే వెంటిలేటర్ తీస్తే ఊపిరి ఆడదు, మాట రాదు, వెంటిలేటర్ ఉంటే ఫోన్‌లో మాట్లాడాడం కష్టం అన్నారు.

కానీ, నిజంగానే నీ చెయ్యి అందిచవూ? నాకు నీ చేయి కావాలి, నీ చేతి నును వెచ్చని స్పర్శ కావాలి. ఆ స్పర్శతో వచ్చే పారవశ్యం కావాలి.

ओ मेरे दिल के चद

ప్రతి క్షణం నీ కోసం ప్రతీక్షణ. నీ చేతి స్పర్శ కోసం ఎదురు చూస్తూ ...

=================

ఈ ఉత్తరం ఎప్పుడు రాస్తున్నాను? ... ఎవరికి రాస్తున్నాను? తెలువదు. నా చామంతికి రాసే ఉత్తరం మాత్రం కాదు. చామంతి కోసం ఇంకొకరికి రాసే ఉత్తరం....ఎందుకు రాస్తున్నానో మాత్రం తెలుసు...కనబడని కోవీడ్ క్రిములు నా గుండెలలో చితి మంట రగిలుస్తున్నప్పుడు, శ్వాస నిశ్వాస అవుతున్న క్షణాలలో, ఆలోచనలు కూడగట్టుకుని రాస్తున్నాను... నా చామంతికి వరుడు కావాలి. నన్ను మరచిపోయేలాగా చేసే వరుడు కావాలి. మా చామంతి నవ్వునను అందుకునే వరుడు కావాలి...మా చామంతి ఎక్కువగా నవ్వదు...మా చామంతికి కోపం వచ్చినప్పుడు బ్రతిమాలి నవ్వించగలిగిన వాడే కావాలి...మా చామంతికి ఎందుకు కోపం వస్తుంది అంటే...సమాజంలో తనకి నచ్చనిది ఏమి జరిగినా...లేకపోతే తన ప్రక్కన కూర్చుని అల్లరి మాటలు చెప్పినా సరే...బోలెడు కోపం వస్తుంది...కోపం వచ్చినప్పుడు తల ప్రక్కకు తిప్పుకుంటుంది కానీ ఒక్క మాట మాట్లాడదు...మరి అప్పుడు బ్రతిమాలాలి ...అప్పుడప్పుడు చల్లబరచటానికి ఐస్‌క్రీం కూడా కొనిపెట్టాలి...చల్లబడిన తరువాత తన నవ్వులో కరిగిపోవటానికి ఒక వరుడు కావాలి...మా చామంతి చెప్పే కబుర్లు వింటూ తనను తాను

మరచిపోయే వరుడు కావాలి... మరి మా చామంతి హాయిగా నవ్వితే చందమామను మర్చిపోయే వరుడు కావాలి... ఎన్నో మాటలు చెపుతుంది...ఇది చెయ్యవద్దు అది చెయ్యవద్దు అని చెపుతుంది...నడుస్తూ ఎన్నో కబుర్లు చెబుతుంది...అప్పుడు తనతో పాటే నడవాలి...ఆ మాటలతో అందరూ నడవని కొత్త బాటలలో, క్రొత్త ఆలోచనలతో నడిపించుతుంది...అలా నడవగలిగిన వరుడు మా చామంతికి కావాలి...తెలువక వేసిన తప్పటడుగైనా...తెలిసి వేసిన తప్పటడుగైనా...తగిలిన దెబ్బకి ఊరడించి, అనునయించే మాటలు చెబుతుంది...ఆ మాటలు వింటూ తన కళ్లలోకి చూస్తూ తనను తాను మరచిపోయే వరుడు మా చామంతికి కావాలి...వెల్లి విరిసే ఔదార్యం మా చామంతికి ఉంది...మరి మా చామంతి మొగ్గ వాడిపోకుండా తోడుగా నీడగా నిలబడే వరుడు కావాలి...శ్వాస లేక నిశ్వాస మాత్రం మిగిలిన నాకు మా చామంతి సౌభాగ్యం కావాలి...మరి ఎవరైనా మంచి వరుడు...నేను లేని నన్ను మరచిపోయేలా చేసే వరుడు మా చామంతికి కావాలి.......

## బకుడు — వేగుళ్ళ కోటేశ్వరరావు

మండపేట నుంచి కపిలేశ్వరపురం వెళ్లే దారిలో, మండపేటకు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామం పేరు వల్లూరు. ఆ ఊరి మెయిన్ రోడ్డుకు కుడివైపున పెద్ద చెరువు, సత్రవు సావిడి. ఆ సత్రవు సావిడి పక్కనే చెరువులోకి ఉన్న 'దూళ్ల రేవు'కు ఎదురుగా రోడ్డుకు ఎడమ పక్క ఒక తాటాకు సావిడిలాటి పాక. ఆ పాకలో ఉన్న హోటలు పేరే 'షరాబు హోటలు'. షరాబులంతా దాన్ని 'షరాబుగాడి హోటల'ని, గరీబులంతా 'షరాబుగారి హోటల'ని, మిగతా వాళ్లంతా 'షరాబు హోటల'ని పిలిచేవారు. సుమారు మూడువేల జనాభా ఉన్న ఆ ఊరికి ఈ హోటలు పెద్దదనే చెప్పుకోవాలి. వల్లూరు, అంగర రోడ్డుకి కాలేరు రోడ్డుకి, జంక్షనవడంవల్ల ఈ హోటలుకి గిరాకీ బాగానే ఉండేది. ఈ హోటలు యజమాని అసలు పేరేమిటో తెలియదుగాని అందరూ అతన్ని షరాబు అని పిలిచేవారు. ఆ పేరే హోటలు పేరు కూడా. నల్లగా, బొద్దుగా, కాకి నిక్కరు, మోచేతులవరకు మడతపెట్టిన తెల్ల పొడుగు చేతుల చొక్కాతో ఉండేవాడు. షరాబు కోమటి, వ్యాపార దక్షత కలవాడు. దానికి తోడు హోటల్లో రుచికరమైన వంటకాలుండడంతో వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయల్లా ఉండేది. ఈ హోటల్లో షరాబు గారితోపాటు ఆయన మేనల్లుళ్లిద్దరూ, మరో ఇద్దరు పనిమనిషులు పనిచేసేవారు. షరాబుగారుంచుకున్న చాకలావిడ అప్పుడప్పుడు, అంటే చాకిరేవు లేనప్పుడు, చలవ చెయ్యాల్సిన బట్టలు లేనప్పుడు, వచ్చి వీరికి సాయపడుతుండేది.

షరాబు హోటలు తెల్లవారక ముందే తెరుచుకుని సాయంత్రం చీకటి పడిన తర్వాత మూత పడేది. ప్రొద్దుట్నించి మధ్యాహ్నం వరకు ఇడ్లి, గారె, పెసరట్టు, పుల్లట్టు లాంటి టిఫిన్లు, కాఫీ టీలు దొరికేవి. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పకోడీ, మిరపకాయ బజ్జీ, అరటికాయ బజ్జి లాంటి చిరుతిండ్లు కాఫీ టీలతోపాటు దొరికేవి. భోజన సదుపాయం లేదు. హోటలుకు ఒక మూల రోడ్డు వైపుకు తెరచుకుని మిఠాయి దుకాణం కూడా ఉండేది. ఇందులో ఎక్కువగా బెల్లం స్వీట్లు, కొన్ని పంచదార స్వీట్లు, కారప్పూస, కారా బూందీ, జంతికలు లాంటి 'స్నాక్స్' ఉండేవి. షరాబుగారి రెండో మేనల్లుడు వేసే మసాలాగారెలు చాలా స్పెషలు. మిఠాయి దుకాణంలో బెల్లం మిఠాయి అచ్చు, కఱకజ్జం, బెల్లం కొమ్ములు ఎక్కువగా అమ్ముడయ్యేవి. దేవళ్ల సూరన్నగారు పేకాటకు వెళుతూ 'పదలం' బెల్లం మిఠాయి కొనుక్కుని వెళ్లి, పేకాడుతున్నంతసేపూ ఎవరికీ కొంచెం ముక్కగూడా పెట్టకుండా ఒక్కడే తినేసేవాడని చెప్పుకునేవారు. హోటల్లో అన్ని వంటకాలు చాలా

రుచిగా ఉండేవి. దోరగా కాలి గోధుమ, పసుపు పచ్చ, ఆకు పచ్చ రంగుల కలయికతో ఉండే పెసరట్టు మరీ రుచిగా ఉండేది. పెసరట్టు మధ్యలో ఉంచిన, పసుపు గణేశుడి ఆకారంలో ఉన్న, వెన్న ముద్ద నోరూరించేది. హోటలు ఖాతాదారుల్లో పెసరట్టు అభిమానులే ఎక్కువ. దాని తరువాత స్థానం ఇడ్లిది. తెల్లగా, పళ్లూడిన విష్ణుచక్రం మధ్యలో ఉబ్బినట్టుగా, ఉండే రెండిడ్లిలు ప్లేటు మధ్యలోను, ప్లేటు పైభాగంలో కాషాయం రంగులో ఉన్న ఉల్లి చట్నీ, కింద భాగంలో ఆకుపచ్చ రంగులో ఉన్న పుదీనా చట్నీ వేసిస్తే చూడ్డానికి మూడు రంగుల భారత పతాకంలా ఉండేది. షరాబు దేశభక్తుడు, కాస్త కళాపోషకుడు కావడం మూలాన్న అప్పుడప్పుడు, అంటే స్వాతంత్ర దినం, రిపబ్లిక్కుడే వంటి రోజుల్లోనూ, పండగలకూ, ఇడ్లి మధ్య పైభాగంలో చక్రంలా కోసిన టమాటో ముక్క అద్దేవాడు. అది జెండాపై ఉండే ధర్మచక్రం అని కస్టమర్లందరికి చెప్పేవాడు.

ఆ రోజుల్లో ఇళ్లల్లో ఎవరూ టిఫిన్లు తినేవారు కాదు. కొన్ని ఇళ్లల్లో మాత్రం అప్పుడప్పుడు కాఫీ తాగేవారు. పొలానికి ముంతలు పట్టికెళ్ళినా, ఇంట్లో తిన్నా చద్దన్నాలే. హోటలుకెళ్ళి తిని రావడమంటే మడిబట్ట కట్టుకుని 'మైల'వాడింటికెళ్లి తినొచ్చినంత ఘోరం. ఆడవాళ్ళసలు వెళ్లేవారు కాదు. చిన్నపిల్లలైతే గుమ్మంలోంచో కిటికీలోంచో చూసి ఆనందించేవారు తప్ప లోపల అడుగు పెట్టేవారు కాదు. అంచేత కస్టమర్లందరూ ఊళ్ళోవాళ్ళు, ఊరిమీదుగా ప్రయాణంచేసేవాళ్ళు ఐన మగవాళ్ళు మాత్రమే. ఈ హోటల్లో తినేవాళ్లలో అన్ని కులాలవారు, జాతులవారు ఉన్నారు. జంధ్యం వేసుకున్న వాళ్లలో కొందరు ఎవరైనా చూస్తారనే భయంతో తెల్లవారక ముందే వెళితే, మరికొందరు ధైర్యంగా అన్ని టైములలోను వెళ్లేవారు. వల్లూరు ఎలిమెంటరీ స్కూల్లో పనిచేసే, ముక్కుపొడి పీల్చే అలవాటు ఎక్కువగా ఉన్న, భట్టు మాస్టారికి ముక్కుపొడి లేకపోయినా ఫరవాలేదుకాని, షరాబు హోటల్లో ప్రొద్దుటే కాఫీ తాగకపోతే మాత్రం పాఠాలు సరిగా చెప్పలేకపోయేవాడు. కొందరికి కొన్ని 'మంచి' చెడ్డ అలవాట్లు. వడ్డా సూరన్న గారి కొట్లో ప్రతీరోజూ తప్పకుండా గోలీసోడా తాగేవారిదీ, కిళ్ళీ వేసుకునేవారిదీ కూడా ఇదే పరిస్థితి. ఊరి శివాలయంలోని పూజారి శివరుద్రయ్య గారు కూడా ఈ హోటలుకెళ్ళని రోజు పూజ అన్యమనస్కంగానే చేసేవారు. ఆయుర్వేదం మందిచ్చే 'గఫూర్' గారి నాలుగో అబ్బాయి 'ఘని' ఇంజన్లు బాగుచెయ్యడంలో పేరున్నవాడు. ఇంజను రిపేరీకెళ్లే ముందు తప్పనిసరిగా షరాబు హోటల్లో పుల్లట్టు తినెళ్ళేవాడు. వీరన్న గారి దత్తుడు రామారావు ప్రతిరోజూ లేవగానే మొహమైనా కడుక్కోకుండా హోటలుకు పరిగెట్టి కాఫీ తాగొచ్చి తరవాత కాలకృత్యాలు తీర్చుకునేవాడు. తిరిగి ఇంటికొచ్చి ఆ కార్యక్రమం అయిందనిపించి మళ్ళీ హోటలుకెళ్ళి పెసరట్టు తినొచ్చేవాడు. ఇంకేపనయినా ఇవైంతర్వాతనే. ఇలా చెప్పుకుంటూపోతే చాలా ఉన్నాయి. యరమాటి బుల్లబ్బాయికి కొత్తగా పెళ్ళయ్యి, ఆ ఊళ్ళోనే ఉన్న అత్తారింట్లో 'మనుగుడుపు' తింటున్నాడు. అత్తగారు బాగానే వండిపెడుతున్నా, అలవాటు మానలేక, చాలా తరచుగా షరాబు హోటలుకెళ్ళి తనకిష్టమైన ఇడ్లి తినొస్తున్నాడు. బుల్లబ్బాయికి పెదనాన్న కొడుకు, దత్తుడు రామారావుకి స్నేహితుడు ఐన వెంకటరావు అప్పుడప్పుడు హోటలుకెళ్ళి నచ్చిన టిఫిను తినే చాలామందిలో ఒకడు.

ఒకరోజు దత్తుడు, బుల్లబ్బాయి, వెంకటరావు హోటల్లో ఎదురెదురుగా కూర్చుని టిఫిన్ తింటుండగా వెంకటరావు

"ఉరేయ్ బుల్లబ్బాయ్ కొంచెం 'బేగి' తిను. ఇయ్యాల కాలవవతల పొలంలో పనికి మనుషుల్ని రమ్మన్నాను. ఇద్దరం పోయి చూసొద్దాం" అన్నాడు.

బుల్లబ్బాయి "సరే" అని ప్లేటులో ఇడ్లి కొంచెం వేగంగా తినడం మొదలెట్టాడు.

ఇంతలో దత్తుడు బుల్లబ్బాయి మొహంలోకి చూసి

"ఉరే నువ్వు బాగా తింటావని, తిని 'అరాయించు'కుంటావని ఊళ్ళో నీకు పేరుందిగదా; నీకు ఇడ్లిలంటే ఇష్టంగదా; ఎన్ని ఇడ్లిలు తినగలవురా" అని ఆరా తీసాడు.

దానికి బుల్లబ్బాయి "ఆ మహా అయితే ఇరవొయ్యో, పాతికో తినగలను" అని సమాధానమిచ్చాడు.

"ఓ వంద తినరా పందెం కడతాను" అన్నాడు దత్తుడు.

"నువ్వే పందెంగట్టినాగాని వంద ఇడ్లిలు తినే మొనగాడు ఈ ఊళ్ళో కాదుగదా, చుట్టుపక్కల ఊళ్లల్లోకూడా ఎవడూ లేడు".

"సరే ఎనభై తినరా, వంద రూపాయలు పందెం"

"నువ్వంద రూపాయలు పందెం అంటే ముప్పై తింటాను"

"అరవై"

"ఆఖరుమాట నలభై"

పందెం అక్కడ ఆగిపోయేలా కనిపించింది. ఇదంతా ఉత్సాహంగా వింటున్న మిగిలిన కస్టమర్లలో ఒకడు పందెం నీరుకారిపోగూడదని "ఇద్దరి మాటా కాదు, యాభైకి ఖాయం చేసేయండెహె" అని తుని తగవు తీర్చేడు.

"నేనొప్పుకుంటాను" అన్నాడు దత్తుడు.

"నేనూ ఒప్పుకుంటాను" అన్నాడు బుల్లబ్బాయి.

దత్తుడు జేబులోంచి వంద రూపాయల నోటు తియ్యడం చూసిన బుల్లబ్బాయి "నా దగ్గరుప్పుడ్డబ్బుల్లే"వన్నాడు.

వెంకటరావు బుల్లబ్బాయికి అన్న వరస, దత్తుడు రామారావుకి మంచి స్నేహితుడు అవడంవల్ల అతను మధ్యవర్తిగా ఉండడానికి ఇద్దరూ ఒప్పుకున్నారు. ఈ మధ్యవర్తి చెయ్యవలసిందేమిటంటే ఓడిపోయినవాడి దగ్గరనుంచి డబ్బులు వసూలు చేసి వంద రూపాయలు నెగ్గిన వాడికి, ఇడ్లి బిల్లు షరాబుకి ఇవ్వడం; యాభై ఇడ్లిలు, చట్నీ సరిగ్గా ఉన్నాయో లేదో చూడ్డం, పందెంలో ఉన్న రెండు పార్టీలకు ఏవైనా చిన్నా చితకా గొడవలొస్తే తీర్పు చెప్పడం.

ఇదంతా కేష్ కౌంటరులో కూర్చుని చెవులు నిక్కించి వింటున్న షరాబు వెంకటరావు పిలవడంతో టేబులు దగ్గరకొచ్చాడు. వెంకటరావు అడిగాడు "యాభై ఇడ్లిలు రెడీ చేయగలవా"?

"ఓ, నానబెట్టిన మినుములున్నయ్, రుబ్బించేస్తాను. కాకపోతే రెండు మూడు రకాల చెట్నీలు చేయించలేను. కొబ్బరి, సెనగలూ ఉన్నాయ్. వాటితో ఒక చట్నీని చేయిస్తాను" యాభై ఇడ్లిల బేరం వస్తోందనే ఉత్సాహంతో చెప్పాడు షరాబు.

"ఒకటే చెట్నీయా" గునిసాడు బుల్లబ్బాయి. "సరేలే" అన్నాడు చివరికి.

పనివాడు పిండి రుబ్బడం, చాకలావిడ పక్క రుబ్బురోట్లో చట్నీ రుబ్బడం మొదలెట్టారు.

హోటల్లో కస్టమర్లందరూ బయటికి వెళ్లకుండా ఈ పందెం చూడాలనే పట్టుదలతో లోపలే కూర్చున్నారు. ఈ పందెం విషయం హోటలు బయటికి పొక్కడంతో కొందరు బయట వాళ్ళుకూడా వచ్చారు. మొత్తానికి పాక కిక్కిరిసిపోయింది.

"మద్దిలో మంచినీళ్లు తాగొచ్చా" అమాయకంగా అడిగాడు పక్క బెంచి మీద కూర్చున్న కాశీ.

"ఉరే కాశీగా నీకీ 'ఏసకటం' ఎప్పుడు పోద్దిరా. యాభై ఇడ్లిలు మంచినీళ్లు తాక్కుండా ఏ యెదవైనా తినగలడ్రా" అన్నాడు చిరాగ్గా బుల్లబ్బాయి.

"పందెం మద్దిలో మీ ఇద్దరికీ గొడవ రాకూడదని, ముందే ఓ మాటనుకుంటే మంచిదని" నసిగాడు కాశీ.

"మంచినీళ్లు తాగొచ్చు" అన్నాడు దత్తుడు ఉదారంగా.

ఈలోగా ఇడ్లీలు, చట్నీ తయారయ్యాయి. వెంకటరావు దగ్గరుండి యాభై ఇడ్లీలు లెక్కపెట్టించి ఒక బేసినులోను, యాభై గరిటల చట్నీ ఒక గిన్నెలోను వేయిచుకుని షరాబు గారి మేనల్లుడుతో టేబులు మీద పెట్టించాడు. ఒక జగ్గుతో మంచినీళ్లు, ఒక ప్లేటు, ఒక గ్లాసు టేబులు మీదకొచ్చాయి.

"యాభై ఇడ్లీలు ఎంత టైములో తినాలి?" మళ్ళీ జనాంతికంగా అనుమాన పడ్డాడు కాశీ.

"ఉరేయ్ 'నెలతక్కువెదవా' మాకింకేవీ పనుల్లేవనుకుంటన్నావేంటిరా ఇక్కడే కూర్చుని ఇడ్లీలు తినడాన్కి. అక్కడ పొలంలో బోల్డంత పని పెట్టుకున్నాంరా. వాడు వరసగా తింటాళ్ళే. నేనున్నాగా చూసుకోడాన్కి. నువ్వు నోర్మూస్కుని కూకో" విసుక్కున్నాడు వెంకటరావు.

బుల్లబ్బాయి ప్లేటు ముందుకు లాక్కుని బేసినులోని ఇడ్లీలు, గిన్నెలోని చట్నీ వేసుకుని తినడం మొదలెట్టాడు. ఒకదాని తరవాతొకటి తాపీగా, ఒకే స్పీడులో, వంచిన తలెత్తకుండా, ఏమాత్రం భుక్తాయాసం లేకుండా తింటున్నాడు. మధ్య మధ్యలో జగ్గులోని మంచినీళ్లు గ్లాసులోకి వంచుకుని తాగుతున్నాడు. చుట్టూవుండి చూస్తున్న వాళ్లంతా కాళ్ళు చేతులు కదపడం మర్చిపోయారు. నోరు మెదపటం మరిచిపోయారు. కళ్లప్పగించి బుల్లబ్బాయి చేతివంక నోటివంక చూస్తూ కూర్చున్నారు. బుల్లబ్బాయి చివరగా యాభైయ్యో ఇడ్లీ తిని ఓ గుక్కెడు మంచినీళ్లు తాగి వంగిన తలెత్తాడు. ముఖంలో విజయ గర్వం, గెలిచాననే తృప్తి. కళ్ళల్లో ఇడ్లీల్లాంటి తెల్లటి మెరుపు. చూస్తున్న జనంలో ఒక్కసారిగా కదలిక వచ్చింది. "బుల్లబ్బాయి గెలిచాడు, యాభై ఇడ్లీలు తినేసాడు" అని ఒక్కసారిగా అరవడం మొదలెట్టారు. ఆ అరుపులతో పాక దద్దరిల్లుతుండగా, దత్తుడు ఒకసారి బేసినిలోకి, చట్నిగిన్నెలోకి తొంగిచూసి "కుదర్దు" అని అరిచాడు. ఈ అరుపు విన్న జనం వాళ్ళ అరుపులు మానేసి విస్తుపోయి చూస్తున్నారు.

"చట్నీ ఉంచేసాడు. మొత్తం తినలేదు" అన్నాడు దత్తుడు పందానికి మెలిక పెట్టే ఉద్దేశంతో.

బుల్లబ్బాయి ముఖంలో చెప్పలేనంత కోపం. కళ్ళు చట్నీ రంగులోకి మారాయి.

"ఇదేం బాలేదు" అన్నాడు బుల్లబ్బాయి.

"చట్నీ బావున్నా, బాగోపోయినా తినాల్సిందే" అన్నాడు దత్తుడు ఓడిపోతున్నానన్న ఉక్రోషంతో.

"నేను బాలేదన్నది చట్నీ కాదు, నువ్వు పెట్టిన మెలిక" అన్నాడు బాధతో బుల్లబ్బాయి.

జనమంతా "ఇది అన్యాయం, ఇది అన్యాయం" అని అరవడం మొదలెట్టారు.

మధ్యవర్తిగా ఉన్న వెంకటరావు ఏదో చెప్దామని నోరు విప్పేలోపల, బుల్లబ్బాయి గ్లాసులో కొద్దిగా మిగిలిన నీళ్లు తాగేసి, గిన్నెలో మిగిలిపోయిన చట్నీ గ్లాసులోకి వంచుకుని, గ్లాసెత్తి గడగడా తాగేశాడు.

జనమంతా రెట్టించిన ఉత్సాహంతో "బుల్లబ్బాయి జిందాబాద్" అని మళ్ళీ అరవడం మొదలెట్టారు. ఉత్సాహవంతులైన నలుగురు కుర్రాళ్ళు ముందుకొచ్చి బుల్లబ్బాయిని భుజాలపై ఎత్తుకుని పైకి లేపేశారు. వాళ్ళు కిందకు దించగానే, దత్తుడు బుల్లబ్బాయిని కావిలించుకొని "నువ్వొట్టి కబుర్లోడివి కాదురా, మంచి గట్టోడివిరా" అని జేబులోంచి వంద రూపాయల నోటు తీసి బుల్లబ్బాయి జేబులో పెట్టేసాడు.

వెంకటరావు ఆనందానికి అంతు లేదు. తమ్ముడి గెలుపు అతనికి గర్వంగా ఉంది. బుల్లబ్బాయి వంక చూసి "నువ్వింటికెళ్ళు, నేను మాఇంటికెళ్లి ఓ పదినిమిషాల్లో మీ అత్తారింటికొత్తాను. నువ్వు రాగలిగితే ఇద్దరం కలిసి పొలవెళ్దాం" అన్నాడు.

బుల్లబ్బాయి సంతోషంతో తాపీగా నడచుకొంటూ అత్తరింటికెళ్లిపోయాడు.

ఓ పావుగంటయింతరవాత వెంకటరావు సైకిలుమీద బయలుదేరి బుల్లబ్బాయి అత్తారింటికెళ్ళాడు, అతన్ని పొలం పిలుచుకెళదామని. ఇంటరుగుమీద బుల్లబ్బాయి బావమరిది తోటి పిల్లలతో ఆడుకుంటుంటే "మీ బావ పొలవస్తాడేమో అడగరా" అన్నాడు వెంకటరావు. బుల్లబ్బాయి బావమరిది లోపలికెళ్ళొచ్చి "మా బావకింకో పదినిమిషాలు పడద్దంట" అని చెప్పాడు.

"లోపలేంజేత్తన్నాడ్రా మీ బావ"

"చద్దన్నం తింటన్నాడు"

" ఆ..............!!" ఆశ్చర్యపోయాడు వెంకటరావు.

## ఓ..నందికేశ్వరా...! చివుకుల పద్మజ

మెల్బోర్న్, ఆస్ట్రేలియా.. సాయంకాలం 6 గంటలు.

ఆఫీస్ లో పని ముగించుకుని, లాప్ టాప్ సర్దుకుని, "బై మిస్టర్ స్టీఫెన్" అని నా కొలీగ్ తో చెప్పి బయలుదేరబోతున్నాను.

ఇంతలో నా ఫోన్ కువకువ లాడింది. వాట్సాప్ మెసేజ్ నాన్న నుంచి, ఫ్రీ గా ఉంటే ఫోన్ చెయ్యమని.

"హాయ్ నాన్నా.. చెప్పండి" అన్నాను ఫోన్ చేసి.

"దివ్య పెళ్లి సాయంత్రం లైవ్ ఇస్తున్నారు. తప్పకుండా చూడమని చెప్పింది రా అమ్మ" పెళ్లి హడావిడి స్పష్టంగా తెలుస్తోంది పక్క నుంచి.

దివ్య నా మేనత్త కూతురు. నా కన్నా సంవత్సరం పెద్దది. మా మధ్య బంధుత్వం కన్నా స్నేహం ఎక్కువ.

"అమ్మ ఏం చేస్తోంది నాన్నా?" అడిగాను పార్కింగ్ లోకి నడుస్తూ.

"భోజనాల వడ్డన లో వుంది రా. పేరుకు నేను మేనమామనే కానీ హడావిడి అంతా మీ అమ్మదే. నువ్వు మీ అమ్మ ఒకటేగా, సందడి చెయ్యటం లో" మురిపెం తో కూడిన నిష్ఠూరం నాన్న గొంతులో.

నిజమే, నాకు అమ్మ పోలికే వచ్చింది. ఏ ఫంక్షన్ అయినా నేను మా అమ్మ చేసే సందడి ఇంతా అంతా ఉండదు. ఆడుతూ పాడుతూ ఆ పనులన్నీ చేసేస్తాం.

"సరే నాన్నా. రాత్రికి పెళ్లి చూసి రేపు మాట్లాడతా. బై మరి" ఫోన్ పెట్టేసి కార్ స్టార్ట్ చేశాను.

★★★

ఆఫీస్ ప్రాజెక్ట్ మీద ఆస్ట్రేలియా వచ్చాను 10 నెల్ల క్రితం. వర్క్ చివర్లో ఉందని లీవ్ ఇవ్వలేదు. పెళ్ళికి వెళ్ళటానికి వీలులేక పోయింది.



కౌ

చ.. ఫండా మిస్ అవుతున్నా.. మరోసారి వాపోతూ ఇంటి దారి పట్టా. మాస్టర్స్ ఇన్ బిజినెస్ చేస్తున్న ఇద్దరు పంజాబీ స్టూడెంట్స్ తో షేరింగ్ అకామడేషన్ ఇచ్చారు ఆఫీస్ తరపున. వాళ్ళూ చాల ఫ్రెండ్లీగా వుంటారు. చకచకా ఫ్రెష్ అప్ అయి కొంచెం మిగిలిపోయిన ఆఫీస్ వర్క్ చేసేసరికి నా రూమ్మేట్స్ వచ్చేసారు. ముగ్గురం కలిసి రోటి లు చేసుకుని బాతాఖానీ వేస్తూ డిన్నర్ ముగించాము.

ఇండియా కన్నా 4:30 గంటలు ముందు ఉంటుంది టైం ఇక్కడ. పెళ్లి ముహూర్తం 8 గంటలకి అంటే ఇక్కడ 12:30 కి. అరగంట ముందే లైవ్ స్టార్ట్ చేసారు. ఇంక పెళ్లి లోకి దూకి పోయా.

పెళ్లి మంటపం కనిపిస్తోంది. పెళ్ళికొడుకు పూజ చేస్తున్నాడు... దివ్యని బుట్టలో తెస్తున్నారు.. అరుగో, నాన్న బుట్ట మోస్తున్నారు మేనమామ కనుక. పర్లేదులే. బక్క పక్షి.. ఈజీ గానే మొయ్యచ్చు.

పెళ్లి తంతు వరసగా జరుగుతోంది.. జీలకర్ర–బెల్లం, మంగళ సూత్రం.. తలంబ్రాలు .. అమ్మ దివ్య వెనకే కూర్చుని చేసే హడావిడి చెప్పలేకపోతున్నా. చాల హుషారు గా జరుగుతోంది తలంబ్రాల కార్యక్రమం. తలంబ్రాలు పూర్తి కాగానే సడన్ గా ఒక్కసారిగా అమ్మ, దివ్య లైవ్ కెమెరా వైపు చూసి.."మిస్ యూ అభీ.." అని అరిచారు.

చెప్పలేని సంతోషం వేసింది.. అక్కడ లేనందుకు బాధ, ఇక్కడ వున్నా పెళ్లి చూడగలిగినందుకు తృప్తి .. ఇలా రకరకాల ఎమోషన్స్ లో ఉండగానే లైవ్ ముగిసింది. నాన్నకి, దివ్య కి మెసేజ్ పెట్టి, రేపు శనివారమేగా, తీరిగ్గా మాట్లాడదాం లెమ్మని చిన్నగా పక్క చేరా.

★★★

"నీ కాళ్ళను పట్టుకు వదలనన్నవి చూడే నా కనులు..ఆ చూపులనెల్ల తొక్కుకు వెళ్ళకు దయలేదా అసలు..."... అదే పనిగా ఫోన్ మోగటం ఎక్కడో లీల గా వినిపిస్తోంది. గబుక్కున లేచి చూసా. మా అమ్మమ్మ కాల్ అది.

మా అమ్మకు పిన్ని. మా స్వంత అమ్మమ్మ మా అమ్మ చిన్నతనం లోనే పోతే తనే మా అమ్మను పెంచింది. తన కొడుకు కోడలు ఇక్కడే ఉద్యోగాలు చేస్తున్నారు. అమ్మమ్మ ఇండియాకు ఆస్ట్రేలియాకు మధ్య తిరుగుతూ ఉంటుంది. పేరుకు నేనుండే ఫ్లాట్ ఇదే కానీ తీరిక సమయాలని వాళ్లింట్లోనే గడుపుతుంటా.

"చెప్పు అమ్మమ్మా.." అన్నాను

"అభీ.. ఏంట్రా ఫోన్ తీయవు. చాల సేపటినుంచి చేస్తున్నా" ఆత్రం గా అడుగుతోంది.

"రాత్రి లేట్ గా పడుకున్నా అమ్మమ్మా దివ్య పెళ్లి చూసి, అందుకే లేవలేకపోయా" నిద్రమత్తు లోనే సమాధానం ఇచ్చాను.

"సర్లే. లేచి కాస్త తెప్పరిల్లి ఫోన్ చెయ్యి. అర్జెంటు పని వుంది నీతో" అని పెట్టేసింది.

ఏంటబ్బా అంత అర్జెంటు అని నిద్ర మత్తు వదుల్చుకుని ఫోన్ చేశాను.

"ఎం లేదురా. కోడలి చేత వచ్చే ఆదివారం నందికేశ్వరుని నోము నోయిస్తున్నా. కావలసినవన్నీ ఈ వారమే తేవాలి. కాస్త నన్ను ఆ ఇండియన్ మార్కెట్స్ కి గానీ తీసుకువెళ్లావా అంటే.. నీకు మంచి పెళ్ళాం వస్తుంది రా"

"ఇంత మాత్రానికే అంత హడావిడిగా ఆవిడ రావటం ఎందుకులే అమ్మమ్మా.. రెడీ గా వుండు, ఒక గంట లో వస్తా" కాస్త కొంటెతనం చోటు చేసుకుంది నా మాటల్లో.

అయితే ఈ శని, ఆది వారాలు షాపింగ్ లో గడుస్తాయి అనుకుంటూ అమ్మమ్మ ని పిక్ చేసుకున్నా. ఇంకా ఆ రెండు రోజులు మెల్బోర్న్ వీధులన్నీ చుట్టేసాం, అమ్మమ్మ షాపింగ్ లో, నేను ఫోన్ లో పెళ్లి కబుర్లు ఫాలో చేస్తూ.

"మా నాయనే. చెప్పిన మాట విన్నావు. నా కొడుకూ వున్నాడు ఎందుకు".

"అమ్మమ్మా. నా కొడుకు అని తిడుతున్నావా నువ్వు?" .. మళ్ళీ టీజింగ్ ఇంతలో.

"అబ్బ. అదే లేరా .. మీ మావయ్య. పనుందని తప్పించుకున్నాడు. ఇహ కోడలేమో వచ్చే వారం ఎలాగూ నోముతో సరిపోతుంది. ఈ వారమన్నా రెస్ట్ తీసుకోకపోతే వారం అంతా పని చేయలేను అని సన్నాయి నొక్కింది రా"

"అంతేగా.. ఉద్యోగాలన్నాక తప్పదుగా" అన్నా.

"ఏమి తప్పదు రా. ఎన్నేళ్ల నుంచి ఇండియా వచ్చినప్పుడు నోము నోయిస్తా అంటే విన్నదా.. ఎప్పుడూ ఏదో ఒక సాకు. ఇహ లాభం లేదని నేనే మన వాళ్ళని పిల్చి పెడుతున్నా|నా ఈ కార్యక్రమం" అన్నది అతిశయంగా.

తనే మళ్ళీ " మీ అమ్మ బంగారు తల్లి రా. చెప్పిన మాట విన్నది. నీ చిన్నతనం లో నే దాని చేత తీర్పించేశా. ఇదే కాదు, చాలా చేయించా" అంది.

సరేలే, అసలే పెళ్లి సందడి తప్పి పోయింది, ఇదన్నా ఎంజాయ్ చేద్దాం అనుకుని సంబరపడ్డాను రాబోయే ఉపద్రవం తెలీక.

★★★

అనుకున్న ఆదివారం రానే వచ్చింది. అమ్మమ్మ వాళ్ళు వంటింటి పనుల్లో ఉంటే, నేను డెకరేషన్, మిగిలిన అరేంజ్మెంట్స్ చేశాను. ఇందులో నాకు హెల్పర్ మా మామయ్య కొడుకు ఏడేళ్ల వినీత్.

ఉదయం 6 కల్లా పూజ మొదలు పెట్టేసారు. 8 కల్లా రావాల్సిన వాళ్లు అందరు వచ్చేసారు బంధు మిత్ర సపరివార సమేతంగా.

"అందరూ కూర్చోండమ్మా. పూజ చివర్లో వుంది, కాంగానే టిఫిన్స్ చేద్దాం " అంది అమ్మమ్మ అందరిని సంబరంగా పలకరిస్తూ.

నైవేద్యం అవటం ఆలస్యం, ప్లేట్స్ తీసుకు వెళ్ళా వంటింట్లోకి. చాలా గిన్నెలున్నాయి. మూతలు తీసి చూస్తే అన్నిట్లో ఉండ్రాళ్ళు.. "ఆ.." అనుకుంటూ ఇంకా తీస్తే అల్లపచ్చడి, పల్లి పచ్చడీ ను.

"ఇంకేం లేవా అమ్మమ్మా, ఇదొక్కటేనా?"

"అదే కాదురా.. ఇవిగో శనగలు. పచ్చివి తినలేరని గుగ్గిళ్ళు చేశా.. ఇవి కూడా చేర్చు ప్లేట్స్ లో" పెద్ద టిఫిన్ నిండా అందించింది.

"మరీ ఇన్నెందుకు.. కాస్త తగ్గించి మంచి వేరే వెరైటీస్ చెయ్యచ్చుగా" అన్నాను.

"ఇవి ఇన్నేసి అని లెక్క ఉంటాయి రా. అంతే చెయ్యాలి" అని ఏదో నాకర్థం కానీ శేరు, మానిక భాషల్లో చెప్పింది.

సరేలే ఇంక, టిఫిన్ కేగా, భోజనాల్లో మంచివి చేస్తుందిలే అమ్మమ్మ... అనుకుంటూ అందరికి అందించే పని లో పడ్డాను. యధాప్రకారం, నా హెల్పర్ వినీత్, మరికొంత మంది వచ్చిన వాళ్లలోని లేడీసును.

టిఫిన్స్ కానిచ్చాక మంచి అల్లం టీ అందించింది మా మామయ్య భార్య, నాకు అత్తయ్య, సదరు నోము తిర్చుకుంటున్న వనితామణి.

మళ్ళీ మధ్యాహ్న భోజనాల తయారీ సాగుతోంది వంటింట్లో... ఆడవాళ్లు అక్కడ.. మగవాళ్ళం ఇక్కడ . తరతరాలుగా మా జాతికి మణిమకుటమైన పేకాటలో.. మహా క్రీడాస్ఫూర్తితో.

"అభీ..వినీత్.. రండర్రా. భోజన ఏర్పాట్లు చూడండి" 2 గంటల కల్లా అమ్మమ్మ పిలుపు.

ప్లేట్స్ పెట్టి, ఆధరువు లన్నీ వడ్డించి, అన్నం పళ్లెం కేసి చూస్తే ఏముంది, పొద్దుటి ఉండ్రాళ్ళు మళ్ళీ దర్శనమిచ్చాయి.

"అమ్మమ్మా. ఏంటివి? అన్నం కావాలి" అన్నా.

"ముందివి కానివ్వండి. అయిపోయాక మిగిలింది అన్నం వడ్డించచ్చు. ఉదయం అందరు నాజూకు తిళ్ళు తింటిరి. ఇవ్వేమో సాయంకాలానికి మిగలకూడదు. లేకపోతే వ్రతభంగం" చిన్నగా చెప్పింది.

"ఇవెలా తినాలి?" ఇంకా అయోమయం గానే వుంది.

"నీకన్ని వివరించాలి. పొడి చేసుకుని అన్నీ అందులో కలుపుకు తింటారు. పెట్టరా ముందు" గద్దించింది.

ఆల్రెడీ ఈ కాన్సెప్ట్ తెలుసేమో, పెద్దవాళ్ళనుండి ఏమి రియాక్షన్ రాలేదు. నా వయసు వాళ్లకు, పిల్లలకు మాత్రం నిలువుగుడ్లు పడ్డాయ్.

ఇక చూడండి. ఈ ప్రహసనం ఆలా ఆలా సాగింది. మాట్లాడితే ఉండ్రాళ్ళు, శనగలు ప్రత్యక్షం. ఎవరిని కదిలించినా వద్దొద్దని సాగిలపడే వాళ్ళే. నా చేత యధాశక్తి.. కాదు .. కాదు.. శక్తి కి మించి పూర్తిగా ఐపోయేదాకా తినిపించింది అమ్మమ్మ.

ఫ్లాట్ దగ్గరేగా. రాత్రి కి వెళ్ళిపోతా అని బతిమలాడి వచ్చేసాను. రాత్రంతా ఒకటే శనగల తేనుపులు. పొట్ట నిండా ఘటం వాయించచ్చు అనేంత గ్యాస్. తెలవారుతుండే సరికి టాయిలెట్ కి ప్రదక్షిణాలు మొదలు పెట్టా. ఆఫీస్ లేదు, పాడు లేదు. సాయంత్రం దాక అదే పని. ఈ దెబ్బ నన్ను 2 రోజులు ఆఫీస్ కి వెళ్లనివ్వలేదు. ఓ, నందికేశ్వరా! ఎంత పని చేశావయ్యా.. ఒక లక్ష సార్లు అనుకుని వుంటాను.

★★★

చిన్నగా కోలుకుని నా రొటీన్ లో పడిపోయాను. మా ప్రాజెక్ట్ దాదాపు అయిపోవచ్చింది.

ఆ సాయంత్రం మాములుగా అమ్మమ్మ దగ్గరికి వెళ్ళాను. చాల రోజులైంది ఈ మధ్య ఇక్కడికి వచ్చి, రోజూ పనెక్కువ ఉండటంతో ఎప్పట్లా కుదర్లేదు. నన్ను చూసి సంబర పడింది. మామూలు కబుర్లు అన్ని అయ్యాక,

"అభీ" గారం గా పిల్చింది.

"ఏంటి అమ్మమ్మా?"

"ఏం లేదురా, మొన్న అత్తయ్య చేత నోము పట్టించా కదా.. మళ్ళీ చేయాలిరా"

"ఇంకానా?" అదిరి పడ్డాను.

"అవును. మొన్న రెండేగా చేసింది. ఇంకా 7 వంటలు చేయాలిరా."

"ఏం చెయ్యాలి" నీరసంగా అడిగాను.

"ఆ.. పెద్దగా ఏం లేవు లే. పెసర గారెలు, చలిమిడి, పాయసం, చక్ర పొంగలినీ" కులాసాగా రివాల్వింగ్ చైర్లో ఊగుతోంది.

నా గుండెల్లో పెద్ద అగ్నిపర్వతం పేలింది. ఆమ్మో, మొన్న రెండిటికే నా పరిస్థితి అలాఅయింది. పెసలు, చలిమిళ్ళు తింటే నా గతేమి గాను దేశం కానీ దేశం లో. ఎట్లా తప్పించుకోవాలి ఈ ప్రమాదం. రకరకాలైన ఆలోచనలు.

దభాలున నా మనుసు కొక మహత్తరమైన ఆలోచన తట్టింది.

"ఒక 20 రోజుల్లోపు నేను వెళ్ళిపోతాను. ఎలాగు 2 నెలల్లో వినీత్ కి సెలవులు. వాళ్ళను తీసుకుని ఇండియా వచ్చేయండి. అక్కడ చేసుకోవచ్చు. చాలా మంది వుంటారు, అన్ని మిగిలిన వంటలు ఒక్కసారే చేయవచ్చు. అత్తయ్యని ఒప్పించే పూచి నాది." ఏమంటుందా అని టెన్షన్ గా చూస్తున్నా.

"అట్లా అంటావా" ఆలోచనలో పడ్డది.

ఆమ్మో ఇంకా ఆలస్యం చెయ్యకూడదు అని,

"అవును అమ్మమ్మా. ఇప్పుడు దివ్య వైపు బంధు బలగం కూడా చేరిందిగా. ఇంకా ఆలోచించకు. ఫిక్స్ అయిపో" నమ్మకంగా చెప్పా.

"సరే , నువ్వు ఇంత బాధ్యత తీసుకుంటానంటే నాదేముంది" అంది చిన్నగా.

అమ్మయ్య.. దివ్య ని ఇరికిస్తా.. లేకపోతే . . "ఎలాగూ 2 మంత్స్ లో వచ్చేస్తా కదా, అప్పుడు పెట్టుకోవే పెళ్లి" అంటే "కుదరదు అభీ.. వసంత్ ఏమంటారో" అని నీలుగుతుందా? చిన్నపటినుంచి కలిసి తిరిగాం, నేను లేకుండా తయ్యిమని పెళ్ళికి కూర్చుంటుందా.. వుండు.. దివ్యా,.. నిన్ను నందికేశ్వర నోముకి పిలిపించి, కొత్త పెళ్లికూతురు వని, నీకిస్తే మరీ మరీ మంచిదని చెప్పి, నీ చేత హీనపక్షం ఐదు పిండి వంటలన్నా తినిపించి నిన్నేడిపించక పోతే, నా పేరు అభీ నే కాదు.

ఆహా.. ఆలోచనే ఎంతో బాగుంది. ఇంక ఈ ఆనందంలో అమ్మమ్మ మాట్లాడుతున్న మాటలు వినిపించడమే మానేశాయి.

★★★

## ప్రజాసేవ (ప్రై)లిమిటెడ్

డా. రమణ యశస్వి

అది ఓట్లురాలు కాలం
అది ఎర వేయు సకలం
ప్రజాస్వామ్యంలో పెద్ద పండగ వచ్చేసింది
అది ఎన్నికల సంఘం కేంద్రప్రభుత్వంతో సంక్రమణ జరిగితే వచ్చే పండుగ
ప్రజలకు ,నేతలకు అది చలికాలమో ,ఎండాకాలమో తెలియని సందడి
అది ఓట్లు రాలుకాలం
అది ఓట్లు పట్టు గాలం

వేదిక మూడు వరసల కుర్చీలలో నేతలతో కిటకిట లాడుతోంది
మూతికొాక కార్డ్ లెస్ మైకు ,హార్ట్ లెస్ నేతలకు ఇచ్చారు
ఆ ఆవరణ తోలుకొచ్చిన జనంతో బిస్కట్లేస్తే రాలినట్లు వుంది

తాయిలాల కోసం లేని తోకలు వూపుతున్నట్లున్నారు చేతులూపుతూ . వాళ్లు పిడికిడంత బిర్యాని తో దేశమంటే గొర్రె మనుషులోయ్ అని నిరూపించడానికి సమాయత్త మవుతున్నారు .పిడికిలి బిగించి ఓటరు వజ్రాయుధాన్ని ధరించాల్సిన హస్తం బిర్యాని పొట్లానికి బానిసయింది

నాటు సారా మన సారా తాగి నరాలు జివ్వుమంటున్నాయి. జివ్వుమన్న నరాలు వణికి, వేలు ఏమి నొక్కుతుందో తెలీని మైకంలో ఓలలాడుతూ భావి భారత జ్యోతిష్యులు నోటు తీసుకుని జేబులో పెట్టుకుంటున్నారు .మధ్యలో ముఖ్య నేత గొట్టం గురవయ్య గురించి అందరూ పొగుడుతుంటే మైకులు పొంగి పొర్లుతున్నాయి అనుసంధానం చేసిన నదుల్లా . పార్టీ గుర్తు మొక్కజొన్న పొత్తు.

ఎవరు ఏమి మాట్లాడుతున్నారో వారికే తెలియట్లేదు . వాళ్ళల్లో ఎవరు ఏ పార్టీనో కూడా చాలామంది తేబడిన ప్రజలకు తెలీదు

ఇంత జరుగుతుంటే ఆ స్టేజ్ మధ్యలోని గొట్టం గురవయ్య సన్నగా మనసులో నవ్వుకున్నాడు .నేనెవరు ఎక్కడికి ఎదిగాను?అని స్వగతం లోకి రింగులు రింగులు గా జారుకున్నాడు .

పదోతరగతి పదిసార్లు దండెత్తినా అవ్వదని దృఢ నమ్మకంతో మా నాన్న నన్ను సుబ్బయ్య అండ్ కో పొగాకు కంపెనీ లో ఆఫీస్ బాయ్ గా అంటే టీలు కాఫీలు కప్పుల్లో పోసి ఇవ్వడం ,అక్కడకు వచ్చే దొరలకు చిల్లర పనులు చేసిపెట్టడం ఆ దొరలని చూస్తే బతికితే అలా బతకాలనిపించేది. ఏమి డబ్బు ఏమి దర్జా.

అలా డబ్బు మీద ప్రేమ పుట్టింది నాకు. స్థాయి పెరిగితే థాయ్ దాకా దేకవచ్చని అనిపించింది !

ప్రతి శనివారం పూజ చెయ్యడానికి వచ్చే పూజారి ఒకరు ఈ కంపెనీ లోనే నాకు పరిచయమయ్యారు. జీవితం మీద విరక్తి గా మీద వున్న నాకు ఆయన ఒక గొప్ప ఒయాసిస్ లాగా కనిపించారు . నాలో ఆత్మస్థైర్యాన్ని నింపారు .నాకు లోక జ్ఞానం నేర్పించారు. నా చెయ్యి చూసి నీది గొప్ప జాతకమని రాజకీయాలలోకి వెళితే బాగా రాణిస్తావని చెప్పారు. మధ్య మధ్య లో తమాషాగా పద్యాలు చెప్పేవాడు . ఆ కంపెనీ వాళ్ళు పేదలకు తక్కువ జీతాలిచ్చి లాభాలు ఎలాపొందుతారో ఇలా చెప్పాడు ఆయన పద్యంలో. .

సుబ్బయ్య అండ్ కో
పేదోళ్ల రక్తం పీల్చుకో
నేతల అండచూసుకో
దొరల డబ్బు దోచుకో
తరతరాలకు దాచుకో

.కొన్ని రోజుల తర్వాత స్వేచ్ఛ కావాలనిపించి ఆ వుద్యోగం మానేసాను ఏమి చెయ్యాలో తెలీక జీతం డబ్బుల్లో మిగుల్చుకున్న వాటితో రోడ్డుపక్కన మసాలా బండి పెట్టుకున్నాను జీరో యాపారం బాగా సాగింది. కూడబెట్టినది తెలివితేటలతో రెట్టింపు చేసుకున్నాను . కులం కలిసొచ్చింది. కాలం కూడా నని తర్వాత తెలిసొచ్చింది. మా కులం కార్పొ'రేటర్' తో రేటు మాట్లాడుకొని చౌక డిపో దక్కించుకున్నాను

పేద ప్రజలకి చౌక డిపో అది. నాకు మాత్రం కల్పతరువు ఆ డిపో .తప్పుడు కొలతలు ,కార్డుల తనఖాలు ,చీకటి అమ్మకాలు ,ఇలా ఎన్నిరకాలుగా డబ్బు సంపాదించాలో అన్ని రకాలుగా ఆ అడ్డు పెట్టుకుని సంపాదించాను . నాకు నవ్వు వచ్చే విషయమేమిటంటే ఆ వూర్లో అందరికి ప్రతి చౌక డిపోలో జరిగే ఆమ్యామ్యా తంతు తెలుసు. అది ప్రతి డిపోవాడు చేసుకోవచ్చన్నట్లు మాట్లాడుకొంటారు అదీ వాళ్ళ కులం వాడు అయితే ' మా వాడు చౌక డిపో పెట్టి బాగా సంపాదించాడు అని గర్వంగా ఫీల్ అవుతారు అలా హాయిగా జీరో టెన్షన్తో నేతలతో' మామూలు' గా ఉంటూ జనులతో జాగ్రత్తగా ఉంటూ జీవితంలో ఊహించని డబ్బు రుచిచూసాను .

డిపో మీద సంపాదించిన డబ్బులు కొన్నిటితో స్థానిక కేబుల్ టీవీ భాగస్వామ్యం తీసుకున్నాను.దాంట్లో బాగా లాభాలు వస్తున్నాయని తెలిసి . దానికి పేరు 'సీ . సీ ' టీవీ అని పేరు పెట్టాను తెలుగులో అయితే 'చూడు చూడు ' టీవీ అని నా ఉద్దేశం . అది కూడా నాకు చాలా సొమ్ములు మిగిల్చింది . నాకు అనిపించింది కేబుల్ నెట్ వర్క్ అంటే అనుసంధానించబడిన అవినీతి కనెక్షన్లు .సీసీటీవీ (CCTV ) అంటే టీవీ గా ఛానెలైజ్డ్ కరప్షన్ అని బాగా చదివి వూళ్ళో కొచ్చిన పిల్లలు అనడం నా చెవిన పడింది .పదో తరగతి తప్పిన నాకు ఊహించని డబ్బు .డాక్టర్లు ఇంజనీర్లు అయిన వాళ్ళు డబ్బు సంపాదించడానికి పడుతున్న పాట్లు చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతుంది నాకు .

అదే విషయం పూజారితో పంచుకుంటే ,'నీ చేతిలో గీతల మహత్యం అది' అంటూ చెయ్యి చూసి ఇప్పుడు నువ్వు రాజకీయాల్లో దూకితే ఎమ్మెల్యే కూడా అయిపోతావు అని భుజం తట్టి చెప్పాడు

ఈ సంభాషణ జరిగిన కొద్ది రోజులకే మునిసిపల్ ఎన్నికలు వచ్చాయి . మా చుట్టం కార్పొరేటర్ “నాకేమో వయసయిపోయింది మళ్ళీ నుంచోలేను ఈ సారి నా వార్డులో నా బదులు నువ్వు నుంచో” అని డీల్ మాట్లాడుకుని నన్ను నిలబెట్టి గెలిపించాడు సీటిచ్చినందుకు తనకు, తన ఓట్లు నాకువేయించినందుకు ఓటుకు ఇంత అని వాటికి ,నాకు పడిన వోట్లకి నేను కొనుక్కున్నందుకు కానీ చాలా డబ్బు వేస్ట్ అయింది. వేస్ట్ అంటే రాజకీయాల్లో విజయం కి మారుపేరు అనిపించింది.

తంతే గారెల బుట్టలో పడ్డట్లు కార్పొరేటర్ అవ్వడమే గొప్ప అనుకుంటే ,కు(గు)ల సమీకరణాల్లో నేను మేయర్ ని కూడా అయిపోయాను . ఓటుకు నోటు తీసుకున్న ప్రతి వాడికీ అవినీతి కాటు వేసాను అదృశ్య అవినీతి మర్రిచెట్టు ప్రజలు అనే నల్లరేగడి నేలలో మొలిచి ,అధికారులు పోసిన అధికారమనే నీరు తాగి , రాజకీయమ నే ఎరువు ,గాలితో విశ్వరూపం దాల్చింది

మేయర్ గా ఐదేళ్లు నాకు తోచినది చేసాను . గద్దెపై గద్దలా గడిపేశాను. ప్రజలకు ఏమిచేయాలో నిజంగా నాకు తెలీదు . అధికారులు ఎవరికి లాభం వున్న రీతిలో వారు నన్ను తప్పుడు తోవ పట్టించి అవినీతి రాజ్యమేలుకొన్నారు . అనుసంధానించబడిన అవినీతి ఛానళ్ళుగా ప్రవహించి ప్రజలు ఇంకా ఇంకా కష్టాల్లో కొట్టుకుపోయేలా చేసింది .

గుంతల రోడ్లు ,దుర్గంధపు దోమల కార్ఖానాల కాలువలు , క్షీణించిన పచ్చదనం ,పెరిగిన భూతాపం ఇవి నా రికార్డులు . వెరసి నాకు తెలియని బ్యాంకుల్ని ,భూముల్ని , అవినీతి కోణాలని , తిమింగళాలని పరిచయం చేసి పారిపోయింది ఐదేళ్ల కాల కోయిల . నా చుట్టూ ప్రైవేట్ సెక్యూరిటీ ,కులగుల గాళ్లు, భజన పరులు చేరారు.

అసెంబ్లీ ఎన్నికల్లో నన్ను అధికార పార్టీ అధిష్టానానికి సిఫార్సు చేశారు . మేయర్ అనుభవం ? డబ్బు ,కులబలగం ,నాకు ఎమ్మెల్యే టికెట్ వచ్చేలా చేశాయి.

పూజారిగారి పద్యాలు గుర్తొచ్చాయి

నాడు

ప్రజా సేవ అండ్ కో
సోలెడు బియ్యం వండుకో
హాయిగా తిని పండుకో
బరిలో విజయం అందుకో

నేడు

ప్రజాసేవ ముసుగేసుకో
పాదయాత్రలు చేసుకో
నాటు ,నోటు పంచుకో
బరిలో నుంచుని తేల్చుకో
నిస్సిగ్గుగా,దర్జాగా దండుకో

నేను నుంచున్న నియోజకవర్గం భౌగోళిక పరిస్థితులు ,ప్రజల స్థితిగతులు అక్కడ సమస్యలు నాకు తెలీవు . మైకు ఇస్తే సరిగా మాట్లాడలేని నన్ను ఎవరో తట్టి లేపారు .

కల చెదిరింది మైకు నా చేతికిచ్చారు.' వినేవాడు యెర్రివాడైతే పంది కూడా పాప్ సాంగ్ పాడుతుంది' అని ఎక్కడో విన్న సామెత గుర్తొచ్చిసన్నగా నవ్వుకుంటూ 'హలొ హలొ' అంటూ మైకు శబ్దంలో ఆ నవ్వుని కలిపేసాను

' నాకు ఓటెయ్యండి . అవినీతిని పారదోలుతాను . అభివృద్ధిని అందలం ఎక్కిస్తాను . రైతులకు న్యాయం చేస్తాను , పేదోళ్లకు కొత్త పథకాలు తెస్తాను, సారా మహమ్మారి అంతు చూస్తాను' . పూజారి గారు రాసిచ్చిన స్క్రిప్ట్ ని నట్టు నట్టులు గా మైకులోకి వంపుతున్నాను.

బిర్యాని పేకెట్లు చేతిలో ఉండటం వల్ల చప్పట్లు చప్పగా వున్నాయి .

జిందాబాద్ జిందాబాద్ గొట్టం గురవయ్య జిందాబాద్. తాగేసినట్లున్నారు పంచిన సారా పేకెట్లు . ముద్దముద్దగా వుంది జిందాబాద్ . మొక్కజొన్న 'పొత్తు' గుర్తుకే మనవోటు అంటూ స్టేజ్ పైన వున్నవాళ్ళందరూ పొత్తులు ఎత్తి చూపారు . పొత్తు గుర్తుకే మన ఓటు అని కింద నుండి అరుపులతో సభ ముగిసింది . స్టేజ్ దిగి కారెక్కాము ఇంకో సభ చేరుకోవడానికి .

ముందు చూస్తే 'గొయ్య' , వెనక చూస్తే 'నుయ్య' అని శీర్షిక పెట్టి ప్రతిపక్ష పార్టీ బాకా పేపరు గొట్టం గురవయ్యని ఉతికేసింది . అధికార పార్టీ అభ్యర్థి గొయ్య అంటే ,'గొ'ట్టం గురవ'య్య' ,నుయ్య అంటే సినిమా నటుడి పార్టీ అభ్యర్థి 'ను'లక పేర' య్య' అని అర్థం వచ్చేలా రాశారు

వీరిద్దరికీ ప్రజలు ఓట్లు వెయ్యడానికి 'ముందు గొయ్య వెనక నుయ్య ' అని సందేహిస్తున్నారనిఅందుకే వాళ్ళ పార్టీ అభ్యర్థి కుంచా కూనయ్యకి ఓట్లు వెయ్యండి అని ఆ వార్త సారాంశం .

ఇంకో పక్క మైకులోనుండి స్వతంత్ర అభ్యర్థి 'సేవయ్య' అరుపులు విన్పిస్తున్నాయి

ఓటు వజ్రాయుధం – వాడుకోండి
అవినీతికి ఆమడ దూరంలో ఉండండి
ఓటుకు నోటు తీసుకోకండి
ఓటుకు నాటు వేసుకోకండి
తాయిలాల బిస్కట్లు తిప్పి కొట్టండి
అన్నీ ఉచితం అంటే ఉతికి ఆరేయ్యండి
సారా నిషేధమ్ డిమాండ్ చెయ్యండి
కుల గోడల్ని కూల గొట్టండి
మత మౌఢ్యాన్ని విడనాడండి
అభివృద్ధికి అండగా ఉండండి
ఐదేళ్ల అక్షయ పాత్రని అందుకోండి
ఓటు వజ్రాయుధంలా ––––––

ఇలా గొంతెండి పోయేలా పాడుతున్నాడు. మైకు బొంగురు పోయింది. పాపం సేవయ్య సభలో జనం కొద్ది మందే వున్నారు. సేవయ్య ఐఏఎస్ ఆఫీసర్ వుద్యోగం వదులుకుని సేవ చేద్దామని వచ్చి స్వతంత్ర అభ్యర్థిగా నిలబడ్డాడు. కింద పడ్డాడు.

ఒకళ్ళనొకళ్ళు తిట్టుకోవడం ,ఒకళ్ళ అవినీతి ఇంకొకళ్ళు బైటపెట్టడం ,జనుల్ని అయోమయానికి గురిచేయడం ,కండువాలు మార్చుకోవడం ,కప్ప గంతులు ,గోడదూకడాలు , అనైతిక పొత్తులు వెరసి రాజకీయ వ్యభిచారానికి మీడియా సాక్షిగా తెర తీశారు.

ప్రతిపక్ష పార్టీ వాళ్ళ మద్దతు దారుల ఓట్లు తీసేస్తున్నారని ,ఎలక్ట్రానిక్ ఓటింగు మిషన్లు వద్దని ,దొంగ ఓట్లు సంసిద్ధం చేసుకుంటున్నారని , డబ్బులు సారాపంపిణీ సంసిద్ధమని ,కులాలవారీగా ఓటర్లని ప్రలోభపెడుతున్నారని ,మహిళలకు చీరలు ,కానుకలు ఇస్తున్నారని ,ఇలా పేపర్లలో వార్తలు వస్తున్నా ఎలక్షన్ కమీషను కానీ ,పోలీస్ వ్యవస్థగానీ ఏమి చెయ్యలేకపోయింది .

అన్ని అకృత్యాలతో మళ్ళీ ఇంకో ఎన్నికల పండగ జరిగిపోయింది . ఒక్క సామాన్యుడు ఎన్నికల్లో నిలబడలేకపోయాడు . కోట్లున్న ధనవంతులు ,పారిశ్రామిక వేత్తలు ,ఎన్నారైలు ,కోట్లకు కోట్లు ఖర్చు పెట్టి గెలిచారు అవి సంపాదించడం కోసం లంచాల బాట పట్టారు .

కాల కోయిల ఐదు కూతలు కూసింది
కుల గద్ద, ఐదేళ్ల అక్షయ పాత్రను తన్నుకు పోయింది

పూజారి పాడ్తుంటే ఎమ్మెల్యే 'గొయ్య' పడక్కుర్చీలో పడుకుని వింటూ నవ్వుకుంటున్నాడు .

ఎక్కువ ప్రజలు ఎక్కుడే
తక్కువ ప్రజలు తొక్కుడే
ఎక్కడి గొంగళి అక్కడే
డెవలపింగ్ ఇండియా నానుడే
సదా పేదోడికి టోపీల పెట్టుడే
సదా సామాన్యుడి సణుగుడే

★★★

# భయం డా.రూపేష్ ఆదిమూలం

భయం.ఇది నా హిస్టరీ లోనే లేదు. మనిషి బ్రైన్ పై ఎంతో విశ్వాసం ఉన్నవాణ్ణి. భయాలు అన్నీ మనిషి సృష్టించుకున్నవే అని రోజూ అందరికీ చెప్పేవాణ్ణి. కానీ నాకు కూడా భయపడే రోజు వస్తుందని తెలీదు.

ఆ రోజు మార్చ్ 28, 2020. రాత్రి అయ్యింది. ఇంట్లో ఒక్కడినే ఉన్నాను. మా వీధిలో జన సంచారం కూడా బొత్తిగా లేదు. ఒక్కడినే యూట్యూబ్ లో వీడియోలు చూస్తున్నాను. జీవితం అంటే అంటే ఏమిటి? మనిషి ఎక్కడినుంచి వచ్చాడు ? చనిపోయిన తరువాత ఎక్కడికి వెల్తాడు? ఇలాంటి ప్రశ్నలతో వేదాంతం చెప్పే వీడియోస్ చూడటం నా హాబీ. కోరికలతో పూజలు చేసేవాళ్లంటే అదో చిన్న చూపు. వాళ్లు తమ మీద తమకు నమ్మకం లేని వాళ్లుగా నాకు కనపడేవారు . వీటికి అతీతంగా ఎదగాలని అప్పుడే పరిణతి వస్తుందని లెక్చర్లు దంచడం నా హాబీ. నేనేదో ఇతరులకంటే ప్రత్యేకమైన వాణ్ణని నా నమ్మకం. అందరూ అసహ్యించుకునే సినిమాలు చూసి నేను ఓ పెద్ద మేథావిని అని నమ్మేవాడిని. మనుషులను పరిశీలిస్తున్నాను అని అనుకోవటమే కాదు, వాళ్లని ప్రశ్నించి సమాధానం రాకపోతే సంతోషపడేవాడిని.

ఆరోజు అలాంటి ఈ వీడియోస్ చూస్తుంటే , అప్పుడే వాట్సాప్లో ఒక మెస్సేజ్ వచ్చింది. "మార్చ్ 29 నుండి ఏప్రిల్ 2 మధ్యన అందరూ జాగ్రత్తగా ఉండాలని. ఎట్టి పరిస్థితులలో బయటకు వెళ్లవద్దని, ఏవో గ్రహాలు పట్టి పీడించపోతున్నాయని. " అది చూసి ఏమిటొ ఈ పిచ్చి మనుషులకు , యూ. కె. కి వచ్చినా ఈ పిచ్చి పోలేదు మనుషుల్లో అని అనుకుని నవ్వుకున్నా. అలా వీడియోలు చూస్తూ సమయం చూసుకోలేదు. గడియారం పన్నెండు గంటలు కొట్టింది. అర్ధరాత్రి పడుకుందామనుకుంటూ పై అంతస్తులోని నా బెడ్రూం లోకి వచ్చి కర్టెన్స్ వేసుకుందామని కిటికీ దగ్గరకు వచ్చాను . బయట ఏదో చప్పుడు అయినట్టు అనిపించటంతో బయటకు చూశాను. మిణుకు

మిణుకుమంటూ వీధిపాలు ఒక్కసారిగా ఆరిపోయాయి .వెలుగుతున్న నా రూం లో కూడా లైట్లు ఆరిపోయాయి. చుట్టుపక్కల ఇళ్లలో కూడా ఇంతే. చుట్టూ చిమ్మ చీకటి . ఇదేమిటి ఒక్కసారిగా ఇలా జరిగింది ? ఏదో కాకతాళీయం అని అనుకున్నా ,

మనసులో ఏదో తెలియని అలజడి . వాట్సాప్ లో మెస్సేజ్ గుర్తుకువచ్చి ఏదో కీడు జరుగుతోందని ఎక్కడో సందేహం . ఛ, ఇలా అనుకుంటున్ననేమిటి అని అనుకున్నాను. అసలు భయం అంటే తెలియనివాడిని ఇలా అనుకోవటమేమిటి అని అనుకున్నాను. ఇంతలో బయట పార్క్ చేసిన నా కార్ లైట్లు వెలిగి ఆరినట్లు అనిపించింది. అరే , కార్ కర్రెక్ట్ గానే లాక్ చేశానే , మరి ఇది ఏమిటి అని అనుకుంటూ , కార్ ఇంకా ఒకసారి లాక్ చేశాను .కార్ పక్కనే ఉన్న చెట్టు జడలు విచ్చుకున్న దయ్యంలా ఊగుతోంది . దయ్యాలు లేవు అనేవాణ్ణి మరి అది దయ్యంలా ఉంది అని ఎందుకనుకున్నాను అనుకుంటూ ఆ చెట్టునే చూస్తూ నుంచున్నాను. ఎవరో చెట్టు చాటుగా నించుని నన్నే చూస్తున్న సందేహం . ఒక్కసారిగా ఒళ్లు జలదరించి భయంతో బిక్క చచ్చి పోయాను . కానీ అంతలోనే తేరుకుని , నుదిటిపై పట్టిన చెమటను తుడుచుకుంటూ , మళ్లీ ఆ చెట్టు వైపే ొచూశాను .ఎవరూ కనపడలేదు . అంతా నిశ్శబ్దం. ఇంతలో దూరంగా చుక్ చుక్ మంటూ రైల్ వెళుతున్న శబ్దం . అదే ఆ రాత్రికి చివరి ట్రైన్ అనుకుంటా! ఆ నిశ్శబ్దంలో దాని చప్పుడుచాలా పెద్దగా వినపడుతోంది. . కొద్దికొద్దిగా ఆ శబ్దం కూడా దూరమయ్యింది . మళ్లీ అలుముకున్న నిశ్శబ్దం.

ఎక్కడినుంచో దూరంగా ఒక కార్ వెళుతున్న చప్పుడు . నెమ్మదిగా ఆ కార్ సౌండ్ అంతమయ్యింది .మళ్లీ అలుముకున్న నిశ్శబ్దం . అలా ఆ నిశ్శబ్దాన్నే గమనిస్తూ నుంచున్నాను. నిశ్శబ్దం ఎంత భయకరంగా ఉంటుందో ఎప్పుడో త్రివిక్రం సినిమాలో డైలాగ్ లా విన్నాను కాని ఇప్పుడు ఎంత భయంకరంగా ఉంటుందో తెలుస్తోంది . భయం భయంగా కిటికీ తెరిచి చూశాను

తుప్పపట్టి చలికి బిగుసుకుని ఉందేమో . మొరాయించి ఒక్కసారిగా తెరుచుకుంది

ఎముకలు కొరికే చలి ఒక్కసారిగా కమ్మి వణికిపోయాను .ఉన్నట్టుండి హోరు గాలి మొదలయ్యింది.

బయట చెట్లన్నీ హోరుగాలికి ఊగి పోతున్నాయి

స్మశాన నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ హోరుగాలి దెయ్యపు చప్పుడు చేస్తున్నది .

దూరంగా ఎక్కడో తీతువు అరుస్తున్న చప్పుడు .

ఏదో ఉపద్రవం రాబోతందని మనసు హెచ్చరించింది .

వణుకుతున్న చేతులతో కిటికీ గట్టిగా పట్టుకున్నాను.

ఈ రాత్రి కాళరాత్రి కాబోతోందని సంకేతమా అన్నట్టు ఒక ఒక పెద్ద మెరుపు మెరిసింది . అంతలోనే పెద్ద వర్షం . ఒక నిమిషంలోనే అది ఆగిపొయ్యింది. పక్కింటి కుక్క అరుపులు. ఆ వీధిలో ఉన్న పెంపుడు కుక్కలన్నీ దానితో జత కలిపాయి. ఏదో భయం వేస్తున్నా , నన్ను నేను తమాయించుకున్నాను.

కళ్లు మూసుకుని పడుకుందామనుకున్నాను. కాసేసు ఆ నిశ్శబ్దంలో అంతా అసహనంగా ఉంది. కానీ ఇంట్లో ఒక్కడినే ఉన్నాను, తలుపులన్నీ జాగ్రత్తగా వేసుకోవాలని, కిందికి వెళ్లి చూశాను ముందు గది తలుపు మూసే ఉంది . కానీ తాళం వేసిలేదు . గుండె ఝల్లు మంది . అసలే దొంగలు తిరుగుతున్నారు. సాయంత్రమే వేసేశానే , ఇది ఏమిటి అని అనుకుంటూ, గడి వేసి వెనక గది బయట కూడా తలుపు వెద్దామని ఒక్కొక్క అడుగూ కూడ గట్టు కుంటూ, నెమ్మదిగా వెళ్లి వెనకగది తలుపు తీశాను .ఆ గదిలో ఫ్రిజ్ చేస్తున్న చప్పుడు ఏదో భయం కలిగించింది . వెనక తలుపు వద్దకు వెళ్లాలంటే భయం. వెనక తోటలో చెట్లు ఊగుతూ ఉన్నాయి . అప్పుడప్పుడూ తోటలోకి ఒక నక్క కూడా వస్తుంటుంది . నేను తరిమే వాడిని. కానీ ఈమధ్య అది నన్ను చూసి బెదిరిపోవటం లేదు. భయమేస్తున్నా ఒక్కో అడుగూ వేసుకుంటూ

వెళుతున్నాను . అడుగు తీసి అడుగు వేస్తుంటే క్రింద చక్కలు చేసే చప్పుడు, ఆ నిశ్శబ్దంలో పెద్ద చప్పుడు చేస్తున్నాయి.ఏదయితేనేం తలుపు కొద్దిగా నెట్టి చూశాను . కానీ ఒక్కసారిగా అది కిర్రున చప్పుడు చేస్తూ తెరుచుకుంది. ఒక్కసారిగా తుళ్లి పడబోయి తమాయించుకున్నాను కానీ, దాదాపు గావు కేక పెట్టిన పని చేశాను. అయినా తమాయించుకుని బయటకు చూశాను. ఎప్పుడో ఉదయం ఆరేసిన నా రెండు జతల బట్టలు గాలికి ఊగుతున్నాయి. అవి చీకట్లో ఏది దయ్యం ఊగుతున్నట్లుగా ఊగుతున్నాయి. త్వరగా ఆ రెండిటినీ తీసుకొద్దామని బయటకు వెళ్లాను . ఒక్కసారిగా ఒక పెద్ద వెలుగు వెలిగింది. కాళ్లు రెండూ ఆగి పోయాయి. కానీ అంతలోనే అది నేను పెట్టిన సెన్సార్ లైట్ అని గుర్తుకొచ్చి కాస్త ధైర్యం వచ్చింది . ఆ వెలుగులో ఆ రెండు జతలూ తీసుకుని లోపలికి వచ్చి తలుపు వేసి అక్కడే నుంచుని ఆలోచిస్తున్నాను. తలుపులూ మూసుకునే ఉన్నాయి కానీ, తాళం వేసి లేదు. అన్ని తలుపులూ పెండలాడే వేసేశాను కానీ, అన్నీ తెరిచి ఉన్నాయి ఎందుకు? తొందరగానే తాళం వేశానే ! లేక వేశానని అనుకున్నానా? లేదు నా జ్ఞాపకం గట్టిది. ఖచ్చితంగా వేశాను . అంటే తలుపులు తీసుకుని ఎవరైనా వచ్చారా? వాళ్లు నా ఇంట్లోనే ఇప్పుడు ఉన్నారా? అంతే ఇక నా ఊపిరి బిక్కచచ్చిపోయింది.

నా ఇంట్లో నాకు తెలీకుండా ఎవరో ఉన్నారేమో అన్న ఊహే నా వెన్నులో వణుకు పుట్టించింది. ఇంతలో తలుపు అద్దాల బయట మళ్లీ మెరుపులా లైట్ వెలిగింది. చటుక్కున అటు చూశాను . అక్కడ నోరు తెరుచుకుని నా వైపే చూస్తున్న ఓ నక్క. లైట్ వెలుగులో దాని కళ్లు రెండు నిప్పు కణికల్లా ఉన్నాయి. దాని చూపులు నన్ను ఆమాంతం మింగేసేలా ఉన్నాయి. చచ్చిపోతానేమో భయంతో ఒక్క గావు కేక పెట్టి , ఇంట్లో ఎవరైనా ఉన్న భయాన్ని కూడా మరిచిపోయి ఒక్క ఉదుటున పైకి పరిగెత్తి , నా బెడ్రూం లో దూరి తలుపు బిగించుకున్నాను. గుండె దడ దడా కొట్టుకుంటోంది. వళ్లంతా చెమటలు పట్టేశాయి . శ్వాస తీసుకోవటం కూడా కష్టం అవుతోంది . ఈ రాత్రి ఎలా గడుస్తోందో అన్న భయం ఎక్కువైంది. ఎందుకిలా జరిగింది ? ఉన్నట్టుండి నా ఇంట్లో నేనే భయపడుతున్నానేమిటి? నా ఇంటి తలుపులు రెండు పక్కలా ఎవరు తీసి ఉంటారు? నా ఇంట్లో ఇంకా ఎవరున్నారు? నా మీద హత్యాప్రయత్నమేదైనా జరుగుతోందా? నేను ఎవరికీ ఎప్పుడు అపకారమైనా చెయ్యలేదే! ఈ ఆలోచనల్లో భయం అంతకంతకూ పెరుగుతోంది. ఖంగారులో తలుపులు సరిగ్గా వేశానా లేదా? ఆ పాడు నక్క లోపలికి. ఏమైనా వచ్చిందా ? ఇలా ఆలోచిస్తూంటే ఏం చేయాలో పాలు పోవటం లేదు. భయం తో అలానే కూర్చుండి పోయాను . కాసేపటికి కొద్దిగా టెన్షన్ తగ్గుతున్నట్లనిపించింది . ఒకసారి క్రిందికి వెళ్లి చూడాలంటే భయం. ఆ నక్క లోపలికి వచ్చిందేమో, ఇంకా ఎవరైనా ఉండుంటే నామీద దాడి చేస్తే... ఇలా అనుకుంటుంటే నాలుక పిడచకట్టుకుని దాహం వేస్తోంది. కానీ కిందికి వెళ్లాలంటే భయం. కాసేపు తటపటాయించి క్రిందకు వెళ్లాలని అనుకున్నా . అసలు ఎప్పుడూ భయం లేని నాకు ఇప్పుడు భయం కలుగుతోంది. నా మాటల మాయజాలంతో ఎందరి భయాలనో పోగొట్టిన నేను ఇలా భయపడుతున్నానేమిటి ? నో ! నేను భయపడ కూడదు అని అనుకుంటూ కాసేపు రెలాక్సేషన్ ప్రాక్టీస్ చేశాను . కాస్త అలజడి తగ్గిన తరువాత నెమ్మదిగా తలుపు తీసి క్రిందకు వెళ్లి నీళ్లు తాగుతున్నాను.

ఉన్నట్లుండి తలుపు గట్టిగా మోదిన శబ్దంతో గుండె గుభేల్ మంది. అక్కడ పరుగెడితే నా బెడ్ రూంలో పడ్డాను. నేను త్రాగుతున్న గ్లాస్ ఒలికి నీళ్లన్నీ నా మీద పడటం చూసుకోలేదు. గట్టిగా రూం తలుపు బిగించి కూర్చున్నాను. త్రాగుతున్న నీళ్లు గొంతుకు అడ్డంపడి పొరపోవటం వల్ల దగ్గు వచ్చి గాలి తీసుకోలేక ఇబ్బంది పడ్డాను. మొదటిసారి చచ్చిపోతానేమో అన్న భయం నన్ను వెంటాడింది. అంతే ఒణికి పోయాను. నా పిల్లలు , పెళ్లాం, అమ్మ, నాన్న అందరూ గుర్తొచ్చారు. వెంటనే ఏడుపొచ్చింది. నేను చనిపోతే అందరూ ఏడుస్తుంటారు .నేను అప్పుడు అది చూడలేను. నేను కష్టపడి సంపాదించినదంతా అనుభవించకుండా పోతానా? మరి నేను లేక పోతే నా చిన్ని కన్న ఎలా ఉంటాడు ? వాడు ఏడిస్తే ఎవరు ఊరుకోపెడతారు? చిన్నప్పుడు అమ్మ నాన్నలకు దూరంగా పెరిగిన పిల్లలు మానసిక సమస్యలతో బాధపడటం కళ్లారా చూసినవాణ్ణి. నా చిన్ని కన్న అలా అయిపోతాడా? వాడి భవిష్యత్తు ఏమవుతుంది? విల్లు కూడా రాయలేదు . వాడికి ఆస్తి

అందుతుందా? గవర్నమెంట్ లాగేసుకోదు కదా? లేదులే ఈ మధ్యే చదివాను . పిల్లలకు అది చెందుతుందంట. అయినా ఇంకొంచెం సంపాదించాల్సింది . పిల్లలకు కావల్సినంత ఉండేది కదా! ఇంకొంచెం ఎక్కువ సంపాదించనదుకు నా మీద నాకు కోపం వచ్చింది. సంపాదించరా అని పెద్దవాళ్లు అంటుంటే జీవితాన్ని అనుభవించాలని ,డబ్బు ఆశలో జీవించవద్దని ,వట్టి శుష్క వేదాంతం చెప్తుండే వాడిని . ఇప్పుడు తెలుస్తుంది. అయినా నా పెళ్లాన్ని అనాలి డబ్బులన్నీ తగలేస్తుంది కాని ఎప్పుడన్నా సంపాదించి చచ్చిందా? నేనే ఎప్పుడూ నా వళ్లు హూనం చేసుకుని సంపాదించడమే కానీ నా సుఖం ఎప్పుడూ చూస్కోలేదు.అందరూ నా మీద పడి తిన్నవాళ్లే. నాకు ఎవరూ సహాయపడలేదు . ఇప్పుడు నా ఖర్మన నన్ను వదిలేసి అది హాయిగా తగుదునమ్మా అది పెళ్లికి పోయింది.నేను ఛస్తే దానికేం? హాయిగా నా డబ్బు ఉందిగా ఇంకొకడిని పెళ్లి చేసుకుని ఊరేగుతుంది. వెంటనే నా పటం గోడకు వెళ్లాడుతున్నట్లు అది దాని కొత్త మొగుడు కలిసి దీపం పెడుతున్నట్టు పాత సినిమా క్లిప్పింగ్లు కళ్ల ముందు మెదిలాయి. కానీ అంతలో ఒక మెరుపు మెరిసి గోడపై ఉన్న మా పెళ్లి ఫోటో పై పడి నా ఆలోచనల్ని భగ్నం చేశాయి. అమ్మయకంగా నవ్వుతున్న నా భార్య ముఖం నన్ను చూసి నవ్వుతున్నట్లు అనిపించింది.

నేను అలా ఆలోచిస్తున్నందుకు నా మీద నాకు అసహ్యం వేసింది. ఎప్పుడూ ఆదర్శాలు వల్లించే నాలో ఇంత గా అభద్రత దాక్కుని ఉన్నదా? ఎదిగాను అనుకున్నాను కానీ ఇంకా ఎదగలేదు. ఇలా అనుకుంటుంటే కింద మళ్లీ అలికిడైన చప్పుడు. మళ్లీ నాలో భయం. ఎవరక్కడ? అని అరుద్దామంటే గొంతు పెగలటం లేదు. గొంతు ఎండి పోయింది .కాళ్లు వణుకుతున్నాయి. నెమ్మదిగా కష్టం చేసుకుని ఎవరు అని పెద్దగా అరుద్దామంటే చిన్నా అన్నాను. నెమ్మదిగా నోరు పెగుల్చుకుని గట్టిగా అరిచాను .సమాధానం లేదు. ఎవరైనా ఉంటే ఏమిటి? నెమ్మదిగా ఆలోచిస్తే ఉండరేమో అనిపించింది. కొద్దిగా ధైర్యం తెచ్చుకుని, నెమ్మదిగా డోర్ ఓపెన్ చేసి ఒక్కొక్క రూముల్లో లైట్ వేసి చూశాను. ఎవ్వరూ కనపడలేదు.

ఇంట్లో ఎవరూ లేరన్న విషయం అర్థం అయిన తరువాత ధైర్యం వచ్చింది . అన్ని లైట్స్ ఆపి బెడ్ రూం కి వచ్చాను .తలుపు గడియ పెట్టుకుని పడుకుందామని బెడ్ పై పడుకుంటే, బయట హోరుగాలి చెసే ఈల శబ్దం మృత్యుదేవత చేసే చప్పుడులా ఉంది. మళ్లీ ఏదో సందేహం ! ఈ రోజు ఏదో ఉపద్రవం రాబోతుందని యూట్యూబ్ లో చూశాను . అది నిజం కాబోతోందా ? ఛ ఇదేంటి అనుకుంటూ , టివి ఆన్ చేశా . టైటానిక్ సినిమా వస్తూంది. షిప్ మునుగుతుంటే , కొందరు ప్రయాణీకులకి కష్టం తెలియకుండా వైయోలిన్ వాయిస్తున్నారు. అది నాకేదే నేను చావటానికి ముందు నాకు కష్టం తెలీకుండా ఏర్పాటు చేసినట్టు అనిపించింది . ఛీ ఇదేంటి అనుకుంటుంటే ఎవరొ పరుగుగెడుతున్న చప్పుడు ... అంతే భయం భయం ... కొంపతీసి దయ్యం కానీ ఉందా? ఆ ఆలోచన రాగానే , పై ప్రాణాలు పైనే పోయాయి. నాకు తెలీకుండానే ఆంజనేయ దండకం చదవటం మొదలుపెట్టాను. ఎప్పుడు అమ్మ చదువుతుంటే నవ్వేవాడిని . దయ్యం దెబ్బకు దేవుడు గుర్తొచ్చాడు. నెమ్మదిగా పోలిస్ కి ఫోన్ చేద్దామనుకున్నా .కానీ వాళ్లు పిచ్చి అని హాస్పిటల్కి తీసుకెల్తే , నా పరువేంకానూ ! వెంటనే ఆ ఆలోచన వదిలేసి , ఫ్రెండ్స్ కి ఫోన్ చేద్దామనుకున్నా. మ్మ్ వద్దు. వాళ్లు రేపటి నుండి ఆట పట్టిస్తారు . వాళ్లముందు ఎప్పుడూ తెగ ఫోజ్ కొట్టేవాడిని కదా. ఎవరినీ హెల్ప్ అడగలేని నా స్థితి చూసి నా మీద నాకు కోపం , జాలి కలిగాయి. నన్ను ఒదిలి వెళ్లిన పెళ్లాం పై పిచ్చి కోపం వచ్చింది. ఇంతలో పెద్ద శబ్దంతో కిటికీ బ్రద్దలయింది . మంచంపై బిక్కచచ్చిపోయి పడుకున్నాను . ఓ పెద్ద రాకాసి నిప్పులు చెరుగుతూ నాపై పడింది. పెద్ద కోరలు , నిప్పుల్లాంటి కళ్లు. వాడి గోళ్లు నా గుండెపై ఆనించింది. అంతా నిశ్శబ్దం . జాగ్రత్తగా చూస్తే అది ఓ రాకాసి కోడి. ఎప్పుడూ కోడి దయ్యం గూర్చి వినలేదు. కోళ్లలో కూడా దయ్యాలుంటాయన్నమాట. అరుద్దామంటే నోరు పెగలటం లేదు. నెమ్మదిగా "ఎందుకు నా .. నా మీద పడ్డావ్ ? ఎవరు నువ్వు ? అని ఒక్కో మాట కూడ దీసుకుని అడిగాను .

"నన్ను ఎన్నోసార్లు నువ్వు చంపి తిన్నావ్ ? నీ పై పగ.. ఇప్పుడు నిన్ను చంపుతా.. "

"నేను నిన్ను ఎప్పుడు చంపాను. ఎవరికీ హాని కూడా తలపెట్టనే ."

"రేయ్ నీకు కోడి కూర చాలా ఇష్టం కదా. ఎన్ని కోళ్లను చంపి ఉంటావ్? "అని అంది

వణికిపోతూ అన్నాను "అయ్యో , నిన్ను నేను చంపలేదు . షాప్ వాడు చంపాడు ."

"అవునురా వాడు నివ్వు తింటున్నావని , నీ కోసం చంపానంటున్నాడు . శిక్ష నీకే .. నీ కోరిక వల్లే మా కోళ్లు చచ్చాయి . అందుకె వచ్చా ".

"మరి నా కోరికని చంపు . నన్నెందుకు చంపుతున్నావ్? "

"నిన్ను చంపితే కదరా కోరిక చచ్చేది ? నువ్వు పుట్టాక కోరిక పుట్టిందా లేక కోరిక పుట్టి నువ్వు పుట్టావా? "

"ఓరి దేవుడా , చికెన్ తినాలన్న చిన్న కోరిక నా చావుకొచ్చిందా ? మరి గబ్బిలాలు కూడా తింటారట . మరి వారి సంగతేంటి ? "

"ఉందిరా అందరికీ మహమ్మారి ఉంది . అందరి పని పడుతోంది ."

నాకేమీ అర్థం కావటంలేదు. ఏంటి ఈరాత్రి ఇలా అవుతోంది. కోడి ఏంటి దయ్యం ఏమిటి ? అది నన్ను చంపటానికి రావటం ఏంటి?

ఒక పెద్ద వెలుగు ఆ రాకాసి నుండి వచ్చింది. అది చూడలేక కళ్లు మూసుకున్నాను.

"అయ్యో దేవుడా! అందరికీ నీ జీవితాన్ని అనుభవించు. అంతులేని విజయాన్ని అందుకో అని పర్సనాలిటి డెవ్లప్మెంట్ క్లాసులు చెప్పాను. ఈ అంతులేని కోరికలతో మరి మానవజాతి ఏమవుతుందో? కోడే కదా అని ఎప్పుడూ ఆలోంచించలేదు . కానీ ఈ కోడే నా బ్రతుకు అంతం చేస్తుందనుకోలేదు. మనిషిని ఏదీ ఏమి చెయ్యలేదు. అనుకున్నా. చివరకు ఇలా చస్తున్నా. అన్నిటా నిండిన ప్రాణం ఒకటే. నా ప్రాణం పై తీపి అన్ని ప్రాణాలకూ ఉంటుందిగా . ఎప్పుడూ ఇలా ఆలోచించలేదు. ఈ ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరి అవుతూ , ఒక్కసారి ఉన్నాడో , లేడో ఆ దేవుడు గుర్తొచ్చాడు . నాన్న చిన్నప్పుడు చెప్పిన గజేంద్ర మోక్షం గుర్తుకొచ్చింది. అన్ని సంశయాలు తీరి ఏనుగు చేసిన ప్రార్థన విని అ శ్రీహరి దిగి వచ్చాడట. మరి నాకోసం రాడా? మరి ప్రాణం పోయినపుడు ఆ కోళ్లు చేసిన రోదన మాటేమిటి? అప్పుడు రాలేదేం దేవుడు. లేదు రాడు. ఇప్పుడు మాత్రం ఎందుకు వస్తాడు. అన్నీ నేనే చేసి దేవుణ్ణి రమ్మంటే ఆయన ఎందుకు వస్తాడు. నా కర్మకు ఫలితం అనుభవించాల్సిందే. ఇక జన్మ వద్దు, మరణం వద్దు .మరు జన్మ ఉంటే మళ్లీ కోరికలు లేకుండా చెయ్యి స్వామి అని లేని దేవుణ్ణి మనస్పూర్తిగా కోరుకున్నాను . మళ్లీ కళ్లు తెరిస్తే వెలుగు , ఓ భీకరమైన కాంతి. అది చూడలేక స్వామీ రామా అని అరుస్తూ కళ్లు మూసుకున్నా. నా చెంపలు రెండూ అది వాయిస్తుంటే కళ్లు తెరిచాను.ఎదురుగా కళ్లు చెదిరే కాంతి . కళ్లు నులుముకుని చూస్తే.. కోడి లేదు ...

సూర్యుడి కాంతి నా ముఖంపై పడుతోంది. పక్క నుండి మా ఆవిడ “ఏంటి అరుస్తున్నారు ? పీడ కలమైనా వచ్చిందా? ఆ చెత్త యూట్యూబ్ లో చెత్త చూడొద్దంటే వినరు.” అని అరుస్తోంది. నాన్నకు ఏం జరిగిందో అని కంగారు పడుతూ నా పిల్లలిద్దరూ నావైపే చూస్తున్నారు. నెమ్మదిగా నా కళ్లు విదిల్చుకుని చూస్తే అర్థం అయ్యింది . నేను ఇప్పటిదాకా కలకంటున్నానని . వళ్లంతా చెమటలు పట్టి ఉన్నాయి. గుండె వేగంగా కొట్టుకుంటూంది. ఇక నెమ్మదిగా వణుకు తగ్గి నా మనసు కుదుటపడింది. హమ్మయ్యా, బ్రతికే ఉన్నాను . అని

అనుకుంటూ పిల్లల్ని దగ్గరకు తీసుకుని ముద్దాడుతుంటే, మా ఆవిడ దగ్గరగా వచ్చి లాలనగా అంది."మీకు పీడకల వచ్చింది . కలలు కలలే గదా. మీకేమి కాదు . లేచి స్నానం చేసి రాముల వారికి దణ్ణం పెట్టుకు రండి. మనసు ప్రశాంతంగా ఉంటుంది" అంది.
బుద్ధిగా తల ఊపాను. "నాన్న గారిని స్నానం చెయ్యనివ్వండి" అంటూ పిల్లల్ని తను తీసుకు వెళ్లింది.
లేచి స్నానం చేస్తూ అనుకున్నాను . అవును ఎంత పీడకల వచ్చింది. కలైనా నన్ను నేను చూసుకునేలా చేసింది. నాలో అంతులేని భయం. వాట్లోంచి పుట్టుకొచ్చిన కోరికలు. వాటితో నన్ను నేను చూసుకుని నేను తెచ్చిపెట్టుక్కున పనులు. వాటితో ఏదొ సాధించి నా భయాన్ని తొక్కిపట్టి , నన్ను నేను దాచేను. నా మేధావితనం , నేను ప్రత్యేకంగా ఉండాలనుకోవటం అన్నీ నా భయాలే. నా భాయాలే నా కలలో కనిపించాయి. నా కలలో నిజాలు బయటకు వచ్చాయి. నిజమే ! నా కోరికలే నన్ను ఇలా చేస్తున్నాయి .వాటినే నిజమని నమ్మాను. కానీ అన్నీ కలగా ఉండేవే. నా భయాలే నా దుస్సప్నం . నా దుస్స్వప్నమే ఓ రాకాసి . ఎప్పుడైతే వెలుగు వచ్చి నాకు మెలకువ వచ్చిందో అప్పుడే దుస్సప్నం దూరమైంది . మెలకువలోనే వెలుగు ఉంది . వెలుగులోనే జ్ఞానముంది. ఆ జ్ఞానమే నన్ను నేను తెలుసుకునేలా చేసింది. ఇక ఎప్పుడూ మెలుకువలో ఉండాలి. జాగరూకుడనై ఉండాలి.

భయం , నిద్ర, చీకటి, అజ్ఞానానికి సంకేతం . ఆ చీకటి నుండి బయట పడి జ్ఞాన మార్గంలో ఉండాలి . ఇలా అనుకుంటూ స్నానం చేసి ఎప్పుడూ లేనిది అప్రయత్నంగా రాములవారి ఫోటోకి దణ్ణం పెట్టి , డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాను.మా ఆవిడ దోశలు వేస్తుంటే "మధ్యాహ్నం ఏంటి కూర?" అని అడిగాను.

"చప్పిడి పప్పు" అని అంది .

"ఆదివారం కుడా పప్పేనా , చప్పగా .. మాంచి ఘాటుగా కోడికూర లేదా?" అని అంటున్నా .. అంతే తింటున్న దోసె గొంతుకడ్డం పడి పొరపోయింది . మా ఆవిడ మంచి నీళ్లకని పరుగెత్తింది.

★★★

## జిప్సీ

రాయపెద్ది వివేకానంద్

"ఓహ్ మై గాడ్. నీవు దెయ్యాన్ని నిజంగా చూశావా?"

"అఫ్ కోర్స్. చూట్టమే కాదు ఆ దెయ్యంతో ఇదే జిప్సీలో ప్రయాణించా, మాట్లాడాను, ఆ దెయ్యం తాలుకు ఒక పని అసంపూర్తిగా మిగిలిపోయినది చేసి పెట్టాను. అవిన్నీ ఇప్పుడు తలచుకుంటే కాస్తా భయం కలుగుతుంది"

"ఏమిటి ఈ జిప్సీ లో ప్రయాణించావా దెయ్యంతొ?" విభ్రముడై అడిగాడు రాజివ్.

"అసలు ఈ జిప్సీ ఆ దెయ్యానిదే" చావు కబురు చల్లగ చెప్పాను నేను.

"అదేంటి గురు, అలా చెపుతున్నావు? మనకేం పర్లేదు కద" రాజివ్ కంఠంలో భయం స్పష్టంగా వినిపిస్తోంది.

నేను నవ్వుతూ వుండి పోయాను

"అదేంటి గురు. నవ్వుతావు? నాకు ఇక్కడ పై ప్రాణాలు పనే పోతున్నాయి. అసలేం జరిగింది మొత్తం చెప్పు" రాజివ్ వణికి పోతున్నాడు భయంతో సమయం రాత్రి ఒంటి గంట దాటింది. చిమ్మచీకటి. మేం ప్రయాణిస్తున్న జిప్సీ మొరాయించటంతో ఆ అర్థరాత్రి ఆ కీకారణ్యంలో చిక్కుకుపోయాం. కౄరమృగాల నుంచి, చలి నుంచి రక్షణకి నెగడు ఏర్పాటు చేసుకుని , కాలక్షేపానికి కబుర్లు చెప్పుకుంటున్నాం.

★★★★★

ఆ దట్టమైన అరణ్యంలొ ప్రయాణం చేయాలంటే పగటి పూటనే భయం అవుతుంది. అలాంటి భయంకరమైన అరణ్యంలొ జిప్సీలో పెట్రోలు అయిపోవటం వల్ల ఆగిపోయాము.

ఈ కథలో జిప్సీని కారు అని జీపు అని కూడా వ్యవహరిస్తూ వుంటాను మీరు కన్ఫ్యూజ్ అవకండి.

అది పెద్దపులుల అభయారణ్యం. అంటె అ అడవిలో పెద్ద పులుల వేట పూర్తిగా నిషేదం.

'ఛ! పెట్రోలు అయిపోయింది" జిప్సీ ని రోడ్డుకు ఒక సైదుకు తీసి ఆపుతూ నిట్టూర్చాను నేను సరిగ్గా మూడు గంటల క్రితం.

ప్రయాణానికి ముందు రోజే పెట్రోల్ ట్యాంకు ఫుల్ చేయించె భాద్యత రాజీవికి అప్పజెప్పి నేను నిశ్చింతగా వుండటం ఎంత పొరపాటు అయిందో నాకు అర్థమవుతోంది.

పెట్రోలు ఇండికేటర్ పనిచేయక దాదాపు నెల రోజులు దాటింది నేను దానిని సరి చేసుంటే ఈ ఇబ్బంది వుండేది కాదు.

ఇంకో వంద కిలో మీటర్లు ప్రయాణం చేస్తే గమ్యం చేరిపోయుండే వారం.

మేమా అడవిలో చిక్కుకు పోయి దాదాపు మూడు గంటలు అవుతోంది.

రాత్రి తొమ్మిది నుంచి ఉదయం ఆరు గంటల దాకా ఆ అడవిగుండా వాహనాల రాకపోకలు పూర్తిగా నిషేదం.

మా వెహికల్ తర్వాత మరే వాహనం ప్రవేశించినట్టు లేదు అడవి దారిలో. ఏదురు గా వచ్చే వాహనాలు ఒకట్రెండు ఎదురయినా మమ్మల్ని చూసి కూడా ఆపలేదు, ఎందుకొచ్చిన రిస్క్ అని అనుకున్నారేమో. ఆ అడవిలొ నక్సలైట్ల భయం కూడా ఎక్కువే.

చలి కూడా బాగానే వుంది.

రోడ్డుకు అటు వైపు, ఇటూ వైపూ కూడా దట్టమైన కీకారణ్యం. కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి. ఒక వైపు అడవిలో కాస్తా లోపలికి నడచుకుంటూ వెళితే లోతైన లోయ ఆ క్రిందనే భయంకరంగా ప్రవహిస్తున్న కృష్ణా నది వుందని ఇందాక చూసుకున్నప్పుడు మొబైల్ లో గూగుల్ మాప్ చెప్పింది. ఇక్కడ మొబైల్ సిగ్నల్స్ కూడా లేవు.

వుండుండి అడవిలో నుండి పెద్దపులుల గాండ్రింపులు, ఇతర కౄరమృగాల అరుపులు వినిపిస్తున్నాయి. ఎండుటాకులపైన ఏదో జర జరమని పాకిన చప్పుడు వినిపించి మేము ఇద్దరం ఉలిక్కి పడ్డాం. చూస్తుండగానే ఒక నల్ల త్రాచు రోడ్డు వారగా పాకుతూ చెట్లలో కలిసి పొయింది.

పార్కింగ్ లైట్లు ఆన్ చేసి వుంచాము మొదట. ఆ తర్వాత కార్ బాటరీ ఖర్చు అయిపోతుంది అన్చెప్పి అది కూడా ఆర్పేశాం ఇప్పుడు.

దట్టంగా కాటుక వ్రాసినట్టు చీకటి. అలాంటి చీకటిని ఎప్పుడూ చూసి వుండలేదు నేను ఇది వరకెప్పుడు.

తెల్లవారి ట్రాఫిక్ కి అనుమతి ఇచ్చిన తర్వాత నే ఏదైనా వాహనం వస్తేనే మాకు విముక్తి అని అర్థం అయింది.

ఆ చీకట్లో మా అత్మస్థైర్యాన్ని కోల్పోకుండా, ఏ పులినోటో పడకుండా తెల్లవారే వరకు ఆ అడవిలో క్షేమంగా గడపటం మా ముందర వున్న పెద్ద ఛాలెంజ్ అని మాకు అర్థమయ్యింది.

"అయామ్ రియల్లీ సారి గురు. నేను పెట్రోల్ పట్టించుకుని వచ్చింటే ఈ ఇబ్బంది ఉండకపోను" రాజీవ్ మరొక్క సారి పశ్చాత్తాపపడ్డాడు.

అతడు పశ్చాత్తాప పడ్డా లాభం లేదు.

ఫస్ట్ థింగ్స్ ఫస్ట్. మేము ప్రధానంగా చేయాల్సింది మా ప్రాణాల్ని కాపాడుకోవటం. అది అభయారణ్యం అయినందువల్ల ఆ సమయంలో మాపై ఏ పులో దాడి చేసినా మమ్మల్ని మేము కాపాడుకోవటానికి దాన్ని గాయపర్చటానికి సయితం వీల్లేదు. అసలా సమయంలో మేము అక్కడ వుండటమే చట్టవిరుద్దం. నా దగ్గర లైసెన్స్డ్ రివాల్వర్ ఉన్నా కూడా అది ఏ మాత్రం ఉపయోగం లేనట్టే లెక్క.

అది ఓపెన్ టాప్ జిప్సి జీప్ అయినందువల్ల అది మాకు క్రూరమృగాల నుండి ఏమాత్రం రక్షణ కల్పించదు. మమ్మల్ని మేము కాపాడుకోవటానికి మా ముందు వున్న ఏకైక మార్గం, నెగడు ఏర్పాటు చేసుకుని, అది ఏ మాత్రం ఆరకుండా చూసుకుంటూ గడిపేయటమే.

అలా అనుకున్న తక్షణం సెల్ ఫోన్ లో టార్చి లైటు సాయంతో అటు ఇటు తిరిగి ఏండు కర్రలు, చిన్న చిన్న దుంగలు సేకరించుకుని వచ్చి, డాష్ బోర్డ్ లో వున్న ఇంజిన్ ఆయిల్ టిన్ తీసి, నెగడు రగల్చి దాని ఎదురుగా అటు ఇటు కూర్చున్నాం.

చెక్ పోస్టు దాటకముందే ధాభాలో డిన్నర్ పూర్తి చేయటం వల్ల ఆకలి బాధ లేదు ఉన్నంతలో.

"అన్నట్టు ఈ అడవిలో క్రూరమృగాలే కాక, దెయ్యాలు వుండొచ్చు అంటావా?" అడిగాడు అకస్మాత్తుగా రాజీవ్.

"నేను అతని వంక ఒక సారి తేరిపారా చూసి, ఈ అడవిలో దెయ్యాలు వున్నాయో లేదో తెలియదు నా జీవితంలో దెయ్యంతో చిత్రమైన అనుభవం ఒకటుంది." నేను సమాధానం చెప్పాను.

"ఓహ్ మై గాడ్. నీవు దెయ్యాన్ని నిజంగా చూశావా?"

"అఫ్ కోర్స్. చూట్టమే కాదు ఆ దెయ్యంతో ఇదే జిప్సీలో ప్రయాణించా, మాట్లాడాను, ఆ దెయ్యం తాలుకు ఒక పని అసంపూర్తిగా మిగిలిపోయినది చేసి పెట్టాను. అవిన్నీ ఇప్పుడు తలచుకుంటే కాస్తా భయం కలుగుతుంది"

"ఏమిటి ఈ జిప్సీ లో ప్రయాణించావా దెయ్యంతొ?" విభ్రముడై అడిగాడు రాజివ్.

"అసలు ఈ జిప్సీ ఆ దెయ్యానిదే" చావు కబురు చల్లగ చెప్పాను నేను.

"అదేంటి గురు, అలా చెపుతున్నావు? మనకేం పర్లేదు కద" రాజివ్ కంఠంలో భయం స్పష్టంగా వినిపిస్తోంది.

నేను నవ్వుతూ వుండి పోయాను

"అదేంటి గురు. నవ్వుతావు? నాకు ఇక్కడ పై ప్రాణాలు పనే పోతున్నాయి. అసలేం జరిగింది మొత్తం చెప్పు" రాజీవ్ వణికి పోతున్నాడు భయంతో.

^^^^^^ ^^^^^^

ఆ రాత్రి నాకు ఇప్పటికి గుర్తే.

అప్పుడు సమయం పది దాటి వుంటుంది. నిండు పున్నమి వెన్నెల. అలాంటి రాత్రి వేళ, వెన్నెలలో, టాప్ లేని జిప్సీ ప్రయాణం నాకు చాలా ఇష్టం.

తారోడ్డు పై జిప్సీ సాఫీగా సాగిపోతోంది. అది కొని అప్పటికి వారం కూడా కాలేదు.

నేను యూస్డ్ కార్స్ డీలర్షిప్ నడుపుతున్నాను. సెకండ్ హేండ్ కార్లు అమ్మే ఇతర సాధారణ డీలర్ల కీ లేని చాలా ప్రత్యేకతలు మా కంపెనీకి వున్నాయి.

ఆటోమొబైల్స్ అంటే నాకున్న సహజమైన ఆసక్తివల్ల ఆటొమొబైల్ ఇంజినీరింగ్ చేసి, ఇష్టంతో ఈ రంగంలోకి వచ్చాను నేను. ఒక చిన్న షేడ్ లో ప్రారంభమయిన మా కంపెనీ అతి త్వరలోనే దేశవ్యాప్తంగా బ్రాంచీలు పెట్టి, మొబైల్ ఆప్, ఆన్ లైన్ ద్వారా అమ్మకాలు, కొనుగోళ్ళు ఇలా ఎవ్వరూ ఊహించడానికి కూడా వీలు కాని దశలోనే మా కంపెనీలో ఈ సేవలన్నీ ప్రవేశ పెట్టాం. అంతేకాక కష్టమర్ సర్వీస్ అత్యుత్తమ స్థాయిలో వుండే విధంగా చూసుకుంటాం.

కొత్త కారు కొనే కష్టమర్ ఏ విధంగా సంతృప్తిగా , నిశ్చింతగా ఫీలవుతాడో అదే స్థాయి నిశ్చింత సెకండ హేండ్ కార్ల రంగంలో ఇచ్చే ఏకైక కంపెనీ మాది అన్న పెరు అతి త్వరలో తెచ్చుకున్నాం.

బాటాకిరువైపులా కొబ్బర్ తోటలు, అక్కడక్కడా తారస పడుతున్న చిన్నచిన్న వాగులు, పిల్ల కాలువలు, చిరు చలి చాలా అహ్లాదంగా వుంది ప్రయాణం.

నాకు కార్ లో వీలయినంత  లాంగ్ డ్రైవ్ కి వెళ్ళటం చాలా ఇష్టం. నాకు వాహనాలంటె పిచ్చి. లారీలు, బస్సులు, ఇలా ఏ ఆటోమొబైల్ అయినా నాకు చాలా ఇష్టం. కార్లంటే చెప్పలేనంత పిచ్చి. కార్లంటే ఎంత ఇష్టమో మాటల్లో చెప్పలేను. వృత్తి ప్రవృత్తి ఒక్కటే కావటం నా అదృష్టం.

దేశమంతటా బ్రాంచీలు ఉన్నాయి, డబ్బులకు కొదవలేదు.

వృత్తి రిత్యా కొని అమ్మే కార్లు సరే సరి . అవి కాకుండా నా సరదాకు , నా స్వంత  వాడకానికి నెను కొన్న కార్లే ఓ ఇరవైముఫై వుంటాయి.

అత్యంత ఖరీదైన మెర్సిడీస్ బెంజ్, అవుడి, బీఎండబ్యూ లతో పాటు అతి సాధారణమైన మారుతి 800 కూడా వున్నాయి నా కలెక్షన్ లో.

ఈ కథకి మూల కారణం అయిన జిప్సీ కూడా అలాగే కోరి కోరి కొనుక్కున్నాను.

మారుతీ కంపెనీ వారు తమ జిప్సీ మోడల్ ని మాములు వినియోగదారులకి అమ్మటం కన్నా ఎక్కువగా రక్షణరంగానికి అమ్మడానికే ప్రాధాన్యత ఇస్తారు.

దానికి తోడు ఆర్మీ వారి మెయింటెనెన్స్ కూడా చాలా బాగుంటుంది.

తన దగ్గరకొచ్చే క్లయింట్లు చాలా మంది "ఆర్మీ వారి జిప్సీ కావాలి" అని అడిగి మరీ అడ్వాన్స్ ఇచ్చి వెయిట్ చేస్తూ వుండటం సహజం.

అందువల్ల నేను ఆర్మీ వారి జిప్సి కోసం ప్రత్యేక శ్రద్ధతో వెదకుతూ వుంటాను. అలాంటి అన్వేషణలో భాగంగా నాకు దొరికిందే ఈ జిప్సీ.

సాధారణంగా ఆర్మీ వారి జిప్సీలు, ఆకుపచ్చ రంగులోనో, తెల్ల రంగులోనో, బూడిద రంగులోనో లభ్యమవుతాయి. ఈ జిప్సి కలర్ కూడా ప్రత్యేకం. ఇది చెట్ల పొదల రంగులో కలిసిపోయే ఆర్మీ యూనీఫాం రంగు అయిన ఖేమూఫ్లాష్ (camouflage) రంగులో లభించింది.

లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అంటారు కద, అలాగా నాకు ఈ జిప్సిని చూడంగానే మొదటి చూపులోనే తీవ్రమైన ఇష్టం ఏర్పడింది.

ఆర్మీ వారు తరచు వేలం పాట పాడి పాత కార్లను, జీపుల్ని, ఇతర వాహనాల్ని అమ్మేస్తుంటారు.  నా దగ్గర తెల్లరంగు జిప్సీ వున్నప్పటికీ ఈ ఖెమూఫ్లాష్ జిప్సీని కొనేశాను. అంతగా ఆకట్టుకుంది ఇది నన్ను.

అంత అద్భుతంగా మెయింటెయిన్ చేయబడ్డ సెకండ్ హేండ్ కారుని నేను అప్పటిదాకా చూసింది లెదు. దానిని కొన్నది లగాయతు, నా దగ్గర వున్న కార్లని అన్నింటిని పక్కన పెట్టేసి ప్రతి పనికి దాన్నే వాడటం మొదలు పెట్టాను. అంతగా ఆకట్టుకుంది నన్ను అది.

ఇక ఆ వెన్నెల రాత్రి జిప్సీలో ప్రయాణం చాలా కీలకమైనది.

ఒక ముఖ్యమైన వ్యాపార లావాదేవి నిమిత్తం నేను రెండు వందల కిలోమీటర్ల దూరంలో వున్న కృష్ణగిరికి వెళ్ళాల్సి వచ్చింది. మహా అంటే మూడు గంటల ప్రయాణం. తెల్లవారు ఝామున్నే బయలుదేరి, అక్కడికి వెళ్లీ పని ముగించుకుని సాయంత్రానికల్లా వెనుదిరిగి వచ్చేయవచ్చు. కానీ ఈ వెన్నెల రాత్రి ఈ లాంగ్ డ్రయివ్ , జిప్సీలో ప్రయాణం నాకు సరదా. అందుకే బయలు దేరాను ఆ రాత్రి.

తేలికగా రాత్రి ఆహారం ముగించి, చిన్న బ్యాగు తీసుకుని, సుమారు పదింటికి టాప్ లేని జిప్సీ తీసుకుని బయలుదేరాను.

మా ఇల్లు ఇంచుమించు నగర శివార్లలో వుంటుంది. శ్రీమతికి, పిల్లలకి వీడ్కోలు చెప్పి మేడ దిగి పోర్టికోలోకి వచ్చి జిప్సీ వద్దకు వచ్చాను, అవుటు హవుస్ లో వుండే డ్రయివర్ పరుగున వచ్చి డ్రైవింగ్ సీట్లో కూర్చుని బయలుదేరబోయాడు. నేనతన్ని సున్నితంగా తిరస్కరించి, బ్యాగ్ వెనుక సీట్లో పడేసి స్టీరింగ్ ముందు కూర్చున్నాను.

మా వీధి మలుపు తిరగంగానే జాతీయ రహదారి ప్రారంభమవుతుంది.

ఆ ప్రయాణం లో డ్రైవర్ ని తిరస్కరించకుండా నాతో తీస్కు పోయివుంటే ఎలా వుండేదో అని ఎన్ని సార్లనుకున్నానో లెక్క లేదు.

వాతావరణం చాలా అహ్లాదంగా వుంది.

పిండారబోసినట్టు వెన్నెల. చల్లటిగాలులు, పల్చటి మబ్బులు. వెన్నెల వెలుగులో వెలవెల బోతున్న నక్షత్రాలు.

సెల్యూట్ చేసి గేట్లు తీశారు సెక్యూరిటి గార్డులు. గేటు తీసి ముందుకురికించాను జిప్సీని. నా వెనుకే నెమ్మదిగా మూసుకున్నాయి గేట్లు.

వీధి మలుపులో జాతీయ రహదారిని ఎక్కించేటప్పుడు చూశాను ఓ వ్యక్తిని దూరం నుంచే. అతడు ఆజానుబాహుడు. రోడ్డు ప్రక్కనే నిలబడి కార్ ఆపమని సైగ చేస్తున్నాడు.

నా జీవితంలో జరిగిన అనేకానేక వింత సంఘటనలకి ఇది నాంది అనుకోవచ్చు.

కార్ దగ్గరయ్యేకొద్ది అతని రూపం స్పష్టంగా కనిపించసాగింది. అతనో ఆర్మీ ఆఫీసర్ అని చూడంగానె అర్థం అవుతోంది.

నెమ్మదిగా ఆయన ముందు కారాపాను.

చాలా స్పష్టమైన ఉఛ్ఛారణతో, మంచి స్థాయి వున్న ఆంగ్లంలో  అతడు అడిగాడు, తలను కాస్తా ముందుకు వుంచి "కృష్ణగిరి దాకా రావొచ్చా?"

ఆర్మీలో అతను చాలా పైస్థాయిలొ వున్న అధికారి అని అతని మెడల్స్, డ్రస్సు తెలుపుతున్నాయి. అతడి భాష, అతడి బాడీ లాంగేజ్ , ఆతని హుందాతనం ఆతన్ని చూడగానే గౌరవ భావం కలిగించే లాగున్నాయి. ఇంగ్లీష్ భాషలో 'కమాండింగ్ ది రెస్పెక్ట్' అన్న పదబంధం అతనికి సరిగ్గ సరిపోతుంది.

అతని అభ్యర్థనని తిరస్కరించటానికి నాకేం కారణం కనిపించలేదు.

చిరునవ్వుతో తల పంకిస్తూ, కాస్తా నా ఎడమ వైపుకి వంగుతూ తలుపు తీశాను. 'కృతజ్ఞతలు' చెబుతూ కారెక్కి నా పక్కసీట్లో కూర్చున్నాడు.

కారు బయలుదేరింది. జాతీయ రహదారి మీద వేగంగా పరుగులు తీయటం మొదలుపెట్టింది.

ఎనిమిది వరుసల జాతీయ రహదారి చాలా విశాలంగా వుంది. ఇంత హాయి అయిన రహదారి పైన ప్రయాణం ఇంకో పది కిలోమీటర్లే. ఆపై ఎడమ వైపుకు మలుపు తీసుకుని సింగిల్ రోడ్డు మీద ప్రయాణం ప్రారంభం ఆవుతుంది. ఆ తరువాత కృష్ణగిరి వరకు ఇలా సింగిల్ రోడ్డు మీదనే ప్రయాణం.

లిఫ్ట్ అడిగేటప్పుడు ఎవరైనా 'మీరే ఊరికి వెళుతున్నారనో' లేదా 'నేను ఫలానా ఊరికి వెళుతున్నాను. మీరు అటు వేపుగానీ వెళుతున్నారా' అని గాని అడగటం కద్దు.

కానీ ఈ ఆర్మీ ఆఫీసర్ నా ప్రయాణం కృష్ణగిరికే అని ముందరే తెలిసినట్టు ప్రవర్తించడం నాకు కాస్తా ఆశ్చర్యం కలిగించింది.

జాతీయ రహదారి పై వాహనాల రద్దీ విపరీతంగా వుంది. లాఘవంగా జీపీ నడుపుతూ కూడా పరిచయం చేసుకున్నాను నన్ను నేను.

ఆయన కూడా తన పరిచయం చేసుకున్నాడు. ఆయన పేరు కల్నల్ శ్రీధర్ అని చెప్పారు. జమ్మూ కాశ్మీర్ లో పాకిస్థాన్ సరిహద్దులో విధి నిర్వాహణలు నిర్వహిస్తున్నాడని చెప్పారు.

ట్రాఫిక్ రద్దీ కారణంగా నేను ఆయనతో కరచాలనం చేయలేకపోయాను. ఒక వేళ షేక్ హాండ్ ఇచ్చే ప్రయత్నం చేసుంటే ఆయన మనిషీ కాదు ఆత్మ అని ఆరోజే తెలుసుకొనగలిగి వుండే వాడిని.

చాలా అత్యవసరమైన వ్యక్తిగతమైన పనుల వల్ల ప్రస్తుతం ఇక్కడికి రావాల్సించ్చిందట. అంత మాత్రమే చెప్పుకొచ్చారాయన. 'వ్యక్తిగతమైన పనులు అని ఆయన అనటం వల్ల నేను కూడ "ఏ పని మీద వచ్చారు?" అని అడగలేదు నేను రెట్టించి.

మా మధ్య సంభాషణ చాలా మటుకు ఆంగ్లంలో సాగిపోతోంది.

కృష్ణగిరి కి వెళ్ళే సూచిక కనపడుతోంది ఆకు పచ్చ రంగు బోర్డు పై తెల్లటి రేడియం అక్షరాలతో.

ఏడమ వైపు చివరి లేన్లోకి క్రమంగా బండిని మళ్ళిస్తూ ఒక దగ్గర నెమ్మది చేసి, ఇండికేటర్ వేస్తూ ఎడమవైపుకు మలుపు తిప్పి సింగిల్ లేన్ రోడ్డు పై పరుగులు పెట్టించటం మొదలెట్టాను.

"నాకీ కార్ చాలా ఇష్టం. మీరు చాలా జాగ్రత్తగా హేండిల్ చేస్తున్నారు. అయాం హేపీ" ఏదో తన కారుని నేను నడుపుతున్నట్టు  అభినందించారు.

అర్థం కానట్టు చూశాను.

"అదే జిప్సీ అంటే నాకు ఇష్టం" తిరిగి ఆయనే చెప్పారు.

ఆయన చాలా మాటకారి. చమత్కారంగా మాట్లాడుతు ఎదుటివారిని ఆకట్టుకునేలా మాట్లాడటం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని నాకు అర్థమయిపోయింది.

చాలా విషయాలలో మా అభిరుచులు కలుస్తున్నాయి. ముఖ్యంగా కార్ల సేకరణ, లేటేస్ట్ కార్ల గురించి విషయ సేకరణ, లాంగ్ డ్రయివ్స్, కార్ రేసింగ్స్, సాహసోపేతమైన ఏడారి కార్ ర్యాలీలు, మౌంటేన్ టెర్రేన్ కార్ ర్యాలీలు ఇలా చాలా అంశాలలో  మా ఇద్దరి అభిరుచులు కలుస్తున్నాయి. నాకిష్టమయిన చాలా మంది ఛాంపియన్స్ ఆయనకు కూడా ఇష్టం.

ఈ అభిరుచుల కారణంగా మేం చాలా తక్కువ సమయంలో మేం చాలా కాలం నుంచి పరిచయం వున్న వారిలా మారిపోయాం.

నేను ఒకటి గమనించాను. ఆయన నీలిరంగు కళ్ళు చాలా ఆకర్షణీయంగా వున్నాయి. నన్ను ఆశ్చర్య పరిచిన అంశం ఏమిటంటె నేను చూస్తుండగా ఆయన కను రెప్పలు ఆడించలేదు ఒక్కసారి కూడా. మాట్లాడేటప్పుడు ఎదుటి వ్యక్తిని కను రెప్ప వేయకుండా తదేకంగా చూస్తూ మాట్లాడుతున్నారు ఆయన.

బహుశా ఆర్మీ శిక్షణ వల్ల అలవడిందనుకుంటా ఆ అలవాటు.

ఆయన సాంగత్యం లో ఒక విధమైన ప్రశాంతతని అనుభవిస్తోంది నా మనస్సు. శరీరం కూడా అసలు అలసట అన్నది ఎరుగని ఒక విధమైన విశ్రాంతి ని అనుభవిస్తోంది.

అప్పుడప్పుడూ ఏదో పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నాము, లేదంటే మౌనంగా తదేక దీక్షతో డ్రైవ్ చేస్తున్నాను. నా మనసు ఎన్నడు ఎరుగని ఒక విధమైన ధ్యాన స్థితిని అనుభవిస్తోంది. ఇదో కొత్త అనుభూతి నాకు.

ప్రయాణం సాఫీగా సాగిపోతోంది.

ఎదురుగా ఓ పెద్ద కొండ అడ్డుగా వస్తుంది మా దారికి. ఇది వరకు ఆ కొండను చుట్టుకుంటూ వెళ్ళాల్సిన విధంగా వుండేది దారి. కానీ ఇటీవలే ఆ కొండ పై ఘాట్ రోడ్డు వేశారు, ఇదొక ఆకర్షణ ఈ ప్రయాణంలో.

ఇప్పటికీ పాత రోడ్డును కూడా వాడుతుంటారు కొంత మంది. కానీ ఆ దారిలో ఒక పది కిలోమీటర్ల ప్రయాణదూరం ఎక్కువ వుంటుంది.

“మనం ఈ ఘాట్ రోడ్డులో కాకుండా మాములు రహదారిలో వేళదాం" ఆయన తీర్పు చెట్టినట్టు ప్రకటించారు.

వేగాన్ని కాస్తా తగ్గించి ఆయన వంక అయోమయంగా చూశాను.

"మీరు సరిగ్గానే విన్నారు. ఘాట్ రోడ్డుపై కాకుండా చుట్టూ తిరిగినా సరే పాత దారిలోనే వెళదాం"ఆయన నా వైపు చూడకుండా రోడ్డు వైపు తదేక దీక్షతో చూస్తూ చెప్పారు.

ఘాట్ రోడ్డుపై ప్రయాణం బాగుంటుంది. ఎందుకీ పెద్దమనిషి వద్దంటున్నాడు. నాకు చిరాకేసింది.

"ఎందుకలా?" చిరాకుని వీలయినంత అణచుకుంటూ అడిగాను ఆయనని.

"ఘాట్ రోడ్డు పై తొమ్మిదో నెంబరు మలుపులో కొండ చరియలు విరిగి పడబోతున్నాయి. ఈ కారుకి చిన్న గీత పడినా నేను భరించలేను" అంతే స్థిరంగా చెప్పారాయన.

"ఏమిటి కొండ చరియలు విరిగి పడ్డాయా? పడబోతున్నాయా? మీరు సరిగ్గానే మాట్లాడుతున్నారా?" కోపాన్ని అణచుకుంటూ అడిగాను

ఆయన చెప్పిన తొమ్మిదో  మలుపు చేరుకోవటానికి ఇంకా అరగంట ప్రయాణం వుంది.

నా ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పలేదు. మౌనం వహించాడు.

అప్పుడు సమయం రాత్రి పదిన్నర అయ్యుంటుంది.

రోడ్ జంక్షన్ రానే వచ్చింది. నేరుగా వెడితే ఘాట్ రోడ్డు, కుడి వైపు మలుపు తిరిగితే పాత రోడ్డు. ఆయన నన్నే చూస్తున్నట్టు అనిపించింది. అసంకల్పితంగా నేను కుడి వయిపుకి మలుపు తిప్పాను.

ఆ తర్వాత ఇద్దరం పెద్దగా మాట్లాడుకోలేదు. కృష్ణగిరి చేరుకునేటప్పటికి రాత్రి దాదాపు పన్నెండున్నర అయింది.

"నా మాట పై గౌరవం పెట్టి ఘాట్ రోడ్డుపై రానందుకు థాంక్స్. కారు ఇక్కడ ఆపేయ్యండి" ఇంకా ఊరు రాక ముందే శివార్లలో దిగిపోయారు ఆయన. అక్కడ చెప్పుకోదగ్గ పెద్ద భవనాలు ఏవీ లేవు. ఇంచుమించు నిర్మానుష్యమైన ప్రదేశం అది.

దూరంగా ఎక్కడో నక్కలు ఊళలు పెడుతున్నాయి. చలి గాలి శరీరాల్ని వణికిస్తోంది.

"ఆయన స్థిరమైన చూపుతో నా వంక సూటిగా చుస్తూ అగర్వాల్ బ్రదర్స్ మిమ్మల్ని కలువలేరు. మీ ప్రయాణం వృధా అని నాకనిపిస్తోంది" అని అన్నారు కారు దిగి.

ఈ మనిషి కి ఏమన్నా పిచ్చా? శుభం పలకరా పెళ్ళికొడుకా అంటే ఏదో అన్నాడట. అలా వుంది ఈయన వ్యవహారం.

నాకు చాలా చిరాకేసింది. అగర్వాల్ బ్రదర్స్ తొ చాలా ఇంపార్టెంట్ కాంట్రాక్ట్ సంతకం చేయబోతున్నాను. వారు డబ్బు కూడా సిద్ధం చేసుకుని వున్నారు. వారం క్రితమే మా అపాయింట్‌మెంట్ ఫిక్స్ అయింది. తీరా బయలుదేరేముందు కూడా రాత్రి ఫోన్ చేసి కన్ఫర్మ్ చేసుకున్నాకే బయలుదేరాను. కాబట్టి అగర్వాల్ బ్రదర్స్ ని నేను కలవలేకపోవటం అన్నది అసాధ్యం.

ఈ పెద్దమనిషికి కాస్తొ పిచ్చి అనుకుంటాను.

ఒక చిరునవ్వు నవ్వి కారు బయలుదేరదీశాను. అంతా ఓ యాభై అడుగుల దూరం వెళ్ళగానే నాకు అప్పుడు తోచింది, అసలు నేను కృష్ణగిరికి వస్తున్నట్టు, అగర్వాల్ బ్రదర్స్ ని కలవబోతున్నట్టు ఈ పెద్దమనిషికి ఎలా తెలుసు? అసలు ఎవరు ఇతడు?

ఆ ఆలోచన వచ్చిన తక్షణం సడన్ బ్రేకు వేశాను. కీచు మని చప్పుడు చేస్తూ కారు ఆగింది. నేను కారు దిగి అతన్ని దింపిన ప్రదేశం వంక చూశాను. అక్కడ ఎవరూ లేరు ఆ చుట్టుప్రక్కల ఎక్కడా కూడా అతను కనిపించలేదు. అక్కడ ఏవిధమైన గల్లీలు, మలుపులు ఏమీ లేవు, ఎక్కడికి వెళ్ళాడబ్బా?

నాకు వెన్నులో కాస్తా చలిపుట్టింది.

"ఈ కారుకి ఏమన్నా అయితే నాకు కోపం వస్తుంది అని చెప్పానా? ఇలా సడన్ బ్రేకులు వేయకండి" చాలా స్పష్టమైన కంఠంతో నా ప్రక్కనే నిలబడి వున్నాడు కల్నల్ శ్రీధర్. నేను ఉలిక్కి పడ్డాను.

నా ఆ అయోమయం పతాక స్థాయికి చేరుకుంది.

"ఎనీ హౌ గుడ్ నైట్" అని చెప్పేసి క్షణమ్ ఆలశ్యం చేయకుండా వేగంగా చీకట్లో కలిసి పోయాడు.

నా గుండె చప్పుడు నాకే స్పష్టంగా వినిపిస్తోంది.

ముందే బుక్ చేసుకున్న గెస్ట్ హవుసి కి వెళ్ళిపోయాను. ఇతర ఆలోచనలు పెట్టుకోకుండా ప్రశాంతంగా నిద్ర పోయాను ఆ రాత్రి.

★★★★★★

ఉదయం నిద్ర లేవంగానే నాకు షాకుల మీద షాకులు.

ఎంత ఆలశ్యంగా పడుకున్నా కూడా ఉదయం అయిందింటికి నిద్ర లేచే అలవాటు వుంది నాకు. ఉదయాన్నే కాసిన్ని గోరువెచ్చని నీళ్ళు త్రాగి వాకింగ్ , యోగా ముగించుకుని బాల్కనీ లో విశ్రాంతిగా టీ త్రాగటానికి కూర్చున్నాను.

ఎదురుగా టీ పాయ్ పై ఆవేళ్టి వార్తా పత్రికలు పెట్టి వెళ్ళాడు రూం సర్వీస్ బాయ్.

రూం లోని టీవి కిటికీలోంచి కనిపిస్తోంది. టీవి వాల్యూం పెద్దగానే వుంది. చాగంటి కోటేశ్వర రావు గారి ఆధ్యాత్మిక ప్రవచనాల తర్వాత వార్తా ప్రసారం ప్రారంభం అయ్యింది.

ఘాట్ రోడ్డుపై క్రితం రాత్రి సరిగ్గా కల్నల్ శ్రీధర్ చెప్పిన సమయానికి కొండ చరియలు విరిగి పడ్డాయట. అదృష్ట వశాత్తు ఆ సమయం లో వాహనాలు ఏవి లేకపోవటం వల్ల పెద్ద ప్రమాదం తప్పి పోయిందని చెబుతున్నారు.

ప్రతిపక్షాలు ఆ కాంట్రాక్టర్ కి అధికార పార్టీతో సన్నిహిత సంబంధాలు వున్నాయని, రహదారుల శాఖామాత్యుడు తక్షణం రాజినామా చెయ్యాలని డిమాండ్ చేస్తున్నారు.

రిమోట్ తో టీవీ కట్టేశాను.

అంటే అరగంట ముందరే ఆ విషయం నాకు చెప్పి నా ప్రాణాలు కాపాడాడన్న మాట ఆ శ్రీధర్. అసలు అతడికి ఎలా తెల్సు ఆ కొండ చరియలు విరిగి పడే విషయం? ఇందులో ఏదన్నా కుట్ర వుందా? ఆ కుట్ర చేసిన మనుషులు ఈయన్ గ్యాంగ్ లోని వారా? నాకు ఆలోచనలు పరిపరి విధాలా పోతున్నాయి.

ఇంతలో నా ఫోన్ మ్రోగింది. స్క్రీన్ పై అగర్వాల్ ప్రొఫైల్ పిక్ నవ్వుతూ కనిపిస్తోంది. కానీ అతను చెప్పిన విషయం విని నా నవ్వు మాయం అయింది.

క్రితం రాత్రే ఆయన పెద్ద అన్నయ్య కి హఠాత్తుగా గుండె పోటు రావటంతో హుటాహుటిన నగరానికి తీసుకు వెళ్ళారట. అప్పటికి అర్ధరాత్రి దాటి వుండటం తొ ఫోన్ చేసి చెప్పలెదు, 'మీరు ఇంకా బయలుదేరకుండా వుండుంటే తక్షణం ఆగి పొండి, మరలా ఎప్పుడు కలుద్దాం అన్న విషయం మళ్ళీ ఫోన్ చేసి చెబుతాన" అని అంటున్నాడు అటు నుండి అగర్వాల్.

నాకు ఒక లాంటి జలదరింపు కలిగింది. అది భయమా.. భయం కాదేమో. మానావాతీత శక్తులు, మన ఊహకు అందని పరిణామాలు మన జీవితంలోనే జరిగితే కలిగే లాంటి ఉద్విగ్నత అది.

ఏదో పారానార్మల్ ఆక్టివిటీస్ సినిమాల్లో జరిగితే చూసి థ్రిల్ ఫీలవ్వటానికి బాగుంటాయి కానీ సాక్షాత్తు మన జీవితాల్లో జరిగితే భరించలేము అనిపించింది.

కల్నల్ శ్రీధర గురించి నాకు మూడు విషయాలు పజిల్ గా మిగిలి పోయాయి.

ఒకటి. నేను కృష్ణగిరికే వెళుతున్నాని తెలిసినట్టు ఎలా ప్రవర్తించగలిగాడు? అప్పటికి నేను కృష్ణగిరి డైవర్షన్ తీసుకోలేదు. ఇంకా కరెక్టుగా చెప్పాలి అంటే నేను అప్పటికి ఇంకా హైవేనే ఎక్కలేదు. నేను సిటిలోనికి కూడా వెళ్ళే అవకాశం వుంది కద. మామూలుగా అయితే నా గమ్యం ఎవరికీ తెలిసే అవకాశం కూడా లేదు.

రెండు. అరగంట ముందరే విరిగి పడబోయే కొండ చరియల విషయం అతడు ఎలా చెప్పగలిగాడు?

మూడు. పక్కాగా ముందరే ఫిక్స్ అయి వున్న నా బిజినెస్ మీటింగ్ కాన్సెల్ అవుతుందని ఎలా చెప్పగలిగాడు. అతను అలా చెప్పిన సమయానికి అగర్వాల్ అన్నయ్యకి ఇంకా గుండె పోటు రాలేదు.

నాకయితే అంతా అయోమయంగా వుంది. చేసేదేం లేక నేను నగరానికి తిరిగి వచ్చేశాను.

నా దినచర్య అంతా యధావిధిగా ఎటువంటి వింత సంఘటనలు లేకుండా గడిచిపోతు వుంది.

కానీ అంతా మాములుగా జరిగితే ఈ కథే లేదు.

ఎనిమిది లేన్లు వున్న అవుటర్ రింగ్ రోడ్డు అంటే నాకు చాలా ఇష్టం. ఒక రాత్రి బిజినెస్ డీలింగ్ ముగించుకుని ఇంటి దారి పట్టాను. అవుటర్ రింగు రోడ్డు మీద సాఫీగా సాగి పోతోంది జీప్సీ. వేగం దాదాపు నూటా ఇరవై– నూటా ముప్పై మధ్య నడుపుతున్నాను. కార్లో నాతో ఎవరూ లేరు.

ఎందుకో తెలియదు నా చూపు వుండుండి నా ప్రక్క సీటు పై పడుతోంది. మసక వెన్నెల, చిరు చలి. వాతావరణం అదోలా వుంది. ఏదో ఇంగ్లీష్ బుక్ లో చదివాను దెయ్యాలకి చలి వాతావరణం అంటే ఇష్టమట. ఏదో తెలియని ఇబ్బంది నా మనసులో కలుగుతోంది.

తదేక దీక్షతో రోడ్డు వంక చూస్తూ నడుపుతున్న నేను కను చివర్ల నుండి గమనించాను పక్క సీట్లో ఎవరో కూర్చొని వున్నట్టు. అప్పుడు తల తిప్పిచూశాను. అతను నా ప్రక్కన సీట్లో కూర్చుని వున్నాడు. స్పష్టాతి స్పష్టంగా చూడగలుగుతున్నాను. ఇది నా భ్రమ కానేకాదు.

అతడు కల్నల్ శ్రీధర్. క్షణం క్రితం లేదు. వందకిలోమీటర్లకు పైగా వేగంతో వెళుతున్న వాహనంలోకి ఎలా రాగలిగాడు?

'కీచు' మని చప్పుడుతో ఆగిపోయింది కారు., నేను సడన్ గా బ్రేక్స్ వేయటం వల్ల.

"హఠాత్తుగా బ్రేక్స్ వేయకండి అని ఇదివరకు కూడా మీకు ఒక సారి చెప్పాను. నాకు ఈ కారంటే ప్రాణం. దీనికి చిన్న గీత పడినా కూడా నేను సహించలేను" స్థిరంగా చెప్పాడు కల్నల్ శ్రీధర్.

అతని స్థిరత్వం చూసి నాకు చిర్రెత్తుకు వచ్చింది.

నేను సభ్యత సంస్కారాలు కూడా పాఠించకుండా "ఇడియట్. ఇది నా కారు నా ఇష్టం. మధ్యలో నీ బోడి ఇష్టా అయిష్టాలు ఎవడిక్కావాలి. అసలు కదిలే కార్లో కి ఎలా రాగలిగావు? పిచ్చి పిచ్చిగా వుందా?" అని గట్టిగా కేకేశాను.

"ఓ అయాం సారి. మీరు చాలా కోపంలో వున్నట్టున్నారు.మరో సారి కలుద్దాం" అంటూ అతడు నా కళ్ళముందరే అదృశ్యం అయ్యాడు.

పల్చటి మంచు తెర లాగా క్రమక్రమంగా పలచబడి క్షీణించిపోతూ శూన్యంలోకి కల్సి పోయాడు. ఆ తరువాత అక్కడ అతని ఆనవాలే కనపడలేదు.

అప్పుడరిచాను నేను "దెయ్యం....దెయ్యం" అంటూ దిక్కులు పిక్కటిల్లి పోయేలాగా. నేను అంత గట్టిగా అరవగలనని నాకే తెలియదు.

ఛాతీలో ఎడమవైపున మొదలయిన నొప్పి క్రమంగా తీవ్రమయింది క్షణాలలో. నాకు అసలు గుండె సమస్య లేదు అప్పటిదాకా.

నా కేకలు అరణ్యరోదనే అయ్యాయి నిర్మానుష్యమైన అవుటర్ రింగు రోడ్డుపైన.

క్రమంగా ముందుకు వాలి స్టీరింగ్ వీల్ పై వాలిపోయాను. నా వత్తిడికి హారన్ మ్రోగటం ప్రారంభించింది. ఆ హారన్ చప్పుడు వినిపిస్తుండగా క్రమంగా స్పృహ కోల్పోయాను.

అదే నా చివరి జ్ఞాపకం స్పృహకోల్పొయే ముందు.

★★★ ★★★★★ ★★★★★

కళ్ళు తెరిచి చూసేటప్పటికి అర్థమయింది నేను ఆసుపత్రిలో వున్నానని.

రెండు పూర్తి రోజులు స్పృహలో లేనట ఆసుపత్రి లో.

హైవే పెట్రోలింగ్ సిబ్బంది గుర్తించి ఆసుపత్రిలో చేర్పించారట.

నాకు మెలకువ రావటంతో ప్రక్కనే కూర్చుని వున్న శ్రీమతి రిలీఫ్ గా నిట్టూర్చింది. 'నా అరచేయి మీద చేయి వేసి తన స్పర్శ ద్వారా నాకు భరోసా ఇచ్చింది.

తర్వాత బజ్జర్ ప్రెస్ చేసి, నర్సింగ్ స్టాఫ్ ని, డాక్టర్స్ ని పిలిపించింది.

ఆ తర్వాత సంభాషణలో 'ఏమి జరిగింది?' అని డాక్టర్లు అడిగిన ప్రశ్నకి నా సమాధానాలు విని వాళ్ళు నమ్మలేదు నా మాటల్ని. నన్నో వెర్రివాడిగ చూశారు. శ్రీమతి నా వంక జాలిగా చూస్తోంది.

ఏదో షాక్ కి గురి అవటం వల్ల నేను అలా పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నానని వారు భావించారు.

వారం రోజుల చికిత్స అనంతరం ఇంటికి పంపించారు.

నేను చెప్పిన సంగతి నమ్మినా నమ్మక పోయినా నా శ్రీమతి ఆ కారుని అమ్మేయమని గోల ప్రారంభించింది.

ఇదిలా వుండగా ఇంకో సంఘటన జరిగింది.

అది నిండు పౌర్ణమి రాత్రి. సమయం పది అయి వుంటుంది.

బెడ్ రూంలో పడుకుని ఏదో పుస్తకం చదువుకుంటున్నాను. శ్రీమతి వంట గదిలో ఏదో పని చేసుకుంటూ వుంది.

ఏసీ చల్లదనంతో గదిలో వాతావరణం హాయిగా వుంది. బుక్స్ చదువుకుంటూ గడపటంలో వున్న ఆనందం నాకు కంప్యూటర్, స్మార్ట్ ఫోన్లు, టీవీలలో లభించదు. నాకు బుక్స్ చదవటం చాలా ఇష్టం.

బుక్ చదువుతున్న వాడినల్లా అసంకల్పితంగా ఒక సారి బయటకు చూశాను.

గది కిటికోలోంచి బయటి వెన్నెల చక్కగా కనిపిస్తోంది. మా కాంపౌండ్ లో వున్న పెద్ద పెద్ద కొబ్బరి చెట్లు, మామిడిచెట్లు వెన్నెల్లో మెరిసిపోతూ చూడటానికి చాలా అందంగా వుంది వాతా వరణం.

లాన్, పచ్చటి పచ్చిక, ఫౌంటెన్స్, వరుసగా పార్క్ చేయబడి వున్న నాకార్లు, ఇవన్నీ కాదు నా దృష్టిని ఆకట్టుకుంది.

కల్నల్ శ్రీధర్ కనిపించాడు మా కాంపౌండ్ లో. జీప్సీ లో కూర్చుని వున్నాడు చిరునవ్వులు చిందిస్తూ. స్టీరింగ్ వీలు పట్టుకుని డ్రైవింగ్ సీట్లో కూర్చుని కనిపించాడు. అతడు కూడా నా వంకే చూస్తున్నాడు.

నన్ను 'రమ్మ'న్నట్టుగా తల కదిలించాడు.

చిత్రంగా నాకు భయం వేయలేదు ఈ సారి.

ఈ వ్యవహారం ఏమిటో తేల్చేసుకుందాం అని నాకు అనిపించింది. బుక్ పక్కన్ పెట్టేసి, మేడ దిగి మెయిన్ డోర్ తిస్కుని బయటకు వచ్చాను.

'ప్రాడో' ఒక సారి గట్టిగా కేకేశాను. గేట్ దగ్గరనుంచి పరిగెత్తుకుంటూ వచ్చింది మా జర్మన్ షెపర్డ్ కుక్క.  చాలా ఆరోగ్యంగా, ఉత్సాహంగ వుంది. అది నన్ను చూసి చూడంగానె రెండు కాళ్ళనీ నా భుజాలపై వేస్తూ ఆనందం వ్యక్తం చేసింది.

నేను ఆ సమయంలో తలుపు తీసుకుని బయటకు రావటంతో, సెక్యూరిటి గార్డ్ కూడా నా వద్దకు వచ్చి 'సెల్యూట్' చేసి వినయంగా నిలబడ్డాడు.

నా వెంబడి రమ్మని సైగ చేసి నిశ్శబ్దంగా మేడ వెనుక వైపు కి కదిలాను.  నాతో పాటు ప్రాడో కూడా ఉత్సాహంగా బయలుదేరింది. టార్చ్ తీసుకుని సెక్యూరిటీ కూడా నాతొ కదిలాడు.

వెన్నెల కాంతి పల్చగా పరచుకుని వుంది. దూరంగా ఎక్కడి నుంచో మైకులో ఏవో హిందీ సినిమా పాటలు వినిపిస్తున్నాయి.

మేము అక్కడికి చేరుకునే సరికి అతను స్టీరింగ్ ముందరనుండి దిగి జీప్సీ ప్రక్కన్ నిలబడి వున్నాడు. అవే దుస్తులు వేసుకుని వున్నాడాయన. ఏమీ మార్పులేదు ఆయన గెటప్ లో.

"శ్రీధర్ గారు మీకు ఇది భావ్యమా? ఇలా చెప్పాపెట్టకుండా ఇలా ఇండ్లలోకి జొరబడవచ్చునా? అసలు మీరెవరు,మీకేమి కావాలి?" అని ఆయనని సూటిగా ప్రశ్నించాను.

'సాబ్! ఆప్ కిస్ సే బాత్ కర్ రహే( హై?' అని కంగారు పడుతున్నాడు సెక్యూరిటీ గార్డ్.

నేను సెక్యూరిటి వంక ఆశ్చర్యంగా చూస్తూ 'నా ఎదురుగా చెట్టంత మనిషి వుంటే ఎవరితో మాట్లాడుతున్నాను అంటావేమిటి?' అని చిరాగ్గ చూశాను

"నేను మీకు తప్ప ఎవ్వరికీ కనపడను" నెమ్మదిగా చెప్పాడు కల్నల్ శ్రీధర్.

నేను ప్రాడో వంక చూశాను. కొత్త మనిషి కనిపించినప్పుడు సాధారణంగా చాలా దారుణంగా అరుస్తుంది అది. అలాంటిది అది ఏమి అరవకుండా ఆయన వంక నిశ్శబ్దంగా చూస్తోంది. మొదట కాస్త అరిచింది, ఆ తరువాత అది మంత్రముగ్ధలా అతన్నే చూస్తు నిలుచుంది.

శ్రీధరే తిరిగి చెప్పటం ప్రారంభించారు.

"భయపడకండి. నేను మీకు ఏ హానీ చేయను. నేను మీకు హాని చేయటానికి రాలేదు. ఇప్పటి దాకా నేను మీకు ఏదీ అబద్ధం చెప్పలేదు. కాకపోతే నేను మీకు ఒక నిజం చెప్పలేదు. అదే నా మరణం గురించి. అది మీరు నిన్ననే గూగుల్ చూసి నిర్ధారించుకున్నారు.అవును నేను చనిపోయాను. ఈ నిజం నాకే ఇంకా సరిగ్గా జీర్ణం కాలేదు.

సరిగ్గా సంవత్సరం క్రితం జమ్మూ కాశ్మీర్ లో ఉగ్రవాదులతో జరిగిన ఒక పోరులో నేను చనిపోయాను. ఉగ్రవాదులు స్థానిక ప్రజలను హ్యూమన్ షీల్డ్ గా పెట్టుకుని మమ్మల్ని దొంగ దెబ్బతీసి చంపేశారు. చనిపోయిన తక్షణం నాకు అంతా తెలుస్తూనే వుంది. నాకు అందరూ కనిపిసూనే ఉన్నారు. కానీ నేనే ఎవ్వరికీ కనిపించటం లేదు. మరి దెయ్యాన్నా? కాదు. మరి నన్నేమనాలి? ఆత్మనా? కాదేమో?

సాధారణంగా కుక్కలకి ఘ్రాణ శక్తి, అతీంద్రియ శక్తులు వుంటాయి. వాటికి నేను కనిపిస్తున్నాను కానీ నన్ను చూసి భయంకరంగా మొరగటం చేయటం లేదు. అవి నన్ను సాధు ఆత్మగా గుర్తించి వుంటాయనుకుంటాను.

ఒకటి మాత్రం నిజం ప్రాణాలతో వున్నపుడు ఎలా అలోచించగలిగే వాడినో, అలా నిరంతరం నాలో చైతన్య స్రవంతిలాగా ఆలోచనలు ఝురిలా కొనసాగుతూనే వున్నాయి.

అంటే నేను శరీరం లేని ఆలోచనల ఝురినన్నమాట. నా ఊహ పారిన చోటికి నేను తక్షణం వెళ్ళి ఆయా ప్రదేశాలు చూడగలుగుతున్నాను. నా స్వగ్రామం ఒరిస్సా లో వుంది. అక్కడికి వెళ్ళగలుగుతున్నాను, నా భార్యా బిడ్డల్ని చూడగలుగుతున్నాను. నాకిష్టమైన ఈ జిప్సీని ఆర్మీ వారు సెకండ్స్ డీలర్లకు వేలం వేసే దగ్గరికి వెళ్ళగలిగాను. ఆ వేలం పాట తతంగాన్నీ యావత్తూ చూడగలిగాను. మీరు జిప్సీ కొనటం చూశాను.

ఇంకా చిత్రమైన విషయం ఏమిటంటే ఇన్ని రోజులుగా నెనెంత ప్రయత్నం చేసినా ఎవరూ నన్ను చూడ లేకపోయారు. నేను మాట్లాడుతూనే వున్నాను,నా మాటలు ఎవ్వరికీ వినపడలేదు.

కానీ అదృష్టవశాత్తు మీరు నన్ను చూడగలుగుతున్నారు, వినగలుగుతున్నారు. ఇంకో చిత్రమైన విషయం ఏమిటంటే మీరు కూడా నేను ఈ జిప్సీకి కేవలం పదడుగుల దూరంలో వుంటేనే చూడగలుగుతున్నారు. అది కూడా పున్నమి రాత్రులలోనే చూడగలుగుతున్నారు.

హేతువాదులకు, నాస్తికులకు ఈ విషయాలు చెప్పినా నమ్మలేరు. 'ట్రూత్ ఈస్ స్ట్రేంజర్ దేన్ ఫిక్షన్' వాస్తవం ఎన్నటికీ కల్పనకన్నా విచిత్రంగా వుంటుంది. అది మీకు తెలుసు.

నా మొహంలో భావాల్ని చదివే ప్రయత్నం చేస్తూ కాసేపు నిశ్శబ్దంగా వుండిపోయాడు శ్రీధర్.

నా వంక అయోమయంగా చూస్తుండిపోయిన సెక్యూరిటిగార్డ్ ను తన స్థానానికి వెళ్ళిపొమ్మని నెమ్మదిగా సైగ చేశాను.

చలి గాలి శరీరాన్ని వణికిస్తోంది. దూరంగా హైవే పై వాహనాల రొద చెవుల్ని తాకుతోంది.

"మీరు నాకు చిన్న సాయం చేయాలి. నన్ను మీరు ఎప్పుడైతే చూడగలిగారో ఆ రోజే అర్థమయిపోయింది నాకు సాయం చేయగలిగింది మీరు ఒక్కరే అని" నేను ఆయన వంకే చూస్తుండి పోయాను.

"మనం ఒరిస్సా వెళ్ళాలి. అక్కడ మీరు నెరవేర్చాల్సిన కార్యం ఒకటుంది. వచ్చే పున్నమి రోజు ఉదయాన్నే బయలుదేరి మనం ఒరిస్సా వెళదాం" శ్రీధర్ చెప్పాడు.

నాకు కాస్తా భీతి కలిగింది.

"నేను మీకు ఏ హాని చేయను. అది నా హామీ" శ్రీధర్ అలా చెప్పి నెమ్మదిగా దూరంగా గాల్లో కల్సిపోయాడు.

నేను ఆ వైపే చూస్తుండి పోయాను.

★★★ ★★★★ ★★★★

దరింగ్‌బడి (హిల్ స్టేషన్) ఒరిస్సా

మేము అక్కడికి చేరుకునే సరికి సాయంత్రం ఆరవుతోంది. పల్చటి చీకట్లు అలుముకుంటున్నాయి. చాలా చలిగా వుంది వాతావరణం.

ప్రక్కనే కూర్చున్న శ్రీధర్ దారి చూపిస్తుండగా ఓ ఎత్తైన మలుపులో ఉన్న ఇంటికి చేరుకున్నాము. అది చాలా పెద్ద ఇల్లు.

కశ్మీర్ ఆఫ్ ఒడిశా అని పేరు వుంది కొండలపై ఉన్న ఆ ఊరికి. ఎటు చూసినా అద్భుతమైన ప్రకృతి దృశ్యాలు మైమరిపింపజేస్తాయి.

ఊరికి కాస్తా దూరంగా ఉన్న ఆ ఇల్లు ప్రకృతి ఒడిలో ఉన్నట్టుంది. దూరంగా ఎటూచూసినా పసుపు తోటలు. ఆ ప్రాంతంలో పసుపు, అల్లం తోటలు ప్రత్యేకం.

ఏవో పల్లె పదాలు పాడుకుంటూ ఇండ్లకు వెళుతున్నారు కార్మికులు, వాళ్ళ వస్త్రధారణ, భాష వింతగా వుంది.

ఆకాశం చాలా స్వచ్ఛంగా వుంది.

ఆ ఇంటి గేటు ముందు జీప్పీ ఆపి కాలింగ్ బెల్ నొక్కాను.

సెక్యూరిటీ గార్డ్ నెమ్మదిగా గేటు తీశాడు.

సెక్యూరిటీ గార్డుకి అర్థం కాలేదు నేనెవరో. కానీ జీప్పీకున్న రంగును బట్టి నాకు ఆర్మీకి ఏదో సంబంధం వుందని అంచనా వేశాడు.

'అమ్మగారున్నారా' అని హిందీలో అడిగి, అతనికి నా విజిటింగ్ కార్డ్ ఇచ్చి ఆవిడకు ఇచ్చి రమ్మన్నాను.

ఇంతలో ఎవరూ ఉహించని విధంగా వాళ్ళ ఇంటి నుంచి లాబ్రడార్ బ్రీడ్ కి చెందిన వారి పెంపుడు కుక్క పరుగున వచ్చి ముందరి సీట్లో ఉన్న శ్రీధర్ పై ప్రేమ గా ఎగబడి అతన్ని నాకే ప్రయత్నం చేస్తోంది.

అతను నాకు మాత్రమే కనిపిస్తున్నాడు. సెక్యూరిటీ గార్డుకు అయోమయంగా వుంది. దాన్ని బలవంతంగా లాక్కుపోతున్నా అది లోనికి వెళ్ళటం లేదు.

అందుకే శ్రీధర్ కార్ దిగి లోనికి నడిచాడు. అతడి వెంబడే అది కూడా లోనికి నడిచింది.

★★★★ ★★★★★ ★★★★★

విషయం మొత్తం వివరంగా చెప్పాను త్రివేణి కి. అసలే పెద్దవైన ఆమె కళ్ళు ఆశ్చర్యంతో మరింత పెద్దవయ్యాయి.

సోఫాలో త్రివేణికి ఎదురుగా కూర్చుని మాట్లాడుతున్నాను. ఆమె ఒడిలో ఆరేళ్ళ బాబు, ఆమె ప్రక్కనే సోఫాలో కూర్చున్న పదేండ్ల పాప కూడా నా మాటలు ఆసక్తిగా వింటున్నారు.

"ఇప్పుడు కల్నల్ శ్రీధర్ మీ పక్కనే కూర్చుని వున్నాడు సోఫాలో. మిమ్మల్ని కళ్ళారా చూసుకుంటున్నాడు. ఆయన్ని నేను చూడగలుగుతున్నాను, మీరు చూడలేక పోతున్నారు."

అలా చెబుతున్నప్పుడు నా కంఠం రుద్ధమయింది.

"అమ్మా మీ ఇద్దరు పిల్లల బాధ్యత, వృద్ధులైన శ్రీధర్ గారి తలితండ్రుల బాధ్యత ఇవన్నీ మీ భుజస్కంధాలపై పడ్డాయి. వారు మీ గురించి బాధపడుతున్నారు. పెన్షన్ డబ్బులు ఎలాగు వస్తాయి, కానీ శ్రీధర్ గారు మీ తోటల తాలుకు కొన్ని ముఖ్యమైన డాక్యుమెంట్లని బ్యాంకు లాకర్ లో పెట్టారట. మీకు ఆ విషయం తెలియక ఆ డాక్యుమెంట్లు పోయాయి అని కంగారు పడుతున్నారట. చెబుదామంటే మీతో వారు కమ్యూనికేట్ చేయలేకపోతున్నారు. అవి కాక వారు చేసిన కొన్ని ఇన్వెస్ట్ మెంట్ల గురించిన వివరాలు మీకు చెబుతున్నారు.

ఇవి కాక వారు కొన్ని పాస్ వర్డ్ లు మీకు చెప్పాలని తపన పడుతున్నారు. ఇవన్నీ నాకు వివరంగా చెప్పారమ్మా. మీరు ఇక పై డబ్బుల గురించి ఏ విధమైన ఆందోళన చెందకండి.

ఈ వివరాలన్నీ మీకు తెలియజేయాలని వారు ఎంత ఆందోళన చెందారో చెప్పలేను"

ఆ వివరాలన్నీ ఆవిడకి చెబుతుంటే ఆయన ఆనంద పడటం ప్రత్యక్షంగా చూడగలిగాను.

ఆయన ఆనందాన్ని కండ్లారా చూడగలిగాను అన్న తృప్తిలో వెయ్యికిలోమీటర్లకు పైగా ప్రయాణం చేసిన అలసట మర్చిపోయాను.

ఓ మంచి పని చేశానన్న తృప్తితో శ్రీధర్ వంక చూశాను.

ఆయన్ వీడ్కోలు చెబుతున్న భంగిమ లో క్రమంగా అదృశ్యమయిపోయారు.

ఆ తర్వాత నేన్నాయన్ని ఎన్నడు చూడలేదు.

★★★★★ ★★★★★★ ★★★★★★

"ఓ మై గాడ్. ఈ జిప్సీ వెనుక ఇంత కథ వుందన్న మాట." అన్నాడు రాజీవ్.

వేగంగా వెళుతున్న జిప్సీలో చల్లటి ఉదయపు గాలులు మా ఇద్దరినీ తాకుతున్నాయి.

ఉదయాన్నే ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ రేంజర్స్ మా పరిస్థితి విని వాళ్ళ దగ్గర వున్న క్యాన్ లోని కాస్త పెట్రోలు ఇచ్చి మమ్మలి ఆదుకున్నారు.

మేము చేయాల్సిన మొదటి పని ఇంకాసేపట్లో వచ్చే చిన్న ఊరిలో టీ త్రాగినా, త్రాగకున్నా ట్యాంకు నిండా పెట్రోలు పట్టించాలి.

"ఇంతకూ ఆ కల్నల్ ఆ తర్వాత ఎప్పుడైనా కనిపించాడా మళ్ళీ?" రాజీవ్ ప్రశ్నించాడు ఉత్కంఠతో.

"లేదు రాజీవ్. ఐ మిస్ హిమ్ ఎ లాట్. వాళ్ళ కుటుంబానికి చెప్పాల్సిన విషయాలు చెప్పేశాక ఆయన తృప్తిగా వెళ్ళిపోయారు. ఆ తర్వాత ఆయన మళ్ళీ ఎప్పుడు కనిపించలేదు. ఇది జరిగి ఓ రెండు సంవత్సరాలు అవుతోంది. ఆ సంఘటనలు జరిగి ఆయన్ అలా అదృశ్యం అయిపోయాక, చాలా పున్నమి రాత్రులు నేను జిప్సీ దగ్గరే కూర్చుని ఆయన కోసం చూసే వాడిని ఆతృత గా. కానీ ఆయన కనిపించలేదు ఆ తర్వాత మరెన్నడు" చెప్పాను నేను.

దూరంగా కనిపిస్తున్న పెట్రోలు స్టేషన్ వంక జిప్సీని నడపసాగాను.

------ సమాప్తం---------

After watching this you tube video, I got inspiration to write this story

https://www.youtube.com/watch?v=-PHxPa_26NA

https://en.wikipedia.org/wiki/Om_Banna

## ఉత్తరాల స్టాండు

పెయ్యేటి శ్రీదేవి

స్రవంతి నెల్లాళ్ళనించి ఇల్లు సర్దుతోంది. ఎప్పట్నించో అడుగుతున్నారు అపార్ట్ మెంట్ కడతామని. అందులో రెండు ఫ్లాట్‌లు వీళ్ళకిచ్చేలాగా. అత్తగారున్ననాళ్ళు ఇవ్వనివ్వలేదు. ఆవిడ పోయి ఏడాదైంది. సంవత్సరీకాలూ అయిపోయాయి కాబట్టి ఇక అపార్ట్ మెంటు కివ్వాలని నిర్ణయించుకుంది. కొడుకు, కూతురు వివాహాలయి అమెరికాలో వుంటున్నారు. ఎలాగూ పాతబడిపోయింది ఇల్లు. 500 గజాల స్థలం వున్న ఆ ఇల్లు బాగుచేయించాలన్నా తలకు మించిన భారమే. అంత పెద్ద ఇంట్లో ఒంటరిగా వుండాలన్నా కష్టమే. పనీ ఎక్కువ. పిల్లలు కూడా అపార్టుమెంటుకిచ్చేయమన్నారు. అందుకే నెల్లాళ్ళకల్లా ఇల్లు అప్పచెప్పాలి. అపార్టుమెంటు అయేదాకా వేరే అద్దె ఇల్లు చూసింది. అన్నీ తనొక్కతే చేసుకోవాలి. భర్త ఆర్.ఎమ్.పి.డాక్టర్. ఆయనగారి వల్ల వీసమెత్తు సాయం లేదు. భార్యమీద అరిచి, అరిచి, అరిచి ఒకసారి కోపంతో కాఫీ వేడిగా లేదని విసిరికొట్టాడు. ఆ కాఫీ స్రవంతి మొహం మీద, చీర మీద పడింది. గట్టిగా అరుస్తూ, అరుస్తూ అప్పట్నించీ మాట పడిపోయింది. భర్తగారు ఇంక అరవలేదని సంతోషించాలో...... మాట పడిపోయిందని బాధ పడాలో ఎటూ జీర్ణించుకోలేక పోయింది స్రవంతి.

తండ్రి పోయాక ఆయన గుర్తుగా ఆయన వాడుకునే ట్రంకు పెట్టె తెచ్చుకుంది. తెచ్చింది గాని అదెప్పుడూ తెరవడం కుదరలేదు దాని తాళం కనబడక. అందులో నాన్నగారి ఇస్త్రీ చేసిన ఫేంట్లు, వాడకానికి అవసరమయే డబ్బు వుండేవి. నాన్నగారు బేంకులో మేనేజరుగా

చేసేవారు. అందుకని ఆయన దగ్గర కొత్త రూపాయల నోట్లు, పదిరూపాయల, వందరూపాయల నోట్లు వుండేవి. పాలవాళ్ళకీ, పనివాళ్ళకీ కొత్త నోట్లే ఇచ్చేవారు. వాళ్ళు ఆ నోట్లు చూసి మురిసి పోయేవారు. ముఖ్యమైన ఉత్తరాలు కూడా జాగ్రత్తగా దాచేవారు.

దాని తాళం కనబడక పోయినా వేరే తాళంచెవులతో ఆ పెట్టి తెరిచింది.

నాన్నగారు వేసుకునే ఇస్త్రీ మడతల దుస్తులు, కొన్ని కొత్త పంచెలు కూడా అలానే వున్నాయి. ఒక బేగ్‌లో కొత్తరూపాయల నోట్ల కట్టలు, పది, వంద రూఫాయల నోట్ల కట్టలు అలానే వున్నాయి. కాని ఏం లాభం? ఆ నోట్లు చెల్లవు. మూడేళ్ళక్రితం ప్రభుత్వంవారు పాతనోట్లు రద్దు చేసారు. అయ్యో, కాస్త ముందరన్నా ఆ పెట్టె తెరిచి ఆ పాతనోట్లన్నీ మార్చేయాల్సింది. అదే టైములో డబ్బు చాలా అవసరం వచ్చింది. భర్తకి హార్ట్ ఎటాక్ వస్తే ఆస్పత్రిలో చేర్పించింది. ఆస్పత్రి ఖర్చు చాలానే అయింది. బ్యాంకులో గోల్డ్ లోన్ పెట్టాల్సి వచ్చింది. అప్పుడే ఈ పెట్టె తెరిచివుంటే అవసరానికన్నా ఆదుకునేది. ఇప్పుడు టైమూ దాటిపోయింది. ఉసూరుమంది. బోలెడు డబ్బు చిత్తుకాగితాల్లా పడేయాల్సిందే కదా?

వెతుకుతూంటే కొన్ని ఫొటోల కట్ట కనబడింది. విప్పిచూస్తే నాన్నగారు ఆఫీసువాళ్ళతో కలిసి తీయించుకున్న ఫొటో, ఇంకోటి ఫేమిలీ ఫొటో, అమ్మమ్మ తాతగారు, అమ్మ, నాన్నగారు, ఇద్దరు పిన్నిలు, మామయ్యలు, తన చెల్లెళ్ళు, తమ్ముళ్ళు, చిన్నపిల్లలు, అందరూ కలిసి దిగిన ఫొటో కనిపించాయి. అప్పటి పాతకాలపు నగ 'కంటె', నడుముకు వడ్డాణం ఉన్నాయి. బ్లాక్ అండ్ వైట్ ఫొటో మూలానేమో, పాత సినిమా యాక్టర్లలా వున్నారు. ఎంత బాగున్నారో! నిండుగా బొట్టు, కాటుక, పట్టుచీర కట్టుకుని వుంది అమ్మమ్మ.

పూర్వం రోజుల్లో ఫొటో తీయించుకోవాలనుకుంటే, నీరెండ రావాలి. మొహాలు ఫ్రెష్ గా వుండాలి. అప్పుడు ఫొటోగ్రాఫర్ వచ్చి, నల్లటి ముసుగేసుకుని స్టాండ్ కెమేరాతో ఫోటో తియ్యడానికి గంటలు గంటలు పట్టేది. మళ్ళీ ఆ ఫోటో కడిగి ఆరబెట్టి ఇచ్చేసరికి వారం రోజులు పట్టేది. ఇప్పుడలా కాదు. వెంటనే అలా తీసేయడం, ఇలా వచ్చేయడం. సెకన్లలో ఏ దేశంలో వున్నా ఇంటర్నెట్ ద్వారా అవతలివాళ్ళకి ఫోటోలు పంపెయ్యడం జరుగుతోంది.

ఆలోచిస్తూ మరో ఫొటో తీసింది. అబ్బో, అది తన ఎస్.ఎస్.ఎల్.సి.లో తీయించుకున్న క్లాస్ ఫొటో. అందర్నీ చూసింది. అప్పుడు తనెంత సన్నగా అందంగా వుందో! ఛీ! అంత అందం ఇప్పుడేమై పోయింది? ఆ తుమ్మెద రెక్కల్లాంటి వంకీజుట్టు, సన్నని నడుము, అందరూ ఎంతందంగా వున్నావే స్రవంతీ! అంటూ పొగిడేసేవారు. ఇప్పుడా సన్నని నడుమూ లేదు, అందమైన జుట్టూ లేదు. భారీగా శరీరం పెరిగిపోయింది. ఛ! రోజులింత దారుణంగా ఎందుకు మారిపోయాయో.........? అందమైన బాల్యం కరిగిపోయింది. అమ్మమ్మ, తాతగార్లు, అమ్మ, నాన్నగార్ల నీడన ఎప్పటికీ చిన్నపిల్లగా వుండిపోతానేమో అనుకుంది గాని, అమ్మమ్మ, బామ్మ, తాతగార్లని పోగొట్టుకుని, తానూ అమ్మ, అమ్మమ్మ, బామ్మ స్థాయికి చేరి అంత పెద్దయిపోతానని ఎప్పుడూ అనుకోలేదు.

మనసు బాధగా మూలిగింది. గతాన్ని పక్కకి పెట్టి, యథాస్థితికి వచ్చి, ఇంకో మూల వెతుకుతూంటే, ఇనపతీగేదో చేతికి గుచ్చుకున్నట్టయి, ఏమిటా అని తీసిచూస్తే, 'ఉత్తరాలస్టాండు'! ఈ ఉత్తరాలస్టాండు పెట్టెలో ఎందుకుంది? గుమ్మానికి మూల మేకుకి

పెట్టివుండేది. ఉత్తరాలు చదివి అందులో గుచ్చేవారు. చెడ్డవార్తలున్న ఉత్తరాలైతే చదివిన వెంటనే చింపేసి పడేసేవారు. బంధుమిత్రుల నించి క్షేమసమాచారాలతో వచ్చే ఆ ఉత్తరాలు చదువుతుంటే ఎంతో ఆనందం కలిగేది.

ఇప్పటి రోజుల్లో క్రమేపీ ఉత్తరాలు కనుమరుగై పోయి వాటి స్థానే ఇంటర్నెట్ లు, ఫేస్ బుక్,సెల్ ఫోన్లు, ఇలా ఎన్నో ప్రసారసాధనాలు వచ్చేసాయి. వాటిద్వారా కొన్ని సెకన్లలోనే వార్తలు ప్రపంచంలోని ఏమూలలో వున్నవారికైనా చేరిపోతున్నాయి.

ఆ రోజుల్లో రోజూ పదకొండు గంటలకల్లా పోస్ట్ మేన్ కోసం అందరూ ఎదురు చూసేవారు. అతను ఇంట్లో అందరికీ ముఖ్యమైన వ్యక్తి. అతను 'పోస్ట్!' అని అరుస్తూ ఇచ్చే ఉత్తరాల కోసం ఎదురు చూస్తూ ఆ రోజు ఉత్తరాలు రాకపోతే తీవ్రమైన నిరాశ కలిగేది అందరికీ. ఉత్తరాలొస్తే మటుకు పిల్లలందరూ ఆ ఉత్తరం పోటీపడి అందుకునేవారు. ఆ అందుకోవడంలో ఒక్కోసారి పెద్దవాళ్ళు చదవకుండానే చిరిగిపోతుండేవి. పిల్లలని చీవాట్లేసి, ఆ చిరిగిన ముక్కలని జతచేసి ఎలాగో చదువుకునే వారు. ఒక్కోసారి అయిదారుత్తరాలు, లేక ఇన్‌లాండ్ కవర్లూ వస్తుండేవి.

మేకుకి వుండే ఉత్తరాలస్టాండు పెట్లో ఎందుకుందా అనుకుంటూ ఒక్కొక్క ఉత్తరమే తీసి చదవసాగింది. అన్నట్టు గుర్తుకొచ్చింది. మేకుకున్న పెద్ద ఉత్తరాలస్టాండు చెదపట్టి, ఉత్తరాలన్నీ చిల్లులు పడి పాడయిపోతే, పడేసి కొత్త స్టాండు కొని, మళ్ళీ చెదపట్టి పాడవకుండా నాన్నగారు పెట్లో పెట్టివుంటారు.

ఒక ఉత్తరం తీసి చదవసాగింది. ముత్యాలకోవతో రాసిన ఆ ఉత్తరం పెదనాన్నగారిది. (ఆమె నాన్నగారి పేరు కామేశ్వరరావు).

'చిరంజీవి కామేశ్వరరావుని దీవించి వ్రాయునది. ఉభయకుశలోపరి. చి.స్రవంతి గాడు, చి.భారతి గాడు, చి.చంద్రంబాబు ఎలా ఉన్నారు? వాళ్ళని తెల్లవారగట్టే లేపి చదివించు. చేతిరాత బాగుండాలి. రోజూ కాపీలు దిద్దించు. చి.మరదలు భవానీ కులాసా అని తలుస్తాను. మీ వదినకి మొన్న జ్వరం వచ్చి తగ్గినది. వాళ్ళమ్మగారు వచ్చారు. మొన్ననే పథ్యం పెట్టారు. ఇంకా నీరసంగానే వుంది. డాక్టరు బ్రెడ్డు, పాలు ఇమ్మన్నారు. నీరసం తగ్గడానికి బార్లీ, గ్లూకోజువాటరు ఇమ్మన్నారు. జలుబుగా వుంటే కస్తూరి మాత్రలు వేస్తున్నాను. చి.రామకృష్ణ ఎస్.ఎస్.ఎల్.సి. పాసయాడు. చి.మహాలక్ష్మి కి సంబంధాలు చూస్తున్నాము. ఒక సంబంధం నలుగుతోంది. అబ్బాయికి బాగా ఆస్తిపాస్తులు ఉన్నాయి. గవర్నమెంటు స్కూల్లో టీచరు. కొంచెం నలుపే అయినా పొలాలవీ వున్నాయి. సరే, ఆ వివరాలు తర్వాత రాస్తాను.

ఉంటాను. వెంటనే జాబు రాయి.'

అలా ఇంకొన్ని ఉత్తరాలు చదివింది. అన్నీ కార్డులే. క్షేమసమాచారాలు తప్ప పెద్ద విశేషాలేం లేవు. అప్పుడు తరుచు నమస్కారాలు పెట్టి, చిన్నవాళ్లయితే దీవెనలు పెట్టి, ఇక్కడంతా క్షేమం, అక్కడంతా క్షేమమని తలుస్తాను. పిల్లలు జాగ్రత్త. వాళ్ళని బాగా చదివించు. ....... ఇలానే వుండేవి ఉత్తరాలన్నీ. మరికొన్ని పొలాల విషయాలు వుండేవి.

అప్పటి రోజుల్లో ఫోన్ సౌకర్యం లేదు కనక ఉత్తరాల ద్వారానే విషయాలు తెలియపరిచే వారు. బంధువులు, కూతుళ్ళు, అలుళ్ళు వచ్చి కొన్నాళ్ళుండి, వెళిపోతుంటే వెంటనే ఉత్తరం రాయమనే వారు. ఉత్తరాలు రాకపోతే కంగారు పడేవారు. ఇంక ఎప్పుడన్నా టెలిగ్రాం వస్తే ఏ చెడువార్తోనని వణికిపోయేవారు.

ఈసారి ఇన్‌లాండ్ లెటర్ తీసింది. అది అత్తయ్య చేతిరాతలా వుందే అనుకుంటూ, ఆలోచిస్తూ చదవడం మొదలెట్టింది. ఎన్నాళ్ళనించో అత్తయ్య వాళ్ళతో సంబంధం లేదు, రాకపోకలూ లేవు. ఎందుకో కారణం తెలీదు. మధుబావ గుర్తొచ్చాడు. ఎక్కడున్నాడో అనుకుంటూ.....

'కామేశానికి దీవించి వ్రాయునది. శాంతక్కయ్య, మరదలు, జానకి, పిల్లలు స్రవంతి, కృష్ణ, జాహ్నవి కులాసా అని తలుస్తాను. అసలు విషయం ఏమంటే, స్రవంతి, నా కొడుకు మధు చిన్నప్పట్నించి ఒకే ఊళ్ళో వుండడం మూలాన కలిసి తిరిగా

రు, ఆడుకున్నారు. స్రవంతిని నా కోడలుగా చేసుకుందామనుకున్నాను కదా? వాళ్ళు ఇష్టపడ్డారు. తరవాత మీ బావగారి ఉద్యోగరీత్యా బొంబాయి వెళ్ళిపోవలసి వచ్చింది. మధు కూడా ఉద్యోగంలో స్థిరపడ్డాడు. ఢిల్లీలో ప్రొఫెసర్‌గా చేస్తున్నాడు. కొంతమంది ఫ్రెండ్స్ తో ఒక రూమ్ తీసుకుని వుంటున్నాడు. ఎన్నాళ్ళు ఒంటరిగా వుంటాడు? హోటల్ తిండి పడటల్లేదు. ఆ మూడు ముళ్ళూ వేయించేస్తే నాకు బెంగ వుండదు. తరవాత వాడి చెల్లెలు మీనాక్షి ఇంకా చిన్నదే కాబట్టి పెళ్ళి తొందర లేదు. ఇప్పుడు ఫోర్త్ ఫారం చదువుతోంది. మా అత్తగారు చదివింది చాలు, ఆడపిల్లకంత చదువెందుకు? చదివి ఉద్యోగాలు చెయ్యాలా, ఊళ్ళేలాలా? మొగుడుకి ఉత్తరం ముక్క రాయడానికి, చాకలిపద్దు వేసుకోవడానికి ఈ చదువు చాలు. నే బతికుండగా దాని పెళ్ళి కూడా చేసెయ్యండి అంటోంది. మీ బావగారికి ఈ ఇంటివిషయాలేమీ పట్టవు. ఆయనకి ఉద్యోగమే మొదటి భార్య. నేను రెండో భార్యని.'

ఆ మాటకి చదువుతూ నవ్వుకుంది స్రవంతి. కాని బాధ పడింది. మరి అప్పుడైతే తనని బావకెందుకు చేసుకోలేదు? హాయిగా వుండేది కదా తన జీవితం? తరవాత చదివింది.

'వెంటనే ఏ సంగతీ ఉత్తరం రాయి. త్వరలో ముహూర్తాలు పెట్టుకుందాము.

ఇట్లు,
అక్కయ్య శాంతమ్మ.'

హడావిడిగా అత్తయ్య రాసిన ఉత్తరాలన్నీ చదివింది.

'అన్నయ్యకి నమస్కారములు. సడన్‌గా మా అత్తగారు పోయారని రాస్తే చూడటానికి రాలేదు సరికదా, కనీసం ఓ సానుభూతి ఉత్తరం కూడా నీ నుంచి రాలేదు.'

కోపంగా రాసినట్టుంది.

మళ్ళీ ఇంకోటి చదివింది. నా పెళ్ళికి పసుపు కుంకుమ కింద నాన్నగారిచ్చిన రెండెకరాల పొలం నించి ధాన్యం బాపతు డబ్బు పంపటల్లేదు. కారణం తెలీదు.

ఇట్లు,
శాంతక్కయ్య.'

ఇదీ కోపంగా రాసిందే. మరో ఉత్తరం....

'నువు మనసులో ఏం పెట్టుకున్నావో? చి.మధుకి, చి.స్రవంతికి త్వరలో పెళ్ళి చెయ్యాలని అదివరలో నీకు ఇన్లాండ్ కవరు రాసాను. నువు దానికి సమాధానం రాయలేదు. ఇక్కడే వాడికి వేరే సంబంధం చూసాము. పిల్ల చాలా బాగుంటుంది. పదివేలు కట్నం, లాంఛనాలు, వెండి కంచం, వెండి మరచెంబు ఇస్తామన్నారు. హోటల్ తిండి పడక వాడి ఆరోగ్యం పాడవుతోంది. శుభలేఖ పంపుతున్నాను. వచ్చి నాలుగక్షింతలు వెయ్యి.'

స్రవంతి ఆ ఉత్తరం చదువుతూ వలవలా ఏడ్చేసింది. గుండెల్లో బాధ. మరి తను ఇష్టపడ్డ మధుబావకిచ్చి చెయ్యకుండా ఈ పిచ్చాడికెందుకు కట్టబెట్టి తన బతుకు నాశనం చేసారు?

కోపంతో ఏడుస్తూ తల్లికి ఫోన్ చేసింది. అప్పుడు రాత్రి పన్నెండవుతోంది. తల్లి పడుకునుంటుంది. ఐనా ఆపలేదు. రింగవుతోంది. నిద్రమత్తు లోనే తల్లి కంగారుగా అడిగింది, 'ఏమిటే ఏడుస్తున్నావు? మీ ఆయనకేమయినా అయిందా?'

'ఆయనకేం బాగానే వున్నారు. నేనే ఇంకా ఎందుకు బతికున్నానా అని ఏడుస్తున్నాను.'

'ఏమయిందే నీకు? ముందా ఏడుపాపి విషయం ఏమిటో చెప్పు.'

'ఆపుతా గాని, ముందర నే అడిగిన దానికి సమాధానం చెప్పు. నన్ను మధుబావకిచ్చి పెళ్ళెందుకు చెయ్యలేదు? అందరికీ తెలిసున్నదే కదా, బావ, నేను ఇష్టపడ్డామని? నన్నీ సోంబేరిగాడికిచ్చి ఎందుకు పెళ్ళి చేసారు?'

'తప్పే. మొగుడ్నలా అనచ్చా సోంబేరిగాడని? మొగుడంటే దేముడు. లెంపలేసుకో......'

'ఆహా....... హా...... హా.......! మొగుడు దేముడు, అత్తగారు దేవత, ఆడబడుచులు నీకు బంగారు తల్లులు. వీళ్ళందరికీ సేవలు చేసీ, చేసీ నా నడుం పడిపోయింది. అత్తగారింటికి పంపేటప్పుడు ఏం నీతులు చెప్పావు నాకు? మొగుడు తిట్టినా, కొట్టినా ఏమనకుండా పడుండాలి. మొగుడే దేముడు. అత్తగారికి కాళ్ళు ఒత్తాలి. అడపడుచుల్ని ప్రేమగా, గౌరవంగా చూడాలి అంటూ నా బుర్రలో నూరిపోసావు. నువ్వు చెప్పినట్లే అలాగే ప్రవర్తించాను. కానీ వాళ్ళు ఒక్కళ్ళు కూడా నామీద ప్రేమ చూపించలేదు. నన్ను పనిమనిషి కన్నా

హీనంగా చూసి, అడ్డమైన చాకిరీలు చేయించుకున్నారు. ఒక మరమనిషిలా అయిపోయాను. ఆఖరికి నాపిల్లల ఆలనా పాలనా కూడా చూసుకోలేక పోయాను. అలాంటి వాళ్ళమీద నాకెందుకు ప్రేమ వుంటుంది?'

'నీ పిల్లల పెళ్ళిళ్ళయిపోయాయి. రేపో మాపో వాళ్ళకీ పిల్లలు పుట్టి అమ్మమ్మవవుతావు. ఇన్నేళ్ళయాక ఈ సాధింపులేమిటే? బావతో పెళ్ళెందుకు చెయ్యలేదనడుగుతావేమిటి? తప్పు కూడాను.'

'తప్పొప్పులు తరవాత నిర్ణయించుకుందాం. బావతో పెళ్ళెందుకు చెయ్యలేదో నే అడిగిన దానికి సమాధానం చెప్పు. నాన్నగారి పెట్టెలో ఉత్తరాల స్టాండు కనబడింది. అత్తయ్య రాసిన ఉత్తరాలు చూసాను. త్వరలో ముహూర్తాలు పెట్టించి పెళ్ళి చెయ్యాలని, హోటలు తిండి బావకి పడటల్లేదని ఆ ఉత్తరం సారాంశం. ఆవిడ రాసిన ఉత్తరాలే చూసాను. మరి మీరేం సమాధానం రాసారు అత్తయ్యకి?'

'ఒంటిగంటవుతోంది. రేపు చెబుతాలే. నిద్రొస్తోంది.'

'నాకు నిద్ర పట్టదు. ఇప్పుడే చెప్పు.'

'సరే, చెబుతాను. మేమేం బావతో సంబంధం వదులుకోవాలనుకోలేదు. చేద్దామనే అనుకున్నాం. ముహూర్తాలు పెడదామనే అనుకున్నాం. పురోహితుడ్ని కూడా పిలిచి ముహూర్తాలు పెట్టించాం. మీ అత్తయ్యకి ఉత్తరం రాసాం కూడా. కానీ ఎన్నాళ్ళకీ సమాధానం రాలేదు. నువు చదివిన ఉత్తరం లేటుగా అందింది మాకు. అప్పటికే నీకూ పెళ్ళి కుదిరిపోయింది. అలాగే మేం రాసిన ఉత్తరం కూడా వాళ్ళకి లేటుగా అందివుంటుంది. అన్నట్లు అప్పట్లో ప్రత్యేకాంధ్ర గొడవలు జరిగాయి. అందుమూలాన నెల వరకు బంధువుల నించి ఉత్తరాలు గాని, రాకపోకలు గాని లేవు. ఈలోగా ఆరోగ్యం బాగాలేక, తను బతికుండగానే నీకు త్వరగా పెళ్ళి చెయ్యమని మీ బామ్మ తొందర పెట్టింది, అబ్బాయి డాక్టరు, ఆస్తిపాస్తులున్నాయి. మన పిల్ల సుఖపడుతుందంటూ. మన ఇంట పౌరోహిత్యం చేసే రామశాస్త్రి గారే ఈ సంబంధం చూసారు. నువ్వూ చెప్పావుగా అబ్బాయి నచ్చాడని? ఇన్నేళ్ళయాక తిట్టిపోస్తావేమిటీ?'

'ఆయన గారు ఏ డాక్టరో తెలుసుకోవద్దా? ఆర్.ఎమ్.పి. అంటే అదో పెద్ద డాక్టరు అనుకున్నారు. అది కూడా తెలీదు. ఆయన ఓ ముక్కోపి. ఏనాడన్నా సుఖపడ్డానా? నరకం అనుభవించాను. ఆడపిల్ల అనగానే ఎవడికో ఒకడికి కట్టపెట్టేద్దామని చూస్తారు. మరిప్పుడు బావ ఎక్కడున్నాడు?'

'తెలీదు. ఆవిడకి పసుపు కుంకుమల కింద ఇచ్చిన పొలం మీద డబ్బు పంపటల్లేదని నాన్నగారి మీద కోపం వచ్చింది. కాని నాన్నగారు ఆ బాధ్యతని బాబాయికప్పగించారు. అతడేమో ఆవిడకి పంపటల్లేదు. కాని ఆమెకి నాన్నగారి మీదే కోపం. ఆడపిల్ల సొమ్ము వాడుకుంటారారా అని. అందుకే రాకపోకలు, మాటలూ లేవు. సరే. నాకు నిద్ర వస్తోంది.. పడుకుంటా. నన్ను విసిగించక పెట్టేయ్ ఫోను.'

ఈ లోగా అమెరికా నించి కూతురు రేఖ ఫోన్ చేసింది, ' అమ్మా! ఇవాళ ఇంట్లో ఫంక్షనుంది. గుత్తివంకాయ కూర ఎలా చెయ్యాలో చెప్పంటూ. వాళ్ళకిప్పుడు పగలు. గుత్తివంకాయ కూరెలా చెయ్యాలో చెప్పి, నిద్ర పట్టక ఇంటర్నెట్ ఆన్ చేసింది. ఫేస్‌బుక్‌లో ఎవరో పోస్ట్ పెట్టారు పాత జ్ఞాపకాలంటూ. అప్పుడు బంధు మిత్రుల నించి వచ్చే ఉత్తరాల గురించి అందరూ అప్పటి జ్ఞాపకాలు, అనుభవాలు

రాస్తున్నారు. అప్పుడు తను పెట్టె వెతుకుతూంటే కొట్టనోట్ల కట్టలు కనపడ్డాయని, కాని ఇప్పుడవి మారవని, అందులో ఉత్తరాలస్టాండు కనపడిందని, అందులో తను చదివిన ఉత్తరాలు వేళకందక తన వివాహం విషయంలో జరిగిన పొరబాటు గురించి రాసి 'ఉత్తరాల స్టాండ్' ఫోటో పెట్టింది.

దానికందరూ వరస పెట్టి కామెంట్లు, లైకులు. అందరూ బావతో పెళ్ళి కాలేదని తెగ బాధ పడిపోయారు. తనకొచ్చిన వందల కొద్దీ కామెంట్లు చూసుకుని, ఓ వెర్రి నవ్వోటి నవ్వుకుంది స్రవంతి.

# సంక్రమణం అంజన కొడాలి

***నారాయణం మహాజ్ఞేయం విశ్వాత్మానం పరాయణం***
***నారాయణ పరోజ్యోతి రాత్మానారాయణః పరః***
***నారాయణ పరం బ్రహ్మ తత్వం నారాయణః పరః***
***నారాయణ పరో ధ్యాతా ధ్యానం నారాయణః పరః***

ఎన్నో ఏళ్ళుగా మంత్రపుష్పం చదువుతున్న పెదవులు, ఈ రోజు మాత్రం మనస్సు హృదయంతో మమైకమవ్వట్లేదు.

అంతటా వ్యాపించిన అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి సేవలో తాను ఈ అరవై సంవత్సరాలలో ఏ తప్పిదమూ చెయ్యలేదే అని శ్రీనివాసాచార్యుల వారి మనస్సు కొట్టుకులాడుతుంది. యధావిధిగా పూజాది కార్యక్రమాలు పూర్తిచేసి, ఇంటినుండి తెచ్చిన పులిహోర, దద్దోజనం నైవేద్యం సమర్పించాడు. అరగిద్దెడు అన్నంతో చేసిన ప్రసాదాలు. కళ్ళు చెమర్చాయి.

ఒకప్పుడు పచ్చని పొలాలు, ధనధాన్యాలతో తులతూగే ఇళ్ళు. ఆ ఊరికే మకుటాయమానంగా ఉన్న రాములవారి ఆలయం. దాదాపు వందేళ్ళ క్రిందట ఊళ్ళో పెద్ద కామందు అచ్యుతరామయ్యకు కలలో కనిపించి మరీ గుడి కట్టించుకున్నాడు రామయ్య. క్రమేణా గుడికి వచ్చే చుట్టుపక్కల పల్లె జనాలతో, దాతల సాయంతో గుడి ప్రాంగణం, పెద్దగోపురం, ద్వజస్థంభం సమకూరాయి. పూజారి కుటుంబ కోసం పక్కనే ఓ పెంకుటిల్లుకూడా రాసి ఇచ్చారు.

శ్రీనివాసాచార్యులు మూడో తరం. రాములవారినే నమ్ముకున్న కుటుంబం. ఎన్నో మార్పులు చూశాడు ఆయన తన అరవై సంవత్సరాలలో. పెద్ద చదువులకోసం పట్నం వలస వెళ్ళిపోయిన ఊరి పిల్లలు వెనక్కి తిరిగిరాలేదు. పొలాలు అమ్ముకుని, పిల్లల దగ్గరకు వెళ్ళారు కొందరు. ఏనాడూ డబ్బుకు ఆశపడలేదు. ఆయన చుట్టుపక్కల ఊళ్ళల్లో కూడా ఆయనకు మంచిపేరు ఉండటంతో శుభకార్యపు సంభావనలు, భక్తులు ఇచ్చే దక్షిణ, సంవత్సరానికి ధర్మకర్త ఇచ్చే వడ్లు ఇవే ఆయన సంపాదన. ఊళ్ళో మిగిలిన ముసలి వాళ్ళకు పండుగల ఉత్సాహం తగ్గింది. దానికి తోడు మత మార్పిడులు ఊరుకు చెరోవైపు రెండు చర్చిలు వెలిసాయి. పండుగ వేళల్లో తొంగిచూసే వాళ్ళు కరువైపోయారు.

గుడి తలుపులు వేసి తాళాం వేశాడు. అసలే గుడికి వచ్చేవారు తక్కువైపోయారు అని బాధపడుతుంటే గతమూడునెలలుగా కోవిడ్ మూలాన గుడులన్ని మూసివేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు. స్వామివారికి సేవచేయకుండా ఉండలేక రోజూ ఒక్కడు వచ్చి పూజలన్నీ చేసి నైవేద్యం సమర్పించుకుంటున్నాడు.

నీరసంగా ఇంటికి వచ్చి వసారాలో ఉన్న బల్లపై నైవేద్యం పళ్ళెం, తీర్థం కలశం పెట్టి పక్కనే ఉన్న కుర్చీలో కూలబడ్డాడు. ఎండలు తీవ్రంగా ఉన్నాయి. వయసు పైబడటంతో బాగా నీరసంగా ఉంటుంది. పైగా ఉపవాసం.

"అయ్యో! అలా కూర్చుండిపోయారేమండి. కళ్ళు తిరుగుతున్నాయా?" లోపలినుండి వస్తూ కంగారుగా అడిగింది. భార్య ఆండాళ్ళు.

"కంగారు పడకు. ఎండకదా అందుకే కూర్చున్నానులే" భార్యను చూస్తే జాలివేసింది ఆయనకు.

పదమూడేళ్ళ ఆండాళ్ళు పదిహేనేళ్ళ శ్రీనివాసాచార్యుల చిటికెన వేలు పట్టుకుని మెట్టినింట్లో అడుగుపెట్టింది. ఆ రోజునుండి ఈ రోజుదాకా అత్తమామల సేవలు, ముగ్గురు పిల్లలు, ఆడపడచుల కుటుంబాలు. ఈ బాధ్యతలన్నీ ఒక్కరోజు కూడా విసుక్కోకుండా నెరవేర్చింది. ఆ రాముని సేవలో భర్తకు ఎంత పాత్ర ఉందో, ఈ ఇల్లాలికి కూడా అంతే పాత్ర ఉంది.

భక్తులు ఎప్పుడైనా బట్టలు పెడితే, జాగ్రత్తగా దాచి, ఆడబడుచులకో, కూతుళ్ళకో ఇచ్చేసేది. పెరట్లో పెంచుకునే కూరగాయలు, సంభావన, ఇంతో అంతో వచ్చే దక్షిణ అయినా ఏనాడూ దిగులు పడలేదు ఆవిడ. పిల్లల పెళ్ళిళ్ళు అయిపోయాయి. ఒక్కగానొక్క కొడుకు హైదరాబాదు వెళ్ళిపోయాడు. అక్కడ పౌరహిత్యానికి ఎక్కువ డబ్బులు వస్తాయి, ఈ పల్లెలో ఉండను అని. అప్పుడు మాత్రం బాధపడింది ఆవిడ.

బావి దగ్గర రెండు చెంబులు తలమీదుగా పోసుకుని, బట్టలు మార్చుకుని భోజనానికి కూర్చున్నారు ఆచార్యులు.

భోజనం అంటూ ఏమీలేదు. స్వామి వారి ప్రసాదాలు చెరిసగం చేసుకుని, పక్కనే పెరట్లో కాసిన ఆనపకాయ కూర వడ్డించింది. దాదాపు నెలరోజులుగా ఇంతే వీరిభోజనం. ఉన్న బియ్యాన్ని ఆచితూచి స్వామివారి ప్రసాదాల కోసం కొంచెం కొంచెంగా వండి, అవే తింటున్నారు. పెరట్లో కూరగాయల పాదుల వలన కనీసం కూరగాయలకు ఇబ్బందిలేదు. ఇక ఆ బియ్యం కూడా ఇంకో రెండుమూడు రోజులకన్నా రావేమో.

మధ్యాన్నం ఓ కునుకు వేసి లేచాకా "అలా నరసింహగారి ఇంటిదాకా వెళ్ళివస్తాను" పై పంచె భుజాన వేసుకుంటూ అన్నారు ఆచార్యులు.

"ఎందుకండీ మీకు ఈ కష్టం, ఇంత ఎండలో వెళ్ళకపోతే ఏ? అయినా, అనకూడదుకానీ దేవాలయం ధర్మకర్త ఐదు ఎకరాలు వారి ముత్తాతగారు గుడిమాన్యం క్రింద రాసిస్తే గత పదేళ్ళుగా మనకు ఎంత ఇస్తున్నారో ఆయన మనఃస్సాక్షికి తెలియదూ? ఎకరం పంట కూడా మనకు ఇవ్వటం లేదు. అలానే నెట్టుకొస్తున్నాం. చుట్టుపక్కల పది ఊళ్ళకుగానూ ఇదే పెద్దగుడి. ఏదో గత ఐదేళ్ళుగా కాస్త ఆదాయం తగ్గింది కానీ ఎంత వైభవంగా కళ్యాణం జరిగేది. బొత్తిగా గుడిని పట్టించుకోవటం లేదు. కనీసం మీ జరుగుబాటు కూడా చూసుకోవాలికదా!" గొంతు గద్గదమైంది ఆండాళ్ళుకు.

"తక్కువేమి మనకు రాముడొక్కడుండు వరకు.." నవ్వుతూ కూనిరాగం తీశారు ఆచార్యులు.

నరసింహంగారి గేటు తీసుకుని లోపలికి వెళ్ళారు. తమ ఇంటికి పెద్ద దూరం లేకపోయినా, ఎండ తీవ్రతతో బాగా చెమట పట్టేసింది. పెద్ద ఇల్లు, ముందు వరండాలో కూర్చుని ఆయన ఫోనులో ఎవరితోనో మాట్లాడుతున్నారు.

కరోనా భయంతో అందరూ దూరందూరంగా మసలుతున్నారు కాబట్టి, వరండాలో అడుగు పెట్టకుండానే నమస్కారం చేశారు ఆచార్యులు.

''ఏంటండి ఎండన పడి ఇలా వచ్చారు?'' ఫోన్ పెట్టేస్తూ అడిగాడు నరసింహం.

''అదేనండి, మీకు రెండు నెలల క్రితం విన్నవించుకున్నాను, స్వామి వారి సేవలకు ఇబ్బందిగా ఉంది. పూజా సామాగ్రి, నైవేద్యాలకు నానుస్తూ ఇబ్బందిగా గుర్తుచేశారు.

''ఈ పూజలు అవీ ఆపెయ్యమని, గుడులు మూసెయ్యమని ప్రభుత్వం ఆర్డరు - మీతో చెప్పాను కదా!'' నరసింహం గొంతులో విసుగు.

''నిజమే మీరు చెప్పారు. భక్తులు రావట్లేదు కానీ స్వామి వారి సేవలు ఎలా ఆపేస్తామండి, అరిష్టం కూడానూ. ఈసారి మీరు పంపవలసిన వడ్లు, డబ్బు కూడా పంపలేదు. ఇంట్లో ఇబ్బందిగా ఉంది'' ఆత్మాభిమానం చంపుకుంటూ చెప్పారు.

''ఖర్చులు తగ్గించుకోవాలండీ, స్వయంగా మన ప్రధానిగారే చెప్పారు ఈ మూడు నెలల్లో ఎన్నోసార్లు. అసలే గత ఐదేళ్ళుగా ఆదాయం సొంతం తగ్గిపోయింది. అందరూ ఇళ్ళల్లోనే దండం పెట్టుకుని ఊరుకుంటున్నారు. ఏదో మీ ఛాదస్తం. ఇంకా వెనకటి వైభవం, ఆదాయం రాదండి.''

పెద్దలిచ్చిన యాభై ఎకరాలు కౌలుకి ఇచ్చి, చిన్న సైజు రాజకీయ నాయకుడిగా ఎదుగుతున్న నరసింహంకు ఆదాయం పూర్తిగా గండికట్టుకుపోయిన గుడి అంటే లెక్కలేదు, కనీసం పూర్వీకులు కట్టించిందన్న అభిమానం గౌరవం కూడా లేదు.

మొక్కలకు నీళ్ళు పెడుతూ వీళ్ళ మాటలు వింటున్న రంగడికి మనస్సు చివుక్కుమంది. పెద్దాయన కనీసం కూర్చోమనకుండా, తిండిగింజల కోసం ఇలా మాట్లాడూతున్నాడని బాధగా అనిపించింది.

''బొత్తిగా ఇంట్లో బియ్యం లేవండి, కాస్త మీరు ఈ సంవత్సరం రావలసినవి పంపిస్తే''

కనీసం నలభై బస్తాలు పండే ఎకరం ఐదు ఎకరాల గుడి మాన్యం ఆ గుడిపూజారి దైన్యంగా తిండిగింజలు లేవని చెప్పటం రంగడిని కలచివేసింది. నరసింహం ఆ ఐదెకరాల పంటను ఎప్పుడో అమ్మేశాడని తనకు తెలుసు.

''రేయ్ రంగా! ఓ బియ్యం మూట తీసుకెళ్ళి అయ్యవారి ఇంట్లో పడెయ్యరా'' మళ్ళా ఏమనుకున్నాడో ఆగి ''వడ్ల మిల్లులు మూసేశారండి వచ్చేనెలలో తెరవగానే వడ్లు మరాడించి కొన్ని బస్తాలు పంపిస్తాలే. ఇదిగో ఈ వెయ్యిరూపాయలుంచండి'' అంటూ చేతిలో రెండు నోట్లు పెట్టాడు.

''వస్తానండి'' నమస్కారం చేసి ఇంటికి బయలుదేరారు ఆచార్యులు.

రాత్రి భోజనం అయ్యాక, భుక్తాయాసంగా వసారాలో నడుం వాల్చారు ఆచార్యులు. దాదాపు నెలరోజులనుండి రాత్రిపూట భోజనం మానేశారు. నరసింహంగారు పంపిన బియ్యపు బస్తా చూసి సంబరంగా దోసకాయ పచ్చడి ముక్కల పులుసు వండింది ఆండాళ్ళు.

''ఆచారిగారూ'' మసకచీకటిలో ఇంటికి ఎవరు వచ్చారో సరిగ్గా కనపడలేదు.

''ఎవరూ?'' లేచి వరండాలో లైటు వేశారు.

''నేను మంగలి సుబ్బయ్యని'' వెలుతురులోకి వచ్చాడు. దాదాపు ఆచార్యుల వయస్సు, ముతకపంచె, పైన చొక్కాలేదు. భుజాల చుట్టూ టవలులాంటిది కప్పుకున్నాడు.

"అరె నువ్వటా! దా ఇలా కూర్చో. ఏంటి ఈ వేళప్పుడు?"

వసారా పక్కన ఉన్న బండరాయి మీద కూర్చున్నాడూ సుబ్బయ్య. పల్లెల్లో కులాల్లో అంతరాలు, అంతస్థుల్లో అంతరాలు బాగా జీర్ణించుకుపోతాయి. చిన్నప్పుడు వీధిబడిలో చదువుకునే వయస్సులో పరిచయం. బడి అనే తాటాకుల షెడ్డులో తామందరూ పాఠాలు వల్లె వేసుకుంటే బైట నిలబడి ఆలకించేవాడు రంగయ్య. అతని ఆసక్తి గమనించి, లోపలికి రానిస్తే ఊళ్ళోని పెద్దవాళ్ళతో ఏమన్నా గొడవులు అవుతాయేమోనని, గది బైట కూర్చోమని చెప్పి ఓ పలకా బలపం ఇచ్చారు మాష్టారు. తరువాత్తరవాత ఇద్దరూ వారి వారి కులవృత్తుల్లో స్థిరపడ్డారు.

"చాలా కాలం అయ్యిందిరా చూసి ఎలా ఉన్నారు?"

"బాగానే ఉన్నామండి. ఏంటోనండి ఇదివరకట్లా కాదు. ఊళ్ళు మారి పోయాయి మనుష్యులు మారిపోతున్నారు. నేను మంగలిని కదండి. కానీ నా కొడుకులు ఇద్దరూ మంగలి పని నేర్చుకోలేదు. మా బావ సన్నాయి వాయిస్తేనే కదండి రాములోరి కల్యాణం, వాడి పిల్లలు నేర్చుకోమన్నారు. ఈ పనులతో ఆదాయం రాదంట. గౌరవం కూడా ఉండదంట."

"నిజమే జరుగుబాటు కూడా చూసుకోవాలిగా" చిన్నగా నిట్టూర్చారు ఆచారిగారు.

"నీ పిల్లలు ఎప్పుడో పట్నం వెళ్ళారని చెప్పావు కదా" గుమ్మం దగ్గర కూర్చుంటూ అడిగింది ఆండాళ్ళు.

ఊరికి కొంచెం పెడగా చాకలి, మంగలి, కమ్మరి ఇలా వేరే వృత్తులు చేసుకునే వాళ్ళు ఉంటారు. అక్కడి నుండే ఊళ్ళోకి కానీ పొలం పనులకు కానీ వచ్చేది. దాదాపు ఇరవై ఏళ్ళ క్రితం దాకా వారెవ్వరూ గుడిలోకి వచ్చేవారు కాదు. ఉత్సవాలప్పుడు ఊరేగింపులోనే దేవుని దర్శనం. శ్రీనివాసాచార్యులు దేవుని దగ్గర ఈ వివక్ష ఏంటి? అందరూ దేవుని దర్శనం చేసుకోవచ్చు అన్నందుకు ఊళ్ళో బాగానే గొడవలు అయ్యాయి. ఊళ్ళో కుర్రాళ్ళు కూడా ఆచార్యులు గారిని కొంచెం సమర్ధించారు. ఈ లోపల మత మార్పిడులూ ఎక్కువైయ్యాయి. 'మా దేవుడికి అందరూ సమానమే, ఈ వివక్షలు లేవు. మీకు డబ్బు సాయం చేస్తాం" ఇలాంటి ప్రలోభాలతో కొంతమంది మారిపోయారు.

"మా వాళ్ళల్లో చాలామంది ఊళ్ళో పొలాలు కౌలుకు తీసుకుంటున్నారు. నా కొడుకులు కూడా నాలుగేళ్ళయ్యిది తిరిగి వచ్చేసి ఇక్కడే ఉంటున్నారు. చిన్న ఇల్లు కట్టుకున్నాం. అందరం కలిసే ఉంటన్నామమ్మా! పిల్లలందరూ బాగున్నారా అమ్మా చూసి బాగా యేళ్ళు అయ్యింది."

"ఎవరి సంసారాలు వాళ్ళవి కదా బాగానే ఉన్నారు. వ్యవసాయం చేసే కుటుంబాలు పొలం కౌలుకిచ్చో, అమ్మేసో ఊళ్ళు దాటుతున్నారు. మంగలి పనులు, కుమ్మరి పనులు ఆపేసి మీవాళ్ళు వ్యవసాయం చేస్తున్నారు. వింతగా లేదూ"

"మీకు కూడా వయస్సయ్యింది కదండి, వచ్చేకాలమా పోయే కాలమా అని - మరి మీ అబ్బాయిగారు ఇక్కడికి రారా, మన గుడే ఉంది కదా" కుతూహలంగా అడిగాడు సుబ్బయ్య.

"లేదురా వాళ్ళు రారు" నిట్టూర్చాడు ఆచార్యులు.

"నీకు తెలియనిది ఏముంది? వాళ్ళకు ఈ పల్లె నచ్చదు. ఇరుకు గదుల్లో అక్కడే ఉంటారు. మాకు అక్కడ ఊపిరి ఆడదు. ప్రాణం ఉండేవరకూ ఈ రాములోరి సేవ అంతే" భర్త మౌనం చూసి తానే చెప్పింది.

పేదరికం తాండవిస్తున్న ఆ ఇంటిని చూశాడు సాంబయ్య. తమ చిన్నప్పుడూ తండ్రితోపాటు ఈ ఇంటికి ఎప్పుడూ వచ్చేవాడు. వరండా నిండుగా ధాన్యం బస్తాలు, పక్కన చావిట్లో రెండు ఆవులు, కొబ్బరి చెట్లు, పట్టుపంచెతో పెద్ద ఆచారిగారు, నిండుగా కళకళలాడుతూ ఆయన భార్య - ఎంతో వైభవంగా ఉండేవారు. కడుపులో దేవేసినట్లయ్యింది సుబ్బయ్యకు.

సాయంత్రం రంగడు వచ్చి నరసింహంగారి ఇంట్లో జరిగింది చెపితే మనసు పట్టలేక ఇలా వచ్చాడు సుబ్బయ్య.

"వస్తానమ్మా, పొద్దుపోయింది పడుకోండి. ఊరికే చూసిపోదామని వచ్చా"

"మంచిది సుబ్బయ్య, మూడునెలలనుండి పలకరించే వాళ్ళు కరువయ్యారు. కనీసం నువ్వైనా నెలలనుండి పలకరించే వాళ్ళు కరువయ్యారు. కనీసం నువ్వైనా వచ్చావు" వీధి గుమ్మం తలుపు వేస్తూ చెప్పారు ఆచార్యులు.

"ఏంటి బావా కబురంపావు?" పొలాల పక్కనే ఉన్న తాళ్ళతోపులో చల్లగా ఉందని నులకమంచం మీద పడుకున్న సుబ్బయ్య, కళ్ళు తెరిచి చూశాడు. బావమరిది, ఇద్దరు తోడల్లుళ్ళు, వాళ్ళ పిల్లలు, మొత్తం ఓ పదిహేనుమంది వచ్చారు.

"అందరూ దూరం దూరంగా కూర్చోండ్రా మీతో ఓ విషయం మాట్లాడాలి" అంటూ ఆచారిగారి పరిస్థితి అంతా వివరించాడు సుబ్బయ్య.

"అయ్యో పాపం అయినా ఊళ్ళో అంతమంది పెదకమతాలు ఉన్నారు. ఎవ్వరూ పట్టించుకోవట్లేదా?" రాజయ్య జాలిపడ్డాడు. అందరికి ఆచారిగారంటే చాలా గౌరవం.

"ఆళ్ళ సంగతి వదిలెయ్యరా! పెద్ద మనుషులకు పెద్ద బుద్దులు ఉండాలనేం లేదుగా. మీ అందరికి గుర్తుందిగా మనల్నందర్ని గుడులోకి రానివ్వాలని ఆయన అందర్ని ఎలా ఎదిరించాడో. మంచి మనిషిరా, మనందర్ని ఏనాడూ తక్కువ కులం అని చూడలేదు. ఎన్నిసార్లు మనం ఆయనతో వాదనలు వేసుకోలేదు. మనకు తెలియని విషయాలు ఎంతో వివరంగా చెప్పేవారు. ఆయనకు తిండిగింజలు వెతుక్కునే ఖర్మ పట్టకూడదు. అంతే"

"మనమేం చెయ్యగలం. అసలాళ్ళకే స్వార్థం ఎక్కువ, దేవుడి దగ్గర కూడా తేడానే. ఇట్టాంటి కులాల గోల లేకుండా హాయిగా ఉన్నాం" ఏసోబు చిరాకుపడ్డాడు.

"నోరుముయ్యరా! కులాల గోల లేదా? మరి లేకపోతే, కులం సర్టిఫికెట్లు పెట్టి గవర్నమెంటు సాయం ఎందుకు పొందుతున్నావురా? కనీసం ఒక్కసారైనా మనుష్యుల్లాగా ఆలోచించండిరా"

"ఏం చేద్దామో చెప్పు బావా?"

"మనందరం జీవితంలో ఆకలి బాధ అంటే ఏంటో తెలిసినవాళ్ళమే కదా! ఈ కోవిడ్ మహమ్మారితో ప్రపంచం అంతా అల్లాడుతుందని రోజూ టీవీలో మొత్తుకుంటున్నారు. కనీసం మన అదృష్టం మన ఊరుదాకా రాలేదు అది. మనం హాయిగా కూరగాయలు పండించుకున్నాం, అమ్ముకుంటున్నాం. జనవరిలో కౌలు తాలూకు వడ్లు ఉన్నాయి. రేపు తొలకరుల్లో మళ్ళీ వ్యవసాయం చేత్తాం. తిండికి నీడకి కొరతలేదు. పాపం ఆ ముసలాళ్ళు. దరిద్రం తాండవిస్తుంది ఆ ఇంట్లో. పెచ్చులూడిపోయిన గోడలు, పైకప్పు పెంకులు ఊడిపోయాయి చూడలేకపోయా"

కాస్త ఆగి మళ్ళా చెప్పాడు సుబ్బయ్య "ఇంత అని నేను చెప్పను కానీ శక్తిమీర బియ్యమో, వడ్లో మా ఇంటికి తీసుకురండి రేపు అంతా మూటలకెత్తి ఇచ్చివద్దాం. మీలో తాపీపని తెలిసిన వాళ్ళు ఉన్నారు కదా, కాస్త ఆ ఇంటి సంగతి చూడండి. పెంకులు మార్చాలేమో. గోడలకు మళ్ళీ సిమెంటు వేసి సున్నం వెయ్యండి. గుళ్ళో ఇన్నేళ్ళు ఆయన కమ్మగా పెట్టిన ప్రసాదాలకు బదులు తీర్చుకోండి" కళ్ళు తుడుచుకున్నాడు సుబ్బయ్య.

"అయ్యో మామ అంత బాధపడాల, నీ మాట కాదంటామా? గుళ్ళో పూజకు బోల్డు ఖర్చుకదా, నేను రేపు కోటయ్య కొట్టుకు ఎల్లి నూనె, నెయ్యి, కర్పూరం లాంటివి ఓ రెండు మూడు నెలలకు సరిపోను తీసుకొస్తాలే. మా గేదెపాలు కూడా ఓ లీటరు రోజూ ఇస్తా. అమ్మగారు చేసే ప్రసాదాలు అమృతంలా ఉండేయి. పోయినేడు శ్రీరామనవమికి వెళ్ళాం గుడికి. ఈసారి కల్యాణమే లేదు"

అందరూ తలా ఒకమాట అందుకున్నారు.

"ఆచారిగారు భోంచేశారా?" వీధితలుపు తీసి లోపలికి వస్తూ అడిగాడు సుబ్బయ్య.

మూడురోజుల తేడాతో మళ్ళీ వచ్చిన సుబ్బయ్యను చూసి ఆశ్చర్యపోయాడు ఆచార్యులు

"రాత్రిపూట భోజనం మానేశామోయ్. ఉప్మా తిని మజ్జిగ తాగాను. నువ్వుకూడా మజ్జిగ పుచ్చుకుంటావా" ఆయన మాట పూర్తికాకుండానే లోనికి ఇద్దరు యువకులు బియ్యం బస్తాలు మోసుకుంటూ వచ్చి వరండాలో వేశారు. వెనకాలే ఇంకొక వ్యక్తి ఇత్తడి చెంబులో పాలు గట్టుమీద పెట్టి "అమ్మగారు పాలండీ" అంటూ కేకవేశాడు.

ఈ సందడికి లోపలినుండి వచ్చిన ఆండాళ్ళు, శ్రీనివాసాచార్యులు ఆశ్చర్యంతో నోరు తెరిచారు.

"ఈ బస్తా వడ్లండి. ఇదేమో బియ్యం బస్తా అండి. ఈ సోములు రోజూ మీకు పాలు తీసుకువస్తాడండి. రేపట్నుండి ప్రొద్దున్నే తెస్తాడు, మీకు అభ్యంతరం లేకుంటే ఈ రోజుపాలు కాసి తెచ్చామండి అంటే కాస్త చీకటి పడ్డాక వద్దామని. ఎవరైనా చూస్తే మళ్ళీ మీకు ఇబ్బందనీ" మొహమాటంగా చెప్పాడు సుబ్బయ్య.

"ఏమిట్రా ఇదంతా? ఎందుకు ఇవన్నీ? ఎవరు పంపారు?"

"అంటే తప్పుగా అనుకోకండయ్యా. మీరు నరసింహంగారితో మాట్లాడింది రంగడు నాతో చెప్పాడు. మనసుకు చాలా కష్టమేసింది అందరికి. అంటే రాములోరికి పూజలు, ప్రసాదాలు సరిగ్గా అందాలని అంతేనయ్యా అంతే."

ఆచార్యులుగారు నొచ్చుకుంటారేమో అని సర్దిచెపుతున్న సుబ్బయ్యను చూసి కళ్ళు చెమర్చాయి.

వరండా గట్టుదిగి సుబ్బయ్య చేతులు పుచ్చుకుని కళ్ళకు అద్దుకున్నాడు శ్రీనివాసాచార్యులు.

"అయ్యో అయ్యో ఇదేంటి బాబు మీరు?"

"లేదు సుబ్బయ్య, సాక్షాత్తు నా రాముడే నీ రూపంలో వచ్చాడు. కన్నబిడ్డలు దూరంగా ఉన్నారు. ఆలయం ధర్మకర్తలు మా బాగోగులు వదిలేశారు. ప్రభుత్వం నిరుపేద పూజారులకు సహాయం అందచేస్తుందని చెప్పారు కానీ అది నా దాకా రాలేదు. ఏ రాముడైతే మన ఊరును జాగ్రత్తగా కాపాడుతున్నాడో, ఆ రాముడి నీ రూపంలో నా ఇంటికి వచ్చాడు" గొంతు జీరబోయింది.

"అయ్యో మీరలా పోల్చకండయ్యా! ఏదో ఉడతా సాయం. అమ్మా రేపటినుండి మా సోములు ఇంకో ఇద్దరు వచ్చి ఇంటిగోడలు, పెంకులు కూడా సరిచేస్తారు. కాదనకూడదు."

ఆచార్యులు ఏదో అనబోతుండగా, తలుపుతోసుకుంటూ పచారీ కొట్టు కోటయ్య వచ్చాడు, వెనకాలే సరుకులు పట్టుకుని రంగడు.

"ఈ నెలకు సరిపాయే పచారీ సామాన్లు, స్వామివారి పూజాసామాగ్రి. నూనె అన్నీ తెచ్చానండి, వద్దన్నా రంగడు పట్టుబట్టి డబ్బులు ఇచ్చాడు. తప్పేనండి. ఎవరి స్వార్థం వాళ్ళు చూసుకున్నాం కానీ సరేనండి అయ్యిందేదో అయ్యింది. వచ్చేనెల పూజాసామగ్రి నేనే పంపుతాను. మనసులో పెట్టుకోమాకండీ" కోటయ్య గబగబా సంజాయిషీ ఇచ్చాడు, కానీ ఇంటిదగ్గర రంగడు, సుబ్బయ్య ముందు బ్రతిమిలాడి తర్వాత పనిలోకి రామని బెదిరించాకే ఉదారత అని మాత్రం కోటయ్య చెప్పలేదు.

"ఏంటిదంతా సుబ్బయ్య, ఏం చెప్పాలో కూడా తోచటంలేదు."

"ఏం చెప్పొద్దయ్యా. రేపట్నుండి స్వామికి మంచి ప్రసాదాలు పెట్టండి. మీరు చల్లగా ఉంటే రాముడు సంతోషంగా ఉంటాడు. ఆయన సంతోషంగా ఉంటే మన ఊరు బాగుంటుంది కదా" చల్లగా నవ్వాడు సుబ్బయ్య.

"గుడి అందరికి చెందాలని, అందరూ రావాలని ఆనాడు మీరు ఎంతో పోరాడారు.

ఏవో శాస్త్రాలు చెప్పారు. అందరితో వాదించారు. మమ్మల్ని సమానంగా చూడాలన్నారు. మేం చేసింది చిన్న సాయమయ్యా, ఏదో మాకున్న దాంట్లో ఓ గుప్పెడు మీతో పంచుకున్నాం. వస్తామయ్యా! అమ్మా రేపు రాములోరికి కమంగా వండి పెట్టండి" నవ్వుతూ బయలుదేరుతున్న సుబ్బయ్యను చూసి చేతులు జోడించారు శ్రీనివాసాచార్యుల దంపతులు.

"చరణములే నమ్మితి, నీ దివ్య చరణములే నమ్మితి.."

## మా'నవ' కర్మాగారం

భాగ్యలక్ష్మి అప్పికొండ

"జన్మ, జన్మాంతర పాపాలన్నీ గుర్తుకు వచ్చి నను చిత్రవధ చేస్తున్నాయ్. ప్రాణానికి ఆప్యాయంగా ఓ పలకరింపు లేదు. కనీసం ప్రేమతో కూడిన స్పర్శ లేదు. నాకు నేనే, నాతో నేనే ఇలా ఎన్ని రోజులని కొట్టుకుంటూ, తన్నుకుంటూ, మాట్లాడుకుంటూ ఉండాలి. నేను దిక్కులు పెక్కటిల్లేలా అరిచినా ఎవరూ వినిపించుకోరు. నా రొధ ఎవరూ పట్టించుకోరు. ఛీ! నామీద నాకే అసహ్యం వేస్తుంది. ఈ కాళరాత్రి సావాసం ఇంకెన్నిన్నాళ్ళు. ఈ ఒక్కసారికి నా యందు దయుంచి ఈ చీకటి గది నుంచి బయటికి పంపించు. ఇంకెప్పుడూ ఏ పాపం చేయను" అని యశోద కడుపులోని బిడ్డ దేవుడికి మొర పెట్టుకుంది.

ఎవరో తలుపు తట్టిన శబ్దం. యశోద తలుపు తీసి "మీరా బాబు! రండి,రండి" అని చిరునవ్వుతో ఆహ్వానించింది.

ఆ ఇంట్లోకి వెళ్ళే అగత్యం తనకు లేదనే అహంకారమే తప్ప వచ్చిన ఆ మనిషికి చిరునవ్వుకి బదులు నవ్వే సంస్కారంలేదు. అందుకే, ఇంటి బయటే నిల్చొని " ఏమ్మా! ఆరోగ్యం బాగుందా?!. నిన్ను, నీ అవస్థను చూసి... జాలిపడి ఈ పని అప్పజెప్పాను. ఎండలు మండిపోతున్నాయి. మీ ఇంట్లో ఏ.సి పెట్టిస్తాను. కానుపు అయిన తరువాత తీసేస్తాను. ఆ సారు వాళ్ళు వచ్చి అడిగితే మూడు నెలల క్రితమే పెట్టామని చెప్పు. మళ్ళీ చెప్తున్నాను, ఈ విషయాలేవి బయటికి చెప్పకూడదు" అని మధ్యవర్తి మోహన్ రావు పెద్ద సంచి నిండా పళ్ళు యశోద చేతిలో పెట్టాడు.

"అలాగే బాబూ. ఎవరికీ సెప్పనేదు, సెప్పను" అంది యశోద. ఎవరు చూడట్లేదని నిర్ధారించుకొన్న తరువాత బ్యాగులో నుంచి డబ్బులు తీసి యశోద చేతిలో పెట్టి మోహనరావు వెళ్ళిపోయాడు.

యశోద తలుపేసి ఇంటి లోపలికెళ్తూ "ఇప్పుడు ఏడో నెల ఇంకో రెండు నెలలు భరిస్తే మా అప్పులు తీరిపోయి ఈ ఇల్లు మిగిల్చుకోవచ్చు" అని తనలో తానే ఆలోచించుకుంటూ పనిచేసుకుంటుంది.

"మా అమ్మా, నాన్నలకి నా మీద ఎంత ప్రేమో!! కుదరక కాని ఈమె కడుపులో కూడా ఏ.సి పెట్టేవాళ్ళేమొ " అని నలుసు నవ్వుతుంది.

"ఈ ముద్ద తిను తల్లి" అని తన ఎనిమిదేళ్ళ కూతురికి కొసరి కొసరి తినిపిస్తుంది యశోధ.

"నాతో కూడా ప్రేమగా ఉండవా? కాస్త పొట్టని నిమిరి నాతో మాట్లాడవా"అని అర్థిస్తుంది ఆ చిన్ని ప్రాణం

పాపం! యశోద ప్రేమ ఎలా చూపిస్తుంది? పిండాన్ని కడుపులో పెడుతున్నప్పుడే " పుట్టే బిడ్డకు, నీకు ఎటువంటి సంబంధం ఉండదు, ఉండకూడదు" అని గట్టిగా చెప్పారు అసలు తల్లిదండ్రులు.

★★★★★★★

విశాఖ సముద్ర తీరంలో ఉన్న పోష్ ఏరియాలో ఖరీదైన బంగ్లా ముందు ఆడి. , బి.యమ్.డబల్యు కార్లు ఆగాయి. వాటిలోంచి విహార్ , ఆశ దిగారు. ఆ భార్యాభర్తలకిద్దరికి పేరు మోసిన కంపెనీల్లో పెద్ద ఉద్యోగాలు. వారికి ఇద్ధరు ఆడపిల్లలు. ఆ పిల్లల చదువులు ఇంటర్నేషనల్ స్కూల్లు చూసుకుంటున్నాయి.

నడమంత్రపు సిరి అవ్వచ్చు. కష్టపడి సంపాదించినదైనా కావచ్చు ఏదైనా డబ్బు మనిషికి మహా చిత్రమైన ఆలోచనలని, ఆశలని పుట్టిస్తుంది. అలాగే వారికి కూడా ఇప్పుడు మగబిడ్డ కావాలి, వంశం నిలబెట్టాలి అనే పాతకాలపు ఆశ చిగురించింది. బిడ్డల్ని కనే వయసున్నా వారికి ఓపిక, తీరిక లేదు, ఒక మగ బిడ్డ కావాలనే గొంతెమ్మ కోరిక తప్ప.

ఒకరి దగ్గర డబ్బులున్నాయి. వేరొకరికి ఆ డబ్బుతో అవసరం ఉంది. ధనం ఉన్న వాడి అలవికాని ఆశలకి ఆధునీకత రెక్కలని అమరుస్తుంది ఆయువు పోస్తుంది. ఒకరి డబ్బుని, వేరొకరి అవసరాన్ని తమకు అవకాశంగా మార్చుకునే మధ్యవర్తి మోహన్రావులకి ఈ లోకంలో కొదవే లేదు. చట్టాలు గట్టివయ్యే కొలది వీరికి ముట్టచెప్పె సొమ్ము పెరుగుతుంది. అందుకే వాళ్ళు అందమైన బొమ్మని ఆన్లైన్ లో ఆర్డర్ చేసి తెచ్చుకున్నట్టుగా రక్తసంబంధాన్ని కూడా కస్టమైజ్డ్ స్పెసిఫికేషన్స్ తో ఆర్డర్ పెట్టారు.

మొబైల్ రింగ్ అవుతోంది "హలో" అంది ఆశ.

"మేడమ్ డెలివరి అయింది, బాబుని తీసుకుని వెళ్లండి" అన్నాడు అవతలి నుంచి మోహన్ రావు.

ఆశ అంతే త్వరగా అత్యంత ఆనందంతో విహార్ కి ఫోన్ చేసి విషయం చెప్పింది.

ఆశ "లక్ష్మి , లక్ష్మి " అని సంబరంగా అరిచినట్టుగా పిలుస్తుంది

"ఏంటమ్మా!" లోపలినుంచి హడివుడిగా వచ్చింది లక్ష్మి .

"అయ్యగారు హాస్పిటల్ లో వుంటానన్నారు. రా! మనం హాస్పిటల్ కెళ్ళి బాబుని తీసుకొద్దాం. నువ్వే వాడిని చూసుకోవాలి" అని క్షణంలో బిడ్డ బాధ్యత లక్ష్మి కి అప్పజెప్పేసింది ఆశ

"మీ బిడ్డ" అని డాక్టర్ ఆ పసికందుని జాగ్రత్తగా ఆశ చేతిలో పెట్టింది.

ఆశ సంతోషంతో మురిసిపోయి తన బిడ్డపై ముద్దుల వర్షం కురిపించి ఐదు నిమిషాల తరువాత పక్కనే వున్న లక్ష్మి కి బిడ్డని అందించింది

"ఒక ఆయమ్మ కడుపులో పుట్టి, మరో ఆయమ్మ చేతిలో పెరుగుతానా?" అని అనిపించిందో ఏమో! ఆ బిడ్డ ఒక్కసారిగా గట్టిగా ఏడవడం మొదలుపెట్టింది.

లక్ష్మి కి ఏం చెయ్యాలో పాలుపోక యశోద పక్కనే పడుకోబెట్టి "పాలు ఇవ్వమ్మా!" అంది అనునయంగా.

అప్పటి వరకు ఏదో బరువు మోసాననుకున్న యశోద, తొమ్మిది నెలలు తాను మోసిన ఆ భారం రూపు దాల్చి తన చనుబాలు తాగుతుంటే ఏదో తెలియని ఉద్వేగానికి గురైంది. అందుకే తన ప్రమేయం లేకుండానే కన్నీరు కారుస్తుంది. అమ్మకానికి అయినా సరే అమ్మతనం లో కమ్మదనాన్ని కాదనలేక ఆ కళ్ళు వర్షిస్తున్నాయి.

ఇదంతా గమనించి గమనించనట్టుగా ఉన్న ఆశ "బేబి కి ఏ పాలు పట్టమంటారు ఫార్ములా రాసివ్వండి" ఆర్తిగా అడిగింది డాక్టర్ ని.

"తల్లి పాలే మంచిది. ఫార్ములా రాసివ్వమంటే రాసిస్తాను" సంశయంగా చెప్పింది డాక్టర్.

"తల్లిపాలు మంచివే కాని ఈమె దగ్గరే బిడ్డని వదిలేస్తే వీళ్ళమధ్య బంధం పెరుగుతుందేమో కదా!" అని తన సందేహాన్ని బయటపెట్టింది ఆశ.

"ఏ కాలంలో ఉన్నారండి!?. కావాలంటే ఇప్పుడు తల్లి పాలు కూడా లభిస్తున్నాయి. ఖరీదెక్కువ అంతే" అంది డాక్టర్.

అవును! కాలం మారి పరుగులు తీస్తుంది. భూమాత ఇచ్చే నీటిని కొంటుంది. తల్లిపాలను కూడా వెలకట్టి కొనగలుగుతుంది.

"అవునా, డాక్టర్! అలా అయితే తల్లిపాలే కావాలి. కొంచెం డిటైల్స్ చెప్తారా?" అని ఉత్సాహంగా అడిగింది ఆశ.

ఆ ప్రశ్న ముందే ఊహించిన డాక్టర్ " ఆ విషయాలన్నీ మా నర్స్ మీకు చెప్తుంది" అని వడివడిగా ముందుకు కదిలింది.

ఈ మాటలన్నీ వింటున్న మోహనరావు బుర్ర పాదరసంలా పనిచేయడం ఆరంభించింది. వెంటనే యశోద దగ్గరకెళ్ళి "ఆ తల్లి పాలు కూడా నువ్వే ఇస్తానని చెప్పి అమ్మగారిని బ్రతిమాలాడు. నీకు డబ్బులు ఎక్కువగా ముట్టేటట్టు నేను చూసుకుంటాను" అని ఆమెకే వినిపించేటట్టు వివరించాడు.

యశోద మోహన్ రావు చెప్పినట్టే అర్థించింది. ఏదో పెద్ద సాయం తానే చేస్తున్నట్టుగా "అలాగే" అని ఒప్పుకుంది ఆశ .

మోహన్ రావు నర్స్ ని అడిగి అక్కడే వున్న ఫార్మసిలో "మాన్యువల్ బ్రెస్ట్ పంప్" ని తీసుకుని వచ్చి యశోదకిచ్చాడు. "ఇది ఎలా వాడాలో నర్సమ్మ నీకొచ్చి చెప్తుంది. నువ్వు పాలు నింపి ఉంచు చాలు. నేనొక కుర్రాణ్ణి పంపిస్తాను, వాడికిచ్చి పంపించు" అని యశోద పొత్తిళ్ళలో వెచ్చగా నిదురపోతున్న బిడ్డని తీసి ఆశ చేతిలో పెట్టాడు. అప్పుడు యశోద ముభావంగా వుంది. ఎందుకంటే తనకి ముందే తెలుసు ఇది వాణిజ్య ఒప్పందంలో చివరి ఘట్టం అని.

అమ్మ పంట పండింది. మోహన్ రావు డబ్బులు ఇచ్చాడు. ఇక్కడ కూడా గిట్టుబాటు ధర రాలేదు. ఎక్కడైనా దళారులదే పైచేయి.

ఆశ, లక్ష్మి బిడ్డని పట్టుకుని కారెక్కి వెనుక సీట్ లో కూర్చున్నారు. విహార్ కారు ముందు సీట్లో కూర్చున్నా డు. "లక్ష్మి ! మీ ఆయన రెండు రోజులని సెలవుపెట్టాడు మూడు రోజులవుతుంది. ఏంటి విషయం? ఇంకా రాలేదు." తల కాస్త వెనక్కి తిప్పి అడిగాడు విహార్

"సారు, మీకు తెలుసు కదా! మా ఆడబిడ్డ చచ్చిపోయింది. ఆలాయన పెద్ద తాగుబోతు. ఉన్న ఒక్క బిడ్డని సరిగ్గా సాకెట్లేదు అలాగని మాకాడ వదిలేయ్యమంటే మా సెద్ద ఇదయ్ పోతున్నాడు. ఆడు ఈ యాల ఊళ్లో గొడవ కూడా పెట్టాడంట. మా ఆయన ఆడి సంగతి తేల్చి రేపు మా మేనకోడలిని తీసుకుని వచ్చేత్తాడు" అంది లక్ష్మి నెమ్మదిగా.

"ఇంతకీ మీ మేనకోడలి వయసెంత" అని అడిగింది తన బిడ్డకి ముద్దుపెడుతూ ఆశ

"మూడేళ్ళు ఉంటాయమ్మా!" అంది లక్ష్మి తన బుర్ర గోక్కుంటూ.

"మీకే గడవట్లేదంటున్నావు కదా! ఆ పిల్లని ఎలా పెంచుతావే?" కాస్త గద్దించినట్టుగా అడిగింది ఆశ.

"ఎవరి పిల్లలైనా అయినా మనం సేరదీత్తే మన పిల్లలే కదమ్మా! పైగా మా ఆడబిడ్డ బిడ్డాయే. అందులోను ఆడపిల్ల. మీరే సెప్పండమ్మా! ఆ తాగుబోతు సచ్చినోడు ఏం సాకగలడు? .అందుకే తీసుకురమ్మన్నా. మా పిల్లలతో పాటు దానికి ఓ ముద్ద పెడితే అదే పెరిగిపోద్ది" అంది లక్ష్మి కాస్త దైన్యంగా, కాస్త ధైర్యం గా

లక్ష్మి మాటలు ఆశ, విహార్ ల గుండెని కదిలిస్తున్నాయి, బుద్ధిని ఆలోచించమంటున్నాయి, ఆత్మని పరిశీలన చేసుకోమంటున్నాయి.

"నీ సుఖం, స్వార్థం కోసం కొండ మీద కోతినైనా తీసుకొని వచ్చే నేను, నీ ఆశలకు, ఆలోచనలకు ఆలంబన ఇచ్చే ఆధునిక టెక్నాలజీ

అందగా ఉండగా...ఇంకా ఎందుకు అర్థం, పర్థం లేని విషయాల గురించి వ్యర్థంగా ఆలోచించాలనుకుంటున్నారు?" అని వారి దగ్గర ఉన్న డబ్బు హెచ్చరించినట్టుగా అనిపించింది. వెంటనే ఆశ, విహార్ లు తేరుకున్నారు. లక్ష్మి మాటలకు సమాధానంగా
కనిపించని మూతి విరుపుతో అసహనంగా ఏక కంఠంతో "అవునా!" అన్నారు.

బాణాల నుంచి తప్పించుకోవచ్చు మరి సరాసరి గుండెలోతుల్లో గుచ్చుకుని అంతరాత్మకు గాయం చేసే మాటలనుంచి తప్పించుకోవడం ఎవరికి సాధ్యం

సూర్యుడు కోటికాంతుల ఆశలను చూపించి అలసి అస్తమించాడు. ఆకాశంలో కటిక చీకటి ముసురుతుండగా చల్లని వెన్నెల కిరణాలతో పున్నమి చంద్రుడుదయించాడు. బంగ్లా బాల్కనిలో ఖరీదైన వెండి మువ్వల ఉయ్యాలలో బాబునూపుతుంది ఆశ. చంద్రుడి తో బాబు మాట్లాడుతూ ఆడుకుంటున్నాడు. ఆశ మోహంలో తప్పు చేసానేమొ అన్న అపరాధ భావన స్పష్టంగా కనిపిస్తుంది.

"ఆశా! ఏంటలా వున్నావ్ ?" బాబు బుగ్గలను పుణుకుతూ అడిగాడు విహార్.

మనసులోని ఆర్థ్రత ఆ మాట కోసమే ఆగిందా! లేక ఇన్నాళ్లు తనకే తెలియని అంతర్యుద్ధం మనసులో జరుగుతుంటే దానికి ముసుగేసి మెటీరియలిస్టిక్ గా బ్రతికిందా? ఏమో మరి ! ఒక్కసారిగా వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టింది ఆశ.

ఆనంద క్షణాల్లో ఈ అనుకోని ఏడుపేంటో అర్థం కాని విహార్ " ఎందుకలా ఏడుస్తున్నావు!" అని అడిగాడు విస్మయంగా.

"ఎవరో బిడ్డ తన పిల్లల్లా పెంచుకుంటానని, తీసుకురమ్మని వాళ్ళయన్ని పంపించి తీసుకురమ్మంది లక్ష్మి . మరి నేను, నా కడుపులో ఆనందంగా పెరగవలసిన బిడ్డని అందులోను అబ్బాయే కావాలని మరో అమ్మ కడుపులో పెట్టించాను" విహార్ వైపు చూస్తూ కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ అంది.

"ఆశా! ఎందుకు అంత ఎమోషనల్ అవుతున్నావు. మనం ఆశ పడిందే కదా! అయినా లక్ష్మి వాళ్ళ స్టేటస్, లైఫ్ స్టైల్ వేరు వాళ్ళతో నిన్ను పోల్చుకుని అనవసరంగా బాధపడుతున్నావు" అని ఆశని దగ్గరగా తీసుకున్నాడు.

"అవును! ఆశపడ్డాం కాని ఆలోచించలేదు. మన లైఫ్ లో స్టైల్ ఉంది. లైఫేది?. పగలు, రాత్రి తేడా లేకుండా తెచ్చి పెట్టుకున్న నవ్వు మొహాలతో సామాజిక మాధ్యమాల స్టేటస్ ల చుట్టే తిరుగుతున్నాం. ఒక్కసారైనా మన మానసిక స్టేటస్ ఏంటి అని మనకి మనం ప్రశ్నించుకోలేదు. విహార్, లక్ష్మి ఆడిన మాటలు నాకు చిన్నప్పుడు పొలంలో వర్షం పడినప్పుడు వచ్చే మట్టి వాసన గుర్తుకు తెచ్చాయి. అప్పుడు నేను మా తాతని అడిగేదాన్ని "ఎందుకు తాత అంత కష్టపడతావు అని మా తాత ఎప్పుడూ ఒకటే మాట చెప్పేవాడు. "మన కష్టాన్ని మనమే భరించాలి. మన ఇష్టాన్ని మనమే సాధించుకోవాలి" అని.

ఆ మాటకర్థం ***కష్టాన్ని భరించైనా సరే ఇష్టాన్ని సాధించుకోవాలని*** .వయసు పెరిగినా నాకు బుద్ధి రాలేదు. అందుకే నా కోరిక తప్పు, ఒప్పు అనే విచక్షణ కూడా లేకుండా ఏ బాధ పడకుండా బిడ్డని తెచ్చుకున్నాను" అని విహార్ భుజాన్ని ఆసరా చేసుకుని మనసు పడే వేదనని మాటల్లో చెప్పడానికి ప్రయత్నిస్తుంది ఆశ.

"ఆశా! ఎందుకంత మధన పడుతున్నావు. నువ్వే కాదు కదా! చాలా మంది చేయించుకుంటున్నారు. ఇందులో తప్పేం ఉంది మనం డబ్బులు ఇస్తున్నాం. వాళ్ళు చేస్తున్నారు. నువ్వు మరీ ఎక్కువ ఆలోచిస్తున్నావు" తల నిమురుతూ అన్నాడు విహార్.

"నిజం చెప్పు విహార్ మనకు తెలీదా సరొగసీ, బిడ్డలు లేక తల్లడిల్లే తల్లిదండ్రుల కోసమని అది కూడా లింగ నిర్ధారణ పరీక్ష లేకుండా అని. వాణిజ్య అద్దె గర్భాలు పూర్తిగా నిషిద్ధం. నిస్వార్థ అద్దె గర్భాలకి మాత్రమే అనుమతి ఉందని. అందరూ చేస్తున్నారని మనము చేస్తే తప్పు ఒప్పై పోతుందా. ఇది చట్టపరంగా అయితే నేరం, నైతికంగా ఆలోచిస్తే పాపం. విహార్ నీకు తెలుసా! ఉదయం డాక్టర్ బిడ్డని నా చేతిలో

పెట్టినప్పుడు ఐదు నిమిషాలు పట్టుకొని వెంటనే లక్ష్మి కి ఇచ్చాను పట్టుకోమని. అదే నేను తొమ్మిది నెలలు మోసిన బిడ్డ అయితే బంధంగా ఉండేది గాని నాకు బరువుగా అనిపించేదా!? నువ్వే చెప్పు" అని ఆత్రంగా విహార్ ని అడుగుతూ ఏడుస్తుంది ఆశ.

విహార్ కి ఏం మాట్లాడాలో అర్థం కాక ఆశ వైపు అయోమయంగా చూస్తూ ఉండిపోయాడు.

"అంతా అయిపోయిన తరువాత ఇప్పుడెందుకు ఆలోచిస్తున్నావు అనకు విహార్ కనీసం నా మనసుతోనైనా నేను నిజాయితీగా చెప్పుకోవాలి, పశ్చాత్తపడాలి కదా! అందుకే నీకు చెప్తున్నా " అని విహార్ ని గట్టిగా హత్తుకుంది.

"అమ్మా! అయిందేదో అయిపోయింది ఇప్పటినుంచి నన్ను వదిలిపెట్టకు, బాగా చూసుకో" అని అంటున్నట్టు గా ఏడవడం ఆరంభించింది ఉయ్యాల లోని బిడ్డ. వెంటనే బాబుని తన ఒళ్ళోకి తీసుకుని యశోద పంపిన తల్లిపాలను వాడి బోసినోటికి అందించింది ఆశ. నెమ్మదిగా తల్లి, బిడ్డ నిద్రలో కి జారుకున్నారు.

టైం రాత్రి రెండు, ఫోన్ రింగ్ అవుతుంది. " ఆ..మోహన్రావు చెప్పు" అన్నాడు విహార్

"అది...అది" అని కొంచెం బాధ గా కొంచెం నీల్లు నములుతున్నట్టుగా ఉంది మోహన్రావు స్వరం.

"విషయం ఏంటో చెప్పు" విసుగ్గా అన్నాడు విహార్.

" అది... యశోద చనిపోయిందండి" గద్గద స్వరంతో

"అవునా!? నిజంగానా!? ఉదయం బాగానే ఉంది కదా!? ఏమైంది!?" ప్రశ్న మీద ప్రశ్న వేస్తున్నాడు విహార్. అతని మనసుకి తెలియక పోయినా ఒంటికి తెలిసినట్టుంది తప్పు చేశానని అది నీరు కారిపోతుంది.

"డాక్టర్ గారు B.P. , రక్త స్రావం ఎక్కువవడం వలన చనిపోయింది అంటున్నారు" అన్నాడు మోహన్రావు

"అయ్యో! అయితే ఇప్పుడు రమ్మంటావా?" నేనిప్పుడు అక్కడికి రావడం మంచిది కాదేమో? అనే ప్రశ్న ధ్వనించేట్టుగా అడిగాడు విహార్.

"సార్ మీరస్సలు రావద్దు.మీరిక్కడకి రావడం మంచిది కాదు. జరగాల్సినవన్నీ నేను చూసుకుంటాను. తల్లి పాలకి వచ్చే అబ్బాయికి చెప్పండి ఎట్టి పరిస్థితుల్లోనూ ఇటువైపు రావద్దని. నా నెంబర్ కి డబ్బులు పంపించండి" జాగ్రత్తలు చెప్తున్నట్టుగా చెప్పి మోహన్ రావు ఫోన్ కట్ చేసేసాడు.

విహార్ పక్కనే ఉన్న వాటర్ బాటిల్ లో నీళ్ళు తాగాడు. కాస్త గుండె వేగం నెమ్మదించి ఫోన్ లో డబ్బులు పంపిస్తుండగా బిడ్డ గుక్కపెట్టి ఏడవడం ఆరంభించింది. ఆశ లేచి బిడ్డకి పాలివ్వబోతుండగా డబ్బాలో పాలు అయిపోయాయి.

అవసరం పడుతుందేమో! అని తెచ్చిన ఫార్ములా పాలు కలిపి పాలడబ్బాలో పోసి పడుతుంటే ఆ బిడ్డ మరికాస్తా గట్టిగా ఏడుస్తుంది తప్ప ఆ పాలు తాగట్లేదు. తల్లి ముర్రి పాల తియ్యదనానికి అలవాటు పడ్డ పసిబిడ్డ పొడి పాలు తాగుతుందా?. తనను మోసిన తల్లి లేదని తెలిసిందేమో ఆ బిడ్డ ఎంతపైనా ఏడుపాపట్లేదు.

"విహార్! ఉదయాన్నే వెళ్ళి వాడిని పాలు తీసుకురమ్మను....వీడీ పాలు తాగట్లేదు, ఏడుపాపట్లేదు" అని నిద్ర చెదిరిన విసుగుతో చెప్తుంది ఆశ.

"అసలే ఒక రకమైన ఎమోషన్ లో ఉంది . ఇప్పుడీ విషయం చెబితే మరింత ఎమోషన్ అయి అక్కడకి వెళదాం అనొచ్చు. లేకపోతే ఏదో పెద్ద సాయం చేద్దాం అని అనొచ్చు. ఈ సమయంలో మనం మంచి చేసినా అది మనకే చెడు అవుతుంది అని చెబితే అర్థం చేసుకునేంత మానసిక పరిణతిగాని, ప్రాక్టీకాలిటిగాని ఆశకి లేవు" అని విహార్ మనసులో అనుకుంటుండగా

. "విహార్! నీకే చెప్తున్నా! నిద్రపోతున్నావా, ఆలోచిస్తున్నావా!?" అని గట్టిగా అరిచినట్టుగా అడుగుతుంది బిడ్డ ఏడుపుతో నిద్రమత్తు వదిలిన ఆశ.

"ఆ...ఆ... అదే యశోద వాళ్ళు వేరే ఊరు వెళ్ళిపోతున్నారట.....బ్యాంకులో డబ్బులు వేయమని చెప్పారు...ఆ పనే చేస్తున్నా మొబైల్ లో " అని మాట మాట కూడబలుక్కుని చెబుతున్నాడు విహార్.

"అదేంటి? ఉదయం నేనే తల్లి పాలు పంపిస్తాను అని ఓ తెగ బ్రతిమలాడింది....ఇప్పుడేంటి ఉన్నట్టుండి వెళ్ళిపోవడం. డబ్బులు బాగానే అడుగుతారు....బిడ్డ పాలుకి ఇబ్బంది పడతాడని తెలియదా ఆవిడకి" అంది ఆశ ఉక్రోషంగా.

బిడ్డ డబ్బా పాలు తాగకుండా ఒకటే ఏడుస్తుంటే వాడిని ఆపలేక లక్ష్మి కి ఫోన్ చేసి రమ్మంది.

★★★★★★★★

ఉదయం ఏడు అవుతుంది. మోహన్ రావు బైక్ మీద వెలుతున్నాడు. ఉన్నట్టుండి వర్షం మొదలైంది. వర్షం వల్లనేమో ఆ వీధిలో నీచు వాసన మరింత ఎక్కువైంది. మోహన్ రావు భృకుటి ముడి పడింది ఆ వాసన భరించలేక. దూరంగా ఒకడు "ఓర్రై పొద్దు కాడ పెద్ద ఎర ఏస్తే కాని ఈ సేప పడనేదురా! పడిన ఎంటనే సచ్చినాది" అని తన చేతిలో ఉన్న చేపని బీడి కాల్చుకుంటూ పక్కవాడికి చూపిస్తున్నాడు.

టెంట్ దగ్గర కొచ్చాడు మోహన్ రావు. ఒక సగం మనిషి తూలుతూ వచ్చాడు మిగిలిన సగం అతని ఒంటి మీద స్పృహ లేదు...."మా ఇంటిది ఇలా అయిపోనాది ఆ బిడ్డ" అని అతను అంటుండగానే మోహన్ రావు "సారు వాళ్ళు ఊర్లో లేరు ఇదిగో ఈ డబ్బులు ఉంచుకో. జరగవలసిన కార్యక్రమం నేను చూసుకుంటానులే " అని అతని జేబులో ఎవరు చూడకుండా డబ్బులు, సీసా పెట్టి అతనికి దూరంగా జరిగాడు. మోహన్ రావు మనసులో "ఈ శవానికి త్వరగా అంత్యక్రియలు జరిపించాలి. రాత్రి నుంచి వీడికి మందిచ్చి మరిపిస్తున్నాను. వీడికి తెలివొచ్చి ఏమైనా తప్పుగా మాట్లాడితే ఈ పని చేసినందుకు.. నేను, డాక్టర్, సార్ అందరం ఇబ్బంది పడాలి . మళ్ళీ ఆ పోలిసోళ్ళకి డబ్బులివ్వాలి." అని అనుకుంటూ బయటికి మట్టుకు విచారంగా మొహం పెట్టాడు.

యశోద బరువుని, భాధ్యతల్ని మోసి మోసి అలసి సొలసి అన్ని మరచి ఆత్మని విడిచి నిర్జీవంగా చాపపై పడి ఉంది. ఆ ఇల్లు నిలబడి వెర్రిగా నువ్వుతుంది నా కోసమేనా నువ్వు పడిపోయింది అన్నట్టుగా. ఆధునీకత, సాంకేతికత వాటి అవసరానికి ఊపయోగపడక అర్థం, పర్థం లేని ఆశల పాలు పడి ఒక ఆయువు తీసింది. "అమ్మా! అమ్మా! అమ్మా! ఆకలేత్తుందే లేవ్వే అమ్మా!, ఏదుంటే అదే తింటానే, ఏదెడితే అదే తింటానే, లేచి పెట్టవే" అని యశోద గుండె ల మీద పడి పడి "అమ్మ లేవట్లేదంటూ" వెర్రిగా చూస్తూ ఆ చిన్న ప్రాణం ఏడుస్తుంటే చూట్టూ ఉన్న వారి గుండెలు ఏడుస్తున్నాయి "ఈ వయసులో నీకెదేం కష్టం అమ్మా!" అని. మోహన్ రావుకి అలానే అనిపించి "అయ్యో! పాపం" అనుకున్నాడు. మళ్ళీ తన కర్మను కడిగేసుకోవడం కోసం చేయవలసిన కర్తవ్యం గుర్తుకు వచ్చింది. ఆ పాపను పక్కకి తీసాడు "పట్టుకొండమ్మా!" అంటూ పక్కనే ఉన్న ఒక అమ్మ చేతి లో పెట్టాడు.

మత్తులో ఉన్న యశోద మొగుడు మతి లేక ములుగుతున్నట్టు ఏడుస్తున్నాడు. యశోదని పాడె మీదకి ఎక్కిస్తున్నప్పుడు ఆమె గుండెలపై తడి ఇంకా తగులుతోంది ఆ పాలకి ఇప్పుడు విలువలేదు. పేద ముత్తైదువ అలంకరణలో ఆ చివరి యాత్రా రథం ముందుకి కదులుతుంటే మోహన్ రావు లో లోపల ఉన్న భయం తగ్గుతూ వస్తూంది, "అమ్మ" తప్ప వేరే లోకం తెలియని ఆ పాలబుగ్గల చిట్టి తల్లి గుండెల్లో భయం పెరుగుతూ పోయి, ఆ బాధను మోయలేక కుప్పకూలిపోయింది . ఒక వేలం వెర్రి ఆశకు బలైన కథ ఉనికిని తన కడుపులో మోసుకుంటూ ఆ రథం ఊరేగుతూ కనుమరుగైపోయింది..కాల గర్భంలో కలిసిపోతున్నది... యథావిధిగా.....ఎప్పట్లానే!!

# అలోఖి

## తిరుమలశ్రీ

"రాత్రులు గజ్జెల చప్పుళ్ళు వినిపిస్తూంటాయి. ఈ ఫ్లాట్స్ లో ఎవరైనా డ్యాన్స్ నేర్చుకుంటున్నారా, తాయారూ?" అంటూ యథాలాపంగా అడిగింది చరిత.

కూరగాయలు తరిగిపెడుతూన్న పనిమనిషి మంగతాయారు చటుక్కున తలెత్తి చరిత కళ్ళలోకి చురుగ్గా చూసింది.

సాంబారు పెట్టడానికని ప్లాస్టిక్ డబ్బాలోంచి కందిపప్పు తీస్తూన్న చరిత, ఆ చూపులు ఏదో తేడాగా అనిపించడంతో, "ఎందుకలా చూస్తున్నావ్?" అనడిగింది చిత్రంగా.

మంగతాయారు వెంటనే జవాబివ్వలేదు. రెండు నిముషాలు ఆగి తల వంచుకుని నెమ్మదిగా అంది, "ఈ కాంప్లెక్స్ లో డ్యాన్స్ నేర్చుకుంటున్నవారెవరూ లేరమ్మా".

చరిత విస్తుపోయి, "మరైతే అర్ధరాత్రి మద్దెల దరువన్నట్టు...అందరూ నిద్రపోయే వేళ ఆ గజ్జెల చప్పుళ్ళేమిటి!?" అంది.

'అన్నా కాంప్లెక్స్' లో థర్డ్ ఫ్లోర్ లో ఉన్న ఆ ఫ్లాట్ లో చరిత, ఆమె భర్త హరీశ్ అద్దెకు దిగి నెల్లాళ్ళయింది. అక్కడకు వచ్చినప్పట్నుంచీ తరచు రాత్రి వేళలో ఎవరో కాళ్ళకు గజ్జెలు కట్టుకుని నడుస్తూన్న శబ్దాలు వినవస్తున్నాయి.

ఓ రోజు, "రాత్రులు గజ్జెల చప్పుళ్ళు వినిపిస్తే లక్ష్మీ దేవి తిరుగుతోందంటారు' అని చరిత అంటే, 'దయ్యాలు కూడా కావచ్చుగదా!' అన్నాడు హరీశ్ ఆమెను భయపెట్టేందుకని. 'హుఁ' అంటూ కోపంగా మోచేత్తో అతని ఛాతీ పైన పొడిచింది ఆమె.

'లేకుంటే ఏమిటోయ్! రాత్రులు గజ్జెల చప్పుడు వినిపిస్తే దేవతో, దయ్యమేనా! ఈ ఫ్లాట్స్ లో ఎవరో డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తూండవచ్చుగదా" అని హరీశ్ నవ్వడంతో, 'నిజమే' ననిపించింది.

చరితకు పాతికేళ్ళుంటాయి. హరీశ్ ఆమె కంటె ఐదేళ్ళు పెద్దవాడు. వారి పెళ్ళయి మూడేళ్ళయింది. పెళ్ళినాటికి హైదరాబాద్ లో ఓ గవర్నమెంట్ కాలేజ్ లో బోటనీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేసేవాడు హరీశ్. ఆ మధ్య చెన్నై లోని ఓ ప్రముఖ ప్రైవేట్ పి.జి. కాలేజ్ లో రెట్టింపు జీతంతో ప్రొఫెసర్ గా ఉద్యోగం రావడంతో మూణ్ణెల్ల క్రితం వచ్చి జాయినయ్యాడు. అతను పనిచేసే కాలేజ్ తాంబరంలో ఉంది. అక్కడకు దగ్గరగా ఉన్న 'అన్నా కాంప్లెక్స్' లో ఫ్లాట్ అద్దెకు తీసుకుని భార్యను తీసుకువచ్చాడు. ఇంకా పిల్లలు కావాలనుకోనందున ఇద్దరే ఉంటున్నారు. ఆ కాంప్లెక్స్ లోని ఇళ్ళలో పనిచేస్తూన్న తెలుగు తెలిసిన నలభై ఏళ్ళ మంగతాయారును ఇంటి పనిలో సాయం చేయడానికి పెట్టుకున్నారు.

హరీశ్ వారం క్రితం అఫీషియల్ టూర్ మీద మెట్టుపాలయం వెళ్ళాడు. తన పరిశోధనలకు అవసరమైన మెడిసినల్ ప్లాంట్స్ అన్వేషణలో ఫారెస్ట్ ఏరియాస్ కు వెళ్తూండడం అలవాటు అతనికి.

"చరితమ్మా! నువ్వు భయపడనంటే ఓ విషయం చెబుతాను," అన్న పనిమనిషి వంక ప్రశ్నార్థకంగా చూసింది చరిత.

చరిత వాళ్ళుండే ఫ్లాట్ కి ఎడమ వైపున్న ఫ్లాట్లో కొత్త దంపతులు ఉండేవాళ్ళు. పెళ్ళిలో పుచ్చుకున్న కట్నం చాలక, ఇంకా ఇంకా తీసుకురమ్మని భార్యను వేధించేవాడు భర్త. ఆ పిల్లను హింసిస్తూండేవాడు. ఏం జరిగిందో తెలియదు, ఓ రోజున ఆ పిల్ల ఇంట్లోనే మంటల్లో

దహనమైపోయింది. భర్త కిరసనాయిలు పోసి కాల్చేసాడని కొందరూ, బాధలు భరించలేక ఆ పిల్ల ఆత్మహత్య చేసుకుందని కొందరూ చెప్పుకున్నారు... అది జరిగి ఏడాదయింది. అప్పట్నుంచీ ఆ ఫ్లాట్ ఖాళీగానే ఉంది. ఆ సంగతి తెలిసి ఎవరూ అందులో అద్దెకు దిగడంలేదు. చనిపోయిన పిల్ల పేరు కుముదం. తెల్లగా చక్కగా ఉండేది. కాళ్ళకు మువ్వల పట్టీలతో ఆ పిల్ల నడుస్తూంటే నాట్యం చేసినట్టుండేది... ఇప్పటికీ అప్పుడప్పుడు రాత్రులు ఆమె మువ్వల పట్టీల శబ్దాలు వినిపిస్తూంటాయని చెప్పుకుంటూంటారు. బలవంతపు చావు వల్ల కుముదం దయ్యమయిందన్న పుకారు ఉంది... మంగతాయారు చెప్పింది ఆలకించి భయంతో బిగుసుకుపోయింది చరిత.

"నిన్ను భయపెట్టాలని కాదుగాని, కొంచెం జాగ్రత్తగా ఉంటావని చెబుతున్నానమ్మా" అంది పనిమనిషి. "కుముదం నిజంగానే దయ్యం అయ్యుంటే, ఇంతవరకు ఆమె ఎవరికీ ఏ హానీ తలపెట్టిన దాఖలాలు లేవు".

కుముదం ఉదంతం ఆలకించినప్పట్నుంచీ రాత్రులు ఇంట్లో ఫ్రీగా తిరగలేకపోతోంది చరిత. ఎక్కడ ఏ చిన్న చప్పుడు వినిపించినా గుండె గతుక్కుమంటోంది. భర్త టూర్ నుండి ఎప్పుడు తిరిగివస్తాడా అని ఎదురుచూడసాగింది.

## 2

సుమారు వందేళ్ళ క్రితం –

హిమాలయాలలోని ఓ కొండ గుహలో ముప్పై అడుగుల ఎత్తున్న కాళికాదేవి విగ్రహం పెద్ద పెద్ద కనుగ్రుడ్లతో, నాలుక చాచుకుని భయంకరంగా ఉంది. దేవి ముంగిట మానవ కపాలాలతో ఏర్పరచిన చతురస్రం ఎర్రటి, తెల్లటి ముగ్గులతో, పూలతో, నిమ్మకాయలతో నిండియుంది. దట్టమైన ధూపం ఎగసిపడుతోంది. గుహ అంతటా ఓ విధమైన వాసనతో గుప్పుమంటోంది.

దేవి విగ్రహం ఎదుట బాసింపట్టు వేసుక్కూర్చుని కన్నులు మూసుకుని ధ్యానముద్రలో ఉంది అలోఖి. ఏళ్ళ తపోబలంతో మాంత్రిక–తాంత్రిక శక్తులను సిద్ధంచేసుకున్న ఆ మాంత్రికురాలికి యాభై ఏళ్ళుంటాయి. సన్నగా పొడవుగా ఉంటుంది. కాషాయ దుస్తులలో, మెళ్ళో రుద్రాక్షలు, మానవ పుర్రెల హారంతో, ఒళ్ళంతా విభూతి రేఖలతో, నుదుటిపైన రూపాయకాసంత ఎర్రటి కుంకుమబొట్టుతో...క్రూరత్వం ఉట్టిపడే వదనంతో వికృతంగా ఉంది ఆమె. ఓ పక్క మంత్రదండం, మరో పక్క పొడవాటి పదునైన ఖడ్గం. అలోఖి సంతరించుకున్న క్షుద్రశక్తులు అపారం, తిరుగులేనివి.

కన్నులు మూసుకుని మంత్రోచ్చాటన కావిస్తోన్న అలోఖి కంఠం ఆ గుహలో మార్మోగుతూంటే...సశరీరులు కొన్ని, అశరీరులు కొన్ని వింత ఆకారాలలో ఉన్న క్షుద్రశక్తులు విచిత్ర శబ్దాలను చేస్తూ ఆమె చుట్టూ తిరుగాడుతూంటే...ఓ భయానక వాతావరణం నెలకొనియున్నదక్కడ.

అలోఖి వంక భయంతో ఊపిరి బిగబట్టి చూస్తోంది కంచుకి. అలోఖి శిష్యురాలు. పాతికేళ్ళుంటాయి. మంత్రోచ్చాటన పూర్తికాగానే అలోఖి కళ్ళు తెరుస్తుంది. అవి విస్ఫులింగాలలా మెరుస్తాయి. ఆ తరువాత జరుగబోయేది తలచుకుని గాలి తాకిడికి గురైన ఆకులా అల్లాడిపోయింది కంచుకి.

దేవి ఎదుటనున్న చక్రాసనంలో పడున్న యువకుడి వంక చూసింది. ఇరవయ్యేళ్ళ ప్రాయంలో నవయవ్వనంతో ఉన్నాడు. కాళ్ళు, చేతులు బంధింపబడి తెలివిలేకుండా పడున్నాడు. కాసేపట్లో కాళికాదేవికి బలికానున్న ఆ యువకుడి వంక జాలిగా చూసింది.

కాసేపటికి మంత్రోచ్చారణ ఆగిపోయింది. అలోఖి కన్నులు తెరచింది. అగ్నిగోళాల వంటి ఎర్రటి కనులతో బలిమనిషి వంక చూసింది. మంత్రదండాన్ని ఆ యువకుడి చుట్టూ ముమ్మారు త్రిప్పింది.

కనులు తెరచి అయోమయంగా పరిసరాలను పరికించాడు అతను. ఎదుటనున్న నిలువెత్తు కాళికా విగ్రహాన్నీ, కట్టెదుట నిలుచున్న మాంత్రికురాలినీ చూసి ఖంగుతిన్నాడు. భయంతో వణికిపోయాడు. కట్లు త్రెంచుకోవడానికి పెనగులాడాడు.

అదే క్షణంలో ఖడ్గం అందుకున్న అలోఖి, 'జై మహంకాళీ!' అంటూ ఒకే వ్రేటితో అతని తల నరికేసింది. యువకుడి శిరస్సు ఎగిరివెళ్ళి దేవి పాదాల వద్ద పడింది. అతని మొండెం నుండి రుధిర ధారలు ఎగజిమ్మి దేవికి రక్తతర్పణం చేసాయి.

'జై మహంకాళీ!...జై దుర్గా భవానీ!...జై భైరవీ!...' ఉద్వేగంతో కూడిన అలోఖి కంఠం భయంకరంగా గుహలో మార్మోగింది. యువకుడి మొండెం కొద్ది క్షణాలు విలవిల కొట్టుకుని నిశ్చలంగా అయిపోయింది.

ఆ భయానక దృశ్యాన్ని గాంచలేక కన్నులు మూసుకుంది కంచుకి.

"అహ్హహ్హ...పది...పది బలులయ్యాయి. ఇంక ఒకడు...ఇంకొక్కడు...ఒకే ఒక్కణ్ణి బలి ఇస్తే నా ఈప్సితం నెరవేరుతుంది. జరామరణాలు ఎరుగని నవజవ్వని నౌతాను. అహ్హహ్హ..." పిచ్చి పట్టిందానిలా అరచింది అలోఖి.

మృత్యువును, వృద్ధాప్యాన్నీ జయించి అపూర్వ సౌందర్యం సంతరించుకుని నిత్య యవ్వనంతో శాశ్వతంగా విలసిల్లాలన్న వాంఛతో దశాబ్దం క్రితం కాళికాదేవిని ఉపాసిస్తే – 'నవయవ్వనులు, అవివాహితులూనైన యువకులు పదకొండుమందిని...ఏడాది కొకరుగా...కార్తీక పూర్ణిమ రోజున కాళికి బలి ఇస్తే, ఆమె కోర్కె నెరవేరుతుందని...' అశరీరవాణి పలకడంతో, త్రికరణశుద్ధిగా అందుకు పూనుకుంది అలోఖి. అనేక సంవత్సరాల తపోదీక్షలో కోల్పోయిన వయసును, యవ్వనాన్నీ తిరిగి పొందాలనీ, కామవాంఛలను తీర్చుకోవాలనీ తపించిపోయింది.

తన మంత్ర తంత్రాలను, కుతంత్రాన్నీ ప్రయోగించి అవివాహిత యువకుల్ని తీసుకువచ్చి ప్రతి కార్తీక పూర్ణిమకూ కాళికాదేవికి బలి ఇవ్వసాగింది అలోఖి... ఐదేళ్ళ ప్రాయంలో కంచుకిని బలి ఇవ్వడానికని ఎత్తుకువచ్చింది అలోఖి. ఆ పిల్లకు ఆయుస్సు నిండని కారణంగా, కారణాంతరాలవల్ల ఆ పసిదాని బలి ఆగిపోయింది. ఆ పిల్లను తన దగ్గరే ఉంచుకుని పెంచి పెద్ద చేసింది అలోఖి. కంచుకి అన్న పేరు తానే పెట్టింది. తన పూజాపునస్కారాలలో సహకరించేటట్టు తర్ఫీదు ఇచ్చింది. కంచుకిలో అందం కంటె ఆకర్షణ ఎక్కువ. ఆ గుహ తప్ప బైటి ప్రపంచం ఎరుగదు. అలోఖినే అమ్మగా అనుకుంటుంది. ఆమె చేసే హింసాత్మక చర్యలు నచ్చకపోయినా నిస్సహాయతతో సహకరిస్తుంది. అలోఖి ఏడాదికోసారి యువకుల్ని తెచ్చి బలి ఇస్తుంటే ఆ పిల్ల మనసు విలవిలలాడిపోయేది. కాని అలోఖికి ఎదురు చెప్పే సత్తా ఆమెకే కాదు, అలోఖి చుట్టు పరిభ్రమించే క్షుద్రశక్తులకు సైతం లేదు.

#

ఏడాది గిర్రున తిరిగివచ్చింది...అది పదకొండవ కార్తీక పూర్ణిమ. నాటితో అలోఖి చిరకాల వాంఛ నెరవేరబోతోంది... పున్నమికి నెల్లాళ్ళ ముందే ఇరవై రెండేళ్ళ ఓ సుందర యువకుణ్ణి ఎత్తుకువచ్చి తన స్థావరంలో బంధించింది అలోఖి. ఆ యువకుడి అందానికి సమ్మోహితురాలైన కంచుకి, అతను అలోఖి కత్తికి బలికాబోవడం తలచుకుని విలవిల్లాడిపోయింది. ఆ యువకుడు కూడా తొలిచూపులోనే కంచుకి పైన మనసు పారేసుకున్నాడు.

కార్తీక పూర్ణిమ నాటి రాత్రి –

నదిలో శుద్ధి అయి వచ్చి యథావిధిగా కాళికాదేవికి పూజ చేసింది అలోఖి. ఆ యువకుడికి తెలివి తప్పించి ముగ్గులో పడుకోబెట్టింది. కన్నులు మూసుకుని మంత్రోచ్చాటన సాగించింది.

ఆ రోజు ఆమెలో ఉద్విగ్నత అధికంగా ఉంది. అందుక్కారణం – నాటితో తన రూపం, జీవితం మారిపోనున్నాయి. వికృత రూపం, వికార వదనం పోయి అప్సరసలను తలదన్నే సుందరాంగిగా నవయవ్వనంతో రూపాంతరం చెందబోతోంది. ముదిమి, మృత్యువులకు

అతీతంగా యుగాలు మారినా మృత్యుంజయగా మిగిలిపోతుంది. తాను సాధించిన అతీత శక్తులతో లోకంలోని అందమైన యువకుల యవ్వనాన్ని జుర్రుకుంటుంది. అమర సౌఖ్యాలను అనుభవిస్తుంది.

మంత్రోచ్చాటన ముగించి లేచి నిల్చుంది అలోఖి. మంత్రదండంతో ఆ యువకుడికి తెలివి తెప్పించింది. అతను కన్నులు తెరవగానే, "దేవికి బలికాబోతూన్న నువ్వు అదృష్టవంతుడివిరా డింభకా!" అంటూ, కంచుకి అందించబోయే ఖడ్గం కోసం చేయి చాచింది.

అదే క్షణంలో – మెరుపులా ఖడ్గంతో అలోఖి కంఠం నరికేసింది కంచుకి, మదిలోనే కాళికామాతను తలచుకుంటూ. అలోఖి తల ఎగిరి దేవి పాదాల చెంత పడింది. ఆమె మొండెం నుండి ఎగసిన వెచ్చటి నెత్తురు దేవికి అభిషేకం చేసింది.

మరుక్షణంలో భూకంపం వచ్చినట్టు ఆ గుహ అంతా అల్లాడిపోయింది. భూత, ప్రేత, పిశాచ గణం యొక్క హాహాకారాలతో దద్దరిల్లిపోయింది. దేవి విగ్రహం వద్ద నున్న గంటలు విడవకుండా మ్రోగాయి. మిరుమిట్లు గొలిపే వెలుతురుకు తట్టుకోలేక కళ్ళు మూసుకున్నారు కంచుకి, యువకుడూను...కన్నులు తెరచేసరికి కాళికాదేవి వారి ముందు ప్రత్యక్షమయింది. అవాక్కయి, అప్రయత్నంగానే దేవికి ప్రణమిల్లారు ఇద్దరూ.

"వత్సా! అలోఖి కోరుకున్న వరం మీకు ప్రసాదిస్తాను..." అంటూన్న దేవి పలుకులకు అడ్డు తగులుతూ, "మాతా! జరామరణాలు లేని జీవితం భారమే తప్ప ఆనందదాయకం ఎలా ఔతుంది? అట్టి ఘోర వరం మాకొద్దు. నీ దర్శన భాగ్యంతో పునీతులమైన మాకు నీ ఆశీర్వచనమే కోటి వరాల మూట!" అన్నాడు యువకుడు. కంచుకి అతనికి వత్తాసు పలుకుతూ, "ఈ మంత్రగత్తె యొక్క పాపపు కృత్యాలలో పాలు పంచుకున్న నా పాపాలకు నిష్కృతి కలిగించు మాతా!" అంటూ వేడుకుంది.

"తథాస్తు!" అంటూ ఆ జంటను ఆశీర్వదించి అదృశ్యమైపోయింది జగన్మాత.

అదే సమయంలో – అలోఖి ప్రేతాత్మ వాయుగుండంగా మారి గుహలోంచి విసురుగా బైటకు దూసుకుపోయింది....

## 3

రాత్రి డోర్ బెల్ మ్రోగడంతో పరుగెత్తుకు వచ్చి తలుపు తెరచింది చరిత. గుమ్మంలో భర్తను చూడగానే, "వచ్చేసారా!" అంటూ ఆనందంతో కౌగలించుకోబోయింది. అంతలోనే బ్రేక్ వేసినట్టు చటుక్కున ఆగిపోయింది.

హరీశ్ వెనుకనుండి వచ్చి అతని పక్కను నిల్చుంది ఓ యువతి. ఇరవయ్యేళ్ళుంటాయి. అందంగా ఉంది. చరిత చూపులు ఆమెకు అతుక్కుపోయాయి. హరీశ్ చిన్నగా పొడిదగ్గు దగ్గడంతో తేరుకుంది.

"ఈమె పేరు మల్లిక. వివరాలు తరువాత చెబుతాను. ముందు లోపలికి తీసుకువెళ్ళు" అన్నాడు హరీశ్. "కొద్దిరోజులపాటు ఈమె ఇక్కడే ఉంటుంది".

చరిత చిరునవ్వుతో స్నేహపూర్వకంగా ఆ యువతి చేయి పట్టుకుని లోపలికి తీసుకువెళ్ళింది. గెస్ట్ రూమ్ చూపించి, "స్నానం చేసిరా, మల్లికా! భోంచేద్దాం" అంది. రెండు అడుగులు వేసి, మళ్ళీ వెనక్కి వచ్చి, "నువ్వు చాలా అందంగా ఉన్నావ్!" అంది నవ్వుతూ.

పడక మంచం పైన మల్లిక గురించి భర్త చెప్పింది విని విస్తుపోయింది చరిత...హరీశ్ మెట్టుపాలయం అడవిలో మొక్కల కోసం తిరుగుతూంటే, ఆత్మహత్య చేసుకోబోయిన మల్లిక కనిపించింది. ఆమెను వారించి వివరాలడిగితే, తాను ప్రేమలో మోసపోయాననీ, ఇంటికి

తిరిగివెళ్ళడం ఇష్టం లేదనీ, అందుకే చావాలనుకున్నాననీ చెప్పింది. ఆమెను ఓదార్చి తనతో తీసుకువచ్చాడు. కొద్ది రోజులు తమతోనే ఉంచుకుని, ఆమె మనసు కుదుటబడ్డాక మెల్లగా నచ్చజెప్పి ఇంటికి పంపించాలన్నది అతని ఆలోచన.

#

మల్లిక వచ్చి వారం అయిపోయింది. ఆమె తల్లిదండ్రుల వివరాలు రాబట్టడం సాధ్యం కాలేదు. ఓ రోజున మంగతాయారు మెల్లగా చరిత చెవిలో అంది, "నువ్వు నా కూతురిలాంటిదానవని చెబుతున్నాను, చరితమ్మా! తప్పుగా అనుకోకు. ఎంత మంచోడైనా మగాడు మగాడే! ఈ పిల్ల చాలా అందంగా ఉంది. ఎక్కువ రోజులు ఇంట్లో అట్టేపెట్టుకుని నీ కాపురంలో చిచ్చు పెట్టుకోకు". చరిత ఆమె వంక ఆశ్చర్యంగా చూసింది.

4

హరీశ్ ఉన్న ఫ్లాట్ కు ఎడమ పక్క ఫ్లాట్ లో దయ్యం ఉందన్న పుకారు కారణంగా అందులోకి ఎవరూ అద్దెకు రావడంలేదు. అందువల్ల దాని యజమాని మాధవన్ ఇంట్లో శాంతి జరిపించడం కోసమని ఓ మంత్రగాణ్ణి తీసుకొచ్చాడు. అతని పేరు పణికర్. మళయాళీ. నలభయ్యేళ్ళుంటాయి. తెల్లటి ధోతి, కోరమీసాలతో, అగ్ని గోళాల్లాంటి మిడిగ్రుడ్లతో...నల్లగా, ఎత్తుగా ఉన్న అతగాడు ఒళ్ళంతా విభూతి పూసుకుని, నుదుటను పెద్ద కుంకుమ బొట్టు పెట్టుకుని భయంకరంగా ఉన్నాడు.

నట్టింట్లో ముగ్గులు వేసి పూలు, నిమ్మకాయలు పెట్టి ఆర్భాటంగా మంత్రాలు జపిస్తున్నాడు అతను. మాధవన్ దంపతులు దగ్గర కూర్చుని ఆ తతంగమంతా ఆసక్తితో తిలకిస్తున్నారు. వీధి గుమ్మం తెరచే ఉంది.

పూజ జరుగుతూండగా చల్లటి గాలి మంచులా పణికర్ శరీరాన్ని తాకింది. చలించిపోయి ఓ క్షణం ఒళ్ళంతా జలదరించింది. చటుక్కున గుమ్మం వైపు చూసి, ఉలికిపడ్డాడు.

గుమ్మంలో– తెల్లటి దుస్తులలో ఓ అందమైన యువతి నిల్చునియుంది!

"అదిగో, వచ్చేసింది...ఈ ఇంటిని ఆవాసం చేసుకున్న దయ్యం!" అంటూ ఉద్వేగంతో, 'ఓమ్...హ్రీమ్...క్లీమ్...' అంటూ స్వరం పెంచి జోరుగా మంత్రాలు చదవనారంభించాడు. మంత్రించిన జలాన్ని ఆమె పైకి చల్లబోయాడు... అదృశ్యమైపోయిం దామె!

మాధవన్ దంపతులు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. కారణం – గుమ్మం దగ్గర వారికెవరూ కనిపించలేదు.

"మాధవన్ గారూ! నా మంత్రాలకు దయ్యం స్పందించింది. నాకు భయపడి కనిపించినట్టే కనిపించి మాయమైపోయింది. వచ్చే ఆదివారం బహుళ అమావాస్య. ఆ రోజున స్మశానంలో ప్రత్యేక పూజ చేసి దీన్ని అక్కడకు రప్పిస్తాను. భూస్థాపితం చేస్తాను. మీరిక నిశ్చింతగా ఉండొచ్చును" అన్నాడు పణికర్. అందుకు అవసరమైన సొమ్ములు తీసుకుని నిష్క్రమించాడు.

#

ఆదివారం...అమావాస్య...అర్థరాత్రి...

'అన్నా కాంప్లెక్స్' నైట్ వాచ్ మేన్ మురుగేశన్ మెయిన్ గేట్ దగ్గరున్న క్యాబిన్లో కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు. పాతికేళ్ళుంటాయి అతనికి. గేట్ చప్పుడు వినిపించి ఉలికిపడి లేచాడు. కిటికీలోంచి తొంగిచూస్తే ఎవరో మెయిన్ గేట్ తెరచుకుని మళ్ళీ మూయకుండా బైటకు వెళ్ళడం కనిపించింది. ఎవరా అనుకుంటూ బైటకు వెళ్ళాడు. గేట్ మూస్తూ పరీక్షగా చూస్తే, తెల్ల చీరలో ఉన్న స్త్రీ ఎవరో నడచుకుంటూ వెళ్ళడం కనిపించింది.

"యారది?" అంటూ అరచాడు. జవాబు రాలేదు. అంత రాత్రప్పుడు ఓ ఆడది ఒంటరిగా వెళ్ళడం వాడిలో కుతూహలం రేపింది. చప్పుడు చేయకుండా ఆమెను అనుసరించాడు.

అమావాస్య రాత్రి కావడంతో ఆ హిందూ స్మశానంలో కాటుకలాంటి చీకటి అలముకునియుంది. అక్కడక్కడ కాలుతూన్న కాష్టాల నుండి వస్తూన్న వెలుతురు అంధకారాన్ని బెదిరిస్తోంది. చర్మము, మాంసము కాలుతూన్న శివరకంపు గాలిలో ప్రయాణిస్తూ అంతటా వ్యాపిస్తోంది. ఎక్కణ్ణుండో నక్కల ఊళలు...గుడ్లగూబల అరుపులు...కీచురాళ్ళ ధ్వనులూ...స్మశాన సంగీతం ఆలపిస్తున్నాయి. కుక్క ఒకటి ఉండి ఉండి ఏడుస్తోంది, ఆప్తుల నెవరినీ కోల్పోయిన మనిషిలా! కపాలాలు ప్రేలుతూన్న చప్పుళ్ళు, ఏవేవో వింత శబ్దాలు...వాతావరణం భయానకంగా ఉంది. ఎంతటి ధైర్యవంతుడైనా ఆ వేళప్పుడు అక్కడ అడుగు పెడితే గుండె ఆగిపోవలసిందే!

స్మశానం లోపల ఓ చోట అలికి ముగ్గులు పెట్టాడు మంత్రగాడు పణికర్. ముగ్గుతో ఓ చదరం గీచి అందులో పసుపు, కుంకుమలు చల్లాడు. పూలు, నిమ్మకాయలు, మానవ పుర్రెలు, ఎముకలూ అందులో ఉంచాడు. అగ్నిగుండం తయారుచేసి అందులో ఆజ్యం వగైరాలను సమెధలుగా వేసాడు. క్షుద్రశక్తులను ఆకట్టుకునే మంత్రాలను గంభీర కంఠంతో స్మశానం ప్రతిధ్వనించేలా ఉచ్చరించసాగాడు.

కొంతసేపటికి తెల్ల చీర ధరించిన ఓ యువతి వచ్చి పణికర్ ఎదుట నిల్చుంది. ట్రాన్స్ లో ఉన్నదానిలా కనిపించింది.

"వచ్చావా? రా! ఈ ముగ్గులో కూర్చో. నీ జేజెమ్మల లాంటి ప్రేతాత్మలనే చిటికెలో లొంగదీసాను. నువ్వొక లెక్కా నాకు! ఈనాటితో నీ ఆటకట్టు. శాశ్వతంగా నిన్ను భూస్థాపితం చేస్తాను," అంటూ మంత్రాల జోరు హెచ్చించి, వేప రొబ్బలతో నీటిని ఆమె మీద జల్లసాగాడు.

ఓ క్షణం మంత్రగాడి వంక తీక్ష్ణంగా చూసిందామె. తరువాత నెమ్మదిగా కదలింది.

ఆమె వదనంలో ప్రస్ఫుటమౌతూన్న తీక్ష్ణతను, నిప్పులు కురిపిస్తూన్న కనులనూ చూసి ఓ క్షణం భీతితో వణికిపోయా డతను. మంత్రాల వేగాన్నీ, స్థాయినీ పెంచాడు.

ముగ్గులో కూర్చోలేదామె. అతని ఎదుటకు వచ్చి నిల్చుంది. ఏం జరుగుతోందో గ్రహించే లోపునే అతగాడి తలను రెండు చేతులతోనూ పట్టుకుని గిరగిరా త్రిప్పింది. ఆమె వదిలేసినా ఆ తల అలా బొంగరంలా తిరుగుతూనే ఉంది. మంత్రోచ్చాటన ఎప్పుడో గాల్లో కలిసిపోయింది.

ఆమెను వెంబడించి వచ్చిన మురుగేశన్, ఆ భయానక దృశ్యం చూసి అదరిపడ్డాడు. ఆమె దయ్యమో రక్తపిశాచో అయ్యుంటుందనిపించింది. భయంతో గుండె ఝుళ్ళుమంది. స్పృహ తప్పి నిలువునా కూలిపోయాడు.

మర్నాడు –

స్మశానంలో రెండు మృతదేహాలు కనిపించాయి. ఒకటి మంత్రగాడు పణికర్ ది. రెండవది, 'అన్నా కాంప్లెక్స్' నైట్ వాచ్ మేన్ మురుగేశన్ ది... పోస్ట్ మార్టెం రిపోర్ట్ ప్రకారం – పణికర్ మెడ విరిగి చనిపోతే, మురుగేశన్ గుండె ఆగి చనిపోయినట్లు తేలింది.

ఆ మరణాలు నగరంలో గొప్ప సంచలనం కలిగించాయి.

## 5

ఆ సంఘటన జరిగిన మూడవ రోజున –

రాత్రి ఏడు గంటలకు చరిత ఇంట్లో పని ముగించుకుని ఇంటికి బయలుదేరింది మంగతాయారు. అంతలో హఠాత్తుగా కరెంట్ పోయింది. స్టోర్ రూమ్ అలమరలో క్రొవ్వొత్తులు ఉంటాయనీ, తెచ్చి వెలిగించమనీ ఆమెకు పురమాయించింది చరిత. మంగతాయారు అగ్గిపుల్ల వెలిగించి ఆ వెలుతురులో స్టోర్ రూమ్ కి వెళ్ళింది. పెద్ద క్రొవ్వొత్తి ఒకటి తీసుకుని వెలిగించింది. దాంతో వెనుదిరిగింది.

గుమ్మంలో తెల్ల చీర ధరించిన స్త్రీని అకస్మాత్తుగా చూడడంతో ఉలిక్కిపడింది. "మల్లికమ్మా?" అంది. ఆ పిల్ల ఎప్పుడూ తెల్ల చీరలే కడుతుంది.

జవాబులేదు. క్రొవ్వొత్తిని పైకెత్తి ముఖంలోకి పరీక్షగా చూసింది. గుండె ఝల్లుమంది.

ఆ స్త్రీ – మొండెం వరకే ఉంది...! తల లేదు...!!

తల – ఆమె చేతిలో ఉంది...!!!

అంతే! భయంతో ఓ వెర్రికేక పెట్టి స్పృహతప్పి పడిపోయింది మంగతాయారు.

వంటింట్లో ఉన్న చరిత పనిమనిషి కేక విని తృళ్ళిపడింది. కంగారుగా స్టోర్ రూమ్ వైపు వెళ్ళబోతూంటే హఠాత్తుగా లైట్లు వెలిగాయి. ఒక్క ఉరుకులో స్టోర్ రూమ్ ని చేరుకున్న చరితకు, గుమ్మం లోపల చలనం లేకుండా పడున్న మంగతాయారు కనిపించింది.

"తాయారూ! తాయారూ! ఏం జరిగింది?" అంటూ కంగారుగా లేపబోతే ఆమెలో కదలిక లేదు. ఆ హడావిడికి మల్లిక అక్కడకు వచ్చింది.

"దీనికేమయిందో? ఎంత పిలిచినా పలకడంలేదు" కంగారుగా అంది చరిత. గ్రుడ్లప్పగించడం మినహా మల్లిక ఏమీ మాట్లాడలేదు.

భార్య ఫోన్ కాల్ అందుకున్న హరీశ్ డాక్టర్ని తీసుకుని కంగారుగా ఇంటికి వచ్చాడు. డాక్టర్ మంగతాయారును పరీక్షించి ఫస్ట్ ఎయిడ్ ఇచ్చాడు. గుండె ఇంకా ఉద్వేగంతో కొట్టుకూంటూండడంతో ఆమె ఎందుకో విపరీతంగా భయపడుంటుందన్నాడు. అతని సలహా మేరకు అంబులెన్స్ తెప్పించి ఆమెను హాస్పిటల్లో చేర్పించాడు హరీశ్... మంగతాయారుకు ఏమయిందో బోధపడక అయోమయంలో పడిపోయారు ఆ దంపతులు.

#

ఓ రాత్రి గాఢ నిద్రలో ఉన్న చరిత ఎవరో లేపినట్టయి ఉలికిపడి లేచింది. లైట్ వేసి చూస్తే గదిలో ఎవరూ లేరు. మంచినీళ్ళు త్రాగి మళ్ళీ పడుకోబోయింది కాని, నిద్ర పట్టలేదు. ఎందుకో భయంగా అనిపించింది.

భర్తను లేపి, "ఏమండీ! నన్నెవరో కంచుకీ అని పిలుస్తూ కుదిపి లేపినట్టయింది" అంది భయంగా.

"పీడకలేదో వచ్చుంటుంది. మంచినీళ్ళు త్రాగి పడుకో" అన్నాడు హరీశ్ నిద్రమత్తులో.

చరిత ఏదో జ్ఞప్తికి తెచ్చుకోవడానికి ప్రయత్నించింది...'కంచుకీ! వంచకీ! నిన్ను నేను వదల!...' అన్న పలుకులు ఇంకా చెవుల్లో మార్మ్రోగుతున్నాయి. భయంతో కళ్ళు మూసుకుని భర్తను గట్టిగా కావలించుకుంది.

#

మంగతాయారుకు మూడో రోజున కాని స్పృహ రాలేదు. తెలివిలోకి వచ్చినా, 'ఏం జరిగిందంటే' సరిగా చెప్పలేకపోతోంది. వెర్రిచూపులు చూస్తోంది. 'పేయి...పిశాచి...దెయ్యం...' అంటూ ఏదేదో మాట్లాడుతోంది. ఆమె ఏదో షాక్ కి గురయిందనీ, పూర్తిగా కోలుకునేంతవరకూ హాస్పిటల్లోనే అబ్జర్వేషన్లో ఉండాలనీ అన్నారు డాక్టర్లు.

#

చరితకు తరచు తననెవరో, 'కంచుకీ!' అని పిలుస్తున్నట్లు అనిపించసాగింది. పగలు కూడా ఒంటరిగా ఉండడానికి భయపడుతోంది. మల్లిక ఉందంటే, ఆమె ఎప్పుడో కాని గదిలోంచి బైటకు రాదు. రాత్రయేసరికి ఆ భయం ఇనుమడించేది.

ఇంకో రాత్రి – ఎందుకో మెలకువ వచ్చేసింది చరితకు. పక్కలో హరీశ్ గాఢ నిద్రలో ఉన్నాడు. లేచి బాత్ రూమ్ కి వెళ్ళింది. లైట్ వేసి లోపల అడుగుపెట్టబోయి, భయంతో కెవ్వున అరచింది.

బాత్ రూమ్ అంతటా బకెట్ తో పోసినట్టి రక్తం...! గోడలపైనా నెత్తుటి మరకలే!

వాటిని చూసి హిస్టీరియా పేషెంటులా ఆగకుండా అరుస్తూనే ఉందామె.

ఆ కేకలకు తృళ్ళిపడి మేల్కొన్న హరీశ్ కు పక్కలో భార్య కనిపించలేదు. కంగారుగా మంచం దిగి, 'చరితా!' అని బిగ్గరగా పిలుస్తూ కేకలు వస్తున్న వైపు పరుగెత్తాడు.

బాత్ రూమ్ గుమ్మం దగ్గర రెండు చేతులతోనూ కళ్ళు మూసుకుని వణికిపోతోంది చరిత. ఆమెను చూసి, పొదివి పట్టుకుని, "ఏమైంది, చరితా? ఎందుకలా కేకలు పెడుతున్నావ్? ఎందుకిలా వణికిపోతున్నావ్?" అంటూ ఆత్రుతగా ప్రశ్నించాడు.

భర్త గొంతుకు ఆలకించి మెల్లగా కళ్ళు తెరచిందామె. అతని వక్షంలో ముఖం దాచుకుంది. భయంతో నోరు పెకలడం లేదు. చేయి చాచి బాత్ రూమ్ లోపలికి చూపించింది.

లోపలికి చూసిన హరీశ్, "ఏముందక్కడ? ఎందుకలా భయపడిపోతున్నావ్?" అనడిగాడు.

"రక్తం..." అంది.

"ఎక్కడా?" అయోమయంగా అడిగాడు, "ఇక్కడేమీ లేందే!"

చటుక్కున అటువైపు చూసింది... రక్తం లేదు! బాత్ రూమ్ కడిగేసినట్టు శుభ్రంగా ఉంది!

నిర్ఘాంతపోయింది. నేలపైన మడుగు కట్టిన రక్తపుటేర్లు, గోడల మీది నెత్తుటి మరకలూ అంతలోనే ఎలా అదృశ్యమైపోయాయి..!?

"నువ్వేదో ఊహించుకుని భయపడుతున్నట్టున్నావు. అసలు ఆ పణికర్, మురుగేశన్ ల మరణం తరువాతే నిన్ను భయం ఆవహించుకుంది" అన్నాడు అతను సముదాయిస్తూ.

తాను చూసింది వాస్తవం కాదనీ, కేవలం అదంతా తన భ్రమ అనీ నమ్మలేకపోతోంది చరిత. తనకేమయిందోనన్న ఆందోళన కూడా కలిగింది. ఆ రాత్రి ఆమెకు కంటి మీద కునుకు లేదు.

#

కొద్ది రోజులుగా చరిత ఆరోగ్యం బావుండడంలేదు. అహర్నిశలూ ఉలికులికిపడుతుంది. 'కంచుకీ! నిన్ను వదల!' అంటూ ఎవరో చెవిలో బెదిరిస్తున్నారంటుంది. ఇంట్లో అజ్ఞాత వ్యక్తి ఎవరో నడయాడుతోందంటుంది. పక్క ఫ్లాట్ లోని దయ్యం తమ ఇంట తిష్ఠవేసిందంటుంది.

డాక్టర్స్ కు చూపిస్తే, ఆమెది మానసిక రుగ్మత అనీ, ఎందుకో భయపడుతోందనీ అంటూ మందులేవో ఇచ్చారు.

చరిత కోలుకునేంతవరకు కొన్నాళ్ళపాటు తోడుంటుందని అత్తగారిని రప్పించాడు హరీశ్.

కూతురి పరిస్థితిని గమనించిన వర్ధనమ్మకు, చరితను ఏ దయ్యమో ఆవహించడమో, లేక ఎవరైనా ఆమెకు చేతబడి చేయడమో కారణమై ఉంటుందన్న అనుమానం కలిగింది.

వెంటనే కాకినాడలో ఉంటూన్న తన అన్నయ్య భవానీశంకర్ కు ఫోన్ చేసింది... భవానీశంకర్ కు యాభై ఏళ్ళుంటాయి. దేవీ ఉపాసకుడు. శక్తి పీఠం ఉంది.

మేనకోడలి పరిస్థితి గురించి ఆలకించిన భవానీశంకర్ నాలుగు రోజుల్లో చెన్నై చేరుకున్నాడు... చరిత ఉండే ఫ్లాట్ లో అడుగిడుతూంటే, పరిసరాలలో క్షుద్రశక్తి ఏదో సంచరిస్తున్నట్లనిపించింది.

కుశల ప్రశ్నల అనంతరం ఇల్లంతా తిరిగి కోణ కోణమూ పరీక్షించాడు అతను... చరిత పరిచయం చేస్తూంటే భవానీశంకర్, మల్లికలు వింతగా వీక్షించుకున్నారు.

స్నానాదులు ముగించుకుని పూజలో కూర్చున్నాడు భవానీశంకర్. పూజ ముగిసాక అంతా వచ్చి హారతి తీసుకుంటూంటే, మల్లిక కనిపించలేదు.

"ప్రియుడి చేత మోసగింపబడ్డప్పట్నుంచీ దేవుడి మీద అలిగింది మల్లిక. పూజగది దాపుకు కూడా రాదు" అంది చరిత.

## 6

ఆ రోజు శుక్రవారం –

సాయంసంధ్య వేళ విశాలమైన ఆ హాల్లో నట్టింట పరాశక్తికి ప్రత్యేక పూజ ఆరంభించాడు భవానీశంకర్. పిండితో, రంగులతో పద్మాకారంలో ఆసనం తయారుచేసాడు. పీఠం వేసి, దాని పైన తనతో తీసుకొచ్చిన సుమారు పన్నెండు అంగుళాల పొడవుండే 'దుర్గాదేవి' కంచు విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు. పూలమాలలతో అలంకరించాడు. మెళ్ళో నిమ్మకాయల దండ వేసాడు. అగరువత్తులు వెలిగించి, దీపారాధన చేసాడు. సాంబ్రాణి ధూపం వేసాడు. తొలుత శుద్ధ జలంతో దేవిని అభిషేకించి, పిమ్మట పసుపు కుంకుమలతో అర్చన చేసాడు... అగరువత్తుల పొగ, సాంబ్రాణి ధూపం ఇల్లంతా దట్టంగా క్రమ్ముకుని వింత సువాసన లీనుతున్నాయి.

చరిత తలంటు పోసుకుని పట్టు చీర కట్టుకుని పూజ దగ్గర కూర్చుంది. హరీశ్, వర్ధనమ్మలు ఆమెకు చెరో పక్కనూ ఆసీనులయ్యారు. భక్తిశ్రద్ధలతో ముకుళిత హస్తాలతో పూజా కార్యక్రమాన్ని తిలకించసాగారు. భవానీశంకర్ వారి నుదుటను దేవి కుంకుమను దిద్దాడు.

మల్లిక మాత్రం గదిలోంచి బైటకు రాలేదు. నిజానికి భవానీశంకర్ వచ్చినప్పట్నుంచీ గదిలోంచి బైటకు రావడం తగ్గించిందామె.

'ఓం ఐం హ్రీం క్లీం...చాముండాయై విచ్చేః ...' – గంభీర స్వరంతో భవానీశంకర్ చేస్తూన్న మంత్రోచ్చాటన ఇల్లంతా ప్రతిధ్వనిస్తోంది. అక్కడ ఉన్నవారి శరీరాలలో ప్రకంపనలను రేపుతోంది.

రాను రాను మంత్రోచ్చాటన ఉధృతమౌతోంది, జోరు హెచ్చింది.

హఠాత్తుగా గది తలుపు భళ్ళున తెరచుకుని బైటకు వచ్చింది మల్లిక. ఆమె ముఖం జేవురించియుంది. "ఆపు...!? అంటూ అరచింది.

ఆశ్చర్యపోయారంతా.

"ఎందుకు?" శాంతంగా అడిగాడు భవానీశంకర్.

"నాకిష్టం లేని పూజలు ఈ ఇంట్లో జరపడానికి వీల్లేదు!" తీక్ష్ణంగా అంది మల్లిక.

"శక్తి పూజను నియంత్రించే శక్తి ఏ శక్తికీ లేదు!" గంభీరంగా అన్నాడు భవానీశంకర్.

"ఆపు! నేను వెళ్ళిపోతున్నాను..." అంటూ గుమ్మం వైపు నడచిందామె.

గడప దాటబోతే, అజ్ఞాత శక్తి ఏదో త్రోసేసినట్టు వెనక్కి తూలిపోయింది. ముఖం రాతిలా చేసుకుని కిటికీ వైపు నడచింది. అక్కడా అదే అనుభవం!

"అష్టదిగ్బంధన జరిగింది. దేవి ఆజ్ఞ లేనిదే మానవేతరు లెవరూ ఈ ఇంటి గడప దాటలేరు" అన్నాడు భవానీశంకర్.

అతని వంక ఉరిమి చూసింది. "ఒరేయ్! నన్ను వెళ్ళనీరా!"

ఆమె వదనం ఎరుపెక్కింది. కనుగ్రుడ్లు పెద్దవయ్యాయి.

మల్లికలో వచ్చిన మార్పుకు కలవరపడ్డారు చరిత, హరీశ్, వర్ధనమ్మలు. అయోమయానికి గురయ్యారు. చరిత భయంతో భర్త చేయి గట్టిగా పట్టుకుంది.

"నా ఒళ్ళంతా మంటలురా... నన్ను పోనియ్యరా!" తీవ్ర స్వరంతో మళ్ళీ అరచింది మల్లిక, మెలికలు తిరిగిపోతూ.

"నువ్వు మనిషివి కావని నాకు తెలుసు. చెప్పు, ఎవరు నువ్వు? ఎక్కణ్ణుంచి వచ్చావ్? ఎందుకు వచ్చావ్?" గర్జించాడు భవానీశంకర్.

విషయం అర్థం అయీ అవనట్టుండడంతో భయం భయంగా చూసారంతా.

మల్లిక పైన మంత్రపు జలం చిలకరించాడు భవానీశంకర్.

అక్కడ పెద్ద మెరుపు మెరిసింది. మల్లిక స్థానంలో దట్టమైన పొగ ఏర్పడింది.

ఆ పొగలో అస్పష్టమైన మానవాకారం!

వికృత వదనంతో భయం గొల్పుతోంది.

"చెప్పు, ఎవరు నువ్వు?" భవానీశంకర్ కంఠం కంచులా మ్రోగింది.

"చెబుతాన్రా, చెబుతాను. నేనెవరో తెలిస్తే మీ గుండెలు ఆగిపోతాయి!" అంటూ ప్రతిధ్వనితో ఆ ఆకారం చెబుతూన్న దాన్ని మంత్రబద్ధుల్లా వింటూండిపోయారంతా...

'నా పేరు అలోఖి. ఓ శక్తివంతమైన మాంత్రికురాలిని. కాళికాదేవి కటాక్షంతో జరామరణాలను జయించి నిత్య యౌవనంతో అలరారవలసిన తరుణంలో...నా శిష్యురాలు కంచుకి నన్ను ఘోరంగా వంచించింది. ఫలితంగా ప్రేతాత్మగా మారి పునర్జన్మకు నోచుకోక అశాంతితో తిరుగాడుతున్నాను నేను. పగతో, ప్రతీకారేచ్ఛతో నూరేళ్ళుగా కంచుకి కోసం వెదుకుతూనే ఉన్నాను...

ఓ రోజున అడవిలో ఓ యువకుణ్ణి చూసి మోహించాను. మానవ రూపం ధరించి అతని వెంట వచ్చాను. ఇక్కడకు వచ్చాక కనిపించింది నాకు – కంచుకి. ఆ యువకుడి భార్య రూపంలో!...

కంచుకని మానసికంగా శారీరకంగా హింసించి బాధలు పెట్టి క్రూరంగా చంపాలని నిశ్చయించుకున్నాను. అనంతరం ఆమె భర్తతో కాపురం చేయాలనుకున్నాను... కాని, కంచుకి మెళ్ళో ఉన్న దేవి బిళ్ళ, ఆమె భర్త జబ్బకు కట్టుకున్న హనుమంతుడి బిళ్ళా...అడ్డు వచ్చాయి. ఎలాగో వారిచేత వాటిని ఒంటి నుండి వేరుచేయించి నా సత్తా చూపించాలనుకున్నాను...

పక్కింటి ప్రేతాన్ని వదిలించడానికి వచ్చిన క్షుద్ర శక్తుల మంత్రగాడు నన్ను చూసాడు. అందుకే వాణ్ణి మెడ విరిచి చంపేసాను... నన్ను ఇంటి నుండి పంపేయమంటూ కంచుకికి పనిమనిషి సలహా ఇవ్వడం గమనించాను. నా నిజరూపం చూపించి దాన్ని పిచ్చిదాన్ని చేసాను...'

ఆగి, చరిత వంక చూసింది అలోఖి ప్రేతాత్మ. 'ఇంతకుముందు స్నానం చేస్తూ మెళ్ళోంచి దేవి బిళ్ళ ఉన్న గొలుసు తీసి పక్కను పెట్టింది కంచుకి. దాన్ని తిరిగి ధరించడం మరచిపోయింది. నేను ఆ విషయం గ్రహించే లోపునే వచ్చి పూజ దగ్గర కూర్చుంది...'

అప్రయత్నంగా మెడ తడుముకుంది చరిత. గొలుసు లేదు.

'ఇప్పుడు దీన్నెవరు కాపాడుతారో చూస్తాను. దీని నెత్తురు త్రాగుతాను. నా పగ తీర్చుకుంటాను...' అంటూ హఠాత్తుగా చరిత పైకి లంఘించింది ప్రేతాత్మ. ఐతే విద్యుద్ఘాతం లాంటి మెరుపులు తాకడంతో 'కెవ్వు'న అరచి దూరంగా పారిపోయింది.

నవ్వాడు భవానీశంకర్. "చరిత మెళ్ళో దేవి బిళ్ళ లేకపోయినా, నుదుటను దేవి కుంకుమ ఉందన్న మాట మరచిపోయావు".

తీక్ష్ణంగా చూసింది ప్రేతాత్మ. 'మీ పూజను భగ్నం చేస్తాను. మిమ్మల్నందర్నీ నాశనం చేస్తాను' ఆగ్రహంతో అరుస్తూ రుధిరంతో నిండిన ఓ బిందెను సృష్టించి అందులోంచి రక్తాన్ని శక్తిపీఠం పైన గ్రుమ్మరించింది.

అది పీఠం చేరగానే పసుపు నీరుగా మారి దేవిని అభిషేకించింది. పుర్రెలు సృష్టించి దేవి మీదకు విసిరింది. అవి పుష్పాలుగా మారి దేవిని అలంకరించాయి.

పిచ్చెక్కినట్టు పేట్రేగిపోయింది అలోఖి ప్రేతాత్మ. "మిమ్మల్నందర్నీ నాశనం చేసేస్తాను. ఈ ఇంటిని స్మశానం చేసేస్తాను" అంటూ పెనుగాలి సృష్టించింది. నిప్పుల వర్షం కురిపించింది.

అవేవీ వారి దరిదాపులకు కూడా చేరలేకపోయాయి. వారి చుట్టూ లక్ష్మణరేఖలా ఓ అగ్నికవచం ఏర్పడడమే అందుకు కారణం.

ప్రేతాత్మ అక్కడ ప్రళయం సృష్టించింది. భూకంపం వచ్చినట్టు అల్లాడిపోయింది ఫ్లాటంతా. తలక్రిందులైంది. అంతా పక్కలకు ఒరిగిపోయారు. ఒకరి మీద నొకరు పడిపోయారు. భయాందోళనలతో కేకలు పెట్టారు.

వారి అవస్థ చూసి వికటంగా నవ్వింది అలోఖి ప్రేతాత్మ.

భవానీశంకర్ మాత్రం ఏమాత్రం తొణక్కుండా మంత్రోచ్చాటనను ముమ్మరం చేసాడు.

ఆ గందరగోళంలో చరిత నుదుటి మీది కుంకుమ చెరిగిపోయింది. ఆ సంగతి గుర్తించిన ప్రేతాత్మ ఆమెను దొరకబుచ్చుకుంది. 'కంచుకీ! నయవంచకీ! నేటితో నీకు ఆయువు మూడింది. నా పగ తీరుతుంది' అంటూ ఆమె శిరస్సు పైన మోదడానికి చేయి పైకెత్తింది.

చరిత భయంతో 'కెవ్వు' మంది. హరీశ్, వర్ధనమ్మలు హాహాకారాలు చేసారు.

భవానీశంకర్ రానున్న ప్రమాదాన్ని గుర్తించాడు. క్షణం ఆలస్యం చేయకుండా, "జై దుర్గా భవానీ...!" అంటూ కూర్చున్న చోటు నుండే పీఠం మీది దేవి విగ్రహాన్ని భక్తితో కన్నులకు అద్దుకుని ప్రేతాత్మ మీదకు విసిరాడు.

విగ్రహం సూటిగా వచ్చి తాకడంతో ఓ వెర్రికేక పెట్టి చరితను వదిలేసింది ప్రేతాత్మ.

హరీశ్ భార్యను పీఠం వైపుకు లాగేసాడు.

విగ్రహం తాకిడితో అగ్ని జ్వాలలు రేగి అలోఖి ప్రేతాత్మ నిలువునా దహించుకుపోయింది. చూస్తూండగానే పిడికెడు బూడిదగా మారిపోయింది.

అలోఖి ప్రేతాత్మ అంతరించడంతో ఆ ఇంట్లో మళ్ళీ ప్రశాంతత నెలకొంది.

'జై ఆది పరాశక్తీ!' అని నినదిస్తూ దేవి విగ్రహాన్ని పీఠం పైన పునఃప్రతిష్ఠించి శుద్ధి జరిపాడు భవానీశంకర్. "ఇక అలోఖి ప్రేతాత్మ పీడ విరగడైనట్టే. చరితకిక ఏ ఆపదా లేదు," అంటూ దేవి కుంకుమను ఆమె నుదుటను దిద్దాడు.

తరువాత అలోఖి ప్రేతాత్మ బూడిదను ఓ సీసాలో బంధించి సీలు వేసాడు – దాన్ని సముద్రంలో వదలిరావడానికి.

'ఓం ఐం హ్రీం క్లీం ... చాముండాయై విచ్చేః ...'

– ఆ రాత్రంతా ఆ ఇంట మంత్రోచ్చాటన మంగళప్రదంగా మార్మోగుతూనే ఉంది.

# ఏది నిత్యం? రాజశేఖర్ తటవర్తి

జయంత్ పరుగు పరుగున టెర్మినల్ 2 గేటు 5c కి చేరుకున్నాడు. సిటీ నుండి ఎయిర్పోర్ట్కి వచ్చే దారిలో ఒకటే హోరున వర్షం. గంట ప్రయాణం డైలీ సీరియల్ లాగా సాగి సాగి మూడు గంటలు పట్టింది. టాక్సీలో కూర్చొని చాట్ చేసి, tiktok చూసి సెల్ఫోన్లో సగం బాటరీ దారిలోనే అయిపోయింది. కౌలాలంపూర్ నుండి వైజాగ్ వెళ్లే ఎయిర్ ఏషియా ఫ్లైట్ బోర్డింగ్ అనౌన్స్ చేసి దాదాపు ఫైనల్ కాల్ కి వచ్చింది. లైన్లో అందరూ ఏదో స్నానానికి వెళ్లేవారిలాగా బెల్టులు షూస్ అన్ని ఒక్కకిటీ తీసి ట్రేలో పెట్టి సెక్యూరిటీ చెక్ కోసం వెయిట్ చేస్తున్నారు.

'ఇక్కడ కూడా ఇంత పొడుగు లైనా.. అందుకే సింగపూర్ షిఫ్ట్ అయిపోవాలి. అక్కడ అన్ని పనులూ చక చకా అయిపోతాయి' అని విసుక్కుంటుండగా జయంత్ ముందు వున్న ఒక పెద్దాయన అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తూ ఆ లైనుని ఇంకా పొడిగిస్తున్నాడు. వెనకాల జయంత్ ప్చ్ లు విని ఒక చిరునవ్వుతో "నువ్వు ముందు వెళ్ళు బాబు. కంగారులో వున్నట్టున్నావు" అని నిదానంగా దారిచ్చాడు.

"థ్యాంక్స్" అని తన తప్పు తాను తెలుకున్నవారిని క్షమించే చూపుతో ఆయన్ని చూసి తన బెల్ట్ షూస్ తీసుకొని వెయిటింగ్ రూమ్లో ఎవరూ లేని కుర్చీల వరసలో చతికిలపడి దీర్ఘంగా నిట్టూర్చాడు జయంత్. బోస్ హెడ్డుఫోన్స్ తో చెవులు కప్పుకొని coldplay పాటలు (ఈ మధ్యనే తన చైనీస్ ఫ్రెండ్ ఈ బ్యాండ్ మ్యూజిక్ అలవాటు చేసాడు) వింటూ వచ్చి పోయే జనాల్ని పరికించసాగాడు.

పట్టుమని ముప్పై ఏళ్ళు కూడాలేని జయంత్ మలేషియాలో ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఏ పనైనా చురుకుగా శ్రద్ధతో చేసే తాను వరుసగా మూడేళ్లు ఆంధ్రా రీజియన్ టాప్ పెరఫార్మర్ అవ్వడంతో కంపెనీ వారు రెండేళ్ల క్రితం మలేషియా బ్రాంచికి ప్రమోట్ చేసారు. రెండు రోజులలో వైజాగ్లో తన పెద్దనాన్న కొడుకు పెళ్లి. కానీ జయంత్ తండ్రికి ఒంట్లో కొంచెం నలతగా ఉండడంతో అయన బదులు జయంత్ని వెళ్ళమని తన అమ్మ బలవంతపెడితే వైజాగ్ ప్రయాణం కట్టాడు. రెండేళ్ళ తరువాత ఇండియాకి ఇదే వెళ్ళటం.

కొంత సేపటికి బోర్డింగ్ అనౌన్స్ చేసారు. మామూలు యిరుకు సీట్లలో కూర్చోలేక ప్రీమియం హాట్ సీట్ బుక్ చేసుకుని విండో సీటులో కూర్చున్నాడు. సీటుపక్కన కిటికీ లోంచి పొడుగాటి విమానపు రెక్కని, దానిపై టపటప చిందుతున్న చినుకుల్ని చూస్తూ ఆలోచలనలో పడ్డాడు. వృత్తి రీత్యా తాను అధిరోహించిన శిఖరాలు..మలేసియాలో పొందుతున్న తర్ఫీదు ఇవన్నీ తెరలు తెరలుగా గుర్తొస్తున్నాయి. సక్సెస్ తాలూకు తలంపులు వెచ్చగా తనని వాటేసుకున్నాయి.

కొంతసేపటికి ఆ దారిచ్చిన పెద్దాయన జయంత్ పక్కన హాట్ సీట్లో వచ్చి కూర్చున్నాడు అదే చిరునవ్వుతో. జయంత్ నవ్వి నవ్వనట్టుగా ఒక నవ్వునవ్వి మళ్ళీ కిటికీ వైపు తలతిప్పుకున్నాడు. ఫ్లైట్ టేక్ ఆఫ్కి సిద్ధపడింది.

విమానం కారుమబ్బుల్లోకి దూసుకెళ్లింది. క్రమంగా క్రిందవున్న భవనాలు, జనం, చెట్టు పుట్టా.. దర్పణ దృశ్యమాన నగరీతుల్యమయ్యాయి. ఆ విహంగ వీక్షణం జయంత్ మదిలో మళ్ళీ గర్వంతో కూడిన జ్ఞాపకాలని నింపింది.

విమానం లోపల లైట్స్ దిమ్ము చేశారు. తలపైన సీటుబెల్ట్ మరియు నో స్మోకింగ్ లైట్లు వెలిగున్నాయి. జయంత్ పక్కకి తిప్పిన మెడ అలాగే వుంచి (ఇటు తిప్పితే పక్కాయనతో మాట్లాడాల్సొస్తుందని) కళ్ళు తెరిచి, రెండు చేతులు గుండెకు హత్తుకునేలా ముడుచుకుని, కాళ్ళని చాపుకుని హాయిగా కలలలోకి జారుకున్నాడు. ఈ సంవత్సరం సేల్స్ ఇంకా బాగా చేస్తే సింగపూర్ పోస్టింగ్ ఇప్పిస్తాననని తన బాస్ వూరించాడు. అంత టైమూ, సహనం లేవు జయన్తకి. దాన్ని ఆర్నెల్లలో సాధించడం ఎలా అని మనసులో ప్రణాళికలు వేస్తున్నాడు.

టేక్ ఆఫ్ అయిన పదినిమిషాలకి లోపల లైట్లు మరల పెంచి... ఎయిర్ హోస్టస్సు కొంచెం పెట్టుడు నవ్వుతో శీతల, ఉష్ణ పానీయాలు అందిస్తున్నారు. ట్రాలీ రెండు మూడు వరుసలు కదిలింది. ఫ్లయిటు వెనకభాగాన చిన్నపిల్ల కేరింతలు వినపడుతున్నాయి.

"వైజాక్కా బాబు?" మాటకలిపారు పెద్దాయన.

భవిష్యత్తు అనే మత్తైనకల కంటోంటే ఈ డిస్టర్బన్స్ అఫ్ ఇండియా ఏంటని కొంచెం చిరాకుతో

"అవునండి" అని పొడిగా సమాధానం యిచ్చాడు జయంత్

"మలేషియా ఉంటావా?" అడిగారు మళ్ళీ పెద్దాయన.

"అవునండీ. ఇక్కడ ఐ.టి కంపెనీ లో బిజినెస్ మానేజర్ని" సమాధానమిచ్చాడు జయంత్ కొంచెం దర్పంగా.

"మీరు మీ పిల్లల్ని కలవడానికి వచ్చారా ఇక్కడికి?" అడిగాడు జయంత్ తానుకూడా అడక్కపోతే బాగుండదని.

"లేదు బాబు. నేను ఆసియాలో పెద్ద కంపెనీలకి అప్పుడప్పుడు కన్సల్టింగ్ చేస్తూ ఉంటాను. అదే పని మీద మలేషియా వచ్చాను" అని తాపీగా సమాధానం ఇచ్చాడు పెద్దాయన.

"ఓహ్, దట్ ఇస్ నైస్" అన్నాడు జయంత్ అవాక్కయి. రెట్టించిన గౌరవంతో ఆయనకి తన ఉద్యోగం గురించి, వృత్తిలో తన విజయాలు, ఆశయాలను ఆయనకి సుదీర్ఘంగా వివరించాడు.

ఆయన అంతా ఒప్పిగ్గా విని "నీ ఎనర్జీ, అంబిషన్ బాగున్నాయి. నాకు నా చిన్నతనం గుర్తొచ్చింది. గో ఫర్ యువర్ డ్రీమ్స్. దేనినీ నీ లక్ష్యానికి అడ్డురానివ్వకు. విష్ యు అల్ ది బెస్ట్ యంగ్మేన్" అని బోధచేసి పెద్దాయన న్యూస్పేపర్ చేతబట్టారు.

"థాంక్స్" అని పొంగిపోయాడు జయంత్ ఆ పొగడ్తకి. కళ్ళుమూసుకొని భవిష్యత్ కలల బగీచాలో మళ్ళీ విహారం కొనసాగించాడు. వైజాగ్లో ఫ్రెండ్స్ తనని చూసి ఏమంటారో? తన పాత బాస్ ని ఒకసారి కలవాలి.. ఆయన సింగపూర్ ఆపిసుకి సిఫార్సు చేస్తే పని కాస్త తొందరగా అవుతుంది.. పెళ్ళికి మలేషియా ఔట్లెట్ మాల్లో కొన్న మార్క్ అండ్ స్పెన్సర్ స్లిమ్ ఫిట్ సూట్ వేసుకెళ్తే టిప్-టాప్గా వుంటా... ఇలా పరుపరు విధాలా మనసు విమానం కన్నా వేగంగా దౌడు తీస్తోంది.

హఠాత్తుగా విమానం ఒక చిన్న కుదుపు కుదిపింది. “టింగ్” అని పైన సీటుబెల్ట్ సైను చప్పుడు చేసింది. కొందరు వేసుకున్న సీట్ బెల్టునే మళ్ళీ సర్దుకున్నారు. జలపాన సేవ యధావిధిగా కొనసాగుతోంది... ఒక నిమిషానికి మళ్ళీ కుదుపు.. ఈసారి కొంచెం భారీగా వచ్చింది. అందరూ సీటుబెల్టు బిగించారు. స్టీవార్డ్లు వాకీ-టాకీలో గుసగుసలాడుకుని ట్రాలీలు వెనక్కి తీసుకువెళ్లారు. జయంత్ కిటికీలోంచి బయటకి చూసాడు.. అంతా కారు చీకటి. విమానం రెక్క మీద చిన్న లైటు తప్ప. ఆ లైటులో మసకగా మేఘాల దొంతర్లు అపసవ్యదిశగా ఏదో అర్జెంటు సందేశం మోసుకెళ్తున్నట్టుగా హడావిడిగా పల్టీలు కొడుతూ దొర్లుకుపోతున్నాయి.

ఫోన్లో ఇంగ్లీష్ పాటలు బోరుకొట్టి .. తనకి చిన్నప్పటినుండీ ఇష్టమైన పాత తెలుగు పాటలు పెట్టుకుని కాళ్ళు దగ్గరకు లాక్కుని కూర్చున్నాడు. ఈసారి మహా పెద్ద కుదుపు.. కంకరరోడ్డు మీద వెళ్లినట్టు విమానం గడగడలాడింది... అంత మెత్తగా కనపడే మబ్బులు ఇంత విమానాన్ని ఎలా ఊపేస్తున్నాయా అని ఆశ్చర్యపోయాడు జయంత్.

కుదుపు తగ్గలేదు. కొంచెం హైరానా పడ్డాడు జయంత్. మొదటిసారిగా తలతిప్పి తోటి ప్రయాణికుల వైపు దృష్టి సారించాడు.. పక్కన పెద్దాయన కళ్ళుమూసుకున్నారు. కొంతమంది బిత్తర చూపులు చూస్తూ శ్వాస ఎగపీలుస్తున్నారు. మరికొందరు వారి ముందుసీట్లని రెండు చేతులు చాపి పట్టుకున్నారు. నాలుగైదు సీట్ల ఆ కేరింతల పసిపిల్ల ఇప్పుడు ఏడుస్తోంది. జయంత్ సీటుబెల్ట్ కొంచెం లూస్ చేసుకొని చేతులమీద బరువు ఆనించి సగం నిల్చుని ఎయిర్ హోస్టెస్ వంక చూసాడు. ఆమె కూడా కొంచెం టెన్షన్ మొహంతో కళ్ళు మూసుకుంది.

“టింగ్” మని మళ్ళీ నెత్తిమీద లైటు బిళ్ళ మోగడంతో ఉలిక్కిపడి సీట్లో చతికిలపడ్డాడు. వాతావరణం బాగోని కారణంగా heavy turbulence (విపరీతమైన కుదుపులు) వుంటుందని పైలట్ హెచ్చరిస్తునేవున్నాడు యింతలో మరో పెద్ద కుదుపు.... ఒక ప్రయాణికుడు పట్టలేక గట్టిగా కేకపెట్టాడు. ఈసారి జయంత్ గుండె వేగంగా కొట్టుకోసాగింది. మ్యూజిక్ ఆపి కిటికీ బయటకి చూసాడు.. ఏమి చెయ్యాలో తోచలేదు. విమానం ఒక పక్కకి ఒరిగింది. గుండె ఝల్లుమంది. ఒకవేళ విమానం కూలిపోతే? ముప్పైవేల అడుగుల నుండి కింద

పడితే బతికే ఛాన్స్ వుందా? కింద సముద్రంవుందో నేలవుందో. నీరు అయితే విమానం నిప్పంటుకోదు కానీ ఊపిరిఆడక ఉక్కిరిబిక్కిరైపోతాం. ఏదైనా చావుతప్పేటట్టులేదు. ఇలా మనసు కీడు శంకించింది. గొంతు తడారిపోయింది.

మొదట మనసులో ఇష్ట దేవుళ్ళకందరికి మొక్కాడు.. ఒక కొబ్బరి కాయతో మొదలుపెట్టి.. కుదుపుకో రెండు పెంచి.. ఇక లాభం లేదని.. అన్నదానం మొక్కుకున్నాడు.. ఐన.. కుదుపులు తగ్గలేదు.. కొద్దిసేపటికి పురుహూతికా అమ్మవారికి పట్టుచీర పెడతానని, పాదగయలో స్నానం చేస్తానని, తిరిగి వచ్చి మలేషియాలో బాటు కేవ్స్ మురుగన్ గుడికి నడిచి ఎక్కుతానని.. ఎడ తెగకుండా మొక్కులు పెట్టాడు... పది నిమిషాలు గడిచాయి. యుగంలా అనిపించింది. పరిస్థితి ఏమి మారలేదు.

మళ్ళీ పైలట్ అనౌన్స్ చేసాడు.. వాతావరణం బాగోలేని కారణంగా దగ్గర్లో కుదిరిన చోట ఎమర్జెన్సీ ల్యాండ్ చేసే అవకాశం వుందని, కంట్రోల్ రూమ్ తో సంభాషిస్తున్నారని.. ఒక పది నిమిషాలలో ఏ విషయం చెప్తామని తెలియచేసాడు.. విమానంలో కోలాహలం బయలుదేరింది.. కొంతమంది ఏడుపులు మరికొంతమంది పెడబొబ్బలు మొదలుపెట్టారు. ఒకరిద్దరు నిల్చుని అత్యవసర ద్వారం తీయమని గదమాయించారు. వైమానిక సిబ్బంది అందరినీ కూర్చోమని వేడుకున్నారు. కెప్టెన్ మెసేజ్ కోసం వేచివుండమని విన్నవించుకున్నారు.

ఇదంతా చూస్తున్న జయంత్.. అత్యవసర ద్వారం పామ్ప్లెట్ తీసి పరధ్యానంగా చదువుతుంటే కళ్ళు రెండూ కన్నీటి పర్యంతం అయ్యాయి. అంతా అయిపోయింది అనుకున్నాడు. ఏమి చేయలేని అసహాయ స్థితి. విచిత్రంగా మనసంతా ఒక రకమైన ప్రశాంతత. మెల్లగా వెన్నక్కి వాలి కళ్ళుమూసుకుని దీర్ఘంగా గాలి పీల్చాడు.. కంటిముందు నాన్న మెదిలారు. అయన ఒక సాదాసీదా రైతు. మాట కటువైనా ప్రేమాభిమానాల్లో కొంచెం పాతకాలం మనిషి. ఆయనతో సరిగ్గా మాట్లాడి దాదాపు సంవత్సరం దాటింది. ఆఖరిసారి ఇంట్లో నాన్నతో జరిగిన వాదన తలపుకొచ్చింది.

"ఈ కాలంలో ప్రతి ఒక్కడూ ఫారెన్ వెళ్తున్నాడు. ఇక్కడ ఉండడమే గొప్ప" అన్నాడు కొడుకు మలేషియా పోస్టింగ్ వార్త విని.

"నాన్నా.. ఇక్కడ వుంటే ఎదుగుదల అంత వేగంగా వుండదు, నాలుగైదేళ్లు ప్రపంచం చూసొస్తా" అన్నాడు జయంత్ కొంచెం నొచ్చుకొంటూ.

"అక్కడ ఉన్నది ఇక్కడ లేనిది ఏమి లేదు. పైగా మలేషియా మన కన్నా చిన్నది వెనకపడినది. మా దగ్గరే ఉండు ఇంటిపట్టున. వెళ్లి ఉద్ధరించేదేమీ లేదు" తనదైన శైలిలో వారించాడు ఆఖరి ప్రయత్నంగా జయంత్ నాన్న.

"నాన్నా నా బ్రతుకు నా ఇష్టం. నేను వెడతాను" అని విసురుగా సమాధానం యిచ్చి అక్కనుండి బయలుదేరాడు.

దాని తర్వాత ఎలా ఉన్నారని పొడిమాటలు తప్ప వేరే సంభాషణలు జరగలేదు. మనసు చివుక్కుమంది గతాన్ని తల్చుకుని. నాన్నకి క్షమాపణ చెప్పాలని విలవిలలాడింది. కానీ ఎలా ఇప్పుడు?

తన చిన్ననాటి స్నేహితులు జగ్గూ, శ్రీనివాస్లతో టైం కుదరక మలేషియా వచ్చేక మాట్లాడలేదు అప్పుడప్పుడు వాట్సాప్ ఫార్వార్డులు తప్ప... తరవాత మాట్లాడచ్చులే మనవాళ్లే కదా అని. తానూ మలేషియా వెళుతున్నాడంటే అందరి కన్నా సంతోషించింది వాళ్ళే. "ఒరేయ్ ఈ. వి.వి సినిమాలు అక్కడ చాలా తీసాడు. నువ్వు సర్దుకున్నాక మేము వస్తాం. మలేషియా అంతా దున్నేద్దామ్" అన్న జగ్గు మాటలు గుర్తొచ్చాయి. మునపటిలాగా ఒకసారి వాళ్లతో ఒక సినిమాకెళితే బాగుణ్ణనిపించింది.

తానిప్పుడు పోతే.. ఆ డబ్బంతా మలేషియా అకౌంట్లోనే పడుంటుంది.. కొంచెం దానమైనా చేసుండాల్సింది అని బాధపడ్డాడు. అమ్మ నాన్నకి అకౌంట్ పాస్వర్డ్ ఎలా చెప్పడం? ఈ రెండేళ్లు వృధాయేనా?

మ్యూజిక్ అంటే అమితమైన ప్రీతి జయంత్ కి. ఎప్పుడో ఒక్కప్పుడు సంగీతం నేర్చుకొని సొంతగా పాడాలనుకున్నాడు. సమయం చిక్కలేదు. సక్సెస్, డబ్బు వస్తే మిగితావి వాటంతటవే వస్తాయి అని నమ్మేడు. అవి చిన్నవయసులో వస్తే మరీమంచిది. పరిగెత్తే సమయంలో ఆగితే జరగదని సమర్ధించుకునేవాడు. కానీ ఇప్పుడు అనుకోని విధంగా మృత్యువుతో ముఖాముఖిన ఆ పరుగుకి అర్థం కనపడలేదు. ఈ కాస్త ప్రయాణంలో ఆనందం కన్నా బడలిక ఎక్కువ కనపడింది. "గత పదేళ్ల నిరంతర పరుగులో జీవితంలో పొందినది పెద్దగా లేదా? మనిషి తుది సమయంలో చింత లేకుండా ఉండాలంటే జీవితాన్ని ఎలా గడపాలి? తుది సమయం ఎప్పుడొస్తుందో ఎలా తెలుస్తుంది మనకి?" ఈ ఆలోచనల్తో, అలసటతో ఎంతసేపయ్యిందో తెలియదు.. మళ్ళీ "టింగ్" అని మ్రోగడంతో అందరూ ఉత్కంఠతో వినసాగారు. మరొక రెండు మూడు నిమిషాలలో మబ్బులు తేలికవుతాయని, వాతావరణం శాంతించడం వలన ఎమర్జెన్సీ లాండింగ్ ప్లాన్ మాని ప్రయాణాన్ని కొనసాగిస్తున్నామని పైలట్ ప్రకటించాడు.

" అమ్మయ్య " అని నిట్టూర్చాడు. మనసులో భగవంతునికి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు జయంత్. ప్రయాణికులందరి మొహాల్లోనూ ఒక పెద్ద రిలీఫ్.

వైజాగ్లో ల్యాండ్ అయినతరువాత పితాపురం తన ఇంటికి వెడుతూ ఏ మొక్కు వల్ల ఈ గండం గట్టెకిందో అని ఒక క్షణం ఆలోచించి.. మొక్కులకన్నా ముందు.. తాను బతికి బట్టకడితే చేయాలనుకున్న జాబితా మనసులో నెమరేసుకున్నాడు జయంత్.

ఇంటికి వెళ్లిన వెంటనే తన నాన్నని గట్టిగా కౌగలించుకుని సారి చెప్పి.. అమ్మ చేతి వంటతిని మనసు స్థిమిత పడ్డాడు. ఆ రోజంతా అమ్మనాన్నతోనే గడిపాడు. "మలేసియాలో మన భోజనం దొరుకుతుందిరా? అక్కడ వాళ్లు ఏమి తింటారు?" అని అమాయకంగా అడిగింది అమ్మ.

"ఇంకేం తింటారు? కప్పలూ అవీ తింటారు" అన్నాడు జయంత్ నాన్న అన్నీ తెలిసినట్టు. "అందుకే ఇక్కడే మన దేశంలోవుంటే మనకీ హాయి, వాడికీ ఇబ్బందుండదు" చేర్చాడు ఒక నిమిషం ఆగి.

మళ్ళీ నాన్నతో వాదనొద్దనుకుని చిన్నగా నవ్వి కాదన్నట్టు తలూపాడు. సాయంత్రం గుడికి వెళ్లి అమ్మవారికి దణ్ణంపెట్టుకొని అమ్మకి మిగితా మొక్కుల గురించి చెప్పి గుర్తుపెట్టుకోమన్నాడు.

మరునాడు నాన్నకి జాగ్రత్తలు చెప్పి, ఆరోగ్యం కుదుటపడ్డాక ఒకసారి మలేషియా తీసుకువెడతానని చెప్పి, అమ్మతో వైజాగ్ పెళ్ళికి బయలుదేరాడు జయంత్. పెళ్ళిలో అనుకున్నట్టుగానే తానే హైలైటు. రెండేళ్ల తరువాత వచ్చాడేమో అందరూ అతని చుట్టూమూగి కొండత ఎత్తేసారు. కొంతమంది ఒళ్ళుచేసావని, చిక్కావని రంగొచ్చావని ఇలా రకరకాల అభిప్రాయాలు గుమ్మరించారు. ఆడపిల్ల ఉన్నవారు కొంత మంది అతన్ని గురించి వాకబు చేశారు. చిన్న పిల్లలున్నవారు అతన్ని చూపించి మావయ్యలగా ఫారెన్ వెళ్ళు, బాబయ్యలా పేరుతెచ్చుకో అని చెప్తే జయంత్ ఉప్పొంగి పోయాడు. ఇదంతా తనకి ఎంతో ఆనందాన్ని ఇచ్చింది.

వైజాగ్లో మర్నాడు సాయంత్రమే తిరుగు ప్రయాణము. జగ్గు శ్రీనూల విషయం గుర్తుంది కానీ మర్నాడే లేచి తన వైజాగ్ బాస్ని లంచికి కలిసాడు. అది ఇదీ మాట్లాడి తన సింగపూర్ విషయం చెప్పాడు. సాయంత్రం అమ్మకి వీడ్కోలు చెప్పి ఎయిర్పోర్టుకి బయలుదేరాడు. దారిలో తన స్నేహితుల గురించి మళ్ళీ గుర్తొచ్చింది కానీ.. ఫ్లైట్లో పెద్దాయన చెప్పిన మాటలు తన బుర్రలో రెసొండ్తో మెదిలాయి. "నిన్ను చూస్తే నాకు నా చిన్నతనం జ్ఞాపకం వస్తోంది. పరిగెత్తాల్సిన వయసు ఇదే. గో ఫర్ ఇట్ అని"..

"ఈ వయసులో కాకోపోతే ఎప్పుడు? ఒక రెండుమూడేళ్ల తరువాత చూద్దాం మిగితావి. కెరీర్, సక్సెస్ ముఖ్యం ఈ దశలో" అని సర్దిచెప్పుకుని హెడ్డుఫోన్స్ లో coldplay పాటలు పెట్టుకుని సింగపూర్ కలల బగీచాలో విహరించాడు.

టాక్సీ F.M రేడియోలో... "అంతా మాయ.. అంతా ఛాయా" అని పాట మ్రోగుతోంది శ్రోతల కోరిక మీద.

## కుక్కలరాజుగారి కత — కృపాకర్ పోతుల

తెలతెలవారుతోంది. బాలభానుని నునులేతకిరణాలు పృధివిమీద మెత్తగా పరచుకుంటున్నాయి. చలికాలం నిష్క్రమిస్తూ, వసంతం తొంగిచూసే సంధికాలం కావడంతో ఆ ఉదయకాల వాతావరణం కాస్త చల్లగా ఉన్నా హాయిగా, ప్రశాంతంగా ఉంది.

అంతటి ఆహ్లాదకరమైన ప్రభాతసమయాన, అరెకరం స్థలంలో కట్టబడ్డ రాజభవనంలాంటి బంగళాలో, ఏసీ బెడ్రూములో, కింగ్ సైజు మంచం పైన చిరునవ్వులుచిందిస్తూ కళ్ళుతెరిచారు "రాజావారు". కళ్ళుతెరిచిన వెంటనే అలవాటుగా ప్రక్కనే ఎప్పుడూఉండే తనమనవరాలు 'స్వీటీ' ఫోటోని ప్రేమగా ముద్దుపెట్టుకొని, పాతికేళ్ళకుర్రాడిలా చెంగుమంటూ మంచందిగారు. మంచంపక్కనే, వాల్ టు వాల్ కార్పెట్ మీద వెచ్చగా ముడుచుకొని పడుకున్న తన ముద్దుల 'స్నూపీ'ని...దానికి ఏమాత్రం నిద్రాభంగం కాకుండా...అరచేతితో సున్నితంగా నిమిరి, ఆచేతిని చిన్నగా ముద్దుపెట్టుకొని "ఎంత ప్రేమో నేనంటే పిచ్చిముండకి. దాని బెడ్ ఉన్నా, నామంచందగ్గరే పడుకుంటుంది ఏకాలంలో అయినా" అని ఫీలయ్యారు సెంటిమెంటల్గా.

తరవాత చిరునవ్వు మొహంమీద తాండవిస్తుండగా 'ఆల్ గ్లాస్ ఫ్రెంచ్ విండోస్' ని కప్పిఉంచిన కర్టెన్స్ తొలగించి ఉదయిస్తున్న సూర్యునీ, వికసిస్తున్న అందమైన గులాబీలనీ, వాటిమీద ఎగురుతున్న రంగురంగుల సీతాకోకచిలుకల్నీ తన్మయత్వంతో తిలకించి ఆనందపరవశులయేరు. ఇంతలో వారు లేచిన అలికిడి విన్న స్నూపీ, తనుకూడా నిద్రలేచి, రాజావారి పాదాలను ముద్దుపెట్టుకుంది ఆనందంగా తోక ఊపుకుంటూ. స్నూపీని చేతుల్లోకి తీసుకొని, హృదయానికి హత్తుకున్నారు రాజావారు ప్రేమగా.

--00--

రాజావారి అసలు పేరు 'రాజావారు' కాదు. వారు ఏ రాజ్యానికీ రాజు కారు. కాని అనేక మంది చిన్నచిన్న దేశాధినేతల్ని అసూయకు గురిచేసేటటువంటి పెద్ద వ్యాపారసామ్రాజ్యానికి అధినేత వారు. దేశంలో విపరీతమైన బూమ్ లో ఉన్న రియల్ ఎస్టేట్ రంగానికి రాజావారే రారాజు. ప్రైవేటు రంగంలో దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ కీ, రెండు హైలీ రెప్యూటెడ్ ఫార్మా కంపెనీలకీ ఆయనే అధిపతి. రాష్ట్రంలో ప్రతీ నగరంలోనూ ఉన్న మాల్స్ లో మల్టీప్లెక్స్ ల్లో సింహభాగం రాజావారివే. దేశవిదేశాల్లో లెక్కలేనన్ని భారీఆనకట్టలూ, పెద్దపెద్ద విమానాశ్రయాలూ, గొప్పగొప్ప రహదారులూ నిర్మించిన కన్స్ట్రక్షన్ కంపెనీలు, మూడు, అవికూడా రాజావారివే. అంతేకాకుండా, పార్టీలకు అతీతంగా దేశంలోని రాజకీయనాయకులు అనేకమంది ఆయనకు అత్యంతఆప్తులూ, మిత్రులూ కూడా. టు కట్ ద లాంగ్ స్టోరీ షార్ట్ .....రాష్ట్రంలో జరిగే ఏ రాజకీయ, వ్యాపారవ్యవహారంగాని రాజావారి అధ్వనిత అంగీకారంలేకుండా జరగదనేది నిర్వివాదాంశం. అట్టి 'వీరభోగవసంతరాయల' వారిని (ఇది రాజావారి అసలుపేరు) యావన్మందీ 'రాజావారు' అనే పిలవడంలో ఆశ్చర్యం ఏముంది?

రాజావారిది మొట్టమొదటి నుండీ కూడా సుసంపన్నమైన కుటుంబమే. అంబానీల్లాగ మధ్యంతరంగా వచ్చిపడిన నడమంత్రపుసిరి కాదు వారిది. రాజావారి ముత్తాతగారు అప్పటి ప్రభువులైన ఆంగ్లేయులకి కళ్ళూచెవులూ ముక్కూమూతీ అన్నీ తానే అయి వ్యవహరించేవారట. దానితో, వారి ప్రభుభక్తికి పులకించిన దొరతనంవారు వందలఎకరాలు ఈనాంగా ధారధత్తం చేయడం మాత్రమేకాక అనేకమైన బిరుదులుకూడా ప్రధానంగావించి ఆయన్ని సత్కరించారట. ఆరోజుల్లో అటు హైదరాబాదు నవాబూ, ఇటు విజయనగరం మహారాజూ తప్ప, రాజావారి ముత్తాతగారికంటే గొప్పవారెవరూ మన తెలుగుగడ్డమీద లేనేలేరట.

ముత్తాతగారు దేశసేవ ద్వారా సంపాదించిన వందల ఎకరాల్లో కొన్ని పదులు మాత్రం సొమ్ముగామార్చిన వారి తాతగారు, ఆసొమ్ముని వ్యాపార పారిశ్రామికరంగాల్లో చాలా డిలిజెంటుగానూ, జుడీషియస్ గానూ పెట్టుబడిపెట్టడంతో వారిసంపద ఇబ్బడిముబ్బడిగా పెరగడంమాత్రమేకాక రాష్ట్రంలోనే అతిముఖ్యమైన వ్యక్తులలో ఒకరిగా వారిని నిలబెట్టింది. ఇక రాజావారి నాన్నగారి దగ్గరకి వస్తే, వారికి సంక్రమించిన ఆస్తుల్నీ, వ్యాపారాల్నీ, పరిశ్రమల్నీ జాగ్రత్తగా కాపాడుకుంటూ, వాటిని కన్సాలిడేట్ చేసుకోవడంతప్ప వేరేపని లేకుండాపోయిందట ఆయనకి.

సో....ద లాంగ్ అండ్ షార్ట్ ఆఫ్ ద స్టోరీ ఈజ్ .....రాజావారు పుట్టడమే ఏదో సామెత చెప్పినట్టు "నోట్లో వెండి గరిటతో కాక బంగారు గరిటతోనే" పుట్టారనేది జగమెరిగిన సత్యం. వారి స్థాయికి తగ్గట్టుగానే రాజావారి చదువుసంధ్యలు....ద బెస్ట్ స్కూల్స్ ఇన్ ఇండియా అండ్ ఎబ్రాడ్లోనే జరిగాయి. చదువుపూర్తిచేసుకున్న రాజావారు ఫారిన్ నుండి తిరిగివచ్చాక నలభైసంవత్సరాలపాటూ తన వ్యాపారసామ్రాజ్యాన్ని బహుముఖంగా విస్తరింపజేసేరు. వ్యాపార పారిశ్రామికరంగాల్లో మేరుపర్వతంలా అత్యున్నతంగా ఎదిగేరు.

అయితే ఎంత ఎత్తుకి ఎదిగినా, తాతతండ్రులు నడిచిన బాటలోనే నడుస్తూ, రాజావారుకూడా ప్రత్యక్షరాజకీయాల జోలికిపోయే పనిమాత్రం ఎన్నడూ చెయ్యలేదు. "బుద్ధున్న వ్యాపారవేత్తెవడూ రాజకీయాలజోలికి పోకూడదండీ. రాజు మనవాడై మనంచెప్పినట్టు నడుచుకోవాలి. అంతే. దానికి ఎంత ఖర్చైనా ఎడంచేత్తో పారెద్దాం. సింహాసనంమీద మనవాడే సర్వకాల సర్వావస్థలలోనూ ఉండేటట్టు చూసుకుందాం. అంతేగాని మననెత్తికి రాసుకోవడమెందుకండీ ఆ రొచ్చూ రొష్టూను" అంటారు రాజావారు తన ఆంతరంగిక మిత్రులతో ఇంగ్లీషులో.

--00--

అటువంటి డాషింగ్, డేరింగ్, డైనమైట్ లాంటి రాజావారు అరవైఐదేళ్ళ వయసువచ్చేసరికి తమ సామ్రాజ్యాన్ని కూతురుకీ అల్లుడికీ అప్పగించి, శేషజీవితాన్ని సమాజశ్రేయస్సు కొరకు వెచ్చించి, ఒక కొత్తఒరవడికి శ్రీకారంచుట్టాలనుకున్నారు. అన్ని విషయాలలోవలే ఆవిషయంలోకూడా సహధర్మచారిణి అయిన రాణీవారితోనూ ఒకరిద్దరు ఆంతరంగిక మిత్రులతోనూ నిశితంగా చర్చించి, ఒక నిర్ణయానికి వచ్చారు.

--00--

రాజావారి పదవీవిరమణ మహోత్సవం నగరంలో అత్యంతఖరీదైన హోటల్లో అంగరంగవైభోగంగా జరిగింది. దానికి దేశంలోని రాజకీయ, పారిశ్రామిక వ్యాపార సినీరంగ ప్రముఖులతో పాటూ పాత్రికేయులుకూడా అనేక మంది ఆహ్వానించబడ్డారు. బ్రహ్మాండమైన విందు ఇవ్వబడినది. ఆ విందులో విదేశీమద్యం ఏరులైపారింది. వడ్డించబడిన వంటకాలకు లెక్కేలేదు. ఆహూతులందరూ తనివితీరా తాగి, తృప్తిగా తిన్న తరవాత పాత్రికేయులతో రాజావారి ఇష్టాగోష్టికార్యక్రమం జరిగింది. అందులో ప్రకటించారు రాజావారు తమ నిర్ణయాన్ని. అది విన్న ఆహూతులందరూ దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఒక ప్రముఖ తెలుగుపత్రికా విలేఖరి

“సర్ మనదేశంలో దారిద్ర్యరేఖకు దిగువనజీవించే నిర్భాగ్యులు అనేకమంది ఉండగా, మీరు ‘మానవసేవ’ కాకుండా ‘జంతుసేవ’ అందునా వీధిశునకాలకు సేవచేసే కార్యక్రమాన్ని చేపట్టబోతునారు. అందుకు ప్రత్యేకమైన కారణం ఏమైనా ఉందా” అని మెలికలు తిరుగుతూ, రాజావారిని స్టైల్ గా ప్రశ్నించింది.

ఆ ప్రశ్నవిన్నరాజావారు చిరునవ్వు నవ్వు నవ్వేరు. అక్కడున్న అందరివేపూ కాస్త కాండెసెండింగా చూసేరు. పిమ్మట “నా బాధ్యతలను త్యజించిన తరవాత ఏంచేయాలో నిర్ణయిం తీసుకునేముందు మన దేశంలోని ప్రముఖసంస్థతో సర్వే ఒకటి చెయ్యించాను. దానిద్వారా తెలుసుకున్న విషయం ఏంటంటే, పేదప్రజలకు సేవ చెయ్యడానికి ప్రభుత్వంఉంది. లెక్కకుమించిన స్వచ్ఛందసంస్థలున్నాయి గాని...దిక్కులేని వీధికుక్కలను సంరక్షించడానికి అటువంటి సంస్థలేవీ లేవని. అది తెలుసుకున్న తరవాత వీధికుక్కలను నిశితంగా గమనించడం మొదలుపెట్టాను. అవి ఎంత దిక్కులేని, దయనీయజీవితాన్ని గడుపున్నాయో గ్రహించేను. అందుకే నా శేషజీవితాన్ని వీధికుక్కల సేవకి అంకితం చేసుకుంటున్నాను” అంటూ భావావేశపూరితంగా ప్రకటించి సమావేశాన్ని ముగించేరు.

ఆయనకు తెలుసో లేదో గాని....మరుసటిరోజు నుండీ ఆ ఊరిప్రజలు రాజావారిని “కుక్కలరాజుగారు” అని కూడా ప్రేమగా పిలుచుకోసాగారు.

--00--

ఎందుకో ఈరోజు ఉదయాన్నే, ఐదువేల డాలర్లు వెచ్చించి స్విట్జర్లాండ్ నుండి దిగుమతిచేసుకున్న పింగాణీబొమ్మలాంటి జాతికుక్క, 'స్నూపీ'ని ముద్దులాడుతున్న రాజావారికి ఆవిషయం అంతా అప్రయత్నంగా గుర్తొచ్చింది. గడిచిన రెండుసంవత్సరాలలో తనకై తను నిర్దేశించుకున్న కారుణికమైన కార్యాన్ని, జయప్రదంగా ఎంతవరకూ నిర్వర్తించగలిగారో సింహావలోకనం చేసుకొని, తృప్తిగా తలపంకించేరు వారు.

--00--

టైం ఏడుగంటలు కావచ్చింది. "గాడ్! ఇట్స్ ఆల్రెడీ సెవెన్!! ఐ షల్ బీ లేట్ ఫర్ మై గేమ్ ఆఫ్ టెన్నిస్" అనుకుంటూ హడావిడిగా తయారై, రేకెట్ తీసుకొని బయలుదేరారు క్లబ్ కి. చెమటలుకారేలా టెన్నిస్ ఆడి, అక్కడే 'హెల్త్ డ్రింక్' (సాయంత్రం ఏడు దాటితేగాని హాట్ డ్రింక్స్ టచ్ చెయ్యరు రాజావారు) సేవించి, ఇంటికి బయలుదేరారు. ముందురోజు రాత్రే వారి పియ్యే రాజావారికి తెలియజేసిఉన్నాడు 'రేపు ఉదయం పదకొండుగంటలకు ఊరవతల మురికివాడలో ఊరకుక్కలకి కుక్కబిస్కెట్లు తినిపించే కార్యక్రమం ఉందనీ, దానికి రాజావారే ప్రారంభోత్సవం చెయ్యాల్సిఉందనీ'ని. "ఐ మస్ట్ స్టార్ట్ బై టెన్. అదర్వైజ్ ఐ షల్ బీ లేట్ ఫర్ ద ఇనాగ్యురేషన్" అనుకున్నారు రాజావారు తన "జాగ్వార్ ఎఫ్-పేస్" కారులో కూర్చుంటూ.

నగరంలో ట్రాఫిక్ నెమ్మదిగా వేగం పుంజుకుంటోది. వెనకసీటులో విశ్రాంతిగా వాలికూర్చొని, పరిసరాలను నిరాసక్తంగా పరికిస్తున్న రాజావారు ఒక్క ఉదుటున లేచి కూర్చున్నారు ఆందోళనగా. కొన్ని క్షణాల్లోనే ఆయన మొహంలో ఆందోళన ఆగ్రహంగా మార్పుచెందడం, "స్టాప్ ద బ్లడీ కార్" అని వారు గర్జించడం ఏకకాలంలో జరిగేయి. ఆగిన కారులోనుంచి ఒక్క ఉదుటున బయటకు దూకి, 'జాగ్వార్'లా దూసుకుపోతున్న రాజావారు ఎక్కడికి వెళ్తున్నారో, ఎందుకు వెళ్తున్నారో అర్ధంకాని డ్రైవరు వారిని అనుసరించేదు తత్తరపాటుతో. ఉద్రేకంగా ఉరుకుతూపోయిన రాజావారు పక్కనే నిర్మాణంలో ఉన్న ఒక బహుళఅంతుస్తుల భవంతిదగ్గర ఆగారు.

ఆ భవనం చుట్టుపక్కలంతా, అక్కడ పనిచేస్తున్న ప్రవాసకూలీల కొరకు నిర్మించబడిన మురికిరేకులషెడ్లతో, మురికినీటి గుంతలతో, వాటిలో పొర్లాడుతున్న మురికిపందులతో, ఆ మురికిలోనే పురుగులు ఏరుకుతింటున్న మురికికోళ్ళతో, వాటి రెట్టలతో, మురికిమురికిగా ఉంది. అక్కడున్న పిల్లలందరూ మురికిగా మాత్రమేకాకుండా, ఆకలితో నీర్సంగా కూడా ఉన్నట్టున్నారు. వాటిలో ఒక షెడ్డుముందు ఆగారు రాజావారు 'కింగ్ కోబ్రాలా' బుసలు కొడుతూ.

ఆ షెడ్ బయట పాతిపెట్టబడి ఉన్న గుంజకి ఊరకుక్క ఒకటి బంధించబడి ఉంది. డొక్కలు వీపుకంటుకుపోయిన అరవైఏళ్లమనిషొకడు...అతను నలభైఏళ్లవాడుకూడా కావచ్చు....ఆ కుక్కని చిన్నకర్రతో కొడుతున్నాడు. అతను కొడుతున్న దెబ్బలు ఎంతగట్టిగా తగులుతున్నాయోగాని ఆ కుక్కమాత్రం కుయ్యోమొర్రోమంటూ, మహగట్టిగా ప్రలాపిస్తోంది. ఆ దారుణమైన దృశ్యాన్ని చూసిన రాజావారు అగ్నిపర్వతంలా బద్దలైతే, వారి కోపం మరుగుతున్న లావాలా పైకి ఎగజిమ్మింది. ఆ బక్కమనిషి చేతిలోని కర్ర విసురుగా లాక్కొని, వాడిని ప్రక్కకు ఒక్కతోపు తోసి, అదే ఊపులో కుక్కను బంధవిముక్తురాల్ని చేసారు రాజావారు. రాజావారు తోసిన తోపుకి తూలిపడిన బక్కమనిషి నీరసంగా లేచి నిలుచున్నంతలో మిగిలిన జనం బిలబిలమంటూ ఆయనచుట్టూ గుమిగూడారు. గుమిగూడారేగాని, రాజావారి స్ఫురద్రూపాన్నీ, దర్జానీ చూసి మాట్లాడడానికి కొంచెం జంకేరు. ఇంతలో మధ్యవయస్కుడొకడు...వాళ్ళనాయకుడిలా ఉన్నాడు....జనాల్ని తప్పించుకొని ముందుకువచ్చి

“ఎవరండీ మీరు. మావోడేటి చేసేడని అలా తోసీసేరాడ్ని” అని ప్రశ్నించేడు.

”వాడు మనిషా పశువా. కొంచెమైనా కంపేషన్ ఉందా రాస్కెల్ కి. ఇన్నోసెంట్ క్రీచర్...దాన్నలా కొడతాడా. అలాంటి స్కౌండ్రల్స్ ని తొయ్యడం కాదు, నడిరోడ్డుమీద షూట్ చేసెయ్యాలి” గాండ్రించేరు రాజావారు రేగిన పులిలా.

రాజావారి కోపాన్ని చూసి నాయకుడు కూడా కాస్త భయపడినట్టున్నాడు “ఏరా ఎంకటీ బేపి (కుక్క) నెందుక్కొట్టేవు?” అని ప్రశ్నించాడు

“పెతీరోజూ ఇంట్లోదూరి రేత్రికని దాసుకున్న అన్నం తినీసి పారిపోతుంటే కొట్టకుండా ముద్దెట్టుకుంటారేటిరా. దీని పున్నేన ఇంటిల్లపాదీ మూణ్రోజులనుండీ కాలీకడుపుల్తో తొంగుతున్నాం రాత్రుల్లు. అయినా ఊరకుక్కని కొడితే ఈ బాబుకెందుకంట అంత కోపం ఎలుపొచ్చీసింది” అడిగాడు వెంకటి కూడా కాస్త కోపంగానే.

“అన్నం తినేసిందంటే తినదా మరి. పూర్ థింగ్. దానికేంతెలుసు తినకూడదని. అంతగా తినకూడదనుకుంటే జాగ్రత్తగా ఇళ్ళకి తాళాలు వేసుకోవాలిగాని అంతంత దెబ్బలు కొడతావా దాన్నీ, యూజ్ లెస్ ఫెలో” కోపంతో ఊగిపోతూ ప్రశ్నించేరు రాజావారు.

'మాకు తెల్దేటండి జాగర్తగా ఎట్టుకోవాలని. తవురు సెప్పాలేటీ. ఒకపాలి మాఇల్లకేసి సూడండి తెలుత్తాది. ఆటికేవన్నా తలుపులా దోరబందాలా. కూలీనాలీ చేసుకొని, తినీతినకా బతుకుతున్నాం. అలాటిది ఉన్న కొంచెం కూడూ కుక్కముట్టీసుకుంటే ఆడేటి తినాలా ఆడి పెల్లం పిల్లలేటి తినాల. ఇంకా నయం మావోడు గాబట్టి కొట్టీసొగ్గీసేడు. అదేనానైతేనా సంపీసిపోదును" అన్నాడు నాయకుడు కూడా కోపంగానే.

నాయకుడి కోపం చూసి ధైర్యం తెచ్చుకున్న ప్రజలంతా గోలగోలగా అరవసాగారు. అది చూసిన రాజావారి డ్రైవరు నెమ్మదిగా రాజావారి ప్రక్కన చేరి "ఈ అలగా వెధవలతో మనకెందుకు సార్. ఇదేదైనా పెద్దగొడవకింద మారి పేపర్లకీ, టీవీలకీ ఎక్కితే మనకే చెడ్డపేరు. ఈ వెధవలకి పోయేదేమీ ఉండదు. వెళ్దాం సార్ మనం" అని డిస్క్రీట్గా రాజావారి చెవిలో చెప్పాడు. రాజావారు కూడా "ఇటువంటి పరిస్థితుల్లో 'డిస్క్రిషన్ ఈజ్ ద బెటర్ పార్ట్ ఆఫ్ వేలర్' అని గ్రహించినవారై, రణరంగంనుండి 'రిట్రీట్' అవడానికి సిద్ధపడ్డారు గాని "పూటకి ఠికాణాలేని వెధవల దగ్గర మనం తగ్గడమా" అని భావించినవారై "ఇంకొకసారి ఇలాంటిది నా కళ్ళబడిందా, మీ అంతు చూస్తాను జాగ్రత్త" అని గట్టి వార్నింగ్ ఒకటి ఇచ్చి అక్కడ్నుండి నిష్క్రమించారు మేజెస్టిక్ గా.

కారులో కూర్చున్నారన్నమాటే గాని, రాజావారి మనసు మనసులోలేదు. వికలమైపోయింది. "ఎప్పుడు బాగుపడుతుందీ దేశం. అన్నంలో నోరుపెట్టిన పాపానికే కొట్టేస్తాడా నోరులేని జీవిని. రాస్కెల్. సచ్ ఫెలోస్ షుడ్ బీ హేంగ్డ్ బై ద లేంప్ పోస్ట్స్. అప్పుడు గాని బాగుపడదీ దేశం" అని తనలోతను మధనపడుతూనే ఉన్నారు పాపం.

--00--

రాజావారి కారు బంగళాలోకి ప్రవేశించింది. కారు దిగిన రాజావారికి రాణీవారెదురయ్యారు విషణ్ణవదనంతో.

"వాట్ హేపెండ్ డియర్" ప్రశ్నించారు రాజావారు ఆదుర్దా.

"స్వీటీ ని (స్వీటీ రాజావారి మనవరాలు) స్నూపీ కరిచేసింది రాజా. డాక్టర్ ఇప్పుడే ఇంజక్షన్ చేసి వెళ్ళాడు" అన్నారు రాణీవారు విచారంగా.

"ఇంత మంది సర్వెంట్స్ ఉన్నారు ఏంచేస్తున్నారందరూ. గాడిగలు కాస్తున్నారా? అసలెలా కరిచింది నా బంగారుతల్లిని?" గాండ్రించేరు రాజావారు.

"స్వీటీ చేతిలోని ఐస్ క్రీం తినడానికి చెయ్యడానికి ట్రై చేసిందట స్నూపీ. స్వీటీ దాన్ని దూరంగా పుష్ చేసిందట. దానితో స్వీటీ కాలిమీద కరిచేసి, షీ రేన్ అవే ఫ్రమ్ దేర్" జరిగిన విషయం చెప్పారు రాణీవారు.

పక్కగదిలో మంచంకింద దాగున్న స్నూపీకి రాజావారి గొంతు విన్నాక కాస్త ధైర్యం వచ్చినట్టుంది. గిల్టీగా నేలచూపులు చూస్తూ, నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చి, తలవంచుకు నిలబడింది రాజావారి పాదాలచెంత. స్నూపీని చూసిన రాజావారి కోపం నసాళానికంటింది. హీ వాజ్ బిసైడ్ హిమ్సెల్ఫ్ విత్ రేజ్. ఈడ్చిపెట్టి ఒక తన్ను తన్నారు దాన్ని. దెబ్బకి కాలు విరిగిన స్నూపీ కుయ్యోమొర్రోమంటూ, బయటకు పరుగుతీసింది కుంటుకుంటూ.

ఇంకా కోపంతీరని రాజావారు అక్కడే నిలబడిఉన్న సర్వెంట్ వేపు కోపంగాచూస్తూ "దాన్ని తీసుకెళ్ళి మనకుక్కల ఆర్ఫనేజ్ లో పారెయ్యండి. ఐ డోంట్ వాంట్ టూ సీ హెర్ ఫేస్ ఎగైన్" అను హుకుం జారీచేసి, మనవరాలు పడుకున్న గదిలోకి పరుగుతీసారు గాభరాగా.

## దారి దీపాలు — డా.జడా సుబ్బారావు

"గుడ్ మార్నింగ్ పిన్నిగారూ..." అంటూ వాకిట్లో ముగ్గేస్తున్న కామాక్షమ్మను దాటుకుని ముందుకు నడిచింది సుమ. గాలికి రేగిన జుట్టు అందంగా ముఖంపై పడుతోంది. ముక్కుపుటాలు అదురుతున్నాయి. ముఖంమీద అక్కడక్కడా పట్టిన చెమటబిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయి. రోజూ ఉదయాన్నే వాకింగుకి వెళ్ళి వచ్చేసరికి కామాక్షమ్మ వాకిట్లో ముగ్గేస్తూ కనిపిస్తుంది. అందుకే పలకరింపుగా గుడ్ మార్నింగ్ చెప్పి లోపలికెళ్తుంది.

"గుడ్ మార్నింగ్ తల్లీ... చంకలు పట్టినట్లుగా కాకుండా కొంచెం కప్పినట్లుగా ఉండే బట్టలు వాడకూడదూ... నీ వంటికీ మంచిది... చూస్తున్న జనాల కంటికీ మంచిది" అంది కామాక్షమ్మ.

తన బట్టలవంక చూసుకున్న సుమ 'అయ్యో.. పిన్నీ! వాకింగుకెళ్లేవాళ్లు ఇలాంటివే వాడతారు గానీ పట్టుచీరలు కట్టుకుని గుడికి వెళ్లినట్లుగా వెళ్ళరు..." అంది పెద్దావిడను ఆటపట్టిస్తున్నట్లుగా.

"నిజమేనమ్మా... కాదనను. కాకపోతే ఇది పల్లెటూరు కదా! అమావాస్య నాటి వెన్నెల తగ్గిపోయినట్లుగా రోజు

రోజుకీ తగ్గిపోతున్న  నీ కురచబట్టల్ని వీధిలో వాళ్లు కన్నార్పకుండా చూస్తున్నారు. తర్వాత నీ ఇష్టం..' నవ్వుకుంటూ ఇంట్లోకి వెళ్ళింది కామాక్షమ్మ.

సుమకి ఇరవై ఐదేళ్లు. డిగ్రీ, బి.ఇడి పూర్తిచేసింది. లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుని డియస్సీకి సెలక్టయింది. ఆడపిల్ల... పైగా ఇంట్లో స్వేచ్ఛగా గారాబంగా పెరిగిన పిల్ల. ఉద్యోగం ఏ ఊళ్లో ఇస్తారోనని తల్లిదండ్రులు కంగారుపడ్డారు. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగస్తులు కావడం, పోష్టింగ్ కూడా మారుమూల పల్లెలోని ఎలిమెంటరీ స్కూల్లో రావడంతో సుమ బాగా నిరాశచెందింది. అన్నిటినీ మించి తల్లిదండ్రుల్ని వదిలిపెట్టి ఉండాల్సి రావడం మనసుకు కష్టంగా అనిపించింది.

స్కూల్లో రిపోర్ట్ చేసిన తర్వాత మంచి ఇంటికోసం అణ్వేషణ సాగించింది సుమ. ఒక్కతే ఉండాల్సిరావడం, స్కూలుకి దూరంగా ఉండడం ఇబ్బంది కనుక ఆ ఊరిలోనే పాఠశాలకు దగ్గర్లోనే ఉన్న కామాక్షమ్మ ఇంటికి చేరుకుంది.

అటు మూడుగదులు, ఇటు మూడుగదులతో వున్న పెద్ద పెంకుటిల్లు కామాక్షమ్మ దంపతులది. ఇద్దరూ ఒక పోర్షనులో ఉంటూ పక్కనున్న వాటా అద్దెకిస్తారు. వెనుకవైపు పెరడు, ముందు ఖాళీస్థలం, ఒకపక్క పూలమొక్కలు, మరో పక్క బాత్రూం... ఇల్లు విశాలంగా ఉండడంతో సుమ బాగా ఇష్టపడింది.

కొద్దిరోజుల్లోనే సుమ పద్ధతి, కలుపుగోలుతనం, చలాకీతనం నచ్చాయి కామాక్షమ్మ దంపతులకి. ఎలా వుంటుందోనని మొదట్లో కంగారుపడినా రోజులు గడిచేకొద్దీ తమలో ఒకరిగా కలిసిపోయిన సుమను మనస్ఫూర్తిగా ఆహ్వానించారు దంపతులిద్దరూ.

పిల్లలు లేకపోవడంతో సుమను సొంతకూతురిలాగా భావించేవారు. సుమకి కూడా తల్లిదండ్రులు దగ్గర లేరన్న చింత లేకుండా పోయింది. అన్నిటికీ చేదోడువాదోడుగా ఉంటూ మంచి మంచి సలహాలిస్తూ తోడున్న దంపతులిద్దరికీ రోజుకొకసారైనా మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంటుంది సుమ.

★★★

స్నానంచేసి హాల్లోకి వస్తున్న సుమకి పెరట్లో నుండి ఏదో దంచుతున్నట్లుగా చప్పుడు వినిపించింది. గదులు దాటుకుని అవతలివైపుకి వెళ్తే కామాక్షమ్మ రోట్లో పచ్చడి చేస్తూ కనిపించింది.

వేపిన ఎండుమిరపకాయలు, వేరుశనగలు, జిలకర, వెల్లుల్లి... ఒకదాని తర్వాత ఒకదాన్ని రోట్లోవేస్తూ నూరుతూ కనిపించింది కామాక్షమ్మ. పచ్చడి చేస్తూనే మధ్యమధ్యలో నుదుటిమీద చెమటను తుడుచుకుంటున్న కామాక్షమ్మను సమీపించి “ఇంట్లో మిక్సీ పెట్టుకుని మీకెందుకమ్మా ఇంత శ్రమ? రెండు నిమిషాల్లో అయ్యేపనికి ఇంత శ్రమపడడం వృథా కదా!” అంది పచ్చడి బండ అందుకుంటూ సుమ.

దానికి చిన్నగా నవ్విన కామాక్షమ్మ “అన్నీ వృథా అనుకుంటే ఎలా? ఒళ్లు కదలాలంటే ఏదో ఒక పని చేయాలిగా! నీకులాగా నడవలేను, పరిగెత్తలేను... ముసలిదాన్ని... కాసేపు వ్యాయామం చేసినట్లుంటుంది కదా! పైగా మిక్సీలో వేస్తే

పచ్చడి బాగా మెత్తగా అయిపోతుంది. మీ బాబాయిగార్కి అలా నచ్చదు. ఎంత కాదనుకున్నా రోటిపచ్చడి రోటిపచ్చడే! అయినా నీ వయసునుండే స్వయంగా ఈ పనులన్నీ చేసుకోబట్టి ఇదిగో ఇలా గట్టిగా వున్నాను. అప్పట్నుంచే ఇలాంటివి వాడుంటే ఒంట్లో ఈమాత్రం ఓపికైనా ఉండేది కాదు. అయినా ఓపిక ఉన్నంతవరకూ శ్రమ మీదే ఆధాపడాలమ్మాయ్" అంది కామాక్షమ్మ.

"అంటే మిక్సీ వాడుతున్న వాళ్లంతా గట్టిగా లేరనా పిన్నీ..." అంది సుమ నవ్వుతూ.

"అలా అని కాదు... అప్పట్నుంచీ వాటిని వాడడం మానేసి చేతులకు పనిచెప్పాను కాబట్టి సరిపోయింది. లేకపోతే ఇప్పుడు ఆ పనులన్నీ వదిలేసి వాకింగుమీద ఆధారపడాల్సి వచ్చేది అంటున్నా..." అంది కామాక్షమ్మ.

విచిత్రంగా చూసింది సుమ. మళ్ళీ ఏదో గుర్తొచ్చినట్లుగా తనలో తనే నవ్వుకుని పచ్చడిలో ఉప్పు సరిపోయిందో లేదో చూసింది. సరిగ్గా సరిపోయింది. 'పచ్చడి బాగుంద'ని మెచ్చుకుని స్కూలుకి వెళ్తున్నానని చెప్పి వెళ్ళిపోయింది.

★★★

స్కూలునుండి తిరిగొచ్చేస్తున్న సుమ ఇంట్లోకెళ్తూ అరుగుమీద తిరగలి తిప్పుతున్న కామాక్షమ్మను చూసి ఆగిపోయింది. కావలసిన వస్తువులన్నీ ఇంట్లో వున్నా ఏవీ వాడదు. ఏమిటో చాదస్తం, అన్నిటికీ పాతతరం పద్ధతులమీద ఆధారపడుతుంది. స్విచ్ వేస్తే తిరిగే వాటిని వాడుకుని సుఖపడడం చేతకాక ఆయాసపడుతూ ఈ వయసులో ఈ పనులెందుకు? పీనాసితనం కాకపోతే! మనసులో అనుకుంటూ కామాక్షమ్మను సమీపించింది.

"పిన్నీ... వచ్చినప్పటినుండీ గమనిస్తున్నాను. ఈ వయసులో ఊరికే హైరానా పడుతున్నారేమో అనిపిస్తుంది నాకు. అందుబాటులో వున్న వస్తువుల్ని వాడుకోవడం మానేసి రుబ్బురోలు, తిరగలి అంటూ పాతతరం వస్తువులతో కుస్తీలెందుకు పిన్నీ. ఆధునిక పద్ధతులతో పనులన్నీ తొందరగా చేసేసుకుని మిగిలిన టైమంతా హాయిగా నిద్ర పోకుండా.." అంది పుస్తకాలు పక్కనబెట్టి తనూ ఒక చెయ్యేస్తూ.

పళ్లన్నీ కనిపించేలా పెద్దగా నవ్వింది కామాక్షమ్మ. నవ్వినప్పుడు ముఖం ఎంతో ఆకర్షణీయంగా కనిపించింది సుమకి. పెద్ద కుంకుమబొట్టు ముఖానికి మరింత అందగా అనిపించింది.

"పాతెప్పుడూ రోత కాదమ్మాయ్. కొత్తతరాన్ని నడిపించే గీత. పైకి కనబడకపోయినా పనుల్లోనో పద్ధతుల్లోనో పాతవాసన అంతర్లీనంగా ప్రవహిస్తూనే వుంటుంది. నలుగురికీ చులకనగా ఉంటుందని మనమే పక్కనపెడుతుంటాం. అయినా ఈ వయసులో నాకూ మీ బాబాయికీ పనులేముంటాయమ్మా! ఆయనకి పుస్తకాలు, పేపర్లు వుంటే చాలు. చక్కగా రోజు గడిచిపోతుంది. ఎప్పుడైనా విసుగనిపిస్తే అలా వీధిలోకెళ్లి స్నేహితుల్ని పరామర్శించి వస్తారు. ఇక నా సంగతంటావా... వంటతో కాస్త కాలక్షేపం. ఏదో రోజు గడవాలి కాబట్టి ఇంత ఉడకేసుకుని తినడం... ఏమైనా పనులుంటే చేసుకోవడం. టీవీ చూడాలంటే ఆసక్తి ఉండదు. కళ్లముందు పనున్నప్పుడు బద్దకాన్ని తగిలించుకుని టీవీ చూడడం

ఆరోగ్యానికి కూడా అంత మంచిది కాదుగా. అయినా... పగటి నిద్ర పనికి చేటని ఊరికే అన్నారా?" అంది.

"అంటే... ఈ వయసులో కష్టపడి ఇబ్బందులు తెచ్చుకోవడం ఎందుకనే తప్ప వేరే ఉద్దేశ్యం కాదు పిన్నీ... మరోలా అనుకోకండి..." అంది సుమ.

"దానిలో అనుకోవడానికేముందిలేమ్మా...! పిల్లల్లేరు... ఉండేది ఇద్దరం. రోజు గడవాలి. అందుకే ఏదో ఒక పనితో తీరికలేకుండా వుంటే దేహానికి ఆరోగ్యం, మనసుకి ఆనందం... ఈ పనులు కూడా లేకపోతే జీవితం ఇంకా యాంత్రికంగా ఉండదూ..." అంది మినప్పప్పు డబ్బాలో పోస్తూ.

కొంచెం సమయం చిక్కితే అవసరం వున్న లేకపోయినా నడుంవాల్చాలని చూసే తమ తరానికి, నడుం వాల్చే అవకాశం ఉన్నా చేతినిండా పని కల్పించుకుంటున్న కామాక్షమ్మ తరానికీ పోలిక చూసుకుంటూ, పుస్తకాలు తీసుకుని గదిలోకి వెళ్ళింది సుమ. అపార్థం చేసుకున్నందుకు మనసులో బాధపడింది.

★★★

ఉదయం పదిగంటలయింది. ఆప్షనల్ హాలిడే కావడంతో ఇంట్లోనే వుండి పుస్తకం చదువుకుంటున్న సుమకి "సుమా... గుడిదాకా వెళ్లొద్దాం... వస్తావా?" అని వినిపించడంతో తలుపు తీసుకుని బయటికి వచ్చింది.

శుభ్రంగా తలస్నానం చేసి పట్టుచీర కట్టుకుంది కామాక్షమ్మ. పెద్దముడి వేసుకుని పూలు చుట్టుకుంది. రూపాయి కాసంత బొట్టు ముఖానికి కొత్త అందాన్ని తెచ్చిపెట్టింది. పాపిట్లో కాస్త కుంకుమ, చేతులనిండా గాజులు, మంగళసూత్రం, నల్లపూసల గొలుసుతో నిండుముత్తైదువులా కనిపిస్తున్న కామాక్షమ్మను చూసి "పిన్నీ... ఈ రోజు స్పెషల్'గా ఉన్నారు... ఏమైనా విశేషమా?" అంది సుమ.

"స్పెషలేమీ కాదమ్మా.. కాసేపు ఊరిచివరున్న గుడికెళ్దామని బయల్దేరాను. తోడొస్తావేమోనని అడిగాను. ఏదైనా పనుంటే ఉండిపో... పర్లేదు... ఒక్కదానికే అలవాటే... వెళ్ళొస్తాను.." అంది కామాక్షమ్మ.

ఏమీ మాట్లాడకుండా ఆమెను వెంబడించింది సుమ. అయిదు అరలున్న పెద్దక్యారేజీ, కాసిని అరిటాకులు, ఒక నీళ్లక్యాను రిక్షాలో పెట్టించింది. అవన్నీ ఎందుకో సుమకి అర్థంకాలేదు. దారిలో "పిన్నీ గుడికి ఇవన్నీ ఎందుకు?" అడిగింది సుమ. సుమవైపు చూసి చిన్నగా నవ్వింది కాని సమాధానం చెప్పలేదు కామాక్షమ్మ. గుడి సమీపించగానే ఒక పక్కనున్న చెట్టుదగ్గర రిక్షా ఆపించి సామాన్లన్నీ దింపి అరుగుమీద పెట్టించింది. దేవుడికి దండం పెట్టుకుని వచ్చేదాకా రిక్షావాడిని అక్కడే వుండమని చెప్పి సుమతో కలిసి గుడిలోకి వెళ్ళివచ్చింది.

తర్వాత గుడిమెట్ల దగ్గరా, అక్కడక్కడా వున్న అనాథల్ని, అడుక్కుంటున్న వాళ్లని రిక్షా అతని ద్వారా పిలిపించింది. చెట్టునీడలో అందర్నీ కూర్చోబెట్టి తెచ్చినవన్నీ స్వయంగా వడ్డించింది.

కాసేపటికి తెచ్చినవన్నీ అయిపోవడంతో ఖాళీపాత్రల్ని మళ్లీ రిక్షాలో పెట్టించింది.

సుమకంతా అయోమయంగా, ఆశ్చర్యంగా ఉంది. ఆ వయసులో కామాక్షమ్మ ఉత్సాహం, ఇతరులకు సాయం చేసే గుణం సుమకి నోటిమాట రాకుండా చేసింది. ఉన్నదానికి ఇంకాస్త చేర్చి ఆస్తులు పెంచుకుంటున్న వాళ్లని చూసింది గానీ, తనకున్న దాన్ని ఇతరులకు ఖర్చుపెట్టడంలో కూడా తృప్తిని పొందుతున్న కామాక్షమ్మ తీరు అందుకు భిన్నంగా కనిపించింది. చెయ్యాలనే ఆలోచన ముందు 'వయసుమీదపడడం' చిన్నవిషయంగా అనిపించింది.

ఇంట్లోకెళ్లబోతూ "ఈ వయసులో అంతమందికి ఒక్కదానివే ఎంత శ్రమపడి వంటచేశావో తల్చుకుంటే ఒళ్లు గగుర్పొడుస్తుంది పిన్నీ. ఒక వయసుదాటాక సొంతవాళ్లే పెద్దవాళ్లని పట్టించుకోవట్లేదు. భారంగా భావిస్తున్నారు. కానీ మీరు మాత్రం మీకు ఏమీ కానివాళ్లకోసం ఇంత శ్రమ తీసుకుని..." మాట్లాడలేకపోయింది సుమ.

మళ్ళీ అదే చిరునవ్వుతో కామాక్షమ్మ "ఇందులో నాకేమీ శ్రమలేదమ్మా. ఇంతకుముందు గుడికెళ్లి దేవుడి దర్శనం చేసుకుని మెట్లమీదున్న వాళ్లకి తోచినంత ఇచ్చి వచ్చేదాన్ని. ఒకరోజు అలాగే వస్తుంటే చిన్నపిల్లవాడు నా కాళ్లకి అడ్డుపడి కడుపు చూపించి ఆకలిగా వుందని డబ్బులడిగాడు. నాకు ఒక్కసారిగా కాళ్లకింద భూమి కదిలినట్లుగా, గుండెను పట్టి గట్టిగా పిండినట్లుగా అయింది. గుట్టలుగా పోగేసుకున్న సంపాదన పరుల ఆకలి తీర్చడానికి ఖర్చుపెట్టలేని జీవితం వ్యర్థమనిపించింది. వాడికేదో ఇచ్చి ఇంటికొచ్చాక కూడా ఆ సంఘటన నన్ను చాలాకాలం వెంటాడింది. దానినుంచి పుట్టిన ఆలోచనే ఈ క్యారేజీ. డబ్బులు ఎంతిచ్చినా రాని తృప్తి కడుపునిండా అన్నంపెడితే వస్తుందని అనిపించింది. అందుకే నాకు తోచినంతమందికి, నేను పెట్టగలిగినన్ని రోజులు ఇలా..." చెప్పి లోపలికెళ్లింది కామాక్షమ్మ.

ఉన్నతమైన కామాక్షమ్మ ఆలోచనకు చలించిపోయింది సుమ.

★★★

"పిన్నీ... తల్లీదండ్రీ దగ్గరలేకపోయినా మీ ఇద్దరివల్లా ఆ లోటు తీరింది. నన్నొక సొంతకూతురిలాగా చూసుకున్నారు. మీరు చూపించిన ప్రేమ నేనెన్నటికీ మర్చిపోలేను. వచ్చేనెలలో నా పెళ్ళి. బదిలీకి కూడా ప్రయత్నాలు చేస్తున్నాను. వెళ్లాలన్న ఆలోచనొస్తేనే మనసు ఏదోలా అయిపోతుంది. మీరూ బాబాయీ తప్పకుండా పెళ్ళికి రావాలి..." శుభలేఖ చేతిలో పెట్టి విషయం చెప్పిన సుమను దగ్గరికి తీసుకుని నుదుటిమీద ముద్దుపెట్టుకుంది కామాక్షమ్మ.

కాసేపటి తర్వాత 'సంబంధాలు అలాగే ఉంటాయమ్మా. కాలంతో పాటే కలుపుకుంటూ ముందుకు సాగిపోవాలి. చదువుకున్నదానివి, లోకజ్ఞానం ఉన్నదానివి, సంపాదించడం నేర్చుకున్నదానివి... నీకు తెలియనివి కాదుగానీ... నా కూతురులాంటి దానివని చెప్తున్నాను. మనుషుల్ని దగ్గర చేసుకోవడానికి ప్రేమని మించిన ఆయుధం లేదు. మనం సంపాదించుకోవడంలో తప్పు లేకపోయినా ఎంతోకొంత లేనివాళ్లకి దానంచేయడం మనసుకి ప్రశాంతతనిస్తుంది. అన్నిటినీ మించి భార్యాభర్తల బంధం ఒక పవిత్రబంధం. ఒకరికొకరు తోడూనీడా. వయసూ, సంపాదనను చూసుకుని మనుషుల్ని దూరంచేసుకోకూడదు. ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. ఒకరి లోపాలను ఒకరు సరిచేసుకోవాలి, నలుగురికీ

ఆదర్శంగా నిలవాలి. పాతతరం వాళ్ల ఆలోచనలూ, అనుభవాలూ దీపాల్లా మారి కొత్తతరాల భవిష్యత్తుకు దారి చూపిస్తే అదే పదివేలు కదా!" చెప్పడం ఆపి కళ్లు తుడుచుకుంది కామాక్షమ్మ.

కామాక్షమ్మకి నమస్కరించి వెనుదిరిగింది సుమ. కష్టపడేతత్వం, సాయంచేసే గుణం, ప్రేమించే లక్షణం మనిషికి మనిషిని ఎంతగా దగ్గర చేస్తాయో కామాక్షమ్మలో చూసింది సుమ. నడవడిక ద్వారా ఆదర్శంగా నిలిచిన కామాక్షమ్మకు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంటూ ముందుకునడిచింది సుమ.

★★★

## సహానుభూతి — అంజన కొడాలి

**ల్యాప్‌టాప్ పై** హోమ్ వర్కు చేసుకుంటూ, ఇల్లు తుడుస్తున్న రవీంద్ర వంక క్రీగంట చూసింది పదిహేనేళ్ళ దీపిక.

కోవిడ్ పుణ్యమా అని ఆరువారాలుగా ఇంట్లోనే ఉండిపోయారు అందరూ. పదవతరగతి CBSE సిలబస్ పరిక్షలు అయిపోయాయి. కానీ JEE కోచింగ్ ఆన్‌లైన్‌లో జరుగుతుంది. చెల్లెలు దేవిక, కవల సోదరి, ఇంగ్లీషు లిటరేచర్ చేస్తానన్నది. అందుకని ఇంటరు క్లాసులు మొదలయ్యేదాకా ఈ చదువు గోల లేదు.

దీపికకు చాలా చిరాకుగా ఉంది. తండ్రి, నానమ్మ, చిన్ననానమ్మ, చిన్న తాతయ్య, చెల్లెలు పైగా నానమ్మను చూసుకునే నర్సు ఇంట్లో ఇంతమంది. కానీ అమ్మ మాత్రం లేదు. రోజూ ఫోనులో అమ్మ అమ్మతో మాట్లాడుతూనే ఉంది అయినా అందరూ కలిసి లేరు అన్న చిరాకు.

"దీపూ పదమ్మా బ్రేక్‌ఫాస్ట్ చేద్దాం. దేవీ, దీపూ అందరికి ప్లేట్లు, మంచినీళ్ళు పెట్టండి" స్నానం చేసి వచ్చిన రవీంద్ర, నానమ్మ గదిలోకి వెళుతూ చెప్పాడు పిల్లలకు. నానమ్మని జాగ్రత్తగా వీల్ చైర్లో కూర్చోపెట్టి తీసుకువచ్చాడు. దాదాపు సంవత్సరంగా పార్కిన్‌సెన్ నాలుగో స్టేజ్‌లో ఉంది సుశీలకు. ఆవిడకు కాస్త కాలక్షేపంగా ఉంటుంది తను ఆఫీసుకు, టూర్లలో వెళితే అని పిన్ని, బాబాయిని ఒప్పించి పల్లెటూరు నుండి రప్పించాడు రవీంద్ర.

"మళ్ళీ ఇడ్లీ ఏనా?" గొణిగింది దీపిక తండ్రి తీసుకొస్తున్న గిన్నెలను చూసి.

"ఇడ్లీ తొందరగా అయిపోతుంది. నీకు వేరే కావాలంటే ముందే చెప్పాలి దీపూ" నిదానంగా చెప్పాడు రవీంద్ర.

"నాకు మీటింగులు ఉన్నాయి, ఇప్పటినుండి ఓ మూడుగంటలు చాలా బిజీగా ఉంటాను. తాతయ్య, నానమ్మలను విసిగించకుండా బ్రేక్ఫాస్ట్, లంచ్ ఫినిష్ చెయ్యండి" గబగబా తింటూ చెప్పాడు రవీంద్ర.

"ఏం సుఖపడుతున్నాడు? ఇంటిపని, ఆఫీసు పని, పిల్లలు ముగ్గురు ముసలాళ్ళు. ఎందుకీ పంతాలు? సంధ్యను ఇంటికి తీసుకురావచ్చుకదా! మూడేళ్ళుగా ఇదే తంతు. యాభైఏళ్ళు దాటాయి. పిల్లలకోసం సర్దుకోవాలి కానీ " పిన్ని విజయ మాటలు వినబడ్డాయి బెడ్రూంలోకి వెళుతున్న రవీంద్రకు.

ఛరున కోపం వచ్చింది రవీంద్రకు. "ఎన్నిసార్లు చెప్పాలి అందరికి పిల్లల ఎదురుగా ఇలాంటి మాటలు మాట్లాడొద్దు. లేతమనసులు గందరగోళంలో పడుతున్నాయి అని ఎంత వివరించినా అర్థంకాదు వీళ్ళకు."

బెడ్రూం తలుపు వేసుకుని కుర్చీలో కూర్చుని కళ్ళు మూసుకున్నాడు రవీంద్ర.

రవీంద్ర తండ్రి రైల్వేలో చిన్న క్లర్కులా చేరి ఎంతో కష్టపడి పరిక్షలు రాసి నెమ్మదిగా ప్రమోషన్లు పొందాడు. ఇద్దరు పిల్లలతో జాగ్రత్తగా సంసారాన్ని సాగించేవాడు. ఆర్థిక స్థోమతు లేక పాలిటెక్నిక్ చదివిన రవీంద్ర, తరువాత చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ, డబ్బులు దాచుకుని ఎం.బి.ఏ చదివాడు. తెలివిగలవాడు, బాగా కష్టపడే మనస్థత్వం వలన మంచి పొజిషన్లో తొందరగానే పైపైకి వెళ్ళాడు. పెళ్ళి మాత్రం ఆలస్యంగా చేసుకున్నాడు. ముప్పై మూడేళ్ళకు సంధ్యను పెళ్ళి చేసుకునే సరికి వైస్ ప్రెసిడెంట్ స్థాయికి చేరుకున్నాడు.

సంధ్యకు చాలా గొప్పగా అనిపించేది. అంత గొప్ప పొజిషన్లో ఉన్న భర్త రావటం, ఎనిమిదేళ్ళు వయస్సు తేడా ఉన్నా అందుకే ఒప్పుకుంది. వైస్ప్రెసిడెంట్ అంటే బ్రహ్మాండమైన బంగళా, పెద్దకారు, లక్జరీ లైఫ్ ఊహించుకుంది. తన తల్లిదండ్రులు తన దగ్గరే ఉంటారని ముందే చెప్పాడు రవీంద్ర. పెళ్ళి తర్వాత చూద్దాంలే అని సంధ్య ఏమీ అభ్యంతరం పెట్టలేదు.

పెళ్ళి అయిన కొత్తల్లోనే సంధ్య విపరీతంగా ఖర్చుపెట్టడం, వేరే కాపురం పెట్టాలని గొడవ పెట్టడం, పెద్దవాళ్ళదాకా వెళ్ళకుండా జాగ్రత్తపడ్డాడు. సంధ్య గర్భవతి అయ్యి కవలలు అని తెలిసిన రోజు అతని ఆనందానికి అవధులు లేవు. ఇద్దరు బంగారు బొమ్మలు పుట్టారని మురిసిపోయాడు. దీపిక ఆరోగ్యంగా మంచి ఎదుగుదలతో ఉండేది కానీ దేవిక సున్నితమైన ఆరోగ్యం. పిల్లల విషయంలో మాత్రం సంధ్యకు చాలా గట్టిగా చెప్పాడు ఇద్దరినీ చాలా జాగ్రత్తగా చూసుకోవాలని. అంతకంటే ఇంకా ఏమీ ఆమె దగ్గరనుండి ఆశించనని.

ఇంట్లో అత్తాకోడళ్ళ మధ్య గొడవలు ఎక్కువైయ్యాయి. అన్నీ గమనించిన రవీంద్ర తండ్రి కొడుకును వేరే కాపురం పెట్టమన్నాడు. ఒకచోట ఉండీ గొడవలు పడేకంటే దూరంగా ఉండి సఖ్యతగా ఉండటం మంచిదన్నాడు.

వేరే కంపెనీలో ఉద్యోగం చూసుకుని బెంగుళూరు వెళ్ళిపోయాడు రవీంద్ర. పిల్లలకు స్కూలు మొదలయ్యాక సంధ్యకు కావలసినంత స్వేచ్ఛ దొరికింది. స్నేహితులు, క్లబ్బులు, కిట్టీపార్టీలు. ఇవేవి రవీంద్రకు తెలియకుండా జాగ్రత్తపడింది. పిల్లలు స్కూలునుండి వచ్చేసరికి ఇంటికి వచ్చేది. పిల్లలకు పదేళ్ళు వచ్చేసరికి నెమ్మదిగా ఒక్కోటి బైటపడ్డాయి.

ఒకరోజు ఎవరో మర్వాడి ఫోన్ చేసి ఆరు లక్షలు చెల్లించకుంటే తనఖా నగలు సొంతం చేసుకుంటానని, ఇదే ఆఖరు వార్నింగని చెప్పాడు. నిర్ఘాంతపోయిన రవీంద్ర వెంటనే మార్వాడి కొట్టుకు వెళ్ళాడు. అక్కడ తెలిసింది అసలు

విషయం సంధ్య చాలా పాత ఖాతాదారని, ఎప్పుడూ నగలు కుదవ పెట్టి లక్ష, యాభైవేలు తీసుకెళ్ళి మళ్ళీ విడిపించుకుంటుందని కానీ ఈసారి ఆరునెలలుగా తప్పించుకుంటుందని, మొదట్లో రికార్డుల్లో రాసుకున్న రవీంద్ర ఫోను నెంబరుకు తప్పనిసరై చెయ్యవలసి వచ్చిందని.

పెళ్ళికి తాము పెట్టిన బంగారు హారం, పిల్లలు పుట్టినప్పుడు తాను కొన్న డైమండ్ సెట్ కళ్ళు ఎదురుగా వెక్కిరిస్తూ కనిపించాయి. మారుమాట్లాడకుండా డబ్బు తెచ్చి ఆ నగలు విడిపించాడు.

సాయంత్రం పిల్లలు నిద్రపోయాక ఆ నగలు మౌనంగా సంధ్య ఎదురుగా పెట్టాడు. బుకాయించబోయింది, నచ్చచెప్పబోయింది. చివరికి ఒప్పుకుంది. క్లబ్బులో పేకాటలో పోయాయని ఇంకెప్పుడూ చెయ్యనని ఏడ్చింది.

కొన్నాళ్ళు ఇద్దరూ మాట్లాడుకోలేదు. నెమ్మదిగా మాములు పరిస్థితుల్లోకి వచ్చారు. ఓ నాలుగైదు నెలలయ్యాక సంధ్య ప్రవర్తన అనుమానం కలిగింది. ఈలోగా రవీంద్రకు కూడా హెడ్ ఆఫీస్ పనులతో బొంబాయి ప్రయాణాలు ఎక్కువయ్యాయి. అమాయకంగా ఓ రోజు దేవిక చెప్పింది. రోజూ స్కూలునుండి వచ్చి తామే ఉంటున్నారని తర్వాత ఎప్పుడో తల్లి ఇంటికి వస్తుందని. మళ్ళీ గొడవలు. రవీంద్రకు అర్ధంకాలేదు ఇంతింతసేపు ఎక్కడికి వెళుతుందని. నగలన్నీ లాకరులో తనపేర, పిల్లల పేరమీద పెట్టేశాడు. బ్యాంకు ఎకౌంటు రోజూ పరిశీలిస్తున్నాడు. ఎప్పుడూ ఫోనులో ఉంటుంది, పకపకా నవ్వులూ లేదా చాటింగ్.

అనుమానంతో నిఘా పెట్టించాడు ఒక డిటెక్టివ్ ఏజన్సీని. ఆమె తిరుగుళ్ళు, రేవ్ పార్టీలు, ఎవరెవరితోనో ఫామ్ హౌస్ పార్టీలు, ఇంటిమేట్ ఫోటోలు అన్నీ సాక్ష్యాలతో సహా దొరికాయి.

రవీంద్ర ఎంతో పెద్ద పొజిషన్లో ఉన్నాడు. ఎంత మంచి పేరు ఉంది. సంధ్య ప్రవర్తన తట్టుకోలేక క్రుంగిపోయాడు. కానీ రవీంద్ర ఆమెను తక్కువ అంచనా వేసి పొరపాటు చేశాడు.

తన దగ్గర ఉన్న సాక్ష్యాలు అన్నీ ఆమెకు చూపి, పిల్లలకోసం ఆఖరి ఛాన్స్ ఇస్తున్నానని, ఇకపై మారకపోతే విడాకులు ఇస్తానని బెదిరించాడు. యథాతథంగా ఏడుపులు, క్షమించమని బ్రతిమిలాడటం.

ఓ వారం పదిరోజులయ్యాక కాస్త సద్దుమణిగిందని, వారం రోజుల బిజినెస్ ట్రిప్‌కని బాంబే, ఢిల్లీ తిరిగి వచ్చేసరికి ఇంట్లో రవీంద్ర తల్లి, అక్క, సంధ్య అక్క, అన్నా, తల్లిదండ్రులు. మూడు రోజులయ్యిందంట వచ్చి. అందరికీ బాగా నూరిపోసింది సంధ్య. రవీంద్రకు ఎవరితోనో సంబంధం ఉందని, అందుకే టూర్లు అని తిరుగుతాడని, తనని కనీసం ముట్టుకోడని, ఏ సుఖమూ లేకుండా పిల్లల కోసం తను సర్దుకుపోతుంటే, ఇప్పుడు విడాకుల కోసం గొడవ చేస్తున్నాడని. పిల్లలతో కూడా ఇదే చెప్పింది.

రవీంద్ర ఏమి చెప్పబోయినా సొంత అక్కకూడా నమ్మలేదు. పంచాయితీలు, ఏడుపులు, బెదిరింపులు. సంధ్యకు తెలుసు పిల్లలంటే ప్రాణం అని. లాయర్ దగ్గరకు వెళ్ళాడు. ఆడపిల్లలు కనక తల్లికే హక్కు ఉందని పదహారేళ్ళదాకా అని చెప్పాడు. అయినా విడాకుల కోసం కేసు వేశాడు. ఇల్లు వదిలి వేరే ఉండటం మొదలుపెట్టాడు.

సంధ్య పిల్లలతో సహా అందరిని తనవైపు తిప్పుకుంది. ఈ గొడవల్లో తన తండ్రి చనిపోయాడు. అక్క మధ్యవర్తిత్వంలో సంధ్య పిల్లలు వేరే ఇంట్లో, రవీంద్ర తన తల్లితోను ఉంటున్నారు ప్రస్తుతానికి. ఎలాగైనా తన స్థానం తిరిగి సంపాదించటానికి పిల్లలను వాడుకుంటుంది. ముఖ్యంగా దీపికను.

"దీపూ, నాన్నతో ఎందుకు అంత రూడ్‌గా మాట్లాడతావు? పాపం ఎంత పనిచేస్తున్నారో చూడు" పక్కనే కూర్చుంటూ నెమ్మదిగా అడిగింది దేవిక.

"నాన్న అంటే ఇష్టంలేదా నీకు?" అమాయకంగా రెట్టించింది దేవిక.

"ఇష్టంలేక కాదు. అందరం కలిసి ఉండాలనే కదా నేను అడుగుతుంది. అమ్మకూడా అదే అడుగుతుంది. ఎందుకు అంత మొండిగా ఉన్నాడు. నాన్న మారిపోయాడు. మనమంటే ప్రేమ తగ్గిపోయింది. అమ్మ అన్నట్లు వేరే ఎవరికోసమేనేమో మనల్ని వదిలేశాడు. సినిమాల్లో చూడట్లేదా?" ఉక్రోషంగా కోపంగా అడిగింది దీపిక.

వేరే సోఫాలో కూర్చుని టివిలో న్యూస్ చూస్తున్న రాఘవరావు అంతా వింటూ నిట్టూర్చాడు. బాబాయితో ఉన్న చనువుతో భార్య చేసినవన్నీ రాఘవరావుకు చెప్పుకున్నాడు. అందరికీ ఆ ఫోటోలు చూపించమని బలవంతం చేశాడాయన. కానీ రవీంద్ర ఒప్పుకోలేదు. అవన్నీ అందరి నోళ్ళల్లో నానితే పిల్లల భవిష్యత్తు దెబ్బతింటుందని.

"తండ్రి తిరుగుబోతు పిల్లల్ని వదిలేశాడు అని తెలిస్తే సమాజం పిల్లలపై సహానుభూతి చూపిస్తుంది. అదే తల్లి గురించి చెడుగా తెలిస్తే ఆ పిల్లల గురించి చెడుగా మాట్లాడతారు. ఆ సూటిపోటీ మాటల్ని నా పిల్లలు ఎదుర్కోకూడదు బాబాయి"

"దీపూ, దేవి ఇలా నా దగ్గరకి రండి" టివి ఆపేసి పిలిచాడు రాఘవరావు. పిల్లలు వచ్చి చెరోపక్క కూర్చున్నారు.

"మీ స్నేహితుల్లో, మీకు చాలా నచ్చే ఇద్దరు ఏవో కారణాలవలన పోట్లాడుకున్నారనుకోండి అప్పుడు మీరేం చేస్తారు? "

"మా మాటలు విన్నావు కదా తాతయ్యా" సూటిగా అడిగింది దీపిక.

"దీపు నువ్వు చాలా తెలివిగలదానివి, కానీ ముందు నేనడిగే కొన్ని ప్రశ్నలకు మనఃస్ఫూర్తిగా సమాధానం చెప్పు."

"సరే వాళ్ళిద్దరికి గొడవ ఎందుకు వచ్చిందో కనుక్కుంటాను."

"గుడ్ ఇద్దరివైపు వాదనలు విన్నావు. వాళ్ళిద్దరంటే నీకు ప్రేమ. కానీ ఒకళ్ళేమో అవతల వ్యక్తి గురించి చాలా చెడ్డగా మాట్లాడుతున్నారు. నీ మనస్సు ఒప్పుకోదు కానీ నీ మెదడు ఆ మాటలన్నింటిని దాచుకుంది నమ్మమంటుంది. ఏం చేస్తావు?"

చాలాసేపు ఆలోచిస్తూ కూర్చుంది దీపిక. రెట్టించలేదు రాఘవరావు.

"అమ్మ తప్పు చేస్తే మాత్రం ఒదిలెయ్యాలా? మాకోసం కలిసి ఉండొచ్చు కదా" ఉక్రోషంగా అడిగింది.

"మీ అమ్మ తప్పు చేసినా కానీ మీ నాన్న సర్దుకుపోవాలన్నది పాయింట్. మరి మీ నాన్న ఏం తప్పు చేశాడని మూడేళ్ళుగా నువ్వు అంత కఠినంగా ఉంటున్నావు. సరిగ్గా మాట్లాడవు. ఆయన చెప్పేది వినవు మీ అమ్మ చెప్పిందే వింటావు అంటే నువ్వు అమ్మా నాన్నల్లో ఒకర్ని సెలక్టు చేసుకున్నావు. చూడు తల్లి మీ నాన్న ఈ మూడు సంవత్సరాలు ఎలా ఉన్నారో నువ్వు గమనిస్తూనే ఉన్నావు. ఉద్యోగం, టూర్లు, నానమ్మను ఎంత జాగ్రత్తగా చూసుకుంటున్నాడో, మీకోసం ఎంత తాపత్రయ పడతాడో చూస్తూనే ఉన్నావు. మీ అమ్మతో తనకు ఎందుకు విభేదాలు వచ్చాయో అన్నీ మీకు చెప్పి పిల్లలైన మీ మనస్సుల్లో నెగిటివిటీ పెంచటం నాన్నకు ఇష్టంలేదు. పైగా కొన్ని విషయాలు పిల్లలతో పంచుకోకూడదు" గట్టిగా ఊపిరి వదిలాడు రాఘవరావు.

"నువ్వు ఏమి చేస్తున్నావో ఆలోచించు దీపూ, నాన్నను ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేస్తున్నావు - అమ్మతో కలిసి ఉండకపోతే నీతో మాట్లాడను, అమ్మనే నమ్ముతాను, మేము చెప్పినట్లే నువ్వు వినాలి అనడం ఎంత తప్పు - ఇలా ఒత్తిడి తేవటం. ఎవరికైనా తమ సంసారం బాగుండాలి, భార్యాపిల్లలతో అందమైన జీవితం కావాలనే ఉంటుంది. ఏవో కారణాల వలన కొన్నిసార్లు ఆ కోరిక నెరవేరదు. నీతో అమ్మ ప్రేమగా ఉంటుంది, నాన్న ప్రాణం పెడుతున్నాడు నీకు ఏది కావాలన్నా ఇస్తున్నాడు. ఆ డబ్బులు సంపాదించడానికి ఎంత కష్టపడుతున్నాడో మాకు తెలుసు. నాన్న కూచిని అని చెప్పేదానివి గుర్తుందా చిన్నప్పుడు. ఒక వ్యక్తిని ప్రేమిస్తే వాళ్ళను మానసికంగా చంపేసి, మన చెప్పుచేతల్లో ఉంచుకోవాలని ఆలోచించకూడదు. అర్థమౌతుందా? నాకు అర్థమౌతుంది దీపు నువ్వు అందరిలా అమ్మా నాన్న ఇంట్లోనే ఉండాలి అని కోరుకుంటున్నావు. మన చేతివేళ్ళు అన్నీ ఒకేరకంగా లేనట్లే అందరి జీవితాలు ఒకే రకంగా ఉండవు. ఇంట్లో ఉండి ఎప్పుడూ పోట్లాటలూ, ముభావంగా ఉండటం నీకు నచ్చుతుందా? నాన్న నిన్ను వదిలెయ్యలేదు అది గుర్తుపెట్టుకో" తలమీద చెయ్యివేసి నిమురుతూ చెప్పాడు.

మాట్లాడలేదు దీపిక. పిల్లలిద్దరూ లేచి బెడ్‌రూంలోకి వెళ్ళారు.

చిన్నప్పుడు దీపిక బొద్దుగా ఉండటం పైగా దేవిక తల్లికొంగు వదిలేది కాదు. దీపికను ఎప్పుడూ రవీంద్రే ఎత్తుకునేవాడు. దానితో ఇద్దరికీ ఎక్కువ సన్నిహితం. స్కూలు కబుర్లన్నీ పూసగుచ్చినట్లు చెప్పేది.

"నేనేనా నాన్నతో గత మూడేళ్ళుగా ఇంత రూడ్‌గా మాట్లాడాను? ఎన్నిసార్లు నాన్న మాట్లాడటానికి ప్రయత్నించాడు. ఇప్పుడేమీ చెప్పలేను తల్లీ ఇక్కడ ఉంటే ఊపిరి ఆడటం లేదు అని ఎన్నిసార్లు అన్నాడో. దానికి తోడు తన ఎదురుగానే అమ్మ, పెద్దమ్మ, మామయ్య కలిసి నాన్నను తెగ తిట్టటం, నువ్వంటే మీ నాన్నకు ప్రాణం, నువ్వు గట్టిగా పట్టుపడితే కానీ నాన్న తిరిగిరాడు అని నూరిపోశారు."

కళ్ళవెంట నీరు కారటం మొదలయ్యింది. లాక్ డౌన్ ముందు పరిక్షల టైంలో అమ్మ ఇక్కడ దించేసి 'కొన్నాళ్ళు మామయ్య దగ్గర ఉండి ఉద్యోగం వెతుక్కుంటాను' అని వెళ్ళిపోయింది. అప్పటినుండి ఇంట్లో నాన్న ఎంత కష్టపడుతున్నాడో చూస్తూనే ఉంది. ముగ్గురు ముసలివాళ్ళు, ఇద్దరు పిల్లలు. ఇల్లు ఊడవటం, రెండుసార్లు తుడవటం,

వంట. తాతయ్య అందరికి డ్యూటీలు వేస్తే ఏదో సాయం చెయ్యటమే కానీ పనంతా నాన్నే. పైగా ఉద్యోగం ప్రొద్దున్నే ఐదుగంటల నుండి రాత్రి పదకొండు దాకా పని...పని. కంటినిండా నిద్రపోడు. హాల్లో దివాన్ మీద పడుకుంటాడు. మధ్యలో లేచి నానమ్మ సరిగ్గా పడుకుందా, ఇబ్బంది పడుతున్నారేమో అని చూసి వస్తాడు. మహా అయితే ఓ నాలుగు గంటల నిద్ర. ఎందుకు నాన్నను అర్థం చేసుకోలేకపోయింది. ఈ మూడేళ్ళూ అన్నీ చూస్తూ కూడా చెప్పిన మాటలు విని ఎంత మూర్ఖంగా నాన్నను బాధపెట్టాను? ఇప్పటికీ తల్లి పార్టీలు, ఫ్రెండ్స్ అని వెళుతూనే ఉంటుంది. కానీ నాన్న ఎప్పుడూ తల్లి గురించి చెడుగా తమతో చెప్పలేదే మీరు చిన్నవాళ్ళు అన్నీ మీకు అర్థంకావు అని మాత్రమే అన్నాడు. గదిలోనుండి బైటకు వచ్చి తండ్రికోసం చుట్టూ చూసింది దీపిక.

సోఫాలో కూర్చుని న్యూస్ చూస్తున్నాడు. తాతయ్య కిచెన్‌లో టీ పెడుతున్నాడు. మిగతావాళ్ళు నానమ్మ గదిలో ఉన్నారు. ఇదే మంచి సమయం అనుకుంది దేవిక.

"నాన్నా..!" రవీంద్ర పక్కన కూర్చుని నెమ్మదిగా పిలిచింది.

"ఏంటి తల్లీ?" అడిగితేనే సమాధానం చెప్పే దీపిక తన పక్కన వచ్చి కూర్చోవటంతో ఆశ్చర్యంగా అడిగాడు రవీంద్ర.

"ఈజ్ ఎవ్విరి థింగ్ ఓకె?" మాట్లాడకుండా తలవంచుకుని కూర్చున్న కూతురు భుజం చుట్టూ చెయ్యివేశాడు.

తండ్రిని గట్టిగా హత్తుకుని ఏడ్చేసింది దీపిక "సారీ నాన్న, వెరీ వెరీ సారీ"

"అరే ఏమైంది తల్లీ ఇటు చూడు, ఎందుకిలా ఏడుస్తున్నావ్?" కంగారుగా అడిగాడు.

"నిన్ను చాలా బాధపెట్టాను కదా" కళ్ళు తుడుచుకుంటూ అడిగింది.

రవీంద్రకు అర్థం అయ్యింది ఏ విషయంలో సారి చెప్పిందో. కానీ మనస్సులోనిదంతా బైటకు రావాలని ఏమీ మాట్లాడకుండా కూతురు తలనిమురుతూ ఉండిపోయాడు.

దేవిక కూడా అక్క గొంతు విని గదిలోకి వచ్చి, తండ్రికి ఇంకో పక్కన కూర్చుంది.

"మీరు మా కోసం ఎంత కష్టపడుతున్నారో చూస్తూనే ఉన్నా నాన్న. మీరు అందరితో ఎంత ప్రేమగా, సరదాగా ఉంటారో కూడా తెలుసు. అన్నీ తెలిసి కూడా మీ వైపు నుండి ఒక్కసారి ఆలోచించలేదు" మళ్ళీ వెక్కిళ్ళు పెట్టింది.

"నువ్వు చిన్నపిల్లవురా, నీ పరిధిలో ఆలోచించావు" కన్నీళ్ళు తుడుస్తూ ఓదార్చాడు.

"లేదు నాన్న, మరీ అంత చిన్నదాన్నేం కాదు. అందరితో ఎంత మంచిగా ఉండే నువ్వు, ఎందుకు అమ్మ విషయంలో పట్టుపట్టావో అనికూడా ఆలోచించాలి కదా నేను. నేను మొట్టమొదటిసారిగా మిమ్మల్ని ఇంత క్లోజ్‌గా ఈ రెండు నెలల్లోనే గమనించానేమో? I took you for granted and I wanted you to be as per my Wishes. I'm very sorry. మీ ఇష్టం నాన్న, అమ్మతోనే కలిసి ఉండాలి అని నేను ఇంక ఎప్పుడూ ఫోర్స్ చెయ్యను. మీరు మా ఇద్దరిని ఎంత ప్రేమిస్తారో నాకు అర్థం అయ్యింది" గట్టిగా ఊపిరి వదిలింది దీపిక.

"మీరు చిన్నవాళ్ళు తల్లీ మిమ్మల్ని బాధపెట్టాలని ఎప్పుడూ అనుకోలేదు. కానీ నావల్ల కాలేదు. మీరు కాస్త పెద్ద అయ్యాక చెపుదాం అనుకున్నాను. కానీ కొన్ని విషయాలు పిల్లలతో చెప్పకూడదు. నేను అమ్మకు వ్యతిరేకంగా చెప్పి, అమ్మ నాకు వ్యతిరేకంగా చెప్పినా పిల్లలు ఎటూ తేల్చుకోలేరు. ఎవరిని సపోర్టు చెయ్యాలో తెలియక ఇబ్బందిపడతారు. అటువంటి సంఘర్షణ ఉండకూడదు. మేము ఇద్దరం విడిపోతున్నది మా సమస్యల వలన మాత్రమే. అయినా మీ పై మా ప్రేమ, శ్రద్ధ అలానే ఉంటుంది అనే భరోసా మాత్రమే పిల్లలకు ఇవ్వాలి మేము"

రవీంద్రకు మనస్సంతా తేలికగా అయిపోయింది. ఎంతో క్లిష్టమైన ఈ పరిస్థితుల్లో ప్రపంచం అంతా కరోనా ధాటికి అల్లకల్లోలమౌతుంటే, పిల్లల విషయంలో ఉన్న సంఘర్షణ అంతా తొలిగిపోయింది. ఈ ఉపద్రవం రావటం వల్లేనేమో పిల్లలతో సమయం గడిపే అదృష్టం అనుకోకుండా లభించింది.

## తాను నేను — క్రాంతి శివరాత్రి

ఇంజనీరింగ్ మూడో ఏడాది వార్షిక పరీక్షలు. పక్కనే ఉన్న మరో కాలేజీ ఎగ్జాం సెంటర్. నాకు అంతగా ఆసక్తి లేని సబ్జెక్ట్ ఆ రోజు. గంటకే శుభం కార్డు వేసి.. హాల్ అంతా చూస్తున్నా. కిటికీ దగ్గర బిజీ బిజీగా ఎగ్జామ్ రాస్తూ ఓ అమ్మాయి. బహుశా తన ఫేవరెట్ సబ్జెక్ట్ ఏమో, చేయి ఆపకుండా రాస్తూ పోతోంది. తన రింగుల జుట్టు... ఆ కళ్ళు చాలా బావున్నాయ్. ఎంతలా అంటే.. చూడగానే నచ్చేసేటంతలా.

మరుసటి రోజు, ఎగ్జాం తర్వాత ఏదో క్యాజువల్ గా ఓసారి మాట్లాడాలనుకున్నా. కానీ ఆరోజు ధైర్యం చాల్లేదు.ఆ రాత్రంతా అదే ఆలోచన.తెల్లారితే ఆఖరు పరీక్ష.న్ఇక రేపు మిస్స్ అయితే మళ్ళీ జీవితంలో చూస్తానో లేదో. ఎందుకో గానీ.. ఎలాగైనా మాట్లాడాలనిపించి ట్రై చేశా. కానీ అన్ని మనం అనుకున్నట్టు జరగవు కదా!ఆ అమ్మాయి త్వరగా వెళ్లిపోయింది.బయటకొచ్చి చూస్తే ఎక్కడ కనిపించక పోయేసరికి వేగంగా క్లాస్ రూం లోకి పరిగెత్తా. తన బెంచ్ పై ఉన్న హాల్ టికెట్ నంబర్ ను నోట్ చేసుకున్నా.

★హాలీడేస్★....

ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ స్టార్ట్ అయింది. కొత్త బిల్డింగ్. కొత్త క్లాస్ రూం. కొత్త టీచర్స్, కానీ నాకేం కొత్త లా...అనిపించలేదు. అసలు నేను ఈ లోకం లోనే లేను అన్నట్లనిపించింది. అవును నేను ఆ అమ్మాయిని మరువలేకపోయా! అంతలోనే రిజల్ట్స్ వచ్చాయ్.నా నంబర్ కంటే ముందే ఆ అమ్మాయి నంబర్ చూసా.అమ్మో 86%

తనకి. నేను షాక్. మనకెప్పుడు 70% దాటిందే లేదు. పేరు. ప్రీతి మల్ రెడ్డి. వెంటనే ఫేస్బుక్ కి వెళ్ళి వెతికా. దొరికిపోయింది. నాకు మ్యూచువల్ ఫ్రెండ్స్ చూపిస్తూ. ఆశ్చర్యమెంటేంటే మేమిద్దరం ఒకే కాలేజ్. చూసా ఆమె ఫేస్బుక్ అకౌంట్ లో. తను కంప్యూటర్ సైన్స్ డిపార్టుమెంటు. ఆనందంతో ఎగిరి గంతేసినంత పనైంది. తనతో మాట్లాడాలి కానీ ఎలా? ఎలా పరిచయం చేసుకోవాలో తెలియని ఉద్విగ్న పరిస్థితుల్లో అల్లాడిపోయాను. ఇక ఏమైనా కానీ, వెంటనే ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టీ మెసేజ్ చేశా. "కంగ్రాట్స్ టాపర్" అని ఏదో పెద్ద కవిత్వమే రాసి పంపా. మెసేజ్ ఐతే చూసుకుంది. కానీ రిక్వెస్ట్ ఆక్సెప్ట్ చేయకపోగా, కనీసం మెసేజ్ కి రిప్లయ్ కూడా ఇవ్వలేదు. అసలు ఈ మూడు సంవత్సరాలు నాకు తను ఎందుకు ఎదురవ్వలేదని తిట్టుకున్నా.

మరుసటి రోజు కంప్యూటర్స్ సైన్స్ డిపార్ట్మెంట్ ముందు చాలా సేపు నిలబడి చూసా.తను కనిపించలేదు. బహుశా తను క్లాస్ టైమ్ లో బయట తిరగదేమో అనుకున్నా. ఎంతైనా టాపర్ కదా! లోపలికి వెళ్ళి చూసి వద్దునా..? అమ్మో వద్దు అందరూ అమ్మాయిలే. ఎవరైనా చూస్తే బాగోదు. బాగోకపోవడం సంగతి పక్కన పెడితే, పక్క డిపార్ట్మెంట్ లో నీకేం పని అని ప్రిన్సిపల్ సస్పెండ్ చేసే రకం. ఎందుకొచ్చిన గొడవనుకొని ఊరుకున్నా. మధ్యాహ్నం అలా క్యాంటీన్ కి వెళ్ళా. మెట్లు ఎక్కుతున్నా... పైనుంచి ఒక అమ్మాయిల గుంపు ఎదురుగా వస్తూ దిగుతున్నారు. తల ఎత్తి చూశా. ఎదురుగా తను. అమ్మో తనే..గుండె ఆగినంత పనైంది. ఊపిరి బిగపట్టి చూస్తున్నా. తనూ నా వైపే చూస్తోంది. కాళ్ళ కింద భూమి కంపించినట్టయింది. కళ్ళు మూసి తెరిచలోగా.. ఆమె క్షణాల్లో నన్ను దాటి వెళ్ళిపోయింది. నా మనసంతా తన రూపంతో నిండిపోయింది. ఏవో ప్రశ్నలు. అంతు చిక్కని సమాధానాలు. తను నన్ను చూస్తూ..ఎందుకలా ఒక్క క్షణం ఆగిపోయింది. ఫేస్బుక్ లో నన్ను చూసిందా?చూసే ఉంటదిగా! గుర్తు పట్టిందా? లాగి ఒక్కటిద్దాం అనుకుందా ? ఏమో, అనుకుంటూ రూం కొచ్చేసా. ఫ్రెండ్స్ అల్లరి. ప్రశాంతంగా అలా వరండా లో గాలికి తిరుగుతూ చందమామను చూస్తూ ఉన్నా. ఆ కన్ఫ్యూజన్ ను పక్కకు నెట్టా. కాసేపట్లోనే వైబ్రేషన్స్ తో ఫోన్ కి మెసేజ్. చిరాకుగా ఓపెన్ చేశా. ఫేస్బుక్ లో, మెసేజ్ ఫ్రమ్ సింగిరెడ్డి అని చూపించింది. రోబో లాగా ఓపెన్ చేసీ, శిలల బిగుసుకుపోయి చూస్తున్నా.

"ఈరోజు మధ్యాహ్నం...... మధ్యాహ్నం నువ్వేనా...నువ్వేనా క్యాంటీన్ దగ్గర.....?" అని ఆ మెసేజ్!

చేతులు, కాళ్ళు వణుకుతున్నాయ్..ఎందుకో మరి!

'ఆ .. నేనే ' అని రిప్లయ్ ఇచ్చా..

"ఎవరు నువ్వు" ..? అడిగింది.

"నేనా...?నా పేరు చుపించట్లేదా ఫేస్బుక్ నీకు?" అన్నాను నేను.

అంతే ఇక. ఇంకో మెసేజ్ రాలేదు అక్కడినుంచి.

మా డిపార్ట్మెంట్ లో నీళ్ళు రావట్లేదు.ప్రిన్సిపల్ కి కంప్లైంట్ చేస్తే ...బాగు చేసేదాకా పక్క డిపార్ట్మెంట్ లోకెళ్లి నీరు తాగి రమ్మని చెప్పడంతో ఇక నా సంతోషానికి హద్దే లేకుండా పోయింది. ఇక ఊరుకుంటామా. నెక్స్ట్ డే నుంచి బాటిల్ ఒకటి వేసుకొని, బ్రేక్ దొరికినప్పుడల్లా తన డిపార్ట్మెంట్ కి వెళ్ళడం..తనని వెతకడం. ఓరోజు నీటి కొళాయి దగ్గరుండగా, ఎవరో వచ్చినట్టనిపించి వెనక్కి చూశా. తనే..నా వెనకాలా. తననలా చూస్తూ ఉండిపోయేసరికి బాటిల్ నిండి పోయి నీళ్ళు కిందకి పారాయి. తను నవ్వుతూ..”హేయ్ చూడక్కడ... లే జరుగు పక్కకు” అనగానే ... తేరుకొని త్వరగా బయటకొచ్చేశా.

ఆ మరుసటి రోజు నుంచి ఎక్కడ కనపడిన నవ్వుతూనే ఉండేది నన్ను చూసి. నాకు ఏదో సిగ్గుగా అనిపించేది. అక్కడినుంచి పరిగెత్తే వాడిని. ఓరోజు లైబ్రరీ లో కూడా బుక్స్ అక్కడ వదిలేసి వచ్చా. ఆ రాత్రి తన నుంచి ఓ మెసేజ్ వచ్చింది.

“ఏం ..? నిన్నేమైన చంపేస్తానా నేను.ఎంటీ నీ ఓవర్ యాక్షన్..?”అని.

“అవును మరి మీ చూపులు అలాగే ఉన్నాయ్” అన్నాన్ నేను.

“సర్లే ..నీ పేరేంటి ?”

“ అనిల్ “ చెప్పా నేను .

“ఏ డిపార్ట్మెంట్?”..

“సివిల్ ఇంజనీరింగ్” .

“ఓహ్ బిల్డింగ్స్ కడతావా”( స్మైలీ ఇమోజీస్ తో)..అంది.

“ఎస్” అన్నాన్ నేను.

“సర్లే ఎందుకు మెసేజ్ చేశావ్? నేనెలా తెలుసు నీకు? నా రిజల్ట్స్ నీకెలా తెలిసాయ్? నా హాల్ టికెట్ నంబర్ ఎవరిచ్చారు నీకు..?” వామ్మో క్యాంపస్ ప్లేస్మెంట్ లో కూడా అన్ని క్వశ్చన్స్ అడగరేమో ఒకేసారి! నేను జరిగిందంతా చెప్పా.

“ఏ మెంటలా నీకేమైనా?” అంది తను.

రోజులు గడుస్తున్నాయి. ఆమె అమాయకపు నవ్వు, ఆ అందం చూసి మతి పోయినట్లయింది నాకు. ఒకరినొకరు చూస్తూ నవ్వుకునే వాళ్ళం దూరం నుంచి. ఏరోజూ ఒకదగ్గర కూర్చొని మాట్లాడుకుంది లేదు. కానీ మా మనసులు మాత్రం పక్కపక్కనే ఉన్నట్లనిపించేది. దూరం పెద్ద దూరమేం కాదు అనిపించేది. ఫోన్ నంబర్స్ ఇచ్చుకున్నామ్ ఒకరికొకరం. వాట్సప్ లో రాత్రిళ్ళు చాటింగ్ లు.మాటలు కలుస్తున్నాయి. చాటింగ్ ఒక్కో రోజు అర్ధరాత్రి దాటేది. ఒకరికొకరి అభిరుచులు, ఇష్టాయిష్టాలు పంచుకున్నాం. స్పష్టమైన ఆలోచనలు, సున్నితమైన మనస్తత్వం తనది. ఓ రాత్రి

చెప్పేశా. "ఐ లవ్ యూ" అని. అఫిషియల్ గా అపుడే చెబుతున్నప్పటికీ, తనకి తెలుసు నేను ఎప్పటినుంచో తనని లవ్ చేస్తున్నా అని. కానీ ఏమీ తెలియనట్లు "ఏయ్ పిచ్చా నీకు?" అంది. (నవ్వుతున్నా ఇమోజిస్ తో). “లేదు నువ్వంటే నాకు చాలా ఇష్టం,పెళ్లి చేసుకుందామా?” అడిగా నేను.

“మెంటాలా నీకు?” (నవ్వుతున్నా ఇమోజీ తో).

రోజు అంతే ఇక. ఎప్పుడడిగిన ఇదే సమాధానం. నవ్వుతుంది తప్ప రిప్లై ఇవ్వదు నా ప్రశ్న కి. కానీ ఇన్ డైరెక్ట్ గా నాకు అర్ధమయ్యేది తనకి నేనంటే ఇష్టమని. ఎలా చెప్పగలవ్? అంటే ఏ అబ్బాయి చెప్పలేడు గాని, వాళ్లకి తెలిసిపోతుంది. కొన్ని ఫీలింగ్స్ బయటకు ఎక్స్ప్రెస్ చేయలేరు, అంతే అది. చాటింగ్ మధ్యలో ఇంకా చెప్పు అన్నప్పుడల్లా...'ఐ లవ్ యూ' అనే వాడిని.ఓ  రోజు స్పందించింది. “లేదు అనిల్ ఇపుడు ఇవన్నీ వద్దు, ఈ వయసులో ఎన్నో అనుకుంటాం. కానీ అవన్నీ మనం ఊహించినంత ఈజీగా ఉండవ్. ఒక ఏజ్ కి వచ్చాక మంచి ఉద్యోగం, మన కాళ్ళ మీద మనం బతకగలిగే స్థాయికి వెళ్ళాక గానీ ఇలాంటి నిర్ణయాలు తీసుకోవద్దు” అంది.

“ఇప్పుడేమైంది మరి, ఇద్దరం సెటిల్ అయ్యాకే కదా పెళ్లి”అన్నాను నేను.

తను మళ్ళీ “హేయ్ మెంటల్” నవ్వుతూ ఉన్న ఇమోజీస్ తో...(ఎన్నో సార్లు ఇలాగే ).

“నువ్వంటే నాకిష్టం అనిల్, మా డాడీ,అన్నయ్యల తర్వాత నేను పూర్తిగా ఏ అబ్బాయినైనా నమ్ముతానంటే అది నిన్నే” ఇలా ఎన్నో సార్లు చెప్పేది. అంతవరకు వచ్చి అలా చెప్పిందంటే, ఇంకేం కావాలి ? ఆ మూడు పదాలు కూడా చెప్పాల్సిన అవసరం ఇంకెందుకు అనిపించేది. నా సంతోషానికి పట్టపగ్గాల్లేవ్. ఇక ఆమెతోనే నా జీవితం అనుకున్నా. భవిష్యత్తు ప్రణాళికలు వేసుకున్నా. ఒక్కరోజు కాలేజీకి వెళ్లకపోయినా “ఏంటి ఎందుకు రాలే నువు?” అని మెసేజ్ చేసేది. కాలేజీలో దూరం నుంచి ఒకరికొకరం చూసుకునే వాళ్ళం. “లైబ్రరీకి వస్తున్నా ఎక్కడున్నావ్?” అని మెసేజ్ చేసేది. ఎదురెదురు గా కూర్చొనేవాళ్ళం రోజూ.

కాలానికి అంత తొందరెంటో చూస్తూ వుండగానే ఇయర్ ఎండింగ్ వచ్చేసింది. ప్రాజెక్ట్ వేటలో కాలం గడిచిపోతుంది. తన నుంచి మేసేజ్ లేదు. నేనూ చేయలేదు. కోర్సు ఎండింగ్ లో ఎవరి బిజీ వాళ్ళది కదా! అనుకున్నా. తను క్యాంపస్ ప్లేస్ మెంట్ లో మంచి ఉద్యోగానికి సెలెక్ట్ అయింది. తన ఫ్రెండ్ ఒకరి ద్వారా నాకు ఆ విషయం తెలిసిన మూడ్రోజుల తర్వాత..తన నుంచి మెసేజ్ వచ్చింది. "హాయ్ అనిల్, నాకు జాబ్ వచ్చింది” అని

“ఓహ్ కంగ్రాట్స్” ఆన్నాన్ నేను.

“థాంక్స్” రిప్లై వచ్చింది అంతే.

ఇంజనీరింగ్ అయిపోయింది. మా ఊరికి వచ్చేశా. ఇంకా నెక్స్ట్ టార్గెట్? ఉద్యోగం. ఆ తర్వాత మా పెళ్లి. అప్పటికే తనకి జాబ్ రావడం మాకు కలిసొచ్చే విషయం అనుకున్నా. అసిస్టెంట్ ఇంజనీర్ జాబ్స్ కి నోటిఫికేషన్ వచ్చింది. బాగా చదువుతున్నా. ఎగ్జామ్ అయిపోయాక మాట్లాడదాం లే అనుకున్నా!

ఓ రోజు నా ఫ్రెండ్ దగ్గర్నుంచి ఒక మెసేజ్ "అనిల్ ఎక్కడున్నావ్ రా? నీకో విషయం తెలుసా...సుధీప్తి పెళ్ళంట కదా!?" అని.

"జోక్ చేస్తున్నావా" అన్నాన్ నేను! ఫోన్ పెట్టేసి వాట్సప్ లో వెడ్డింగ్ కార్డ్ పంపించాడు.నిజమే రెండ్రోజుల్లో తన పెళ్లి. గుండె ఆగిపోయింది ఒక్క క్షణం. గత పదేళ్లుగా కన్నీళ్లే రాని నా కంటి నుంచి నీళ్లు జలపాతాల్లా దూకుతూ పడుతున్నాయి. నోరు తెరుచుకోలేదు. స్పర్శ లేదు. కళ్ళు తెరిచే ఉన్నా ఏమి కనపడట్లేదు. బాధతో దాదాపు పిచ్చి వాడినయ్యా. జీవితాంతం తోడుంటుందనుకున్న ప్రేమ, నన్ను అర్ధాంతరంగా వదిలి వెళ్ళిపోయినందుకు జీవితమే భారం అనిపించింది. ఎన్నో నిద్ర లేని రాత్రులు. ఏవేవో ప్రశ్నలు. అసలు మా మధ్య ఏ గొడవా లేకుండానే..ఎందుకిలా చేసింది.

"నీ గురించి అన్ని విషయాలు పంచుకున్నావ్,ఏ సమస్యా ఉన్న చెప్పుకున్నావ్. ఎందుకిలా నాతో ఒక్క మాటైనా చెప్పకుండా వదిలేసి వెళ్ళావ్...?" అని నా మనసులో అనుకోని రోజే లేదు.

తను ప్రేమించిన అమ్మాయి, తనను పెళ్ళి చేసుకుంటేనే సుఖపడుతుందని ప్రతీ ప్రేమికుడూ నమ్ముతాడు.

కానీ అలా జరగనప్పుడు ఎవరేం చేయగలరు? తెలిసీ తెలియని వయసులో ప్రేమలో పడ్డా. ఉద్యోగం కోసం ప్రయత్నం చేసే ఏజ్ లో ఇలా సమయం వృధా చేసుకుంటున్నా.

నన్ను నేనే మోసం చేసుకుంటున్నానా? అనే భావనలో కొట్టుమిట్టాడుకుపోయా. సంవత్సరం పాటు ఎవరితో మాట్లాడకుండా ఒంటరిగా కుమిలి పోయా. ఆ సంవత్సరం ఉద్యోగ ప్రయత్నం విఫలమైంది. అసలే పేదరికం,బతుకు భారమైంది. ఇంకెన్ని రోజులు ఇలా కుర్చోనూ అనిపించింది. నా మీద నాకే అసహ్యమేసింది. తర్వాతేంటి? నేను మారాలి.. పూర్తిగా మారి పోవాలి. నేను ఎదగాలనే తపన, నా భవిష్యత్ గురించిన స్వార్థం నా మనసును, శరీరం నుంచి వేరు చేశాయి. స్వార్థం, భయం, లక్ష్యం, ఆశయం, ప్రేమ...ఇవన్నీ మనిషి శరీరాన్నీ, మనసునీ వేరు చేయగలవనీ అప్పుడే తెలుసుకున్నా. ఉద్యోగం సంపాదించాలనే కాంక్ష నాలో మొదలైంది. అనుక్షణం ఆమెనే గుర్తు చేసుకుంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేశా. ఆ కష్టం ఊరికే పోలేదు. మంచి గ్రీన్ పెన్ హోదాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించా..! కానీ గెలిచానని సంతోషపడలా? ఓడిపోయానని బాధ పడాలా? అని అర్థం కాకుండానే రెండేళ్లు, నా ఉద్యోగంలో తీరిక లేకుండా గడిపా. కానీ తనని గుర్తు చేసుకోని రోజే లేదు.

మూడు సంవత్సరాలయింది అప్పటికి తనతో మాట్లాడక. విడిపోవడం కూడా ఒక పద్దతి ప్రకారం జరగలేదు మా బంధం. ఏం జరుగుతుందోనని తేరుకొనేలోపే అంతా అయిపోయింది.

తన జ్ఞాపకాలు నన్ను వెంటాడుతూనే వచ్చాయి. ఓ రోజు ధైర్యం చేసి ఫేస్బుక్ లో మెసేజ్ పెట్టా 'హాయ్' అని.వారం రోజుల తర్వాత రిప్లై వచ్చింది."హాయ్ అనిల్ ఎలా ఉన్నావ్?"అని. పెళ్ళయాక అందరూ వాళ్ళ ఫ్యామిలీ తో బిజీ అయిపోతారని ఆ వారం రోజుల లేట్ రిప్లై చెప్పింది నాకు.

“బాగున్నా” అన్నాను నేను.

తన కుటుంబం గురించి మొత్తం నాతో పంచుకుంది. కంటికి రెప్పలా చూసుకునే ఆమె భర్త , ముద్దొచ్చే తన బుల్లి కూతురిని చూస్తే ముచ్చటేసింది. “ఏం జరిగిందసలు?” అని నేనేం అడగలేదు.తనూ..చెప్పలేదు! నార్మల్ గా చాలా రోజుల తర్వాత ఫ్రెండ్స్ లాగే మాట్లాడుకున్నాం. తనతో మాట్లాడుతుంటే, నేను ప్రాణంతోనే ఉన్నాననే నమ్మకం తిరిగొచ్చింది.ఒక్కసారిగా నా ప్రపంచమంతా కొత్తగా కనిపించటం ప్రారంభమయింది. ఇలా కూడా బాగుంది. తను నాకు టచ్ లో ఉంటే చాలు అన్నట్టు. తను ఎక్కడున్నా సంతోషంగానే ఉందిగా అన్నట్టు!

అమ్మాయిని ప్రేమించడం అంటే నా దృష్టిలో అమ్మాయిని మాత్రమే ప్రేమించడం కాదు. ఆమె కష్టాలు,ఇష్టాలు,బాధ్యతలు సంతోషాల్నీ ప్రేమించగలగాలి. నిజమైన ప్రేమ అదే నాకు తెలిసి. అవును ఇప్పటికీ తనని నేను ప్రేమిస్తూనే ఉన్నా...ఉంటా...ఎప్పటికీ...! కాలం మారినా, నువ్వు మారినా! నా మనసులో, నీమీద ఉన్న ప్రేమ మాత్రం నా ఊపిరి ఆగే చివరి క్షణం దాకా మారదు..!

★★★

## సెకండ్ ఇన్నింగ్స్ — మోపూరి కె రెడ్డి

అంతర్జాతీయ క్రికెట్లో అన్ని ఫార్మాట్లకి వీడ్కోలు పలికిన తర్వాత, కుటుంబ సమయాన్ని ఆనందిస్తున్న అంతర్జాతీయ క్రికెటర్ కుమార సంగక్కర, కొన్ని వారాలు సరదాగా గడుపుదామని, శ్రీలంకలో తను పుట్టిపెరిగిన ఊరు కండీ (kandy)కి వచ్చాడు. ప్రశాంతమైన విశ్రాంతి తర్వాత భవిష్యత్ కార్యాచరణ గురించి ఆలోచించాలని తన ఉద్దేశం. ఇంతవరకూ క్రికెటే తన సర్వస్వంగా గడిచిపోయింది. ఎప్పుడూ జీవితంలో తన సెకండ్ ఇన్నింగ్స్ గురించి ఆలోచనే రాలేదు. తనతో గడిపే సమయం కోసం కొన్నేళ్లుగా వేచిచూస్తున్న తన కుటుంబాన్ని మనసులో పెట్టుకొనే, ఏ నిర్ణయమైనా తీసుకోవాలని తెలుసు. అసలే రెండు వారాల క్రితం తన రిటైర్మెంట్ సన్మాన సభలో శ్రీలంక అధ్యక్షుడు అనూహ్యంగా తనని బ్రిటన్లో శ్రీలంక హైకమీషనర్ పదవికి ప్రతిపాదించినప్పటి నుంచీ, తన కుటుంబ సభ్యులంతా చాలా ఉత్తేజితులై ఉన్నారు. “అంతర్జాతీయ సమాజంలో తమ దేశానికి సంగా సరైన ప్రతినిధి” అంటూ అధ్యక్షుడు కొనియాడటం

ఇంకా తన చెవుల్లో మారుమోగుతోంది. క్రికెట్ వల్ల ఇప్పటికే కావాల్సినంత సంపాదించాడు. ప్రపంచంలో కోరుకున్న చోట పిల్లల్ని చదివించగలడు. సెలవులకి భూగోళం మీద ఎక్కడైనా వాలగలడు. కాబట్టి, ఇంట్లోనివాళ్లకి అందుబాటులో, క్రికెటేతర ఇన్నింగ్స్ ఏదైనా మొదలుపెట్టాలా? ఎలాగూ, చాలా సంపాదించేశాడు కాబట్టి, అందరు క్రీడాకారుల్లా, తానూ ఆటనుంచి రిటైర్ అయ్యి, వేరే వ్యాపకం ఎందుకు చేపట్టకూడదు? ఇలాంటి వ్యాపకాలైతే కుదురుగా ఒకచోట ఉండి పర్యటనల వల్ల కుటుంబంతో కోల్పోయిన సమయాన్ని తిరిగి పొందే వీలు కూడా ఉంటుంది కదా?

కానీ, అంతగా ఆరాధించిన ఆటకి దూరమై తను సంతోషంగా ఉండగలడా? తననంటూ నిర్మించి, అంతర్జాతీయంగా తనకు దిగ్గజ గుర్తింపునిచ్చిన శ్రీలంక క్రికెట్కి కూడా తాను చేయాల్సినవి చాలానే ఉన్నాయని గుర్తెరిగినవాడు సంగా. నిన్నకూడా సర్రే కౌంటీ క్రికెట్ క్లబ్ (SCCC) నుంచి కాంట్రాక్టు విషయమై ఫోనుకాల్ వచ్చిందని తన మేనేజర్ చెప్పాడు. ఈ సీజన్ కాంట్రాక్టులు ముగించడానికి ఇంక నాలుగు వారాలు మాత్రమే ఉందని గుర్తు చేసాడు. ఆటతో తన ప్రయాణాన్ని ఇంకా ఆటగాడిగా, కోచ్ గా, లేదా వ్యాఖ్యాతగా కొనసాగించి తనెంతో ప్రేమించే కుటుంబాన్ని మరిన్ని త్యాగాలకి గురి చేయాల్సిందేనా? ఇలాంటి ప్రశ్నలనుంచి ఉపశమనం కోసం ప్రశాంతత వెతుక్కుంటూ వచ్చాడు చిన్నపుడు పుట్టిపెరిగిన తన ఊరికి. ఎప్పటిలాగా వేసవికాలం ఐరోపాకి వెళ్లకుండా ఇక్కడికి వచ్చినందుకు తన పిల్లలకి కొంచెం కోపంగా ఉంది. కానీ వాళ్లకి తమ తాతయ్య, నానమ్మలని కలుసుకున్నందుకు సంతోషంగానూ ఉంది. గత వారంరోజులుగా వాళ్లకి తను చదువుకున్న స్కూలు, కాలేజీ, స్నేహితులతో తిరిగిన ప్రదేశాలూ చూపిస్తున్నాడు.

ఒకానొక ఉదయం, ఇంకా తెల్లవారక ముందే మెలకువరావడంతో, లేచి బయటికి వెళ్లాలనిపించింది సంగాకి. ఇంట్లో ఇంకా ఎవరూ నిద్ర లేవలేదు. కొంచెం కాఫీ కలుపుకొని, ఫ్లాస్కులోకి తీసుకుని బయటికి బయల్దేరాడు ఊరిబయట తాగుదామని. కారు మెల్లిగా ఊరికి ఉత్తరదిశలో పరుగుపెట్టింది. ఇంకా సూర్యోదయం కాకపోయినా, వేసవికాలం అవడంతో చల్లటి వెలుగు పరుచుకొని ఉంది. డోరు గ్లాసులు దించేసి, వీస్తున్న చిరుగాలిని ఆస్వాదించడం మొదలు పెట్టాడు సంగా. కండీ నగరం శ్రీలంకలో రాజులు అంతరించేనాటికి వారి చివరి రాజధాని. చుట్టూ పచ్చని కొండల మధ్య, పీఠభూమిపై ఉంటుంది కండీ. నగరానికి కొంచెం ఉత్తరంగా సారవంతమైన 'మధ్య కొండలు (Central Hills)' ఉంటాయి. అలా అలక్ష్యం(aimless)గా తిరుగుతూ, ఒక సరస్సు కనిపిస్తే, కారు అక్కడ ఆపి, ప్రశాంతంగా ఉన్న ఆ దృశ్యం చూద్దామని దిగాడు. ఒళ్ళంతా ఒకసారి విరుచుకొని, రొమ్ములనిండా గాలి పీల్చుకున్నాడు. రోడ్డుపక్కన, "దునువిలా 0Km, మాతలై 16Km" అన్న బోర్డు కనిపించింది. ఊరుదాటి కాస్త ముందుకు వచ్చిన సంగతి అప్పుడు గమనించాడు. అక్కడున్న ప్రకృతిని ఆస్వాదిస్తూ అటూఇటూ నడుస్తున్న సంగాకి, దివ్య తేజస్సుతో మెరిసిపోతున్న ఒక మనిషి, గట్టుమీద కూర్చొని, చాలా దీర్ఘంగా ఆలోచిస్తూ కనిపించాడు. 'ఈయనెవరబ్బా, చాలా వింతగా, గొప్పగా

ఉన్నాడు' అనుకుంటూ ఆశ్చర్యపోయాడు. అయినా ఈ సమయంలో ఇక్కడేం చేస్తున్నాడో అనుకుంటూ, దగ్గరికెళ్లి అడిగాడు, “మీరెవర”ని .

గడ్డంకింద పెట్టుకున్న చేయి తీసి, దీర్ఘాలోచన నుంచి బయటికొచ్చిన ఆయన, తల పైకెత్తి ఓసారి సంగావైపు చూసి, ఏభావం లేకుండా పక్కకి తిప్పుకున్నాడు. సమాధానం కోసం సంగా ఇంకా తననే చూస్తూండటంతో, ఓసారి నిట్టూర్చి, "నేనా? నేను, దేవేంద్రుని సారథిని, నన్ను మాతలి అంటారు" అన్నాడు తనవైపు చూడకుండానే.

"ఆఁ!?" అని నివ్వెరపోయిన సంగక్కరకి ఏంచేయాలో పాలుపోలేదు. తనకి హిందూ మైథాలజీ గురించి తెలిసింది తక్కువే అయినా, ఆయన ఏంచెప్పాడో అర్థమైంది, కానీ, నమ్మాలనిపించలేదు, పైగా, ప్రశాంతంగా ఉంటుందని పొద్దున్నే ఇలా వస్తే, ‘ఈయనెవరో, ఎందుకిలా చెబుతున్నాడో?'నని విసుగొచ్చింది. కాసేపు మౌనంగా ఉండి, కోలుకున్నాక, ‘అంటే ఈయనో హిందూ దేవుడనమాట!' అనుకుంటూ మెల్లిగా అడిగాడు, కొంచెం వెటకారంగా, "అయ్యా, అయితే, మీరు ఇక్కడ, ఇప్పుడు ఏంచేస్తున్నారో?" అని. సమాధానం రాకపోయే సరికి, "అయినా, తమరంత గొప్పవారు కదా, ఎందుకో తమరు కొంచెం దిగులుగా కనిపిస్తున్నారు?" అన్నాడు.

అయినా బదులు రాకపోయేసరికి, ‘ఇదేదో ఆసక్తిగా ఉందే, ఈయన నాటకాలు ఆడుతున్నాడో, లేక నిజంగానే అంతటివాడో తెలుసుకోవాలి' అనుకుంటూ, కాఫీ సంగతి గుర్తొచ్చి, కారులో ఉన్న ఫ్లాస్కు తీసుకొద్దామని ఆయనకి చెప్పకుండానే కారు దగ్గరికొచ్చాడు. తీరా వచ్చాక గుర్తొచ్చింది, తనకొక్కడికే మగ్గు తెచుకున్నాడని. ‘ఆఁ!, దేవతలు కాఫీ తాగరులే' అని తనకితానే వెటకారంగా సమాధానం చెప్పుకున్నాడు. పొగలు కక్కుతున్న కాఫీ మగ్గులో పోసుకొని వచ్చి, "ఇంక చెప్పండి మీ కథ!" అని ఎదురుగా కూచున్నాడు. అంతలోనే, “నా దగ్గర ఒకే మగ్గు ఉంది, అందుకనే మీకు కాఫీ ఇవ్వలేక పోతున్నాను” అని కూడా చెప్పాడు. ఈలోపు తన మొబైల్ ఫోను తీసి, అంతర్జాలంలో ఈయన గురించి వెదుకుతున్నాడు.

అప్పుడప్పుడూ తనని ఓరకంట కనిపెడుతూ, మొబైల్ ఫోను చూసుకుంటూ, మధ్య మధ్యలో కాఫీ తాగుతున్న సంగాతో, కాసేపయ్యాక ఆ దివ్య పురుషుడు మెల్లిగా మాట్లాడటం మొదలు పెట్టాడు, "చేస్తున్న పనిలో సంతృప్తి, అదే, జాబ్ శాటిస్ఫాక్షన్ అంటారే మీరు, అది ఉండట్లేదయ్యా నాకు" అని.

అయన మాటల కోసమే ఎదురుచూస్తున్న సంగా, మొబైల్ స్క్రీనులోనుంచి తల పైకెత్తి, "ఒక్క నిముషం, ఏమన్నారూ? సాక్షాత్తూ దేవతలందరికి బాసు అయిన దేవేంద్రుని రథసారథి అయ్యిఉండి, కేవలం గొప్పవాళ్లు మాత్రమే ఉండే స్వర్గంలో ఉండీ ఇలా మాట్లాడుతున్నారే? హ్మ్, ఆసక్తికరంగా ఉందే!" అని ఆశ్చర్యపోయాడు సంగక్కర.

"అబ్బే, అంత అమరావతిలోనూ నేను సాధించిన గొప్ప కార్యాలు అంటూ పెద్దగా ఏం లేవయ్యా" నిట్టూర్చాడు ఆయన.

"అవునా, సామాన్యంగా మీ ఉద్యోగ బాధ్యతలెలా ఉంటాయి?" ప్రశించాడు సంగా.

"ఇందాక చెప్పినట్లు, నేను ఇంద్రుని రథ సారథిని, అంటే డ్రైవరుని. ఆయన యుద్ధాల్లో పాల్గొన్నప్పుడు తన రథాన్ని చాకచక్యంతో, సమయస్ఫూర్తితో శత్రువుల మధ్యలో నడిపించి విజయానికి దోహదపడతాను"

"మరింకేం, దేవతలకే రాజు కాబట్టి, లోకాలకల్యాణం కోసం గొప్ప గొప్ప యుద్ధాలు చేసే ఉంటారుగా మీరిద్దరూ కలిసి?", ఆయన్ని అనుమానించి అడుగుతున్నట్లులేదు, అర్థం చేసుకుందామనే అడిగినట్లు ఉంది.

"ఎక్కడా? స్వర్గం మీదకి దండెత్తేది ముఖ్యంగా రాక్షసులు. అందులోనూ, తపస్సు చేసి, గొప్ప గొప్ప వరాలు పొందిన వాళ్లు మాత్రమే యుద్ధానికి వస్తారు. ఆ వరాల సంగతి తెలిసి, వాళ్లని ఎలాగూ గెలవలేం అని, ఇంద్రుడు ముందుగానే లొంగిపోయి, అప్సరసలతో రిసెప్షన్ ఏర్పాటు చేస్తాడు. అందరం అవమానాల పాలవుతాము. ఒకవేళ చిన్న చిన్న రాక్షసులు వచ్చారంటే, అప్పుడు యుద్ధం ఉంటుంది, కానీ, సులభంగా అయిపోతుంది, సవాలు ఉండదు."

"ఓహో! అదన్నమాట మీ సమస్య! ఇదేదో మా మీదున్న విమర్శలాగా ఉందే. నన్ను, నా మిత్రుడు జయవర్ధనను ఆ మధ్య flat track bullies అని, Minnow Bashers అని అన్నారులెండి. అది పక్కన పెడదాం, ఆలెక్కన, మీ కెరీర్లో గొప్పగా చెప్పుకునే యుద్ధాలే లేవా?"

"ఎందుకు లేవు, అలాంటి జ్ఞాపకాలు కొన్నైనా ఉన్నాయి కాబట్టే, అప్పుడప్పుడు వాటిని నెమరు వేసుకొని తృప్తిపడుతూ ఉంటా. ఇప్పుడుకూడా, ఇక్కడికి ఎందుకు వచ్చాననుకున్నావ్, అందుకే! చాలా కాలం క్రితం ఇక్కడ చోటుచేసుకున్న అలాంటి ఒక గొప్ప జ్ఞాపకాన్ని తలచుకుందామని వచ్చా."

"అవునా, ఇక్కడా? ఇంకా ఆసక్తికరంగా ఉంది, చెప్పండి, నేను కూడా వింటాను" అంటూ తన మగ్గు మళ్లీ నింపుకున్నాడు సంగా.

"నా కెరీర్లో నేను పాల్గొన్న ఒకానొక గొప్ప సమరం, రామ రావణ యుద్ధం. ఏరకంగా చూసుకున్నా, అదొక గొప్ప చారిత్రాత్మక సమరం. ఆ యుద్ధంలో సుసంపన్న రాక్షస సైన్యంతో రావణుడు ఒక పక్క, పరమ సామాన్య వానరసేనతో ధర్మమూర్తి రాముడు ఇంకో పక్క పోరాడుతున్నారు. రాముడి తండ్రి దశరథుడు, అనగా, పది రథములు కలవాడు అని అర్థం. అంతటి చక్రవర్తి కుమారుడే అయినా కానీ, వనవాసంలో ఉన్నకారణంగా, ఒక సాధారణ సైనికుడిలాగా, యుద్ధం చేయడానికి ఒక్క రథం కూడలేక, పోరాడిన అన్ని రోజులూ నేల మీదనించి, లేకపోతే హనుమంతుడి భుజాలమీద నుంచి బాణాలు వేశాడు.

ఒక్క చివరి రోజు మాత్రం, మహా ఘట్టానికి సహకరిస్తూ దేవేంద్రుడు సారథితో సహా తన రథాన్ని రామునికి ఇచ్చి యుద్ధం చేయమన్నాడు. అలా నాకు కూడా ఆ యుద్ధంలో ఒక్క రోజు పాల్గొనే అవకాశం వచ్చింది. కళ్లారా రాముని యుద్ధ ప్రతిభ సందర్శించే భాగ్యం, ఆయనకి సారథ్యం వహించే భాగ్యం కూడా కలిగింది. రాముడు అరివీర భయంకరుడు, ఎంతటి దయామూర్తో, అంతటి కదన కుశలుడు. వందలమంది భయంకర రాక్షసులని క్షణాల్లో తన బాణాలతో ఇట్టే పడగొట్ట గలడు. యుద్ధంలో రాముని బాణాలని ఆ తర్వాత కాలంలో శ్రీ కృష్ణ దేవరాయలు అనే కవి ఆముక్తమాల్యద అనే కావ్యంలో ఇలా వర్ణించాడు.

స్యందనస్థిత బిడౌజః క్షత్తృ జాడ్యకృత్ ఝుంఝూమరుత్ గరుత్ ఝూత్కృతములు
క్రవ్యాశిరాట్ గాత్ర కనదస్రుక్ గాహన స్ఫుటశల్య హవ్యభుక్ ఛూత్కృతములు,
యోధవర్మిత హృత్పుటోత్క్రాంత నిజపాత సాలాశ్మకృత ముహు ష్ఠాత్కృతములు
పతితోగ్రరక్షః కబంధ భారభృశార్తి భుగ్నభోగ ఫణీంద్ర ఫూత్కృతములు

దాని భావం ఏంటంటే, 'ఇంద్రుడు బహుకరించిన రథంలోనుండి శ్రీరాముడు బాణాలు విసురుతుంటే, అవి మహావేగంగా వెళ్తూ, అంతేవేగంతో వెనుకకి కొత్త గాలులని సృష్టిస్తూ 'ఝూత్' 'ఝూత్' మని సారథి అయిన మాతలి పక్కనుంచి పోతూ అతడికి ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. రాక్షసుల శరీరాలలో దిగి, వాళ్ల రక్తంలో మునిగి, బాణాల కొలుకులలోని వేడిమి 'ఛూత్' మని వేడి వస్తువును నీళ్లలో ముంచినపుడు వచ్చే శబ్దం చేస్తున్నాయి. ఆయన విసిరిన బాణాలు మహాయోధుల హృదయాలని చీలుస్తూ వెనుక నుండి బయటకి వచ్చి అక్కడి చెట్లు, రాళ్లని తాకగా 'ఠాత్' మని ధ్వని పుడుతున్నది. రాక్షసుల తలలు తెగి పడుతుండగా కొన్ని క్షణాల తరువాత నేల మీద కుప్పకూలుతున్న వారి మొండాల బరువుని భరించలేక భూమిని మోస్తున్న ఆదిశేషువు వేయి ముఖాలనుండి ఉస్సురుగా 'ఫూత్' మనే శబ్దం వస్తున్నది. ఒకేసారి, 5, 10, 20గా ఒకదాని వెంబడి మరొకటి వస్తున్న బాణ పరంపర, యుద్ధరంగంలో అలసిపోయిన దేవేంద్రుని గుర్రాలకి రేకుల shed లాగా నీడనిస్తున్నాయి.'

తానూ స్వయంగా ఒక రాజు కాబట్టి, కృష్ణదేవరాయలు అంత బాగా వర్ణించగలిగాడు ఆ బాణాల్ని. అంతటి భయంకరంగా సాగింది ఆ యుద్ధం. నేను ప్రత్యక్షంగా పాల్గొన్నది ఒక్కరోజే అయినా, రావణ సంహారాన్ని అపేక్షించిన వారము అవడం వల్ల, అమరలోకం మొత్తం విను వీధులనుంచి రాముని వీరవిన్యాసం, సమరోత్సాహం కన్నుల పండుగలా తిలకించి పులకించాం. ఆ తర్వాత నేను అటువంటి యుద్ధవిన్యాసంలో పాల్గొనలేదు" అని గర్వంతో కనులు మెరుస్తుండగా ముగించి సంగావైపు తిరిగి చూసాడు ఆయన.

"ఆహా! అద్భుతం!, రామాయణం స్థూలంగా కథ తెలుసు కానీ, ఇంత కూలంకుషంగా నాకు తెలీదు. వింటున్న నాకే ఇలా ఉందంటే, ప్రత్యక్షంగా పాల్గొన్న మీకెలా ఉంటుందో ఉహించుకోగలను" అంటూ ఆరాధనగా చూశాడు సంగా ఆయనవైపు.

"అవును, ఎప్పటికీ చెరిగిపోనిది ఆ సమర జ్ఞాపకం" అని తృప్తిగా అనుకున్నాడాయన.

"ఆ! ఇప్పుడు అర్థమైంది, మీరీ దునువిలా సరస్సు దగ్గర ఎందుకు కూర్చున్నారో. కథలు కూడా ఉన్నాయి ఆ యుద్ధాన్ని ఈ సరస్సుని కలుపుతూ. సింహళ భాషలో, 'దును' అంటే బాణం అని, 'విలా' అంటే సరస్సు అని అర్థం" అంటూ తను చిన్నప్పుడు విన్న సంగతి గుర్తు చేసుకున్నాడు సంగా.

"అవును, రావణుణ్ణి సంహరించడానికి ఇక్కడే రాముడు చివరిగా బ్రహ్మాస్త్ర ప్రయోగం చేసింది. అందుకే ఇక్కడికొచ్చి అవన్నీ గుర్తు తెచుకుంటున్నా, మళ్లీ వీలైనంత తొందర్లో అలాంటి ఒక గొప్ప కార్యంలో భాగంకావాలని ఆ రామచంద్రుణ్ని కోరుకుందామని వచ్చా!" అని నిట్టూర్చాడు మాతలి, తిరుగు ప్రయాణానికి సిద్ధమవుతూ.

"అర్థమైంది. గుడ్ లక్!" అని చెబుతూ వినయంగా ఆయనకి తన రెండు చేతులతో షేక్ హ్యాండ్ ఇచ్చి వీడ్కోలు పలికాడు సంగా. చిరునవ్వు నవ్వుతూ అంతర్ధాన మయ్యాడు ఆయన. ఇంకా ఆ స్పెల్ నుంచి బయటపడని సంగా, "అవును, ఒకదాని తర్వాత ఒకటి గొప్ప కార్యాలు సాధించుకుంటూ పోవాలనే కదా కార్యసాధకులు కోరుకునేది" అనుకుంటూ తనకి కాస్త స్పష్టత వచ్చినందుకు సంతోషించాడు. ఫ్లాస్కు, మగ్గు సర్దుకుని కుటుంబంతో మాట్లాడాలని ఇంటివైపు పయనమయ్యాడు.

మరుసటి రోజు విలేఖరుల సమావేశంలో, తన క్రికెట్ కమిట్మెంట్స్ కారణంగా అధ్యక్షుని ప్రతిపాదనని సున్నితంగా తిరస్కరించానని, కానీ ఆయన కోరిక మేరకు శ్రీలంక మాదకద్రవ్య నిర్మూలన కార్యక్రమానికి రాయబారిగా వ్యవహరిస్తానని ప్రకటించాడు. అలాగే, తాను అప్పుడే క్రికెట్ నుండి దూరం కాలేదనీ, రానున్న సీజన్ లో సర్రే కౌంటీ తరపున ఆడనున్నట్లు కూడా ప్రకటించాడు.

## అదృష్టం — కప్పగంతుల శ్రీ కృష్ణ బహదూర్

తెల్లవారు జామున లేవడం రమాకాంత్ కి అలవాటు లేదు. ప్రొద్దున్నే లేచి ట్రైన్ పట్టుకుని విజయవాడ వెళ్లడానికి సెల్ ఫోన్ లోఅలారం ఐదింటికి పెట్టుకున్నాడు.

అది జనవరి నెల, రమాకాంత్ కి చలి అసలే పడదు. చెన్నై లో చలి కే అతనికి వణుకొస్తుంది. అలాంటిది బెజవాడ చలి తట్టుకోవాలంటే స్వెట్టర్ తప్పకుండా వేసుకోవాలి. బీర్వాలో క్రింద అరలో వెనక్కాల ఎక్కడో దాచిన స్వెట్టర్ ని వెతికి తీసి ముందు రోజే రెడీగా పెట్టుకున్నాడు.

సంక్రాంతికి అత్తారింటికి వెళుతున్నాడతను. భార్య జానకి ముందుగానే వెళ్లింది. వాళ్ళకి పిల్లలు లేరు.ఇంక పుట్టరనికూడా లేడీ డాక్టర్లు చెప్పేశారు. ఈ విషయం పెళ్ళైన కొద్దికాలానికే తెలిసింది.

జానకి ఎంతగానో ఏడిచింది. లోపం ఆమెలోనే ఉందన్నారు డాక్టర్లు.

“డైవోర్స్ ఇచ్చేస్తాను మీరు ఇంకో అమ్మాయిని పెళ్లి చేసుకోండి”అంది కనీళ్లు తుడుచుకుంటూ.

రమాకాంత్ ఆమె శిరస్సునిమిరాడు.

“జానకీ, నువ్వు నచ్చావని నేను నిన్ను పెళ్లి చేసుకున్నాను. పిల్లల కోసం నేను పెళ్లి చేసుకోలేదు. పిల్లలు లేకపోతే ఏమైంది ఇప్పుడు. నువ్వు నాకు పిల్లవి నేను నీకు పిల్లాడిని. ఇంకెప్పుడూ ఇలాంటి మాటలు మాట్లాడకు, నాకు చాలా బాధ  కలుగుతుంది. ఈ విషయంలో ఇంకెప్పుడూ దుఃఖించకు” అన్నాడు ప్రేమతో.

క్షణాల్లో ఆమెకి అతనెంత గొప్ప మనసు కలవాడో అర్థమైంది. అతని అత్తమామలకి అతను దేవుడిలాంటి వాడని అభిప్రాయం. ఆ పెద్దవాళ్ళు బాధ పడతారని అతను ప్రతీ సంవత్సరం చలి భరిస్తూ ఆ ఊరికెళ్లి పండగ రోజులు అక్కడ గడిపి వస్తాడు. ఆ సంగతి వాళ్ళకి తెలుసు. బాధ పడుతూనే సంతోషిస్తారు ఆ వృద్ధులిద్దరూ.

నిజాముద్దీన్ ఎక్స్ ప్రెస్ ఎక్కి కూర్చున్నాడు రమాకాంత్. ఒకరిద్దరు వృద్ధులు, చిన్నపిల్లలూ తప్ప ఎవ్వరూ అతనిలా స్వెట్టరు వేసుకోలేదు. ఒక్కక్షణం అతనికి చిన్నతనంగా అనిపించింది. అంతలోనే చిరునవ్వుతో సర్దుకున్నాడతను.

అతను చాలా ఆశాభావం కలవాడు. ఎప్పుడూ పాజిటివ్ గా ఆలోచిస్తూ సంతోషంగా ఉండాలనే ప్రయత్నిస్తాడు. జీవితంలో అతన్ని దురదృష్టం చిన్నతనం నుండి వెంటాడుతూనే ఉంది. కానీ, అతను దురదృష్టంలో కూడా ఎప్పుడూ అదృష్టం చూసుకునేవాడు. ఈ ఆశాభావం అతనికి స్వభావంలా అవడానికి కారణం సీతారాం తాతయ్య.

రమాకాంత్ కి ఆరేళ్ళప్పుడు అతని తల్లితండ్రులు యాక్సిడెంట్లో మరణించారు. బాబాయ్ నరసింహం పేదవాడు. అతనికి గార్డియన్ గా ఉంటానని ఒప్పుకున్నాడు. కానీ, అతని పోషణ మొత్తం తనే భరించలేనని బంధువులందరూ రొటేషన్లో భరించాలని చెప్పాడు.

ఒక్కడే పిల్లాడు ఇంకెవరూ తోబుట్టువులు లేరు. అందరూ సరేనన్నారు.

ఆ చిరుప్రాయంలోనే రమాకాంత్ కి లోకంలో పరమ నీచులు ఉంటారు, మంచివాళ్లు ఉంటారు అని తెలియసాగింది. బాబాయి పెద్ద కూతురు కరుణకి అతనంటే ద్వేషం. అతని తిండి ఖర్చులని ఇంకో మావయ్య రంగారావు

కూడా షేర్ చేసుకుంటాడని ఆమెకి తెలీదు. తన తండ్రి నరసింహమే భరిస్తున్నాడని భావించి వీడికెందుకు పెట్టాలని ద్వేషించేది. ఆమె తల్లి సుమిత్ర తప్పని చెప్పినా వినేది కాదు.

"కరుణా, బంధువులని దూషించకూడదు, ద్వేషించకూడదమ్మా. మనకున్నంతలో కొంచెం పెడితే నీకేంనష్టంఅయిపోదు. అంత నీచంగా నీకు నష్టం అవుతోందన్న భావాలు పెట్టుకోకు" అంది ఒకరోజు.

కరుణ తల్లి మాటలు వినదు. పెరుగుతున్నకొద్దీ సూటీపోటీ మాటలతో రమాకాంత్ ని బాధ పెట్టేది.

శేషగిరి రమాకాంత్ కి ఇంకో మావయ్య. అతగాడు ఒక ఇంజనీరు. ఎప్పుడూ లేబర్ ని గదమాయిస్తూ, సంస్కారం మర్చిపోయి, మనస్సాక్షి ని చంపుకుని సంపాదిస్తూ, వెధవపనులకి బంధువులకి ఉపయోగపడుతూ తనో ప్రయోజకుడని గర్వంతో, శ్రీమంతుడని పొగరుగా ఉంటాడు. అతన్ని రమాకాంత్ చదువు ఖర్చులు భరించమని తక్కిన బంధువులు అడిగారు. ఏదో ఉచితంగా కాలేజ్ నడుపుతున్నంత ఫోజు పెట్టి ఒప్పుకున్నాడు. అతని భార్య లలిత చాలా మంచిది. ఆ అబ్బాయికి ఆదివారాలు భోజనం పెడతానని భర్తని ఒప్పించింది.

ఒక ఆదివారం వాళ్ళింటికి వెళ్ళాడు రమాకాంత్. శేషగిరి ఇంట్లో ఉన్నాడు. ఆ అబ్బాయి రావడం చూశాడు.

"ఏరా,ఎక్కువ తినేయకురా" అన్నాడు పెద్దగా నవ్వుతూ.

ఎదుగుతున్న అ పిల్లాడి మనసు చివుక్కుమంది. చిన్నబోయినమొహంతో లోపలికి వెళ్ళాడు. ఆ పసివాడి మొహం చూడగానే లలితకి తన సంస్కారహీనుడైన భర్త ఏదో నీచంగా అని ఉంటాడని గ్రహించింది. ఆమెకి కోపం వచ్చింది.

"కొందరికి మానసిక దారిద్ర్యం ఉంటుంది బాబూ, మనసున్నవాళ్ళే ఇంకోళ్ళకీ మనసు ఉంటుందని తెలుసుకోగలరు. మీ మావయ్యకి లేని దానికి జాలిపడు. నీ మనసు బాధ పెట్టుకోకు. నీకిష్టమైన ఉల్లిపాయల సాంబారు చేశాను. వచ్చి తినమ్మా"అంది.

అతని భోజనం అయ్యాక జిలేబీలున్న స్వీట్స్ బాక్స్ ఇచ్చి "పట్టుకెళ్ళి తిను బాబూ". అంది నవ్వుతూ.

రమాకాంత్ నరసింహం బాబాయి ఇంటికి వచ్చి సుమిత్ర పిన్ని చేతికిచ్చాడు స్వీట్స్ బాక్స్. ఆవిడ ఏదో పనిలో ఉండి దాన్ని డైనింగ్ టేబుల్ మీద పెట్టింది. కొంతసేపయ్యాక టివి లో సినిమా చూసి వచ్చి కరుణ ఆ బాక్స్ చూసింది.

"అమ్మా,నాన్న జిలేబీలు తెచ్చారా, అరున్నాయి నాకు మూడు. తమ్ముడికి, నీకు, నాన్నకి, తలోక్కటి. ఆ రమాకాంత్ కి ఏమివ్వద్దు" అంటూ గబగబా తినసాగింది.

తనూ తిందామని లోపలికి వస్తున్న రమాకాంత్ ఆ పిల్ల మాటలకి చాలా బాధ పడ్డాడు. కళ్ళలో నీళ్ళు తుడుచుకుంటూ బయటకి వచ్చి కూర్చున్నాడు.

ఆ ఇంట్లో ఇంకో మనిషి ఉన్నాడు. ఆయన సీతారాం తాతయ్య. ఆయన సుమిత్ర తండ్రి. ఆయనకి బి.పి.,షుగరు ఉన్నాయి. కాళ్ళు ఎప్పుడు మండుతూ ఉంటాయి. కాళ్ళు ఒత్తుతూ ఉంటే ఆయనకి ఉపశమనంగా ఉంటుంది. కరుణ ఏ పనీ చెయ్యదు,అలాంటిది కాళ్ళు ఒత్తుతుందా? ఆమె తమ్ముడు రవి చిన్నవాడు చెయ్యలేడు. అందుకని ఆయన రమాకాంత్ ని కాళ్ళు ఒత్తమంటాడు. అతను చక్కగా చేస్తాడు.

“తాతగారూ, వ్రేళ్ళు కూడా లాగాలా, మడమలు కూడా నొక్కనా,మోకాళ్ళదాకా పిసకమంటారా?” అని అడిగి ,”ఇంక చాలు బాబు” అనే దాకా శ్రద్ధగా కాళ్ళు నొక్కే ఆ అబ్బాయి బుద్ధిని చూస్తే ఆ పెద్దమనిషికి ఎంతో సంతోషం కలిగేది.

ఆ వేళ దైన్యం నిండిన మొహంతో కూర్చున్న రమాకాంత్ ని చూడగానే ఆయన హృదయం ద్రవించింది .

“బాబూ,కాస్త కాళ్ళు.....” అన్నాడాయన అరుగు మీద పడుక్కుంటూ.

రమాకాంత్ తల ఊపాడు. కన్నీళ్లు తుడుచుకుని మౌనంగా ఆయన కాళ్ళు నొక్కసాగాడు.

“నీకు కొన్ని విషయాలు చెప్తాను విను బాబూ “

“చెప్పండి తాతగారూ”.

“నీకూ మానసిక సౌందర్యం ఉంది నాయనా, నువ్వు మంచివాడివి. మంచివాళ్ళకి కష్టాలు ఎక్కువ. వాళ్ల మనసు ఎక్కువ బాధ పడుతుంది. కానీ కష్టాలని ఎప్పుడూ దురదృష్టం అని భావించకు. సమస్యలని ఎదుర్కుంటేనే ధైర్యం వస్తుంది. నా అదృష్టం ఇలాంటి మనిషిని చూశాను. వీడెంతనీచుడో అర్థమైంది. నేనెలా, ఉండకూడదో తెలిసింది. ఇలాంటి కాకులకి వీలైనంత త్వరగా దూరంగా ఉండాలి,వీళ్లతో సహవాసం చెయ్యకూడదు. వీళ్ళ స్థాయికి నేను దిగజారకూడదు. ఇంకా ఎదిగి పోవాలి అని నిర్ణయించుకో. ఎప్పుడూ ఆశాభావంతో ఉండు. లోకంలో మంచి వాళ్ళూ ఉన్నారు,చెడ్డవాళ్లూ ఉన్నారు. మన జన్మంతా జీవితంలో కలుస్తూనే ఉంటారు. కొన్నిసమయాల్లో చెత్త వెధవల్తో కలిసి కూర్చోవడమో, ప్రయాణం చెయ్యడమో, పని చేయించుకోవడమో, అవసరమవుతుంది. ఇవాళ్ళ నేనొక పరమహీనమైన మనిషిని కలవాల్సొచ్చింది వీడిలాంటి హీనుడి ని అవకూడదు నేను అనుకో. ఈ రెండు రకాల మనుషులకన్నా ప్రమాదకరమైనవాళ్లు మూర్ఖులు. వాళ్ళతో కలిసున్నా అంటీముట్టనట్లు జాగ్రత్తగా ఉండు. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. చెడులోనూ మేలు జరుగుతుంది అనే నమ్మకం ఎన్నడూ వదలకు.నీకంటే పెద్దవాళ్ళు అసహ్యంగా ప్రవర్తిస్తే చెయ్యి చేసుకోకు, చస్తారు. అలాంటి వాళ్ళకి దూరంగా వెళ్ళు. సహనం వహించడం చాలా కష్టం. కానీ, అలవాటు చేసుకో. క్షమించడం కూడా కష్టమే. కానీ, నేర్చుకో. అది దైవీక గుణం బాబూ. ఎప్పటికైనా ఎవరో ఒకరు నీ గొప్పతనం గ్రహిస్తారు. పోనీ, గ్రహించకపోయినా నీకుమానసిక ప్రశాంతత కలుగుతుంది.నేను రెచ్చిపోయి పశువులా ప్రవర్తించలేదు అనే భావం నిన్ను

ఎదిగేలా చేస్తుంది. మనస్సాక్షి ఉన్నవాడు నువ్వు క్షమించావని అర్థమైతే సిగ్గుపడి వాడే కుమిలి పోతాడు. వాడు మంచిగా మారితే వాడి కుటుంబం సంతోషంగా ఉంటుంది. ఇంకోళ్ళకి మేలు చేసినవాడివి అవుతావు”.

అన్నాడు సీతారాం తాతయ్య గంభీరంగా.

జీవితసారం, జీవనవిధానం ఆ అబ్బాయికి నేర్పించేశాడాయన!

ఆ తర్వాత కష్టాలకి ఎక్కువ బాధ పడకుండా బ్రతకడం నేర్చుకున్నాడు రమాకాంత్. స్కూల్ ఫైనల్ కి వచ్చాడు.

ఒకరోజు శేషగిరి మావయ్య స్కూల్ కి వచ్చాడు. హెడ్ మాష్టర్ శంకరయ్య రూమ్ లో కూర్చుని ఉన్నాడు. రమాకాంత్ చదువు ఎలా ఉంది తర్వాత ఏ కాలేజ్ లో ఏ పెద్ద చదువులు చదివిస్తే బాగుంటుంది అని అడగటానికి వచ్చాడు. క్లాస్ నుండి వచ్చిన రమాకాంత్ శేషగిరి కుర్చీ ప్రక్కనే నిలబడ్డాడు.

“పెద్ద చదువులెందుకండీ, డబ్బు ఖర్చు. మంచి మార్కులు వస్తున్నాయికదా, ఉద్యోగం సులభంగానే దొరుకుతుంది. ఏదైనా పనిలో పెట్టేయండి” అన్నాడు శంకరయ్య.

మావయ్య చదివిస్తానంటే ఈయన డబ్బేదో ఖర్చు అవుతుందన్నట్లు చెడగొడుతున్నాడు ఈయన హెడ్ మాష్టరా! బాధగా అనుకున్నాడు రమాకాంత్. అంతలోనే సీతారాం తాతయ్య మాటలు గుర్తుకొచ్చాయి. బాధ ని అణచుకున్నాడు.

కొంతమంది, కొంతమందేమిటి చాలమందే, పరాయి వాళ్ళు బాగుపడతారంటే సహించలేరు. ఎంత గొప్ప పదవిలో ఉంటే అంతనీచంగా అణిచేయాలని ప్రయత్నిస్తారు. పైకి ఉపకారం చేస్తున్నట్లు ఫోజు పెడతారు.

“ఏం, రమాకాంత్ చదువు అవగానే ఉద్యోగంలో చేరిపో. డబ్బు వస్తే జీవితం హాయిగా ఉంటుంది. కావాలంటే నేనే స్కూల్ లో ప్యూన్ ఉద్యోగం ఇప్పిం చడానికి చూస్తాను” అన్నాడు శంకరయ్య ఎంతో దయగా చూస్తూ. లోపల క్రూరమైన ఆనందంతో ఉన్నాడానీచుడు.

రమాకాంత్ వినయంగా తలాడించాడు. స్కూల్ చదువు పూర్తి చేశాడు. శంకరయ్య ఏ ఉద్యోగం ఇప్పించలేకపోయాడు. అయితే, అతని సలహా నచ్చిన శేషగిరి ఆలస్యం చేయకుండా రమాకాంత్ ని ఒక వీక్లీపేపర్ ఆఫీసులో ప్యూన్ ఉద్యోగంలో పెట్టేశాడు.

ఆ వీక్లీ కి ఓనరూ, ఎడిటరూ ఒకరే. ఆయన శేషగిరి స్నేహితుడు రామారావ్. ఆఫీసు పై భాగంలో ఒక రూమ్ లో రమాకాంత్ ఉండేలా ఏర్పాటు చేశాడాయన. ప్రతీ పనీ చేయించి ఆ కుర్రాడిని అనుభవజ్ఞుడిని చేశాడు. రమాకాంత్ కరస్పాండెంట్ కోర్సులో జర్నలిజం డిప్లొమా చేస్తానంటే సహాయం చేశాడు. మెల్లగా వ్యాసాలు, కథలు, నవలలు రాయడం ఆరంభించాడు రమాకాంత్.

అడుగడుగునా ప్రోత్సాహమిచ్చాడు రామారావ్. అతనికి రమాకాంత్ నచ్చాడు. ప్రతీ పనీ శ్రద్ధగా, పూర్తిగా, సరిగ్గా చేస్తూ వినయంగా, తెలివిగా ఉండి మంచి రచనలు చేస్తూ తను పేరు తెచ్చుకుంటూ వీక్లీ ని కూడా అభివృద్ధిలోకి తెచ్చాడని అతనంటే అభిమానం రామారావ్ కి.

చూస్తుండగానే రమాకాంత్ ప్రముఖ రచయిత అయ్యాడు. బంధువుల్లో "మా రమాకాంత్ అయ్యాడు". ఉద్యోగంలో చేరడం మంచిదే అయ్యింది అతనికి. రామారావే తన ఫ్రెండ్ రమణారావ్ కూతురు జానకి తో అతనికి పెళ్లి జరిపించాడు. వాళ్ళకి పిల్లలు కలుగరని తెలిసి చాలా బాధ పడ్డాడు.

రమాకాంత్ కి ముప్పైఆరేళ్లు. సంక్రాంతికి ఊరేళ్లడానికి పండగ శలవులేగాక, రెండ్రోజులుఅధికంగా లీవు వెంటనే ఇచ్చాడు రామారావ్.

రైలు వేగం పుంజుకుంది. ప్రయాణీకులు అందరినీ గమనిస్తున్నాడు రమాకాంత్. ఎదురు సీట్లలో కూర్చున్న భార్యాభర్తలు చాలా యంగ్ గా ఉన్నారు. ఆ అబ్బాయి లోపలికి వస్తున్నప్పుడు బుజం మీద నిద్రపోతున్న ఒక చిన్నపిల్లతో వచ్చాడు. ఆ పాప కి మెలకువ వచ్చింది. కళ్ళు తెరిచి రమాకాంత్ ని చూసింది. అంత అందమైన పాప ని ఎప్పుడూ చూడలేదతను. గులాబీ రంగు చర్మంతో, పెద్ద కళ్ళు, గుండ్రని ముఖం, అందమైన ముక్కు, చిన్ననోరు, చిన్న చిన్న రెండు జడలు, వాటికి ఆకుపచ్చ రిబ్బన్లు, అందమైన గౌనుతో చిన్నారి దేవతలా ఉంది.

"లేచావా, బిస్కెట్ లు తిను" అంది వాళ్ళమ్మ.

ఒక బిస్కెట్ ప్యాకెట్ ఆ పాప చేతికి ఇచ్చింది. ఆ పాప ప్యాకెట్ చింపి ఒక బిస్కెట్ తీసి, రమాకాంత్ కి అందించింది.

"అంకుల్,బిస్కెట్ తినండి" అంది.

ఆ పిల్ల సంస్కారానికి, స్పష్టమైన మాటలకి అతనికి ముచ్చటేసింది.

"నీ పేరెంటి?" అన్నాడు ఆ బిస్కెట్ అందుకుంటూ.

"నా పేరు లచ్చిమీదేవి. మా నాన్నలమేష్, మా అమ్మ సుందలి. మలి మీ పేలో?"

"నా పేరు రమాకాంత్" అన్నాడు నవ్వుకుంటూ.ఆ పాప కి 'ర' పలకదు.

"రమాకాంత్ అంటే....రచయిత రమాకాంత్ గారా?" అన్నాడు రమేష్.

"అవును నేనే".

"నేను మీ అభిమానిని సార్. ఎన్నో కష్టాల్లో మీ పుస్తకాలు చదివి ధైర్యం తెచ్చుకున్నాను. మా పెళ్లయ్యాక అందరం తిరిగి వస్తూంటే రోడ్ యాక్సిడెంట్ జరిగి మా తల్లితండ్రులు, బంధువులు చాలామంది మరణించారు. మాది దురదృష్టజాతకం అని మా వాళ్ళందరూ మమ్మల్ని వదిలేశారు. అలాంటి సమయంలో మీ పుస్తకాలు చాలా ఓదార్పు

ఇచ్చాయి. మాది విజయవాడే, ఆఫీసు పని మీద చెన్నై కి వచ్చి తిరిగి వెళ్ళుతున్నాం. కొత్తగా ఏమైనా కథలు రాస్తున్నారా?" గబగబా రమాకాంత్ ని చూసిన ఆనందంతో తన గురించి చెప్పుకుని సంతోషంగా చూడసాగాడు రమేష్.

"అంకుల్, మీకు కథలు వచ్చా, అయితే కథ చెప్పండి". అంది లక్ష్మీ దేవి గబగబా వచ్చి రమాకాంత్ వళ్ళోకూర్చుని.

"ఇంక మీకు విజయవాడ వెళ్ళేదాకా మంచి కాలక్షేపం" అంది సుందరి నవ్వుతూ.

మధ్య మధ్య పెద్దవాళ్లతో మాట్లాడుతూ, ఆ పాప కి కథలు చెప్తూ ప్రయాణం చేశాడు రమాకాంత్. ఎదురు సీట్లో ఇంకో వ్యక్తి కూడా కూర్చుని ఉన్నాడు. ఆయన పేరు శ్రీధర్. ఆయన ఒక బిజినెస్ మేన్.పలుకుబడి కలిగిన పెద్దమనిషి. ఆయన కూడా మధ్యలో మాట్లాడుతూ, పాపని చూసి ముచ్చటపడ్డాడు.

"మీకు మంచి శ్రోత దొరికిందండీ. మీరూ చాలా కథలే చెబుతున్నారు. యువార్ ఎ బార్న్ స్టోరీ టెల్లర్" అన్నాడు నవ్వుతూ.

సరదాగా గంటలు గడిచి పోయాయి.

కొన్ని సంఘటనలు మనం అనుకోకుండా జీవితంలోజరుగుతాయి.అవే యాక్సిడెంట్లు.వాటి వలన మనకి కీడు జరిగినట్లనిపించినా ఒక విధంగా మేలు కూడా జరుగుతుంది .మేలుని అర్ధం చేసుకుని మనుగడ సాగిస్తే మనిషికిఅదృష్టంఅంటే ఏమిటో బాగా తెలుస్తుంది.లేకపోతే దురదృష్టం అనుభవంలోకి వస్తుంది.

ఆశాభావం ఉండే రమాకాంత్ కి అదృష్టం కలిగింది.

రైలు తెనాలి దాటాక పెద్ద ప్రమాదం జరిగింది. అటు వైపు నుండి అదే ట్రాక్ మీద ఇంకో ఎక్స్ ప్రెస్ వచ్చింది. ఆ రెండు రైళ్లూ గుద్దుకున్న వేగానికి బోగీలకి బోగీలు ఎగిరిపడి దొర్లిపోయాయి. సుందరి చనిపోయింది. రమేష్ కొనఊపిరితో ఉన్నాడు. శ్రీధర్ కి చిన్న దెబ్బ తగిలింది. పాప కి ఏమీ జరగలేదు. బెదిరిపోయి ఏడుస్తోంది. రమాకాంత్ కాలు విరిగింది. రమేష్ అతికష్టం మీద తలఎత్తి రమాకాంత్ ని పిలిచాడు.

"సార్, నా పని అయిపోయింది. నా కూతురు......"

"మీ కేం కాలేదు ,భయ పడకండి. మీ పాప క్షేమం గా ఉంది. మీ కేమైనా అయితే ఆ పిల్ల సంగతి నేను చూసు కుంటాను. ప్రశాంతంగా పడుకోండి డాక్టర్లు, యాంబులెన్సు వస్తాయి, ఆస్పత్రికి తీసుకెళ్తారు "అన్నాడు రమాకాంత్ కాలు ఈడ్చుకుంటూ అతని దగ్గరకి వెళ్ళి.

రమాకాంత్ కళ్లలోకి, కన్నీళ్లతో, కృతజ్ఞతాపూర్వకంగా చూస్తూ, ప్రాణాలు విడిచాడు రమేష్.

నలభై నిమిషాలకి వాళ్ళబోగీ లోకి డాక్టర్ నర్సులతో బాటు వచ్చాడు. ఈ లోపల జానకీ, రమణారావ్ అక్కడకి వచ్చేశారు.

"ఈయన కాలు ఫ్రాక్చర్ అయ్యింది, ఏం భయపడనక్కర్లేదు, స్ట్రెచర్ మీద బయటకి తీసుకెళ్ళండి" అన్నాడు డాక్టర్ .

రమాకాంత్ ని బయటకి తెచ్చి పడుక్కోబెట్టారు. అతని ప్రక్కనే వచ్చి నిలబడింది ఆ చిన్నారి పాప కూడా.

అతని చుట్టూ నిలబడ్డారు శ్రీధర్, జానకీ, రమణారావ్.

పాప గురించి చెప్పాడు శ్రీధర్.

"ఏమిటండీ ఈ దురదృష్టం, చక్కగా పండగ జరుపుకుందామంటే కాలు...." ఇంకమాట్లాడలేక కన్నీళు కార్చింది జానకి.

"దురదృష్టం కాదు జానకీ, కాలు కదా విరిగింది, చెయ్యి కాదే. నేనింకా రచనలు చెయ్యవచ్చు. ఐనా, ఈ కాలు కూడా నయమవుతుంది. నిజానికి ఈ యాక్సిడెంటు అదృష్టమే" అన్నాడు రమాకాంత్.

జీవితంలో మొట్టమొదటిసారి అదృష్టం అనే మాట వాడాడు అతను!

"ఎలాగండీ?" అంది జానకి.

"ఈ ప్రమాదం వలన లక్ష్మీ దేవే మన ఇంటికి వచ్చింది జానకీ" అన్నాడు ఆనందంగా.

"నిజమేనండీ, లక్ష్మీ దేవే మనకూతురైంది" అంది జానకి అతని ఉద్దేశం అర్థమై ఆ పాపని దగ్గరకి తీసుకుంటూ.

"ఆదరించే వాళ్ళెవరూ లేని ఒక చిన్న బాలికని చేరదీసి, మీ అదృష్టం వలన మీ ఇంటికి వచ్చిన సిరులతల్లి లక్ష్మీ దేవి లా భావిస్తున్నారా, ఈ పాపని మీరు దత్తత తీసుకొనేలా పోలీసులతో నేను మాట్లాడిఏర్పాటు చేస్తాను నిజంగా మీరిద్దరూచాలా గొప్ప మనుషులు. మీ ఇంట లక్ష్మి తాండవమాడుతుంది". గౌరవభావంతో వాళ్ళని చూస్తూ, ఆశీర్వదిస్తున్నట్లు మనస్ఫూర్తిగా అన్నాడు శ్రీధర్.

★★★

## ఓ అమ్మాయి కథ

డా.చివుకుల పద్మజ

"నమస్తే మేడం" ఉదయాన్నే ఫోన్.

"నమస్తే, చెప్పండి శంకర్రావు గారూ" అన్నాను.

"వచ్చే నెల పదకొండో తారీకు కొత్త కథకుల వర్క్ షాప్ పెడుతున్నాము. దయచేసి మీరు ఒక మెంటార్ గా రావాలి" చాల మర్యాదగా రిక్వెస్ట్ చేసారు. నేనొక మోస్తరు కన్నాఎక్కువే పేరున్న రచయిత్రిని. కొన్ని వందల కథలు, సమీక్షలు, పదుల సంఖ్యలో నవలలు నా ఖాతాలో వున్నాయి.

"అమ్మా. నా జడ. త్వరగా, టైం అవుతోంది" మా అమ్మాయి అరుస్తోంది. నాకు ఇద్దరు కవల పిల్లలు. పాప, బాబు. ఇంటర్ చదువుతున్నారు, ఎనిమిది కల్లా కాలేజీ కి వెళ్ళిపోవాలి. అదీ దాని గోల.

ఫోన్ అలాగే భుజం మీద పట్టుకుని తల వంచి మాట్లాడుతూనే దాని జడ ముగించాను. తప్పకుండ వస్తానని చెప్పి ఫోన్ పెట్టేసాను.

ఎనిమిది కల్లా పిల్లలని పంపి, తొమ్మిది కి శ్రీవారిని పంపి, ఒక అరగంట లో అంతా సర్దుకుని, టీ కప్పు పట్టుకుని బాల్కనీ లో కుర్చీని చిన్నగా తాగడం ప్రారంభించా. ఉదయం నించి హడావిడి సరిపోతుంది, ఈ కాస్సేపు టైం మాత్రమే హాయిగా కూర్చుని, తీరిగ్గా టీ ని ఆస్వాదిస్తుంటాను.

కుండీలో గులాబీ చెట్టు పువ్వు పూర్తిగా పూసింది ఈ రోజు. దాన్ని నాలుగు రోజుల నుంచి చూస్తున్నాను. చిన్న మొగ్గతొ మొదలై పూర్తి పూవు గా మారింది.

ఇలాగే జరిగింది నా రచనా వికాసం కూడా. చిన్నప్పుడు చందమామ, బాలమిత్ర లతో మొదలైంది నా పఠనా వ్యాసంగం. స్కూల్ లో వున్నప్పుడు చిన్నపిల్లల కథలు ఒకటి రెండు రాసాను. తర్వాత కాలేజీ మ్యాగజైన్ కి కథలు, కవితలు రాసేదాన్ని. పెళ్లి, ఆ వెంటనే పిల్లలు తో తర్వాత నా ఆసక్తి ని పూర్తిగా మర్చిపోయాను.

పిల్లలు కాస్త పెద్దయ్యాక, కొత్తగా వచ్చిన ఫేస్బుక్ పుణ్యమా అని పేరాగ్రాఫ్ కథలు గా చిన్న చిన్నరైటప్స్ మా ఫ్రెండ్స్ కి పోస్ట్ చేసేదాన్ని. అది చూసిన అందరూ ఎంకరేజ్ చేసే వారు మళ్లీ రాయటం మొదలుపెట్టు అని.

సరే కదాని, మొదలు పెడదామని కూర్చుంటే పెన్ కదలదే. క్యాజువల్ గా అయితే బోల్డంత రాయగలను గాని, కథ రాయాలి అని కూర్చుంటే తడబడిపోతున్నాను. మొత్తానికి కొన్ని రాసాను. అవ్వి చదివి మా పిల్లలు ఒకటే నవ్వు. వాళ్ళ నాన్న ఇంటికి రాగానే చెవుల్లో ఊదేశారు.

"తెలుసా, అమ్మ కథల్లో అందరూ హైలీ ఎడ్యుకేటెడ్" మా అమ్మాయి కామెంట్.

"అవునమ్మా, తాను బాగా చదువుకుంది కదా" వ్యంగంగా అన్నారు.

"హీరో, హీరోయినే కాదు, చివరికి పనిమనిషి కైనా మినిమం టెన్త్ క్వాలిఫికేషన్" ఇంకా నవ్వింది.

"అది చాలక, ఒక కథలో హీరోయిన్ సివిల్స్ రాస్తుందిట. ఆ అమ్మాయికి అలాంటి సంబంధమే చేస్తామంటే, హీరో UK నుంచి వచ్చేసి సివిల్స్ కొట్టి అమ్మాయిని చేసుకుంటాట్ట" వాళ్ళ నవ్వుల్తో హాల్ దద్దరిల్లిపోయింది.

నాకుకూడా నవ్వు వచ్చింది. ఇంకొన్ని కథలు రాసి చూపించాను. "అబ్బా, కుటుంబ కథలు, హాస్య కథలు, కనువిప్పు కథలు వద్దే బాబు. కావాలంటే థ్రిల్లర్స్ రాయి" సలహా పారేసారు మా వారు.

"అమ్మో. మొదలే థ్రిల్లర్స్ అంటే నా వల్ల కాదు" అన్నా.

"అయితే కథలో ఎవరినైనా చంపు, బాగా పండుతాయి"

"ఛీ.. ఛీ..అసలు చెయ్యను ఆ పని"

అసలే కొన్ని సినిమాల్లో కొన్ని జరక్కుండా ఉంటే బాగుండునని బాధపడుతుంటాను. సాగరసంగమం లో జయప్రద కమలహాసన్ దగ్గరికి ఓకే చెప్పడానికి పరిగెత్తుకుంటూ వస్తుంది. అప్పుడు తన భర్త కనిపిస్తాడు. చివరికి అతనితో కెనడా వెళ్ళిపోతుంది. అతను రాకుండా ఉంటే ఎంత మంచి జంటని చూసేవాళ్ళం... అని ఎన్నో సార్లు అనుకుంటాను. అలాగే గజని సినిమా లో కూడా ఆసిన్ సూర్యా నే సంజయ్ అని తెలీకుండానే చనిపోతుంది. ఇది కూడా ఆలా జరక్కుండా ఉంటే బాగుండునని ఇప్పటికి అనిపిస్తునే ఉంటుంది. అట్లా జరిగితే ఇంక సినిమా ఏముంది అంటారు మా ఇంట్లో.

వీటన్నిటి మధ్య నా కథలు కొన్ని తక్కువ టైం లో నే పబ్లిష్ అవటం జరిగింది. ప్రతి కథకి నా ఆలోచనలు, రైటింగ్ ఇంప్రూవ్ అవ్వడం, క్రమంగా పోటీల్లో బోలెడన్ని బహుమతులు గెల్చుకోటం కూడా జరిగిపోయింది.

ఇక అప్పటినుంచి అపార్ట్మెంట్ లో నా విలువ పెరిగిపోయింది. ఏమి ఈవెంట్స్ జరిగినా నాకు స్పెషల్ స్టేటస్ ఇవ్వటం మొదలు పెట్టారు. అంతకు ముందు పెద్దగా పట్టించుకోని వాళ్ళు కూడా కింద సెల్లార్ లో నేను కనపడితే చాలు మర్యాదగా పలకరిస్తున్నారు.

"ఏమో అనుకున్నాం. మాక్కూడా గొప్పగానే వుంది" మా పిల్లలు ఆనందపడ్డారు. మా అయన పైకి తేలే రకం కాదనుకోండి, కానీ మనసులో సంతోషించారనే నా అనుమానం.

★★★

ఆలోచనల్లోంచి బయటపడి, ఒక సీరియల్ రాస్తూ కూర్చున్నాను.

పిచ్చుకలు రొద చేస్తున్నట్లుండే మా కాలింగ్ బెల్ మోగింది.

"హాయ్ ఆంటీ" మా ఎదురు ఫ్లాట్ లో వుండే అమ్మాయి.

"రామ్మా" చిరునవ్వుతో లోపలికి ఆహ్వానించాను.

"మీరు బిజీ ఏమో. కాస్సేపు టైం స్పేర్ చేస్తారా?" మొహమాటపడుతూనే అడిగింది.

"పర్వాలేదు, కూర్చోమ్మా"

"థాంక్యూ".

"మీ పేరు గీత కదా" అన్నాను. ఎప్పుడైనా చూడటమే తప్ప పెద్దగా పరిచయం లేదు.బయట చాలా తక్కువగా కనిపిస్తుంది. పైగా వాళ్ళ మెయిన్ డోర్ కొంచెం పక్కకి ఉంటుంది కాబట్టి కావాలని వెళ్తే తప్ప లోపలి వాళ్ళు కనిపించరు.

"మీరు బాగా ఆలోచిస్తారు, మీ కథల్లో మంచి సామజిక స్పృహ ఉంటుంది. నాకేమైనా పరిష్కారం చెప్పగలరేమో అని వచ్చాను ఆంటీ" తన కంఠం రుద్ధమైంది.

"అయ్యో.. బీ కూల్" చేతిలో చెయ్యి వేసి పట్టుకున్నాను.

వాళ్ళది లవ్ మ్యారేజ్ అట. బి.టెక్. లో క్లాస్మేట్స్ అట. ఇద్దరి కులాలు వేరని, ఇంట్లో ఒప్పుకోలేదని ఆర్యసమాజ్ లో పెళ్లి చేసుకున్నారట. క్యాంపస్ ఇంటర్వ్యూ లో వచ్చిన జాబ్స్ చేరి, తర్వాత ఈ ఇల్లు  కొనుక్కున్నారట. మొదట్లో బాగుండేవాళ్ళట. అయితే కొంతకాలం గా అవినాష్ లో మార్పు వచ్చిందని చెప్పింది. మధ్య మధ్య లో వాళ్ళ ఇంటికి వెళ్లి రావటం చేస్తున్నాడట. పోనీలే ఫామిలీ లో కలుస్తామని సంతోషించిందట.

కానీ రాను రాను వింతగా బిహేవ్ చేస్తున్నాడట అవినాష్. ఎక్కువగా వాళ్ళ ఇంట్లోనే వుంటున్నాడట. తాను ఒకతె ఉందనే విషయమే మర్చిపోయినట్లు వుంటున్నాడట. ఈ కలతల మధ్యే ప్రెగ్నన్ట్ అయిందిట. రెండు రోజుల పాటు ఏమి మాట్లాడకుండా తర్వాత కొన్ని టాబ్లెట్స్ ఇచ్చి వేసుకోమన్నాడట. అదేంటి అంటే మనం ఇంకా సెటిల్ అవ్వాలి. మా ఫామిలీ ఇప్పుడే కాస్త మాట్లాడుతున్నారు, అంతా కుదురుకున్నాక అయితే బాగుంటుంది అని బలవంతాన మింగించాడట. ఆ పిల్స్ వల్ల అబార్షన్ అయ్యి ప్రాణం మీదకి వచ్చి, యుటెరస్ డామేజ్ అయిందని తీసేసారుట. అందువల్ల జాబ్ మానేసి ఇంట్లో రెస్ట్ తీసుకుంటోంది. క్రమంగా గొడవలు పెద్దవయ్యాయిట. అత్తామామలు రాకపోకలు సాగిస్తున్నారట. అవినాష్ లేని సమయంలో బాగా సాధిస్తున్నారట. అతనికి చెప్పబోతే మా పేరెంట్స్ మీద నేరాలు మోపకు అన్నాడట. మానసిక వేదన ఎక్కువై ఎమోషన్స్ తట్టుకోలేక గట్టిగా మాట్లాడితే పిచ్చిది అని ముద్ర వేసారట. అవినాష్ జాబ్ మానేసి ఫామిలీ బిజినెస్ చూస్తున్నాడట. ఇంక వాళ్ళకి వ్యతిరేకంగా ఏమీ వినడట. ఇప్పుడు నీకింక పిల్లలు పుట్టరు, విడాకులు ఇచ్చేయ్, మా వాళ్లలోనే మంచి సంబంధం చేస్తాం అని మొదలు పెట్టారట. రోజూ ఇదే ప్రెషర్ ట. చచ్చినా విడాకులు ఇవ్వను అందట, అయితే చావు అని హేళన చేశారట. అవినాష్ వినిపించుకునే స్థితిలో లేదు, గట్టిగా మాట్లాడితే నీకు సైకోసిస్ వచ్చింది అంటున్నాడట. తన పెళ్లి వల్ల తన వాళ్ళు కూడా దూరమయ్యారు, ఎవరికి చెప్పుకోవాలో అర్ధం కావట్లేదు. చెప్తూనే వెక్కి వెక్కి ఏడ్చింది గీత.

ఇదంతా విని బిత్తర పోయాను నేను. అందుకేనేమో పాపం ఎప్పుడు బయటకి రాదు (రానివ్వలేదేమో). ఎప్పుడు ఏ మీటింగ్ కానీ, ఈవెంట్ కానీ జరిగితే అవినాష్ అటెండన్స్ వేసుకుంటాడు తప్ప గీత ఎప్పుడు కనపళ్ళేదు.

వచ్చిన కొత్తలో ఒకసారి వినాయక చవితికి కింద విగ్రహం పెడితే గీత ని పిలవమంటే, పక్క ఫ్లాట్ శ్యామల గారన్నారు...వద్దులేమ్మా ఆ అమ్మాయి కి మెంటల్ ట అని.

గీత దుఃఖం కాస్త తగ్గనిచ్చి అన్నాను" ఊరుకోమ్మా.. ప్రతి సమస్యకి ఎదో ఒక పరిష్కారం ఉంటుంది. నీ సమస్యకి చాలా మార్గాలున్నాయి చట్టపరంగా. అయితే అంత ప్రేమించి చేసుకున్నాడంటున్నావ్. ఖచ్చితంగా అవినాష్ ని మార్చే ప్రయత్నం చేద్దాం ముందు. కొంచెం ఓపిక పట్టు. నేను కొంచెం అలోచించి చెపుతాను".

"అందుకే మీ దగ్గరికి వచ్చాను. చచ్చిపోదామనిపిస్తోంది ఆంటీ" వెక్కుతూ అంది గీత.

"ఛ..ఛ.. పిచ్చి పనులు చెయ్యకు. నాకు చెప్పావు కాబట్టి, నేను చూస్తాను. అయితే ఈ లోపు నువ్వు నీ హెల్త్ మీద శ్రద్ధ పెట్టు. కాస్త బాగా మంచి ఫుడ్ తిని రికవర్ అవ్వు, కొంచెం తేరుకో" ఓదార్చి పంపాను.

ఆ రోజంతా మనసు చెదిరిపోయింది. చదువులేని వాళ్లకు తెలీదు అనుకోవచ్చు, కానీ ఇంత హై సొసైటీ ఫామిలీ అయ్యి ఉండి ఈ బుద్ధులేంటి ... అసహ్యం వేసింది నాకు.

ఆ సాయంత్రం మా అన్నయ్య ఫోన్ చేసాడు. మా మేనకోడలు కావ్య కి మంచి సంబంధం వచ్చిందిట, మాట్లాడుకోవాలి అర్జెంటుగా బయలుదేరి వచ్చేయమని. చాలా ఆనందం కలిగించిందీ వార్త. అదంటే చాలా ఇష్టం నాకు. వూరికెళ్ళొచ్చి గీత పని చూద్దాం లెమ్మని ఝామ్మని వెళ్ళిపోయాను. ఆ వెళ్ళటం, వెళ్ళటం రావటానికి ఇరవై రోజులు పట్టింది. అబ్బాయికి లీవ్ లేదని, వెంటనే పెళ్లి చెయ్యవలిసి వచ్చింది. అంతకాలం మా వారు, పిల్లలే మేనేజ్ చేసుకున్నారు. పెళ్లి కి వచ్చినప్పుడు మా పిల్లలు చెప్పారు.. ఒకరోజు సాయంత్రం గీత వచ్చిందట నా కోసం.. లేనని తెల్సి వెళ్లిపోయిందట. అయ్యో అనుకుని, మళ్లీ నా హడావిడిలో నేను పడిపోయాను.

★★★

పదకొండో తారీకు రానే వచ్చింది. ఉదయం ఎనిమిది కల్లా రమ్మని చెప్పారు శంకరరావు గారు. ఒక కాలేజీ సెమినార్ హాల్ తీసుకున్నారు. నేను వెళ్లిన కాస్సేపటికి రాజారామ్ గారు వచ్చారు. చాల పెద్దాయన, వయసులోనూ, విద్వత్తులోనూ. లేచి నమస్కారం చేశాను.

"వూ...యేంటమ్మాయ్. ఎలా సాగుతోంది కథ?" నవ్వుతూ అడిగారు. మేము ఎలా ఉన్నామని అడిగారన్నమాట అయన.

"మా కథకేంటి బాబాయ్ గారు.. అది జీడిపాకమే" నవ్వుతూ కౌంటర్ వేసాను.

మాట్లాడుతూ ఉండగానే రాజ్యలక్ష్మి గారు, రామారావు గారు, ప్రసాద్ గారు వచ్చారు. అందరూ సాహితీలోకంలో లబ్ధప్రతిష్ఠులు. రాజ్యలక్ష్మి గారంటే నాకు చాలా అభిమానం, ఇష్టం కూడా. వీళ్లందరితో కలిసి పని చేసేందుకు అవకాశం ఇచ్చిన శంకర్రావు గారికి మనసులోనే థాంక్స్ చెప్పుకున్నాను.

ఈ నవతరం లో పుస్తకాలు చదవటం దాదాపుగా మృగ్యమై పోయింది. కాస్త పాత అభిరుచులు వున్నవాళ్లు తప్ప సాహిత్యం చదివే వాళ్ళు లేరనే చెప్పాలి. చదివే వాళ్లే లేకపోతే ఇంక రాసే వాళ్ళు ఎక్కడ వుంటారు?సాహితీ ప్రక్రియ కనుమరుగవకుండా ఉండాలంటే ఇలాంటి వర్క్ షాప్స్ చాలా అవసరం. చాలా మందికి తమలో నిద్రాణమై ఉన్న టాలెంట్ తెలియదు. ఒకవేళ తెలిసినా రొటీన్ లైఫ్ లో ఇలాంటివి ఆలోచించరు కూడా. మంచి సాహిత్యపు అవసరం తెలియచెప్పి, కాస్త ఉత్సాహం అందిస్తే మంచి మంచి సాహిత్యకారులు బయటపడతారు. ఖర్చుక్కూడా వెనకాడకుండా తపన పడే శంకర్రావు గారి లాంటి వాళ్ళ ఆశయం నెరవేరుతుంది.

ఇవ్వాల్టి సాహితీ అంశం "కథ". ప్రోగ్రాం షెడ్యూల్ చూసి, మార్పులు, చేర్పులు చేసాం. నలభై మందికి పైగా పార్టిసిపంట్స్ రిజిస్టర్ అయ్యారు. ఎక్కువ మంది చిన్న వయస్కులే. ఉద్యోగాలు చేసేవాళ్ళు,గృహిణులు కుడా వున్నారు.

పదింటి కల్లా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రోగ్రాం స్టార్ట్ చేసాము.అప్పటికి ఆహూతులంతా వచ్చేసారు. మమ్మల్ని వచ్చిన వారికి పరిచయం చేసారు శంకర్రావు గారు. రాజారామ్ గారు ముఖ్య అతిథి గా చిన్న ఉపన్యాసం ఇచ్చారు.. కథ, దాని ఆవశ్యకత మీద.

ముందు సెషన్ రాజ్యలక్ష్మి గారిది. అసలు కథ అంటే ఏంటి, దానిలోని అంశాలు, శిల్పం, నడక వగైరా లన్నీచాలా బాగా వివరించారు. తర్వాత నా వంతు. అసలు కథ ఎలా మొదలు పెట్టాలి? ఏమి రాయాలి?

"ముందు మంచి మంచి పుస్తకాలు చదవండి. వాళ్ళు రాసిన శైలి గమనించండి. ఎలా మొదలు పెడుతున్నారు, ఎలా నడిపిస్తున్నారు, చివరికి ఎలా ముగిస్తున్నారు..ఇలాంటివి చూడండి" చెప్పాను.

ఒకతను "అవి బాగానే చదువుతున్నాం మేడం, కానీ మేమేమి రాయాలో అర్ధం కావట్లేదు" అడిగాడు.

"మన చుట్టూ జరిగేవి చూడండి. న్యూస్ పేపర్స్ లో, సోషల్ మీడియా లో రకరకాల సంఘటనలు కనిపిస్తూ ఉంటాయి. మనసుకు హత్తుకునేవి కొన్ని అయితే, మనసుని పిండేసేవి కొన్ని కనిపిస్తాయి. అంతే కాదు. మీ ఇంట్లోనో, బంధువుల్లోనో, ఆఫీస్ లోనో ఏదో ప్రత్యేకమైన జీవన విధానమో, వింత వింత పాత్రలో ఎదురవచ్చు. మీకు నచ్చినవి ఎంచుకోండి. ఆ సంఘటననే మీ మాటల్లో కథగా రాయండి. క్రమంగా ఊహించటం మీకే అలవాటు అవుతుంది" చెప్పాను.

ఇంకొక అమ్మాయి లేచింది ... "ఇలాంటివి నేను అనుకున్నాను మేడం. కానీ మన వాళ్ళ గురించి రాస్తే వాళ్ళు హర్ట్ అవుతారేమో, మన విషయాలు బయట పెట్టింది అనుకుంటారేమో అని భయంగా వుంది".

"అటువంటప్పుడు చాలా కాజువల్ గా ఒక్క మెయిన్ ఐటమ్ మాత్రం వాళ్ళ సంగతి తీసుకుని, చుట్టుపక్కల వేరే పాత్రలు సృష్టించి ఆ సమస్యేదో చర్చించచ్చు" సలహా ఇచ్చాను.

తర్వాత వాళ్ళని సింపుల్ గా ఒక పేజీ కథ రాయమని గీతిక విషయం టూకీగా చెప్పాను. అందరినీ రాయమని టైం ఇచ్చి, తర్వాత అందరి పేపర్లు తీసుకుని లంచ్ తర్వాత ఫీడ్ బ్యాక్ ఇస్తానని చెప్పిలంచ్ బ్రేక్ ఇచ్చాను. మేం కూడా లంచ్ చేసి అందరి పేపర్స్ తీసుకుని చదివాం. ప్రణీత అనే అమ్మాయి రాసిన విధానం బాగా నచ్చింది నాకు. మంచి పట్టున్న రైటర్ అవుతుంది అనిపించింది.

అందరికీ పేపర్స్ వెనక్కి ఇచ్చి పది నిముషాల్లో నేను చెప్పాల్సింది చెప్పి వచ్చేసాను. తర్వాతి సెషన్ రామారావు గారు వాళ్ళది.

చివరగా ధన్యవాదాలు చెప్పి వర్క్ షాప్ ముగించి బయలుదేరుతుండగా ప్రణీత నా దగ్గరికి వచ్చింది.

"మేడం, మీకెలా తెల్సు మధ్యాహ్నం ఇచ్చిన కథ" అడిగింది.

"న్యూస్ పేపర్ లో చూసాను" తల తిప్పుకుని సమాధానం చెప్పాను. చేదు జ్ఞాపకాలు గొంతుకు అడ్డం పడ్డాయి.

"ఆ న్యూస్ లోని అమ్మాయి పేరు గీతిక. నా క్లాస్ మేట్" కళ్ళలో నీళ్లు తిరుగుతుండగా చెప్పింది. షాక్ కొట్టినట్లయింది నాకు.

"సూసైడ్ చేసుకుంది....మీరు రాయలేదా దీనిపైన కథ?" అడిగింది మళ్ళీ. రాశానన్నట్టు తలూపాను.

నువ్వు రాసినట్లే, నేనూ ఆ కథని విషాదాంతం చెయ్యలేదు అని చెప్పాలనుకున్నాను కానీ కన్నీళ్ల మధ్య మాటలు బయటికి రాలేదు

★★★

## *క్షమించు మిత్రమా..!!* *జీడిగుంట రామచంద్రమూర్తి*

.

**"పూజకొద్దీ పురుషుడు,** దానం కొద్దీ బిడ్డలు" తారసపడతారని పెద్దవాళ్ళు చెప్తూంటారు. ఆ సామెతకు మరో కొసమెరుపును చేర్చి 'పూర్వజన్మ సుకృతం కొద్దీ మిత్రులు చేకూరుతారని - వాళ్ళ ముగ్గుర్నీ చూసిన వాళ్ళు అంటూంటారు. 'ఎవరయ్యా ఆ ముగ్గురు' అని అడిగితే, మొదటివాడు సత్యం, రెండవవాడు శివం, మూడవ వాడు సుందరం అని కూడా చెప్పేస్తారు.

ఆ మూడు పేర్లూ వాళ్ళ నామకరణం నాడు, తల్లితండ్రులు పెట్టిన పేర్లు కాదు. అవి వేరే వున్నాయి. సత్యం అసలు పేరు సత్యమూర్తి. శివం అసలు పేరు శివరావు. ఇక సుందరం అసలు పేరు సుందరరావు. వాళ్ళ ముగ్గురి స్వస్థలం హైదరాబాదే ఆరోతరగతిలోకి వచ్చేవరకూ వాళ్ళను ఆ పేర్లతోనే పిలిచేవాడు. పిలుచుకునే వారు కూడా. అయితే వాళ్ళు

ఆరో తరగతిలో చేరినపుడు 'అటెండెన్స్' 'మార్క్' చేసే క్లాసు టీచరుగారు, వాళ్ళ పేర్లు చదువుతూ "మీ పేర్లు చాలా బాగున్నాయ్రా. కానీ నేను మాత్రం మిమ్మల్ని 'సత్యం, శివం, సుందరం' అని పిలుస్తాంటాను. మీ ముగ్గుర్నీ ఒకే బెంచీమీద కూర్చోపెడతాను. వెరైటీగా వుంటుంది" అన్నారు.

అప్పట్నుంచీ ఆ పేర్లతోనే పిలవబడుతూ ఒక బెంచీమీదనే కూర్చుంటూ పదోక్లాసుదాకా చదివి పాసయ్యారు. తర్వాత కూడా ఒకే జూనియర్ కాలేజీలో చేరి ఇంటర్ చదివారు. అది చదువుతున్న రోజుల్లోనే ఓ సంఘటన జరిగింది. ముగ్గురూ కలిసి ఓ ఆదివారం సాయంత్రం గండిపేట చెరువులో స్నానం చేద్దామని వెళ్ళారు. చేస్తూండగా ఆ నీళ్ళల్లో సత్యం ఓ అడుగుముందుకు వేసి, అక్కడ కాలు నేలకు అందక ప్రవాహంలో మునిగిపోయాడు. దాంతో భయపడి, రెండు చేతులూ పైకెత్తి 'హెల్ప్‌మీ, హెల్ప్‌మీ' అంటూ కేకలు పెట్టాడు. అప్పుడు సుందరం ఒక్క క్షణమైనా ఆలస్యం చేయకుండా అతనివైపు ఉరికి ఓ చేయి పట్టుకుని ఒడ్డుకి లాక్కుని వచ్చాడు. అక్కడే గట్టుమీద అతన్ని వెల్లకిలా పడుకోపెట్టి తనకు తెలిసిన 'ఫస్ట్ ఎయిడ్ ' చేసి, అతను పీకలదాకా మింగిన నీళ్ళను బయటకు కక్కించి ప్రాణాలు నిలబెట్టాడు. అదే జరిగి వుండకపోతే ఆ ముగ్గురు మిత్రుల్లో ఇద్దరే మిగిలి వుండేవారు. అప్పట్నించీ సత్యానికి సుందరం పట్ల గౌరవంతోపాటు ప్రేమాభిమానాలు కూడా ఎక్కువయ్యాయి. అప్పటినించీ సుందరాన్ని చూసినప్పుడల్లా 'ప్రాణదాతకు ప్రణామాలు' అంటూండేవాడు సత్యం. అలా అనద్దని సుందరం వారించేవాడు.

ఇంటరు పూర్తయ్యాక ముగ్గురూ కాలేజీలు మారిపోయారు. సత్యం డిగ్రీ కాలేజీలో చేరితే శివం మెడికల్ కాలేజీలో చేరాడు. ఇక సుందరం ఇంజనీరింగు కాలేజీలో చేరిపోయాడు. కానీ స్నేహితులుగా మాత్రం వాళ్ళు విడిపోలేదు. ముగ్గురూ ఒకే కాలనీలో వుండేవాళ్ళు కనుక, రోజూ కలుస్తూనే వుండేవారు. సినిమాలకూ, షికార్లకూ కలిసే వెడుతూండేవారు. ఎవరైనా తెలిసినవాళ్ళు, వాళ్ళ ముగ్గుర్నీ ఒకేచోట చూసినప్పుడు "మీ చదువులు వేరైనా మీరు మాత్రం వేరు వేరుగా కనిపించరేమిటయ్యా?" అని ప్రశ్నిస్తే దానికి ముగ్గురూ ఒకే సమాధానం చెప్పేవారు.

"మన జీవితంలోని ప్రతి దశలోనూ, స్నేహితులనేవాళ్ళు దొరుకుతూనే వుంటారండీ. కానీ జీవితాంతం కలిసి వుండే స్నేహితులే నిజమైన స్నేహితులం ఆ స్నేహమే మా మధ్య వుంది" అని.

ఆ స్నేహపూరిత వాతావరణంలో వాళ్ళ మధ్యన రోజులు, వారాలూ నెలలూ ఏళ్ళుగా మారిపోతున్నాయి. అలా మారిపోయిన పదేళ్ళ వ్యవధిలో, వాళ్ళ జీవితాల్లో అనేక సంఘటనలు జరిగాయి. సత్యం పబ్లిక్ సర్వీసు పరిక్ష రాసి సెక్రటేరియట్లో గుమాస్తా ఉద్యోగం సంపాదించుకున్నాడు. మెడిసిన్ చదివిన శివం హైదరాబాదులోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో డాక్టరుగా చేరిపోయాడు. ఇంజనీరింగ్ పట్టా తీసుకున్న సుందరం మాత్రం ఢిల్లీలోని ఓ 'ఐ.టీ కంపెనీ'లో ఉద్యోగంలో చేరాడు.

ముగ్గురుకీ అటూ ఇటూగా నాలుగేళ్ళ వ్యవధిలో పెళ్ళిళ్ళు కూడా జరిగిపోయాయి. పెళ్ళయి రెండేళ్ళకే సత్యం దంపతులకు ఒక మగపిల్లాడు కలిగాడు. ఆరేడేళ్ళయినా శివానికీ, సుందరానికీ 'తండ్రి' హోదా లభించలేదు. సత్యం, శివం, హైదరాబాదు మాదాపూర్‌లో వున్న 'గేటెడ్ కమ్యూనిటీలో పక్కపక్కనే చెరో అపార్ట్‌మెంట్ కొనుక్కుని, ఒకేసారి గృహప్రవేశం చేసుకున్నారు. ఆ వేడుక చూసేందుకు ఢిల్లీనించి సుందరం వచ్చాడు.

"నేనుకూడా హైదరాబాదు వచ్చేసి, ఇక్కడే వేరే 'జాబ్' చూసుకుంటాన్రా. మీ అపార్ట్‌మెంట్స్ పక్కనే మరొకటి ఖాళీగా వుంటే చూడండి. అప్పుడు మనం ముగ్గురం ముచ్చటగా ఒకే చోట వుండచ్చు" అన్నాడు సుందరం వాళ్ళతో.

"నువ్వు రావాలే కానీ మాకు అంతకంటేనా" అన్నాడు సత్యం.

"అలా మాట వరుసకు అంటున్నాడేకానీ అంత మంచి జాబ్ ఈ హైదరాబాద్‌లో ఇప్పటికిప్పుడు దొరకదు్దా?" అలా అంటే అయినా పౌరుషం వచ్చి సుందరం ఆ ప్రయత్నంలో పడతాడనుకున్నాడు శివం.

మొత్తానికి ఢిల్లీనుంచి వచ్చిన సుందరం మాత్రం సత్యం కొడుకుతో అక్కడున్న మూడురోజులూ కాలక్షేపం చేసి మురిసిపోయాడు. వాణ్ణి ఎత్తుకుని టాక్సీ ఎక్కించి ఊరంతా తిప్పాడు. కొత్త డ్రెస్సులూ, రకరకాల బొమ్మలూ వాడికి కొనిచ్చాడు.

"ఎందుకన్నయ్యా అంత డబ్బు ఖర్చు చేసి అవన్నీ కొనటం?" అని అడిగింది లలిత.

"నీకు తెలీదమ్మా. సత్యం నాకు స్నేహితుడేకాదు. తమ్ముడులాంటివాడు. అప్పుడు నువ్వు వరసకి మరదలవుతావు. అయినా నిన్ను మాత్రం 'చెల్లెమ్మా' అని పిలుస్తున్నాను. అలాంటప్పుడు మీ బాబిగాణ్ణి నేను పరాయివానిగా ఎలా చూసుకుంటానమ్మా. అయినా వాడికోసం నేను చేసింది కూడా ఓ ఖర్చేనా? మర్చిపొండి" అన్నాడు సుందరం.

నాలుగోరోజున అతను తిరిగి ఢిల్లీ ప్రయాణం అయినప్పుడు, వీడ్కోలు చెప్పేందుకు అందరూ ఎయిర్‌పోర్టుకి వెళ్ళారు. అప్పుడు కూడా టాక్సీలో బాబిని, సుందరం తన పక్కనే కూర్చోపెట్టుకున్నాడు.

"అంకుల్! నువ్వూ, ఈ శివం బాబాయ్ మా నాన్నకి మంచి స్నేహితులు కదా!" సుందరాన్ని అడిగాడు బాబి.

"మేం ముగ్గురం మంచి స్నేహితులం మాత్రమే కాదురా" ప్రాణ స్నేహితులం నీకు తెలుసునోలేదో ఓసారి మేం ముగ్గురం చెరువులో స్నానానికి వెళ్ళినప్పుడు నేను ఈతకొడుతూ, ఆ నీళ్ళ ప్రవాహంలో మునిగిపోతే అప్పుడు ఈ సుందరం అంకులే నన్ను బయటకు లాగి ప్రాణాలు కాపాడాడు" చెప్పాడు సత్యం.

"ఓః! గ్రేట్. అయితే సుందరం అంకుల్ హీరో అన్నమాట" చప్పట్లు కొడుతూ అన్నాడు బాబి.

"మామూలు హీరోకాదురా! సూపర్ హీరో" పక్కన కూర్చున్న శివం చెప్పాడు. టాక్సీ ఎయిర్‌పోర్టుకి చేరుకోగానే తన సూట్‌కేసు తీసుకుని క్రిందకు దిగాడు సుందరం.

"ఉంటాన్రా! మీ బాబిగాడితో ఫోనులో మాట్లాడిస్తూండు" అని సత్యానికి చెప్పి లోపలకు వెళ్ళిపోయాడు.

ఇక శివం సంగతి సరేసరి. పక్క పక్క అపార్ట్‌మెంటుల్లోనే వుంటున్నారు. కనుక సత్యం దంపతులతో అతని స్నేహం మరింత బలపడింది. బాబితో చనువుకూడా ఎక్కువైంది. ప్రతిరోజూ హాస్పిటల్‌కి వెళ్ళేటప్పుడు ఓసారి వాడి బుగ్గగిల్లి ముద్దు పెట్టుకుని 'బై' చెప్పేవాడు. మళ్ళీ సాయంత్రం హాస్పిటల్ నించి తిరిగి రాగానే 'హాయ్ బాబి' అని పలకరించి, బట్టలు మార్చుకుని తన దగ్గర కూర్చోపెట్టుకునేవాడు. రోజూ వాడు చేసే చిలిపి పనులగురించి సుందరానికి ఫోన్లో చెప్తూండేవాడు. వాడితో తీసుకున్న సెల్ఫీలూ, ఫొటోలూ వాట్సప్‌లో అతనికి పంపుతూండేవాడు.

రోజులు అలా గడుస్తూండగా ఓసారి బాబికి టైఫాయిడ్ జ్వరం వచ్చింది. సత్యం కంటే శివం ఎక్కువ ఖంగారు పడిపోయాడు. వెంటనే తాను పనిచేస్తున్న హాస్పిటల్‌కి తీసుకెళ్ళి 'అడ్మిట్' చేశాడు. చిల్డ్రన్స్ స్పెషలిస్టుతో వైద్యం చేయించాడు. తనూ, తన భార్య కలసి ఆ పదిరోజులూ హాస్పిటల్‌లోనే సత్యం దంపతులకు సాయంగా వుండి సపర్యలు చేశారు. ఆ విషయాన్ని ఢిల్లీలో వున్న సుందరానికి ఫోన్లో చెప్పేసరికి అతను కూడా ఖంగారు పడిపోయాడు. రోజుకి రెండుసార్లయినా శివానికి ఫోన్ చేసి వాడి ఆరోగ్యం గురించి వాకబు చేసేవాడు. "త్వరగా బాబికి జ్వరం తగ్గిపోయి, క్షేమంగా ఇంటికి చేరిపోతే ఈసారి హైదరాబాదు వచ్చినప్పుడు అక్కణ్ణించి తిరుపతి వెళ్ళి తన తలనీలాలు ఆ స్వామికి

సమర్పించుకుంటా"నని మొక్కుకున్నాడు. మాటల సందర్భంలో ఆ సంగతి సత్యానికి చెప్పినప్పుడు అతని కళ్ళు చెమర్చాయి.

"చూశావా లలితా మనం అంటే శివానికీ, సుందరానికీ ఎంత ప్రేమో. పాపం వాళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళయి ఇంతకాలమైనా పిల్లలు కలగలేదు. ఆ ఏడుకొండల వెంకన్న దయవల్ల రేపో మాపో వాళ్ళకు కూడా పిల్లలు కలగాలోయ్ అప్పుడు మనం కూడా తిరుపతి వెళ్ళి ఆ స్వామిని దర్శించుకుందాం. నేనైతే నా తలనీలాలు సమర్పించుకుంటాను" అన్నాడు సత్యం.

"స్నేహం అంటే మీదేనండీ" అంది లలిత అతనివైపు మెచ్చుకోలుగా చూస్తూ.

"లలితా ఏం చేస్తున్నావ్? నీకో శుభవార్త చెప్పబోతున్నాను త్వరగా రావాలి" ఆఫీసు నించి అప్పుడే ఇంటికొచ్చి హాల్లోకి అడుగుపెట్టిన సత్యం పిలిచాడు.

"వస్తున్నానండీ" వంటింటిలోంచి బదులిచ్చింది లలిత.

"ఏమిటి డాడీ ఆ శుభవార్త? నీకు ఆఫీసులో ప్రమోషను వచ్చిందా?" అక్కడే సోఫాలో కూర్చుని సెల్‌ఫోన్‌లో 'గేమ్' ఆడుతున్న బాబి అడిగాడు.

"అంతకంటే మంచి వార్తరా"

"ఏమిటండీ ఆ వార్త?" వంటింటిలోంచి వస్తూ అడిగింది లలిత.

"రేపు నేను మా సుందరం గాణ్ణి కలుసుకోబోతున్నానోయ్" సంతోషంతో చెప్పాడు సత్యం

"అలాగా! ఇక్కడికి వస్తున్నట్టు అతను ఫోన్ చేశాడా?"

"లేదోయ్ వాడు ఇక్కడకు రావటం కాదు. నేనే ఢిల్లీ వెడుతున్నాను. రేపూ ఎల్లుండీ శని, ఆదివారాలు కదా. హాయిగా వాడితో గడిపేస్తాను. మా ఆఫీసునించి కొన్ని ముఖ్యమైన ఫైళ్ళు అక్కడి సెక్రటేరియట్‌లో నన్ను పర్సనల్‌గా ఇచ్చి రమ్మన్నారు. సోమవారం ఆ పని పూర్తిచేసుకుని మళ్ళీ మంగళవారం బయల్దేరి వచ్చేస్తాన్లే. ఫ్లయిట్ టిక్కెట్లు ఆఫీసువాళ్ళే అరేంజ్ చేశారు"

"మేం కూడా వస్తామండీ" పక్కనే కూర్చుని అడిగిందామె.

"మీరా?"

"అవుండి మన పెళ్ళి అయ్యాక హనీమూన్ తీసుకెడతానని చెప్పారు. గుర్తుందా 'ఇదిగో వెడదాం, అదిగో వెడదాం' అంటూ పదేళ్ళ నించీ వాయిదాల మీద వాయిదాలు వేసేశారు. మనకి బాబిగాడు కూడా పుట్టేసి నాలుగేళ్ళయిపోయింది ఇప్పుడైనా తీసుకెళ్ళండి. పైగా నేను ఎప్పుడూ విమానం ఎక్కలేదు కూడాను" గారాలుపోతూ చెప్పింది.

"ఇప్పటికిప్పుడు అడిగితే ఎలాగోయ్? 'టిక్కెట్స్' దొరకొద్దూ?"

"మీ స్నేహం పవిత్రమైందే అయితే తప్పకుండా దొరుకుతాయి. నెట్‌లో చూడండి"

"ఔను డాడీ. తప్పకుండా దొరుకుతాయి. నేను దేవుడికి దణ్ణం పెట్టుకుంటాను. నాక్కూడా సుందరం అంకుల్ని చూడాలని వుంది. చూడు డాడీ" అంటూ దగ్గరకొచ్చి కంప్యూటరు ఓపెన్ చేస్తూ అడిగాడు బాబి.

'తప్పదా? అంటూ నెట్ ఓపెన్ చేసి చూశాడు సత్యం ఫ్లయిట్‌లో చాలా ఖాళీలే వున్నట్టు గమనించారు.

"ఓc చాలా ఖాళీలున్నాయి. శివం గాణ్ణికూడా అడిగితే బాగుంటుందేమో వాడు కూడా వస్తాడు."

"అడగండి" సెల్‌ఫోను అందిస్తూ చెప్పింది లలిత.

"ఏమిటి చెల్లెమ్మా. అడగమంటున్నావ్ ఎవర్ని?" అదే క్షణంలో ఆ ఇంట్లో అడుగుపెట్టిన శివం అడిగాడు. అక్కడే వున్న సోఫాలో కూర్చుంటూ.

"నిన్నేరా సమయానికి వచ్చావ్ రా! నేను ఫామ్లీతో రేప్పొద్దున్న ఫ్లయిట్‌లో ఢిల్లీ వెడుతున్నాను. నువ్వూ, మీ ఆవిడా కూడా వస్తే బావుంటుందనుకున్నాం. నాలుగు రోజుల్లో వచ్చేద్దాం. అఫ్‌కోర్స్. అక్కడ సెక్రటేరియట్‌లో, నేను ఓ రోజు పని చూసుకోవాలునుకో కానీ మిగతా మూడురోజులూ సుందరంతో హాయిగా గడిపేయచ్చు" హుషారుగా చెప్పాడు సత్యం.

"సారీరా! నేను రాలేను"

"అదేమ్రిటా? స్పృహలో వుండే ఆ మాటలు చెప్పాడా? అడిగాడు సత్యం.

"స్పృహలో లేకపోయినా బావుండేది."

"అంటే ఏమిటి నీ ఉద్దేశ్యం?"

"నువ్వు కూడా సుందరం ఇంటికి వెళ్ళేందుకు వీల్లేదు" అంటూ సోఫాలోంచి ఛివాల్న లేచాడు.

"జోకు చెయ్యకు. నువ్ రావాల్సిందే అస్తమానూ సుందరాన్ని మనం 'వీడియో కాల్స్'లో చూసుకోవటమే తప్ప పర్సనల్‌గా కలవలేకపోయాం. ఎప్పుడో ఏడాది క్రితం మన ఇళ్ళ గృహప్రవేశానికి వచ్చాడు."

శివం మాట్లాడలేదు. అతని కళ్ళు చెమ్మగిల్లుతున్నాయని గ్రహించాడు సత్యం.

"ఏమైందిరా? మీ మధ్య ఏమైనా మనస్పర్ధలు వచ్చాయా?" అడిగాడు మళ్ళీ.

"ఆc...అవును. అలాంటివే. నువ్ వాడింటికి వెడితే మనిద్దరి మధ్య కూడా వస్తాయి."

ఈసారి సత్యం కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఏమైందిరా? ఒకప్పుడు వాడు నీ ప్రాణాలు కాపాడినవాడు. వాడితో మనస్పర్ధలా?" పైగా నన్ను కూడా కలవద్దంటావా? ఎందుకిలా మాట్లాడుతున్నావ్?"

"ఎందుకో నువ్వు తిరిగి వచ్చాక చెప్తాను. నువ్ మాత్రం ఈ ట్రిప్పులో వాణ్ణి కలవటానికి వీల్లేదు. కలిసావంటే నామీద ఒట్టే" గబగబా బయటకు నడిచాడు శివం.

నిశ్చేష్టుడై అటే చూస్తూ తలపట్టుకున్నాడు సత్యం.

మర్నాడు పొద్దున్నే సతీసమేతంగా బయల్దేరి ఎయిర్ పోర్టుకి వెళ్ళి విమానం ఎక్కి మధ్యాహ్నం రెండయ్యేసరికి ఢిల్లీ చేరుకున్నాడు సత్యం. ఆ రోజంతా రెస్టు తీసుకుని తర్వాత రెండురోజుల్లో అక్కడ చూడాల్సిన ప్రదేశాలన్నీ చూసేశారు. సోమవారం ఆఫీసు పని పూర్తి చేసుకుని హోటల్ రూమ్‌కి వచ్చాడు.

"పని అయిపోయిందిగా ఇంక సుందరం అంకుల్ ఇంటికి వెడదాం డాడీ" అడిగాడు బాబి.

"ఇప్పుడు వెళ్ళటం కష్టంరా. వాడిల్లు ఇక్కడికి చాలాదూరం."

"అయితే మాత్రం టాక్సీలో వెళ్ళవచ్చుగా"

"ఇప్పుడు ఓపికలేదు నాన్నా?" చెప్పాడు సత్యం.

"అదేం కాదులే నాకు తెలుసు అక్కడకు వెళ్ళద్దని శివం అంకుల్ చెప్పాడుగా" నేను విన్నాను.

"మరింకనేం అందుకే వాళ్ళింటికి వెళ్ళదల్చుకోలేదు పైగా తన పైన ఒట్టుకూడా వేసుకున్నాడు"

"అయితే ఏం? ఒట్టుతీసి గట్టున పెట్టచ్చట. ఓసారెప్పుడో మమ్మీ చెప్పింది"

"గట్టున పెట్టే ఒట్టు కాదురా మాది. కట్టుబడివుండే ఒట్టు" చెప్పాడు.

"అయితే ఓసారి అంకుల్‌కి ఫోన్ చేసివ్వు. నేనుమాట్లాడతాను. ఢిల్లీ వచ్చామని చెప్తాను. అప్పుడు తనే మనల్ని చూడ్డానికి వస్తాడు" సలహా ఇచ్చాడు బాబి.

ఆ సలహా సత్యానికి నచ్చింది. వెంటనే ఫోను తీసి సుందరం నంబరుకి డయల్ చేశాడు 'స్విచ్ ఆఫ్' అని తెలిసింది ఆ మాటే బాబికి చెప్పి 'ఇంక వదిలెయ్' అన్నాడు.

ఆ మర్నాడు ముగ్గురూ కలసి హైదరాబాదుకి తిరుగు ప్రయాణమయ్యారు. విమానంలో కూర్చున్నాడన్నమాటేగానీ సుందరాన్ని కలుసుకోలేదన్న బాధతో సత్యం మనసంతా అల్లకల్లోలమైపోయింది. అసలు శివం - సుందరాన్ని ఎందుకు కలుసుకోవద్దన్నాడో, ఇద్దరి మధ్యా మనస్పర్ధలు ఎందుకొచ్చాయో ఒకవేళ వచ్చాయే అనుకున్నా - తనను కలవద్దనటానికి కారణం ఏమిటో ఎంత ఆలోచించి సమాధాఅం దొరకలేదు.

ఆ కలవరపాటుతోనే హైదరాబాదు చేరుకుని ఇంటికి వచ్చాడు సత్యం. రాగానే శివం వాళ్ళను చూసి 'వచ్చేశారా' అంటూ ఆనందంతో బాబి గాణ్ణి దగ్గరకు తీసుకుని ఎత్తుకున్నాడు.

"ఇదేమిట్రా?" ఈ నాలుగు రోజుల్లోనే వీడు ఇంతగా చిక్కిపోయాడు?" అడిగాడు సత్యాన్ని.

"చిక్కిపోలేదు సుందరాన్ని చూడలేకపోయినందుకు బెంగపెట్టుకున్నాడు" ముఖం పక్కకు తిప్పుకుని చెప్పాడు సత్యం.

"సారీరా! నన్ను క్షమించు. నా మాట విని వాడి దగ్గరకు వెళ్ళలేదు"

"అదే! వాడి దగ్గరకు ఎందుకు వెళ్ళద్దన్నావో ఇప్పుడైనా చెప్పు. వచ్చాక చెప్తానన్నావ్‌గా. మా మధ్య మనస్పర్ధలు ఎందుకు వచ్చాయ్?" అడిగాడు.

"మనస్పర్ధలు కాదురా! వాడికి.. సుందరానికి కరోనా వైరస్ సోకిందిరా. ఆస్పత్రిలో వున్నాడు" కంట తడితో చెప్పాడు శివం.

అంతే నోటమాట రాలేదు సత్యానికి అక్కడే వున్న సోఫాలో కూలబడిపోయాడు 'అయ్యో' అంటూ లలితకూడా అతని పక్కనే కూర్చుండిపోయింది.

"ఎప్పుడు?" నెమ్మదిగా అక్షరాల్ని కూడదీసుకుంటూ అడిగాడు సత్యం దిగులుగా చూస్తూ.

"అప్పుడే పదిరోజులైందిరా మీ ఢిల్లీ ప్రయాణానికి ముందు యధాలాపంగా వాడికి ఫోను చేశాను. వాడు ఎత్తలేదు. చెల్లెమ్మ ఫోను తీసింది. 'ఆయనకు కరోనా సోకింది అన్నయ్యగారూ. ఆస్పత్రిలో చేర్పించాను. నాలుగురోజులైంది.' ఫామ్లీతో ఢిల్లీ వచ్చావనీ, నేను కూడా రేపు బయల్దేరి వస్తాననీ ఇద్దరం కలిసి హాస్పిటల్‌కి వచ్చి వాణ్ణి చూస్తామనీ నేను చెప్పాను. చెల్లెమ్మ మనల్ని రావద్దంది. అసలు తనకు కరోనా వచ్చిన విషయం ఎవరికీ చెప్పద్దనీ ముఖ్యంగా మనిద్దరికీ అసలే చెప్పద్దనీ అన్నాడట. మనల్ని బాధపెట్టటం తనకు ఇష్టంలేదట" తన బాధను హృదయంలో దాచుకుంటూ చెప్పాడు శివం.

"అయితే మనం అర్జంటుగా చెల్లెమ్మతో మాట్లాడాలిరా. ఓసారి వీడియోకాల్ చేసి వాణ్ణి చూపించమందాం" అన్నాడు సత్యం.

" సాయంత్రం అయిదింటికి 'విజిటింగ్ అవర్స్' వుంటాయి. అప్పుడు చెల్లెమ్మ ఆస్పత్రిలో వుంటుంది" చెప్పాడు శివం.

ఆ రోజంతా 'సాయంత్రం ఎప్పుడవుతుందా' అని ఎదురు చూస్తూ గడిపేశారు. పదినిమిషాలు ముందే వాట్సప్ ఫోను తీసి సుందరం భార్యకు ఫోను చేశాడు శివం నంబరు చూసుకుని ఫోను 'ఆన్' చేసిందామె.

"హలో.."

"ఏమిటి చెల్లెమ్మా ఈదారుణం? సుందరానికి కరోనా సోకిందనీ, నువ్వు వాణ్ణి ఆస్పత్రిలో చేర్పించావనీ శివం చెప్పాడమ్మా. ఇప్పుడు ఎలా వున్నాడూ?" ఆందోళన నిండిన స్వరంతో అడిగాడు సత్యం.

"ఎలా వున్నారంటే ఏం చెప్పమంటావ్ అన్నయ్యా? ఆ భగవంతుణ్ణే అడగాలి" దుఃఖాన్ని ఆపుకుంటూ చెప్పిందామె.

"ఏమిటమ్మా నువ్వు అంటున్నదీ?" ఖంగారుగా అడిగాడు.

"ఆయన.. ఆయన వెళ్ళిపోయారు. అసలు నాలుగురోజుల్నించీ స్పృహలోనే లేరు. ఐ.సి.యూలో వుంచి వెంటిలేటర్ అమర్చి ఊపిరితిత్తులకు ఆక్సిజన్ అందించారు. ఇవాళ పొద్దున్నే ఊపిరి ఆగిపోయింది. అంతా అయిపోయింది అన్నయ్యా!" దాదాపు ఏడుస్తూ చెప్పింది.

"అయ్యో! భగవంతుడా" అనుకుని మరి మాట్లాడలేకపోయాడు సత్యం

"మరి.. అంత్యక్రియలు" అని శివం అడగబోయాడు.

"ఇంకా కాలేదన్నయ్యా మార్చురీలో వుంచారు."

"వాడి అన్నయ్య కొడుకు ఢిల్లీలోనే వున్నాడుగా. కబురు పెట్టావా?"

"కబురు పెట్టాను. కానీ రాలేనన్నాడు. కరోనా అంటు వ్యాధి కదా?"

"అయితే మాత్రం 'మాస్క్' పెట్టుకుని దూరంగా కూర్చోవచ్చుగా. కొడుకుతో సమానం."

"వాళ్ళ పెద్దవాళ్ళు వద్దన్నారటలే. మనం ఏం చేయగలం" చెప్పిందామె.

"మరేం ఫర్వాలేదమ్మా నేనూ సత్యం రేపొద్దున్నే ఏ ఫ్లయిటుంటే ఆ ఫ్లయిటు పట్టుకుని వచ్చేస్తాం. అంతవరకూ మార్చురీలో వుంచమని అక్కడి డాక్టర్లకు చెప్పు. వాడి అంత్యక్రియలు మేం చేస్తాం" అంటూ ఫోన్ 'ఆఫ్'చేసి వెంటనే కంప్యూటర్ 'ఆన్' చేసి మర్నాడు ఉదయం ఫ్లయిట్‌లో ఢిల్లీ ప్రయాణానికి టిక్కెట్లు బుక్ చేశాడు శివం. ఆ మధ్యాహ్నం మూడు గంటలకు ఇద్దరూ ఢిల్లీ చేరుకున్నారు. వెంటనే సుందరం భార్యకు ఫోన్ చేసి తాము ఢిల్లీ వచ్చిన విషయం చెప్పాడు.

ఆస్పత్రికి వెళ్ళగానే ఇద్దరూ ముఖాలకు మాస్కులు పెట్టుకుని భౌతిక దూరాన్ని పాటిస్తూ బరువెక్కిన హృదయాలతో, పెల్లుబికి వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ మార్చురీలోంచి సుందరం 'భౌతిక కాయాన్ని' 'అంబులెన్స్'లో పెట్టించి స్మశాన వాటికకు తీసుకెళ్ళారు. చితి పేర్పించారు.

"ఒరే సుందరం నిన్ను పోగొట్టుకోవటం మా దురదృష్టం!" నేను ఢిల్లీ వచ్చికూడా నిన్ను చూడలేకపోయాను. నన్ను క్షమించు" చితిమీద పడుకోపెట్టిన వాడి పార్థివదేహానికి నమస్కరించి నిప్పు అంటించాడు సత్యం.

"నేనూ తప్పు చేశాన్రా! సత్యం ఢిల్లీ వెడుతున్నాడని తెలియగానే నిన్ను కలవటానికి వీల్లేదని ఆంక్ష విధించాను. నన్ను కూడా క్షమించు" సత్యం వెనకాలే, చితిచుట్టూ ప్రదక్షిణ చేస్తూ అనుకున్నాడు శివం.

చితిలోంచి మంటలు ఉవ్వెత్తున పైకి లేచాయి.

"ఈశ్వరా! మా ప్రాణస్నేహితుని ఆత్మకు సంతృప్తి లభిస్తుంది" అంటూ కనిపించని ఆ పరమేశ్వరునికి ఎదురుగా కనిపిస్తున్న అగ్నిదేవుడికి నమస్కరించారు. కన్నీళ్ళు నిండిపోయిన వారిద్దరి కనులకు ఆ చితిమంటలు మసకమసకగా కనిపించాయి.

## ఇలా ఉంటే బావుంటావమ్మాయీ — జ్యోతిర్మయి

రాహుల్ కి ఉద్యోగమొచ్చి మూడేళ్లయింది. పెళ్లి చెయ్యాలని అమ్మానాన్నా తెగ ఆరాటపడుతున్నా కాస్త ఆగండని నెట్టుకొస్తూ వచ్చాడు ఈ మూడేళ్ళూ. తనిచ్చే గ్రీన్ సిగ్నల్ కోసమే వాళ్ళ వెయిటింగ్. మూడు నెలలకోసారి ఇంటికెళతాడు రాహుల్. వెళ్ళిన ప్రతిసారీ వాళ్ళ అమ్మా నాన్నలది ఒకే ప్రశ్న "అమ్మాయిని చూసెయ్యమంటావా?" అని. అప్పుడే వద్దంటాడు రాహుల్. క్రిందటి సారి వెళ్ళినపుడు రహస్యంగా అడిగింది వాళ్ళమ్మ భారతి "ఎవర్నైనా ఇష్టపడితే చెప్పు..మీ నాన్నగార్ని వప్పించే పూచీ నాది" అంటూ. అది గుర్తొచ్చి నవ్వుకున్నాడు రాహుల్. కాఫీ చివరి సిప్ చెస్తూ లేచాడు మంచం మీంచి. కప్పు టేబుల్ మీద పెట్టి అద్దం ముందు నిలుచుని తనని తాను చూసుకున్నాడు క్రాఫ్ సవరించుకుంటూ. 'ఇక చెప్పెయ్యాలి' అన్న నిర్ణయం తీసుకోగానే అతని పెదవులపైన చిరునవ్వూ లోలోపల కాసంత సిగ్గూ పుట్టాయి ఆ క్షణమే.

రోజూ కన్నా కాస్త శ్రద్ధగా తయారయ్యాడు ఆ రోజు. ఆఫీసు హాల్లోకి ఎంటరవుతూనే వెతికాయి అతని కళ్ళు మెర్సీ కోసం. క్యూబికల్ లో కనపడలేదు. అయితే కాఫటేరియా దగ్గరే ఉండాలి అనుకుంటూ అటేపు వెళ్ళిన రాహుల్ కి కాఫీ తాగుతూ కనపడ్డారు స్వప్న, హరి, లిఖిత, శ్రీను ఇంకా గేంగంతా ఉన్నారు మెర్సీ మాత్రం లేదు. రాహుల్ ముఖం చిన్నబోయింది. లిఖితనడిగితే చెప్పింది ముందే వచ్చింది గానీ ఫోన్ ఏదో వస్తే వెంటనే వెళ్ళిపోయిందని. వెంటనే రింగ్ చేసి ఆత్రుతగా ఎదురుచూస్తున్నాడు. ఫోన్ లిఫ్ట్ చెయ్యలేదు మెర్సీ. నిరాశగా తన సీట్ కి వచ్చి పని చేసుకోసాగాడు. కీబోర్డ్ మీటుతూ వేళ్ళూ స్క్రీన్ మీద చూస్తూ కళ్ళూ స్పీడుగా కదుల్తున్నాయి గానీ అతని మనసులో ఆలోచనలు మరింత స్పీడుగా తిరుగుతున్నాయి. ఏమయి ఉంటుంది? తన ఫోను లిఫ్ట్ చేయలేనంత ఇంపార్టెంటు పని ఏమయి ఉంటుంది మెర్సీకి? నాలుగు నెలలుగా తనే లోకమై గడుపుతున్న మెర్సీకి ఏదైనా కష్టమైతే తను తట్టుకోగలడా? పనిచేయబుద్ధి కాలేదు. ఫోను తీసి మళ్ళీ రింగ్ చేసాడు. ఎత్తడం లేదు మెర్సీ. బాధగా నిట్టూరుస్తూ పనిచేసుకోసాగాడు. రాత్రి పదయింది పనిలో పడి టైం

తెలీలేదు. బాగ్ తగిలించుకుని బండి తాళం తీసుకుని బయటికొస్తుండగా కనపడింది మెర్సీ, కార్లో నుండి దిగి ఎవరికో టాటా బైబై చెబుతూ. లోపల్నించి చెయ్యి ఊపాడు ఒక యువకుడు. రాహుల్ ఇంతకు ముందెపుడూ చూడలేదతనిని. ఎదురైన మెర్సీని చూస్తూ పలకరించాడు రాహుల్ "హాయ్ డియర్, ఏంటి మధ్యాహ్నం నుంచీ ఏమయిపోయావు ఎంత కంగారు పడ్డానో తెలుసా? "

రాహుల్ వేపు చూడకుండానే గబగబా లోనికి అడుగులేస్తూ అంది "ఎందుకూ?" చాలా సాధారణంగా వినపడిన ఆమె స్వరం రాహుల్ ని ఆశ్చర్యానికి గురిచేసింది.

మెర్సీ వెనకాలే అడుగులేస్తున్న రాహుల్ ఆగిపోయాడు ఆమె వాష్ రూం లోకి వెళ్ళిపోవడంతో. బయట సోఫాలో కూచుని ఎదురుచూస్తున్నాడు రాహుల్.

కాసేపటికి టీం లీడర్ పద్మ వచ్చి అడిగింది "ఎవరికోసమేనా వెయిట్ చేస్తున్నావా?" అంటూ. ఆమె చెప్పిన మాటతో షాక్ తిన్నాడు రాహుల్

"మెర్సీ ని డార్మిటరీ లో నిద్రపోతూ చూసానే!"

తను బయట వెయిట్ చేస్తున్నానని కూడా చూడకుండా తను అట్నించటే వెళ్ళిపోయిందన్న మాట. ఎందుకిలా? ఏమీ అర్థం కావట్లేదు రాహుల్ కి. ఫోన్ చేసాడు ఈసారి కూడా ఎత్తలేదు. అర్థమయింది రాహుల్ కి మెర్సీ తనని ఎవాయిడ్ చేస్తోంది. వెంటనే వెనుతిరిగాడు గుండెలోంచి బాధేదో జివ్వున చిమ్మింది అతని కళ్ళల్లోకి. రూముకొచ్చి పడుకుని ఆలోచిస్తున్నాడు ఎందుకు, ఎందుకిలా? మర్నాడు కూడా అంతే, తను బయటికొస్తున్నపుడు వస్తోంది అదే కార్లో..అదే యువకుడితో. నేరుగా వాష్ రూంలోకీ ఆనక డార్మిటరీ లోకీ వెళ్ళిపోతోంది. వారం తర్వాత ఒకరోజు మధ్యాహ్నం వచ్చింది. అడిగితే

"అయినా నామీద ఎందుకంత ఇంట్రెస్ట్?" అంది.

"అదేంటి, నేను స్పెషల్ కాదా నీకు?" అన్నాడు.

"స్పెషలే, కాదనెవరన్నారు? శ్రీనూ, హరీ, లిఖీ మీరందరూ నాకు స్పెషలే కదా అలా ఎందుకడుగుతున్నావ్?" అంది చాలా మామూలుగా.

"అందరిలాగే నేనూనా?" అన్నాడు ఆమె కళ్ళల్లోకి చూస్తూ ఎక్కడో చిన్న ఆశ ఇంకా వెంటాడుతోంది అతన్ని.

"అవునూ" అంటూ అక్కడ్నించి వెళ్ళిపోయింది. ఆమె చూపులో అంతకన్నా ఏం లేదన్న అర్థం స్పష్టంగా కనపడింది రాహుల్ కి. దిగ్భ్రాంతిలో ఉన్నాడతను. కాసేపు కళ్ళుమూసుకుని ఉండిపోయాడు. నాలుగు నెలలుగా తనతో ఎంతో చనువుగా తిరిగిన మెర్సీ ఇప్పుడు ఏమీ లేనట్టు ప్రవర్తిస్తోంది. తనని నిర్లక్ష్యం చేస్తోంది.

పని చేస్తున్నపుడూ కాఫీ తాగుతున్నపుడూ ఎప్పుడుపడితే అప్పుడు తన కళ్ళల్లోకి కొంటెగా చూడడం, తను రావడం ఆలస్యమయితే దిగులు పడడం, రాగానే మెరిసే కళ్ళతో నవ్వడం, రెస్టారెంట్ కీ సినిమాకీ తనతో ఒంటరిగా రావడం, తనని వాటేసుకుని బైక్ వెనకాల కూచోవడం, దగ్గరగా ఉన్నపుడు కళ్ళల్లోకి గుచ్చి గుచ్చి చూడడం, ఎవరికీ తెలీకుండా చిన్నగా కన్ను కొట్టడం, వీటన్నిటికీ అర్థం మామూలు ఫ్రెండ్షిప్పేనా? అర్థం కావట్లేదు రాహుల్ కి. మౌనంగా లేచి ఇంటికొచ్చేసాడు. పడుకున్నాడు గానీ నిద్ర పట్టడం లేదు. తన పుట్టినరోజుకి గిఫ్ట్ అడిగితే టాంక్‌బండుకెళ్దామంది. ఏమిస్తుందో అని ఎంత ఆత్రంగా ఎదురుచూసాడారోజు? నిజంగానే తాను ఎదురుచూడని బహుమతి. కళ్ళుమూసుకుంటే ఇస్తానని చెప్పి నుదిటిమీదా, చెంపలమీదా చివరికి పెదాలమీద కూడా ముద్దు పెట్టింది. ఇదంతా ఉత్తి ఫ్రెండ్‌షిప్పేనా? కాదు..కాదు..అంతా మోసం! ఒక్క ఉదుటున లేచాడు పక్కమీదనుంచి. అవమానంగా ఉంది. బాధగా ఉంది. అమ్మాయిల మీద ఏవగింపుగా ఉంది.

లాభం లేదు రేపు నేరుగా అడగాల్సిందే! ఏమిటీ మోసమని నిలదియ్యాల్సిందే! ఈ నిర్ణయం తీసుకున్నాక కూడా ఆలోచిస్తూనే ఉన్నాడు ఎప్పుడో తెల్లవారాక గానీ నిద్రపట్టలేదు రాహుల్ కి. లేటుగా లేచాడేమో మధ్యాహ్నం వెళ్ళలేకపోయాడు సాయంత్రమయింది ఆఫీసుకెళ్ళేసరికి. అంతా ఫుడ్ కోర్ట్ దగ్గరే కనపడ్డారు. తను మెర్సీ కోసం వెతుకుతుంటే స్వప్న పసిగట్టింది.

“ఇలా రారా” అంటూ దూరంగా తీసుకెళ్ళింది.

“దాన్ని వదిలెయ్‌రా..నువ్వంటే ఇంట్రెస్ట్ లేదని చెప్తోంది కదా" అంది. తమ మధ్య ఉన్నది మామూలు ఫ్రెండ్‌షిప్ కాదని ప్రేమ అని చెప్పాలని చూస్తున్న రాహుల్ ని ఆపుతూ తనే అంది

"నాకంతా తెలుసు. అప్పుడు ఇష్టపడింది ఇప్పుడు కాదంటుంది వదిలెయ్, నువ్వు ఊ అనాలే గానీ నేను లేనా నీకోసం" అంది కన్ను గీటుతూ. ఒక్క క్షణమాగితే స్వప్న చెంప చెళ్ళుమనేదే నిగ్రహించుకున్నాడు రాహుల్. ఒక్క క్షణం కూడా అక్కడ ఉండలేకపోయాడు. ఇంటికొచ్చి మంచం మీద వాలాడు. మనసంతా అయోమయంగా గజిబిజిగా ఉంది. ఆకలి లేదు తినాలని లేదు. మేస్ బోయ్ గోవిందం అప్పటికే రెండు సార్లు వచ్చి అడిగాడు ‘భోజనం చేస్తారా’ అని. వద్దని పంపించేసాడు అతనిని. కళ్ళుమూసుకుని పడుకున్నాడు. మనసు తెరమీద ఒక సినిమాలా కదులుతోంది తను ఇక్కడ జాయిన్ అయిన మొదటిరోజు నుండీ ఇంతవరకూ జరిగినదంతా.

హాయ్ హాయ్ వెల్కం అంటూ చెయ్యి ఊపారు కొందరు. దగ్గరకొచ్చి షేక్ హాండిచ్చి విష్ చేస్తున్నారు మరికొందరు. ఒకరిద్దరు అమ్మాయిలయితే బాగా దగ్గరగా వచ్చి అతనిని ఆనుకుంటూ నిలబడి చెయ్యి కలిపి కాసేపు వదలకుండా పట్టుకున్నారు కళ్ళల్లోకి చూస్తూ. కొంచెం ఇబ్బంది పడ్డాడు రాహుల్. చుట్టూ చూసాడు. అందరూ మామూలుగానే ఉన్నారు. తరవాత సీట్లో కూచుని పనిచేసుకుంటూ ఒకసారి అందర్నీ చూసాడు. అమ్మాయిలంతా బిగుతైన

జీన్సూ టీ షర్టులూ పొట్టి పొట్టి మిడ్డీలూ వేసుకున్నారు. కాస్త సాంప్రదాయ దుస్తుల్లో ఒకరేనా ఉన్నారా అని వెతికి చూసి నిరాశపడ్డాడు. మాటిమాటికీ రెస్ట్ రూమ్ కి వెళ్లి మేకప్పులవడం, ఎప్పుడుబడితే అప్పుడు ఉన్నచోటే పర్సు తీసి పెదాలమీద లిప్ స్టిక్ దిద్దుకోవడం కొంచెం వెగటు పుట్టించిందతనికి. సరే, ఎవరిష్టం వారిది రోజంతా కలిసి పనిచెయ్యాల్సింది వీళ్ళతోనే కదా అనుకుని అలవాటు చేసుకున్నాడు. యేడాది క్రితం మెర్సీ రాకతో రాహుల్ కళ్ళకి ఒక అందమైన అమ్మాయి దర్శనం అయింది. చుడీదార్ వేసుకుని లక్షణంగా అనిపించింది. చున్నీతో గుండెల్ని కప్పుకుని కనపడిన ఒకే ఒక అమ్మాయి అక్కడ మెర్సీనే రాహుల్ కి. అందుకేనేమో తొలిచూపులోనే ఆకర్షితుడయ్యాడు.

స్వప్న మాటిమాటికీ తన సీటు దగ్గరికి రావడం, ఏదో డౌట్ అడిగే సాకుతో తనకు దగ్గరవాలని ప్రయత్నం చేయడం చిరాకు పుట్టిస్తోంది. తనకు ఆసక్తి లేదని తెలిసి ఎలాగయినా ఆకర్షించాలని చేసే వెకిలి చేష్టలకు రాహుల్ కి ఆమెపై రానురానూ అసహ్యం మొదలయింది. ఒకరోజు హరితో బాగా దగ్గరగా ఉండగా చూసాక ఆమెపై మరింత అసహ్యం పెంచుకున్నాడు. ఆగలేక అడిగాడు కూడా ఏంటిది? అని. జస్ట్ ఫ్రెండ్ షిప్ అంది. మరి నాకెందుకు దగ్గరవాలనుకుంటున్నావ్? అంటే అది కూడా అందుకే అంది. ఛీ, ఇంత దిగజారుతున్నారా అమ్మాయిలు? మనసంతా చికాకుగా అనిపించింది ఆరోజంతా.

శ్రీనూ లిఖితా రోజూ ఒకే కార్లో వచ్చేవారు ఆఫీస్ కి. ఫ్రెండ్స్ అనుకున్నాడు కొన్నాళ్ళకి తెలిసింది వాళ్ళు లివింగ్ రిలేషన్ షిప్ లో ఉన్నారని. కానీ అది కొన్ని నెలలే. తర్వాత విడివిడిగా వస్తున్నారు. విడిపోయారని తెలిసి బాధపడ్డాడు. ఒకరోజు శ్రీను ఒంటరిగా ఉన్నపుడు అడిగాడు ఎలా తట్టుకుంటున్నావని.

“అమ్మాయి తనే లైట్ తీసుకుంటోంది, నాకేంటి బ్రో?” అన్నాడు.

ఎలా? ఇంత ఈజీనా, కలవడం, విడిపోవడం? తాము కలిసున్నప్పటి అనుభవాలు గుర్తొచ్చి భవిష్యత్ లో బాధించవా? గడిచిన కాలపు జ్ఞాపకాలు ప్రస్తుత జీవితంపై ప్రభావం చూపించవా? ఇంత లైట్ అని ఎలా అనుకుంటున్నారు? పెళ్లి అనే తంతుతో కలవకపోయినా స్త్రీ పురుషులిద్దరు కలిసి జీవించాలనే నిర్ణయం తీసుకున్నారంటే ఆ ఇద్దరి మనసులు విడిపోలేనంతగా ముడిపడ్డాయనే కదా! మరి అంత త్వరగా నిర్ణయాలు మార్చుకుని విడిపోవడం ఎలా సాధ్యం? రాహుల్ బుర్ర వేడెక్కింది ఆరోజు.

రెండు నెలలలోనే లిఖితా, శ్రీనూ మళ్ళీ సహజీవన జంటలయ్యారు ఇద్దరూ కలిసి కాదు..వేర్వేరు వ్యక్తులతో. ఇది మరీ పెద్ద షాక్ రాహుల్ కి. అయితే ఈమధ్యనే లిఖితకి ఇంట్లో వాళ్ళు సంబంధం చూస్తే మానసికంగా కొంచం నలిగింది గానీ బాయ్ ఫ్రెండుకి గుడ్ బై చెప్పేసి ఇంట్లోవాళ్ళు చూసిన అబ్బాయితో తాళి కట్టించుకుని ఇల్లాలయిపోయింది. పెళ్ళికి పిలిస్తే అందరూ వెళ్ళారు శ్రీనూతో సహా అందరూ హేపీగా గడిపారు. పెళ్లికొడుకుతో కరచాలనం చేస్తూ నవ్వుతూ మాట్లాడుతున్న శ్రీను ను చూస్తూ ఆశ్చర్యపోయాడు రాహుల్. ఎలా ఉండగలుగుతున్నారు

వీళ్ళంతా. ఇదంతా సంస్కారమేనా? సంస్కారమంటే ఇదేనా? ఆకర్షణకి ప్రేమ అనే ముసుగు వేసి అవసరాలు తీర్చుకోవడం ఎంతవరకూ సమంజసం? మన సంస్కృతీ సంప్రదాయాలను తప్పుదోవ పట్టిస్తూ సభ్య సమాజాన్ని కలుషితం చేసే దిక్కుగా తీసుకు పోతున్నాయా మన ఈ పోకడలు?

ఇవన్నీ ఇలా ఉంటే 'నీతో సమానంగా సంపాదిస్తున్నాను కదా నువ్వు నాకన్నా ఏం గొప్ప' అంటూ ఈగో ల గోలతో పెళ్ళయిన ఏడాదికే విడాకులు తీసుకుంటున్న జంటలు. అమ్మో, నాన్నో తప్ప ఇద్దరి ప్రేమా దొరకని దౌర్భాగ్యానికి గురయ్యే పిల్లలు. ఆలోచిస్తున్నరాహుల్ కి తల పగిలిపోతోంది. కలవడాలూ విడిపోవడాలూ ఎన్ని జరుగుతున్నా అంతా పబ్బులూ, డ్రింకులూ వీకెండ్ పార్టీల్లో కలుస్తూనే ఉంటారు. అంతా మామూలుగా నవ్వుతూ తుళ్ళుతూ గడిపేస్తుంటారు. ఇవన్నీ చూస్తున్న రాహుల్కి ఒకోసారి పిచ్చెక్కినంత పనవుతుంది.

ఒకరోజు కొలీగ్ సుదేష్ తో మాటల్లో అన్నాడు వీళ్ళంతా ఇంత ఈజీగా ఎలా ఉండగలుగుతున్నారు? అని

"లైట్ బ్రో..అమ్మాయిలు మనతో చనువుగా ఉన్నపుడు ఎంజాయ్ చేయాల్సిందే, సమయమొచ్చినపుడు అమ్మానాన్న చూసిన లక్షణమైన అమ్మాయిని పెళ్లి చేసుకోవాల్సిందే, ఎక్కువ ఆలోచించి బుర్ర పాడుచేసుకోకూడదు" అన్నాడు.

స్వప్న కూడా అలాగే మాట్లాడింది. "నీ అంత వేస్టు ఫెలో ని నా లైఫ్ లో చూళ్ళేదు. లైఫ్ ఎంజాయ్ చెయ్యడం తెలీని ముద్దపప్పువి " అంది. అవునా? బరితెగించే పనులు చేయని తాను తెలివితక్కువవాడా? తరతరాలుగా ప్రపంచ దేశాలన్నిటిలో కొనియాడబడుతున్న భారతీయ సంస్కృతిని చిన్నాభిన్నం చేస్తున వీళ్ళంతా తెలివైనవారా? మధనపడుతూనే కాలం నెట్టుకొస్తున్నాడు. మెర్సీ పరిచయం అయాక ఆమె చూపించింది ప్రేమ అనే అనుకున్నాడు. ఆమె కళ్ళల్లోని అమాయకత్వం, ఆమాటల్లోని లాలిత్యం నిజమే అనుకున్నాడు. అందరిలో తానొక్కతీ ప్రత్యేకం అనుకున్నాడు. మెర్సీ లాంటి వాళ్ళు కూడా అక్కడక్కడ ఉన్నందుకు సంతోషించాడు. ఇప్పుడు మెర్సీ ప్రవర్తన కూడా విచ్చలవిడి వ్యవహారంగానే అనిపించి ప్రేమ అనే పదానికి యువతలో పూర్తిగా అర్ధమే మారిపోయిందని అర్థం చేసుకున్నాడు.

రాహుల్ ఆ వీకెండ్ ఇంటికి బయల్దేరాడు. భారతీ, శ్రీనివాస్ సంతోషంగా ఉన్నారు కొడుకు రాకతో. అమ్మతో కబుర్లు చెబుతూ వంటింట్లో చిన్న చిన్న సాయాలు చేసాడు రాహుల్. కొడుక్కి ఏం కావాలో అడిగి అడిగి వండి ప్రేమగా వడ్డించి తినిపించింది భారతి. పక్కనే కూచుని జోక్స్ చెబుతూ ఉత్సాహపరుస్తూ నాన్న. అల్లరి చేస్తూ ఉడికిస్తూ సందడి చేస్తూ చెల్లి. ఎంత అందమైన కుటుంబం మనదీ అనుకుంటాడు ఇంటికొచ్చినప్పుడల్లా రాహుల్..

రాత్రి భోజనాలయాక అందరూ పెరట్లో చాప వేసుకుని వెన్నెల నీడలో జలకాలాడుతుండగా భారతి అంది

"నాన్నా ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరగాలి. ఇంకా లేటు చేయడం మంచిది కాదు. నువ్వు ఔనన్నా కాదన్నా మేం అమ్మాయిని చూడాలని అనుకుంటున్నాం" కొడుకు ఏమంటాడా అని అతని కళ్ళల్లోకి చూసింది.

"సరేనమ్మా ,చూడండి" రాహుల్ సమాధానంతో సంతోషం ఉప్పొంగింది ఇద్దరిలోనూ.

"ఇంకేం, గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు మనవాడు. ఇక తియ్యి నీ చిట్టా" ఉత్సాహంగా అన్నాడు శ్రీనివాస్.

వెంటనే గబగబా అడుగులేసుకుంటూ ఇంట్లోకెళ్ళి చిన్న చేతి పుస్తకం పట్టుకొచ్చి కూచుంది భారతి సంబరంగా. ఆశ్చరంగా చూసాడు రాహుల్.

"అమ్మకి ఆర్నెల్ల నుండీ ఇదే పనిరా అన్నయ్యా..చూడు దాన్నిండా అమ్మాయిలే ఉన్నారు. ఇప్పుడు నువ్వు చూసి ఎంచుకోడమే" అంది చెల్లి రమ్య  అమ్మ పక్కకి చేరి పుస్తకంలోకి ఆసక్తిగా చూస్తూ.

పుస్తకం రాహుల్ చేతిలో ఉంది ఇప్పుడు.  ఒక్కొక్క పేజీ తిప్పి చూస్తున్నాడు. రాహుల్ ఫోటోలు చూస్తుంటే భారతీ రమ్యా  అతని ముఖంలోకి చూస్తున్నారు ఆత్రుతగా. ఫోటోలూ వివరాలూ అన్నీ చూసాడు. చివరి పేజీ అయ్యాక పుస్తకం అమ్మ చేతిలో పెట్టాడు.

"ఏరా ఒక్కరు కూడా నచ్చలేదా?" అంది కాస్త నిస్సత్తువగా. ఆర్నెల్ల తన కష్టం  కొడుకుకి కొంచం కూడా పనికిరాదేమో అన్న నిరాశ కనపడిందామె ముఖంలో.

"అందరూ బాగున్నారమ్మా" అందరూ ఆశ్చర్యపోయారు ఆ మాటతో.

"మరింకేం నాన్నా ఎవరో ఒకర్ని సెలెక్ట్ చేసుకో మాట్లాడదాం" అన్నాడు నాన్న

నాన్నవేపు నవ్వుతూ చూసి అమ్మ ఒడిలో తలను వాల్చాడు  రాహుల్. వెల్లికిలా పడుకుని రెండు చేతులూ గుండెలమీద పెట్టుకుని తలపైకెత్తి అమ్మ ముఖాన్నీ నింగిలోని చందమామనీ మార్చి మార్చి చూస్తున్నాడు. భారతి చేతి వేళ్ళు అతని తలను నిమురుతున్నాయి ప్రేమగా. ఇంత అందమైన దృశ్యాన్ని ఎప్పుడూ కనపడేలా దాచుకోవాల్సిందే అనుకుని వెంటనే కెమెరా క్లిక్కుమనిపించింది రమ్య. కొడుకు ఏదో దీర్ఘాలోచనలో ఉన్నాడనిపించి అతను చెప్పేదాకా ఆగడం అవసరమని ఎదురు చూస్తోంది భారతి. పక్కనే కూచున్న మిగతా ఇద్దరిదీ కూడా అదే పరిస్థితి.అయిదు నిముషాలయాక నోరు విప్పాడు రాహుల్.

"అమ్మా, నీలాంటి అమ్మాయిలు ఇప్పుడు లేరా అమ్మా?" అమ్మ చేతివేళ్లు ఆగాయి కాసేపు.

"ఎందుకుండరు,   అయినా నాలాంటి పాత చింతకాయ పచ్చడి నీకెందుకురా, నేను చూసిన అమ్మాయిలంతా చదువుకుని పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్నారు. అలాంటివాళ్ళే నీకు సరియైన జోడీ నాన్నా" అంది సముదాయిస్తున్నట్టుగా.

"అమ్మా, మీరంతా ఇలా ఉండబట్టే మేమంతా చదువుతో పాటు సంస్కారం నేర్చుకున్నాం. పెద్ద చదువులూ గొప్ప ఉద్యోగాలూ చేస్తున్నంత మాత్రాన గొప్పవారు కాదు. మన పద్ధతులు మర్చిపోయి వెస్టర్న్ కల్చర్ గొప్ప అనుకునే వారు నాకే కాదు, ఈతరం అబ్బాయిలెవరికీ నచ్చరు" అన్నాడు రాహుల్.

అమ్మానాన్నలిద్దరూ ఆశ్చర్యంతో అవాక్కయారు.. ఈకాలం కుర్రాళ్ళు మాడర్న్ గా ఉండే అమ్మాయిల్ని ఇష్టపడతారని అనుకున్న వారి అంచనా తప్పయింది

"అమ్మా, అమ్మాయి అంటే, నీలా నిండుగా బట్టలేసుకోవాలి. మెత్తగా మాట్లాడాలి. ఎదుటివారి మాటకు విలువిచ్చే సంస్కారం ఉండాలి. చూడగానే మర్యాద ఇవ్వాలనిపించేలా ఉండాలి. చుట్టూ ఉన్న పురుషులు ఆమెకి గౌరవం ఇవ్వగలిగేలా ఆమె నడత ఉండాలి. స్త్రీ జాతికి గౌరవం తెచ్చేలా ప్రతి పురుషుడూ చేతులెత్తి నమస్కరించేలా ఆమె జీవితం ఉండాలి" చెప్పుకుంటూ వెళ్తున్నాడు రాహుల్. నోరెళ్ళబెట్టి వింటున్నారు ముగ్గురూ.

"భార్య ప్రేమ చూపేదయితే భర్త సంతోషంగా ఉంటాడు. అలాంటి భార్యని ప్రాణానికి ప్రాణంగా ప్రేమిస్తాడు అతను కూడా. ఒక స్త్రీ వలన సంతోషకరమైన ఇల్లు తయారవుతుంది. అలాంటి ఇళ్ళన్నీ కలిస్తేనే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుంది. స్త్రీ చేతిలోనే సమాజం ఉంది. మాడర్నిటీ పేరుతో తమ వ్యక్తిత్వానికి తామే మసి పూసుకుంటున్నామనీ, సమాన హక్కుల పేరుతో తమ ఉనికికి తామే భద్రత లేకుండా చేసుకుంటున్నామనీ తెలీని అమ్మాయిలు ఒక విషయం అర్థం చేసుకోవాలి. పాతచింతకాయ పచ్చళ్ళని చిన్నచూపు చూడకుండా పాత తరం వారినే ఆదర్శంగా తీసుకుని తమ జీవితాలను ..కాదు..కాదు వారిమీద ఆధారపడ్డ అందరి జీవితాలకూ వెలుగు నివ్వడానికి సిద్ధమవ్వాలి".

కొడుకు మాటలకి మురిసిపోయారు భారతీ శ్రీనివాస్ లు. దీర్ఘాలోచనలో పడిపోయి ఉండిపోయింది రమ్య. లేచి వెళ్లి అంతా నిద్రపోయారు ఆరాత్రి ప్రశాంతంగా నిద్రపోయాడు రాహుల్.

పొద్దున్న లేస్తూనే ఇంట్లో దృశ్యం చూసి సంతోషంతో పరవశించిపోయాడు రాహుల్. పరికిణీ వోణీ వేసుకుని అమ్మ వెనకాలే తిరుగుతూ అమ్మకి సాయం చేస్తూ రమ్య అన్నని చూసి హాయిగా నవ్వింది.

"డ్రెస్సింగ్ మారితే చాలదు..ఆలోచన, ఆచరణ కూడా మారాలి" అన్నాడు చిన్నగా తలమీద తడుతూ.

"నీ చెల్లినే అన్నయ్యా" అంది రమ్య

మార్పు తన ఇంటినుండే మొదలయినందుకు గుండెనిండా హాయి నిండింది రాహుల్ కి.

# జన్మ

భాగ్యలక్ష్మి అప్పికొండ

"జన్మ, జన్మాంతర పాపాలన్నీ గుర్తుకు వచ్చి నను చిత్రవధ చేస్తున్నాయ్. ప్రాణానికి ఆప్యాయంగా ఓ పలకరింపు లేదు. కనీసం ప్రేమతో కూడిన స్పర్శ లేదు. నాకు నేనే, నాతో నేనే ఇలా ఎన్ని రోజులని కొట్టుకుంటూ, తన్నుకుంటూ, మాట్లాడుకుంటూ ఉండాలి. నేను దిక్కులు పెక్కటిల్లెలా అరిచినా ఎవరూ వినిపించుకోరు. నా రొధ ఎవరూ పట్టించుకోరు. ఛీ! నామీద నాకే అసహ్యం వేస్తుంది. ఈ కాళరాత్రి సావాసం ఇంకెన్నిన్నాళ్ళు. ఈ ఒక్కసారికి నా యందు దయుంచి ఈ చీకటి గది నుంచి బయటికి పంపించు. ఇంకెప్పుడూ ఏ పాపం చేయను" అని యశోద కడుపులోని బిడ్డ దేవుడికి మొర పెట్టుకుంది.

ఎవరో తలుపు తట్టిన శబ్దం. యశోద తలుపు తీసి "మీరా బాబు! రండి,రండి" అని చిరునవ్వుతో ఆహ్వానించింది.

ఆ ఇంట్లోకి వెళ్ళే అగత్యం తనకు లేదనే అహంకారమే తప్ప వచ్చిన ఆ మనిషికి చిరునవ్వుకి బదులు నవ్వే సంస్కారంలేదు. అందుకే, ఇంటి బయటే నిల్చొని " ఏమ్మా! ఆరోగ్యం బాగుందా?!. నిన్ను, నీ అవస్థను చూసి... జాలిపడి ఈ పని అప్పజెప్పాను. ఎండలు మండిపోతున్నాయి. మీ ఇంట్లో ఏ.సి పెట్టిస్తాను. కానుపు అయిన తరువాత తీసెస్తాను. ఆ సారు వాళ్ళు వచ్చి అడిగితే మూడు నెలల క్రితమే పెట్టామని చెప్పు. మళ్ళీ చెప్తున్నాను, ఈ విషయాలేవి బయటికి చెప్పకూడదు" అని మధ్యవర్తి మోహన్ రావు పెద్ద సంచి నిండా పళ్ళు యశోద చేతిలో పెట్టాడు.

"అలాగే బాబూ. ఎవరికీ సెప్పనేదు, సెప్పను" అంది యశోద. ఎవరు చూడట్లేదని నిర్ధారించుకొన్న తరువాత బ్యాగులో నుంచి డబ్బులు తీసి యశోద చేతిలో పెట్టి మోహనరావు వెళ్ళిపోయాడు.

యశోద తలుపేసి ఇంటి లోపలికెళ్తూ "ఇప్పుడు ఏడో నెల ఇంకో రెండు నెలలు భరిస్తే మా అప్పులు తీరిపోయి ఈ ఇల్లు మిగిల్చుకోవచ్చు" అని తనలో తానే ఆలోచించుకుంటూ పనిచేసుకుంటుంది.

"మా అమ్మా, నాన్నలకి నా మీద ఎంత ప్రేమో!! కుదరక కాని ఈమె కడుపులో కూడా ఏ.సి పెట్టేవాళ్ళేమొ " అని నలుసు నవ్వుతుంది.

"ఈ ముద్ధ తిను తల్లి" అని తన ఎనిమిదేళ్ళ కూతురికి కొసరి కొసరి తినిపిస్తుంది యశోధ.

"నాతో కూడా ప్రేమగా ఉండవా? కాస్త పొట్టని నిమిరి నాతో మాట్లాడవా"అని అర్థిస్తుంది ఆ చిన్ని ప్రాణం

పాపం! యశోద ప్రేమ ఎలా చూపిస్తుంది? పిండాన్ని కడుపులో పెడుతున్నప్పుడే " పుట్టే బిడ్డకు, నీకు ఎటువంటి సంబంధం ఉండదు, ఉండకూడదు" అని గట్టిగా చెప్పారు అసలు తల్లిదండ్రులు.

★★★★★★★

విశాఖ సముద్ర తీరంలో  ఉన్న పోష్ ఏరియాలో ఖరీదైన బంగ్లా ముందు ఆఢి. , బి.యమ్.డబల్యు కార్లు ఆగాయి. వాటిలోంచి విహార్ , ఆశ దిగారు. ఆ భార్యాభర్తలకిద్దరికి పేరు మోసిన కంపెనీల్లో పెద్ద ఉద్యోగాలు. వారికి  ఇద్ధరు ఆడపిల్లలు. ఆ పిల్లల చదువులు ఇంటర్నేషనల్ స్కూల్లు చూసుకుంటున్నాయి.

నడమంత్రపు సిరి అవ్వచ్చు. కష్టపడి సంపాదించినదైనా కావచ్చు ఏదైనా డబ్బు మనిషికి మహ చిత్రమైన ఆలోచనలని, ఆశలని  పుట్టిస్తుంది. అలాగే వారికి కూడా ఇప్పుడు మగబిడ్డ కావాలి, వంశం నిలబెట్టాలి అనే పాతకాలపు ఆశ చిగురించింది. బిడ్డల్ని కనే వయసున్నా వారికి ఓపిక, తీరిక లేదు, ఒక మగ బిడ్డ కావాలనే గొంతెమ్మ కోరిక తప్ప.

ఒకరి  దగ్గర డబ్బులున్నాయి. వేరొకరికి ఆ డబ్బుతో అవసరం ఉంది. ధనం ఉన్న వాడి అలవికాని ఆశలకి ఆధునీకత రెక్కలని అమరుస్తుంది ఆయువు పోస్తుంది. ఒకరి డబ్బుని, వేరొకరి అవసరాన్ని తమకు అవకాశంగా మార్చుకునే మధ్యవర్తి మోహన్రావులకి ఈ లోకంలో కొదవే లేదు.  చట్టాలు గట్టివయ్యే కొలది వీరికి ముట్టచెప్పె సొమ్ము పెరుగుతుంది. అందుకే వాళ్ళు అందమైన బొమ్మని ఆన్లైన్ లో ఆర్డర్ చేసి తెచ్చుకున్నట్టుగా రక్తసంబంధాన్ని కూడా కస్టమైజ్డ్ స్పెసిఫికేషన్స్ తో ఆర్డర్ పెట్టారు.

మొబైల్ రింగ్ అవుతోంది "హలో" అంది ఆశ.

"మేడమ్ డెలివరి అయింది, బాబుని తీసుకుని వెళ్లండి" అన్నాడు అవతలి నుంచి మోహన్ రావు.

ఆశ అంతే త్వరగా  అత్యంత ఆనందంతో విహార్  కి ఫోన్ చేసి విషయం చెప్పింది.

ఆశ "లక్ష్మి , లక్ష్మి " అని సంబరంగా అరిచినట్టుగా పిలుస్తుంది

"ఏంటమ్మా!"  లోపలినుంచి  హడివుడిగా వచ్చింది లక్ష్మి .

"అయ్యగారు హాస్పిటల్ లో వుంటానన్నారు.  రా! మనం  హాస్పిటల్ కెళ్ళి బాబుని తీసుకొద్దాం. నువ్వే వాడిని చూసుకోవాలి" అని క్షణంలో బిడ్డ బాధ్యత  లక్ష్మి కి అప్పజెప్పేసింది ఆశ

"మీ బిడ్డ" అని డాక్టర్ ఆ పసికందుని జాగ్రత్తగా ఆశ చేతిలో పెట్టింది.

ఆశ సంతోషంతో మురిసిపోయి తన బిడ్డపై  ముద్దుల వర్షం కురిపించి ఐదు నిమిషాల తరువాత  పక్కనే వున్న లక్ష్మి కి బిడ్డని అందించింది

"ఒక ఆయమ్మ కడుపులో పుట్టి, మరో ఆయమ్మ చేతిలో పెరుగుతానా?" అని అనిపించిందో ఏమో! ఆ బిడ్డ  ఒక్కసారిగా గట్టిగా ఏడవడం మొదలుపెట్టింది.

లక్ష్మి  కి ఏం చెయ్యాలో పాలుపోక యశోద పక్కనే పడుకోబెట్టి  "పాలు ఇవ్వమ్మా!" అంది అనునయంగా.

అప్పటి వరకు ఏదో బరువు మోసాననుకున్న యశోద, తొమ్మిది నెలలు తాను మోసిన ఆ భారం రూపు దాల్చి

తన చనుబాలు తాగుతుంటే ఏదో తెలియని ఉద్వేగానికి గురైంది. అందుకే తన ప్రమేయం లేకుండానే కన్నీరు కారుస్తుంది. అమ్మకానికి అయినా సరే అమ్మతనం లో కమ్మదనాన్ని కాదనలేక ఆ కళ్ళు వర్షిస్తున్నాయి.

ఇదంతా గమనించి గమనించనట్టుగా ఉన్న ఆశ "బేబి కి ఏ పాలు పట్టమంటారు ఫార్ములా రాసివ్వండి" ఆర్తిగా అడిగింది డాక్టర్ ని.

"తల్లి పాలే మంచిది. ఫార్ములా రాసివ్వమంటే రాసిస్తాను" సంశయంగా చెప్పింది డాక్టర్.

"తల్లిపాలు మంచివే కాని ఈమె దగ్గరే బిడ్డని వదిలేస్తే వీళ్ళమధ్య బంధం పెరుగుతుందేమో కదా!" అని తన సందేహాన్ని బయటపెట్టింది ఆశ.

"ఏ కాలంలో ఉన్నారండి!?. కావాలంటే ఇప్పుడు తల్లి పాలు కూడా లభిస్తున్నాయి. ఖరీదెక్కువ అంతే" అంది డాక్టర్.

అవును! కాలం మారి పరుగులు తీస్తుంది. భూమాత ఇచ్చే నీటిని కొంటుంది. తల్లిపాలను కూడా వెలకట్టి కొనగలుగుతుంది.

"అవునా, డాక్టర్! అలా అయితే తల్లిపాలే కావాలి. కొంచెం డిటైల్స్ చెప్తారా?" అని ఉత్సాహంగా అడిగింది ఆశ.

ఆ ప్రశ్న ముందే ఊహించిన డాక్టర్ " ఆ విషయాలన్నీ మా నర్స్ మీకు చెప్తుంది" అని వడివడిగా ముందుకు కదిలింది.

ఈ మాటలన్నీ వింటున్న మోహనరావు బుర్ర పాదరసంలా పనిచేయడం ఆరంభించింది. వెంటనే యశోద దగ్గరకెళ్ళి "ఆ తల్లి పాలు కూడా నువ్వే ఇస్తానని చెప్పి అమ్మగారిని బ్రతిమాలాడు. నీకు డబ్బులు ఎక్కువగా ముట్టేటట్టు నేను చూసుకుంటాను" అని ఆమెకే వినిపించేటట్టు వివరించాడు.

యశోద మోహన్ రావు చెప్పినట్టే అర్థించింది. ఏదో పెద్ద సాయం తానే చేస్తున్నట్టుగా "అలాగే" అని ఒప్పుకుంది ఆశ .

మోహన్ రావు నర్స్ ని అడిగి అక్కడే వున్న ఫార్మసిలో "మాన్యువల్ బ్రెస్ట్ పంప్" ని తీసుకుని వచ్చి యశోదకిచ్చాడు. "ఇది ఎలా వాడాలో నర్సమ్మ నీకొచ్చి చెప్తుంది. నువ్వు పాలు నింపి ఉంచు చాలు. నేనొక కుర్రాణ్ణి పంపిస్తాను, వాడికిచ్చి పంపించు" అని యశోద పొత్తిళ్ళలో వెచ్చగా నిదురపోతున్న బిడ్డని తీసి ఆశ చేతిలో పెట్టాడు. అప్పుడు యశోద ముభావంగా వుంది. ఎందుకంటే తనకి ముందే తెలుసు ఇది వాణిజ్య ఒప్పందంలో చివరి ఘట్టం అని.

అమ్మ పంట పండింది. మోహన్ రావు డబ్బులు ఇచ్చాడు. ఇక్కడ కూడా గిట్టుబాటు ధర రాలేదు. ఎక్కడైనా దళారులదే పైచేయి.

ఆశ, లక్ష్మి బిడ్డని పట్టుకుని కారెక్కి వెనుక సీట్ లో కూర్చున్నారు. విహార్ కారు ముందు సీట్లో కూర్చున్నాడు.

"లక్ష్మి ! మీ ఆయన రెండు రోజులని సెలవుపెట్టాడు మూడు రోజులవుతుంది. ఏంటి విషయం? ఇంకా రాలేదు." తల కాస్త వెనక్కి తిప్పి అడిగాడు విహార్

"సారు, మీకు తెలుసు కదా! మా ఆడబిడ్డ చచ్చిపోయింది. ఆలాయన పెద్ద తాగుబోతు. ఉన్న ఒక్క బిడ్డని సరిగ్గా సాకెట్లేదు అలాగని మాకాడ వదిలేయ్యమంటే మా సెడ్డ ఇదయ్ పోతున్నాడు. ఆడు ఈ యాల ఊళ్లో గొడవ కూడా పెట్టాడంట. మా ఆయన ఆడి సంగతి తేల్చి రేపు మా మేనకోడలిని తీసుకుని వచ్చేత్తాడు" అంది లక్ష్మి నెమ్మదిగా.

"ఇంతకీ మీ మేనకోడలి వయసెంత" అని అడిగింది తన బిడ్డకి ముద్దుపెడుతూ ఆశ

"మూడేళ్ళు ఉంటాయమ్మా!" అంది లక్ష్మి తన బుర్ర గోక్కుంటూ.

"మీకే గడవట్లేదంటున్నావు కదా! ఆ పిల్లని ఎలా పెంచుతావే?" కాస్త గద్ధించినట్టుగా అడిగింది ఆశ.

"ఎవరి పిల్లలైనా అయినా మనం సేరదీత్తే మన పిల్లలే కదమ్మా! పైగా మా ఆడబిడ్డ బిడ్డాయే. అందులోను ఆడపిల్ల. మీరే సెప్పండమ్మా! ఆ తాగుబోతు సచ్చినోడు ఏం సాకగలడు? .అందుకే తీసుకురమ్మన్నా. మా పిల్లలతో పాటు దానికి ఓ ముద్ద పెడితే అదే పెరిగిపోద్ది" అంది లక్ష్మి కాస్త దైన్యంగా, కాస్త ధైర్యం గా

లక్ష్మి మాటలు ఆశ, విహార్ ల గుండెని కదిలిస్తున్నాయి, బుద్దిని ఆలోచించమంటున్నాయి, ఆత్మని పరిశీలన చేసుకోమంటున్నాయి.

"నీ సుఖం, స్వార్ధం కోసం కొండ మీద కోతినైనా తీసుకొని వచ్చే నేను, నీ ఆశలకు, ఆలోచనలకు ఆలంబన ఇచ్చే ఆధునిక టెక్నాలజీ అండగా ఉండగా...ఇంకా ఎందుకు అర్థం, పర్థం లేని విషయాల గురించి వ్యర్థంగా ఆలోచించాలనుకుంటున్నారు?" అని వారి దగ్గర ఉన్న డబ్బు హెచ్చరించినట్టుగా అనిపించింది. వెంటనే ఆశ, విహార్ లు తేరుకున్నారు. లక్ష్మి మాటలకు సమాధానంగా
కనిపించని మూతి విరుపుతో అసహనంగా ఏక కంఠంతో "అవునా!" అన్నారు.

బాణాల నుంచి తప్పించుకోవచ్చు మరి సరాసరి గుండెలోతుల్లో గుచ్చుకుని అంతరాత్మకు గాయం చేసే మాటలనుంచి తప్పించుకోవడం ఎవరికి సాధ్యం?

సూర్యుడు కోటికాంతుల ఆశలను చూపించి అలసి అస్తమించాడు. ఆకాశంలో కటిక
చీకటి ముసురుతుండగా చల్లని వెన్నెల కిరణాలతో పున్నమి చంద్రుడుదయించాడు. బంగ్లా బాల్కనిలో ఖరీదైన వెండి మువ్వల ఉయ్యాలలో బాబునూపుతుంది ఆశ. చంద్రుడి తో బాబు మాట్లాడుతూ ఆడుకుంటున్నాడు. ఆశ మోహంలో తప్పు చేసానేమొ అన్న అపరాధ భావన స్పష్టంగా కనిపిస్తుంది.

"ఆశా! ఏంటలా వున్నావ్ ?" బాబు బుగ్గలను పుణుకుతూ అడిగాడు విహార్.

మనసులోని ఆర్ధ్రత ఆ మాట కోసమే ఆగిందా! లేక ఇన్నాళ్లు తనకే తెలియని అంతర్యుద్ధం మనసులో

జరుగుతుంటే దానికి ముసుగేసి మెటీరియలిస్టిక్ గా బ్రతికిందా? ఏమో మరి ! ఒక్కసారిగా వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టింది ఆశ.

ఆనంద క్షణాల్లో ఈ అనుకోని ఏడుపేంటో అర్థం కాని విహార్ " ఎందుకలా ఏడుస్తున్నావు?" అని అడిగాడు విస్మయంగా.

"ఎవరో బిడ్డ తన పిల్లల్లా పెంచుకుంటానని, తీసుకురమ్మని వాళ్ళయన్ని పంపించి తీసుకురమ్మంది లక్షి . మరి నేను, నా కడుపులో ఆనందంగా పెరగవలసిన బిడ్డని అందులోను అబ్బాయే కావాలని మరో అమ్మ కడుపులో పెట్టించాను" విహార్ వైపు చూస్తూ కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ అంది.

"ఆశా! ఎందుకు అంత ఎమోషనల్ అవుతున్నావు. మనం ఆశ పడిందే కదా! అయినా లక్షి వాళ్ళ స్టేటస్, లైఫ్ స్టైల్ వేరు వాళ్ళతో నిన్ను పోల్చుకుని అనవసరంగా బాధపడుతున్నావు" అని ఆశని దగ్గరగా తీసుకున్నాడు.

"అవును! ఆశపడ్డాం కాని ఆలోచించలేదు. మన లైఫ్ లో స్టైల్ ఉంది. లైఫేది?. పగలు, రాత్రి తేడా లేకుండా తెచ్చి పెట్టుకున్న నవ్వు మొహాలతో సామాజిక మాధ్యమాల స్టేటస్ ల చుట్టే తిరుగుతున్నాం. ఒక్కసారైనా మన మానసిక స్టేటస్ ఏంటి అని మనకి మనం ప్రశ్నించుకోలేదు. విహార్, లక్షి ఆడిన మాటలు నాకు చిన్నప్పుడు పొలంలో వర్షం పడినప్పుడు వచ్చే మట్టి వాసన గుర్తుకు తెచ్చాయి. అప్పుడు నేను మా తాతని అడిగేదాన్ని "ఎందుకు తాత అంత కష్టపడతావు అని మా తాత ఎప్పుడూ ఒకటే మాట చెప్పేవాడు. "మన కష్టాన్ని మనమే భరించాలి. మన ఇష్టాన్ని మనమే సాధించుకోవాలి" అని.

ఆ మాటకర్థం ***కష్టాన్ని భరించైనా సరే ఇష్టాన్ని సాధించుకోవాలని*** . వయసు పెరిగినా నాకు బుద్ధి రాలేదు. అందుకే నా కోరిక తప్పు, ఒప్పు అనే విచక్షణ కూడా లేకుండా ఏ బాధ పడకుండా బిడ్డని తెచ్చుకున్నాను" అని విహార్ భుజాన్ని ఆసరా చేసుకుని మనసు పడే వేదనని మాటల్లో చెప్పడానికి ప్రయత్నిస్తుంది ఆశ.

"ఆశా! ఎందుకంత మధన పడుతున్నావు. నువ్వే కాదు కదా! చాలా మంది చేయించుకుంటున్నారు. ఇందులో తప్పేం ఉంది మనం డబ్బులు ఇస్తున్నాం. వాళ్ళు చేస్తున్నారు. నువ్వు మరీ ఎక్కువ ఆలోచిస్తున్నావు" తల నిమురుతూ అన్నాడు విహార్.

"నిజం చెప్పు విహార్ మనకు తెలీదా సరొగసీ, బిడ్డలు లేక తల్లడిల్లే తల్లిదండ్రుల కోసమని అది కూడా లింగ నిర్ధారణ పరీక్ష లేకుండా అని. వాణిజ్య అద్దె గర్భాలు పూర్తిగా నిషిద్ధం. నిస్వార్థ అద్దె గర్భాలకి మాత్రమే అనుమతి ఉందని. అందరూ చేస్తున్నారని మనము చేస్తే తప్పు ఒప్పై పోతుందా. ఇది చట్టపరంగా అయితే నేరం, నైతికంగా ఆలోచిస్తే పాపం. విహార్ నీకు తెలుసా! ఉదయం డాక్టర్ బిడ్డని నా చేతిలో పెట్టినప్పుడు ఐదు నిమిషాలు పట్టుకొని వెంటనే లక్షి కి ఇచ్చాను పట్టుకోమని. అదే నేను తొమ్మిది నెలలు మోసిన బిడ్డ అయితే బంధంగా ఉండేది గాని నాకు బరువుగా

అనిపించేదా!? నువ్వే చెప్పు" అని ఆత్రంగా విహార్ ని అడుగుతూ ఏడుస్తుంది ఆశ.

విహార్ కి ఏం మాట్లాడాలో అర్థం కాక ఆశ వైపు అయోమయంగా చూస్తూ ఉండిపోయాడు.

"అంతా అయిపోయిన తరువాత ఇప్పుడెందుకు ఆలోచిస్తున్నావు అనకు విహార్ కనీసం నా మనసుతోనైనా నేను నిజాయితీగా చెప్పుకోవాలి, పశ్చాత్తపడాలి కదా! అందుకే నీకు చెప్తున్నా " అని విహార్ ని గట్టిగా హత్తుకుంది.

"అమ్మా! అయిందేదో అయిపోయింది ఇప్పటినుంచి నన్ను వదిలిపెట్టకు, బాగా చూసుకో" అని అంటున్నట్టుగా ఏడవడం ఆరంభించింది ఉయ్యాల లోని బిడ్డ. వెంటనే బాబుని తన ఒళ్ళోకి తీసుకుని యశోద పంపిన తల్లిపాలను వాడి బోసినోటికి అందించింది ఆశ. నెమ్మదిగా తల్లి, బిడ్డ నిద్రలో కి జారుకున్నారు.

టైం రాత్రి రెండు, ఫోన్ రింగ్ అవుతుంది. " ఆ..మోహన్రావు చెప్పు" అన్నాడు విహార్

"అది...అది" అని కొంచెం బాధ గా కొంచెం నీల్లు నములుతున్నట్టుగా ఉంది మోహన్రావు స్వరం.

"విషయం ఏంటో చెప్పు" విసుగ్గా అన్నాడు విహార్.

" అది... యశోద చనిపోయిందండి" గద్గద స్వరంతో

"అవునా!? నిజంగానా!? ఉదయం బాగానే ఉంది కదా!? ఏమైంది!?" ప్రశ్న మీద ప్రశ్న వేస్తున్నాడు విహార్. అతని మనసుకి తెలియక పోయినా ఒంటికి తెలిసినట్టుంది తప్పు చేశానని అది నీరు కారిపోతుంది.

"డాక్టర్ గారు B.P. , రక్త స్రావం ఎక్కువవడం వలన చనిపోయింది అంటున్నారు" అన్నాడు మోహన్రావు

"అయ్యో! అయితే ఇప్పుడు రమ్మంటావా?" నేనిప్పుడు అక్కడికి రావడం మంచిది కాదేమో? అనే ప్రశ్న ధ్వనించేట్టుగా అడిగాడు విహార్.

"సార్ మీరస్సలు రావద్దు.మీరిక్కడకి రావడం మంచిది కాదు. జరగాల్సినవన్నీ నేను చూసుకుంటాను. తల్లి పాలకి వచ్చే అబ్బాయికి చెప్పండి ఎట్టి పరిస్థితుల్లోనూ ఇటువైపు రావద్దని. నా నెంబర్ కి డబ్బులు పంపించండి" జాగ్రత్తలు చెప్తున్నట్టుగా చెప్పి మోహన్ రావు ఫోన్ కట్ చేసేసాడు.

విహార్ పక్కనే ఉన్న వాటర్ బాటిల్ లో నీళ్ళు తాగాడు. కాస్త గుండె వేగం నెమ్మదించి ఫోన్ లో డబ్బులు పంపిస్తుండగా బిడ్డ గుక్కపెట్టి ఏడవడం ఆరంభించింది. ఆశ లేచి బిడ్డకి పాలివ్వబోతుండగా డబ్బాలో పాలు అయిపోయాయి.

అవసరం పడుతుందేమో! అని తెచ్చిన ఫార్ములా పాలు కలిపి పాలడబ్బాలో పోసి పడుతుంటే ఆ బిడ్డ మరికాస్తా గట్టిగా ఏడుస్తుంది తప్ప ఆ పాలు తాగట్లేదు. తల్లి ముర్రి పాల తియ్యదనానికి అలవాటు పడ్డ పసిబిడ్డ పొడి పాలు తాగుతుందా?. తనను మోసిన తల్లి లేదని తెలిసిందేమో ఆ బిడ్డ ఎంతపైనా ఏడుపాపట్లేదు.

"విహార్! ఉదయాన్నే వెళ్ళి వాడిని పాలు తీసుకురమ్మను....వీడీ పాలు తాగట్లేదు, ఏడుపాపట్లేదు" అని నిద్ర

చెదిరిన విసుగుతో చెప్తుంది ఆశ.

"అసలే ఒక రకమైన ఎమోషన్ లో ఉంది . ఇప్పుడీ విషయం చెబితే మరింత ఎమోషన్ అయి అక్కడకి వెళదాం అనోచ్చు. లేకపోతే ఏదో పెద్ద సాయం చేద్దాం అని అనొచ్చు. ఈ సమయంలో మనం మంచి చేసినా అది మనకే చెడు అవుతుంది అని చెబితే అర్థం చేసుకునేంత మానసిక పరిణతిగాని, ప్రాక్టీకాలిటిగాని ఆశకి లేవు" అని విహార్ మనసులో అనుకుంటుండగా

. "విహార్! నీకే చెప్తున్నా! నిద్రపోతున్నావా, ఆలోచిస్తున్నావా!?" అని గట్టిగా అరిచినట్టుగా అడుగుతుంది బిడ్డ ఏడుపుతో నిద్రమత్తు వదిలిన ఆశ.

"ఆ...ఆ... అదే యశోద వాళ్ళు వేరే ఊరు వెళ్ళిపోతున్నారట.....బ్యాంకులో డబ్బులు వేయమని చెప్పారు...ఆ పనే చేస్తున్నా మొబైల్ లో " అని మాట మాట కూడబలుక్కుని చెబుతున్నాడు విహార్.

"అదేంటి? ఉదయం నేనే తల్లి పాలు పంపిస్తాను అని ఓ తెగ బ్రతిమలాడింది....ఇప్పుడేంటి ఉన్నట్టుండి వెళ్ళిపోవడం. డబ్బులు బాగానే అడుగుతారు....బిడ్డ పాలుకి ఇబ్బంది పడతాడని తెలియదా ఆవిడకి" అంది ఆశ ఉక్రోషంగా.

బిడ్డ డబ్బా పాలు తాగకుండా ఒకటే ఏడుస్తుంటే వాడిని ఆపలేక లక్ష్మి కి ఫోన్ చేసి రమ్మంది.

★★★★★★★★★

ఉదయం ఏడు అవుతుంది. మోహన్ రావు బైక్ మీద వెలుతున్నాడు. ఉన్నట్టుండి వర్షం మొదలైంది. వర్షం వల్లనేమో ఆ వీధిలో నీచు వాసన మరింత ఎక్కువైంది. మోహన్ రావు భృకుటి ముడి పడింది ఆ వాసన భరించలేక. దూరంగా ఒకడు "ఓర్రై పొద్దు కాడ పెద్ద ఎర ఏస్తే కాని ఈ సేప పడనేదురా! పడిన ఎంటనే సచ్చినాది" అని తన చేతిలో ఉన్న చేపని బీడి కాల్చుకుంటూ పక్కవాడికి చూపిస్తున్నాడు.

టెంట్ దగ్గర కొచ్చాడు మోహన్ రావు. ఒక సగం మనిషి తూలుతూ వచ్చాడు మిగిలిన సగం అతని ఒంటి మీద స్పృహ లేదు...."మా ఇంటిది ఇలా అయిపోనాది ఆ బిడ్డ" అని అతను అంటుండగానే మోహన్ రావు "సారు వాళ్ళు ఊర్లో లేరు ఇదిగో ఈ డబ్బులు ఉంచుకో. జరగవలసిన కార్యక్రమం నేను చూసుకుంటానులే " అని అతని జేబులో ఎవరు చూడకుండా డబ్బులు, సీసా పెట్టి అతనికి దూరంగా జరిగాడు. మోహన్ రావు మనసులో "ఈ శవానికి త్వరగా అంత్యక్రియలు జరిపించాలి. రాత్రి నుంచి వీడికి మందిచ్చి మరిపిస్తున్నాను. వీడికి తెలివొచ్చి ఏమైనా తప్పుగా మాట్లాడితే ఈ పని చేసినందుకు.. నేను, డాక్టర్, సార్ అందరం ఇబ్బంది పడాలి . మళ్ళీ ఆ పోలిసోళ్ళకి డబ్బులివ్వాలి." అని అనుకుంటూ బయటికి మట్టుకు విచారంగా మొహం పెట్టాడు.

యశోద బరువుని, భాధ్యతల్ని మోసి మోసి అలసి సొలసి అన్ని మరచి ఆత్మని విడిచి నిర్జీవంగా చాపపై పడి

ఉంది. ఆ ఇల్లు నిలబడి వెర్రిగా నువ్వుతుంది నా కోసమేనా నువ్వు పడిపోయింది అన్నట్టుగా. ఆధునీకత, సాంకేతికత వాటి అవసరానికి ఊపయోగపడక అర్థం, పర్థం లేని ఆశల పాలు పడి ఒక ఆయువు తీసింది. "అమ్మా! అమ్మా! అమ్మా! ఆకలేత్తుందే లేవ్వే అమ్మా!, ఏదుంటే అదే తింటానే, ఏదెడితే అదే తింటానే, లేచి పెట్టవే" అని యశోద గుండె ల మీద పడి పడి "అమ్మ లేవట్లేదంటూ" వెర్రిగా చూస్తూ ఆ చిన్న ప్రాణం ఏడుస్తుంటే చూట్టూ ఉన్న వారి గుండెలు ఏడుస్తున్నాయి "ఈ వయసులో నీకెదేం కష్టం అమ్మా!" అని. మోహన్ రావుకి అలానే అనిపించి "అయ్యో! పాపం" అనుకున్నాడు. మళ్ళీ తన కర్మను కడిగేసుకోవడం కోసం చేయవలసిన కర్తవ్యం గుర్తుకు వచ్చింది. ఆ పాపను పక్కకి తీసాడు "పట్టుకొండమ్మా!" అంటూ పక్కనే ఉన్న ఒక అమ్మ చేతి లో పెట్టాడు.

మత్తులో ఉన్న యశోద మొగుడు మతి లేక ములుగుతున్నట్టు ఏడుస్తున్నాడు. యశోదని పాడె మీదకి ఎక్కిస్తున్నప్పుడు ఆమె గుండెలపై తడి ఇంకా తగులుతుంది ఆ పాలకి ఇప్పుడు విలువలేదు. పేద ముత్తైదువ అలంకరణలో ఆ చివరి యాత్రా రథం ముందుకి కదులుతుంటే మోహన్ రావు లో లోపల ఉన్న భయం తగ్గుతూ వస్తూంది, "అమ్మ" తప్ప వేరే లోకం తెలియని ఆ పాలబుగ్గల చిట్టి తల్లి గుండెల్లో భయం పెరుగుతూ పోయి, ఆ బాధను మోయలేక కుప్పకూలిపోయింది . ఒక వేలం వెర్రి ఆశకు బలైన కథ ఉనికిని తన కడుపులో మోసుకుంటూ ఆ రథం ఊరేగుతూ కనుమరుగైపోయింది.. కాల గర్భంలో కలిసిపోతున్నది... యథావిధిగా.....ఎప్పట్లానే!!

## ఏమోయ్ నీకు పెళ్ళైందా!? — చంద్రమౌళి కళ్యాణచక్రవర్తి

" ఏమోయ్ నీకు పెళ్లి అయ్యిందా ?? " అడిగేశాను అవును అడిగేశాను , మనస్సు ఉగ్గ బట్టుకోలేక అడిగేశాను .

అదిగో అతనినే. అతను ఆరడుగులకు అటో ఇటో ఉంటాడు , అటు కాదులెండి ఇటే. ఆరుకు ఒకటో రెండో ఇంచులు తక్కువే ఉంటాడు . మీడియం సైజు శరీరం అంటే మరీ లావు కాదు అట్లా అని సన్నం అనీ చెప్పలేము . కొంచం చామనఛాయ. అంటే నలుపు అని మాత్రం అస్సలు అనలేము. తెలుపు అనీ పూర్తిగా ఒప్పుకోలేము. టిప్ టాప్గా తయారయ్యి ఉన్నాడు. నిండు నీలం రంగు ప్యాంటు , దానికి పోటీగా గంధం రంగు చొక్కా శాటిన్ మోడల్ అనుకుంట చక్కగా ఇస్త్రీ చేసి ఫుల్ హ్యాండ్స్ గుండీలు పెట్టుకొని మరీ ఉన్నాడు . అంటే డార్క్ ప్యాంటు లైట్ కలర్ షర్టు వేసుకోవాలీ అని మా కంపనీ డ్రెస్ కోడ్ కాబట్టి వేసుకొచ్చినట్టు అర్థం అయితోంది. నల్లటి బూట్లు అంబాసిడర్ బ్రాండ్ అనుకుంటా

చక్కగా పోలిష్ చేసి నిగ నిగ లాడుతున్నాయి. జుట్టు దువ్వుకున్నట్టు తెలుస్తోంది అయితే యవ్వనపు నిర్లక్ష్యపు ముంగురులు ఓ రెండు నుదుటి మీద విలాసంగా నిల్చున్నాయి.

నేను పనిచేసేది భారత దేశం లో ఉన్న అతి పెద్ద కంపెనీలలో ఒక కంపెనీ ( అది ఏ కంపెనీ అయితే మీకు ఎందుకు ?, కథలోకి రండి ). నేను అతను వేరే వేరే డిపార్టుమెంటు కాక పోతే అతని బాస్ కి నాకు దోస్తీ ఎక్కువ . ఒకరికొకరం భుజాల మీద తల పెట్టుకుని ఏడ్చేంత స్నేహం.రోజూ లాగానే ఈ రోజు లంచ్ బ్రేక్ లో ఒక కప్పు అల్లం టీ తాగి ఒక దమ్ము తీసి వద్దామని బయలుదేరితే ఇదిగో వాళ్ళ బాస్ ని కలవడం కోసం ఇలా కిందకు వచ్చాడు.

మేము సాధారణంగా మా పధ్నాలుగో అంతస్తు లోంచి లిఫ్ట్ ఎక్కి గ్రౌండ్ ఫ్లోర్ కి వచ్చి బిల్డింగ్ చుట్టూ ప్రదక్షిణగా తిరిగి బిల్డింగ్ వెనక వైపు కొత్తగా కడుతున్న ఇంకొక బిల్డింగ్ ముందు, అక్కడి వాచ్మేన్ వాళ్ళు పెట్టిన చిన్న టీ బంక్ లాంటి చోట , అల్లం చాయ్ కాయించుకుని తాగటం మా అలవాటు. ఆ ఏ సి రూమ్ లు హడావిడి నుంచీ ఒక పది పదిహేను నిముషాలు బయటి ప్రపంచం చూడక పోతే మాకు తోచదు, అంటే ఈ పది పదిహేను నిముషాలు ఫోన్ లు పని చేస్తూనే ఉంటాయి అది వేరే విషయం. అయిదు అంకెల జీతం ఇహనో ఇప్పుడో ఆరు అంకెలు చేరబోతున్న ఉద్యోగాలు మావి. నేను నా స్నేహితుడు ఇద్దరం గత పదిహేను సంవత్సరాలనుంచి ఇటుకా ఇటుకా పేర్చి ఈ కంపనీ నీ ఈ ఊరులో ఇంత స్థాయికి తీసుకొచ్చామని మనస్సులో ఉన్నా మా పై బాసు లు ఇంక్రిమెంట్ లు ప్రమోషన్ విషయాలలో కాస్త ఆలోచిస్తారు అన్న గుడ్డి నమ్మకంతో, మీటింగ్ ల లో మాత్రం ఇంకా పైకి తేవాలని. ఇంకా చాలా చెయ్యాలీ అంటూ హడావిడి పడిపోతూ ఉంటాము. సర్లేండి మా గొడవ ఎప్పుడూ ఉండేదే , అసలు ఏం అయింది అంటే " ఏమోయ్ నీకు పెళ్ళిఅయిందా?" అని అడిగేశాను అని చెప్పాను కదా . ఆ రోజు రోజూలాగానే నేను నా స్నేహితుడు బయటికి వచ్చాము ఒక కప్పు టీ తాగి తాగి ప్రపంచాన్ని ఒక్క సారి చూసేసి మళ్ళీ మా బాధ్యతల వైపు అడుగెయ్యాలి కదా అని . మావాడి కి ఫోను వచ్చింది

" ఆ ఇప్పుడే అయ్యింది ......"

"....................................................................................................................................... "

" సరే చూస్తాలే .."

"...................................................................................................."

" చె...ప్పా ....వు .....కదా చూస్తాలే ........"

"..........................................................................................,.......................... , ................................................."

" సరే బయటికి వచ్చాను .... చూస్తా లే ..."

"..................................( ఏవో మాటలు నడుస్తూ---------------- స్తూ------------. ఉన్నాయి ).

ఆ టీ బంకు అమ్మాయి టీ ఇచ్చింది , నేనొక గ్లాస్ తీసుకొని ఇంకోటి మావాడికి అందించాను, ఫోన్ ఒక చెవిలో పెట్టుకుని వింటూ గ్లాస్ అందుకున్నాడు .అటూ ఇటూ నడుస్తూ వింటున్నాడు నా వైపు ఒక చూపు కూడా చూశాడు . నేనేమో ఫ్రెష్ గా పెట్టిన అల్లం టీ ని అనుభవించే ఆనందం లో ఉన్నాను . అదిగో అప్పుడే వచ్చాడు అతను . ' హలో ' అంటూ పరిచయం చేసుకొన్నాడు. మావాడు ఫోన్ లో వున్నాడు , రొజూ కంటే ఇవాళ కొంచెం ఎక్కువ సేపే ఫోన్ సం'భాషణ' నడుస్తోంది . టీ తీసుకోమన్నాను అతనిని.

' ఇంకో టీ ఇయ్యమ్మా ' అంటూ టీ బంకు ఆమెకి చెప్పాను .

' అట్లనే సార్ ' అంటూ ఆమే ఇంకొక గ్లాస్ లో ఇవ్వబోయింది ,

' పేపర్ కప్ లేదామ్మా? ' అంటూ అడిగాడు ,

' లేదు సారూ గ్లాస్ బాగా కడిగినా సారూ " అంటూ వినయం గా చెప్పింది

" పేపర్ కప్పు లేక పోతే టీ వద్దు లేమ్మా ...." అన్నాడు,

" గ్లాస్ లు క్లీన్ గా నే కడుగుతారు .... వేడి నీళ్ళలో ఇంకొక్క సారి కడుగమ్మా ఈ సార్ కోసం ...." పెద్దరికం గా చెప్పాను .

" ఒద్దులెండి సర్ అక్కర్లేని రిస్క్ ..." అంటూ తిరస్కరించాడు. అయ్యో ఒక బేరం పోయిందే అని టీ బంకు ఆమె అనుకుంటుందేమో అని అనుకుని సంఘ సంస్కర్తనైన నేను

" టీ బాగుంది ఆ గ్లాస్ నాకియ్యమ్మా " అని మళ్ళీ ఇంకో టీ తీసుకొన్నా .

అవతల మా స్నేహితుడి సంభాషణ తేగేతట్లు కనిపించడం లేదు ఇప్పటికి దాదాపు మాటలు ఒక పావు కిలోమీటర్ నడకను పూర్తి చేసుకొని ఉంటాయి. టీ సిప్ చేస్తూ ఇతని వైపు చూసాను , ఒక విచిత్రమైన చూపు కనిపించింది . ఆ చూపు నిజంగా కనిపించిందో లేక నాకు అనిపించిందో అర్థం కాలేదు. ఏదైతేనేమి నేను నా రెండో టీ పూర్తి చేశాను మావాడు సంభాషణ పూర్తి చేశాడు. టీ గ్లాస్ టేబుల్ మీద పెట్టి సిగరెట్ అందుకొన్నాడు. ఆవేశం , ఆక్రోశం . అందోళనఅన్నీ సిగరెట్ వెలిగించడం లో స్పష్టంగా కనిపించాయి. లైటర్ నలిగి పోతోంది . టీ బంకు ఆమే అందోళన నాకు అర్థం అవుతోంది. ' ఏది గురూ లైటర్ " అంటూ మావాడి చేతిలోంచి లైటర్ అందుకుని టేబుల్ మీద పెట్టా. " ఇంకో టీ తాగుతావా " అనునయంగా అడిగా , " ఒద్దులే ...." అన్యమనస్కంగా అనేశాడు.

మళ్ళా ఫోన్ మ్రోగింది నెంబర్ కూడా చూడలేదు కట్ చేశాడు. నాకు తెలుసు ఆ ఫోన్ ఎక్కడినుంచో . నేను మెల్లిగా లేచి రెండు అడుగులు వేశాను టీ బంక్ ఆమెకి డబ్బులు ఇద్దాం అని. జేబులోంచి రెడీ గా పెట్టుకున్న వంద

రూపాయల నోటు తీసి ఇచ్చారు చిల్లర తీసుకొన్నాను. మా వాడు సిగరెట్ అంతు చూస్తున్నాడు. ఇంతలో మన కథా నాయకుడు మొదలు పెట్టాడు.

" రోజూ ఇక్కడికి వస్తారా సర్ ...?" మాట కలుపుదాం అన్న ఉత్సాహం కనిపించింది. బాస్ లను మంచి చేసుకోవటం సర్వ సాధారణం కదా. పై ఎత్తు మన కథా నాయకునికి మావాడు రిపోర్టింగ్ బాస్ .

" రోజూ ఏమి కాదు వీలైనప్పుడు ...." మా వాడు అబద్ధం ఆడేశాడు ..." అవును నువ్వు ఇవాళ క్లయింట్ విజిట్ కి వేళ్తానన్నావు గా ఇంకా ఇక్కడ ఏమి చేస్తున్నావు ..." వదిలించుకొని పంపించేయ్యాలన్న తపన కనిపించింది.

" అదే మీకు చెప్పి వెళ్దాం అని ......" ఏదో అడగాలి అన్న కోరిక కనిపించింది ....( మా వాడికీ అనిపించి ఉండొచ్చు. కాని బాస్ కదా బయట పద కూడదు .... ఇది అప్రకటిత వ్యూహం )

" తొందరగా వెళ్ళు ..... మళ్ళా వచ్చి రేపటికి రిపోర్ట్ పంపించక పోతే బిగ్ బాస్ తల తింటాడు ......" ( నాకు అర్ధం అవుతోంది మా వాడిని తల తింటున్న బిగ్ బాస్ ఎవరో ......)

" అదే సార్ అది చెబ్దాం అనే వచ్చాను . ఇక్కడినుంచి చందానగర్ వెళ్లి ... మళ్లీ ఇక్కడికి రావడం ఎందుకు .... అటునించి అటు ఇంటికి వెళతాను సార్ ...." అంటూ గారాలు పోయాడు ...( పిచ్చి వెధవ సమయం సందర్భం ఉండొద్దు గారాబం పోవటానికి ....)

" అట్లా యెట్లా మళ్ళా రిపోర్ట్ యెట్లా చేస్తావు? ఎప్పుడు పంపిస్తావు? .... ఈ ఆఫీసులో ఏ రోజు పని ఆ రోజే పంపియ్యాలి మళ్ళా రేపటికి రేపటి పని ఉంటుంది కదా ..." నచ్చ చెప్పే ఉద్దేశ్యం మా వాడిది

" అది కాదు సార్ అక్కడికి చేరే సరికి నాలుగు అవుతుంది , మీటింగ్ ప్రెజంటేషన్ అయిపోయే సరికి ఈజీ గా అయిదున్నర అవుతుంది మళ్ళా ఆఫీస్ కి రావాలంటే ఏడో ఏడున్నరో అవుతుంది కదా సార్ .........." ( లాజిక్ లు మాట్లాడుతున్నాడు లాజిక్కులు ...) ఎంతో వినయం గా నే అడుగుతున్నాడు

" చూడు బాబు మనది గవర్నమెంట్ ఆఫీస్ ఏమీ కాదు .....పని అయిన తరువాతే ఇంటికి వెళ్ళాలి రాత్రి పన్నెండు అయినా ఒంటి గంట అయినా ...." ( నాకు మావాడి కసి తెలుస్తూనే ఉంది )

" సార్ ఇది కంటిన్యువస్ గా నాలుగో రోజు సార్ , నాకు రోజూ ఇంటికి వెళ్ళే సరికి తొమ్మిది దాటుతోంది...." తన విసుగును ప్రదర్శించాడు

" నన్నేమి చేయమంటావు ?? క్లయింట్ నాలుగు కి రమ్మంటే నువ్వు రెండు గంటలకి వెళ్ళలేవు కదా ??..తప్పదు ఏమి చేస్తాం " నేను తదేకంగా గమనించాను మా వాడి మనస్సులో ఎటువంటి కుట్రా కనపడటం లేదు .

" ఇట్లా అయితే నేను జాబ్ మానేస్తాను సార్ .....ఎంజాయ్ చెయ్యలేని జాబ్ వేస్ట్ అనిపిస్తోంది సార్ " ....అసహనం వ్యక్తం చేశాడు .

మా వాడు నా వైపు చూశాడు , నేను మా వాడి వైపు చూశాను .........మా వాడు మళ్ళీ అతని తో అన్నాడు

" బాబు ఏ కంపెనీ లో నైనా ఇట్లానే ఉంటుంది , కష్ట పడటం అంటే ఏమిటనుకున్నావు ??" నిజం గా మా వాడు నచ్చ చెప్పే ప్రయత్నమే చేస్తున్నాడు ( అంటే ఈ కథానాయకుడు కనుక మానేస్తే మళ్ళా కొత్త రిక్రూట్మెంట్ అయ్యేదాకా మా వాడే ఆ పని చేసుకోవాలి అన్న టెన్షన్ తో మాత్రం కాదు ) .....ఇంతలో మావాడి ఫోన్ మళ్ళా మ్రోగింది .....

" ఆ చెప్పు .........."

"...............................................................................................................................................
.."

" చూస్తాను అని చెప్పాను కదా ???........."

"...............................................................................................................................................
........ "

" మళ్ళా మళ్ళా అదే చెప్తావే .... చూస్తాను అని చెప్పా కదా ......పెట్టెయి.. ఫోన్ ....పెట్టేయి ...." విసుగ్గా పెట్టేశాడు ... కథానాయకుడి వైపు తిరిగాడు .." బయల్దేరు ...మళ్ళా లేట్ అవుతుంది ........" లేచి ఆఫీస్ వైపు అడుగులేస్తున్నాము.

" మరీ అట్నించి అటు ఇంటికి వెళ్ళి పోతాను సార్ ......", నిశ్చయంగా చెప్పేశాడు

అందుకే నేను ఆపు కోలేక ఉండబట్టలేక అడిగేశాను " ఏమోయ్ నీకు పెళ్లి అయ్యిందా .....??" ....... మావాడు నా కళ్ళలోకి చూసాడు దాదాపు పదిహేనేళ్ళ స్నేహం కదూ . ఒక విలక్షణ మైన నవ్వు తోణికిస లాడింది మా వాడి కళ్ళలో. అల్లరిగా నవ్వుకున్నాం ఇద్దరం. అయితే మా వాడు బాస్ కదా

" సరే ఈ రోజు కి వెళ్ళు , మళ్ళా ఇట్లా నన్ను అడగొద్దు ......" అంటూ తేలిక పడ్డ మనస్సు తో. పిల్లాడు కూడా సంతోషించాడు " ఓకే సార్ ...." అని మాతో పాటు ఆఫీసు వైపు వచ్చాడు . మధ్యలో ఏమి ఆలోచన వచ్చిందో ఏమో నన్ను అడిగాడు ......." నా పెళ్లి గురించి ఎందుకు అడిగారు సార్ ....." సందేహాస్పదంగా .....

" ముందు ముందు నీకే తెలుస్తుంది లేవయ్యా .... వెళ్ళు " హడావిడి పెట్టాడు మా వాడు ......

..............ఏవండీ మీకు అర్థమైంది గా నేను ఎందుకు అడిగానో ..... మా కథానాయకుడు మీకు కనిపిస్తే కొంచెం వివరించండి ....పెళ్ళైన మొగవాళ్ళ మైన మనందరి బాధ్యత ఇది...... ఏమంటారు ????

# మీతో 34 ఏళ్ళు - మీపై 10 ఆరోపణలు   అనన్య

**నాన్నగారూ, మీకు కొద్దిరోజుల్లో షష్టిపూర్తి.**

గడచిన 60 ఏళ్ళను తరచి చూసుకొంటే మీరు ఎటువంటి అనుభూతిని పొందుతారో, ఎన్ని విజయాలకు వెన్ను చరుచుకుంటారో, ఏమేమి నిర్ణయాలకు ఈనాటికీ నాలుక కరచుకుంటారో, ఏమేమి జ్ఞాపకాలకు ఆనందంతో కంటతడి పెడతారో, ఏ తీపి గుర్తులకు చిరుమందహాసం చిందిస్తారో గానీ, నేను నా మదిలో ముచ్చట్లను మీకు చెప్తాను ఈ సందర్భంగా.

మీ గతంలో నా ముచ్చట్లేమిటి అంటారా? 60 లో మొదటి 26 తీసేయగా మిగతా 34 ఏళ్ళ ప్రయాణంలో నేనూ ఉన్నాను మరి. అది చాలదూ? 34 సంవత్సరాల పరిచయంలో మీ పట్ల నాకు చాలా అసంతృప్తులు ఉన్నాయి. 10 కంప్లెయింట్లు ఉన్నాయి. అవి ఈరోజు మీకు వెళ్ళబోసుకోవాలని నిర్ణయానికి వచ్చేశాను. వినక తప్పదు మీకు.

**1) మీరు నా చేత రోజూ ఊరు ప్రయాణం చేయించేవారు**

నా తొమ్మిదేళ్ళ వయసు లోపు మనమున్న ఊరిలో లైబ్రరీ లేదని పక్కనున్న పెద్ద ఊరికి సైకిల్ తొక్కుకుంటూ తీసుకువెళ్ళేవారు. మీరు పేపర్ చదువుతూ కూర్చొనేవారు. నాకు ఏ పుస్తకం కావాలంటే అది చదువుకోమనేవారు. మళ్లీ వెనక్కి సైకిల్ తొక్కుకుంటూ వచ్చే దారిలో నేనేం చదివానో ఆ కథ చెప్పమనేవారు. దీనితో నాకు reading habit అలవడటం మాత్రమే కాక, జ్ఞాపకశక్తి, ధారణా శక్తి కూడా పెరిగాలని మీ ఉద్దేశం అయ్యుంటుంది. కదా?

**2) చిన్నప్పుడే పెద్దపెద్ద పుస్తకాలతో నాకు చుక్కలు చూపించారు**

రాయల ప్రపంచ అట్లస్ ఉండేది మన ఇంట్లో. అందులో ఇండియా మ్యాప్, రాష్ట్ర మ్యాప్, ప్రపంచ మ్యాప్ చూపించి ఖండాలు, దేశాలు, రాష్ట్రాలు, జిల్లాలు, ఊళ్ళు, నదులు, ఉపనదులు, సముద్రాలు, పర్వతశ్రేణులు, రవాణా వ్యవస్థ, వాణిజ్య వ్యవస్థ, ఖగోళం, భూగోళం, శాటిలైట్లు, శౌర వ్యవస్థలు అన్నీ నా కళ్ళకి కట్టారు. ఈనాటికీ ఆ జ్ఞానం నా అతిపెద్ద 'ఆస్తి'.

### 3) ఎంతో దూరం నడిపించేవారు

నిత్యం రాత్రి భోజనం అయ్యాక కుటుంబ సమేతంగా వాకింగ్ చేసేవాళ్ళం తిన్నది అరిగేవరకు. తిథులు, నక్షత్రాల పేర్లు, రాశుల పేర్లు, తెలుగు సంవత్సరాల పేర్లు, శ్లోకాలు, పద్యాలు, పాటలు, అంతే కాక రామాయణ మహాభారత కథలు, పంచతంత్ర కథలు, ఇతర నీతి కథలు, అబ్బో... ఇక లెక్క లేదు మన కబుర్లకి. ఇలా కథలు, కబుర్ల ద్వారానే మా బాల్యం గడిచేసరికి ఎన్ని జీవితపాఠాలు నేర్పి ఉంటారో వేరే చెప్పక్కరలేదుగా?

### 4) ఎత్తులు, జిత్తులు నేర్పించేవారు

ఆరేడేళ్ళ వయసులో చదరంగంలో ఎత్తులు నేర్పారు. త్వరగా పనులు పూర్తి చేసుకొని క్యారమ్స్, లూడో, వైకుంతపాళీ అందరం కలసి ఆడుకొనేవాళ్ళం. మా మొదటి స్నేహితులు మీరు, అమ్మ. గెలిచి ఉడికించేవారు, ఓడినట్లు నటించి గెలవనిచ్చేవారు. పడుతూ లేస్తూ సైకిల్ నేర్చుకున్నాను మీ నుంచే. సాధారణంగా ఆడపిల్లలకు ఎవరూ నేర్పనిది... చేతక్ నడపటం నేర్పారు. కార్ నడపటం కూడా మీరు నేర్పినదే. జయంట్ వీల్ లాంటివి ధైర్యంగా ఎక్కటం నేర్పారు. ఈనాటికీ ఎన్నో విషయాల్లో నా వెన్ను తట్టి ముందుకు నడుపుతున్నారు.

### 5) పోటీలకి నాకు సాయం చేయమంటే "నో" అన్నారు

Inter-school, intra-school competitions జరుగుతూ ఉండేవి చిన్నప్పుడు. పాటల పోటీలకు అమ్మ నేర్పిన పాటలతో ఎలాగోలా ఏదో ఒక బహుమతి తీసుకొనే ఇంటికి వచ్చేదాన్ని. Essay writing, elocution competitions ప్రకటించినప్పుడు మిమ్మల్ని అడిగేదాన్ని నాకు matter చెప్పమని, చదువుకొని రాస్తానని/మాట్లాడతానని. కానీ ఎప్పుడూ చెప్పేవారు కాదు. ఆ అంశం మీద నాతో చర్చించేవారు. దాని ప్రాముఖ్యత ఏమిటి, మంచిచెడ్డలు ఏమిటి, సమస్య-పరిష్కారాలు ఏమిటి, పర్యవసానాలు ఏమిటి ఇలా కూలంకషంగా నాకు బోధపడేలా మాట్లాడేవారు. "ఒక వ్యాసం రాస్తే, చదివే వారికి ఒక మనిషి తమ పక్కన కూర్చొని కబుర్లు చెప్తునట్లు ఉండాలి, ఒక ప్రసంగం ఇస్తే వినేవారికి ఒక మహాగ్రంథం

చదువుతున్నట్లు ఉండాలి" అని నాకు నాటుకొనేలా చెప్పారు మీరు. ఎలా రాస్తే ఆపకుండా చదువుతారో, ఎలా మాట్లాడితే ఇంకా వినాలని జనం కోరుకుంటారో వివరించారు. దానితో ఏ ఒక్క పోటీలోనో గెలిచే matter నాకు ఇవ్వలేదు మీరు, జీవితంలో ఎప్పుడు ఏమి రాసినా, ఎప్పుడు ఏం మాట్లాడినా సరిపోయే అంత matter ఇచ్చారు.

### 6) నన్ను ఎప్పుడూ కూర్చోపెట్టి చదివించలేదు

మీ ఉద్యోగం ఒక మంచి పెద్ద పల్లెటూళ్ళో ఉండేది. హాయిగా గడిపేయచ్చు అక్కడ. రిటైర్మెంట్ వరకు అక్కడే ఉండిపోయినా అడిగేవాళ్ళు లేరు. అద్దె కూడా తీసుకోకుండా ఉండటానికి ఇల్లు ఇచ్చిన ఒక ఉత్తమురాలు, పూల మొక్కలు, చెట్లు, చేమలు, కావలసినంత ఆక్సిజన్ ఉన్న విశాల ప్రాంగణం. మాస్టారిగా ఊరంతా గౌరవం. మాకు ఇంగ్లీష్ మీడియం చదువు నేర్పగల ఒక స్కూల్, ఆసుపత్రి, లైబ్రరీ, సినిమా హాల్ లాంటి హంగులు అన్నీ ఉన్న ఊరే.

కానీ ఈలోపు అమ్మకి పక్కనే ఉన్న పట్నంలో పెద్ద స్కూల్లో తెలుగు టీచర్ గా ఉద్యోగం వచ్చింది. చాలా మంచి స్కూల్. మీరిద్దరూ "అక్కడ పిల్లల్ని చేర్చితే ఎలా ఉంటుంది?" అనుకున్నారు. "ఫీజ్ భరించగలమా?" అని కలవరపడ్డారు. "ఇంతవరకు లేనివి, పట్నంలో కొత్తకొత్త ఖర్చులు మోయగలమా?" అని కంగారుపడ్డారు. చివరికి మా ఇద్దరి భవిష్యత్తు కంటే మీ శ్రమ ముఖ్యం కాదనుకున్నారు.

పట్నానికి మారాము. మీరే రోజూ ఉద్యోగానికి ఆ ఊరు వెళ్లిరావటం మొదలుపెట్టారు. మిమ్మల్ని పెంచి పెద్ద చేసిందన్న గౌరవంతో ప్రవృత్తిగా పౌరోహిత్యాన్ని కొనసాగించేవారు వీలున్నప్పుడల్లా. పెరుగుతున్న ఖర్చుల రీత్యా ట్యూషన్ క్లాసులు చెప్పటం కూడా మొదలుపెట్టారు. తెలిసిన వాళ్ళు మొహమాటపెట్టి, బలవంతపెట్టటంతో వారానికోసారి గంటల కొద్దీ ప్రయాణం చేసి వేరే ఊరిలో ఏదో కాలేజీలో కూడా బోధించటానికి ఒప్పుకున్నారు.

ఒక్కోసారి ఇంటికి తిరిగి వచ్చి మా ముఖాలు చూసేలోపే మేము నిద్రపోయేవాళ్ళం. చదివించటం సంగతి దేవుడెరు, కబుర్లు కూడా చెప్పే సమయం మిగిలేది కాదు. ఏదో నాలుగు రూపాయలు సంపాదిస్తే మా ఫీజ్ కట్టచ్చు, మాకు ఏదో అమర్చచ్చు అనే ఉద్దేశంతో మీకే తెలియకుండా మీరొక కొవ్వొత్తిలా కరిగిపోయేవారు. అలా చాలా ఏళ్ళు గడిచిపోయాయి. ఆ శ్రమ ఫలితమే అద్దె ఇల్లు సొంత ఇల్లు అయ్యింది, పెంకుటిల్లు డాబా అయ్యింది. మాతో ఏ కొద్దిసేపు గడిపినా మా జీవితానికి పనికొచ్చే పాఠాలు నేర్పేవారు అడుగడుగునా.

7) మమ్మల్ని ఎప్పుడూ ఏ టూర్ లకీ తీసుకువెళ్ళలేదు

మా కోసం జీవిత భవసాగరాలు ఈదటంలో బిజీ అయిపోయిన మీకు అంత సమయం ఎక్కడ మిగిలింది? మమ్మల్ని మాత్రం మాన్పించలేదు. అమ్మమ్మ, తాతగారితో మావయ్యల ఇళ్ళకి పంపేవారు. చెన్నై, అమృతసర్, చండీఘర్, హిమాలయాలు... అన్నీ చూసి వచ్చిన మా కళ్ళలోని ఆనందాన్ని చూసి మీరూ అవన్నీ తిరిగి వచ్చినంత సంబరపడ్డారు.

8) ఏళ్ళ తరబడి మమ్మల్ని వదిలి వెళ్లిపోయారు

నేను డిగ్రీలోను, తమ్ముడు ఇంటర్ లోను చేరేసరికి మీకు యూఎస్ రమ్మని ఆఫర్ వచ్చింది. అభిరుచి కొద్దీ మీ దగ్గర సంస్కృతం నేర్చుకున్న ఒక ఎన్నారై డాక్టర్ గారు మీ బహుముఖ ప్రజ్ఞను గుర్తించి పరదేశంలో ఉన్న భారతీయులకు మీ సేవలు బాగా ఉపకరిస్తాయని అనిపించి అక్కడి ఒక వేంకటేశ్వరస్వామి గుడిలో ఉద్యోగంలో చేరమని ప్రోత్సహించారు. మాకు, ఉన్న ఊరికి, మీ వాళ్ళందరికీ దూరంగా వెళ్ళలేక కాదనుకున్నారు. కానీ డాక్టరు గారు, ఆయన సన్నిహితుల అకుంఠిత ప్రోత్సాహం చూసి "పోనీ, మనకి ఏమి రాసిపెట్టి ఉందో! ఈ ఒక్క అడుగు వేయటంతో మన పిల్లలు తమ జీవితాల్లో ఎన్ని అడుగులు ముందుకి వెళ్ళగలరో! సరస్వతి సేవలో ఉన్న నన్ను స్వామివారు చూసి తన సేవ చేసుకోమని ఆహ్వానిస్తున్నారేమో!" అనుకున్నారు.

అన్నీ అనుకూల వాయువులు వీయటంతో ఒక్కొక్క ఏడు, ఒక్కొక్క ఏడు జరుగుతూ వెళ్ళాయి. విమానం మొదటిసారి ఎక్కి మీరు ఖండాంతరం వెళ్లింది మొదలు... మళ్లీ మనం నలుగురం ఒక చూరు కింద ఒక కుటుంబంగా జీవించలేదు. టీనేజ్ లో ఉన్న ఇద్దరు పిల్లల చదువులతో, అవసరాలతో, అహంకారాలతో అమ్మ ఒంటరి పోరాటం ఇండియాలో చేస్తుంటే, మీరు మీ సహచరితో వారానికోసారి ఐదు నిముషాలు మాత్రమే మాట్లాడుతూ (ఆనాటికి ఇప్పుడు ఉన్నంత సాంకేతిక అభివృద్ధి లేదు. కాలింగ్ కార్డులు కొనుక్కొని ఖరీదైన అంతర్జాతీయ కాల్స్ మాత్రమే చేయగలిగేవారు) పరిచయస్తుల సహాయంతో, చేతనయ్యీ చేతకాని వంట చేసుకొని తింటూ యూఎస్ లో ఏకాకి జీవితం గడిపారు ఎన్నో ఏళ్ళు. మీ ఇద్దరి శ్రమ, త్యాగాల పుణ్యమా అని మేము పట్టభద్రులం, ప్రయోజకులం అయ్యాము.

9) ఒక అయ్య చేతిలో నన్ను పెట్టేసి చేతులు దులుపుకున్నారు

ఏ ఆడపిల్లకి అయినా పెళ్లి అయ్యేవరకు భర్త, అత్తమామలు, ఆడపడుచులు అపరిచితులే. మీరు ఎప్పుడూ నాకు అత్తారింటిని భయంకరంగానూ చిత్రీకరించలేదు, స్వర్గధామంగానూ ప్రదర్శించలేదు. ఒక్క సూత్రం మాత్రం చెప్పారు. "అత్తారింట్లో అయినా, వృత్తి జీవితంలో అయినా జడంగా ఉండకూడదు. మంచినీటిలా పారాలి. నీటిని గ్లాసులో పోస్తే గ్లాసు ఆకారం తీసుకుంటాయి, బిందెలో పోస్తే బిందె ఆకారం తీసుకుంటాయి, గిన్నెలో పోస్తే గిన్నె ఆకారం తీసుకుంటాయి. అలా ఉన్న వాతావరణానికి, అవసరానికి, అవకాశానికి తగ్గట్లు మనల్ని మనం మలచుకోగలిగితే మనం విజయాల కోసం వెంపర్లాడక్కరలేదు. మన జీవితంలో అడుగడుగునా విజయమే మన వెన్నంటి ఉంటుంది" అని జీవిత సారాంశాన్ని కాచి వడబోసి నాకు పోశారు.

ఎదిగినకొద్దీ ఒదగాలి అన్నారు. జీవితం ఏ తలుపు చూపిస్తే ఆ తలుపుకి తాళం చెవిని నా దగ్గర సిద్ధంగా ఉంచారు. తెరుచుకున్న తలుపును దాటి వెళ్ళాక ఎదురయ్యే ప్రతి ఆనందాన్ని ఎలా ఆస్వాదించాలో, ప్రతి ఆటంకాన్ని ఎలా ఎదుర్కోవాలో నాకు తర్ఫీదునిచ్చారు. మీ వేలుని పట్టుకొని 21 ఏళ్ళు నడిచాక, మీకు ఏమాత్రం తీసిపోకుండా నా వేలును పట్టుకొని నడిపించగల ఒక అద్భుతమైన సహచరుడికి నా చేతిని అందించారు.

### 10) నాకు కష్టం వస్తే మీరు ఓదార్చరు.

"ఫలానా కష్టం వచ్చింది" అని మీతో చెప్పుకోవలసిన అవసరం మీరు నాకు మిగల్చలేదు. మీకు చెప్పుకొని బాధపడవలసినంత కష్టంగా నేను దేనినీ భావించను. దేనినైనా జీవితంలో ఒక భాగంగా స్వీకరించటం మీరు నాకు నేర్పారు. ఉసూరుమనటం కంటే ఉత్సాహంతో ముందుకి సాగటంలో ఎంత ఆనందం ఉంటుందో మీరు ఆచరించి మాకు చూపించారు.

**నాన్నగారూ,** ఎంతమంది నాన్నలు తమ కూతుళ్ళని ఇంత బాగా చూసుకుంటారో, ఇంతకంటే బాగా చూసుకుంటారో నాకు తెలియదు. నాకు మాత్రం మీరు నా మొట్టమొదటి స్నేహితుడు, మొట్టమొదటి గురువు, ఆటల్లో మొట్టమొదటి ఉజ్జీ. మీరు నా Super Dad. నా జీవిత లక్ష్యం ఒక్కటే. నా షష్టిపూర్తి నాటికి ఇంతే గర్వంగా మా అమ్మాయి నన్ను Super Mom అని అనుకొనేలా జీవించాలి. చివరిగా... 34 సంవత్సరాల్లో ఎప్పుడూ నోటితో పైకి అనని ఒక మాట... ఐ లవ్ యూ , డ్యాడ్.

# ముఖ చిత్ర పత్రం

టి.వి.ఎస్. రామానుజ రావు

"పొట్ట పెరిగిపోయింది మార్నింగు వాక్ చెయ్యమని చెవినిల్లు కట్టుకుని పోరుతున్నా వినరయ్యే! అలా పొట్ట పెరగడం మంచిది కాదు" అంటూ పొద్దున్నే(అంటే మరీ పొద్దున్నే కాదు సుమా, సుమారు 8 గంటల సమయం) లేవగొట్టి, బ్రష్ మీద పేస్టు వేసిచ్చి, "బ్రష్ చేసుకుంటూ అలా నాలుగడుగులు నడిచిరండి" అంటూ పురమాయించింది భార్యామణి.

"అసలు ఇల్లు చెవిలో కట్టుకోవడం ఏమిటి? మా అమ్మా నాన్న ఇచ్చిపోయిన ఇల్లుండగా నీకు నా చెవుల్లోనూ, ముక్కులోనూ ఇల్లు కట్టుకోవాల్సిన ఖర్మేం పట్టింది? ఎలా వుందామనుకుంటున్నావు అక్కడ? అయినా ఇలా నోట్లో బ్రష్ పెట్టుకుని వెడితే ఎవరన్నా ఏమనుకుంటారు?" ఎదురు ప్రశ్న వేయగలిగానని ఆనంద పడ్డాడు ప్రభాకర్.

"అలాయితే మొహం కడుక్కుని వెంటనే బయల్దేరండి, మీరు మార్నిగ్ వాక్ కు వెళ్ళకపోతే, కాఫీ కలపను" అంటూ బ్రహ్మాస్త్రం ప్రయోగించేసరికి ఇక తప్పలేదు. పొద్దున్నే కాఫీ తాగకపోతే నీరసం వస్తుంది కనుక, కాఫీ తాగి వాకింగు చేస్తానని నమ్మకంగా చెప్పాక ఆవిడ కాఫీ ఇచ్చింది. ఒక పది నిముషాలు కాఫితాగడంలో ఆనందం అనుభవించి, బయటకు వెళ్ళడానికి చేసుకోవాల్సిన మేకప్ చేసుకుని, ఇంటి దగ్గరలో వున్న పార్కులో వాకింగుకు బయల్దేరాడు. కరోనా సంవత్సరం కనుక దొంగ లాగా భయం భయంగా అటూ ఇటూ చూసుకుంటూ, ఎవరూ తాకకుండా, నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తుండగా, ఒకాయన ఎదురయ్యాడు. ఒకరినొకరు హంతకుడిని చూసినట్లు కోపంగా చూసుకుంటూ తప్పుకుని, వాకింగు సాగించారు . రోజూ ఆయన కూడా వాకింగుకు రావడం చూసి ప్రభాకర్ ఆయనపై జాలిపడ్డాడు . పాపం, ఇంటి దగ్గర ఈ మానవుడు ఎటువంటి బాధలు పడుతున్నాడో కదా అనిపించింది. కొన్నాళ్ళకు చిరునవ్వులతో మొదలై, తర్వాత అల్లంత దూరాన్నించే చేతులూపడం వరకూ వచ్చింది, కరోనా జాగ్రత్తల పరిచయం. ఇద్దరూ నడి వయసుకు చేరారేమో , సూర్యుడు వాళ్ళ తలల మీదే తన అందాన్ని చూసుకుంటున్నాడు. వాకింగు చేసి అలసిపోయి, ఒకరోజు ఎదురెదురు బెంచిలపై కూర్చొని మాట్లాడుకున్నారు . మాస్కు కొద్దిగా మాత్రమే తప్పించి, ఆయన తానే ముందు పరిచయం చేసుకున్నాడు. తన పేరు సుబ్రహ్మణ్యం అనీ, తను మొన్నటి దాకా ఏదో పల్లెటూళ్ళో ప్రభుత్వం వారి స్కూల్లో పని చేశానని, ఈ పట్టణంలో స్కూలుకు ట్రాన్స్ఫర్ కావడంతో వచ్చామన్నాడు. మాటల్లో ఇద్దరూ ఎలిమెంటరి స్కూల్లో సహ విద్యార్ధులని తెలిసింది. వయసుతో పాటు బొజ్జలు పెరిగి,

తలలు అద్దాలు కావడంతో తొందరగా గుర్తు పట్టలేక పోయామనీ నవ్వుకున్నారు. హై స్కూలు చదువుల దగ్గరకొచ్చేసరికి, వాళ్ళ నాన్నగారికి ట్రాన్స్ఫర్ కావడంతో సుబ్రహ్మణ్యం వాళ్ళు వేరే వూరు వెళ్ళిపోయారట.

స్కూల్లో పని అనగానే " స్కూల్లో ఏం చేస్తారు?" అని అడిగాడు ప్రభాకర్ .

"అదే, మాస్టారు ఉద్యోగం" అన్నాడు.

"మీరు తెలుగు మాస్టారా, మీరు కవులు కాదు గదా?" భయం భయంగా అడిగాడు.

"అబ్బే, నేను తెలుగు మాస్టార్ని కాదండి. మీకు కనబడినా కనబడక పోయినా, నాక్కూడా వినబడినా వినబడకపోయినా, నేను కవిని కాను; కవిత్వం చెప్పనంటే చెప్పను, నేను పటమట స్కూల్లో హిందీ మాస్టార్ని" నవ్వుతూ అన్నాడు. అమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నాడు ప్రభాకర్.

"ఏం అలా అడిగారు?" అడిగాడు ప్రభాకర్ మోహంలోకి చూస్తూ.

"ఏం లేదు. నేను ఏ. కే. టి. పి. స్కూలులో లెక్కల మాస్టార్ని. మా ఆవిడేమో తెలుగు టీచరు."

"చాలా సంతోషం. మనమంతా ఒకే కుటుంబంకు చెందినవారన్నమాట. అయినా మనం మీరు, అండీ అనుకోవడం ఏమిటి, చిన్నప్పటి స్నేహితులం కదా?" అన్నాడు నవ్వుతూ.

అతను తెలుగు టీచరమో అని ప్రభాకర్ భయపడటానికి కారణం వుంది. వాళ్ళావిడ తెలుగు టీచరే కాదు, డిక్టేటర్ కూడా. అంటే, తెలుగులో (మాట్లాడే భాషలో) తప్పులు దిద్ది, డిక్టేషను ఇస్తూ వుంటుంది. తరచుగా అతను, పిల్లలూ ఈ శిక్షకు గురవుతూ ఉంటారు .

మరుసటి ఆదివారం ఒకే బెంచీ పై అటు చివర ఒకళ్ళూ, ఇటు చివర ఒకళ్ళూ దూరంగా కూర్చుని మాట్లాడుకున్నారు. ముందు తనే మొదలుపెట్టాడు. తన భార్య పెద్దగా చదువు కోలేదట. కానీ, ఇంటి పనులవీ అన్నీ తనే చూసుకుంటుందని చెప్పాడు. 'ఇంట్లో భాష పోరు లేదు, పని పోరు లేదు. క్లాసులో పెద్దగా కష్టపడి చెప్పాల్సిన పని లేదు. సుఖపడుతున్నాడు మానవుడు'' అసూయ పడ్డాడు ప్రభాకర్ . అతనికి ఇద్దరు పిల్లలు, ఒకడు రెండో క్లాసు, రెండవ వాడు ఎల్. కె. జి. ట.

"మీ కెంతమంది పిల్లలు?" అడిగాడు సుబ్రహ్మణ్యం.

"ముగ్గురు. పెద్ద వాడు ఆరో తరగతి చదువుతున్నాడు. వాడి పేరు అల్లసాని."

"అదేం, పూర్తి పేరు అల్లసాని పెద్దన అని పెట్టచ్చుగదా?" అడిగాడు ఆశ్చర్యంగా.

"మా ఆవిడ అల్లసాని పెద్దన్న అని పూర్తి పేరే పెడదామనుకుంది. కానీ వీడు పుట్టగానే ఏడ్చినప్పుడు అది "అల్ల ,అల్ల " అన్నట్లు వుందిట. అలాని కవిత్వంలా లేదని సగం పేరే పెట్టింది. ఐదో తరగతి దాకా తెలుగు మీడియంలోనే వీడి చదువంతా. ఇప్పుడు ఆరో తరగతి. ఇంగ్లీషు మీడియంలో చదువుతున్నాడు. వాడు ఫేస్బుక్ కన్నా వేగంగా విశేషాలు

మోసుకోస్తాడు. అందుకని వాడిని మెస్సెంజెర్ అని పిలుస్తాను. ఇక రెండోది తెనాలి రమణి. అది రెండో క్లాసు చదువుతోంది. దానికి మాటలు వస్తున్నప్పటి నుంచీ, మేము ఏం మాట్లాడినా, ఆ మాట తిరగేసి, వ్యంగ్యంగా మాట్లాడుతుంది. అందుకని తెనాలి రామలింగడి పేరు, వాళ్ళ అమ్మ పేరు కలిపి పెట్టింది. దానికేది దొరికినా జాగ్రత్తగా దాచేస్తుంది. అందుకని ఆర్కైవ్స్ అని పేరుపెట్టాను. చివరివాడి పేరు ముక్కు వేమన. వాడికి మూడేళ్ళు. వాడికి వొంటి మీద బట్టలుంటే చిరాకు. ముక్కుతో మాట్లాడుతాడు. అందువల్ల ముక్కు తిమ్మన పేరు, వేమన పేరు కలిపి పెట్టింది. అన్నీ వాడి టైం ప్రకారమే జరిగిపోవాలి. అందుకని నేను వాడిని టైం లైన్ అని పిలుస్తాను" చెప్పాడు ప్రభాకర్.

"బాగుంది, ఆవిడ మహా కవుల పేర్లు పెట్టారు బాగానే వుంది. నువ్వు మీ పిల్లలకు అన్నీ ఫేస్బుక్ పేర్లు పెట్టడానికి కారణమేమైనా ఉందా? మీది ప్రేమ వివాహమా? మీరిద్దరూ ఎలా కలుసుకున్నారు?"

"అదేదో సినిమాలో బ్రహ్మానందం చెబుతాడు, అలాగా. ప్రేమ వివాహమే కానీ ప్రేమించింది ఆవిడ, పెళ్ళికి ఒప్పుకున్నది నేను."

"వివరంగా చెప్పు , అర్థం కాలేదు."

"కథ కొంచెం ముందు నుంచీ చెబుతాను. లేకపోతే నీకు అర్థం కాదు. నా హై స్కూలు చదువంతా మునిసిపల్ స్కూల్లోనే. ఒక్కో క్లాసులో ఆరు సెక్షన్లు, ఉండేవారు. మా స్కూల్లో తెలుగు మాస్టారు ఒకాయన వుండేవారు. ఆయన పరీక్ష పేపర్లు దిద్దితే, మాకు గుండెలు జారిపోయేవి. సెక్షనుకు యాభై మంది స్టూడెంట్లు చొప్పున, ఆ క్లాసు మొత్తం ఆరు సెక్షన్లకు మూడు వందల మందిలో ఒకళ్ళో, ఇద్దరో ప్యాసయ్యే వారు. ఆయన అక్షరం పక్కన అర సున్నా పెట్టకపోతే అర మార్కు తీసేసేవాడు. ఎవరికన్నా నలభై మార్కులు వస్తే, ఆయన వాళ్ళ క్లాసుకు వచ్చి, చూసి, ఆ పిల్లవాడు కాపీ కొట్టలేదని నిర్ధారించుకున్నాకే మార్కులు వేసేవాడు. తొమ్మిదో క్లాసు చదువుతు న్నప్పుడు, మూడునెలల పరీక్షలో నేను అన్నింటికీ అర సున్నాలు పెట్టేస్తే ఎక్కువ మార్కులు వస్తాయని, మొత్తం అన్ని మాటలకు అరసున్నాలు పెట్టాను. ఆ పరీక్షలో మొత్తం సున్నా మార్కులు ఇచ్చాడు. అడిగితే, "అన్ని అరసున్నాలు పెట్టినవాడికి, నేను ఒక నిండు సున్నా అన్నా ఇవ్వద్దా?" అన్నాడు. ఇదిగో, మా ఆవిడా అట్లాంటిదే. తను కూడా ఆ స్కూల్లోనే చదివింది. ఆ మాస్టారికి పక్కా శిష్యురాలు. అసలు తను మా చుట్టా లమ్మాయే. నేను స్కూలు ఫైనల్ చదివేటప్పుడు, తను తొమ్మిదో క్లాసు. అప్పటికే తెలుగులో కవితలూ, కథలు రాస్తుండేది. నాతో మాట్లాడదామని చూసేది. నాకు కవులన్నా, రచయితలన్నా భయం. అందువల్ల దూరంగా వుండేవాడ్ని. ఆతర్వాత, నేను డిగ్రీ పూర్తిచేసి, బి.ఎడ్. చేయగానే లెక్కల మాస్టారు ఉద్యోగం వచ్చింది. ఒక రెండేళ్ళన్నా నన్ను హాయిగా తిరగనీకుండా, మా వాళ్ళు వెంటనే పెళ్లి ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఈవిడ అప్పటికే, తెలుగు పండిట్ కోర్సు ఏదో పూర్తి చేసి, పిల్లలకు తెలుగు చక్కగా నేర్పాలని కంకణం కట్టుకుంది. టీచర్ ఉద్యోగం చేస్తానని ఈవిడా, పెళ్లి చెయ్యాలని తల్లిదండ్రులు! వాళ్ళ ప్రయత్నాల్లో నేను దొరికిపోయాను.

ఒక రోజు వాళ్ళ నాన్న మా ఇంటికి వచ్చి, పెళ్లిచూపులకు రమ్మని ఆహ్వానించాడు. అమ్మాయిని చూసి రాగానే, మా అమ్మ "ఏరా అబ్బాయ్, ఏమంటావు? అమ్మాయి బాగుంది, చదువుకున్నది కూడా. మనకు తెలిసిన వాళ్ళే. తను రేపు నీతో పాటు ఉద్యోగం కూడా చెయ్యగలదు. హాయిగా చిలక గోరింకల్లా ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటూ ఉండవచ్చు" అంటూ నా బుర్ర తినెయ్యడం మొదలు పెట్టింది. నాన్నకూ ఇష్టమేనని చెప్పేసింది.

ఇక లాభం లేదని, " అమ్మా, ఆ అమ్మాయిని చాలా సార్లు చూశాను. తన తెలుగు పాండిత్యం అంతా కనబడిన వాళ్ళ మీద కుమ్మరిస్తుంటుంది. రేపు నీమీద, నా మీద కూడా చూపిస్తుంది." అన్నాను.

"ఏమంటుందిరా, నువ్వు అన్నింటికీ వంక పెడతావు?" కోపంగా అడిగింది అమ్మ.

"నువ్వు పాల తరక అన్నావనుకో. అందులో అర సున్నా పెట్టలేదు కనుక, నీకు భోజనంలో పెరుగు కట్ అంటుంది. రేపు నీ వంట నచ్చకపోతే, మనుచరిత్రలో పద్యాలు అప్పచెప్పమనవచ్చు. తెనాలి రామలింగడి సినిమాలో లాగా, "త్రువ్వట బాబా తలపై" అని నిన్ను రాయమని పరీక్ష పెట్టిందనుకో, నీ పరిస్థితి ఏమిటి? ఇంకా చెబుతా, విను. తను రాసిన కవితో, కథో వింటేనే నీకు అన్నం పెడతా అనవచ్చు. ఇక తనేం రాసినా అచ్చు వేసుకోవడానికి "చంటబ్బాయి" సినిమాలో జగ్గయ్య కున్నట్లు నాన్నకు ప్రెస్సు, పత్రికా లేవు కదమ్మా! పుంఖానుపుంఖాలుగా కథలూ, కవితలూ రాసి దేశం మీదకు వదలడం, అవి అచ్చు కాకపోతే బెంగపడి పోవడం, ఇవే ఆవిడ కార్యక్రమాలు. రచనలు అచ్చులో చూసి తను ఆనంద పడితే, మనం బ్రహ్మాండం అని పొగడాలి; అవి తిరుగు టపాలో వెనక్కి వస్తే, దిగులుపడద్దని ధైర్యం చెప్పాలి. వీలైతే ఆ ఎడిటరును దుమ్మెత్తి పొయ్యాలి. ఇక ఇంటినిండా అచ్చు వేసిన పుస్తకాలు గుట్టలు గుట్టలు చేరతాయి . తరచూ దుమ్ము దులుపుకుంటూ, అవి చెదలు పట్టకుండా చూసుకోవాలి! ఇప్పుడు కరోనా కష్ట కాలం కనుక వాళ్ళ సభలూ, సన్మానాలూ లేవు. అవే ఉంటే, వాటన్నింటికి నువ్వో, నేనో వెంట వుండాలి. రేపు పిల్లలు పుట్టారనుకో, ఒకడ్ని భుజాన వేసుకుని, మరోడికి పాల సీసాలో పాలు పడుతూ, మనం కూడా వెళ్ళాల్సిందే. ఇలాంటి వాళ్ళు మనకొద్దమ్మా! అసలు ఈ కాలం కోడళ్ళు అత్తలనే ఆరళ్ళు పెడుతున్నారు. నువ్వసలే అమాయకురాలివి. హాయిగా వున్న ప్రాణాన్ని ఎందుకు కష్టపెట్టుకుంటావు? అయినా ఇప్పుడు నా పెళ్ళికి తొందరేం వచ్చింది?" ఇలా ఏవేవో చెప్పి అమ్మను భయపెట్టాలనుకున్నాను. లాభం లేకపోయింది.

బంధువులం కనుక, ఉన్న ఊళ్ళో మా ఇద్దరికీ పర్మనెంట్ ఉద్యోగాలు వేయిస్తాననీ, తమ కళ్ళెదుటే మేము ఉంటామనీ, మామగారు మా అమ్మకూ, నాన్నకూ కబురు పెట్టారు. ఒక్కతే కూతురు అయినందువల్ల, కూతురూ, అల్లుడూ ఎదురుగా వుంటారనే ఉద్దేశ్యంతో అడుగుతున్నామని ఒకటికి నాలుగు సార్లు మా ఇంటి చుట్టూ తిరిగేసరికి, మావాళ్ళు కరిగి పోయారు. పైగా ఉన్న ఊళ్ళోనే ఉద్యోగాలంటే మాటలు కాదుగదా! దాన్తో మా అమ్మా నాన్నా లొంగిపోయారు.

ఇప్పుడే పెళ్ళి వద్దన్న నా మాట అమ్మా, నాన్నల దగ్గర చెల్లలేదు. నాన్న ఏమీ అనకపోయినా, అమ్మ కళ్ళ నీళ్ళు పెట్టుకుని "నీతో మాట్లాడను పొమ్మ"ని భీష్మించుకుంది. ఒక వారం రోజులు ఆవిడ మూగనోముతో, నా మౌన వ్రతంలో గడిచిపోయాయి. ఒక రోజు సరళ, ( మా ఆవిడ) మా ఇంటికి వచ్చింది. సరాసరి మా అమ్మ దగ్గరికి వెళ్ళి, కాసేపు మాట్లాడింది. ఆ అమ్మాయి ఎందుకు వచ్చిందో నాకు అర్థం అయ్యేలోపు, నా గదిలోకి వచ్చి, కుర్చీ లాక్కుని కూర్చుంది. నేను తనని చూడనట్లు పేస్ బుక్ ఓపెన్ చేసి, చూసుకుంటున్నాను.

"ఆ లాప్ టాప్ కాసేపు కట్టేస్తారా? నేను మీతో మాట్లాడాలి!" అంది.

ఈ పిల్లకి ఇంత ధైర్యం ఏమిట్రా బాబూ అనుకుంటూ "చెప్పండి" మొహమాటంగా అన్నాను.

"చెప్పండి కాదు, చెప్పు అనండి. హై స్కూల్లో చదువుతున్నప్పటి నుంచీ ప్రయత్నిస్తున్నాను. మీతో ఎప్పుడు మాట్లాడదామన్నా, నన్ను చూస్తే మీరు పారిపోతున్నారు. మీ ప్రవర్తన చూసి, పేస్ బుక్ లో మీరు పోస్టుచేసేవి చూసి, మీరంటే ఇష్టం పెంచుకున్నాను. మీ పేస్ బుక్ లో ఫ్రెండు రిక్వెస్ట్ పెట్టాను, కనీసం చాటింగు అన్నా చేద్దామని. కానీ, మీరు నన్ను డిలిట్ చేసారు. ఎందుకని?"

"అమ్మ, పేస్ బుక్కా, నీ మూలంగా ఇలా దొరికిపోయానివాళ!" అనుకున్నాను.

తన ప్రశ్నకు నేను జవాబివ్వక మౌనంగా వుండేసరికి, "మా అమ్మ నాన్నా మీరంటే ఇష్టపడుతున్నారు. మీ వాళ్ళకు కూడా ఏమీ అభ్యంతరం లేదు. మీకు మాత్రమే అభ్యంతరం అని అర్థమైంది. కారణం చెబుతారా? నేనేమీ అందవికారిని కాను, చదువుకున్నాను కూడా." అడిగింది సరళ.

తను అట్లా అడిగేసరికి నీళ్ళు నమిలాను. ఏమి చెప్పాలో అర్థం కాలేదు. కాసేపటికి గొంతు పెగుల్చుకుని, "మీ తెలుగు .... అరసున్నాలు .." అన్నాను నట్లు నట్లుగా. సరిగా మాట్లాడ లేకపోయినట్లు చాలా సేపటికి అర్థమైంది కానీ, చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం అంటే ఇదేనేమో!. ఆ అమ్మాయి వెంటనే, "ఓ, ఆ తెలుగు మాస్టారి భయం మీకింకా పోలేదా? నేను ఆయన శిష్యురాలిని కనుక, నా తెలుగుతో మిమ్మల్ని బాధ పెడతానేమోననా? అలాంటి భయం మీకు అక్కర్లేదు. నేను ఇంట్లో గ్రాంధికం మాట్లాడను. నాకు మా అమ్మ నాన్నలెంతో, మీ అమ్మ నాన్నలు కూడా అంతే! వాళ్ళని ప్రేమగానే చూస్తాను. మీరంటే నాకు చాలా ఇష్టమని చెప్పానుకదా, మిమ్మల్ని కన్నవాళ్ళని వేరేగా ఎలా చూస్తాను? చదువుకున్న వాళ్ళంతా దుర్మార్గులేం కాదు. ఉదాహరణకు మీరే! మీలాంటి మంచి వ్యక్తిని నేనెక్కడా చూడలేదు. అందుకే నాకై నేనే మీతో మాట్లాడి, తేల్చుకుందామని వచ్చాను. నిజంగా చెప్పండి, నేను నచ్చక పోవడం కారణం కాదు గదా ? లేక, నాపై ఇంకా మీకు అనుమానా లున్నాయా?" సరళ ప్రశ్నకు ఏం జావాబు చెప్పాలో తెలియలేదు. తల అడ్డంగా ఊపాను.

"నన్ను చేసుకోవటానికి ఇంకా మీకు అభ్యంతరాలు ఏవైనా ఉన్నాయా? మీ అనుమానాలు తీరినట్లేనా?" సరళ మృదువుగా అడిగేసరికి గట్టిగా కాదని చెప్పలేకపోయాను. "మౌనం అంగీకార సూచన" అంటూ లేచింది.

ఆ పిల్ల ఏం మాట్లాడుతోందో, నేనెక్కడ మొహం మీదే వద్దని చెప్పేస్తానో అని భయపడుతూ, అమ్మ నాగది లోకి వచ్చింది. సరళ అమ్మ కాళ్ళకు దణ్ణంపెట్టి, "మీ అబ్బాయి ఒప్పుకున్నారత్తయ్యా" అంటూ వరస కలిపే సరికి, అమ్మ ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యింది. "నా తల్లే, నా బెంగ తీరిందే అమ్మా! ఎవర్ని చూసినా వీడేదో ఒక వంక పెడుతుండే! ఈ కొరకరాని కొయ్యని దారికి తెచ్చావే తల్లీ" అంటూ సరళను దగ్గరకు తీసుకుంది. టి.వి. లో అప్పుడే "ఎక్కడికీ పోతావు, చిన్నవాడా?" పాట వస్తోంది. సరళ నా వంక నవ్వుతూ చూసి వెళ్ళిపోయింది.

అలా నా అభిప్రాయంతో పెద్దగా ప్రమేయం లేకుండానే సరళకు , నాకు పెళ్ళయి పోయింది. అప్పుడు, ఇప్పుడూ కూడా సరళకు కాదని చెప్పలేకపోవడం నా బలహీనతా? తనేమో "ఎక్కడకు పోతావు చిన్నవాడా" అని పాడేస్తూ ఇప్పుడు కూడా నను వెక్కిరిస్తుంటుంది."

అక్కడితో ఆపి, "భోజనం టైం అవుతోంది, తను ఎదురు చూస్తుంటుంది. రేపు కలుద్దాం " అంటూ లేచాడు.

★ ★ ★ ★ ★ ★

ఆ మర్నాడు, అటు తర్వాత రోజూ కూడా సుబ్రహ్మణ్యం వాకింగుకు రాలేదు. మూడో రోజు రెండవ శనివారం అవడంతో మళ్ళీ పార్కులో వాకింగు చేస్తూ ప్రభాకర్ దూరం నుంచే సుబ్రహ్మణ్యంని చూసి, "ఇన్నాళ్ళూ రాలేదేమని" అడిగాడు. ఇంట్లో ఏవో పనులుండటం వాళ్ళ రాలేకపోయానని చెప్పాడతను.

వాళ్ళిద్దరూ దూరం పాటిస్తూ ఒకే బెంచీ పై కూర్చున్నాక, ఆపేసిన కథ కొనసాగింపు చేయమని కోరాడు సుబ్రహ్మణ్యం.

"పాప పుట్టేదాకా తను ఉద్యోగం చాలా ఇష్టంగా చేస్తూండేది. అది పుట్టాక దాని ఆలనా పాలనా చూసుకోవడం, అటు స్కూల్లో పిల్లలతో అరచి అరచి వచ్చి అలసి పోతుండేది. ఇంటి దగ్గర నేనూ, అమ్మా ఎంత సహాయం చేసినా, కొన్ని పనులేవో తను చేయక తప్పేది కాదు. తనకు కాస్త విశ్రాంతిగా వుంటుందని అప్పుడప్పుడూ సినీమాలకు తీసుకెళ్ళే వాడిని. ఆ సినిమాల్లో పాటల్లో, మాటల్లోను తప్పులు వెతికేది. ఒక సారి నాకిష్టమైన నటి సినిమాకు వెళ్ళాం. అందులో ఆవిడ సంభాషణలన్నీ వత్తులే లేకుండా చెప్పిందట. ఆవిడచేత లక్ష వత్తుల నోము నోయించాలి అని మొదలుపెట్టింది. టీవి లో ప్రోగ్రాములు తెలుగు సరిగ్గా రాని వాళ్ళు యాంకర్లుగా నిర్వహించడం ఆవిడకు కోపం. అందుకని టీవి చూడదు.

ఒక సారి ఆరవ క్లాసులో అంతక్రితం తను చెప్పిన వేమన పద్యం " అల్పు డెప్పుడు పల్కు" విద్యార్థులనదర్నీ మళ్ళీ చదువుకుని రమ్మని చెప్పిందట. మర్నాడు ఒకడిని "సజ్జనుండు పల్కు చల్లగాను" అనేదానికి అర్థం చెప్పమందట. వాడు కాసేపు ఆలోచించి, "సజ్జనుడు అనేవాడికి ఆకలేసి, అన్నం పలుకుగా వున్నా మజ్జిగ కలుపుకుని తిన్నాడు" అని చెప్పాడట. మరొకడిని "కనకంబు" అనే పదానికి అర్థమేమిటని అడిగింది.

వాడు వెంటనే, "మా ఇంట్లో పనమ్మాయి వాళ్ళ నాన్న" అన్నాడు. అదేమిటని అడిగితే, వాళ్ళ పనమ్మాయి పేరు కనకం. కనకంబు అంటే, కనకం వాళ్ళ అబ్బ అయివుండచ్చని అలా చెప్పాడట. దాంతో తనకు కోపం వచ్చి, వాళ్ళిద్దర్నీ రెండు దెబ్బలు వేసింది.

ఆ మర్నాడే ఆ పిల్లల తల్లిదండ్రులు తనపై హెడ్ మాస్టరుకు పిర్యాదు చేశారు. వాళ్ళ పిల్లలకు తెలుగు పద్యాలు రాకపోయినా, అసలు చదువు రాకపోయినా పర్లేదు కానీ, టీచర్ కొట్టకూడదట. "అసలు తెలుగు ఎవడికి కావాలి? ఇవాళ తెలుగు చదువు కుంటేనే వుద్యోగాలొస్తాయా?" అని ఎదురు ప్రశ్నించే సరికి తను హతాశురాలైంది. వాళ్ళకు క్షమాపణ చెప్పాల్సిందేనని పట్టుబట్టారు. ఈవిడ తను ససేమిరా చెప్పనంది. హెడ్ మాస్టారు, నేనూ ఎలాగో వాళ్ళకు సర్ది చెప్పి పంపేశాము. కానీ వాళ్ళు అంతటితో వూరుకోక, పైకి పిర్యాదు చేశారు. స్కూళ్ల ఇన్స్పెక్టరు గారు వచ్చి విచారించి వెళ్ళాడు. ఆయన కూడా క్షమాపణ చెబితే పోయేదానికి, ఇంతదాకా ఎందుకు తెచ్చు కున్నావమ్మా అనే చెప్పాడు.

"తెలుగు కూడా సరిగ్గా నేర్చుకోలేని పిల్లలకు రేపు మిగతా విషయాల్లో ఎలా నైపుణ్యం వస్తుందీ, వాళ్ళు రేపు దేశానికి ఏ రకంగా వుపయోగపడతారు? చదువు చెప్పేటప్పుడు రెండు దెబ్బలు వేస్తే తప్పంటే ఎలా?" అంటూ ఎదురు ప్రశ్న వేసేసరికి ఆయనేం మాట్లాడలేకపోయాడు. చివరికి ఆయన రిపోర్టులో కూడా టీచర్ క్షమాపణ చెప్పాలని రాసేసరికి, తను రిజైను చేసింది."

"ఓ గాడ్! ఎంతపని జరిగిందీ? ఈ కాలం పిల్లలకు అసలు చదువుకోవాలన్న ధ్యాసే వుండటం లేదు. తల్లి దండ్రులూ అలాగే వుంటున్నారు. అందరికీ వుద్యోగాలు, డబ్బు సంపాదించడం పైనే దృష్టి" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"గ్రేట్, మీ ఆవిడ చాలా గొప్ప కమిట్మెంట్ వున్న టీచర్. అంతే కాదు, గొప్ప ఆత్మాభిమానం వున్న మనిషి. మరి తనిప్పుడేం చేస్తున్నారు?" ప్రశ్నించాడు.

"ఏముందీ, నేనూ, పిల్లలూ మాట్లాడే మాటల్లో తప్పులు వెతుకుతుంది. ఆ తప్పులు మళ్ళీ మాట్లాడకుండా మాచేత వల్లె వేయిస్తుంది" అన్నాడు ప్రభాకర్ లేచి నిలబడి.

• ★ ★ ★ ★ ★

గేటు తెరుచుకుని లోపలికి వస్తున్న సుబ్రహ్మణ్యం ఎదురుగా తులసి మొక్కకు నీళ్ళు పోస్తున్న పెద్దావిడను చూసి, "నమస్కారం అమ్మా, ప్రభాకర్ వున్నాడా?" అని అడిగాడు.

"మీరెవరు బాబూ?" అడిగిందావిడ.

"నేనూ, తానూ చిన్నప్పుడు ఒకే స్కూల్లో చదువుకున్నామమ్మా, నా పేరు సుబ్రహ్మణ్యం" చెప్పాడు.

"ఏం చేస్తారు మీరు? ఎక్కడుంటారు? " మళ్ళీ అడిగిందావిడ.

"నేనూ మీవాడిలాగానే టీచర్ ని . ఈ పేటలోనే వుంటాము. ఇద్దరం రోజూ పార్కులో మార్నింగ్ వాక్ లో కలుస్తుంటాం." ఎందుకీవిడ ఇన్ని ప్రశ్నలు అడుగుతోందబ్బా అనుకున్నాడు సుబ్రహ్మణ్యం.

"కాసేపు కూర్చోండి బాబూ, ఈ కుర్చీలో. ఆయనవస్తారు" అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

హాల్లో అడుగుపెట్టగానే, ఎదురుగా రెండు పెద్ద అద్దాల బీరువాలు వాటి నిండా తెలుగు కావ్యాలు, కథల పుస్తకాలు కనిపించాయి. వాటికి ఒక పక్క టేబుల్ పై ఒక కంప్యూటరు, మరొక పక్క గోడ మీద ఫోటో కనిపించాయి. ఫోటోలో ప్రభాకర్, అతని పక్కన వాళ్ళ నాన్న కాబోలు, ఇద్దరూ దాదాపు ఒకేలా వున్నారు.

ఇంతలో లోపలి నుంచీ, "ఎవరూ?" అంటూ ఒక పెద్దాయన టవల్ తో మొహం తుడుచుకుంటూ హాల్లోకి వచ్చాడు.

"నమస్కారమండి ! నా పేరు సుబ్రహ్మణ్యం. నేనూ, మీ అబ్బాయి స్నేహితులం" లేచి నిలుచుని నమస్కరించాడు.

పెద్దాయన మొహంలో చిరునవ్వు కనిపించింది. "కూర్చోవయ్యా" అని వెనక్కి తిరిగి, "ఏమేవ్, మన ప్రభాకర్ స్నేహితుడట. కాస్త కాఫీ తెచ్చిపెట్టు" చెప్పాడు.

సుబ్రహ్మణ్యం మోహమాటపడుతూనే, ఆవిడ ఇచ్చిన కాఫీ తాగాడు.

"ప్రభాకర్ లేడా అండీ?" అడిగాడు సుబ్రహ్మణ్యం.

"ఆయనే ప్రభాకర్ బాబూ!" అని మూసిముసి నవ్వులు నవ్వింది.

ఒక్క క్షణం తెల్లబోయాడు సుబ్రహ్మణ్యం. "మరి నాతో రోజూ వాకింగుకు వచ్చే లెక్కల మాస్టరు ప్రభాకర్, తెలుగు పండితురాలైన అతని భార్య సరళ ?" సందిగ్ధంగా అడిగాడు.

"ప్రభాకర్ ఆయనేనయ్యా! ఆ సరళనీ నేనే! రోజూ మార్నింగ్ వాకుకు వచ్చేదీ ఆయనే. ఆయన లెక్కల మాస్టరూ కాదు, నేను తెలుగు పండితురాలినీ కాదు. పార్కులో కొత్త పరిచయస్తులు కనబడితే ఇలాగే కథలల్లి చెబుతారు. ఇదొక కాలక్షేపం ఆయనకు. మా పిల్లలలంతా అమెరికాలో వున్నారు. మేమిద్దరమే ఇక్కడున్నాము" అంది ఆవిడ పెద్దగా నవ్వుతూ.

" నారహస్యం చెప్పేశావా?" అడిగాడు అప్పుడే చొక్కా గుండీలు పెట్టుకుంటూ వచ్చిన ప్రభాకర్.

ఒక క్షణం ఆయన వంకే ఆశ్చర్యంగా చూస్తుండి పోయాడు సుబ్రహ్మణ్యం . వెంటనే తేరుకుని పెద్దగా నవ్వేశాడు.

(ఈ కథలో పాత్రలూ, సన్నివేశాలు కేవలం కల్పితమే. హాస్యం కోసం రాసినవి తప్ప ఎవరినీ ఉద్దేశించినవి కాదు—రచయిత)

# రాధా చలం ప్రణయ కథ

తురగా శివరామ వెంకటేశ్వర్లు

ఆరోజు శ్రావణ శుక్ర వారం . అందువలన రోజూ వేసుకునే జీన్ ఫాంటు షర్టు, పంజాబీ డ్రస్సు లాంటివి కాకుండా అందమైన చీర కట్టుకుని ఆఫీసు ముందు బస్సు దిగింది రాధ. గేటునుంచి స్మార్టుగా స్మార్టు ఫోను చూసు కుంటూ , నవ్వుకుంటూ ఆఫీసు వైపు నడుచుకుంటూ వెళ్ళుతోంది. దారిలో ఎదురుగా ఏదోపని మీద గేటు వైపుకు వస్తున్న ఒక అబ్బాయి, రాధ గుద్దు కున్నారు.. దానితో క్రింద పడబోయిన రాధ తమాయించుకుని, “కళ్ళు మూసుకు పోయాయా?” అని కోపంతో చెంప మీద కొట్టడానికి చెయ్యి ఎత్తింది. ఆ అబ్బాయి వెంటనే తన చేతితో రాధ చెయ్యి పట్టుకుని ఆపేడు. ఆవిధంగా మొదటి సారి వారిద్దరి చేతులు కలిసాయి . “అవునండీ! నిజంగానే కళ్ళు మూసుకు పోయాయి. మీరు వస్తుంటే గాలికి మీ చీర పమిట జారిపోయినా మీరు చూసుకోకుండా ఫోను చూసుకుంటూ వస్తున్నారు. పమిటజారిన అమ్మాయిని చూడడం సభ్యత కాదని కళ్ళు మూసుకుని వస్తుంటే మిమ్మలని గుద్దేశాను. ఏమీ అనుకోకండి. సారీ!” అన్నాడు ఆ అబ్బాయి.

“వాట్.. నిజమా?” అంది రాధ కుంచెం సిగ్గుతో పమిట సరి చేసుకుంటూ.

“నిజమేనండీ ఒట్టు” అంటూ ఆమె చేతిలో తన చెయ్యి వేశాడు..

మళ్ళీ వాళ్ళిద్దరి చేతులు రెండవసారి కలిశాయి ఆవేళ.

“మీ పేరు?” అడిగింది రాధ.

“చలం” అన్నాడు.

“ సినీమా చలమా? రైటరు చలమా?” అడిగింది నవ్వుతూ.

“వాళ్ళెవరండీ.. నేను శేషాచలాన్ని” అన్నాడు.

” ఓహో! కొండచలమా!”అంది.

” ఏమిటండీ..కొండచిలువా అన్నట్లు అంటున్నారు” అన్నాడు చలం.

“అదేలెండి. ఏడుకొండలవాడు గుర్తుకొచ్చి అల్లా అన్నాను.”అంది మళ్ళీ నవ్వుతూ. “ఇంతకీ మీది ఏవూరు?”అడిగింది.

“నేను లోకల్” అన్నాడు.

"అదేమిటండీ. నేను ఊరు పేరడగితే సినీమా పేరు చెపుతూరు"అంది.

"అదేనండి.. నేను గుంటోరోడ్ని" అన్నాడు.

" అదిగో మళ్ళీ యింకో సినీమా పేరు చెపుతున్నారు" అంది రాధ నవ్వుతూ.

"కాదండీ..మాది ఈవూరే.. గుంటూరు."చెప్పేడు చలం.

"అల్లా చెప్పండి మరి " అంది రాధ నవ్వుతూ.

"మీరు ఈ ఆఫీసులో పని చేస్తున్నారా? ఏ డివిజన్ లో" అడిగింది.

"అవునండీ ఎ డివిజన్ లో " అన్నాడు.

"నేనడిగిందే మళ్ళీ నన్నడగుతున్నారు" అంది నవ్వుతూ.

"కాదండీ.. ఆఫీసు బిల్డింగు పై ఫ్లోరులో 'ఎ' డివిజన్ ఉంది కదా.. అందులో అన్నాడు.

"అల్లా చెప్పండి మరి" అంది మళ్ళీ నవ్వుతూ.

"అబ్బో! నన్ను బాగా ఆట పట్టిస్తున్నారే! ఇంతకీ మీ మాటేమిటీ?" అడిగాడు చలం.

"నేను మీ ఆఫీసులోనే 'బి' డివిజన్ లో చేస్తున్నాను" చెప్పింది రాధ.

" ఒహో! అయితే నా క్రిందన్న మాట"అన్నాడు నవ్వుతూ.

"మీరు గ్రాడ్యుయేటా?" అడిగాడు చలం.

"బి.ఏ. తెలుగు" చెప్పింది రాధ..

"మీరు?"

"ఎమ్.ఎ. ఇంగ్లీషు" చెప్పేడు చలం.

"చలం గారూ ..మీరు నాకు ఒక సాయం చేయాలి.. నేనొక ఆఫీసు ఫైలు అర్జంటుగా పంపాలి. దానికి మీ 'ఎ' డివిజన్ నుంచి కొంత ఇన్ఫర్మేషన్ కావాలి. ఇవ్వగలరా?" అడిగింది రాధ.

"షూర్. మాడివిజన్ కి రండి. లేదా నాకు ఫోను చేయండి. ఇదిగో నా నెంబరు" అంటూ తన కార్డిచ్చి రాధ కార్డు కూడా తీసుకున్నాడు చలం. ఆవిధంగా శ్రావణ శుక్రవారం పూట చీర కట్టిన వేళ రాధకి చలం తో పరిచయమయింది.

ఆ పరిచయం తర్వాత వారిద్దరి మధ్య క్రమంగా చనువు, చొరవ పెరిగి మీరు మీరు పలకరింపులు నువ్వు నువ్వుల్లోకి మారాయి. కలిసి కాఫీలుకి వెళ్ళడం, ఫోనులు చేసుకోవడం, చాటింగులు, ఒకళ్ళనొకళ్ళు పొగుడుకోవడం, కలిసి గుళ్ళకి వెళ్ళడం మొదలయి ఆరు నెలలు గడిచాక తాను చలాన్ని ఇష్టపడుతున్నట్టు రాధకి

అర్ధమయింది. ఒక రోజు రాధ సీరియస్ గా ఆలోచించి ఇంక చలంతో దాగుడుమూతలు, అష్టాచెమ్మలు మానేసి తను ప్రేమిస్తున్న విషయం చెప్పి తేల్చుకోవాలనుకుంది.

ఒక ఆదివారం చలంకి ఫోను చేసి, "ఐ లవ్ యు సీరియస్లీ" అంది.

దానికి "నువ్వు తెలుగు బి.ఏ.అన్నావు కదా ! ఇల్లా ఇంగ్లీషులో ప్రేమ విషయం ఐ లవ్ యు అని చెప్పడానికి సిగ్గు లేదూ నీకు? నీ స్టైలులో తెలుగులో చెప్పు" అన్నాడు చలం.

"ఎమ్.ఎ. ఇంగ్లీషు వాడివి తెలుగులో చెపుతే "నీకేమి అర్ధమవతుంది?"నవ్వుతూ అంది.

"అబ్బా! ఏది చెపు..చూద్దాం ." అన్నాడు.

"అయితే విను. చలం! వయస్సు పరువంతో పరవళ్ళు త్రొక్కుతున్న ఒక అందమైన నదిని నేను. నీవొక విశాలమైన సాగరుడవు. ఒక పున్నమి నాటి రాత్రి సిరి వెన్నెల లో నా వంకర టింకరి వయ్యారి నడకలతో వచ్చి నీలో కలసిపోవాలని, నిన్ను పొందాలని సాగరసంగమం చేయాలని వుంది ఏమంటావ్?" అంది రాధ.

దానికి చలం నవ్వినవ్వి, "బాబోయ్! మరీ ఇంత తెలుగులోనా ఐ లవ్ యు చెప్పడం?. ఏమంటాను. మానాన్న అమ్మలతో వెంటనే మాట్లాడమంటాను మీనాన్నను". అన్నాడు చలం.

ఒక రోజు చలం ఇంట్లో ఉన్నప్పుడు రాధ నాన్న రామనాధం, చలం నాన్న శంకరం కలుసుకున్నారు. రాధ చలంల మధ్య ప్రేమ సంగతులు , త్వరలో చేయవలసిన వాళ్ళ పెళ్ళి విషయాలు మాట్లాడుకుని రామనాధం లేచి వెళ్తూ, రాధ చెప్పిన సంగతి గుర్తుకొచ్చి శంకరాన్ని పలకరింపుగా అడిగాడు ,

" ఈమధ్య మీరు కంటికి కేటరాక్టు చేయించుకుని, చెవికి మెషీన్ పెట్టుకున్నారుట ఇపుడు బాగా కనపడుతోందా, వినపడుతోందా?" అని.

దానికి శంకరం , "ఆ.. ఇపుడు అందరి నిజరూపాలు తెలుస్తున్నాయి. చాటు మాటలు కూడా వినపడుతున్నాయి" అన్నాడు.

"అదేమిటండీ.! ఇపుడు నేనేమన్నానని నా నిజ రూపం తెలియడానికి చాటుమాటలు వినపడడానికి?" అడిగాడు రామనాధం ఆశ్చర్యంగా.

"ఏంలేదయ్యా.. కళ్ళు బాగా స్పష్టంగా కనపడుతున్నాయని, మెల్లిగా మాట్లాడినా వినపడుతోందని చెప్పడానికి అల్లా జోక్ గా అన్నాను అంతే" అన్నాడు శంకరం నవ్వుతూ.

ఇద్దరూ ఒకసారి నవ్వుకున్నారు. ఇంతలో బయట గుమ్మంలో కారు చప్పుడు విని తలుపు తీశాడు శంకరం.

కారు దిగిన అమ్మాయి లోపలకొొచ్చి "హమ్మయ్యా! వచ్చేశాను బాబు!" అంది కష్టపడి నడిచి వచ్చినట్లుగా శంకరం ప్రక్కన కుర్చీలో కూర్చుంటూ.

అమ్మాయి మాట వినపడి శంకరం భార్య కూడా వచ్చి "ఏమిటమ్మా.. అల్లా నీరసంగా ఉన్నావ్?" అడిగారు ఆవిడ, శంకరం పుష్టిగా హుషారుగా ఉన్న ఆ అమ్మాయిని తల నిమురుతో.

"ఇంట్లో పని చేసుకోలేక పోతున్నాను" అంది ఆ అమ్మాయి.

"ఏం గిన్నెలు తోము కోవడం ఇల్లు ఊడ్చుకోవడం నువ్వేనా?" అడిగారు ఇద్దరూ.

"కాదులే.. పని అమ్మాయి ఉంది."చెప్పింది.

"బట్టలుతుక్కోవాలా?".

"అక్కరలేదు. వాషంగు మెషీన్ ఉంది".

"వంట వార్పు?".

"ఎప్పటినుంచో మాఇంట్లో వంట మనిషుంది".

"మరేమిటమ్మా! నువ్వు చేసుకోలేకపోతున్నది?" అడిగారిద్దరూ.

"వడ్డించడానికి ఎవరూ దొరికి చావట్లేదు" అంటూ గారాలుపోతూ లోపలికెళ్ళుతున్న అమ్మాయి వైపు చూస్తూ ఉండిపోయారిద్దరూ.

"మాఅమ్మాయి. అత్తవారు ఈ ఊరే!" చెప్పాడు శంకరం రామనాధంతో.

"మరి వెళ్ళొస్తా"..అంటూ బయలు దేరాడు రామనాధం ఇంటికి.

తర్వాత వీకెండులో రాధ చలానికి ప్రొద్దుటే ఫోను చేసి 'శుభోదయం' అంది హుషారుగా. "నీ తెలుగు చాలు గానీ విషయమేమిటో చెప్పు" అన్నాడు చలం.

"అదే.. మానాన్న మీయింటికొచ్చి మన ప్రేమ పెళ్ళి విషయాలు మాట్లాడేడుట కదా"అంది రాధ.

"అవును. ఏమన్నాడు మీనాన్న. నేను నచ్చానా మీనాన్నకి?" అడిగాడు చలం.

"అయ్యో! నచ్చకపోవడమేమిటీ! 'శంకరాభరణం'లాఉన్నావని తెగ మెచ్చేసుకున్నాడు నిన్ను" అంది.

"అంటే నాకు పాము గర్తుకొస్తోంది. అల్లా ఉన్నానా? అయినా నచ్చానా మీనాన్నకి?"అడిగాడు చలం.

"అయ్యో! కాదు..కాదు. శంకరుని మెడలో ఆభరణం కాదు. నెత్తిమీద ఆభరణం. 'శంభోర్మకుటభూషణం' చంద్రుడు. చందమామలా అందంగా ఉన్నావుట" అంది రాధ.

"అబ్బ! అంత నచ్చానా మీనాన్నకి. ఇంకేమన్నాడు? మీ నా....న్న. సాగతీస్తూ అడిగాడు చలం.

"మనిద్దరి జాతకాలు చూపించాడుట. నీకూ నాకూ వ్రాసిపెట్టిన్నుదట. నన్ను చేసుకున్నవాడు శ్రీమంతుడవుతాడుట" అంది రాధ.

" నువ్వు నన్ను చేసుకుంటే శ్రీమతివవుతావుకదా" చలం కౌంటరు.

"అది వేరు. పెళ్ళయిన అమ్మాయిలందరూ శ్రీమతలవుతారు కానీ పెళ్ళయిన అబ్బాయిలందరూ శ్రీమంతులు కాలేరు ఎక్కడో నాలాంటి అమ్మాయిని చేసుకున్నవాడు తప్ప" నవ్వుతూ అంది.

ఇపుడో వారం పోయాక మూఢం ప్రారంభమయి రెండు మూడు నెలలపాటు ఉంటుందిట. మూఢమి వెళ్ళేకా మన పెళ్ళి ముహూర్తమట " చెప్పంది రాధ.

"మరి మావాళ్ళకు నువ్వు నచ్చాలికదా"అన్నాడు.

"అందుకే మన పెళ్ళి చూపులు. మీరందరూ మాయింటికొస్తున్నారు. అవునూ! చలం ! పెళ్ళి చూపుల్లో ఏంప్రశ్నలు వేస్తావో ముందే చెప్పేయవా.. ప్రిపేరయిపోతాను" అంది నవ్వుతూ.

"అబ్బ! ఆశ. పదవతరగతి పరీక్షల ప్రశ్నల లీకులకే లక్షలు లంచమడుగుతున్నయీరోజుల్లో పెళ్ళిచూపుల ప్రశ్నలు లంచం లేకుండగా లీక్ చేస్తానా?"అన్నాడు చలం జోక్ గా.

"లంచాలడగకు చలం. అడిగినందుకు నువ్వు, ఇచ్చినందుకు నేను పట్టుపడిపోతాం.. దొరికిపోతాం. పెళ్ళయ్యకా లంచాలు ఎలాగా తప్పవు."అంది నవ్వుతూ.

"అబ్బా! నీమాటల్లో భయం..భావంలో రొమేన్సు. తెలుగు బి.ఏ.అనిపించుకున్నావు రాధా." చలం పొగడత.

పెళ్ళిచూపులయ్యాయి. రాధా చలం ఇళ్ళ మధ్య రాకపోకలు మొదలయ్యాయి. నెలరోజులు రోజులు గడిచాయి. ఒక రోజు సాయంకాలం రాధ తమ్ముడు వాసు వచ్చి,

"అక్కా! యీవేళ చలం 'సిటీ బార్' లోంచి బయటకు వస్తుంటే చూశాను. కుంచెం నీరసంగా ఉన్నాడు" అంటూ చెప్పాడు.

"నీ మొహం. ఎవరిని చూసి అతననుకున్నావో! నేనమ్మనురా.. అయినా నువ్వెందుకెళ్ళావక్కడికి?" అడిగింది రాథ.

"నా కోచింగు క్లాసులు ఆ బార్ ఎదురు బిల్డింగులోనే కదా." చెప్పాడు వాసు.

"సరేలే. పోయి చదువుకో" అంది.

వారం పోయాక మళ్ళీ ఓ రోజు వాసు హడావిడిగా రాధ దగ్గరికొచ్చి "అక్కా.. యీవేళ మళ్ళీ చలం ఆ బార్ లోంచి బయటకు రావడం చూశాను. ఓకుర్రాడు అతన్ని పట్టుకుని తీసుకొస్తున్నాడు. చలం నన్ను చూసి పిలిచి అక్కడ తనను చూసినట్టు నీతో చెప్పొద్దని నాచేత ఒట్టు వేయించు కున్నాడు. నిజం!" అన్నాడు.

"అవునా?"అని ఆశ్చర్య పోయింది రాధ.

తర్వాత తన గదిలోకి వెళ్ళి పడుకుని చలం గురించి ఆలోచనలో పడింది. 'ఎంత మోసం. చలం బాగా డ్రింకరన్నమాట. పచ్చి త్రాగుబోతన్నమాట. ఆవేళ ఆఫీసు గేటు దగ్గర మొదట పరిచయమైన రోజున నన్ను గుద్దినపుడే అనుకన్నాను మందు కొట్టున్నాడని..కానీ వాడి మాయ మాటలు నమ్మాను. ఛీ.. చలాన్ని ఇంక కలవ కూడదు. వాడితో మట్లాడకూడదు. ఆఖరికి ఫోను కూడా చేయ కూడదనుకునింది. యింక భరించలేక రాధ తల్లి దగ్గరికెళ్ళి కాగలించుకుని విషయం చెప్పి భోరునేడ్చింది. తల్లి రామనాధాన్ని పిలిచి విషయం చెప్పింది.

"అల్లాగా? అయితే ఆ 'సిటీ బార్ 'ఓనరు నాకు బాగా తెలుసు. చలం ఫొటో ఒకటియ్యి. అది చూపించి వాడు బార్ కి ఎప్పుడొస్తున్నాడు, ఎప్పటినుంచి వస్తున్నాడు, ఏంతాగుతున్నాడు, బీరా, విస్కీయా, బ్రాందా అన్ని విషయాలడిగి చలం గుట్టు రట్టు చేస్తాను. వాడిని నిలదీస్తా!" అన్నాడు రామనాథం కోపంగా.

వెంటనే రాధ తల్లి "ఆ బార్ ఓనరు మీకెల్లా తెలుసండీ? అన్ని డ్రింకుల పేర్లు మీకెల్లా తెలిసాయి? మీరు కూడా తాగుతారా?"అంటూ మొగుడు చేతులు పట్టుకుని ఘొల్లుమంది.

"ఛీ! నోరు ముయ్యవే! ఆ బార్ ఓనరు సుబ్బయ్య మొదట్లో హొటలు పెట్టాడు. నువ్వు పుట్టింటికెళ్ళినప్పుడల్లా ఆహొటల్లో భోజనం చేసే వాడిని. అప్పటినుంచి తెలుసు నాకు" అంటూ బుజ్జగించాడు రామనాధం.

"అంతేనా? హమ్మయ్య! అనుకుంది రాధ తల్లి.

మర్నాడు చలం ఫొటో పట్టుకుని తన కారులో బయలుదేరేడు సిటీబార్ కి రామనాథం. దారిలో డ్రైవరు కారు స్లో చేసి, "అయ్యగారూ! ఏ అలవాటులు లేని మీరు బారు కి బయలుదేరితే నాకే బాధగా వుంది.. మరి అమ్మ గారికి తెలుస్తే ఆవిడ ఊరుకుంటారా?" అనడిగాడు.

"ఓరి నీ మొహం మండ! నేనావిడికి తెలిసే వెళ్ళుతున్నా..నేనేమీ మందు కొట్టడానకి వెళ్ళట్లేదు. సుబ్బయ్యతో పనుండి వెళ్ళుతున్నా". చెప్పాడు రామనాధం. కొంత దూరం వెళ్ళేకా కారు ఆగింది. రామనాధం దిగి బయట బోర్డు చూశాడు. 'సిటీబార్' అని పెద్ద అక్షరాలతో వ్రాసి వుంది. లోపలికెళ్ళేడు. చూస్తే అది బార్ లా లేదు. లోపల ఓ కేబిన్ ఉంది. దానిమీద ప్లాస్టిక్ అక్షరాలతో డా..గోపాలం .ఎం.బి.బి..యస్. ఫిజీషియన్. అని ఒక చిన్న బోర్డు ఉంది. తలుపు తోసుకుని లోపలికళ్ళాడు. కుర్చీలో కూర్చుని వున్న డా.గోపాలానికి తనను పరిచయం చేసుకుని ఎదురు కుర్చీలో కూర్చుని, "ఇక్కడ సిటీబార్ ఉండేది." అన్నాడు.

గోపాలం వెంటనే, " అవును.. ఆబార్ ఇప్పుడు లేదు. ఎత్తివేసి నెల దాటుతోంది. నేను తీసుకుని ఈ చిన్న ఆసుపత్రి పెట్టా. పదిహేను రోజులవుతోంది. ఇంకా ఎవరికీ బాగా తెలియదు. బయట ఇంకా బోర్డు కూడా పెట్టలేదు. బోర్డు వ్రాయిస్తున్నా" అని చెపుతూ అడిగాడు రామనాధాన్ని " ఏం మీకు బార్ కి వెళ్ళే అలవాటుందా?" అని.

"లేదండి! బాబూ!" అంటూ జేబులోంచి ఫొటో తీసి చూపిస్తూ," ఈ బడుద్ధాయికి మాఅమ్మాయినిచ్చి పెళ్ళి చేద్దామనుకన్నాం. కానీ ఇతను ఈ బార్ లోంచి బయటకు రావడం యీ వారంరోజుల్లో రెండు సార్లు మా అబ్బాయి చూసాడుట. నిన్నబాగా మందు కొట్టినట్టుగా ఇంకో అబ్బాయి సాయంతో బయటకు రావడం చూసి మాకు చెప్పడంతో ఈబార్ ఓనరు సుబ్బయ్యని అడిగి వివరం తెలుసుకుందామని వచ్చా. సుబ్బయ్య నాకు బాగా తెలుసు" చెప్పాడు రామనాధం.

గోపాలం ఫొటో చూసి, "అరే! యితను మాశంకరం వాళ్ళ అబ్బాయి. చలం. నాఫ్రెండు కొడుకు. వారం క్రితం నావద్దకు వచ్చాడు. గాలి మార్పు వల్ల బాగా జ్వరం వచ్చింది. ఇతను నా పేషెంటు. నిన్నకూడా వచ్చాడు . నీరసంగా వున్నాడని ఓకుర్రాడిని సాయం యిచ్చి పంపాను. ఇతను బార్లో మందు కొట్టడమేమిటండీ! అసలు ఇక్కడ బారే లేదు కదా!. ఇతను గుళ్ళో ప్రసాదంగా పానకం తప్ప ఇంకేమీ తాగడు" అని నవ్వుతూ అంటూ, "ఎక్కడో పొరపాటు జరిగింది. బహుశ మీఅబ్బాయికి యిక్కడ బార్ ఎత్తివేసినట్లు, ఈ చిన్నఆసుపత్రి ఉన్నట్లు తెలియదు. చలం నాదగ్గరకొచ్చి బయటకొస్తుంటే 'సిటీబార్' బోర్డు చూసి బార్లోంచే చలం వస్తున్నట్టు మీఅబ్బాయి అనుకున్నాడు. సందేహం లేదు. అందుకే మీకల్లా చెప్పాడు. డోన్టువర్రీ! గోహెడ్ విత్ మేరేజ్. యువర్ డాటర్ ఈజ్ వెరీ లక్కీ! చలం ఈజ్ బెస్టు బోయ్. ఐ నో. ఆల్ ది బెస్టు!" అంటూ ఇంగ్లీషులో హుషారుగా చెప్పి షేకుహేండిచ్చి," నౌ యుకెన్ గో" అని రామనాధానికి చెప్పి వెయిట్ చేస్తున్న పేషెంటుని పిలిచాడు డా.. గోపాలం.

రామనాధం ఊపిరి పీల్చుకుని ఇంటికెళ్ళుతూ డ్రైవరనడిగాడు, "సిటీ బార్ లేదుట కదా యిపుడు.. నీకు తెలవదా?" అని.

"తెలవదండీ. నేను ఇటువైపుకొచ్చి చాలా రోజులయింది. పోనీలెండి. కుర్రాళ్ళలో తాగుడు తగ్గుద్ది." అన్నాడు డ్రైవరు. ఇంటికొచ్చి రామనాధం అందరినీ పిలిచి జరిగినదంతా చెప్పి, కొడుకు వాసుతో,

" ఏరా అసలు అక్కడ బారే లేనిదే అక్కతో అల్లా ఏందుకు చెప్పావనడిగాడు?".

"నాకేమి తెలుసు? 'సిటీ బారని' బోర్డు ఉందికదా. అందుకనుకున్నాను" అన్నాడు వాసు.

వెంటనే రాధ అందుకుని "అయితే అక్కడ తనను చూసినట్టు నాతో చెప్పొద్దని వాసు చేత యెందుకు ఒట్టు వేయించుకున్నట్టు చలం? నాన్నా?" అంది. "ఇది మంచి పాయింటు! చలం ఇంటికెళ్ళి తేలుస్తా!" అన్నాడు రామనాధం.

ఆసాయంకాలం చలం ఇంటికెళ్ళాడు రామనాధం. పలకరింపులయాక అడిగాడు చలాన్ని, "ఏమయ్యా నిన్ను ఆసుపత్రి దగ్గర చూసినట్టు రాధతో చెప్పొద్దని అన్నావుట మా వాసు తో. ఏం చెపుతే ఏమవుతుంది.. రాధకి తెలుస్తే ఏమవుతుంది?" అనడిగాడు.

"అవునండి. అన్నాను. రాథ సంగతి మీకు తెలియదు. రాధకి నేనంటే పిచ్చి ప్రేమ. నేను జ్వరంతో ఆసుపత్రికి తిరుగుతున్నట్టు తెలిస్తే తట్టుకో లేదు. తిండి కూడా తినదు. ఆఫీసుక్కూడా వెళ్ళదు. అందుకే వాసుతో అల్లా చెప్పేను." అన్నాడు చలం.

"బాగుందయ్యా! మీరు మీ ప్రేమలు. మరి వెళ్ళొస్తా.." అని ఇంటికి తిరిగొచ్చి భార్య, రాధలతో చలం చెప్పిన జవాబు చెప్పాడు రామనాధం. రాధ ఎగిరి గంతేసింది. చలం గురించి మరోలా అనుకున్నందు తనను తానే తిట్టుకుంది మనస్సులో. కొద్దిరోజులుకి అడ్డున్న మూఢం వెళ్ళి పోయింది. తరువాత ఒక శుభముహూర్తాన ఉదయం రాధా చలంల పెళ్ళి వైభవంగా జిగింది.

ఆసాయంకాలం పెళ్ళి వారందరూ కళ్యాణ మండపం నుంచి బయలు దేరుతుండగా రామనాధం స్నేతుడు కాంతయ్య వచ్చి,

"రామనాధం! అర్జంటు పనుండి పొద్దున్న పెళ్ళికి రాలేకపోయూను. ఏమనుకోకు. పెళ్ళి బాగా జరిగిందాని" అడిగాడు.

"బాగానే జరిగింది కానీ నాచేత ఇరవైవేలు యిప్పించి నువ్వు పెట్టిన పురోహితుడు బుచ్చయ్య శాస్త్రిరి మాత్రం కేశవనామాలు కూడా పూర్తిగా చదవలేక పోయాడు."అన్నాడు రామనాధం పెళ్ళికి రానందుకు కాస్సేపు కాంతయ్యని సరదాగా ఏడిపించాలని. అది కనిపెట్టిన కాంతయ్య రామనాధంతో, "అయ్యో! బుచ్చయ్య పండితుడయ్యా! అతనికి కేశవనామాలు తెలియక కాదు..ఆయనకు నామాల శాస్త్రిరి అని పేరు కూడా వుంది. ఎటొచ్చి....ఈవేళ ఆయన చేయించవలసిన ఇంకో పెళ్ళి ముహూర్తం దగ్గర పడడంతో ఈపెళ్ళి కుంచెం తొందరగా చేయించాడు." అన్నాడు. రామనాధం, కాంతయ్య వీరి సంభాషణ వింటున్న అందరూ గట్టిగా నవ్వు కున్నారు.